మైండ్ పవర్

KNOW YOUR INFINITE MIND

సేత్ విజ్ఞానం

VOLUME - 1

మైండ్ పవర్

(MIND POWER)

సేత్ విజ్ఞానం

Volume - I

V.V.Ramana

Akshara Publications
VIJAYAWADA, A.P.
Ph. No : 9963 258 796

Published by :

V. Krishna ; V. Avinash
Akshara Publications,
(Formerly - New Vision Maithreya Publications)
Plot -23, K.P. Colony,
VIJAYAWADA.
Cell No: 9963 258 796

Title
*** Seth Vignanam - Mind Power (Telugu)**
First Edition : 2007
Third Edition : 2009

Special Price : r **350/-**

Cover design concept : V.V. Ramana

All rights reserved. No part of this book may be translated or reproduced in any form, or by any means without the permission of the Publishers

DTP Layout :
Sri Lakshmi Graphics
#31-20-10/A, D.B.R.K. Street,
Machavaram Down,
VIJAYAWADA - 4.
Cell : 9652 606 444, 9393 92 1608

For copies contact : 9963 258 796, 9985 763 446

Copies available at : Vishalaandhra Book House in all towns, All Pyramid Dhyana Kendrams and all leading Book Stores in A.P.

Printed at :
SRI CHAITANYA OFFSET PRINTERS
VIJAYAWADA.
Ph : 9849067050.

ముందుమాట

"ఆధునిక భౌతిక శాస్త్రజ్ఞులలో Einstein ఎలాంటి వాడో ఆధునిక ఆధ్యాత్మిక శాస్త్రజ్ఞులలో అటువంటి వాడు SETH.

Jane Roberts మరి Robert F.Butts ఆధ్యాత్మిక జంట దంపతుల భగీరథ ఆధ్యాత్మిక ప్రయత్న ప్రసాదమే 'సేత్ జ్ఞానం' అన్న 'ఆకాశగంగ!"

'సేత్' అంటే ఒకానొక ఊర్ధ్వలోక పూర్ణాత్మ! జేన్ రాబర్ట్స్ అనే ఆవిడ ద్వారా 1965 నుండి 1985 వరకు 'ఛానెలింగ్' అనే ప్రక్రియ ద్వారా పూర్ణ జ్ఞానాన్ని భూలోకానికి అందించిన మహాత్ముడు.

'సేత్' పుస్తకాలు తెలుగులో లేవు మరి; ఏం చేస్తాం? అయితే ఇన్ని రోజులకు 'అవిదిత యదార్థం' అన్న పేరిట ఒక చిన్ని పుస్తకం మటుకు వచ్చింది.

భవిష్యత్తులో ఆయన పుస్తకాలన్నీ మన దేశ భాషలన్నింటిలో అనువాదం కావాలనే కలలు కంటున్నాను!

అయితే అర్జంటుగా ఇప్పుడే 'సేత్ జ్ఞానం' తెలుసుకోవాలంటే ఆంగ్లం వచ్చిన వారిని ఆశ్రయించక తప్పదు!

*** సేత్ చెప్పినదే ఈ భూమి మీద ఇప్పుడు వున్న అత్యంత అసాధారణమైన పరిపూర్ణ ఆధ్యాత్మిక విజ్ఞాన ప్రకాశం!**

–బ్రహ్మర్షి సుభాష్ పత్రి
'తులసీ దళం' నుంచి

సేత్ విజ్ఞానం పై ఆంగ్లంలో ముప్పై ఎనిమిది పుస్తకాలు వెలువడ్డాయి. అందులో కొన్ని 'Seth Material', 'Seth Speaks', 'The Nature of Personal Reality', 'The Unknown Reality, vol I & II', 'The Nature of Psyche', 'The Nature of Individual and Mass Events'... మొదలయినవి.

సేత్ విజ్ఞానాన్ని తెలుగులోనికి అనువదించడం ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. ప్రస్తుతం మీ చేతులలో వున్న పుస్తకం నేను అనువదించిన రెండవ పుస్తకం! 'సేత్ విజ్ఞానం' అన్న పేరిట ఒక చిన్ని పుస్తకం ఇంతకు ముందే వెలువడింది. ఆ పుస్తకాన్ని కొన్ని వేల మంది పిరమిడ్ మాస్టర్లు చదివి వుంటారని అనుకుంటా! ప్రస్తుతం మీ చేతుల్లో వున్న పుస్తకాన్ని అనువదించడానికి కొంత శ్రమ పడాల్సి వచ్చింది. అందరికీ అర్థమయ్యే రీతిలో ఏ విధంగా రాస్తే బాగుంటుంది? అని ఎంతో ఆలోచించి వ్రాయడం జరిగింది. నవంబర్ 2004 సం॥ పత్రీజి 'సేత్ విజ్ఞానం'ను తెలుగులోనికి అనువదించమని నన్ను ఆదేశించినపుడు, 'ధ్యానాంధ్రప్రదేశ్' మ్యాగజైన్‌లో వరుసగా ఆరు మాసాల పాటు కొన్ని వ్యాసాలను ప్రచురించడం జరిగింది.

తెలుగుజాతి ప్రజలందరికీ 'సేత్ విజ్ఞానం– మైండ్ పవర్ & ఆత్మశక్తి' ఒక గొప్ప కానుక. ఈ పుస్తకాన్ని చదవడం ద్వారా మీ ఆధ్యాత్మిక శక్తి మరి మనో వికాసం ఎన్నో రెట్లు విస్తరింపబడతాయి; మీ యొక్క చైతన్యశక్తి (consciousness) ఎన్నో రెట్లు పెరుగుతుంది. కేవలం ఒక్కసారి మాత్రమే చదువతగ్గ పుస్తకం కాదిది. 'మనో శక్తి' మరి 'భౌతిక వాస్తవం' అధ్యాయాల ద్వారా తెలుగుజాతి యువతకు, విద్యార్థులకు ఎంతో స్ఫూర్తి మరి ఉత్తేజం కలుగుతాయి. ఆ రెండు అధ్యాయాలే కాకుండా అన్ని అధ్యాయాలూ మీకు ఎంతో గైడెన్స్‌ను ఇచ్చి మీ ఆధ్యాత్మికతను మరి ఆత్మ జ్ఞానాన్ని పెంచుతాయి.

కొన్ని వేల ఆధ్యాత్మిక గ్రంథాలను చదవడానికి ప్రోత్సాహాన్ని మరి గైడెన్స్‌ను ఇచ్చిన బ్రహ్మర్షి శ్రీ సుభాష్ పత్రిగారికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఈ పుస్తక ప్రచురణకు ప్రోత్సాహాన్నిచ్చిన పిరమిడ్ మాస్టర్స్,

V. రంగనాథ్; యం.యస్.సి., యం.ఇ.డి., పలమనేరు.

(Late) K. శివశంకర్; బి.ఎ., బి.యల్, పలమనేరు.

J. రాఘవరావు గారు & J.పద్మ గారు, విజయవాడ.

U. చంద్ర కాంత రాజు గారు, విజయవాడ.

G. బాలకృష్ణ గారు, పిరమిడ్ ఇంజనీర్, హైదరాబాద్

ధ్యానర్షి ప్రేమనాథ్ గుప్తగారు, ఆదోని

D. రాయ జగపతిరాజు గారు, హైదరాబాద్

G. రాఘవేంద్రరావు గారు, నాయిడుపేట

K. వేణుగోపాల్ రెడ్డి గారు, స్పిరిచ్యువల్ ఇండియా, హైదరాబాద్

మరి ఎంతో మంది పిరమిడ్ మాస్టర్స్‌కు నా కృతజ్ఞతలు తెలుపు కుంటున్నాను.

'సేత్ విజ్ఞానం'ను తెలుగులోనికి ఇంకా చాలా పుస్తకాలను అనువదించాల్సి వుంది. ఈ ఒక్క పుస్తకంలోనే 'సేత్' అను దివ్యాత్మ చెప్పిన జ్ఞానాన్నంతా ఇమడ్చడం చాలా కష్టం! మిగతా పుస్తకాలను కూడా అనువదించడానికి ప్రయత్నం చేస్తాను.

ఈ పుస్తకాన్ని అనేక సార్లు చదివి చైతన్య పరిణామం చెంది, ఆధ్యాత్మిక పురోగతిని పొందుతారని, ఆశిస్తూ...

విజయవాడ

అక్టోబర్, 2007

వి.వి.రమణ

ఫోన్ : 9985 763 446

9963 258 796

విషయ సూచిక

పేజి

1. భౌతిక వాస్తవం ---------- 9

2. మనోశక్తి ---------- 112

3. ఆత్మ ..... ---------- 175

4. మల్టి డైమన్షనల్ ఆత్మ ---------- 241

మా ప్రచురణలు

1. మైండ్ పవర్ (సేత్ విజ్ఞానం)
2. థాట్ పవర్ (సేత్ విజ్ఞానం)
3. దివ్య సంపద [మీ సంపద మీ చేతుల్లో] (రామ్తా విజ్ఞానం)
4. దివ్య సందేశం (సేత్ విజ్ఞానం)
5. జీవితం ఒక వరం (సేత్ విజ్ఞానం)
6. మహా సంకల్పశక్తి (రామ్తా విజ్ఞానం)
7. నాలుగు గొప్ప సత్యాలు (న్యూ ఏజ్ సైన్స్)
8. జీవిత వికాసం (సేత్ విజ్ఞానం)
9. 2012 తర్వాత... (దివ్యయుగం)
10. అపరిమితమైన జీవితం (రామ్తా విజ్ఞానం)
11. అందుకే నీవు యోగివికా!
12. మహా ఆరోగ్యశాస్త్రం (సేత్ విజ్ఞానం)
13. మహా జీవిత శాస్త్రం (సేత్ విజ్ఞానం)
14. మైండ్ పవర్ (రామ్తా విజ్ఞానం)

భౌతిక వాస్తవం
(Physical Reality)

భౌతిక వాస్తవం
(Physical Reality)

మీరు త్రిదిశా తలం (three dimensional plane)లోనికి జన్మ తీసుకుని ప్రవేశించారు. భౌతిక పదార్థాన్ని (physical matter), భౌతిక సంఘటనలు (physical events), భౌతిక పరిస్థితులు (physical circumstances), భౌతిక వాస్తవాన్ని (physical reality), మానవ చైతన్య వికాసాన్ని (human consciousness) సంపూర్ణంగా అధ్యయనం చేసి జ్ఞానపరిధిని విస్తరింప జేసుకోవడానికే భూమి మీద జన్మ తీసుకున్నారు. **ఆత్మ చైతన్య వికాసాన్ని అనేక కోణాలలో వ్యాపింప జేసుకోవడానికి – అన్ని శక్తి సామర్థ్యాలను మీ అంతర్ శక్తిలో ఇముడ్చుకుని భూమి అనే ప్రయోగశాలలో ప్రవేశించడం జరిగింది.** ఇక్కడ జన్మ తీసుకున్నపుడే భూమి మీద గల చైతన్యశక్తి పరిణామాన్ని సంపూర్ణంగా ఆకళింపు చేసుకోగల సమర్థత మీ అంతర్ ప్రపంచంలో కలిగి వున్నారు. ఆత్మ చైతన్య పరిణామం చెందడానికి అనంతమైన అవకాశాలు, అపారమైన శక్తి మీ అంతర్ ప్రపంచంలో ఇమడ్చబడి వున్నాయి.

ఈ విశ్వంలో అపారమైన శక్తి, సంపద మీ వినియోగానికి సిద్ధంగా వున్నాయి. మీరు ఎంత తోడుకున్నా సముద్రంలో నీరు తరిగి పోయేదేమీ వుండదు. అట్లే మీరు ఎంత వినియోగించుకున్నప్పటికీ ఈ విశ్వంలోని శక్తి, సంపద తరిగిపోయేవి కావు. మీరు సంకల్పించుకున్న దానికంటే ఎక్కువగా ఇవ్వడానికి ఈ విశ్వం ఎల్లవేళలా సిద్ధంగా వుంది. ఏ ఆత్మ శకలమూ ఈ విశ్వంలో ప్రాముఖ్యాన్ని కోల్పోవడం లేదు. ప్రతి ప్రాణికి కావలసిన సర్వ శక్తి సామర్థ్యాలు దాని అంతర్ ప్రపంచంలోనే ఇమడ్చబడి ఉన్నాయి. మీ జీవితాలలో ఏది కావాలంటే దాన్ని సమకూర్చుకోగల సర్వసమర్థత మీ అంతర్ ప్రపంచంలో ఇమడ్చబడి వుంది. ఈ ప్రపంచంలో ఏ శక్తికీ మీరు తల వంచాల్సిన పని లేదు; ఏ శక్తి యొక్క దయాదాక్షిణ్యాల పైన మీరు ఆధారపడనవసరం లేదు. సంకల్పాలు, లక్ష్యాలు, పెట్టుకోకుండా ఈ విశ్వంలో ఏదీ మీ జీవితంలో దానంతట అది మీ అనుభవంలోనికి రాదు. **మీరు వాంఛించకుండా ఏ భౌతిక సంఘటనా మీ జీవితంలోనికి**

ప్రవేశించడం జరగదు. మీరు ఏవేవి వాంఛిస్తున్నారో అవే మీ జీవితంలో భౌతిక పరిస్థితులుగా ఎదురవుతున్నాయి. సహేతుకంగా, నిర్దిష్టంగా ఆలోచించి సంకల్పాలను, లక్ష్యాలను ఎంచుకోవాల్సిన బాధ్యత, స్వేచ్ఛ మీ చేతుల్లోనే వుంది.

మీ జీవితాలను మీ ఇష్టమొచ్చిన రీతిలో మలుపు త్రిప్పగల శక్తిసామర్థ్యాలు మీలోనే వున్నాయి. విధిరాత, లలాట లిఖితం అనేవి ఏ ప్రాణికీ ముందుగానే నిర్ణయింపబడి వుండవు. ఒక వ్యక్తి ఒక రోగాన్ని జీవితాంతం బాధను అనుభవిస్తున్నాడంటే –జన్మ తీసుకోకమునుపే ఆ రోగాన్ని ఎంచుకుని ఎంచుకోవడం జరుగుతుంది. చైతన్యశక్తి ఒక దిశలో పరిణామం చెందడం కోసం ఆ రోగాన్ని ఎంచుకోవడం జరిగింది. దాన్ని నయం చేసుకోవాలని అతడు తీవ్రంగా వాంఛించినట్లయితే అందుకనుగుణంగా అతని దేహంలో జీవకణాలు స్పందిస్తాయి. దేహం కొన్ని జీవరసాయనాలను విడుదల చేసుకుని ఆ రోగాన్ని నయం చేసుకుంటుంది. ఈ విశ్వంలో ఏ వ్యక్తి కూడ గతం యొక్క దయాదాక్షిణ్యాల పైన ఆధారపడవలసిన పనిలేదు. రోగం నుండి విముక్తి కావాలని అతడు బలంగా కోరుకుంటే విశ్వచైతన్యశక్తి అతని సంకల్పానికి అనుగుణంగా స్పందిస్తుంది. అతని అంతర్ ప్రపంచంలో ఎన్నో మార్పులు జరిగి దేహాన్ని ఆ రోగం నుండి విముక్తి కలిగిస్తుంది.

అదే వ్యక్తి ఇంకో జన్మలో ఆ రోగాన్ని అధ్యయనం చేసే డాక్టరుగా జన్మ తీసుకోవచ్చు. ఆ రోగానికి గల మూల కారణాన్ని వెదికి దానికి ఒక చికిత్సా విధానాన్ని కనుగొనవచ్చు. ప్రతి జన్మ కూడ మీరు ఎంచుకుంటున్నదే. **మీ జీవితాలను శాసించడానికి, నియంత్రించడానికి ఈ విశ్వంలో ఏ శక్తికీ అధికారం లేదు. ఈ విశ్వంలో ఏ కాస్మిక్ డైరక్టరో** (Cosmic director)**, లేదా ఏ దేవుడో** (God) **మీ జీవితాలను శాసించడం లేదు.** పిల్లలు లేకుండా ఒక జన్మ, పిల్లలతో ఒక జన్మ, స్త్రీగా ఒక జన్మ, పురుషుడుగా ఒక జన్మ, భిక్షగాడిగా ఒక జన్మ, రాజుగా ఒక జన్మ, రైతుగా ఒక జన్మ – ఇలా అనేకానేక జన్మలు మీరు స్వతంత్రంగా ఎంచుకుంటున్నవే. జీవిత శాస్త్రాన్ని అనేకానేక కోణాలలో దర్శించి, అధ్యయనం చెయ్యడం కోసం ప్రతి ఆత్మ కూడ తన ఇష్ట ప్రకారమే జన్మలను తీసుకుంటుంది. భూమి మీద ఎదురయ్యే అన్ని సవాళ్ళను స్వీకరించే సహజ సామర్థ్యాన్ని ప్రతి ఆత్మా తన అంతర్ ప్రపంచంలో ఇముడ్చుకుని జన్మ తీసుకోవడం జరుగుతుంటుంది. ప్రకృతిలోని సంపదంతా మీ కోసం, మీ వినియోగం కోసం సిద్ధంగా వుంది. ఈ ప్రకృతిలో ప్రతి మనిషీ ఒక అంతర్భాగమే. మానవజాతి + ఇతర జీవజాతులన్నీ

ప్రకృతి సంరక్షణలో చాల క్షేమంగానే వున్నారు. ఏ వ్యక్తీ ప్రకృతి చేత తిరస్కరింపబడడంగాని, విస్మరింపబడడంగాని, నిర్లక్ష్యం చేయబడడంగాని, నిర్దయగా వదిలివేయబడడంగాని జరగదు. తల్లి ఒడిలోని బిడ్డ ఎంత క్షేమంగా వుంటుందో, అంతకంటే ఎక్కువగా ప్రతి ప్రాణి కూడ ప్రకృతి ఒడిలో ఎంతో క్షేమంగా వుంది. ఒక వృక్షం తన ఆహారం కోసం భూమి నుండి భిక్షం తీసుకోనవసరం లేదు; సూర్యకిరణాల కోసం పడిగాపులు పడనవసరం లేదు. వృక్షానికి కావలసిన వనరులన్నింటినీ ప్రకృతి సమకూరుస్తుంది. ఈ భూమి మీద ప్రతి ప్రాణికీ కావాల్సిన వనరులన్నింటినీ ప్రకృతి సమకూరుస్తుంది. **భూమి మీద ఏ మనిషి కూడ ఇతరుల దయాదాక్షిణ్యాల పైన ఆధారపడే అవసరం లేదు. మీరు ఏది సంకల్పించుకుంటే అది మీ జీవితంలో ప్రవేశపెట్టడానికి మీ అంతర్ ప్రపంచం సర్వసన్నద్ధంగా వుంది. ప్రకృతి కూడ అందుకు సిద్ధంగా వుంది. సంకల్పాలు, లక్ష్యాలులేకుండా ఈ భూభౌతిక ప్రపంచంలో మీకు ఏవీ సమకూర్చబడవు. ఈ విశ్వంలో ఏ లోకంలోనైనా ఇదే రీతి వుంటుంది.**

ఈ విశ్వశక్తి అన్ని వేళలా మీ లక్ష్యాలను నెరవేర్చడంలో పాలు పంచుకోవడానికి సిద్ధంగా వుంది. విశ్వశక్తి మీ సంకల్పాల వైపు ప్రవహించడానికి సిద్ధంగా వుంది. మిమ్మల్ని కించపరుచుకునే భావనలను విస్మరించి అంతర్ ప్రపంచాన్ని సద్వినియోగం చేసుకోవడం సాధన చెయ్యండి. సాధన చెయ్యకుండా, లక్ష్యాలు ఏర్పరచుకోకుండా, ప్రయత్నం చెయ్యకుండా ఏదీ మీ జీవితాలలో ఊడిపడదు. అంతర్ ప్రపంచాన్ని విశ్వసించి దాన్ని వినియోగించడం ప్రాక్టీసు చెయ్యండి. అంతర్ ప్రపంచానికి అవధులు (limits) అనేవి వుండవు. కాలానికి, దూరానికి సంబంధించిన పరిమితులు, నియమాలు మీ అంతర్ ప్రపంచానికి వర్తించవు. ప్రాక్టీసు చెయ్యకుండా ఏదీ మీకు అవగతం కాదు. వృక్షానికి భూమి నుండి సారం అందుతున్నట్లుగా అంతర్ ప్రపంచం నుండి మీకు అన్నీ అందించబడుతున్నాయి. భూమి మీద ఏ మనిషి కూడ బాహ్య ప్రపంచం యొక్క దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి మనుగడ సాగించడం లేదు. అతనికి కావాల్సినవన్నీ అంతర్ ప్రపంచం నుండే అందుతున్నాయి.

ఫలానా విషయం పట్ల నైపుణ్యం పెంచుకోవాలని మీ మనసుకు తోచితే, దానికి సంబంధించిన ఐడియా (idea) మీ అంతర్ ప్రపంచం నుండి వచ్చిందని తెలుసుకోండి. ఉదాహరణకు సంగీతం నేర్చుకోవాలని మీకు ఒక వాంఛ కలుగుతుంది. ఆ వాంఛ మీ అంతర్ ప్రపంచంలో కలిగింది. బాహ్య ప్రపంచంలో ఆ వాంఛ వాస్తవ

రూపం పొందేందుకు గల శక్తి సామర్థ్యాలు మీ అంతర్ శక్తిలో వున్నపుడే దాని గురించిన ఐడియా మీలో ఏర్పడింది. ఒక వ్యక్తికి ప్రస్తుతం అనుభవిస్తున్న పేదరికాన్ని వదిలించుకోవాలని వాంఛ కలిగితే, దాన్ని వదిలించుకోగల శక్తి అతడి అంతర్ ప్రపంచంలో వుంటుంది. అంతర్ ప్రపంచాన్ని విశ్వసించి ప్రయత్నానికి వుపక్రమిస్తే పేదరికాన్ని వదిలించుకోవడానికిగల భౌతిక పరిస్థితులు సృష్టింపబడతాయి. జీవితానుభవాలు, జీవిత పరిస్థితులు మార్చుకోవాలని ఒక వ్యక్తి సంకల్పించినపుడు అతని అంతర్ ప్రపంచం వెంటనే ప్రతిస్పందిస్తుంది; అంతర్ ప్రపంచం యొక్క మెకానిజమ్ వెంటనే క్రియారూపం ధరిస్తుంది.మీరు తీసుకునేది చాల చిన్న నిర్ణయమైనా సరే, దాని కనుగుణంగా అంతర్ ప్రపంచపు మెకానిజమ్ ఆక్టివేట్ (activate) అయి ఆ నిర్ణయానికి అనుగుణంగా భౌతిక పరిస్థితులను సృష్టిస్తుంది. ఎటువంటి నిర్ణయాలు, లక్ష్యాలు తీసుకోవాలి? అనే విషయం పై మీ కాన్షియస్ మైండ్‌ను వినియోగించే కొలదీ దాని సామర్థ్యం పెరుగుతుంటుంది.

'నేను ఫలానా పని చెయ్యగలను' అనే స్పందన మీలో కలిగిందంటే ఆ పనిని సాధించగల సామర్థ్యం మీ అంతర్ ప్రపంచంలో కలిగి వున్నారని అర్థం. మీ అంతర్ ప్రపంచానికి అసలు అసాధ్యమంటూ ఏదీ వుండనే వుండదు. మీరు ఏ లక్ష్యం ఎంచుకున్నా దానిని నెరవేర్చే కెపాసిటీ మీకుంటుంది. కాన్షియస్ మైండ్ పరిధిలో రీజనింగ్ (reasoning) చేసి సాధ్యం, అసాధ్యం అనే వాటిని మీరు బేరీజు వేసుకుంటుంటారు. మీరేర్పచుకున్న పరిమిత అభిప్రాయాలవల్ల కొన్ని సాధ్యమని, మరికొన్ని అసాధ్యమని భావిస్తుంటారు. అంతే తప్ప ఆత్మశక్తికి అసాధ్యమంటూ ఏదీ లేదు.

ప్రస్తుతం మీ పరిస్థితి ఎటువంటిదైనా కానియ్యండి. మీ జీవితాన్ని మీ ఇష్టమైన రీతిలో మలుపు త్రిప్పవచ్చు. మీరు ఎంతో ఎరుకతో లక్ష్యాలను ఎంచుకోవలసిన అవసరముంది. మీ అంతరంగం నుండి వెలువడిన ప్రతి ఆలోచన బాహ్య ప్రపంచంలో భౌతిక సంఘటనగా వాస్తవరూపం పొందుతుందనే విషయం మీరు గుర్తుంచుకోవాలి. మీ మైండ్ నుండి ప్రతిక్షణమూ అనేక ఆలోచనలు వెలువడుతుంటాయి. ఆలోచన, తీవ్రమైనదై వుండి, మీ శక్తి దాని వైపు కేంద్రీకరింపజేసినపుడు అది భౌతిక తలంలో (physical plane) వాస్తవరూపం (manifestation) పొందుతుంది. మిగతా ఆలోచనలు బలహీనమైన శక్తి కలిగివుండటం వల్ల అవి సంభావ్య క్రియలుగా (probable activities) మారి ఇతర తలాల్లో (other planes or worlds) వాస్తవ రూపం పొందుతాయి.

ఉదాహరణకు ఇపుడు మీరు రేపు సాయంకాలం 4గంటలకు మీ ఫ్రెండ్‌ను కలవాలనుకొంటారు. ఇంకో క్షణంలో ఒక ఆలోచన వస్తుంది. రేపు సాయంకాలం 4 గంటలకు టెలిఫోన్ బిల్లు కట్టాలనుకుంటారు. ఇంకో క్షణంలో మళ్ళీ ఆలోచన వచ్చింది. రేపు సాయంకాలం 4 గంటలకు విమానాశ్రయానికి వెళ్ళాలనుకుంటారు. ఈ మూడు ఆలోచనలూ రేపు సాయంకాలం 4 గంటలకు సంబంధించినవే. వీటిని మీ మైండ్‌లో ఏర్పడిన సంభావ్య క్రియలుగా (probable activities) పరిగణించడం జరుగుతుంది. ఈ మూడింటిలో ఒక దాని పట్ల మాత్రమే మీ శక్తిని కేంద్రీకరింప జెయ్యడం జరుగుతుంది. అది మాత్రమే భౌతిక ప్రపంచంలో (physical world) వాస్తవ రూపం పొందుతుంది. మిగతా రెండూ మీ మైండ్ నుండి వెలువడిన ఆలోచనలే అయినప్పటికీ వాటికి గల శక్తి చాల బలహీనంగా వుండటం వల్ల అవి ఇతర డైమన్షన్స్‌గల (other dimensions) లోకాలలోకి ప్రయాణించి అక్కడ వాస్తవ రూపం పొందుతాయి.

ఈ భౌతిక తలంలో మీరు లక్ష్యాలు, సంకల్పాలు ఏర్పరచుకునే ముందు ఎంత తీవ్రంగా వాంఛిస్తున్నారు? అనేది ముఖ్యం. మీ సంకల్పాలు ఏ విధంగా వాస్తవ రూపం పొందుతున్నాయో, అదే రీతిగా మీ భయాలు కూడా వాస్తవరూపం పొందుతాయి. మీ ఇంట్లో దొంగతనం జరుగుతుందేమోనని మీరు భయపడితే మీ ఇంట్లో దొంగతనం జరుగుతుంది. మీ అంతరంగం నుండి వెలువడిన ఆలోచనలే అటువంటి పరిస్థితులను ఆకర్షిస్తాయి. ఇతరులు మిమ్మల్ని అసహ్యించుకుంటారని భయపడితే అటువంటి పరిస్థితులనే మీరు ఆకర్షిస్తారు. మీ జీవితంలో తారసపడే భౌతిక పరిస్థితులన్నీ మీ మైండ్‌లో ఏర్పడుతున్న సంభావ్యక్రియలే! మైండ్ నుండి వెలువడుతున్న సంభావ్యక్రియలలో ఎక్కువ శక్తి తీవ్రత గలవి భౌతిక ప్రపంచంలో మీ జీవితానుభవాలుగా చుట్టుముడతాయి. మీరు తీవ్రంగా కలిగివున్న వాంఛలన్నీ మీ జీవితానుభవాలుగా, మీ జీవిత పరిస్థితులుగా మలచబడుతున్నాయి. మీరు ఎంచుకునే పాజిటివ్ ఆలోచనలు, భయాలు వాటి స్వభావాలకనుగుణంగా భౌతిక సంఘటనలను (physical events) ఆకర్షిస్తాయి. దొంగల గురించి భయపడితే దొంగలను ఆకర్షిస్తారు. అనారోగ్యం గురించి భయపడితే అనారోగ్యాన్ని ఆకర్షిస్తారు. దారిద్ర్యం గురించి భయపడితే దారిద్ర్యాన్ని ఆకర్షిస్తారు. మీ అంతరాలలో బలమైన భావనగా దేన్ని కలిగివుంటారో అదే బాహ్య ప్రపంచంలో మీ జీవితంలో భౌతిక సంఘటనగా మలచబడుతుంది.

జీవితగతి దిశను మార్చాలంటే మొదటగా మీ నమ్మకాలను మార్చుకోవలసి వుంటుంది మీ జీవితానుభవాలుగా మారే సంఘటనలన్నీ తొలుత సంభావ్య క్రియలుగా

మీ మైండ్‌లో ఉద్భవిస్తాయి. ఒక చిత్రకారుడు తెల్లకాగితం పై బొమ్మలు గీయడానికి ఉపక్రమించినపుడు అతని కాన్షియస్ మైండ్‌లో ఏవేవి గీయాలో నిర్ణయించుకుంటాడు. అతని అంతర్ ప్రపంచం నుండి చిత్ర రచనకు కావలసిన శక్తి సామర్థ్యాలు అందించ బడతాయి. కాగితం పై గీయబడే బొమ్మలు సంభావ్యక్రియలుగా అతని మైండ్‌లో ఏర్పడతాయి. క్షణకాలంలో ఎన్నో సంభావ్య క్రియలు ఏర్పడుతుంటాయి. వాటిలో ఎక్కువ శక్తిని తీసుకున్న సంభావ్యక్రియలు కాగితంపై బొమ్మలుగా సృష్టింపబడతాయి. కాగితం పై బొమ్మలను తన ఇష్టమొచ్చిన రీతిలో చిత్రకారుడు రచిస్తాడు. మీ జీవిత చిత్రపటాన్ని కూడ మీ ఇష్టమైనరీతిలో రచించవచ్చు. మీ జీవిత చిత్రపటాన్ని రచించే అధికారం మీ ఒక్కరికే వుంటుంది. ఈ విశ్వంలో ఏ శక్తి మీ జీవిత చిత్రపటం యొక్క తీరుతెన్నులను శాసించదు. ఏయే లక్ష్యాలు కావాలో, ఏయే జీవితానుభవాలు కావాలో, ఏ భౌతిక పరిస్థితులు వుండాలో అన్నీ నిర్ణయించుకుని మీ జీవిత చిత్రపటంలో రచించుకోగల స్వేచ్ఛను మీరు కలిగి వున్నారు. మీ మైండ్‌లో ఏర్పడే అనంతమైన సంభావ్య క్రియలలో కొన్నింటిని ఎంచుకుని వాటిపై మీ చైతన్యశక్తిని సంకల్పాల ద్వారా కేంద్రీకరించినపుడు అవి భౌతిక వాస్తవాలుగా (physical realities) రూపుదిద్దుకుంటాయి.

మీరు ఏది వాంఛిస్తున్నారో అది నెరవేర్చడానికి మీ అంతర్ ప్రపంచం ఎల్లప్పుడూ సిద్ధంగా వుంటుంది. మీరు సంకల్పించుకున్న కార్యం నెరవేరడానికి కావలసిన నైపుణ్యం మీ అంతర్‌శక్తిలో సిద్ధంగా వుంటుంది. మీ అంతర్ ప్రయాణం ద్వారా దాన్ని వెలికితీయవచ్చు. దానికి మీరు ప్రయాస పడనవసరం లేదు. ఒలింపిక్ క్రీడలలో (Olympic games) క్రీడాకారులు చేసే భౌతిక విన్యాసాలన్నీ మీకు అద్భుతంగా కన్పిస్తాయి. ఆ విన్యాసాలు కొంతమంది మాత్రమే చెయ్యగలరని మీరు భావిస్తుంటారు. అది పూర్తిగా వాస్తవ విరుద్ధం! మీ మానవజాతిలో ప్రతి ఒక్కరికీ ఆ విన్యాసాలను అతి సునాయాసంగా చెయ్యగల ప్రతిభను కలిగి వున్నారు. ఎంతో ట్రెయినింగ్ తీసుకుంటే తప్ప వాటిని చెయ్యలేమన్న భావనలు, నమ్మకాలు కలిగి వుండడం వల్ల మీరు చెయ్యలేక పోతున్నారు. మీ నమ్మక వ్యవస్థ ప్రకారం మీ దేహం స్పందిస్తుంది.

మీరు అంతర్ ప్రయాణం ద్వారా మీ సంకల్పాలకు కావలసిన నైపుణ్యాన్ని రాబట్టవచ్చు. మీరు ఒక చిత్రకారుడు కావాలని లక్ష్యం ఏర్పరచుకుంటే, తక్షణమే మీ దేహంలో జీవరసాయనిక మార్పులు సంభవిస్తాయి. దేహంలోని మెకానిజమ్ అందుకనుగుణంగా మార్పు చెందుతుంది. అంతర్ ప్రయాణం ద్వారా ఇతర డైమన్షన్స్‌లో వున్న సంభావ్య ఆత్మల (probable souls)నుండి, ఇతర లోకాలలో వుండే మాస్టర్స్

నుండి, భూమి మీద వుండే మాస్టర్స్ నుండి, మీ గత జన్మల నుండి టెలిపతి ద్వారా చిత్ర రచనకు కావలసిన నైపుణ్యాన్ని సంపాందించవచ్చు. స్వప్నాలద్వారా కూడ ఈ నైపుణ్యాన్ని పొందవచ్చు. అంతర్ ప్రయాణం ద్వారా, స్వప్నాల ద్వారా నైపుణ్యం పొందడమనే ప్రక్రియలను మానవజాతి సహజంగా కలిగివుంది. భౌతిక వాస్తవాన్ని సృష్టించడంలో మీరు ప్రయాస పడాల్సిన అవసరం లేదు. దేనిపట్లనైన సునాయాసంగా నైపుణ్యం సాధించగల సహజత్వాన్ని కలిగివున్నారు. ఒక విషయంపట్ల ధ్యాస, శ్రద్ధ పెట్టినపుడు మీ చైతన్యశక్తి అటువైపు కేంద్రీకరింపబడుతుంది. చాల ఆటోమాటిక్‌గా ఆ విషయం పట్ల నైపుణ్యం పొందేందుకు మీ అంతర్ శక్తి స్పందిస్తుంది.

మీ జీవితంలో ఏ సవాలునైనా వర్తమానంలోనే ఎదుర్కోవాల్సి వుంటుంది. వర్తమానంలో సంభవించే మార్పులే గతంలో జరిగిన సంఘటనలను, భవిష్యత్తులో జరిగే సంఘటనలను ప్రభావితం చేసి మార్పు చెందిస్తాయి. ఆత్మశక్తికి భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలనేవి వుండవు. ఒక చక్రం యొక్క చట్రంపై భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలను ఒక దానికొకటి సమాన దూరంలో వున్నట్లు ఊహించుకోండి. చక్రం ఒక అక్షం ఆధారంగా భ్రమణంలో వున్నపుడు భూత, వర్తమాన, భవిష్యత్తు కాలాలు ఆ అక్షం (axis) చుట్టూ తిరుగుతుంటాయి. అక్షం ఆధారంగా చక్రం యొక్క మధ్య బిందువు స్థిరంగా వుంటుంది. చక్రం యొక్క మధ్య బిందువును ఆత్మశక్తిగా పరిగణిస్తే, దాని చుట్టూ భూత, వర్తమాన, భవిష్యత్తు కాలాలకు సంబంధించిన భౌతిక సంఘటనలు పరిభ్రమిస్తుంటాయి. చక్రం యొక్క కేంద్రబిందువులో ఆత్మశక్తి స్థితమవుతుంది. వర్తమానంలో మీరు ఏర్పరుచుకునే సంకల్పాలు చక్రానికి భ్రమణాన్ని కలుగజేస్తున్నాయి. ఈ వర్తమానంలోని సంకల్పాలు భూత, వర్తమాన, భవిష్యత్తులో సంభవిస్తున్న భౌతిక సంఘటనలకు ఆ కేంద్రబిందువు చుట్టూ పరిభ్రమణం చెందే విధంగా ప్రభావితం చేస్తున్నాయి.

'కాలం' అనేది మల్టి-డైమన్షనల్ (multi dimensional) భౌతిక రాశి! భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలనేవి అన్నీ ఏకకాలంలో జరుగుతున్నాయి. కాలం గురించి మీరు ఏర్పరచుకున్న ప్రామాణికతలన్నీ సింగిల్ డైమన్షన్ (single dimension) పరంగా జరుగుతున్నాయి. కాలాన్ని మల్టి – డైమన్షనల్ సిస్టమ్‌లో వీక్షించాలంటే ఎంతో జ్ఞానం వుండాలి. జ్ఞాన నేత్రంతోనే అది సాధ్యమవుతుంది.

మానవజాతి ఒక్కటే కాలానికి సింగిల్ – డైమన్షన్‌లో ప్రామాణికాలను ఏర్పరచి కాలం యొక్క స్వరూపాన్ని సంపూర్తిగా గ్రహించలేకపోయింది. మీ శాస్త్రవేత్తలు కాలానికి

రూపొందించిన ప్రామాణికతలు చాల అసమగ్రంగా వున్నాయి. శాస్త్ర పరికరాలతో కాలాన్ని కొలవడం సరియైన విధానం కానే కాదు. మీ అంతర్ శక్తి ద్వారా మాత్రమే కాలం యొక్క మల్టి డైమన్షనల్ స్వరూపాన్ని అర్థం చేసుకోగలుగుతారు. భ్రమణంలో వున్న చక్రం (wheel) మధ్యలో మీ అంతర్‌శక్తి వుందని ఊహించుకుంటే, మీ అంతర్ శక్తి చుట్టూ భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలకు సంబంధించిన భౌతిక సంఘటనలు ఏకకాలంలో పరిభ్రమణం చెందుతున్నాయి.

చేతనావస్థలో మీరు ఎటువంటి అస్పష్టత కలిగివున్నప్పటికీ మీ అంతర్ ప్రపంచంలో అస్పష్టత అనేది ఎప్పటికీ ఉండదు. మీ సంకల్పాలకు గల శక్తి స్థాయి (energy level), తీవ్రత (intensity)లకు అనుగుణంగా అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోకి భౌతిక పరిస్థితులు, భౌతిక సంఘటనలుగా ఉద్భవిస్తున్నాయనే విషయం మీరు విస్మరించకూడదు. కాలం యొక్క మల్టి – డైమన్షనల్ సిస్టంలో వర్తమానం కేంద్రంగా వుంటూ, భూత, భవిష్యత్తు భౌతిక సంఘటనలు దాని చుట్టూ పరిభ్రమిస్తూ వుంటాయి. నిద్రావస్థ, చేతనావస్థ, అచేతనావస్థ, స్వప్నావస్థ, సమాధి స్థితి ... ఇలా ఏ స్థితి నుండి అయినా సరే, మీ అంతర్ శక్తి నుండి వెలువడే ఆలోచనా తరంగాలకు అనుగుణంగా భౌతిక సంఘటనలు ఈ వర్తమానం నుండే సృష్టికావింపబడుతున్నాయి.

మీరు కలిగివున్న ఆలోచనలు, నమ్మకాలు, అభిప్రాయాలు, భావాలు, భయాలు, ఫీలింగ్స్ మూలంగా మీ అంతర్ శక్తి నుండి వచ్చే శక్తి తరంగాలు మీ వాస్తవాన్ని సృష్టిస్తున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు మార్చుకోవడం మీ చేతుల్లోనే వుంది. T.Vలో ఒక ప్రోగ్రామ్ నచ్చకపోతే క్షణంలో మరో ప్రొగ్రామ్‌కు మార్చినంత సులభంగా మీకు నచ్చని భౌతిక సంఘటనలను క్షణకాలంలో వదిలివేసే క్రొత్త క్రొత్త భౌతిక సంఘటనలను మీ జీవితంలో ప్రవేశపెట్టగల శక్తిని మీరు ఇపుడే కలిగివున్నారు. ఈ వర్తమానంలోనే దాన్ని సాధ్యం చేయవచ్చు!

భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక శక్తులన్నింటినీ ఈ వర్తమానంలో కేంద్రీకరింపజేసి జీవితానుభవాలను మీ అంతర్‌ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోనికి మీ జీవితానుభవాలుగా తీసుకురావడానికి ఇతోధికంగా సాధన చెయ్యండి. మీ సాధన పెరిగే కొలదీ మీ నైపుణ్యం, చైతన్యశక్తి వికాసం పెరుగుతూ వస్తాయి. బాహ్య శక్తులేవీ మీ జీవితాన్ని ప్రభావితం చెయ్యలేవనే సత్యం మీకు తెలుస్తుంది. మీలోకి మీరు అంతర్ యానం చెయ్యడం ద్వారా అనంతమైన జ్ఞానం మీ అనుభవంలోనికి వస్తుంది. మీరు

దేహంతో కూడిన ఆత్మస్వరూపమని తెలుసుకోండి! **విశ్వమంతా వ్యాపించివున్న మూలచైతన్యంలోని (All That Is) భాగమే మీరు. మీరే మూలచైతన్యమై వున్నారు. మూలచైతన్యమే దైవ స్వరూపం! మీరే దైవ స్వరూపులు! ఈ వర్తమానంలో వున్న దైవ స్వరూపాలు మీరే! మీ చైతన్యశక్తి . మనోశక్తి . ఆధ్యాత్మిక శక్తి మీ దేహ ఆకృతిపైగానీ, దేహంపైగాని, మీ వయస్సుపై గాని ఆధారపడి లేదు.**

వర్తమానంలో ప్రస్తుతం మీరున్న పరిస్థితులపై గతంలో జరిగిన సంఘటనల ప్రభావమేమీ వుండదు. వర్తమానంలో మీరు తీసుకునే సరియైన నిర్ణయమే మీ జీవితం యొక్క ఆట (Life's game) గెలుపు ఓటములను కలుగజేస్తుంది. వర్తమానంలో ఒక దేశం లేదా, ఆ ప్రపంచంలో గల మానవాళి అందరి వ్యక్తిగత సంకల్పాల సముదాయంతో ఆ దేశం లేదా ప్రపంచం యొక్క చైతన్య వికాసం అభివృద్ధి చెందుతుంటుంది. అంతర్ ప్రపంచం నుండి బాహ్యప్రపంచంలోనికి భౌతిక వాస్తవంగా సృష్టి జరుగుతుందనే సత్యం తెలిసిన తర్వాత ఈ వర్తమానంలో నెగెటివ్‌గా ఆలోచించడం, అభద్రతా భావం కలిగి వుండడం, భయానికి లోనవడం అనేవి అర్థరహితం! ఒక శిల్పి తన ఇష్టమొచ్చిన రీతిలో శిల్పాన్ని మలిచినట్లు మీ జీవితాన్ని మీ ఇష్టమొచ్చిన రీతిలో మలుచుకోవచ్చు. **గత జన్మలలో చేసిన కర్మలేవి ప్రస్తుతం ఈ వర్తమానంలో మిమ్మల్ని శాసించి వెంటాడడం లేదు. ఈ వర్తమానంలో ఎంచుకున్న బలమైన లక్ష్యమే గత జన్మలలోని కర్మలను ఒక పెట్టున తుడిచివేస్తుంది.**

ఆలోచన యొక్క కార్యరూపమే భౌతిక వాస్తవం! ఈ వర్తమానంలో మీ వాస్తవాన్ని మీరు సృష్టించుకుంటున్నారు. మీ ఆలోచనలే బాహ్య ప్రపంచంలో మీ జీవితానుభవాలుగా రూపాంతరం చెందుతున్నాయి.

* * *

జీవితంలో సమస్యలు అనేవి వుండవు. ఉన్నవన్నీ సవాళ్ళే. నూరు మైళ్ళ నడక ఒకరికి సమస్యగా, మరొకరికి సవాలుగా, వాళ్ళు భావించే రీతినిబట్టి వుంటుంది. సమస్య, పరిష్కారం అనేవి ఒకే నాణేనికి ఇరువైపులా వున్న బొమ్మ, బొరుసులాంటివి. మీ జీవితంలో సమస్య ఏర్పడిందంటే దాన్ని పరిష్కరించే శక్తి కూడ మీ అంతర్ ప్రపంచంలో వుంటుంది. సమస్యకుగల పరిష్కారాన్ని మీరు ఎన్నో విధాలుగా కనుగొనవచ్చు. అంతర్ ప్రయాణం ద్వారా, స్వప్నాల ద్వారా, సమాధిస్థితి ద్వారా సమస్య యొక్క పరిష్కారాన్ని మీరు పొందవచ్చు. పరిష్కరించుకోగలమనే ధీమాతోనే సవాళ్ళను (సమస్యలను) ఎంచుకుంటారు

తప్ప మీశక్తికి మించిన సవాళ్ళేవీ మీ జీవితానుభవాలుగా ఎదురుకావు. మీరు ఎన్ని సవాళ్ళను అధిగమిస్తుంటే అంత చైతన్యశక్తి పరిణామాన్ని విస్తరించుకుంటుంటారు. సమస్య + దాని పరిష్కారం రెండూ వర్తమానంలోనే సృష్టింపబడతాయి.

మీకు ఏదైనా సమస్య ఎదురయ్యినపుడు ఈ విధంగా చెయ్యండి.

1. సమస్యను గురించి బాధపడడంగాని, దుఃఖించడంగాని, భయపడడంగాని తక్షణమే మానివెయ్యండి.
2. వర్తమానంలోనే సమస్య + దాని పరిష్కారం సృష్టింపబడతాయనే విషయం గుర్తుంచుకోండి.
3. మీ అంతర్ ప్రపంచానికి అపారమైన శక్తి వుందని నమ్మండి. అంతర్ ప్రయాణం ద్వారాగాని, స్వప్నాలద్వారాగాని, ఇంకేదైనా ఇతర రూపంలో గానీ సమస్యయొక్క పరిష్కారం లభిస్తుందని సంపూర్ణంగా విశ్వసించండి. మీ అంతర్ ప్రపంచం మీకు ద్రోహం చెయ్యడమనేది ఎప్పటికీ జరగనే జరగదు. తప్పనిసరిగా సమస్యకు పరిష్కారం లభిస్తుంది.
4. మీ శక్తికి మించిన ఏ సమస్యకూడ మీ జీవితంలో ఎదురయ్యే ప్రశ్నే లేదు. పాజిటివ్ రిజల్ట్ వస్తుందనే నమ్మకం కలిగి వుండండి. అంతేచాలు, మిగతాదాన్ని మీ అంతర్ ప్రపంచం పూర్తి చేస్తుంది.
5. రీజనింగ్‌మైండ్‌ను, మీ పరిమిత ఇంటెలక్ట్‌ను, మానసిక సోమరితనాన్ని (mental laziness) ప్రక్కనబెట్టి అంతర్ ప్రపంచం నుండి వచ్చే సూచనల్ని ఆచరణలోపెట్టండి. అంతే! జీవితంలో ఎదురయ్యేఅన్ని సవాళ్ళకు సమాధానాలు లభిస్తాయి.

ఈ భౌతిక ప్రపంచంలో ఆచరణలేకుండా ఏ సంకల్పమూ సాధింపబడదు. ఆచరణలేనపుడు ఆధ్యాత్మికత అనేది వుండదు. సంకల్పాలు, లక్ష్యాలు ఎంచుకుని కార్యాచరణలో పెట్టినపుడే మీరు ఆధ్యాత్మికంగా రాణిస్తారు.

మీ అంతర్ ప్రపంచం నుండి జ్ఞానాన్ని డైరెక్టుగా పొందవచ్చు. అంతర్ ప్రపంచం ఎలా వుంటుందనేది అనుభవపూర్వకంగా తెలుసుకుంటే తప్ప దాన్ని ఎవరూ వివరించలేరు. **అంతర్ ప్రపంచం నుండి జ్ఞానాన్ని పొంది, చైతన్య పరిణామం చెందడం కోసమే మీరు ఈ భూమి మీద జన్మ తీసుకున్నారు. జీవితంలో వైఫల్యాలు, ఓడిపోవడాలు అనేవి వుండవు. ఈ భౌతిక ప్రపంచంలో మీకు తారసపడేవన్నీ సవాళ్ళే! సవాళ్ళను ఎదుర్కోవడం**

ద్వారా జీవితానుభవాలు పెరుగుతాయి. జీవితానుభవాలు పొందడం ద్వారా మీ జ్ఞానపరిధి పెరుగుతుంటుంది. మీ చైతన్య పరిణామ పరిధి పెరుగుతుంటుంది.

మీ జీవితాన్ని మీరు ఇష్టపడడం నేర్చుకోండి. మీ వ్యక్తిత్వాన్ని ఔన్నత్యపరుచుకోండి. ఈ భూమి పైన మీ జన్మ, ఉనికి, చైతన్యపరిణామం, ఆత్మ చైతన్య పురోగతి అనుపమానమైనవి. 'పరిస్థితుల ముందర నేను నిస్సహాయుడను. విధిరాతకు తలవంచాల్సిందే. జీవితంలో ఏది ఎలా జరగాలో అలాగే జరుగుతుంది.' లాంటి మాటలను మీ జీవితాలలోనికి రానీయకండి. ఆధ్యాత్మిక, మానసిక, భౌతిక, జీవశక్తుల సముదాయమే ఈ జీవితం. మీ చైతన్యపరిణామం, మీ శక్తి సామర్థ్యాలు సాటిలేనివి. ఇతరులతో పోల్చలేనివి. మాంసపిండం రూపంలోవున్న చైతన్య స్వరూపమే మీరు. మీరే దైవ స్వరూపాలు. ఈ విశ్వంలో మీ ప్రాముఖ్యత అసామాన్యమైనది. **మిమ్మల్ని గందరగోళపరచి నిరుత్సాహపరిచే మనుషులను మీ నుంచి దూరంగా వుంచండి. ఈ భూమిపై ఏ పరిస్థితులూ మిమ్మల్ని హీనపర్చడానికి సృష్టింపబడలేదు. మీ జీవితంలో ఎదురయ్యే సంఘటనలు, సవాళ్ళు మీ జీవితాన్ని ఔన్నత్యపరిచి మిమ్మల్ని చైతన్య పరిణామపరంగా ముందుకు తీసుకెళుతున్నాయి. సమస్యలు (problems) అనేవి ఎక్కడా లేవు. జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటనను సవాలుగా (challenge)గా స్వీకరించండి.**

* * *

మిమ్మల్ని మీరు ప్రేమించండి. అపుడే మీరు ఇతరులను ప్రేమించగలుగుతారు. మీ జీవితాన్ని హీనపర్చుకుంటున్నపుడు, ఇతరుల జీవితాలలో మంచిని మీరు చూడలేరు. మిమ్మల్ని మీరు ప్రేమించడం లేదంటే – మీ జీవితాన్ని మీ శక్తి సామర్థ్యాలను, మీ ఆత్మ చైతన్య పరిణామాన్ని, ఈ విశ్వంలో మీకు గల విశిష్టమైన స్థానాన్ని, జీవిత పరమార్థకతను అగౌరవపరుస్తున్నారని భావించండి. మీ జీవితాన్ని జీవిత పరమార్థాన్ని గుర్తించలేని మీరు ఇతరులను ఎలా ప్రేమించగలరు? మీ జీవితమే దుఃఖమయంగా వున్నపుడు ఇతరుల జీవితాలలో ఆనందాన్ని, సంతోషాన్ని చూడగలరా? అది అసాధ్యం! మిమ్మల్ని మీరు హింస పెట్టుకుంటూ ఇతర ప్రాణుల పట్ల అహింసతో జీవించగలుగుతారా? అసంభవం! **తననుతాను హింసించుకునే వాడే ఇతర ప్రాణికోటి పట్ల హింసాత్మకంగా వుండగలడు. తననుతాను ప్రేమించుకోలేని వాడు ఇతరులను ప్రేమించ లేడు.** జీవిత సార్థకతను, చైతన్య పరిణామాన్ని సంపూర్ణంగా స్వాగతించినపుడే మిమ్మల్ని మీరు

ప్రేమించడం నేర్చుకుంటారు. ఎవరి జీవితాలను వాళ్ళ ఇష్టమొచ్చిన రీతిలో వాళ్ళు మలుపు త్రిప్పుకోగల సామర్థ్యాన్ని, స్వేచ్ఛను కలిగి వున్నారని మీరు గుర్తించగలిగినపుడే ఇతరులను ప్రేమించగలుగుతారు. మీ దేహాన్ని మీరు ప్రేమించలేనపుడే ఇతరుల దేహాలు అందంగా, లేదా అందవికారంగా వున్నాయా? లేవా? అని వెదుకుతారు. మీలో లేని లక్షణాలు ఇతరులపై రుద్దాలనుకుంటున్నపుడు వాళ్ళను ప్రేమించలేరు. మిమ్మల్ని ద్వేషించుకుంటూ ఇతరులను ప్రేమించలేరు.

మిమ్మల్ని మీరు దైవంగా భావించినపుడే ఇతరులను కూడ దైవస్వరూపాలుగా చూడగలుగుతారు. ఈ విశ్వంలో ఆత్మ చైతన్యపరిణామం చెందడానికి మీకు ఎంత హక్కు వుందో, ఇతరులకు కూడ అంతే హక్కు వుందని భావించినపుడే ఇతరులను మీరు ప్రేమించగలుగుతారు. జీవితం యొక్క విలువ, పరమార్థకత మీకు క్షుణ్ణంగా అర్థం అయినపుడే ఇతర ప్రాణికోటిపట్ల మీరు ప్రేమ, అనురక్తి కలిగి వుంటారు. **తమ జీవితాలను హీనపర్చుకునే వారే ఇతర జంతుజాతులను చంపగలరు. జీవితాన్ని అత్యున్నతంగా ప్రేమించేవాళ్ళు జంతుజాతినిగాని ఇతర జీవజాతులను గాని హింసించలేరు. మీ శాస్త్రవేత్తలకు జీవితం యొక్క పరమార్థం, విలువ తెలియదు కాబట్టే జంతుజాతులను ప్రయోగశాలల్లో పరిశోధనలకు వాడుకుంటున్నారు.**

ఈ విశ్వమంతా మూలచైతన్యంతో (All That Is) నిండి వుంది. మీ అంతర్‌శక్తికి అసాధ్యమంటూ ఏదీ లేదు. మీ జీవితంలో ఎదురయ్యే భౌతిక సంఘటనలకు మతం యొక్క రంగును పూసుకుని సంతృప్తి పడుతుంటారు. 'నాదేమీ లేదు. దేవుడు నాలోవుండి నన్ను నడిపిస్తున్నాడు. నేనేదైనా మంచి చెయ్యగలుగుతున్నానంటే, అది దేవుడి కృపవల్లనే. నేను నిస్సహాయుడను. భగవంతుడే ఆ శక్తినిచ్చి నా చేత గొప్ప కార్యాలను చేయిస్తున్నాడు. భగవంతుడికే ఆ శక్తి సామర్థ్యాలున్నాయి, అని చాల మంది తలపోస్తుంటారు. ఈ విశ్వంలో అన్నింటిలో వుంటున్నది ఆ భగవంతుడే. ఆ మూలచైతన్యమే. అంతేగాని భగవంతుడనేవాడు ఫలానా వాళ్ళకు మాత్రమే ప్రత్యేకంగా కార్యాలు చేసిపెట్టడు. మీరే ఆ దైవశక్తి స్వరూపులు. మీ సంకల్పాలు, ఆశయాలు, కోరికలు, కలలు, ఇష్టాలు, ఆశల కనుగుణంగా మీలోని అంతర్‌శక్తి బాహ్యప్రపంచంలో భౌతిక సంఘటనలుగా మలచబడుతున్నాయి. మీరేమీ నిస్సహాయులు కారు. ఈ విశ్వమంతా వ్యాపించివున్న మూలచైతన్యంలో ఒకానొక భాగమే మీరు. మూలచైతన్యం మీ ద్వారా చైతన్య వికాసం చెందుతూంది. మీతో గొప్ప కార్యాలు చేయించడం ద్వారా

దైవం (మూలచైతన్యం) తన ఉనికిని రుజువు పర్చుకోనవసరం లేదు. మీలోవున్న అపరిమితమైన అంతర్‌శక్తి ఆ గొప్ప కార్యాలను చేయిస్తున్నది. ఎవరో మీలో ఆవేశించి ఆ కార్యాలను చేయించడం లేదు.

ఈ విశ్వంలో మీరు ఎంత ప్రాముఖ్యమో, ఇతరులు కూడ అంతే ప్రాముఖ్యాన్ని కలిగివున్నారు. ఎలక్ట్రాను (electron), పరమాణువు (atom), అణువు (molecule), చీమ, కప్ప, పాము, రాయి, చెట్టు, జంతువు, మనుషులు, ఇలా అన్ని జీవజాతులన్నింటిలో మూలచైతన్యశక్తి లేదా దైవం (All That Is or God) నిండి వుండి ఎంతో ప్రాముఖ్యాన్ని కలిగి వున్నాయి. దైవం దృష్టిలో మీరు మాత్రమే ప్రత్యేకంగా గుర్తింపబడి, ఇతరులు విస్మరింపబడటం అనేది ఎక్కడా లేదు. సమస్త లోకాలు, వాటిల్లో వున్న జీవరాశులు అన్నీ ఈ విశ్వం యొక్క సంరక్షణలో ఎంతో భద్రంగా వుంటూ చైతన్య పరిణామం చెందుతున్నాయి

'నీవలే నీ పొరుగు వానిని ప్రేమించుము' అని మీరు విని వుంటారు. దీన్ని చాలా మంది అపార్థం చేసుకున్నారు. మిమ్మల్ని మీరు ఉన్నతంగా చూడగలిగినపుడే ఇతరులనుకకూడా ఉన్నతంగా చూడగలుగుతారు. **'వినయం గల వారు ధన్యులు వారు భూమి వారసత్వమును పొందెదరు' అని కూడా మీరు విని వుంటారు. దీని అర్థం – మీ జీవితాన్ని హీన పర్చుకోకుండా, మీ ఆత్మశక్తిని, మీ అంతర్ ప్రపంచాన్ని గుర్తించి చైతన్య పరిణామం చెందడం . ఇతరులను కూడా అదే రీతిలో గౌరవించి, వాళ్ళుకూడా ఈ విశ్వంలో చైతన్య పరిణామం చెందుతున్నారని గుర్తించడం . ఈ విశ్వంలో సకల ప్రాణికోటి కూడా చైతన్యశక్తి పరిణామం చెందుతున్నాయని గుర్తించడం, ఇతర ప్రాణికోటిపట్ల అనురక్తి కలిగి వుండడం, వినయం అంటే అదే!** ఇతరులను చూచి భయపడడం, వాళ్ళతో పోల్చుకుని మిమ్మల్ని హీన పర్చుకోవడం, జీవితం సార్థకత, జీవితపు విలువను గుర్తించలేకపోవడం, జీవిత సవాళ్ళ ముందర దయనీయంగా బ్రతుకీడ్చడంలాంటివి 'వినయం' అన్పించుకోవు

ఈ వర్తమానంలో మీరు ఎలా వున్నారో అలానే జీవితాన్ని ఆస్వాదించండి. మీరు దేహం మాత్రమే కాదు దైవస్వరూపమని గుర్తుంచుకోండి. మీ జీవితంలో నచ్చని జీవిత సంఘటనలు భౌతిక పరిస్థితుల ముందర దయనీయమైన పరిస్థితిలో మోకరిల్లాల్సిన పని లేదని మీ వాస్తవాన్ని మీరే సృష్టించుకోగలరని గుర్తుంచుకోండి. **'వినయం గలవారు ధన్యులు, వారు భూమి వారసత్వమును పొందెదరు' అని తన కొండమీద ఉపన్యాసం**

(Sermon on the mount)లో జీసస్ క్రైస్ట్ సందేశమిదే! వినయమంటే – నీ వాస్తవాన్ని నీవే సృష్టించుకుంటున్నావు. మీ శాంతియుతమైన ఆలోచనలే మీ జీవితాలలో శాంతిని నింపుతాయి. యుద్ధాలకు, వినాశనానికి మిమ్మల్ని దూరంగా వుంచుతాయి. వాళ్ళే భూమి వారసత్వాన్ని పొందుతారు. అంతేగాని వినయంగల వాళ్ళు అంటే, శక్తిహీనులు, దయనీయస్థితిలో జీవించేవాళ్ళు, వెన్నెముకలేని వాళ్ళు అని కాదు.

జీసస్ చెప్పిన ఎన్నో అఖండ సత్యాలకు వక్రభాష్యాలు చెప్పబడినాయి. మానవుడు ఆధ్యాత్మికంగా, మానసికంగా, ఎంత ఉన్నతంగా ఎదగగలడో తెలియజేసేందుకు జీసస్ ఒక గొప్ప ఉదాహరణ. వాస్తవానికి జీసస్ శిలువ వేయబడి మరణించలేదు. మానవ చైతన్య పరిణామం పరిపూర్ణంగా ఎలా చెందగలదో తెలియజెయ్యడానికి జీసస్ ఒక ప్రతీక. మానవునికి అపారమైన అంతర్‌శక్తి వుందని జీసస్ చెప్పాడు. "దేవుని రాజ్యం మీలోనే వుంది. దాని కోసం వెదకండి. తక్కినవన్నీ వాటంతట అవే వస్తాయి." అని జీసస్ చెప్పడంలో అంతరార్థం – 'మీ వాస్తవాన్ని మీరే సృష్టించుకుంటున్నారు.' అని 'మీ అంతర్ ప్రపంచమే దేవుని రాజ్యం' అని జీసస్ తెలియజేశాడు. ఆనాటి జనావళికి అర్థమయ్యేరీతిలో కొన్ని పిట్టకథలను జోడించి సత్యసందేశం చేశాడు జీసస్. కాని కాలక్రమేణా జీసస్ చెప్పిన సత్యసందేశాల అర్థాలు వక్రీకరింపబడినాయి. 'అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోనికి భౌతిక సంఘటనలు, భౌతిక పరిస్థితులు భౌతిక పదార్థం సృష్టింపబడుతున్నాయి' అని జీసస్ మానవాళికి సందేశమిచ్చాడు. **"దేవుని రాజ్యం మీలోనే వుంది. మొదట దానికోసం వెదకండి. తక్కినవన్నీ వాటంతట అవే వస్తాయి." అంటే – మీ జీవితంలో ఏయే జీవితానుభవాలు కావాలో అన్నీ మీ సంకల్పశక్తి (power of intent), ఊహాశక్తి (imagination) ద్వారా మీ అంతర్ ప్రపంచంలో సృష్టించుకోండి, అవే బాహ్య ప్రపంచంలోనికి సృష్టింపబడతాయి. మీ అంతర్ ప్రపంచమే 'దేవుని రాజ్యం'. అన్ని మతాలూ బోధించిందీ ఈ అంతర్ ప్రపంచం గురించే. అయితే సత్యసందేశాలను అర్థం చేసుకునే మానసిక పరిణతికి మానవజాతి ఇంకా ఎదగవలసివుంది.**

మీ ఆశయాలకు అనుగుణంగానే మీకు పరిస్థితులు, అనుభవాలు ఎదురవుతున్నాయి. మీపై మీరు ఏర్పరుచుకున్న నమ్మకాలు, మీ ఆలోచనలతో ఏర్పరుచుకున్న పరిధులవల్ల వాటికనుగుణమైన పరిస్థితులలో మీరు బందీలవుతున్నారు. మీ ఊహలు, ఆలోచనలు, నమ్మకాలు, కలలు, సంకల్పాలు, స్పందనలు, భయాలు,

ఆశయాలు, కోరికలు, తపన... మొదలైన వాటి నుండే మీ వాస్తవాన్ని మీరు సృష్టించుకుంటున్నారు.

మీకు తెలియకపోవచ్చుకాని, మీ అంతర్ ప్రపంచం నుండే అవి బాహ్య ప్రపంచంలో భౌతిక సంఘటనలుగా వాస్తవరూపం ధరిస్తున్నాయి. మీ అంతరాంతరాలలో స్పందనలు కూడ వాస్తవరూపం ధరిస్తాయి. మీకు ఏది అనుభవంలోనికి వస్తుందో అదే మీరయి వున్నారు. మీ బాహ్య ప్రపంచంలో అనుభవాలన్నీ మీ అంతర్ శక్తి యొక్క ప్రతినిధులని తెలుసుకోండి. మీ అనుభవాలు మీ మూల స్వభావాన్ని తెలియజేస్తున్నాయి. **ఏదైనా జరుగుతుందేమోనని మీరు భయపడితే, అది ఒక భౌతిక సంఘటనగా బాహ్య ప్రపంచంలో రూపాంతరం చెందుతుంది.** బాహ్యంగా ఏది జరిగినా అది మీ అంతర్ ప్రపంచంలోంచే పుట్టుకొస్తున్నదని గుర్తుంచుకోండి.

అనుపమానమైన మీ వ్యక్తిత్వం, జీవితపు విలువలపట్ల విశ్వాసం వుంచండి. మరణం ముందూ జీవితం వుంది. మరణం తర్వాత కూడ జీవితం కంటిన్యూ అవుతుంది. మీరు దేహాలను ప్రతిజన్మ తర్వాత వదిలిపెడుతుంటారు గాని జీవితం మాత్రం నిరంతరమూ ప్రవహిస్తూ వుంటుంది. మీ జీవితంపట్ల అపారమైన నమ్మకం, గౌరవం, ప్రేమకలిగి వున్నట్లయితే జీవితం యొక్క దిశను, గమనాన్ని నడిపించడానికి గల శక్తి సామర్థ్యాలు, గైడెన్స్ మీ అంతర్ ప్రపంచం నుండి ఎప్పటికప్పుడు అందించబడుతుంది. వర్తమానంలో ప్రస్తుతం మీ పరిస్థితి ఎటువంటిదైనా కాని మీ జీవితాన్ని ఎలా కావాలంటే అలా మలుపు త్రిప్పవచ్చుననే విశ్వాసం కలిగివుండండి. ఆ విశ్వాసమే మీ అంతర్ ప్రపంచాన్ని స్పందింపజేసి మీ సంకల్పాలకనుగుణంగా మీ జీవిత దిశ, చైతన్య పరిణామం నడిపింపబడతాయి. మీరు బలమైన సంకల్పం, వాంఛ, కోరిక లేదా ఆశయం కలిగి వున్నపుడు వాటికనుగుణంగా జీవితానుభవాలు పొందడానికి కావలసిన ఐడియాలు (ideas) మీ అంతర్ ప్రపంచం నుండి ఇవ్వబడతాయి. ఆ ఐడియాలు – స్వప్నాల రూపంలోగాని, అంతర్వాణి ద్వారాగాని, కొన్ని ఊహల రూపంలోగాని, మనోశక్తి నుండి వచ్చే ఫ్లాష్‌ల ద్వారా గాని అందించబడుతాయి. మీరు ఏ సంకల్పాన్ని అయితే కలిగివున్నారో, దాని తాలూకు ఐడియాలు మీ అంతర్ ప్రపంచం నుండే వస్తాయి గాని బాహ్యంగా ఏవీ అందించబడవు. కావల్సిందల్లా మీరు ఎంత దృఢమైన సంకల్పాలు కలిగివున్నారు? ఎంత ప్రగాఢంగా మీ అంతర్ ప్రపంచాన్ని విశ్వసిస్తున్నారు? అనేవి ముఖ్యం.

మీ సంకల్పాలు, ఊహలు, వాంఛలు, ఆశయాలు అనేవి మీ మైండ్ నుండి వెలువడుతున్న విద్యుదయస్కాంత తరంగాలు. అవి ఆత్మశక్తిగా రూపాంతరం చెంది భవిష్యత్తులోనికి ప్రయాణించి సంభావ్య సంఘటనలుగా (probable events) మారుతాయి. మీ శక్తిని ఆ సంకల్పాలకు లేదా ఊహలకు మరింత కేంద్రీకరింప జేసినపుడు ఆ సంభావ్య సంఘటన భౌతిక సంఘటనగా వాస్తవ రూపం పొందుతుంది. మీ జీవితంలో ఎదురవుతున్న భౌతిక పరిస్థితులు, భౌతిక సంఘటనలు అన్నీ కూడ సంభావ్య సంఘటనల నుండి మలచబడుతున్నాయి. ఎంత బలంగా వాంఛించారు? ఎంత ధృఢమైన సంకల్పాలు కలిగివున్నారు? సంభావ్య సంఘటనలకు ఎంత బలంగా శక్తి కేంద్రీకరింపబడింది అనే వాటి ఆధారంగా భౌతిక సంఘటనలు భూతలంపై సృష్టింపబడడం జరుగుతుంటుంది.

ఈ భూమి మీద ఏ మనిషి కూడ 'అసమర్థుడిగా.' 'దయనీయుడిగా', 'హీనుడిగా,' 'దుర్బలుడిగా' జన్మతీసుకోవడమనేది జరగనే జరగదు. ఈ భూమి మీద చైతన్య పరిణామానికి, ఆత్మ వికాసానికి కావలసిన అన్ని హంగులూ ముందరే సమకూర్చుకుని జన్మతీసుకోవడం జరుగుతుంది. బుద్ధిమాంద్యం గలవాళ్ళు, అంగవైకల్యం గల వాళ్ళు – వాళ్ళ పాపాల పరిహారంగా దయనీయమైన పరిస్థితులలో జన్మతీసుకున్నారని మీకు తోచవచ్చు. కాని కొన్ని ప్రత్యేక కోణాలలో చైతన్య పరిణామం చెందడం కోసం జన్మ తీసుకునే ముందరే అలా డిజైన్ (design) చేసుకుని వాళ్ళు భూమి మీద ప్రవేశించడం జరుగుతుంది. అంతేగాని, ఇక్కడ శిక్షింపబడడం కోసం జన్మ తీసుకోవడం జరగదు. ఈ విశ్వంలో ఏ లోకంలోనూ ఏ ఆత్మశకలమూ శిక్షింపబడడం జరగదు. **ఈ విశ్వంలో ఏ జీవరాశి కూడ హీనమైనదిగా పరిగణింపబడడం లేదు.**

మీ జీవితంలో ఏ క్షణంలోనూ నిరాశ నిస్పృహలకు లోనుకాకండి. భౌతిక ప్రపంచంలో ప్రతి మానవుడూ తన అంతర్ ప్రపంచంలో అన్ని సర్వసమర్థతలను ఇముడ్చుకుని జన్మతీసుకోవడం జరుగుతుంది. మీరు ఎంత స్పష్టంగా సంకల్పాలు (intents) ఏర్పరచుకుంటున్నారు? అనేది చాల ముఖ్యం. ప్రేమికులు ఒక వైపు 'ఆదర్శప్రేమ'ను వెదుకుతూ, మరోవైపు లోపాలు వెదుకుతూ ఉంటే ఆ ప్రేమ ఎప్పటికీ సఫలం కానేకాదు. అట్లే మీ జీవితంలో కూడ ఒక వైపు సంకల్పం ఏర్పరుచుకుని, మరోవైపు ఆ సంకల్పం నెరవేరుతుందా? లేదా? అని సందేహాలు పెట్టుకున్నపుడు ఆ సంకల్పం భౌతిక వాస్తవంగా (physical reality) రూపాంతరం చెందదు. మీరు సందేహాలు పెట్టుకున్నపుడు ఆ సంకల్పానికున్న శక్తి బలహీనపడుతుంది. బలహీనంగా

వున్న సంకల్పాలు భౌతిక పదార్థంతో ముడిపడివున్న భౌతిక సంఘటనలుగా రూపాంతరం చెందవు. అవి సంభావ్య సంఘటనలుగానే మిగిలిపోతాయి. ఒకే ఒరలో రెండు కత్తులు ఇమడవు గదా! అవి వాటి శక్తి స్థాయి కనుగుణంగా వున్న లోకాలలోనికి ప్రవేశించి అక్కడ వాస్తవరూపం పొందుతాయి. నిరాశకర జీవితానుభవాలు పొందడానికి మీరు ఈ భూమి మీదకు రాలేదు. చైతన్యశక్తిని మలుచుకోవడం మీకు చేత కాకపోవడం వలన మరి ఆత్మజ్ఞానం లేకపోవడం వలన మీ జీవితాలు – దరిద్రంలోనికి, దుఃఖంలోనికి, రోగాలలోనికి నెట్టబడుతున్నాయి. **విశ్వచైతన్య పరిణామంలో భూప్రపంచంలో ప్రతి మనిషీ, ప్రతి జీవీ ఎంతో ముఖ్యమైన వాళ్ళే!** మీరు చైతన్య పరిణామం చెందడం కోసం ఒక కోణంలో ఒక అడుగు ముందుకేస్తే, ఈ విశ్వం మీకు సహకారం అందించడం కోసం అనంతమైన కోణాలలో స్పందిస్తుంది. అడుగు వెయ్యాలనే దృఢమైన సంకల్పం ఏర్పరచుకోవడం కోసం మీరు సాధన చెయ్యవలసి వుంది.

మీ నమ్మకాలే మీ చుట్టూ కంచెలను ఏర్పరుస్తాయి. మీ ఆలోచనలే మీకు సరిహద్దులను ఏర్పరుస్తున్నాయి. వృత్తం యొక్క వ్యాసార్ధం పెరిగే కొలది వృత్తం యొక్క పరిధి పెరుగుతుంటుంది. అలాగే మీ ఆలోచనల పరిధి ఎంత విస్తరించదలుచుకుంటే మీ సరిహద్దులు అంతగా విస్తరిస్తాయి. మీరు 'కొన్ని పరిధుల్లో' వున్నారంటే, మీరు ఆ పరిధుల్ని దాటి విస్తరించాలని సంకల్పం పెట్టుకోకపోవడం వల్లనే జరుగుతుంది.

మీ విజయాలకు, ఆహ్లాదాలకు, సుఖ దుఃఖాలకు మీరే కారణం! మీ జీవితంలో ఏ కోణంలోనైనా అసంతృప్తిగా వుంటే దాన్ని మార్చుకోగల శక్తి మీలోనే వుంది. అది మీ బాధ్యత కూడ. మిమ్మల్ని మీరుగా గుర్తించడం మీ బాధ్యత మరి ప్రథమ కర్తవ్యం. అంతరాత్మ ప్రబోధం అనేది ఎల్లవేళలా మిమ్మల్ని నడిపించాలనే ప్రక్రియలో వుంటుంది. కాని మీరే దాన్ని పెడచెవిన పెడుతున్నారు. మీరు పుట్టి పెరిగిన పరిస్థితులు, సైకాలజిస్టుల విశ్లేషణలు, మీకు ఇదివరకు బోధింపబడిన విషయాలు... వెరసి అన్నీ మిమ్మల్ని గ్రుడ్డి నమ్మకాలలోనికి నెట్టివేస్తున్నాయి. దాని వల్ల అంతర్‌శక్తి నుండి వచ్చే సూచనలకు ద్వారాలు బిగుసుకుపోతాయి. ఆ మార్గాలన్నింటినీ మీరు మూసేశారు. అంతర్ ప్రయాణం చెయ్యడానికీ, అంతర్‌శక్తిని ఉపయోగించ డానికీ, శోధించడానికీ గల అవకాశాలను పోగొట్టుకుంటున్నారు.

మీ అంతర్‌శక్తి నుండి, మీ మనోశక్తి నుండి, మీ చైతన్యం నుండి వచ్చే గైడెన్స్‌ను పట్టించుకోకపోవడం వల్ల మీరిదివరకు కొన్ని అభిప్రాయాలను ఏర్పరుచుకుని

అమలులో పెట్టడం వల్ల సరియైన జీవిత గమ్యాలను ఎంచుకునే శక్తిని కోల్పోతున్నారు. మీ జీవితంలో ఎదురయ్యే సవాళ్ళ ముందు మీరు అశక్తులు కాదు. వాటిని ఎదుర్కొని అధిగమిస్తామనే నమ్మకంతోనే ఆ సవాళ్ళను ఎంచుకున్నారు. అంతేగాని 'యాదృచ్ఛికంగా' అవి తటస్థించలేదు. మీరు ఆహ్వానిస్తే తప్ప ఆ సవాళ్ళు మీకు ఎదురుపడవు. ఈ విషయం మీకు బోధపడితే మీ జీవితగతిని ఎలా కావాలంటే అలా మార్చుకోవచ్చు. 'మీ వాస్తవాన్ని మీరే సృష్టించుకుంటున్నారు', అనే విషయం గ్రహించినట్లయితే మీ ఆలోచనలకు మీరెప్పుడూ బానిసలు కారు. మీ అంతర్ ప్రపంచం... అంటే అంతరాత్మకు అనంతమైన శక్తి వుంది. దానికి హద్దులంటూ ఏమీ లేవు. మీకు ఎంత శక్తి వుందనేది ఎంత విశ్లేషణ చేసినా మీకు అర్థం కాదు.

* * *

జీవిత పరమార్థకతను, భూమి మీద మీ జన్మయొక్క విశిష్టతను, చైతన్యశక్తి పరిణామం యొక్క ప్రాముఖ్యతను, దేహం యొక్క అద్భుతమైన శక్తిని, అపారమైన మీ అంతర్‌శక్తిని సరియైన రీతిలో మీరు గుర్తించకపోవడం వల్లనే మీకు అనారోగ్యం, దుఃఖం తటస్థిస్తున్నాయి. మీ నమ్మకాలు, ఆలోచనల కనుగుణంగా మీ జీవితంలో ఆరోగ్యమో, ఆనందమో, దుఃఖమో సృష్టింపబడుతుంటాయి. ఒకే ఒక్క నమ్మకంతో వంశ పారంపర్యంగా వస్తూన్న జెనెటిక్ వ్యాధులను నయం చేసుకునే శక్తి మీ దేహానికి కలుగజెయ్యవచ్చు. ఆ ఒక్క నమ్మకంతోనే మీ దేహంలో ఎన్నో హార్మోన్లు, రసాయనాలు విడుదలయి ఆ వ్యాధులు నయం చెయ్యబడతాయి. దేహానికి సంక్రమించిన ఎటువంటి వ్యాధులయినా నయమవ్వడానికి నెలలు, సంవత్సరాలు పట్టాల్సిన పని లేదు. మీ బలమైన నమ్మకాలతో కొన్ని నిముషాలలోపే ఎటువంటి దీర్ఘకాలిక వ్యాధినైనా నయం చేసుకోవచ్చు.

భయాలు, అపనమ్మకాలు, సందేహాలు, పరిమిత జ్ఞానంతో కూడుకున్న మీ విశ్లేషణలు మీ ఆరోగ్యాన్ని, మీ జీవితానుభవాలను మెరుగుపర్చడానికి బదులు మరింత దిగజార్చుతాయి. మీరు ఈ విశ్వంలో దేనికీ భయపడనక్కరలేదు. **జీవితాన్ని, జీవిత సవాళ్ళను ఒక కళగా, ఒక ఆటగా, ఒక సరదాగా స్వీకరించడం నేర్చుకోండి.జీవితాన్ని సీరియస్‌గా తీసుకోనవసరం లేదు. ఈ విశ్వంలో ఏ జీవజాతులూ తమ జీవితాలను సీరియస్‌గా తీసుకోవడం లేదు. కీటకాలు, పక్షులు, చేపలు, చీమలు, తేనెటీగలు... ఇంకా ఇతర జీవజాతులన్నీ జీవితాన్ని ఒక కళగా, ఒక ఆటగా ఆస్వాదిస్తున్నాయేగాని జీవితాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. చిన్న పిల్లలను ఎప్పుడైనా నిశితంగా**

గమనించారా? వాళ్ళ జీవితాలలో సీరియస్‌నెస్ అనేది ఎక్కడా ఆవగింజంతయినా కన్పించదు. ఆనందం, ఆరోగ్యం, సృజనాత్మకత సహజత్వం అనేవి జీవితాన్ని ఒక ఆటగా, కళగా ఆస్వాదించినపుడే అలవడుతాయి. జీవితంలో ఎదురయ్యే సమస్యలను (సవాళ్ళు), ఆరోగ్య సమస్యలను వాటిని అధిగమించగలమనే ప్రగాఢ నమ్మకంతో ఒక కళగా స్వీకరించండి. మీ అంతర్ ప్రపంచం నుండి గైడెన్స్ వస్తుందనే నమ్మకంతో కృత నిశ్చయంతో వుండడం నేర్చుకోండి. మీకు రావాల్సిన గైడెన్స్ ఆటోమాటిక్‌గా వచ్చే తీరుతుంది.

మీకు జబ్బు చేసినపుడో, దుఃఖంలో వున్నపుడో, భరించరాని సమస్యలతో ఇరుక్కున్నారని భావించినపుడో, భయానికి లోనయినపుడో, నిరుత్సాహపడినపుడో, మరింత క్రుంగిపోవడం చెయ్యకండి. అవన్నీ సముద్రంలోని అలలు లేదా అలజడులు లాంటివి. మహాసముద్రమంత అంతర్ ప్రపంచంలో ఆ 'అలలు', 'అలజడులు' ఎంతోకాలం కొనసాగవని గుర్తుంచుకోండి. వాటిని ఒక కళగా, సవాలుగా ఎంతో ఆనందంగా స్వీకరించడం నేర్చుకున్నట్లయితే ప్రతిదానికీ పరిష్కారం మీ అంతర్ శక్తి నుండి లభిస్తుంది.

మీ అంతర్వాణి మాత్రమే మీకు సరియైన గైడెన్స్ ఇవ్వగలదు. ఇతరులనుండి వచ్చే నెగిటివ్ సలహాలు, సూచనలను ఎంతమాత్రం పట్టించుకోకండి. 'నువ్వు చాలా అలసిపోయినట్లున్నావు?' 'నువ్వు చాల అనారోగ్యంగా వున్నావు.' 'నువ్వు ఈ పని చెయ్యలేవు?' 'నీకు ఈ విషయం పట్ల అంత నైపుణ్యం లేదు?' 'నీవు అంత తెలివైన వాడివి కాదు.'– లాంటి ఎన్నో సూచనలు ఇతరుల నుండి వస్తున్నపుడు వాటిని మీరు మనస్ఫూర్తిగా తిరస్కరించండి. మీరు గనుక ఆ సూచనలను అనుమతిస్తే వాటివల్ల మీ కాన్షియస్ మైండ్ ప్రభావితం అయి మీ జీవిత పరిస్థితులను మరింత దిగజార్చడం జరుగుతుంది. కాన్షియస్ మైండ్ ద్వారా స్వీకరించిన ప్రతి సూచన కూడ మీ ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తుంది. ఇతరులనుండి పాజిటివ్‌గా వచ్చే సూచనల్ని మాత్రమే మీ వివేచనా శక్తితో స్వీకరించండి.

జీవితంలో ఎదురయ్యే ఏ సమస్య అయినా సరే దానికి పరిష్కారం వుండితీరుతుందని బలంగా విశ్వసించండి. ఆ సమస్యకు పరిష్కారం లభించినట్లు మీ ఊహాశక్తి ద్వారా (Imagination) కలలు కనండి. మీ ఆత్మశక్తి... అంటే మీ అంతర్‌శక్తి ఉద్యుక్తమై ఆ సమస్య పరిష్కారమయ్యే దిశలో భౌతిక పరిస్థితులను సృష్టిస్తుంది. అనారోగ్యం, అసంతృప్తికర పరిస్థితులు అనేవి ఆత్మశక్తి యొక్క అనుపమానమైన శక్తిసామర్థ్యాలను గుర్తించలేకపోవడం వల్ల జరుగుతుంటుంది. ఒక మనిషి తన జీవిత కాలంలో తను

పొందే జీవితానుభవాలకంటే అనేక రెట్లు జీవితానుభవాలను పొందవచ్చు. తన జీవితం ఏయే లక్ష్యాలు ఎంచుకోవాలో తన అంతర్వాణి నుండి ప్రతి క్షణమూ సందేశాలు అందించబడుతూనే వున్నాయి. మీరే అంతర్వాణి పట్ల శ్రద్ధ చూపడం లేదు.

జీవిత ప్రయాణం ఏ దిశలో సాగాలి? అనే విషయం మీరే నిర్ణయించుకోవాలి. ఇతరుల ఆశయాలకనుగుణంగా మీ జీవిత లక్ష్యాలను ఎంచుకోవడం శుద్ధ అవివేకం. దానివల్ల మీకు ఒరిగేదేమీ వుండదు. దానివల్ల మీరు ఆధ్యాత్మికంగా నేర్చుకునేదేమీ వుండదు. మీ నుంచి మీరు ఏమి ఆశిస్తున్నారు? మీ అంతర్వాణి ద్వారా గైడెన్స్‌ను ఎంత చక్కగా వినియోగించుకుంటున్నారు? అనేవి మిమ్మల్ని ఆధ్యాత్మికంగా ముందుకు నడిపిస్తాయి. ఇతరుల ఆశయాలకనుగుణంగా మీ జీవిత గమనాన్ని ఎంత మాత్రం ఎంచుకోకండి. అది మీ వ్యక్తిత్వాన్ని, మీ చైతన్య పరిణామాన్ని దెబ్బతీస్తుంది.

మీ సంకల్పం అనేది అంతర్ ప్రపంచం... అంటే అంతర్‌శక్తి నుండి వెలువడుతుంది. అంతర్‌శక్తి నుండి వెలువడిన ప్రతి సంకల్పమూ విద్యుదయస్కాంత శక్తిని కలిగి వుంటుంది. మీ సంకల్పాలు, ఆలోచనలు విశ్వశక్తిని కలిగి వుండి అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోనికి వెలువడినపుడు భౌతిక సంఘటనలను ప్రభావితం చేస్తాయి. భౌతిక సంఘటనలలోని అతి సూక్ష్మాతి సూక్ష్మమైన ధర్మాలను ప్రభావితం చేసి మీ ఆలోచనలకు అనుగుణంగా మల్చబడతాయి. మీ మనోశక్తి నుండి వస్తున్న ప్రతి సంకల్పమూ బాహ్య ప్రపంచంలోని భౌతిక పరిస్థితులను తారుమారు చేస్తూ వుంటాయి. చెస్‌గేమ్ (chess game)లో ఒక పావును (pawn) కదిపితే ఆట స్వభావం మారిపోతున్న రీతిలో మీ ఒక్కొక్క సంకల్పమూ మీ జీవితంలో తారసపడే భౌతిక సంఘటనల స్వభావాన్ని మార్చేస్తుంటుంది. నదీ ప్రవాహం ఏక్షణానికి ఆ క్షణం మలుపు తిరుగుతున్నట్లే, జీవితప్రవాహం కూడ మలుపు తిరుగుతుంటుంది. వర్తమానంలో మీ నుండి వెలువడే ప్రతి ఆలోచన, ప్రతి సంకల్పం మీ జీవితాన్ని మలుపు త్రిప్పుతుంది.

నిరాశ, దుఃఖం, దరిద్రం, రోగంలాంటి వాటి నుండి మీ దృష్టిని మరల్చి ఆనందం, ఆరోగ్యం, అద్భుతమైన జీవితంపట్ల కేంద్రీకరించండి. మీ అంతర్‌శక్తి యొక్క అనంతమైన ఇంటెలిజన్స్ (infinite intelligence) పట్ల నమ్మకం కలిగి వుండండి. జీవితంలో ఎల్లవేళలా మంచే జరుగుతుందని ఆశాకర దృక్పథాన్ని కలిగి వుండండి. ఆ దృక్పథమే మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. మిగతా కార్యాన్ని మీ అంతర్ ప్రపంచం నడిపిస్తుంది. ఈ క్రింద కనబర్చిన భావనలను మీరు ఏర్పరచుకోండి. అవి మీకు ఆశాకర దృక్పథాన్ని కలిగిస్తాయి.

1. నేను ఒక అద్భుతమైన ప్రాణిని. ఈ చైతన్య వికాసంలో నేను ఎంతో విశిష్టతను కలిగివున్నాను.

2. భూమి మీద నా ఉనికి నా యొక్క జీవితసార్థకతను పెంచుతుంది. మరి ఇతర జీవజాతుల జీవితసార్థకతను కూడ పెంచడంలో నేను ప్రముఖ పాత్ర వహిస్తున్నాను.

3. నా సామర్థ్యాలను పెంపొందించుకోవడం ద్వారా నా జీవితాన్ని ఆనందమయం చేసుకుని చైతన్య పరిణామం చెందుతున్నాను. అన్ని జీవజాతుల చైతన్య పరిణామానికి నేను తోడ్పాటునందిస్తున్నందుకు ఆనందిస్తున్నాను.

4. నేను అనుక్షణమూ ఈ విశ్వం, మూలచైతన్యం సంరక్షణలో వుంటున్నాను. ఈ మూలచైతన్యమే నా అంతర్ ప్రపంచమై వుండి నాలో చైతన్య పరిణామం చెందిస్తూంది. నా చర్మ చక్షువులకు కన్పించకపోవచ్చుగాని నా అంతర్ శక్తి నన్ను నడిపిస్తుంది.

5. ఈ ప్రకృతిలో నేను ఒక గొప్ప ప్రాణిని. ఈ ప్రకృతిలోని శక్తి అంతా నా వినియోగం కోసం ఎదురు చూస్తూంది. ప్రకృతి శక్తులంతా నా సంకల్పానికి సహాయ సహకారాలు అందిస్తున్నాయి.

6. ఈ విశ్వ చైతన్య పరిణామంలో నాకుగాని, నా సహచర జీవజాతులకుగాని ఎటువంటి కొరత, లోపం ఏర్పడడం లేదు. అన్ని జీవరాశులూ ఈ విశ్వంలో మూలచైతన్యం నుండి వెలువడిన ఆత్మశకలాలే.

7. ఈ ఆత్మ శకలాలన్నీ చైతన్య పరిణామాన్ని చెందుతున్నాయి. ఒక దాని చైతన్య పరిణామం మిగతా వాటిని ప్రభావితం చేస్తుంది. ఈ విశ్వంలోని జీవజాతులన్నీ సఖ్యత, సహకారం, ప్రేమ, అనురక్తితో జీవిస్తున్నాయి.

ఇలాంటి పాజిటివ్ భావనలు (positive ideas) ఏర్పరచుకోవడం వల్ల మీకు మీరు మేలు చేకూర్చుకుంటారు. ఆశాకర దృక్పథం మీలో ఆటోమాటిక్‌గా ఏర్పడుతుంది. ఈ భావనలు మీ దేహంలోని పరమాణువులు, అణువులు, జీవకణాలను ఉత్తేజితం చేసి క్రొత్త క్రొత్త జీవరసాయనిక చర్యలను కలగజేస్తాయి. క్రొత్త ఎంజైములను, హార్మోనులను, ఇతర జీవరసాయనాలను అతి సూక్ష్మమైన ప్రక్రియల ద్వారా విడుదల చేస్తాయి. వాటిని మీ వైద్య శాస్త్రజ్ఞులు పసిగట్టలేరు. దేహం యొక్క ప్రతిస్పందన రీతిని మార్చడంలో

పాజిటివ్ భావనలు తోడ్పడతాయి.

శిశువులు (Infants) జన్మలు తీసుకోక ముందరే ఈ భూమి మీద ఎంతో విశిష్టత, ప్రాముఖ్యత, చైతన్య పరిణామం చెందడానికి అపారమైన అవకాశాలు, అమేయమైన సంపద, జీవజాతుల నుండి సాటిలేని సహకారం + ప్రేమ వుంటాయనే విశ్వాసం కలిగి వుండి భూ ప్రపంచంలోనికి ప్రవేశించడం జరుగుతుంది. భూమి మీద వాతావరణం, ఇతర పరిస్థితులకు భయపడి ఏ శిశువూ జన్మ తీసుకోవడం జరగడం లేదు. 'భూమి మీద అంతా మంచే జరుగుతుంది.' 'ఈ విశ్వం నాకన్నీ సమృద్ధిగా సమకూరుస్తుంది. 'ఆత్మ చైతన్య పరిణామం చెందడానికి పుష్కలమైన అవకాశాలు వున్నాయి', అనే ఉత్తేజకరమైన భావనలతో, నమ్మకాలతో ప్రతి శిశువూ భూమి మీద జన్మ తీసుకుంటుంది. భయాలు, సందేహాలు, కోపం, కసి, పగ లాంటి ఫీలింగ్స్‌తో ఏ శిశువూ భూమి మీద ప్రవేశించడం లేదు. ఆత్మ పరిశోధన, ఆత్మ చైతన్య పరిణామం చెందడం కోసం మూలచైతన్యం యొక్క హృదయ స్పందన కనుగుణంగా ప్రతిశిశువూ జన్మ తీసుకుంటూంది. **ప్రతి శిశువు జన్మతో భూమి . జీవరాశులు . ప్రకృతి ఆనంద పారవశ్యంతో పులకించి పోతున్నాయి, సాదరంగా, సగౌరవంగా స్వాగతం పలుకుతున్నాయి. భూమి మీద జన్మ తీసుకునే ప్రతి శిశువూ, ప్రతిప్రాణీ భూప్రపంచ చైతన్య పరిణామాన్ని పెంచేందుకు వస్తున్నందుకు, భూమి .జీవరాశులు . ప్రకృతి ఆనందంతో నృత్యం చేస్తున్నాయి. ప్రతి శిశువు జననం, ప్రతి ప్రాణి జననం భూప్రపంచానికి ఒక సెలబ్రేషన్ (celebration)! ఆ ఆనందమే బ్రహ్మానందం.**

ఈ విశ్వంలో అనంతమైన శక్తి – మీ సంకల్పాలు, ఆశయాలు, కలలూ, ఊహలు, వాంఛలు, స్పందనలకు అనుగుణంగా మీ వినియోగంలోనికి రావడానికి సిద్ధంగా వుంది. అనంతమైన శక్తి మీ సంకల్పాలను నెరవేర్చడానికి సిద్ధంగా వుంది. ప్రతి ఆత్మ శకలమూ అనంతమైన శక్తిని వినియోగించుకోవచ్చు. ఈ విశ్వంలోని శక్తి అంతా మీ ద్వారా ప్రకటితం కావడానికి మీ సంకల్పాల వైపు నిత్యమూ ప్రవహిస్తూ వుంది.

ఈ భౌతిక ప్రపంచంలో మీ నమ్మకాలు, విశ్వాసాలకనుగుణంగా మీ చుట్టూ భౌతిక వాతావరణం, భౌతిక పరిస్థితులను ఆకర్షిస్తున్నాయి. మీ దేహ ఆరోగ్యం కూడ మీ విశ్వాసాలకు అనుగుణంగా వుంటుంది. **హింసను విడనాడితే తప్ప మానవజాతికున్న రోగాలు మటుమాయం కావు.** ఒక వైపు కబేళాలలో జంతువులను వధిస్తూ,

ప్రయోగశాలల్లో జంతువులను హింసించి ప్రయోగాలు చేస్తూ, మరోవైపు శాంతి మంత్రాలను వల్లెవేయడం ఆధ్యాత్మికత అన్పించుకోదు. **మానవులు ఆహారం కోసం అతి క్రూరమైన పద్ధతుల ద్వారా జంతువులను హింసించడం, జంతువులను ప్రయోగశాలల్లో నీచమైన పద్ధతుల ద్వారా హింసించడం విడిచిపెట్టనంత కాలం భూమి మీద వ్యాధులనేవి మానవజాతిని వీడవు. హింసాత్మకధోరణి దేహం పైన ప్రభావం చూపుతుంది. జీవజాతులు కూడ చైతన్యశక్తి, ఫీలింగ్స్, భావనలు కలిగి వుంటాయనే విషయాన్ని మీరు విస్మరించారు.** వాటియొక్క చైతన్యశక్తికీ, ఆత్మవికాసానికీ విలువ ఇచ్చి గౌరవించకపోవడం వలన ప్రకృతి చైతన్య వికాసాన్ని అర్థం చేసుకోవడంలో మీరు విఫలమవుతున్నారు. చైతన్య పరిణామం, హింస ఒకేసారి తటస్థించవు. హింస వున్నపుడు చైతన్య పరిణామం వుండదు. జంతుజాతిని వాటి మానాన వాటిని వదిలి వెయ్యండి. భౌతిక వాస్తవాన్ని అర్థం చేసుకోవడంలో మానవజాతికి జంతుజాతులన్నీ ఎంతో సహకరిస్తున్నాయి. విశ్వచైతన్య పరిణామంలో మానవజాతితో బాటు జంతుజాతి కూడ ఎంతో విశిష్టత కలిగి వుంది. జంతుజాతిపట్ల ఎంతో కృతజ్ఞులై వుండండి. దేహ ఆరోగ్యానికి సంబంధించి ఎన్నో విషయాలను జంతుజాతుల నుండి మీరు నేర్చుకోవచ్చు. ప్రాచీన నాగరికతలలో మానవజాతికి వ్యాధులనేవి వుండెడివి కావు. వారు జంతుజాతులతో ఎంతో సఖ్యత, ప్రేమ కలిగి వుండి ఎన్నో విషయాలు నేర్చుకుంటూ వుండేవాళ్ళు.

భూమి మీద శక్తిని, వనరులను నిత్యనూతనంగా వుంచడానికి భూకంపాలు, తుఫానులులాంటి ప్రకృతి ప్రళయాల ద్వారా ప్రకృతి తననుతాను సర్దుబాట్లు చేసుకుంటుంది. మానవజాతి, జీవజాతులను శిక్షించడానికి ఈ ప్రళయాలు ఏర్పడవు. అదేవిధంగా దేహ ఆరోగ్యానికి, దేహానికిగల చైతన్యశక్తిని నిత్యనూతనంగా వుంచేందుకు అపుడపుడూ కొన్ని వ్యాధులు సంక్రమిస్తుంటాయి. ఆ వ్యాధులవల్ల దేహంలో కొన్ని సర్దుబాట్లు జరుగుతాయి. అయితే ఎటువంటి వ్యాధినైనా దేహం నయం చేసుకోగలదనే విషయాన్ని మీరు విస్మరించకూడదు. అదే విధంగా దేశాల మధ్య , జీవజాతుల మధ్య ప్రకృతి చైతన్య పరిణామ క్రమంలో సర్దుబాట్లు, సమతౌల్యం పొందడానికి – సూక్ష్మస్థాయి నుండి అతిపెద్ద స్థాయి వరకు – అపార ప్రాణనష్టం జరుగుతుంటుంది. ఇదంతా మనుషులు, జీవజాతుల అంగీకారంతోనే జరుగుతుంటుంది. ఏ మనిషీ, ఏ జంతువూ తన అంగీకారం లేకుండా మృత్యువును ఆహ్వానించదు. తుఫానులు, భూకంపాలలో మరణిస్తున్న మానవజాతి వారి అంతర్ ప్రపంచంలో మృత్యువును ఆహ్వానించినవాళ్ళే.

ఈ విశ్వంలో ఏ దేవుడూ మిమ్మల్ని శిక్షించడం లేదు. విశ్వంలో ఏ శక్తీ మిమ్మల్ని శాసించడం లేదు. మిమ్మల్ని మీరే శిక్షించుకుంటున్నారు. మిమ్మల్ని మీరే అభివృద్ధి పరచుకుంటున్నారు. మీ పురోగతికి గాని, మీ తిరోగతికిగాని మీరే కారకులు. మీ జీవితంలో ఎదురవుతున్న భౌతిక వాస్తవమంతా మీ సంకల్పాల నుండే జనిస్తూంది.

* * *

ఈ భూమి మీద ఈ దేహంతో వున్నారంటే అన్నీ అనుభవించడానికే! అన్నీ ఆనందించడానికే. మీకున్న అపారమైన శక్తిని ప్రకటితం చేసుకుని చైతన్య పరిణామం చెందడానికే. మీరు ఈ లోకంలో వున్నది– మీ చైతన్యశక్తిని విస్తరణ కావించుకుని, విశ్వచైతన్యశక్తి విస్తరణకు దోహదం చెయ్యడం కోసం. మీ జీవితంలో సమస్యలను, సవాళ్ళను ఎవరూ మీపై రుద్దడం లేదు. వాటిని ఎదుర్కొని చైతన్య పరిణామం చెందాలనే సంకల్పంతో ఆకర్షిస్తున్నారు. మీ జీవితానుభవాల పరిధి విస్తరించేకొలదీ జీవితశాస్త్రము + చైతన్య పరిణామం చాల చక్కగా అర్థమవుతుంటుంది. జీవితానుభవాలు పొందడానికి, జీవిత సవాళ్ళను ఎంచుకోవడానికి, బలమైన సంకల్పాలు ఎంచుకోవడానికి ఏ మాత్రం వెనుకాడకండి. జీవితానుభవాలు, సవాళ్ళను ఒక్కొక్కదాన్ని ఎదుర్కొనే కొలదీ మీ చైతన్య వికాసం మరింత పదునుపెట్టబడుతుంటుంది. శక్తి వృధా అవుతుందని గాని సవాళ్ళను ఎదుర్కొని మధ్యలో విఫలమవుతామేమో అనే భయాలను మీ భావనలలో, ఆలోచనలలో రానీయకండి. మీ అంతర్వాణి నుండి సూచనలను స్వీకరించడంలో విఫలమవుతున్నామేమోననే ఆలోచనల్ని మీ దరికి చేరనీయకండి. ఎన్ని అనుభవాలనైనా, ఎన్ని సవాళ్ళనైనా ఎదుర్కోగలననే ధీమాతో సిద్ధంగా వుండండి. ప్రతి అనుభవమూ మీకు జ్ఞానాన్ని అందిస్తుంది. మీ జీవితం యొక్క క్వాలిటీని పెంచుతుంది.

భౌతిక పదార్థంతో ముడిపడివున్న ఈ భూప్రపంచంలో అన్ని కోణాలలో భౌతిక అనుభవాలు, ఆనందాలు పొందుతూ చైతన్య పరిణామం చెందడానికి మీకు ఎంత హక్కు వుందో, ఇతర జీవజాతులకు కూడ అంతే హక్కు వుందని గుర్తించండి. ఆధ్యాత్మికంగా, భౌతికంగా, మానసికంగా, ఆత్మచైతన్య పరిణామపరంగా ఎదగడానికి అన్ని జీవరాశులూ జన్మ తీసుకుంటున్నాయనే విషయాన్ని మీరు గుర్తుంచుకోవాలి. మీ కాన్షియస్ మైండ్ పరిధిలో పొరపాట్లు, తప్పిదాలు అనేవి వున్నట్లు గోచరించవచ్చుకాని మహిమాన్వితమైన ఈ విశాల విశ్వంలో అవన్నీ చైతన్య పరిణామంలో సంభవించే మార్పులు. మీరేమి చేస్తున్నారో, ఏ దిశలో చైతన్య పరిణామం చెందుతున్నారో అంతా

మీ అంతర్ ప్రపంచానికి తెలుసు. మీ ఆలోచనలు, సంకల్పాలు, భయాలు, సందేశాలన్నీ మీ అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలో వాస్తవరూపం పొందుతూన్న విషయం మీ దేహంలోని ప్రతి జీవకణానికీ తెలుసు. మీరు అంతర్‌శక్తిలో ఏ భావనలు కలిగివున్నారో, అవే బాహ్య ప్రపంచంలో త్రీ డైమన్షనల్ అద్దంలో భౌతిక సంఘటనలుగా పరావర్తనం చెందుతున్నాయి. బాహ్య ప్రపంచంలో ఇతరులలో చూసే గుణాలన్నీ మీ మనసులోనివే. మీరు ఒక గుణంపట్ల ఒక మనిషిని ద్వేషిస్తున్నారంటే మీలోని ఆ గుణాన్ని చూస్తున్నారని అర్థం.

మీ యొక్క సజీవ చిత్రమే మీరు. మీ అంతర్‌శక్తి నుండే మీ దేహం పుట్టుకొచ్చింది. మీ భావనలు, చేతనా స్థితి + అచేతనాస్థితిలో నుండి వెలువడుతూన్న మీ ఆలోచనలు, మీ ఊహలు, కలలు అన్నీ కలిసి ఏ క్షణానికాక్షణం మీ దేహాన్ని నిర్మిస్తున్నాయి. మీ దేహం యొక్క ఆకృతి, దాని ఆరోగ్యం, అనారోగ్యం... మీ మనోశక్తి నుండి వాస్తవరూపం పొందుతున్నాయి. మీ అంతర్ శక్తి యొక్క సంకల్పం, ఊహాశక్తి వల్ల భూమి మీద ఈ జన్మను తీసుకున్నారు. మీరేమీ యాదృచ్ఛికంగా ఈ భూమి మీద ఊడిపడడం జరగలేదు. అనేకానేక జన్మలు... అంటే కోటానుకోట్ల జన్మల తాలూకు జ్ఞానాన్ని, చైతన్యశక్తిని మీ ఆత్మశక్తిలో, మీ సబ్‌కాన్షియస్ మైండ్‌లో ఇముడ్చుకుని ఈ భూమి మీద బహుముఖకోణాలలో చైతన్య పరిణామం చెందడానికి జన్మ తీసుకోవడం జరిగింది. ఆ జ్ఞానమంతా మీ దేహంలోని జీవకణాలలో, క్రోమోజోమ్‌లలో, రక్తంలో, క్రోడీకరింపబడివుంది.

కోటానుకోట్ల జన్మల జ్ఞానాన్ని, మీ పూర్వీకుల జ్ఞానాన్ని, జీవజాతులన్నింటి జ్ఞానాన్ని– ఈ భూతలంలో భౌతిక వాస్తవాన్ని ఎదుర్కొని చైతన్య వికాసం చెందడానికి మీ దేహంలో ఇముడ్చుకుని జన్మ తీసుకున్నారు. దేహమంటే ఒట్టి మాంసపు ముద్ద అని కాదు. ఆధ్యాత్మిక శక్తి . భౌతికశక్తి . జీవరసాయనిక శక్తి . విద్యుదయస్కాంత శక్తి . మానసిక శక్తి అన్నింటి సముదాయంతో మూలచైతన్యశక్తితో నింపబడివున్న మాంస పిండమే మీ దేహం. మీ దేహం పరమ పవిత్రమైనది. భౌతిక ప్రపంచంలో త్రిడైమన్షనల్ తలంలో భౌతిక వాస్తవం తాలూకు సవాళ్ళను స్వీకరించి చైతన్య పరిణామం చెందడానికి మీ అంతర్‌శక్తి మీ దేహాన్ని ఎంచుకుంది. అలాగే ప్రతి ఆత్మ శకలమూ భూభౌతిక తలంలో ప్రవేశించే ముందర దేహాలను ఎంచుకుని వస్తున్నది. **భూమి మీద దేహధారులైన ఆత్మ శకలాలన్నీ మీ కళ్ళ ముందర నడయాడే సజీవ దైవాలు. మానవదైవాలు, జంతు**

దైవాలు, వృక్ష దైవాలు, కీటక దైవాలు, రాయి దైవాలు, పరమాణువు దైవాలు, కొండ దైవాలు - అన్నీ దైవాలే.

అంతర్ ప్రపంచంలో వున్నది మల్టిడైమన్షనల్ తలం అయితే బాహ్య ప్రపంచంలో వున్నది త్రి డైమన్షనల్ తలం. మీ అంతర్ ప్రపంచంలో సంకల్పాలు వెలువడితే బాహ్య ప్రపంచంలో అవి భౌతిక వాస్తవం పొందుతాయి. ఈ భౌతిక వాస్తవంలోనే పదార్థం + భౌతిక సంఘటనలు + భౌతిక పరిస్థితులు + భౌతిక వాతావరణం + జీవితానుభవాలు ఇమిడి వున్నాయి. అంతర్ ప్రపంచంలో కారణముంటే బాహ్య ప్రపంచంలో కార్యముంటుంది. మీ అంతర్ ప్రపంచం సృష్టి కర్త అయితే దాని వాస్తవ రూపమే బాహ్య ప్రపంచంలో సృష్టి అవుతుంది. బాహ్య ప్రపంచంలో భౌతిక పదార్థంతో ముడిపడివున్న భౌతిక పరిస్థితులు, జీవితానుభవాలన్నీ కూడ మీ ఆత్మశక్తి నుంచే పుట్టుకొస్తున్నాయి. మీ అంతర్ ప్రపంచంలో భావనలకు అనుగుణంగా బాహ్య ప్రపంచంలో భౌతిక సంఘటనలు ఆటోమాటిక్‌గా సృష్టింపబడతాయి.

అంతర్ ప్రపంచంలో మార్పుతోనే బాహ్య ప్రపంచంలో మార్పు సంభవమవుతుంది. బాహ్య ప్రపంచంలో మీ జీవితానుభవాలలో తారసపడే సమస్యలకు పరిష్కారాన్ని మీ అంతర్ ప్రపంచం నుంచి రాబట్టండి. సమస్యకు పరిష్కారం దొరకినట్లు అంతర్ ప్రపంచంలో కలలుగనండి. అంతర్ ప్రపంచాన్ని విశ్వసించండి. బాహ్య ప్రపంచంలో అన్ని భౌతిక సంఘటనల మూలాలూ మీ అంతర్ ప్రపంచంలోనే వున్నాయి. మీ జీవితంలో చోటుచేసుకున్న దీర్ఘకాలిక భౌతిక సంఘటనలు కూడ మీ అంతర్ ప్రపంచంలో సంకల్పాలలో మార్పు వచ్చినపుడు తక్షణమే మటుమాయమైపోతాయి. మీ సంకల్పాలకనుగుణంగా క్రొత్త భౌతిక సంఘటనలు మీ జీవితానుభవాలుగా ప్రవేశిస్తాయి.

అనేక సంవత్సరాలుగా కొన్ని భౌతిక సమస్యలు మిమ్మల్ని వెంబడిస్తుంటాయి. మీ అంతర్ ప్రపంచంలో వాటిని అంగీకరిస్తున్నందువల్లనే అవి మిమ్మల్ని వెంబడిస్తుంటాయి. క్రొత్త భౌతిక పరిస్థితులు, క్రొత్త జీవితానుభవాలు కావాలని, ఇపుడున్న పరిస్థితులు సమూలంగా మార్పు చెందాలని మీరు ప్రగాఢంగా వాంచించినపుడు వాటికనుగుణంగానే మీ జీవితంలో భౌతిక పరిస్థితులు ప్రవేశిస్తాయి. మీరు వాంఛించకుండా ఏదీ మీ జీవితంలో ప్రవేశించదు. జీవితంలో ఏదైనా దుర్ఘటన జరుగుతుందేమోనని మీరు భయపడినపుడు, మీ మైండ్‌లో ఏదో పొరలో దాన్ని వాంఛిస్తున్నారు. ఆ దుర్ఘటన మీ జీవితంలో చోటుచేసుకుంటుంది. ఒక వ్యక్తి యాక్సిడెంట్

(accident) జరుగుతుందేమోనని భయపడతాడు. ఆ భయమే అతనికి యాక్సిడెంట్‌ను కలుగజేస్తుంది.

మీ భయాలు, సంకల్పాలు, కోరికలు, ఆశలు, ఆశయాలు అన్నీ అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోనికి, మీరు శ్వాస తీసుకుంటున్నంత సులభంగా భౌతిక వాస్తవంగా సృష్టింపబడుతున్నాయి. అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోనికి సృష్టి అనేది చాల ఆహ్లాదమైన కార్యము. ఇదేమీ ప్రయాసతో కూడినది కాదు. మీ భౌతిక జీవితానుభవాలలో ఇతర మానవజాతి + ఇతర జంతుజాతుల భౌతిక జీవితానుభవాలు కూడ కలుస్తాయి. ఒక రంగస్థల నాటకంలో లేదా సినిమాలో ఎన్నో పాత్రలు కలిసినపుడే ఆ నాటకం లేదా సినిమా అర్థవంతంగా వుంటుంది. ఒకే పాత్రతో నాటకం, సినిమా వుండదు. అట్లే ఈ త్రీ డైమన్షనల్ భూభౌతిక ప్రపంచంలో మీ జీవితానుభవాలు, మీ లక్ష్యాలు ఇతరుల జీవితానుభవాలు, లక్ష్యాలతో మిళితమై వుంటాయి. మీ లక్ష్యాలకు, సంకల్పాలకు అనుగుణంగా ఇతర మానవజాతిని మీ వైపు ఆకర్షిస్తారు. వాటికనుగుణంగానే ఇతరుల భౌతిక సంఘటనలు మీ భౌతిక సంఘటనలతో మిళితమవుతాయి. ఈ పరిణామం మీరు జీవించి వున్నపుడు, మరణం తర్వాత కూడ చోటుచేసుకుంటుంది. జీవితానుభవాలను మీరు సంకల్పించుకున్నట్లే మీకు ఇష్టమొచ్చిన రీతిలో మలుచుకోవచ్చుననే విషయం తెలుసుకోండి..

మీ ఇంట్లో కుర్చీ, టేబిల్, బట్టలు, డైనింగ్ టేబిల్ ఇతరత్రా వస్తువులు మీ కుటుంబ సభ్యుల్లోని అంతర్ ప్రపంచం నుండి సంకల్పించబడి బాహ్య ప్రపంచంలో వాస్తవరూపం పొందినవే. అంతర్ శక్తి నుండి బాహ్య ప్రపంచంలోనికి భౌతిక వస్తువులు, భౌతిక సంఘటనలు, భౌతిక పరిస్థితులుగా సృష్టింపబడతాయనే వాస్తవాన్ని మీరు సదా గుర్తుంచుకోవాలి. మీ జీవితానుభవాలన్నీ చైతన్యశక్తితో నిండి వున్నవే. పదార్థం, భౌతిక వస్తువు, భౌతిక సంఘటన అన్నీ చైతన్యశక్తిని కలిగివున్నాయి. మీకు ఫీలింగ్స్ ఎలా వుంటాయో భౌతిక సంఘటనలకు, పదార్థానికి, వస్తువులకు కూడ ఫీలింగ్స్ వుంటాయి. భూమి, భౌతిక వాతావరణంలో గల అన్ని అణువులు, పరమాణువులు అన్నీ కూడ మీకులాగే చైతన్యశక్తి + ఫీలింగ్స్ + ఎమోషన్స్ కలిగివున్నాయి. మీ సంకల్పాల కనుగుణంగా అవి ప్రతిస్పందిస్తాయి. ఈ మెకానిజమ్ మీ సాధారణ తెలివితేటలకు అర్థం కాదు.

మీ అంతర్ వాణి యొక్క స్పందనలను మీరు క్షుణ్ణంగా పసిగట్టగలిగితే భౌతిక వాస్తవం యొక్క శక్తి సామర్థ్యాలను దాని మెకానిజమ్‌ను అర్థం చేసుకోగలుగుతారు.

మీ జీవితంలో ప్రవేశించే భౌతిక సంఘటనలన్నీ కూడ మీ అంతర్ ప్రపంచం నుండి చొచ్చుకు వస్తున్నాయి. బాహ్య ప్రపంచంలో ఏ శక్తీ మిమ్ములను ప్రభావితం చెయ్యదు. మీ చైతన్య పరిణామానికి ఈ విశ్వంలో ఏ శక్తీ అడ్డు తగలదు. భూమి + భౌతిక వాతావరణం + జీవజాతులన్నింటిలో ఇమిడివున్న చైతన్యశక్తి అంతా కూడ మీ చైతన్య పరిణామానికి దోహద పడుతుంది. ఈ ప్రకృతిలో ఎప్పటికీ మీ ఉనికిని, వ్యక్తిత్వాన్ని కోల్పోవడం జరగదు. మీరు మీరుగానే వుంటారు. ప్రతిక్షణమూ మీ వాస్తవాన్ని మీరే సృష్టించుకుంటున్నారు. ఇంతకుమించి రహస్యమేమీ లేదు.

* * *

బాహ్య ప్రపంచం, అంతర్ ప్రపంచం రెండూ ఒకటే. అంతర్ ప్రపంచంలో శక్తి వుంటే బాహ్య ప్రపంచంలో పదార్థంతో ముడిపడివున్న భౌతిక సంఘటనలు వుంటాయి. శక్తి యొక్క మరో రూపాంతరమే పదార్థం. అంతర్ ప్రపంచంలోను, బాహ్య ప్రపంచంలోను చైతన్యశక్తి వుంటుంది. త్రి డైమన్షనల్ తలంలో వున్న పదార్థం గురించి ఇక్కడ చర్చించడం జరుగుతూంది. ఒక్కో డైమన్షన్‌లో గల పదార్థం యొక్క స్వభావం ఒక్కొక్క విధంగా వుంటుంది. బాహ్య ప్రపంచంలో మీరు ఏర్పరుచుకున్న భౌతిక నియమాలు (physical laws) అంతర్ ప్రపంచానికి వర్తించవు. అంతర్ ప్రపంచం యొక్క నియమాలు మీ దివ్యదృష్టికి మాత్రమే అర్థం కాగలవు.

మీకు వ్యక్తిత్వం వున్నట్లుగానే ఈ సృష్టిలో అన్నింటికీ వ్యక్తిత్వం వుంటుంది. ఎలక్ట్రాను (electron) తన వ్యక్తిత్వాన్ని తాను కాపాడుకుంటూ వుంటుంది. పరమాణువులు, అణువులు, రాళ్ళు, చెట్లు, అన్ని జీవరాశులూ తమ వ్యక్తిత్వాలను కాపాడుకుంటుంటాయి. ప్రతి ఆత్మశకలం యొక్క చైతన్య పరిణామమూ విశిష్టమైనదే. మీరు ఈ విశ్వంలో ప్రత్యక్షంగా భౌతిక ప్రపంచంలో ఎంత విశిష్టమైన స్థానం కలిగి వున్నారో, అంతే విశిష్ట స్థానాన్ని ప్రతి ఎలక్ట్రాను, ప్రతి పరమాణువు, ప్రతి అణువు, ప్రతి జంతువు కలిగి వున్నాయి. **విశ్వచైతన్య పరిణామానికి మీరెంత ముఖ్యమో, ప్రతి ప్రాణీ అంతే ముఖ్యం.** 'మీ వాస్తవాన్ని మీరే సృష్టించుకుంటున్నారు' అనే వాక్యాన్ని కొన్ని వందలసార్లు నేను పునరావృతం చెయ్యడం జరుగుతూంది. దానివల్ల ఈ వాక్యం మీ సబ్‌కాన్షియస్ మైండ్‌లో చాలా లోతుగా పాతుకుపోతుంది. 'మీ వాస్తవాన్ని మీరే సృష్టించుకుంటున్నారు.' అనే సత్యం మీకు చక్కగా అర్థం అయితే జీవితశాస్త్రం గురించి మీకు బాగా తెలిసినట్లే.

దరిద్రం, దుఃఖం, అనారోగ్యం, అశాంతి లాంటివైపు మీ ఆలోచనలను కేంద్రీకరింపజేసే బదులు, ఐశ్వర్యం, ఆనందం, ఆరోగ్యం, ప్రశాంతతల వైపు కేంద్రీకరించండి. జీవితంలో అంతా మంచే జరుగుతుందనే భావన మరి అఖండ మనోశక్తి (Infinite Intelligence) పట్ల విశ్వాసాన్ని ఎల్లవేళలా మీరు కలిగివున్నట్లయితే మీ అంతర్ ప్రపంచం మిమ్మల్ని పురోగతివైపు నడిపిస్తుంది. ఇందుకోసం మీరేమీ అత్యద్భుతమైన ఊహాశక్తిని కలిగివుండాల్సిన అవసరం లేదు. లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధిస్తామన్న నమ్మకం కలిగివుండండి. అంతే చాలు. మిగతా పనిని మీ అంతర్ ప్రపంచం నెరవేరుస్తుంది. లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాఫల్యం చేసుకోవడానికి మీకు అపారమైన తెలివితేటలు అవసరం లేదు. అంతర్ ప్రపంచం పైన నమ్మకం వుంటే చాలు. అదే మీకు అఖండ మనోశక్తిని కలుగజేస్తుంది. అఖండ మనోశక్తితో అసాధ్యమంటూ ఏదీ వుండదు. ఈ విశ్వంలోని జీవరాశుల చైతన్య పరిణామం కేవలం తెలివితేటలతో (intelligence) విస్తరింపబడడం లేదు. మీ మానవజాతి పొందిన అత్యద్భుతమైన విజయాలు కూడ అంతర్ శక్తితో, అఖండ మనోశక్తితో సాధింపబడినవేకాని ఇంటెలిజన్స్ ద్వారా మాత్రం కావు. ఇంటెలిజన్స్ అనేది కాన్షియస్ మైండ్‌లో ఒక భాగం. అఖండ మనోశక్తిని మహాసముద్రంతో పోల్చితే, ఇంటెలిజన్స్‌ని సముద్రపు అలగా పోల్చవచ్చు.

ఒక లక్ష్యాన్ని ఎంచుకుని అది నెరవేరుతుందని ప్రగాఢంగా నమ్మి అంతర్ ప్రపంచానికి చెందిన అఖండ మనోశక్తికి అప్పజెప్పండి. అంతర్ ప్రపంచమే భౌతిక వాస్తవాన్ని సృష్టించి ఆ లక్ష్యం సాధింపబడేటట్లు చేస్తుంది. బాహ్య ప్రపంచంలో మీకు కన్పించే ఏ భౌతిక వస్తువైనా, ఏ భౌతిక సంఘటనైనా, ఏ భౌతిక పరిస్థితి అయినా మీ అంతర్ ప్రపంచం నుండి పుట్టుకొస్తున్నవే. అంతర్ శక్తి యొక్క బాహ్య రూపాంతరమే ఈ భౌతిక సంఘటన. సమస్య గురించి బాధపడుతూ క్రుంగి పోయే బదులు సమస్యకు పరిష్కారం లభించినట్లు మీ మనోశక్తితో కలలు కనండి. ఆ కలలే అంతర్‌శక్తిని బాహ్య ప్రపంచపు భౌతిక సంఘటనగా రూపాంతరం చెందిస్తుంది. అనారోగ్యం గురించి, వ్యాధుల గురించి భయపడడం మానేసి ఆరోగ్యం గురించి, వ్యాధులు నయం అయినట్లు దాని పర్యవసానంగా ఆనందిస్తున్నట్లు, చలాకీగా వున్నట్లు మీ మనోశక్తితో ఊహించుకుని కలలు కనండి. మీ అంతర్ ప్రపంచం అందుకు స్పందించి చక్కటి ఆరోగ్యాన్ని మీకు కలుగజేస్తుంది. తెలివితేటలు (intelligence), జ్ఞాపక శక్తి లేవని మీరు బాధపడుతూ కూర్చోకండి. అపారమైన తెలివితేటలు, జ్ఞాపకశక్తి వున్నట్లు ఊహించుకొని కలలు కనండి.

అఖండ మనోశక్తి నుండి మీకు అందజేయబడతాయి. ఫ్రెండ్స్ లేరని, సరియైన కుటుంబ వాతావరణం లేదని దిగులు పడకండి. మంచి ఫ్రెండ్స్ వున్నట్లు, చక్కటి కుటుంబ వాతావరణం వున్నట్లు మీ ఊహాశక్తితో కలలు కనండి. మీ అంతర్ ప్రపంచమే దానికనుగుణంగా బాహ్య ప్రపంచంలో భౌతిక సంఘటనలను సృష్టిస్తుంది.

మీరు స్త్రీ అయి వుండి మీ భర్త తాగుబోతు, వ్యసనపరుడై వుంటే అతనిలో మార్పు వచ్చినట్లు, చక్కటి కుటుంబ వాతావరణం వున్నట్లు ఊహాశక్తితో కలలు గనండి. మీ అంతర్ ప్రపంచం మీ ఊహలకనుగుణంగా భౌతిక పరిస్థితులను సృష్టిస్తుంది. మీ ఆలోచనా తరంగాలు విద్యుదయస్కాంత శక్తిని కలిగి వుంటాయి. విద్యుదయస్కాంత శక్తి మీ భర్త మైండ్‌ను ప్రభావితం జెయ్యగలదు. ఒక భౌతిక వాస్తవం మరొక భౌతిక వాస్తవాన్ని ప్రభావితం చెయ్యగలదు. అలాగే నిత్య జీవితంలో ఏది కావాలంటే దాన్ని సృష్టించుకోగల సామర్థ్యాన్ని కలిగి వున్నారు. ఈ విశ్వంలో ఏ శక్తీ మిమ్మల్ని ప్రభావితం చేసి నడిపించడం లేదు. మీ అంతర్ శక్తే మీకు అన్నీ సమకూరుస్తుంది. మీరు ఎన్ని భౌతిక సంఘటనల్ని అయినా సృష్టించుకోగల స్వేచ్ఛను కలిగి వున్నారు.

భౌతిక పదార్థంతో (physical matter) ముడిపడివున్న భౌతిక సంఘటనలు మీ సంకల్పశక్తి (power of intent) ద్వారా సృష్టింపబడుతున్నాయి. **మీ సంకల్ప శక్తి 'కారణం' (cause) అయితే, బాహ్య సృష్టి కార్యం అవుతుంది. కారణం లేకుండా ఏ కార్యమూ ఈ విశ్వంలో వుండదు.** మీ సంకల్పశక్తి క్రియారూపమే (action) బాహ్య ప్రపంచంలో 'కార్యం'. బాహ్య భౌతిక ప్రపంచం అనేది అంతర్ ప్రపంచం నుండి ప్రతి క్షణమూ ఉద్భవిస్తుంటుంది. బాహ్య ప్రపంచంలో భౌతిక సంఘటన ఎంత కాలం మనుగడ సాగిస్తుందనే విషయం అంతర్ ప్రపంచం నుండి సరఫరా చెయ్యబడిన శక్తి ఎంత బలంగా, ఎంత తీవ్రంగా వుందనే వాటి మీద ఆధారపడి వుంటుంది. అంతర్ ప్రపంచం నుండి తక్కువ శక్తి తీవ్రతతో సృష్టింపబడిన బాహ్య సంఘటన ఎక్కువ జీవితకాలం కలిగి వుండదు.

* * *

1. శక్తి, సంకల్పశక్తి, భౌతిక సంఘటన – ఈ మూడు అంతర్ ప్రపంచానికి సంబంధించినవి. ఇవి వేర్వేరు కావు. అంతర్ ప్రపంచంనుండి వెలువడే బాహ్యరూపాంతర శక్తియే ఈ భౌతిక సంఘటన.

2. బాహ్య భౌతిక ప్రపంచంలో భౌతిక సంఘటనలు, భౌతిక వస్తువులు, మనోశక్తి నుండి ఉద్భవిస్తున్నాయి. ఈ మనోశక్తి ఆత్మశక్తి నుంచే పుట్టింది.
3. ప్రకృతి నిరంతరమూ చైతన్య పరిణామం చెందుతూ మార్పు చెందుతూంటుంది. ఏదీ శాశ్వతంగా నిలిచిపోదు. భౌతిక సంఘటనల మనుగడ అవి పొందిన శక్తి తీవ్రతలను బట్టి ఆధారపడుతుంది.
4. భౌతిక సంఘటనలు, భౌతిక పరిస్థితులు, భౌతిక వస్తువులు త్రి డైమన్షనల్‌గా వుండే భూ భౌతిక పదార్థంతో ముడిపడి వున్నాయి. మనోశక్తిని ఒకానొక ఫ్రీక్వెన్సీని భూమి స్థాయికి మలచినపుడే ఈ భౌతిక సంఘటనలు సృష్టింపబడుతున్నాయి.
5. భౌతిక ప్రపంచంలో వాస్తవ రూపం పొందే భౌతిక సంఘటనల సృష్టి అంతా కూడ అంతర్ ప్రపంచంలోని మల్టిడైమన్షనల్ మూలచైతన్యం నుండి పుడుతున్నది. బాహ్య ప్రపంచంలో అవి త్రీ డైమన్షనల్ తలంలో మీ జీవితానుభవాలుగా ప్రవేశిస్తున్నాయి.
6. భౌతిక సంఘటనల సృష్టికి బాహ్య ప్రపంచంలో ఏ శక్తీ అడ్డురాదు. ఏ అడ్డంకులూ సృష్టింపబడవు.
7. అడ్డంకులన్నీ మీ లోపలే, మీ మనోశక్తిలో ఏర్పడుతున్నాయి.. మీ పరిమిత ఇంటెలిజన్స్, విశ్లేషణ, రీజనింగ్ మైండ్ మరి అంతర్ శక్తి పట్ల అపనమ్మకంవల్ల మీ అంతర్ ప్రపంచంలో అడ్డంకులు సృష్టించుకుంటున్నారు.
8. బాహ్య ప్రపంచమంతా మీ వినియోగానికి అందుబాటులో అన్ని వేళలా సిద్ధంగా వుంది. అంతర్ ప్రపంచంలో నుంచి భౌతిక సంఘటనలు మీ సంకల్పాల ద్వారా సృష్టింపబడి వాస్తవం పొందడానికి బాహ్య ప్రపంచం ఎల్లప్పుడూ సిద్ధపరచబడివుంది.
9. మీ అంతర్ ప్రపంచం కారణం + సృష్టికర్త అయితే, బాహ్య ప్రపంచంలో కార్యం + సృష్టి వుంటుంది.
10. మీ అంతర్ ప్రపంచం మల్టి డైమన్షనల్ మూలచైతన్యం అయితే బాహ్యప్రపంచం త్రీ డైమన్షనల్ చైతన్యశక్తిగా భౌతిక సంఘటనల రూపంలో పరిణామం చెందుతూంది.

'నేను నిస్సహాయుణ్ణి. నేను అశక్తుణ్ణి' లాంటి ఫీలింగ్స్ కలిగినపుడు నిరాశ నిస్పృహలు మిమ్మల్ని ఆవహిస్తాయి. డిప్రెషన్ (depression) అనేది ఆ ఫీలింగ్స్ వల్లనే

కలుగుతుంది. జీవితశాస్త్రము, ఆధ్యాత్మిక శాస్త్రము, జ్ఞానం గురించి తెలిసే కొలదీ సూర్యుని క్రమ్మిన మేఘాలలాగ ఆ భావనలు క్రమక్రమంగా తొలగిపోతాయి. జ్ఞానం పెరిగే కొలది అస్పష్టత, అయోమయం తొలిగిపోయి భూమి మీద ఆనందంగా, స్వేచ్ఛగా జీవిస్తూ చైతన్య పరిణామం చెందడం నేర్చుకుంటారు. **'When ye know the truth, It shall set you free' అన్న సత్యాన్ని మత గ్రంధాలలో మీరిదివరకే చదివి వుంటారు.'మీకు సత్యం తెలిసినట్లయితే, అది మిమ్మల్ని విముక్తుల్ని చేస్తుంది'. అని దాని అర్థం. ఇక్కడ సత్యమంటే – 'మీ వాస్తవాన్ని మీరే సృష్టించుకుంటున్నారు. మీ అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోనికి సృష్టి జరుగుతూంది.' అని మీరు అర్థం చేసుకోవాలి. ఈ విషయం మీకు క్షుణ్ణంగా అర్థం అయితే ఇక మీరు విముక్తులయినట్లే.**

మీ జీవితంలో ప్రవేశించే ప్రతి భౌతిక సంఘటన కూడ తన వెంట ఎన్నో సవాళ్ళను, జ్ఞానాన్ని మోసుకొస్తుంది. ఆ భౌతిక సంఘటనలు పదార్థం + శక్తి + ఆత్మశక్తి+ చైతన్య పరిణామం గురించిన జ్ఞాన సందేశాన్ని మీకు అందిస్తాయి. మీ సైన్సు, మీ మతాలు, మీ మనస్తత్వ శాస్త్రము ఏ మాత్రము మీకు ఆత్మ జ్ఞానాన్ని, జీవితశాస్త్రాన్ని తెలియజెయ్యడం లేదు. అవి మిమ్మల్ని మరింత అయోమయానికి గురి చేస్తున్నాయి. మానవజాతికి వున్న దుఃఖాన్ని, అశాంతిని, దారిద్ర్యాన్ని రూపుమాపడంలో అవి విఫలమయినాయి. పాజిటివ్ థింకింగ్ (positive thinking = ఆశాకర దృక్పథం) గురించి ఎంతో సాహిత్యం మీ భూమి మీద అందించబడుతూంది. పాజిటివ్ థింకింగ్‌కు సంబంధించిన పుస్తకాలు మానవజాతికి మేలు చెయ్యకపోగా కీడు చేస్తున్నాయి. ఆ పుస్తకాలలో ఆత్మజ్ఞానం గురించి అంతర్ శక్తి గురించి, అంతర్ ప్రపంచం గురించి, ఆత్మ చైతన్య పరిణామం గురించి ఎక్కడా ప్రస్తావన వుండదు. మైండ్ పవర్‌ను అభివృద్ధి పరచడం ఎలా? అనే విషయం మీద ఎన్నో పుస్తకాలు వెలువడినాయి. ఆ పుస్తకాలు రాసే రచయితలకు, శాస్త్రవేత్తలకు 'మైండ్' అంటే ఏమిటో తెలియదు. 'ఆత్మశక్తి' అంటే ఏమిటో తెలియదు. కాని మైండ్ పవర్ మీద, పాజిటివ్ థింకింగ్ మీద పుస్తకాలు వెలువడడం హాస్యాస్పదం.

ఆత్మజ్ఞానాన్ని గురించి సూటిగా చెప్పే పుస్తకాలే మానవజాతి చైతన్య పరిణామానికి ఎంతో మేలు చేయగలుగుతాయి. ఆత్మజ్ఞానం, అంతర్‌శక్తి గురించి చర్చించని ఏ పుస్తకమైనా మిమ్మల్ని అయోమయానికి గురిచేస్తుంది. ఆదర్శ వ్యక్తిగా వుండడం ఎలా? అని ఒక పుస్తకం పర్సనాలిటీ డెవలప్‌మెంట్ (personality

development) సబ్జెక్టు మీద వెలువడుతుంది. కొన్ని విశ్లేషణలు (analyses), కొందరి అభిప్రాయాలు అందులో పొందుపరచబడి వుంటాయి. అటువంటి పుస్తకాలు చదవడం వల్ల కంటితుడుపు తప్ప మీకు ఒరిగేదేమీ వుండదు. అంతర్ ప్రయాణం, అంతర్ శక్తి వినియోగం, ఆత్మశక్తి ద్వారా జీవిత సవాళ్ళను సాధించడం, అంతర్ ప్రపంచ పరిశోధన ద్వారా మాత్రమే మానవజాతికి వున్న దుఃఖం తుడిచివేయ బడుతుంది. అంతకు మించి వేరే మార్గాలేమీ లేవు. ఒక్క మానవజాతికి గనుక చైతన్య పరిణామం సవ్యమైన రీతిలో చెందగలిగితే, భూమి + జీవజాతుల చైతన్య పరిణామానికి ఎంతో తోడ్పాటునందించి నట్లవుతుంది.

ఆదర్శ వ్యక్తిగా వుండాలని, మంచి వ్యక్తిగా వుండాలని మీరు ప్రయత్నించాల్సిన పని లేదు. సహజసిద్ధంగా ఈ భూమి మీద సాటిలేని విశిష్టత కలిగి వున్నారు. చైతన్య పరిణామం చెందడానికే మీరు ఈ భూమి మీద జన్మ తీసుకున్నారు. ప్రతి క్షణమూ మీ వాస్తవాన్ని మీరు సృష్టించుకుంటున్నారు. తద్వారా మీ జీవితానుభవాలను, జ్ఞాన పరిధిని విస్తరింపజేసుకుంటున్నారు. దిక్కుతోచని పరిస్థితులను మీ పరిమిత ఇంటెలిజెన్స్ ద్వారా, మీ రీజనింగ్ మైండ్ ద్వారా సృష్టించుకుంటున్నారు. మీ అంతర్ వాణిని వినగలిగినట్లయితే అటువంటి పరిస్థితులు మీకు తారసపడవు.

మీరు నిరాశాకర ఆలోచనలకు లోనయినపుడు ఒక క్షణం ఆగి అంతర్ ప్రయాణం చెయ్యండి. అంతర్ వాణిని వినడానికి ప్రయత్నం చెయ్యండి. ఆ ఆలోచనల యొక్క మూలకారణం, దాని పరిష్కారం మీ అంతర్‌శక్తి నుంచే లభిస్తాయి. మీ ఆలోచనల్ని, ఫీలింగ్స్‌ను, భావనల్ని జాగ్రత్తగా గమనిస్తూ వుండండి. ప్రతి దానికీ కారణం అంతర్ ప్రపంచంలో వుంటుంది. ప్రతి సమస్యకు పరిష్కారం అంతర్ ప్రపంచం నుండి లభిస్తుంది. ఒక వ్యక్తికి జీవితశాస్త్రం చక్కగా అర్థం కాగలిగితే అతను ఆధ్యాత్మికవేత్తగా, ఆత్మజ్ఞానిగా పిలవబడతాడు. **ఆధ్యాత్మికవేత్త లేదా ఆత్మజ్ఞానిగా పిలవబడే వ్యక్తికి రాగద్వేషాలుండవు; ఇతర మానవజాతి పట్ల అసూయాద్వేషాలు కలిగివుండలేడు; ఇతర జంతుజాతులను హింసాప్రవృత్తితో చూడడంగాని, చంపడం గాని చెయ్యలేడు.**

మీ ఫీలింగ్స్‌ను చాల స్వేచ్ఛగా ప్రకటితం చెయ్యడం నేర్చుకోండి. ఆధ్యాత్మిక జ్ఞానం క్రమక్రమంగా పెరిగే కొలది హింసాత్మక ఆలోచన విధానం తొలగిపోతూ వస్తుంది. **హింసా ప్రవృత్తి ఉన్నంతకాలం ఆనందం ఎప్పటికీ రాదు. హింసా ప్రవృత్తి, హింసతో కూడిన ఆలోచనలు మీ దేహం యొక్క సహజరోగ నిరోధక శక్తిని విచ్ఛిన్నం చేస్తాయి.**

మానవజాతికి సంక్రమిస్తున్న వ్యాధులకు మూలకారణం హింస మాత్రమే. హింస అనేది చైతన్య వికాసాన్ని, మనోశక్తికి గల సృజనాత్మకతను నశింపజేస్తుంది. మనిషి యొక్క ప్రథమ శత్రువు కోపం అని మీకిదివరకు చెప్పబడింది. మీకోపాన్ని చాల సహజమైన ఫీలింగ్‌గా భావించండి. దాన్ని అణచివెయ్యడానికి ప్రయత్నించకండి. **ఆధ్యాత్మిక జ్ఞానం కల్గిన వ్యక్తులకు వచ్చేకోపం చాల నిర్మాణాత్మకంగాను, హింసాప్రవృత్తిగల వ్యక్తులకు వచ్చే కోపం చాల వినాశనానికి దారి తీసేదిగాను వుంటుంది.** జంతువులకు వచ్చే కోపం ఎంత సహజంగా వుంటుందో ఎప్పుడైనా గమనించారా? హింస అనేది ఆత్మ చైతన్య వినాశనకారి. మైండ్‌కు, దేహానికి గల సహజశక్తిని ఈ హింస మరి హింసాత్మక ధోరణి నిర్వీర్యం చేస్తుంది. హింసాత్మక ధోరణి వలన మైండ్‌కు గల అసాధారణమైన శక్తిని అంటే అంతర్ శక్తిని నిర్మాణాత్మకమైన అనుభవాల వైపు వినియోగించలేరు. భౌతిక వాస్తవాన్ని సక్రమంగా అర్థం చేసుకోలేరు.

నిర్మాణాత్మకంగా ప్రదర్శించే కోపాన్ని 'ఉద్రేకం'గా లేదా 'తెగింపు స్థితి'గా భావించవచ్చు. జన్మ తీసుకోవడం ఒక ఉద్రేకమైన చర్య; మైండ్ + దేహం ఉద్రేకానికి నిర్మాణాత్మకంగా స్పందిస్తాయి. ఈ ఉద్రేకం యొక్క షార్ట్ సర్క్యూట్ (short circuit) రూపమే హింస! జీవిత శాస్త్రం యొక్క డైనమిక్స్ తెలియక పోవడం వలన హింసాత్మక ధోరణి అలవడుతుంది. చంపేవాడు, చంపబడేవాడు – ఇద్దరికీ జీవిత శాస్త్రం తెలియదు. ఉద్రేకం – భౌతిక క్రియా శక్తిని, సృష్టిని, లైఫ్‌ని కలుగజేస్తే, హింస – వినాశనాన్ని కలుగజేస్తుంది. గుండె కొట్టుకోవడం, ఊపిరితిత్తులు పనిచెయ్యటం, జీవకణాల ప్రక్రియలు, దేహం ఎంజైములను విడుదల చేసుకోవడం – అన్నీ ఉద్రేకమైన చర్యలే. ఎలక్ట్రాను భ్రమణం కూడా ఉద్రేకమైన చర్యే! సృష్టి చైతన్య పరిణామం కూడా ఉద్రేకమైన చర్యే! ప్రేమ, ఆశావాదం, అంతా మంచే జరుగుందనే నమ్మకం, తన స్థితిని నిజాయితీతో అంగీకరించడం లాంటివికూడా ఉద్రేక చర్యలే. ఇవి జీవక్రియల పరంగా దేహానికి ఎంతో మేలు చేస్తాయి; మైండ్‌కు కూడా ఎంతో మేలు చేస్తాయి.

మీ ఎమోషన్స్, ఫీలింగ్స్‌లను బయటకి ప్రకటితం చేసుకోవడం ద్వారా దేహానికి, మైండ్‌కు ఎంతో మేలు చేకూరుతుంది. ఎమోషన్స్‌ను అణిచివేయడం ద్వారా శారీరక, మానసిక రుగ్మతలను ఆహ్వానించడం జరుగుతుంది; దేహం ఎంజైములను, హార్మోనులను విడుదల చేసే సహజశక్తిని కోల్పోవడం జరుగుతుంది. శారీరక, మానసిక రుగ్మతల వల్ల మీరు ఇతర జీవజాతులకు ఏ మాత్రం వుపయోగపడలేరు. మిమ్మల్ని మీరు హీనంగా

భావించినపుడు ఏ విధంగాను ఇతర జీవజాతులను వాటి జీవ పరిణామాన్ని, చైతన్య వికాసాన్ని గౌరవంగా, విశిష్టంగా చూడలేరు.

జీవజాతుల నుండి వారసత్వంగా సంక్రమించిన చైతన్య పరిణామాన్ని విస్మరించి మీరు ఆధ్యాత్మికతను పొందలేరు. ప్రకృతిని, ప్రకృతిపరంగా మీకున్న జీవపరిణామ ప్రాముఖ్యాన్ని విస్మరించి ఆధ్యాత్మికతను పొందలేరు. దేహం + అంతర్‌శక్తి విశిష్టతను విస్మరించి, భౌతిక ప్రపంచంలో చైతన్య పరిణామానికి దేహం యొక్క ప్రాముఖ్యతను విస్మరించి ప్రకృతిలో జీవరాశులతో చైతన్యశక్తి + జీవశక్తి పరంగా మీకు గల బంధాన్ని విస్మరించి – ఏ విధంగానూ ఆధ్యాత్మికంగా ఎదగలేరు. మీరు ప్రకృతి చైతన్య పరిణామంలో ఒక భాగం. మీరు ఒక జీవాత్మగా భావించి, ఇతర జీవాత్మలను కూడా గౌరవించినపుడే ఆధ్యాత్మిక పురోగతిని పొందగలరు. జంతుజాతులు + ఇతర జీవజాతుల వారసత్వంగా సంక్రమించిన చైతన్య పరిణామం యొక్క తరువాయి ముందడుగే మానవత్వం!

సృష్టికి మరి ఉద్రేకానికి మధ్య చైతన్యశక్తిపరంగా వున్న సంబంధాన్ని అర్థం చేసుకోగల స్థితికి మీ మానవజాతి ఇంకా ఎదగవలసి వుంది. ప్రతి వ్యక్తికీ ఒక రక్షణ వ్యవస్థతో కూడిన శక్తిని అంతర్‌శక్తి కలుగజేస్తుంది. ఏ వ్యక్తికీ తన అంగీకారం లేకుండా మృత్యువు అతన్ని సమీపించదు; ఇతరులు అతనికి హాని తలపెట్టలేరు. తన ఆలోచనలు, భయాలకనుగుణంగా భౌతిక సంఘటనలను ఆకర్షిస్తాడు. మీ అంతర్ శక్తి మీకు రక్షాకవచంగా పనిచేస్తుంది. ఈ ప్రపంచంలో ఏ శక్తీ మీ రక్షాకవచాన్ని చేధించి మీకు హాని తలపెట్టలేదు. మీ కాన్షియస్ మైండ్ ద్వారా ఎప్పటికప్పుడు జీవితానుభవాల తాలూకు సందేశాలు మీ అంతర్ ప్రపంచం నుండి పంపబడుతుంటాయి. మీరు అంతర్వాణిని సక్రమంగా వినియోగించడం ద్వారా ఎన్నో జీవితసత్యాలు, ఆధ్యాత్మికసత్యాలు తెలుసుకోగలుగుతారు.

ఏ ఆధ్యాత్మిక గురువులూ, మతగురువులూ, ఏ ఆధ్యాత్మిక పుస్తకాలూ ఇవ్వలేని జ్ఞానాన్ని మీరు జంతువులనుండి, చిన్నపిల్లల నుండి పొందవచ్చు. ఎంతో సహజంగా వుంటూ ప్రకృతి నుండి ఎన్నో పాఠాలను నేర్చుకోవడాన్ని వాళ్ళు మీకు నేర్పుతారు. అంతర్ శక్తిని భౌతిక వాస్తవం వైపు ఎలా ప్రవహింపజేయవచ్చో వారినుండి మీరు నేర్చుకోవచ్చు. ఎమోషన్స్, ఫీలింగ్స్‌ను ఎంత సహజంగా ప్రకటితం చేసి దేహం + మైండ్ స్వస్థతను పొందుతాయో వాటి నుండి నేర్చుకోండి. ఎమోషన్స్, ఫీలింగ్స్‌ను ప్రకటితం చెయ్యడం మరియు వాటిని అనుభూతి పొందడమే గాకుండా వాటిని మీ

జీవితంలో ఒక భాగంగా ఒక వాస్తవంగా అంగీకరించండి. ఎమోషన్స్, ఫీలింగ్స్‌ను బలవంతంగా ప్రకటితం చేయకండి. నిజాయితీతో వాటిని అంగీకరించినపుడు మీ ఇంటెలిజెన్స్‌ను పదునుపెడతాయి. వాటికి భయపడినపుడు మిమ్మల్ని బానిసలుగా చేసుకుంటాయి. మిమ్మల్ని బందీలుగా చేసి సమస్యలలోనికి నెట్టివేస్తాయి.

మీ నమ్మక వ్యవస్థ కనుగుణంగా మీ ఎమోషన్స్ వుంటాయి. పరిస్థితుల ముందర నేను అశక్తుణ్ణి అని మీరు భావించినపుడు దేహం యొక్క ఆరోగ్యవ్యవస్థ శక్తి హీనమవుతుంది. మైండ్ నుండి వెలువడే ఆశాకర ఆలోచనలను ఆటంకపరుస్తాయి. ఎమోషన్స్, ఫీలింగ్స్ మళ్ళీ క్రొత్త ఎమోషన్స్‌ను, ఫీలింగ్స్‌ను కలుగజేస్తాయి. మీ భౌతిక వాస్తవాన్ని ప్రభావితం చెయ్యడంలో ఇవి కీలక పాత్ర వహిస్తాయి. కాన్షియస్ మైండ్‌ను ప్రభావితం చేసి అంతర్ శక్తిని బాహ్య ప్రపంచంలో భౌతిక సంఘటనల సృష్టికి ఇవి ప్రేరణ కలుగ జేస్తాయి. అంతర్‌శక్తి బాహ్య భౌతిక సంఘటనలుగా మలచడంలో ఇవి క్రియాశక్తిని కలుగజేస్తాయి. ఇచ్ఛాశక్తికి, సంకల్పశక్తికి బాహ్య భౌతిక వాస్తవాన్ని కలుగజెయ్యడంలో ఇవి ప్రముఖపాత్ర వహిస్తాయి.

దేహ వ్యవస్థకు అవయవాలు ఎలా వున్నాయో, మనో శక్తికీ నమ్మకవ్యవస్థ అనేది వుంటుంది. మీ జీవితంలో ప్రవేశించే పాజిటివ్ మరి నెగెటివ్ భౌతిక సంఘటనలు మీ కాన్షియస్ మైండ్ యొక్క క్రియాశీల పాత్రను పరీక్షించి బలోపేతం చెయ్యడానికి సంభవిస్తున్నాయి. నిర్ణయాత్మకశక్తిని, సంకల్పశక్తిని పెంచడానికి అవి వుపయోగపడుతున్నాయి. వివేచనతో సంకల్పాలను ఎంచుకోవడం మీరు ఎంతో సాధన చెయ్యవలసి వుంది. ఎమోషన్స్, ఫీలింగ్స్ మీ దేహ స్థితిని, మనోస్థితిని ప్రభావితం చేస్తాయి. నెగెటివ్ ఫీలింగ్స్, ఎమోషన్స్ మీ దేహంలో కొన్ని జీవరసాయనాలను విడుదలచేసి ఆరోగ్య వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తాయి.. అట్లే పాజిటివ్ ఎమోషన్స్, ఫీలింగ్స్ మీ దేహంలో ఇంకో రకమైన జీవరసాయనాలను విడుదుల చేసి దేహ ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేస్తాయి; దేహ వ్యవస్థ, మనోశక్తిని ప్రభావితం చేస్తాయి. దేహ వ్యవస్థ, మనోశక్తి పరస్పరం ప్రభావితం చేసుకుంటాయి. దేహాన్ని ఒట్టి మాంసపిండంగా లేదా పదార్థంగా చూడడానికి వీలు లేదు. ఆత్మశక్తితో నిండిన చైతన్య పదార్థస్వరూపమే ఈ దేహం.

శారీరక, భౌతిక, మానసిక రుగ్మతలు ఒక దానిపై ఇంకొకటి ఆధారపడి వున్నాయి. దేహం + మైండ్‌తో కూడిన వ్యవస్థ దేహానికి సంక్రమించిన ఎటువంటి వ్యాధినైనా నయం చేసుకోగలిగే శక్తి కలిగి వుంటుంది. **క్యాన్సరు (Cancer), ఎయిడ్స్**

(AIDS), లాంటి వ్యాధులను కూడా దేహం తనంత తానుగా నయం చేసుకోగల అపార శక్తిని కలిగివుంది. ఆత్మహత్యా దృక్పథం గల ఆలోచనా వ్యవస్థ వల్లనే అటువంటి వ్యాధులు మీకు సంక్రమిస్తాయి. మీ వ్యక్తిగత ఆలోచనలు, నమ్మకాలు, ఎమోషన్స్, ఫీలింగ్స్ మీ వాస్తవాన్ని సృష్టిస్తున్నాయి. అంతేకాని బాహ్యశక్తులేవీ మిమ్మల్ని ప్రభావితం చెయ్యడం లేదు. మీ అనుమతి లేకుండా మీ అంగీకారం లేకుండా ఏ క్యాన్సరు (Cancer), ఏ ఎయిడ్స్ వ్యాధీ (AIDS) లేదా ఏ భయానకమైన వ్యాధీ మిమ్మల్ని చంపడం జరగనే జరగదు. **అది క్యాన్సరు కావచ్చు లేదా ఎయిడ్స్ కావచ్చు, మీరు కనుక ఆ వ్యాధి నయమవుతుందని బలంగా, తీవ్రంగా విశ్వసిస్తే దేహం కొన్ని అద్భుతమైన జీవరసాయనాలను విడుదలచేసి ఆ వ్యాధిని నిర్మూలింపజేసుకుంటుంది.** ఆ జీవ రసాయనాలు మీ అంతర్‌శక్తి నుంచి విడుదలవుతాయి. ఈ విడుదల చేసుకునే ప్రక్రియ మీ డాక్టర్లకు, మీ శాస్త్రవేత్తలకు ఇంకా అంతుబట్టని విషయంగానే మిగిలిపోయింది. ఆత్మశక్తి + దేహం + చైతన్యశక్తి పట్ల అవగాహన గలవాళ్ళు మాత్రమే దేహానికి చికిత్స చెయ్యడానికి అర్హులు. మీరు చెప్పుకొనే డాక్టర్లంతా దేహ చైతన్య వ్యవస్థకు ఎంతో కీడు చేస్తున్నారు. వాళ్ళను వర్జించండి.

జీవించాలని ఆసక్తి కోల్పోయినపుడు, తనను తాను అసహ్యించుకున్నపుడు, దేహరక్షణ వ్యవస్థ పట్ల అపనమ్మకం కలిగినపుడు, జీవితం పట్ల విరక్తి కలిగినపుడు – వ్యాధులు సంక్రమిస్తాయి. ఎయిడ్స్ అనే వ్యాధి మొదటగా స్వలింగ లైంగిక సంపర్కం చేసుకునే వాళ్ళకు సంక్రమించింది. తర్వాత ఇతరులకు అంటువ్యాధిలా వ్యాపించడం జరుగుతూంది. స్వలింగ లైంగిక సంపర్కం అనేది ఒక అపరాధంగా భావిస్తూ అందులో పాల్గొనడం వల్లనూ, ఇతర జనాభా తమను అసహ్యంతో ట్రీట్ చేస్తున్నారని భావించడంవల్లనూ, జీవితాసక్తి కోల్పోవడం వల్లనూ – దేహ ఆరోగ్య రక్షణ వ్యవస్థను దెబ్బతీయడం ద్వారా ఎయిడ్స్ (AIDS) అనే వ్యాధి ఒక సామాజిక రుగ్మతగా మీ మానవజాతిలో ప్రవేశించింది. మీ మానవజాతిలో చాలా మంది జీవితాసక్తి కోల్పోయి తమను తాము అసహ్యించుకోవడం చేస్తున్నారు. తమను సహజ సిద్ధమైన జీవజాతిగా గౌరవించుకోలేకపోతున్నారు.

ఎయిడ్స్ అనేది ఒక సామాజిక దృగ్విషయం (a social phenomenon). జీవ ప్రక్రియల తిరుగుబాటు వల్ల రోగ నిరోధక వ్యవస్థ క్షీణించడం వల్ల ఎయిడ్స్ మానవజాతిని వెంబడిస్తూంది. ఎయిడ్స్ ఈ క్రింది కొన్ని కారణాల వల్ల సంక్రమిస్తుంది.

1. మానవజాతిలో ఒక ప్రాంతం, ఒక మతం లేదా ఒక రంగు గల జనాభాను అసహ్యించుకోవడం, వాళ్ళ పట్ల తీవ్ర అసంతృప్తి కలిగి వుండటం.
2. జీవితంలో ఇక అభివృద్ధి వుండదని భావించడం, జీవితాసక్తి కోల్పోయి నిరాశా నిస్పృహలకు లోనుకావడం.
3. జీవితాన్ని ఒక సాహసంగా, సవాలుగా, తీసుకోకపోవడం. జీవితంలో ఎదురయ్యే భౌతిక సమస్యలను సవాళ్ళుగా తీసుకోకపోవడం మరి వాటికి భయపడిపోవడం.
4. జీవజాతుల పట్ల ప్రేమ, అనురక్తి కొరవడడం మరి తన జీవితం పట్ల, ఇతర జీవితాల పట్ల చిన్న చూపు వుండటం.
5. కోపం, ద్వేషం, అసహ్యం, పగ, ప్రతీకారధోరణి, ఆత్మహత్యాధోరణి మరి జీవజాతుల పట్ల హింసాత్మక ధోరణిలాంటి వినాశకర భావనలు కలిగివుండటం.

ఎయిడ్స్ (AIDS) ఒక్కటే కాదు మిగతా అన్ని వ్యాధులు కూడ ఆ విధంగా సంక్రమిస్తున్నాయి. ఎయిడ్స్‌ను ఒక పెద్ద సామాజిక సమస్యగా మీరు పరిగణించడం వల్ల ఇక్కడ నేను ప్రస్తావించడం జరిగింది. మొదటగా హోమో సెక్సువల్స్ (స్వలింగ లైంగిక సంపర్క జాతి) ఆ వ్యాధిని భూమ్మీద సృష్టించారు. మిగతా మానవజాతి వాళ్ళను మరీ చులకనగా, అసహ్యంతో ట్రీట్ చెయ్యడం వల్ల హోమో సెక్సువల్స్‌కు ఆత్మహత్యాధోరణి ప్రబలి దేహ ఆరోగ్య వ్యవస్థ విచ్ఛిన్నం అవడం ద్వారా ఎయిడ్స్ జనించింది. 'మీరు మరీ అసహ్యంగా చులకనగా ట్రీట్ చేసే బదులు మమ్మల్ని చంపండి. ఎంతో సంతోషిస్తాం! లాంటి ఆలోచనా విధానం, నమ్మక వ్యవస్థను వాళ్ళు ఏర్పరచుకుని ఆ వ్యాధిని సృష్టించుకున్నారు. పైన ఉదహరించిన కొన్ని కారణాలే కాకుండా ఇతరమైనవి కూడా వ్యాధికారకాలుగా వున్నాయి. కాని మానవజాతికి సంక్రమిస్తున్న వ్యాధులకు ప్రధానకారణాలవే.

కలరా, ప్లేగు, విషజ్వరాలు లాంటి ఎపిడెమిక్ వ్యాధులు (epidemic diseases) ఒక ప్రాంతంలో సడెన్‌గా చెలరేగి ఎక్కువ జనాభాను చంపివెయ్యడం జరుగుతుంటుంది. ఒక ప్రాంతంలో నివసిస్తున్న జనాభాలో ఎక్కువ శాతం మంది – మత వైషమ్యాలు, జాతి వైషమ్యాలు, ఆత్మహత్యా ధోరణి, జీవితం పట్ల విరక్తి, జీవితార్థం కోల్పోవడంలాంటివి కలిగి వుండటం వలన వాళ్ళ అంతర్ ప్రపంచంలో వున్న మనోశక్తి రూపాంతరం చెంది బాహ్య ప్రపంచంలో ఎపిడెమిక్ వ్యాధులుగా (భౌతిక సంఘటన) రూపాంతరం చెంది ఎక్కువ జనాభాను హరించివెయ్యడం జరుగుతుంటుంది. ప్రకృతి ప్రళయాలైన

భూకంపాలు, సునామి, తుఫానులాంటివి కూడా అలాగే సంభవిస్తున్నాయి. భయాలు, వినాశకరధోరణి వల్లనే మీరు వాటికి బలవుతున్నారు.

సాముహికంగా మీ మానవజాతి యొక్క అంతర్ ప్రపంచాలలోని సంకల్పాలు, భయాలు బాహ్య ప్రపంచంలో భౌతిక సంఘటనలుగా అవతరిస్తున్నాయి. అవి వినాశకరరీతిలోను, నిర్మాణాత్మకరీతిలోను – మీరు ఎలా ఆహ్వానిస్తే అలా – మీ జీవితంలో ఎదురవుతాయి. ఒక వ్యక్తి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడడం కూడా అతను జీవితం పట్ల నిస్పృహను కలిగి వుండటం వల్లనే. జీవితాన్ని ఒక సాహసంగా, అర్థవంతంగా అతను భావించినట్లయితే ఆ వ్యాధిని నయం చేసుకోవడానికి తన దేహం వెంటనే స్పందించి రంగంలోకి దిగుతుంది. ఆ వ్యాధిని అతి స్వల్ప కాలంలోనే నయం చేసుకుంటుంది.

వైరస్‌లు, బాక్టీరియాల ద్వారా సంక్రమించే అంటువ్యాధులను కూడా మీ ఎమోషన్స్, నమ్మకాల ద్వారా ఆహ్వానించినపుడే అవి మీకు సంక్రమిస్తున్నాయి. వ్యాధులు నయమవుతాయని మీరు ప్రగాఢంగా నమ్మితే తప్ప ఏ వైద్య విధానాలు, ఏ మందులూ మీకు వుపయోగపడవు. దురదృష్టవశాత్తు మీ వైద్య విధానాలు, చికిత్సా విధానాలు, రోగిని ట్రీట్‌చేసే విధానాలు చాలా లోపభూయిష్టంగా అసమగ్రంగా వున్నాయి. రోగిని మానవ చైతన్యశక్తిగా గుర్తించి చికిత్స చెయ్యడం లేదు. మీ వైద్యశాస్త్రం సరియైన దశలో అభివృద్ధి చెందడం లేదు.

జీవితాన్ని ఒక గొప్ప అవకాశంగా, ఒక సాహసంగా భావించండి. జీవితాన్ని అర్థవంతంగా, ప్రయోజనాత్మకంగా స్వీకరించండి. ఎటువంటి నిరాశా నిస్పృహలకు లోనుకాకండి. ఆత్మశక్తితో కూడిన దేహాన్ని ధరించిన మీకు అసాధ్యమంటూ ఏదీ లేదు. మీ అంతర్‌శక్తి, మీ అంతర్ ప్రపంచం అనంతమైనవి.

ఇపుడున్న వైద్య విధానంలో మీ డాక్టర్లు, శాస్త్రవేత్తలు మానవదేహ ఆరోగ్య రక్షణ వ్యవస్థతో దాగుడుమూతలాడుతున్నారు. ఆరోగ్యం పైన నమ్మకం వున్నపుడు ఆరోగ్యం సంప్రాప్తిస్తుంది. అనారోగ్యం పైన నమ్మకం వున్నపుడు అనారోగ్యం సంప్రాప్తిస్తుంది. 'నేను త్వరగా అలసిపోతున్నాను' అనే మాటను పదేపదే మీ మనస్సులో అనుకొంటున్నపుడు మీ దేహం అందుకు తక్షణమే స్పందించి అలసటను తెచ్చుకుంటుంది. 'నేను ఆరోగ్యంగా వుంటున్నాను' అనే మాటను మీరు అనేక సార్లు మీ మనస్సులో స్మరించడం లేదా భావించడం జరిగితే మీ దేహం ఆరోగ్యంగా వుండడానికి స్పందిస్తుంది. మీ అంతర్ ప్రపంచం మీ దేహాన్ని సమతౌల్యంలో వుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోగల రక్షణ వ్యవస్థను

ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకుంటుంది. మీరు అనారోగ్యం గురించి ఆలోచిస్తున్నపుడో, ఆరోగ్యం పట్ల భయాలు, సందేహాలు కలిగి వున్నపుడో, ఆత్మహత్యా సదృశమైన ఆలోచనా ధోరణి కలిగి వున్నపుడో దేహం తన సహజశక్తిని కోల్పోవడం జరుగుతుంటుంది.

మీ డాక్టర్లు ఆరోగ్యంపట్ల, దేహానికి గల మహిమాన్విత శక్తి పట్ల ఇంకా ఎంతో ఎంతో అధ్యయనం చేయవలసివుంది. మనిషిని వ్యాధులను సృష్టించే జీవిగా కాక చైతన్యశక్తిగా గుర్తించడం వాళ్ళు అలవర్చుకోవాలి. మృత జీవకణాల మీద, జంతు కళేబరాల మీద తక్షణమే పరిశోధనలు మానేసి దేహం . ఆత్మశక్తి . చైతన్యశక్తి వ్యవస్థ మీద పరిశోధనలు చేపట్టవలసిన అవసరముంది. దేహానికి హీలింగ్ చేసి అనారోగ్యాన్ని తొలగిస్తున్నామని కొందరు ఆధ్యాత్మిక వేత్తలుగా చెప్పుకునే వాళ్ళు కూడ దేహాన్ని చైతన్యశక్తితో కూడిన ఆత్మశక్తిగా గుర్తించవలసిన అవసరముంది. దేహానికి ఎటువంటి హీలింగూ (healing) అవసరం లేదు. వాస్తవానికి మీ అంతర్ ప్రపంచంలోవున్న అపారశక్తి దేహాన్ని హీలింగ్ చెయ్యగలుగుతుంది. బాహ్యంగా ఏ శక్తి యొక్క సహాయమూ దేహానికి అవసరం లేదు. హీలింగ్ శక్తిని దేహం తనలోనే కలిగివుంది. ఆధ్యాత్మికవాదులు హీలింగ్ చెయ్యడమనేది మీ దేహంలోని చైతన్యశక్తిని ఉత్తేజపరచడానికే!

పరమాణువులు, అణువులతో నిర్మింపబడిన మీ దేహం చైతన్యశక్తితో ఆవరించబడి వుంది. పరమాణువులు, అణువులు నిరంతరమూ ఉత్తేజంగా వుంటున్నాయి. పరమాణువులు, అణువుల సముదాయమే మాంసపు ముద్దగా చైతన్యశక్తితో ఆవరించబడి దేహంగా రూపుదిద్దుకున్నాయి. ఈ దేహం ఆత్మశక్తితో నింపబడివుంది. ఆత్మశక్తికి అపారమైన శక్తి వున్నపుడు బాహ్యంగా ఇచ్చే హీలింగ్, మరియు మందులు అన్నీ ప్రోత్సాహం కోసం ఇవ్వబడుతున్నవే.

బాహ్య ప్రపంచంలో ధ్వని, కాంతి ఎలా వున్నాయో, అంతర్ ప్రపంచంలో కూడ ధ్వని, కాంతి వున్నాయి. మీ సంకల్పాలు, ఊహలు, కలలు, కోరికలు, భయాలు, సందేహాలు– కాన్షియస్ మైండ్ ద్వారా అంతర్ ప్రపంచంలోని శక్తిని ప్రభావితం చేస్తాయి. బాహ్య ప్రపంచంలో భౌతిక సృష్టిని కలుగజెయ్యడానికి అంతర్ ప్రపంచంలోని ఈ ధ్వని, కాంతి, విద్యుదయస్కాంత తరంగాలు యాక్టివేట్ (activate) అయి భౌతిక వాస్తవం పొందేందుకు ఉద్యుక్తమయి వాస్తవరూపం పొందుతాయి. భౌతిక పదార్థంగా, భౌతిక సంఘటనలుగా వాస్తవం పొందే ముందర అంతర్ ప్రపంచంలో వాటి ఛాయలు (images) ఏర్పడి తర్వాత భౌతిక ప్రపంచంలో సృష్టింపబడడం జరుగుతుంటుంది.

మీ శాస్త్రవేత్తలకుగాని, మీ సైన్సుకుగాని అందని కాంతి తరంగాలు ఈ విశ్వమంతా వ్యాపించి వున్నాయి. మీ శాస్త్రవేత్తలకు ఒక వర్ణపటం (solar spectrum) గురించి మాత్రమే తెలుసు, ఈ విశ్వకాంతి కిరణాలలో లెక్కలేనన్ని వర్ణపటాలు (spectra) వున్నాయి. మీ కళ్ళకు భౌతిక పదార్థంతో కూడిన దేహం మాత్రమే కనబడుతూంది. కాని మీ కళ్ళకు కన్పించని దేహాలు మీ భౌతిక దేహంలో ఇమిడి వున్నాయి. ఆ దేహాలను మీ అంతరేంద్రియాలతో మాత్రమే పసిగట్టగలుగుతారు. మీ అంతర్ ప్రపంచంలోని శబ్దాలు, కాంతిని మీ అంతరేంద్రియాలతో పసిగట్టవచ్చు. త్రీ డైమన్షనల్ తలంలో భౌతిక సంఘటనలను సృష్టించడంలో అంతర్ ప్రపంచపు శబ్దాలు (ధ్వనులు), కాంతి వుపయోగపడుతున్నాయి. మీ దేహంలోని ప్రతి అణువు తన వాస్తవాన్ని తానే సృష్టించుకుంటూ దేహంతో కూడిన ఆత్మశకలం యొక్క వాస్తవాన్ని సృష్టించడంలో సహకారాన్ని అందిస్తుంటుంది. దేహంలో ప్రతిభాగం తన ఉనికిని కాపాడుకుంటూ దేహ వ్యవస్థ మొత్తం చైతన్యశక్తి పరిణామంలో పాలుపంచుకుంటూ వుంటుంది.

దేహంలో ఏదైనా ఒక భాగంలో నొప్పిగాని, అనారోగ్యం గాని తటస్థించినపుడు సూచనల ద్వారా మీ మనోశక్తిని అక్కడికి డైరెక్టు చెయ్యండి. దేహంలోని చైతన్యశక్తి అక్కడికి ప్రవహించి హీలింగ్ చెయ్యడం ప్రారంభిస్తుంది. ఈ హీలింగ్ ప్రక్రియలో భౌతిక దేహం మాత్రమే గాక మీ అంతర్ ప్రపంచంలో ఇమిడివున్న ఇతర దేహాలు కూడ యాక్టివేట్ అయి నయం చేస్తాయి. మీ ఆలోచనలు, సూచనలు, సంకల్పాలు, భయాలు, సందేహాలు– కాన్షియస్ మైండ్ ద్వారా అంతర్ ప్రపంచానికి చేరి అంతర్ ధ్వని, అంతర్ కాంతిగా మార్పు చెందుతాయి. ఆత్మశక్తి ఈ మార్పును కలుగజేస్తుంది. అంతర్ ప్రపంచంలో కలిగిన ఈ మార్పులు బాహ్య ప్రపంచంలో భౌతిక సంఘటనలుగా ప్రకటితం కావడానికి సిద్ధంగా తయారయి వుంటాయి. సరిపడా శక్తి తీవ్రత, ఫ్రీక్వెన్సీ స్థాయిలు భౌతిక ప్రపంచానికి సమానమయినప్పుడు బాహ్య ప్రపంచంలో మీ కళ్ళ ముందర మీ జీవితానుభవాలుగా మల్చబడతాయి. మీ మనోశక్తితో కలలుగనే ఊహలు, కలలు చాల బలమయినవి. వాటికి స్పష్టమైన మైండ్ పిక్చర్ (mind picture), అంతర్ ధ్వని, అంతర్ కాంతి తోడయినపుడు ఆత్మశక్తి నుండి బాహ్య ప్రపంచంలోనికి మీ సంకల్పాలు, భయాలు... భౌతిక సంఘటనలుగా రూపాంతరం చెందుతుంటాయి.

భౌతిక సంఘటనలను వాస్తవికత చెందించడంలో ఈ క్రింది విషయాలు దోహదపడుతుంటాయి.

1. స్పష్టమైన, నిర్ధిష్టమైన సంకల్పాలు, కోరికలు, భయాలు, సందేహాలు, ఎమోషన్స్, ఫీలింగ్స్, ఊహలు, కలలు మీ కాన్షియస్ మైండ్ ద్వారా మీ అంతర్ ప్రపంచంలోనికి ప్రవేశిస్తాయి.
2. ఏవి కావాలో, ఏవి అవసరం లేదో వివేచన చెయ్యగల శక్తి మీ కాన్షియస్ మైండ్ ద్వారా మాత్రమే జరుగుతుంటుంది. అంతర్ ప్రపంచం మటుకు మీరు అడిగిన వాటన్నింటిని ఇస్తుంటుంది.
3. అంతర్ ప్రయాణం, అంతర్వాణిని వినడం, అనేకానేక జీవితానుభవాలు పొందడం, జ్ఞాన సముపార్జన, చైతన్యశక్తిని ఎక్కువ కూడగట్టుకోవడం ద్వారా మీ కాన్షియస్ మైండ్‌ను విస్తరింప జేసుకుంటూ దానికి గల అసాధారణ శక్తిని వినియోగించుకొనవచ్చు.
4. కాన్షియస్ మైండ్ అనేది కళ్ళకు కన్పించే భౌతిక పదార్థం కాదు. అంతర్ శక్తికి సంబంధించిన చైతన్యశక్తి స్వరూపం. ఇది మెదడు (brain) ద్వారా పనిచేస్తుంది. దేహం వున్నపుడు, లేనపుడు కూడ కాన్షియస్ మైండ్ ఎప్పటికీ వుంటుంది.
5. అంతర్ ప్రపంచానికి స్పష్టమైన, నిర్ధిష్టమైన, బలవత్తరమైన సంకల్పాలు, భయాలు... బాహ్య ప్రపంచంలో భౌతిక వాస్తవం పొందడానికి తయారుగా వుంటాయి. వాటి శక్తి స్థాయినిబట్టి భౌతిక ప్రపంచంలో త్రీ డైమన్షనల్ తలంలో భౌతిక సంఘటనలుగా మలచబడతాయి, మిగతావి వేరే డైమన్షన్స్ గల తలాల్లో వాస్తవరూపం పొందుతాయి.

భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక ప్రగతి సాధించడానికే మీరు ఈ భూమి మీద జన్మతీసుకోవడం జరిగింది. ఈ మూడు ఒక దానికొకటి ముడిపడివున్నాయి. ఒకదాన్ని విస్మరించి ఇంకోదానిలో పురోగతి సాధించలేరు. ఆరోగ్యం + ఆనందం + జ్ఞానం అనేవి భౌతిక అనుభవాలు, మానసిక అనుభవాలు, ఆధ్యాత్మిక అనుభవాలు పెరగడం ద్వారా సంప్రాప్తిస్తాయి. దేహం మహిమాన్వితమైన సజీవ శిల్పం. మీ దేహాన్ని ఆరాధించండి. ప్రేమించండి. **దేహం అనేది లేకుండా భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక పురోగతి అనేది త్రీ డైమన్షనల్ భౌతిక ప్రపంచంలో అసాధ్యం!** పదార్థం + భౌతిక సంఘటనలతో ముడిపడిన ఈ భౌతిక ప్రపంచంలో ఆత్మశక్తిని బాహ్యప్రపంచంలోనికి చొప్పించి భౌతిక సంఘటనలను మీ జీవితం లోనికి ప్రవేశింప జెయ్యడం ద్వారా

చైతన్య పరిణామం, ఆత్మ చైతన్య పురోగతి చెందుతున్నారు. అందుకు దేహం అనేది ఒక వాహనంలాగ పని చేస్తుంది.

భౌతిక ప్రపంచం యొక్క ఉనికిలో భౌతిక వాస్తవాన్ని సృష్టించడానికి మీలో ప్రతి ఒక్కరికీ అసామాన్యమైన శక్తి వుంది. దేహం అంటే మాంసపిండంలో దాగివున్న ఆత్మ. చర్మ చక్షువులకు మాంసపిండంతో కూడిన దేహం కన్పిస్తుంది. అంతరేంద్రియాలకు మీ యొక్క ఇతర దేహాలు కన్పిస్తాయి. అన్ని జీవజాతుల దేహాలు కూడ మాంసపిండంలో దాగివున్న ఆత్మలే. **మీ దేహాన్ని ఆత్మశక్తి యొక్క వాహనంగా భావించగలిగినపుడే ఇతర ప్రాణి కోటిపట్ల ప్రేమ, అనురక్తి కలిగి వుంటారు. దేహంయొక్క మహిమాన్వితశక్తిని గుర్తించని వాళ్ళే ఇతర జీవజాతులను హింసించడమో, చంపడమో చెయ్యగలుగుతారు.**

రక్తమాంసాలలో దాగిన ఆత్మశకలాలే సంఘాలను, నాగరికతలను, భౌతిక వాతావరణాన్ని, సృష్టిస్తున్నాయి. భూభౌతిక చైతన్య పరిణామాన్ని పెంచుతున్నాయి. విశ్వచైతన్య పరిణామాన్ని పెంచడంలో తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి. పరమాణువు, అణువు నుంచి మహాపర్వతం, మనిషి మరి భూమి వరకు రకరకాల దేహాలు ధరించిన అన్ని ఆత్మలు భౌతిక వాస్తవాన్ని సృష్టించగల శక్తిని కలిగివున్నాయి. వాటి అంతర్ ప్రపంచాలలో వున్న శక్తి (అంతర్ శక్తి లేదా ఆత్మశక్తి) బాహ్య భౌతిక ప్రపంచంలో + ఇతర డైమన్షన్స్‌లోని తలాలలో భౌతిక వాస్తవంగా ఆవిష్కరింపబడడం ద్వారా చైతన్య పరిణామం జరుగుతూంది. పరమాణువులు, అణువులతో తయారయిన మీ దేహం ప్రతి క్షణమూ తననుతాను పునర్నిర్మాణం చేసుకుంటుంది. క్షణంలో ఎన్నో పరమాణువులు, అణువులు మృతి చెందుతూ వాటిస్థానంలో క్రొత్త పరమాణువులు, అణువులు పుడుతుంటాయి.

మీరు కలిగివున్న ఈ భౌతిక దేహం ఈ భౌతిక ప్రపంచానికి సంబంధించినది. భూమి మీద ఏయే మూలకాలు వున్నాయో అన్నీ మీ దేహంలో వున్నాయి. భూమి మీద జీవజాతులన్నీ భూభౌతిక మూలకాలు కలిగిన భౌతిక దేహాలను ధరించి వున్నాయి. దేహంలోని జీవకణాలన్నీ ఆరోగ్యంగా వుండాలని మీరు సంకల్పిస్తే, జీవకణాలన్నీ అందుకు బదులుగా మీ దేహం ఆరోగ్యంగా వుండాలని సంకల్పిస్తాయి. మీరు వ్యక్తిత్వం కలిగి వున్నట్లే, మీ దేహంలోని జీవకణాలు కూడ తమతమ వ్యక్తిత్వాలను కలిగి వుంటూ చైతన్యపరిణామం చెందుతున్నాయి.

ఈ భౌతిక ప్రపంచంలో ఏ మనిషీ, ఏ జంతువూ, ఏ జీవరాశి కూడ అనారోగ్యంతో పుట్టడం సంభవించదు. అంగవైకల్యంతో పుట్టేవాళ్ళు, పుట్టుకతోనే

అనారోగ్యం కలిగివున్నవాళ్ళు జన్మతీసుకోక మునుపే ఆత్మశక్తిని కొన్ని ప్రత్యేక లక్ష్యాలతో చైతన్య వికాసం చెందడం కోసం అటువంటి జన్మలు తీసుకోవడం జరుగుతుంది. గత జన్మలలో చేసిన పాపాలకు శిక్షగా ఈ జన్మలో అంగవైకల్యంతో, అనారోగ్యంతో పుట్టడం అంటూ జరగదు. భూమి అనే ప్రయోగశాలలో చైతన్య పరిణామం చెందడం కోసం, జీవచైతన్యశక్తి పరంగా కొన్ని ఆధ్యాత్మిక పాఠాలు నేర్చుకోవడం కోసం జీవితాన్ని ఒక సాహసంగా స్వీకరించి జన్మలను తీసుకోవడం జరుగుతుంది. భూమి మీద ప్రవేశించే ఆత్మలన్నీ తమ ఇష్టానుసారంగానే జన్మలను తీసుకుంటున్నాయి. ఈ విశ్వంలో ఏ శక్తీ ఫలానా జన్మలు తీసుకోవాలని మిమ్మల్ని శాసించడం లేదు.

భూమి మీద ఆత్మ జ్ఞానాన్ని, అంతర్ ప్రపంచాన్ని అధ్యయనం చెయ్యడానికి దేహం అనే వాహనాన్ని ఆత్మ ధరించడం జరుగుతుంది. భూభౌతిక ప్రపంచంలో ఏది కావాలంటే దాన్ని సాధించుకోగల సర్వసమర్థతను మీ ఆత్మశక్తి కలిగి వుంది. మీ దేహం అందుకు కావలసిన అన్ని హంగులనూ తనలో ఇముడ్చుకుని వుంది.

మీరు ఏర్పరుచుకున్న సంకల్పాలు, ఆశయాలు, కోరికలు, భయాలు అన్నీ భౌతిక తలంలో ఎందుకు వాస్తవరూపం పొందలేదని మీరు ప్రశ్నించుకొంటుంటారు. వాటిలో కొన్ని మాత్రమే భౌతిక వాస్తవం పొందుతున్నాయి. మరి కొన్ని భౌతిక వాస్తవం పొందడం లేదు. 'మీ వాస్తవాన్ని మీరే సృష్టించుకుంటున్నారు!' అనే కాన్సెప్ట్ మీకు పూర్తిగా అర్థంకాకపోవడం వల్లనే మీకా ప్రశ్న తలెత్తుతుంది. మీ ఆలోచనలు, సంకల్పాలు, భయాలు తీవ్రమైన బలమైన శక్తి కలిగివున్నపుడు వాటిశక్తి త్రీడైమన్షనల్ భౌతిక ప్రపంచం యొక్క శక్తి స్థాయి, ఫ్రీక్వెన్సీలకు సమానమైనపుడు అవి భౌతిక సంఘటనలుగా సృష్టించబడుతున్నాయి.

భౌతిక ప్రపంచంలో మీకు కావలసిన సహాయం, సమాచారం, మరి జ్ఞానం అంతా కూడ మీ కాన్షియస్ మైండ్ ద్వారా మీ అంతర్ ప్రపంచం నుండి సరఫరా అవుతుంటుంది. మీ పరిమిత జ్ఞానంతో, మీ అపనమ్మకాలతో మీ కాన్షియస్ మైండ్‌ను అటంక పరచనట్లయితే ప్రతిక్షణమూ మీరు మీ అంతర్వాణి నుండి సందేశాలను వినగలుగుతారు. భౌతిక ప్రపంచంలో మీ కాన్షియస్ మైండ్‌ను గనుక శ్రద్ధతో ఉపయోగించుకోగల్గితే మీ జీవిత చైతన్య వికాసానికి సరిపడా జ్ఞానాన్ని మీ అంతర్ ప్రపంచం నుండి పొందవచ్చు. సబ్‌కాన్షియస్ మైండ్ నుండి... అంటే అంతర్ ప్రపంచం నుండి ఎప్పటికప్పుడు భౌతిక ప్రపంచంలో చైతన్య పరిణామానికి కావలసిన సందేశాలు

మీకు అందించబడుతూ వుంటాయి. వాటిని స్వీకరించడానికి మీరు ఎంతో ప్రాక్టీసు చేయవలసివుంది.

మీ ఆరోగ్యం గురించి, అనారోగ్యం గురించి ప్రతిక్షణమూ మీ ఆలోచనలు, సంకల్పాల ద్వారా సూచనలు ఇవ్వడం జరుగుతూంది. వాటికనుగుణంగానే మీ దేహం ప్రతి క్షణమూ తన ఆరోగ్యంలో మార్పులు చేసుకుంటూంది. మీరు ఎరుకలోవున్నపుడు, ఎరుకలో లేనపుడు కూడ మీరు కలిగివున్న నమ్మకాలు, భయాల వల్ల ప్రతిక్షణమూ మీ అంతర్ ప్రపంచానికి సూచనలు అందుతూనే వుంటాయి. మీరు నమ్మకాలు, భావాలు మార్చుకున్న క్షణమే – అనారోగ్యం నుండి ఆరోగ్యానికి, ఊబకాయం నుండి తేలిక శరీరంలోనికి, బద్ధకం నుండి చురుకుదనంలోనికి మార్పులు చేసుకోవడానికి మీ దేహం సర్దుబాట్లు చేసుకుంటుంది.

మీ ఆలోచనలు విద్యుదయస్కాంత శక్తిని కలిగి వుండి భౌతిక వాస్తవం పొందడానికి సిద్ధంగా వుంటాయి. వాటికి ఊహాశక్తి (Imagination)తో సంకల్పశక్తితో ప్రేరణ కల్గించినపుడు భౌతిక ప్రపంచంలో వాస్తవం పొందుతాయి. భౌతిక సృష్టిని అంతర్ శక్తి నుండి బాహ్య ప్రపంచంలోనికి తీసుకురావడంలో ఊహాశక్తి చాల బలవంతమైనది. ఊహాశక్తి అంతర్ ప్రపంచంలో ఇమిడివున్న మెకానిజమ్‌ను యాక్టివేట్ చేయించి భౌతిక తలంలో భౌతిక సంఘటనల సృష్టి జరిగేట్లు చేస్తుంది. చంద్రమండలానికి పంపాల్సిన రాకెట్‌కు ఇంధనం ఏ విధంగా అవసరమో, మీ సంకల్పాలు, కోరికలు, భయాలు అంతర్ ప్రపంచం నుండి భౌతిక ప్రపంచంలో వాస్తవం పొందడానికి ఊహాశక్తి అనే ఇంధనం అవసరం. అగ్నికి ఆజ్యం పోసినట్లుగా ఊహాశక్తికి ఫీలింగ్స్, ఎమోషన్స్, నమ్మకాలు తోడయితే భౌతిక సంఘటనల సృష్టి మరింత వేగవంతం అవుతుంది. ఊహాశక్తి + ఫీలింగ్స్ + ఎమోషన్స్ + నమ్మకం అనే వ్యవస్థ మీ సంకల్పాలను అంతర్ ప్రపంచం నుండి భౌతిక ప్రపంచంలోనికి భౌతిక సంఘటనలుగా సృష్టించడం చేస్తుంది.

వర్తమాన ప్రపంచంలో సంభవిస్తున్న రాజకీయపరిణామాలు, మత పరిణామాలు, సంఘం ద్వారా మీరు పొందుతూన్న జ్ఞానం, కాలేజీలలో మీకు బోధింపబడే విషయాలు – మీకు ఆధ్యాత్మిక విషయాలుగాని, జీవిత శాస్త్రము గురించిగాని, కారణ–కార్య సంబంధం గురించి గాని, జీవజాతుల చైతన్య పరిణామం గురించిగాని అవగాహన కలిగించడం లేదు. దేహానికి గల మహిమాన్విత శక్తిని గురించి మీ వైద్య శాస్త్రము విస్మరించింది. అవి మీకు దుఃఖాన్ని, అశాంతిని, అనారోగ్యాన్ని, హింసను

కలుగజేయడంతోబాటు మానవజాతి + జీవజాతుల చైతన్య పరిణామాన్ని గుర్తించడంలో విఫలమైనాయి.

కాన్షియస్ మైండ్ ద్వారా అంతర్ ప్రపంచం నుండి వర్తమాన జీవితానికి చైతన్య వికాసం కలిగించడం కోసం ఎప్పటికప్పుడు సందేశాలు ఇవ్వబడుతూనే వున్నాయి. కాని మీరిదివరకు ఏర్పరుచుకున్న అభిప్రాయాలు పరిమిత నమ్మకాల వల్ల స్వాభావికమైన మీ ఇంటెలిజన్స్‌ను ఆటంకపరచడం జరుగుతూంది. మీ వ్యక్తిగత సమస్యలు, దుఃఖం అన్నీకూడ దాన్ని ఆటంక పరచడంవల్ల సంభవిస్తున్నాయి. మీ పరిమిత నమ్మకాలు, భయాలు, సందేశాలు మీ అంతర్ ప్రపంచానికి గల ద్వారాలను బిగించేస్తున్నాయి. సైకో అనలిస్ట్‌లూ, సైకాలజిస్టుల మీద ఆధారపడడంవల్ల మీరు మరింత శక్తిహీనులవుతున్నారు. వాళ్ళవల్ల మీకు ఒరిగేదేమీ వుండదు, తాత్కాలిక ఉపశమనం తప్ప.

అనారోగ్యం గురించి, దుఃఖం గురించి, భౌతిక సమస్యల గురించి భయపడడం, బాధపడడం మానేసి మీ ఆలోచనా విధానాన్ని నిర్మాణాత్మకంగా మలుచుకోండి. మీ కాలుకి గాయమైతే, పదే పదే దాన్ని గుర్తుంచుకోవడం బదులు ఆ గాయం నయమైపోయినట్లుగా, మీ కాలు చాల స్వస్థతలో వున్నట్లుగా మీ మనోశక్తిలో ఊహించుకోండి. మీ అంతర్ ప్రపంచం అందుకు సిద్ధమయి నయం చెయ్యడం ప్రారంభిస్తుంది. భౌతిక ప్రపంచంలో మిమ్మల్ని ఒక సమస్య బాధిస్తుంటే ఆ సమస్య పరిష్కారమయినట్లు మీ మనోశక్తిలో ఊహించుకోండి. ఊహాశక్తి + ఫీలింగ్స్ + ఎమోషన్స్ + నమ్మకం అనే సూత్రాన్ని పాటించండి. ఆ సమస్య ఇట్లే పరిష్కారమవుతుంది.

డాక్టర్లు మాత్రమే వ్యాధిని నయం చేస్తారని మీరు నమ్మినట్లయితే వాళ్ళ దగ్గరే ట్రీట్‌మెంట్ తీసుకోండి. కాని ఒక విషయం గుర్తుంచుకోండి. దానివల్ల మీకు ఒరిగేది తాత్కాలికమే తప్ప శాశ్వత పరిష్కారం లభించదు. మీ దేహాన్ని మహిమాన్వితమైనదిగా భావించి ట్రీట్‌మెంట్ ఇవ్వడం వాళ్ళు చెయ్యరు.

ఈ భూమ్మీద కోట్లాది మంది జనాభాకు ఆత్మశక్తి గురించి, చైతన్య పరిణామం గురించి తెలియదు. దేవుడు అనే కాన్సెప్ట్‌ను వాళ్ళ అహం లెవెల్లో ఏర్పరుచుకున్నారు. ఇంటెలెక్టువల్స్ అని భావించే వాళ్ళు కూడ తమను దేవుడు అనేవాడు శాసిస్తున్నాడని, స్వర్గం, నరకం అనేవి వున్నాయని నమ్ముతున్నారు. మృత్యు భయం అందరినీ పీడిస్తుంది . జరామరణాలు అనేవి శ్వాసనిశ్వాసలు లాంటివి అనే కాన్సెప్ట్ చాల మందికి తెలియదు.

భయం, సందేహం, పరిమిత జ్ఞానం, మానసిక సోమరితనం వల్ల మానవజాతి భౌతిక సమస్యలతో దుఃఖంతో మునిగివున్నది. అయినప్పటికీ మీ అంతర్ ప్రపంచం యొక్క కృపవల్ల దేహంలో గుండె కొట్టుకోవడం, మీ శ్వాస ప్రక్రియ, ఊపిరితిత్తులు పనిచెయ్యడం లాంటివి చాల ఆటోమాటిక్‌గా జరుగుతున్నాయి. మీరు స్వప్నావస్థలో వున్నపుడు మీ అంతర్ శక్తి నుండి సందేశాలు అందుతూ వుండడం వల్ల మీకు ఎరుక లేనప్పటికీ జీవిత చైతన్య పరిణామం అలా సాగుతూంది. మీ సంకల్పాలు, ఊహాశక్తికి అణుగుణంగా మీ అంతర్ ప్రపంచం స్పందించి భూభౌతిక వాతావరణంలో నుండి పరమాణువులు + అణువులతో మీ దేహాన్ని సృష్టించింది. దేహం వున్నపుడు, లేనపుడు కూడ అంతర్ ప్రపంచం (అంటే ఆత్మశక్తి) వుంటుంది. ఈ పరమాణువులు, అణువులే ఒక గ్రూపుగా ఏర్పడి జీవకణాలుగా తయారవుతున్నాయి. మీ దేహం, జీవితానుభవాలు, మీ జీవితంలో భౌతిక సంఘటనలు చాల స్వేచ్ఛగా, ఆహ్లాదంగా, అకస్మాత్తుగా అంతర్ ప్రపంచం నుండి సృష్టింపబడుతున్నాయి. మీరు ఏర్పరుచుకున్న నమ్మకాలు, భయాలు, సంకల్పాలు మీ భౌతిక అనుభవాల చుట్టూ కంచెను ఏర్పరుస్తున్నాయి.

ఇక్కడ ఒక చిన్న ఎక్సర్‌సైజ్ (exercise)ను ప్రాక్టీసు చెయ్యండి. సుఖాసనంలో హాయిగా కూర్చుని కళ్ళు మూసుకోండి. కొన్ని నిముషాలపాటు శ్వాసను గమనించండి. శ్వాసను గమనించడంవల్ల మీ మైండ్‌లో గందరగోళం, ఆలోచనలు తొలగిపోతాయి. తరువాత ఈ క్రింది విధంగా ఫీలవ్వండి.

1. ఆత్మశక్తికి అవధులు లేవు. ఆత్మ అనేది భౌతిక దేహానికి మాత్రమే పరిమితం కాదు. ఆత్మ దేహం లోపల, దేహం వెలుపల వ్యాపించివుంది.
2. నా వాస్తవాన్ని నేను సృష్టించుకుంటున్నాను. భౌతిక ప్రపంచంలో నా జీవితంలో ప్రవేశించే భౌతిక సంఘటనలన్నీ నా అంతర్ ప్రపంచం నుండే ఉద్భవిస్తున్నాయి.
3. భౌతిక ప్రపంచంలో ఎదురయ్యే అన్ని సమస్యలకు, సవాళ్ళకు పరిష్కారం నా అంతర్ శక్తిలోనే ఉంది. నా ఆత్మశక్తితోనే నా సమస్యలను, సవాళ్ళను అధిగమిస్తున్నాను. ఈ సమస్యలు, సవాళ్ళు నా జీవితంలో జ్ఞానాన్ని పెంచడానికి ప్రవేశించే భౌతిక సంఘటనలుగా భావిస్తున్నాను.
4. ఈ సృష్టిలో అంతటా చైతన్యశక్తి నిండివుంది. భౌతిక ప్రపంచంలో అన్ని వస్తువులలో, అన్ని భౌతిక సంఘటనలలో చైతన్యశక్తి నిండి వుంది. నేను పొందే భౌతిక అనుభవాలన్నీ కూడ చైతన్యశక్తితో నిండి వున్నాయి.

5. భౌతిక ప్రపంచం అనే నిర్దేశ చట్రంలో నా చైతన్య పరిణామానికి కావలసిన భౌతిక సంఘటనలను, భౌతిక పరిస్థితులను సృష్టించుకోగల స్వేచ్ఛ కలిగి వున్నాను.

6. భౌతిక వాస్తవం, భౌతిక సృష్టి, చైతన్య పరిణామం అనేవి చాల సునాయాసంగా, అప్రయత్నపూర్వకంగా, అంతర్ ప్రపంచం నుండి బాహ్య భౌతిక ప్రపంచంలోనికి మలచబడే ప్రక్రియలే. ఇవన్నీ నా ఆత్మశక్తి నుండి వెలువడుతున్నాయి.

7. నా ఆలోచనలు, ఫీలింగ్స్, ఎమోషన్స్, ఊహలు, కలలు ముందరగా అంతర్ ప్రపంచంలో ప్రారంభ సంఘటనలుగా ఏర్పడి తర్వాత బాహ్య ప్రపంచంలో భౌతిక సంఘటనలుగా భౌతిక వాస్తవం పొందడంలో చైతన్యశక్తి + విద్యుదయస్కాంత శక్తి + అంతర్ ధ్వని + అంతర్ కాంతి పాలుపంచు కుంటున్నాయి.

పైన కనబర్చిన అన్ని పాయింట్స్‌ను మీ అంతరంగంలో ఫీలవుతూ ప్రాక్టీసు చెయ్యండి. దానివల్ల మీ ఫీలింగ్స్ మరింత ఉత్తేజాన్ని పొందుతాయి. మీ పాత భావాలు, పాత నమ్మకాలు, పాత కాన్సెప్ట్‌లను ప్రక్కనబెట్టి మీ అంతర్ శక్తి, అంతర్ ప్రపంచం యొక్క విశిష్టతను ఫీలవుతూ ఆస్వాదించండి. ఈ ప్రాక్టీసు సరియైనదా? కాదా? నేను చేస్తున్నది కరక్టేనా? నేను సరియైన రీతిలో ఫీలవుతున్నానా? ఇతరులు నా గురించి ఏ విధంగా ఫీలవుతారు? లాంటివి ప్రక్కనబెట్టి వారంలో ఒకసారి పది నిముషాల పాటు ప్రాక్టీసు చెయ్యండి. మీ సాధన, మీ ఫీలింగ్స్ ముఖ్యం గాని ఇతరులు మీపట్ల ఏర్పరుచుకున్న అభిప్రాయాలు, ప్రామాణికాలను మీరు పట్టించుకోనవసరం లేదు.

ఈ ఎక్సర్‌సైజు వల్ల మీకు జీవితంపట్ల ఆసక్తి, జీవితం అర్థవంతమైనదిగా వున్నట్లు, మీరు 'దేహం' మాత్రమే కాదు 'ఆత్మశక్తి' కూడ అనే అవగాహన కలుగుతుంది. ప్రతి రోజూ కూడ దీన్ని ప్రాక్టీసు చెయ్యవచ్చు. దీన్ని ప్రయాసపడి కష్టపడి సాధన చెయ్యవలసిన పనిలేదు. ఒక ఆటగా తమాషాగా ఎంజాయ్‌మెంట్ కోసం అన్నట్లు ప్రాక్టీసు చెయ్యండి. మీ అంతరంగంలో ఏమేమి ఫీలవుతున్నారో అంతా స్వీకరించండి. ఈ ఎక్సర్‌సైజు మీరేంటో మీకు తెలియజేస్తుంది. మీ అంతర్ ప్రపంచంతో మీకు సంబంధాన్ని కలుగజేస్తుంది. మీతో మిమ్మల్ని వుండేటట్లు చేస్తుంది. మీ అంతర్ ప్రపంచంలో చైతన్యశక్తిని స్పందింపజేసి విద్యుదయస్కాంత శక్తిని ఉత్తేజింపజేస్తుంది. ఆత్మశక్తికి అవధులు లేవు, ఇది అన్ని దిశలా వ్యాప్తి చెంది వుందన్న భావన కలగజేస్తుంది.

మీరు నిరాశా నిస్పృహలలో వున్నపుడు ఈ ఎక్సర్‌సైజును సాధన చెయ్యండి. మీకు రిలీఫ్ వస్తుంది. మీ చుట్టూ మీరు ఆశించిన భౌతిక పరిస్థితులు ఆటోమాటిక్‌గా ఆకర్షింపబడుతాయి. ఆశాకరధోరణి మీకు అలవడుతుంది.

* * *

మీ ఆలోచనలు, ఎమోషన్స్, నమ్మకాల దృశ్యరూపమే భౌతిక వాతావరణం. మీ ఆలోచనలు, ఎమోషన్స్, నమ్మకాలు భౌతిక పరిస్థితులను తారుమారు చేసి ప్రభావితం చెయ్యగలవు. ఈ ప్రక్రియలో జీవజాతులన్నీ తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి. భౌతిక పదార్థంతో కూడిన చట్రంలో మీ దేహం ఒక ఘనపదార్థంగా మీ కళ్ళకు కన్పిస్తుంది. ఎలక్ట్రానులు, పరమాణువులు, అణువులు గ్రూపులుగా ఏర్పడి జీవకణాలుగా మరి జీవకణాలు గ్రూపుగా ఏర్పడి దేహంలో అవయవాలుగా రూపొందుతున్నాయి. శక్తి యొక్క రూపాంతరమే మీ దేహ పదార్థం. మీ దేహంలోని ఎలక్ట్రానులు, పరమాణువులు నిరంతరమూ ఆత్మభ్రమణం + పరిభ్రమణం చేస్తున్నాయి. అవి నిరంతరం కదిలికను, క్రియారూపాన్ని కలిగిస్తూ చైతన్యశక్తితో నడపబడుతున్నాయి. మీకు మాంసంగా కన్పించే దేహంలో ఎలక్ట్రానులు, పరమాణువుల ఆత్మభ్రమణం + పరిభ్రమణాలవల్ల శక్తిని నిరంతరమూ ఇచ్చిపుచ్చుకుంటూ ప్రవహింపజేస్తున్నాయి. దేహం వెలుపల మీరు శూన్యంగా భావించే బాహ్య వాతావరణంలో కూడా ఇదే శక్తి ప్రవాహం, ఇవే ఎలక్ట్రానులు, పరమాణువులు వుంటున్నాయి. బాహ్య వాతావరణంలోని పరమాణువులు, మీ దేహ నిర్మాణంలోని పరమాణువుల మధ్య నిరంతరం శక్తి ప్రవాహం జరుగుతుంటుంది. మీరు శ్వాస తీసుకుంటున్నపుడు బయటిగాలి లోపలికి, లోపలి గాలి బయటికి పోతుంటుంది. అదే విధంగా మీ దేహంలోని శక్తి బయటి వాతావరణానికి, బయటి వాతావరణం నుండి దేహంలోనికి శక్తి ప్రవాహం జరుగుతుంటుంది. దేహం లోపల, బయటి వాతావరణంలో వున్న పరమాణువుల మధ్య విద్యుదయస్కాంత శక్తి, రసాయనిక శక్తులు అటునుంచి ఇటు, ఇటు నుంచి అటు ప్రవాహం లేకపోతే జీవ శక్తి అనేది భూభౌతిక ప్రపంచంలో మనుగడ సాగించదు.

అంతర్ ప్రపంచం, అంతర్ శక్తి కూడ లోపలికి, వెలుపలికి ప్రవహిస్తుంటుంది. ఈ ప్రకృతిలో మీరు ఏ విధంగానూ ఉనికి కోల్పోవడం లేదు. ఎంచేతంటే మీరు ప్రకృతిలో భాగం గనుక. ఊపిరిని బిగపట్టి గాలిని లోపలికి, బయటికి ప్రవహించకుండా ఆపడం ఎలా సాధ్యం కాదో, అదే విదంగా మీ దేహంలోని విద్యుదయస్కాంత + జీవ రసాయనిక శక్తి ప్రవాహాన్ని ఆపడం కూడ అసాధ్యం. మీ రక్తంలో ప్రవహిస్తూన్న ఎడ్రినలిన్

(adrenalin) మీ దేహాన్ని ఉత్తేజ పరచడమే కాకుండా బాహ్య ప్రపంచ వాతావరణంలోనికి కూడ దాని విద్యుత్ అయస్కాంత శక్తిని వెదజల్లుతుంటుంది.

మీ ఎమోషన్స్, ఫీలింగ్స్, నమ్మకాలు కూడ దేహంలో రసాయనాలను, హార్మోనులను విడుదల జేస్తాయి. ఈ ప్రక్రియను ఇంత వరకు మీ వైద్య శాస్త్రము పసిగట్టలేకపోతుంది. శ్వాస ద్వారా వాతావరణంతో అనుసంధానం కలిగివున్నట్లే, మీ దేహంలో విడుదలయ్యే రసాయనాలు, హార్మోనుల ద్వారా కూడ బయటి వాతావరణంతో అనుసంధానం కలిగి వున్నారు. మీరెప్పుడైనా గమనించారా? మీ దేహం నుండి విడుదలవుతున్న రసాయనాలను, హార్మోనులను పసిగట్టడం ద్వారా మీ పెంపుడు కుక్క, పెంపుడు జంతువులు ఎంతో దూరంలో వున్న మిమ్ములను, వాటికి కన్పించక పోయినప్పటికీ మిమ్మల్ని గుర్తుపట్టగలవు. అడవులలో వేటాడే జంతువులు, చంపబడే జంతువులు కూడ ఈ విధంగానే అవతలి జంతువుల దేహాలలోని హార్మోనులను, రసాయనాలను పసిగట్టి గుర్తించగలవు. మీ మానవజాతి తమ ఎమోషన్స్, ఫీలింగ్, ఆలోచనల ద్వారా భౌతిక వాతావరణాన్ని ప్రభావితం చెయ్యడం జరుగుతూంది. ఇతర జీవజాతులు కూడ ఇందులో ప్రమేయం కలిగి వున్నాయి. తుఫానులు, భూకంపాలు, సునామీలు, కలరా వ్యాప్తి, ప్లేగు వ్యాప్తి లాంటి ప్రకృతి వైపరీత్యాలు మీ ఎమోషన్స్, ఫీలింగ్స్, నమ్మకాల వల్లనే సంభవిస్తున్నాయి. మీ నమ్మకాలే మీ ఎమోషన్స్‌ను సృష్టిస్తున్నాయి.

అంతర్ శక్తిని ఎమోషన్స్‌గా, ఆలోచనలుగా, ఫీలింగ్స్‌గా, నమ్మకాలుగా మార్చి భౌతిక సంఘటనలుగా రూపాంతరం చెందించి వాటిని జీవితానుభవాలుగా ఎదుర్కొని చైతన్య పరిణామం + జ్ఞానం సముపార్జన కోసమే మీరు ఈ భూభౌతిక ప్రపంచంలోనికి జన్మ తీసుకోవడం జరుగుతూంది. అంతకు మించి వేరే లక్ష్యాలు లేవు. ఇక్కడ చైతన్య పరిణామం + జ్ఞానం పెరిగేకొలది మీ ఆత్మశక్తి పరిధి విస్తరిస్తూ వుంటుంది. **ఆత్మ చైతన్య వికాసం చెందడం కోసం, భౌతిక పదార్థంతో ముడిపడి వున్న చైతన్యశక్తిని అధ్యయనం చెయ్యడం కోసమే భూమి మీద జీవజాతులు జన్మతీసుకోవడం జరుగుతూంది. భూమి మీద గల జ్ఞానాన్ని సంపూర్తిగా పొందిన తర్వాత ఈ ఆత్మ మరో ఉన్నతమైన, శక్తివంతమైన హైఫ్రీక్వెన్సీగల లోకానికి ప్రయాణం చేసి అక్కడ జన్మతీసుకుని చైతన్య పరిణామాన్ని ప్రారంభిస్తుంది.** 'పునరపి జననం పునరపి మరణం' అనే పరంపర ఈ భౌతిక వాస్తవాన్ని అధ్యయనం చేసి చైతన్య పరిణామం చెందడం కోసమే! భూమి మీద జన్మను తీసుకుంటున్న ప్రతి ఆత్మకు ఇది తప్పనిసరి.

మీ చుట్టూ ఒకసారి గమనించండి. ఆనందం, దుఃఖం, సంతోషం, నిరాశ, ఆరోగ్యం, అనారోగ్యం అన్నీ మీరేర్పచుకున్న నమ్మకాల వల్లనే సృష్టింపబడుతున్నాయి. అనారోగ్యాన్ని, దుఃఖాన్ని మీపై ఏ బాహ్య శక్తీ రుద్ధడం లేదు. ఎవరూ మిమ్మల్ని ప్రభావితం చెయ్యడం లేదు. అన్నీ మీ అంగీకారంతోనే మీకు తారసపడుతున్నాయి. మీ అంతట మీరే ఆ నమ్మకాలను మార్చుకుని మీ జీవితానుభవాలను మార్చుకోవాలి.

భౌతిక వాస్తవం గురించిన జ్ఞాన పరిధిని విస్తరించుకుంటూ పోయినప్పుడే మీ జీవితంలో భౌతిక సంఘటనలను సవాళ్ళుగా ఆనందంగా స్వీకరించ గలుగుతారు. మీ జ్ఞాన పరిధిలో సంకల్పాలు, కోరికలు, ఆశలు కలిగి వుండడమే కాదు. వాటిని క్రియా రూపంలో ఆచరణలో పెట్టగలిగినపుడే అభివృద్ధి అనేది వుంటుంది. ఒక్కొక్క భౌతిక సంఘటనా మీ జీవితానుభవంగా మారి మీ జ్ఞాన పరిధిని + చైతన్యశక్తి పరిధిని పెంచుతుంది.

దేహంలో సంభవించిన ఎటువంటి వ్యాధినైనా ఆత్మశక్తితో నయం చేసుకోవచ్చు. మరి 'ఎవరి వాస్తవాన్ని వారే సృష్టించుకుంటున్నారు' అనే ఒట్టి జ్ఞానం వుంటే చాలదు. ఆ జ్ఞానాన్ని క్రియారూపంలో ఆచరణలో పెట్టగలిగినపుడే ఆధ్యాత్మికత అన్పించుకుంటుంది. ఆధ్యాత్మికత అంటే ఆత్మజ్ఞానాన్ని ఆచరణలో పెట్టడం ద్వారా చైతన్య పరిణామం చెందడమని అర్థం. మీ భూభౌతిక ప్రపంచంలో మెజారిటీ జనాభా ఆధ్యాత్మికవేత్తలు కానేకారు. జ్ఞానాన్ని ఆచరణలో శూన్యం చేసినపుడే జీవితంలో దుఃఖం, అశాంతి, నిరాశ, అనారోగ్యం ఎదురవుతాయి. మెజారిటీ శాతం జనాభా ఆధ్యాత్మికవేత్తలుగా మారితే మీ భూమ్మీద మరో క్రొత్త ప్రపంచం ఆవిష్కరిస్తుంది.

మీ ఆలోచనల్ని, నమ్మకాలను, ఎంతో ఎరుకతో గమనించడం నేర్చుకోండి. ఇతరుల పట్ల మీ అభిప్రాయాలు, ద్వేషాలు నమ్మకాలు మీ అంతరంగంలోని భావాలను, ఆలోచనలను ప్రతిబింప చేస్తాయి. ఈ ప్రపంచమంతా దుఃఖముతో, దారిద్ర్యముతో, సమస్యలతో నిండివుందని, ప్రజలంతా మోసపూరితమైనవారని, మానవజాతికి అర్థం లేకుండా పోయిందని, మనుషులంతా చెడ్డవాళ్ళేనని, మానవ దేహం తరచూ అనారోగ్యం పాలు అవుతుందని – మీరు అభిప్రాయాలు ఆలోచనలు కలిగివున్నట్లయితే మీలో లోపం వుందని తెలుసుకోండి. మీరు అటువంటి ఆలోచనలు కలిగి. ఎంత దృఢంగా నమ్ముతున్నట్లయితే అంత అజ్ఞానం మీకు వుందని అర్థం చేసుకోండి. ఇటువంటి ఆలోచనలను అభిప్రాయాలను క్షుణ్ణంగా పరీక్ష చేసుకుని మీ ఆలోచనా దృక్పథాన్ని

మార్చుకోవలసి వుంది. ఈ భూభౌతిక ప్రపంచంలో సంపద, ఆనందం పుష్కలమైన అవకాశాలు, జీవితం పట్ల గౌరవం, ఇతరులలో మంచితనాన్ని చూడడం, ఆశావాదం, దేహాన్ని మహిమాన్విత శక్తిగా భావించడం, మానవజాతి + ఇతర జీవజాతుల పట్ల విలువ ఇవ్వడం లాంటి ఆలోచనలు అభిప్రాయాలు మీరు కలిగివున్నపుడు మీ మనోస్థితి చాల ఆరోగ్యకరంగా వుందని తెలుసుకోండి.

నిర్మాణాత్మకంగా గాని, వినాశకరరీతిలో గాని వున్న ఆలోచనాధోరణిని సమూలంగా పరీక్ష చేసి మీకుపయోగకరంగా మలుచుకోగల శక్తిని మీరు ఏ క్షణంలో నైనా కలిగివున్నారు. భౌతిక ప్రపంచంలో మీరు ఏర్పరుచుకున్న ఆలోచనల్ని, అభిప్రాయాల్ని మీ కాన్షియస్ మైండ్ వివేచన చెయ్యగలదు. వివేచనా శక్తి మీ కాన్షియస్ మైండ్‌కు తప్ప మీ అంతర్ ప్రపంచానికి వుండదు. మీ అంతర్ ప్రపంచానికి మీరు ఏది కోరుకుంటే అది ఇవ్వడమే తెలుసు. అంతర్ ప్రపంచం నుండి వచ్చే సందేశాలు, సూచనల్ని కాన్షియస్ మైండ్ అనే ద్వారం ద్వారా మీ జీవితానుభవంగా మలచబడుతున్నాయి. అంతర్ ప్రయాణం ద్వారా, అపారమైన జీవితానుభవాల ద్వారా కాన్షియస్ మైండ్ షార్ప్ (sharp) అవుతుంది. అంతర్ ప్రపంచానికి, బాహ్య భౌతిక ప్రపంచానికి మధ్య వారధిలాగ కాన్షియస్ మైండ్ పని చేస్తుంటుంది. వివేచన చేసి బాహ్య ప్రపంచంలో ఏయే భౌతిక సంఘటనలు, జీవితానుభవాలు కావాలో సంకల్పాలు, ఆలోచనల రూపంలో అంతర్ ప్రపంచానికి తెలియజెయ్యడమనే పని చేస్తుంది కాన్షియస్‌మైండ్. అంతర్ ప్రపంచం అనేది భౌతిక ప్రపంచంలో ఇమిడేవిధంగా భౌతిక సంఘటనలను, భౌతిక పరిస్థితులను, జీవితానుభవాలను ఈ కాన్షియస్ మైండ్ ద్వారా వెలుపలకు వాస్తవరూపం చెందిస్తుంది. అంతర్వాణి, అంతర్ సందేశాలు ఈ కాన్షియస్ మైండ్ ద్వారా మీ ఎరుకలోనికి వస్తుంటుంది.

మీ కాన్షియస్ మైండ్ ద్వారా ఏ సూచనలు, ఏ సలహాలను మీ అంతర్ ప్రపంచానికి ఇస్తున్నారనే విషయాన్ని చాల సునిశితంగా పరిశీలించండి. మీ జీవితానుభవాలను మీ ఇష్టానుసారం సృష్టించుకోవచ్చుననే విషయాన్ని ఎల్లవేళలా గుర్తుంచుకోండి. మీలో చాల మంది 'మేము చాల మంచి వాళ్ళము' అనే ముసుగులో తమను తాము మోసం చేసుకుంటున్నారు. చెడును ద్వేషిస్తున్నామని వాళ్ళు చెప్పుకుంటుంటారు. ద్వేషిస్తున్నంతమాత్రాన చెడు అనేది మటుమాయం కాదు. మీ అంతర్ ప్రపంచంలో నిర్మాణాత్మకంగా మీ పట్ల మీరు మంచి ఆలోచనలు కలిగి వున్నారా?

అనేది ముఖ్యం. పేదరికంలో ప్రగ్గుతూ జీవితాన్ని గడపడం గొప్పగా, చాల మంచికార్యంగా మీలో కొంతమంది భావిస్తున్నారు. దాన్ని సమర్థించుకుంటూ తాము దురాశాపరులము కామని చెప్పుకుంటున్నారు. సంపద గల వాళ్ళంతా అశాంతితో వున్నారని, సంపద వల్లనే సమాజంలో చెడు జరుగుతూందని, తాము మాత్రము సింపుల్ లైఫ్‌తో నిరాడంబరంగా వుంటున్నామని సమర్థించుకుంటున్నారు. అనారోగ్యం అనేది జీవిత శాపమని, భగవంతుడు ఇచ్చిన శిక్షగా భావిస్తూ మరికొందరు జీవితాలను వెళ్ళదీస్తున్నారు. ఇవన్నీ మిమ్మల్ని మీరు వంచించుకుంటున్న చర్యలే! మేము చాల మంచి వాళ్ళము అనే ముసుగులో మిమ్మల్ని మీరు వంచించుకుంటున్నారు. ఒట్టి భ్రమలలో మునిగి తేలుతున్నారు. దీనివల్ల మీకు జీవితం దుర్భరమవుతుందేగాని పురోగతి వుండదు.

జీవితంలో విఫలమవుతున్నామని భావించినపుడు, మంచి వాళ్ళుగా చెప్పుకునేందుకు ఎన్నో కుయుక్తులను, సాకులను, సమర్థించుకోవడాలను వెదుకుతూ జీవితాన్ని దుఃఖభరితం చేసుకోవలసిన అగత్యం ఏ ఆత్మకూ ఈ భూమి మీద ఏర్పడలేదు. ద్వేషించినంత మాత్రాన మీ జీవితాలలో పరిస్థితులు మారవు. మీకు ఏ పరిస్థితులు, ఏ భౌతిక అనుభవాలు, భౌతిక సంఘటనలు కావాలో వాటిని మీ సంకల్పాల ద్వారా అంతర్ ప్రపంచం నుండి భౌతిక ప్రపంచంలోనికి సృష్టించుకోండి. అనారోగ్యాన్ని ద్వేషిస్తే మీకు ఆరోగ్యం వస్తుందా? మీకు ఆరోగ్యం కావాలని సంకల్పించుకుని భౌతిక వాస్తవం పొందండి. మీరు స్త్రీలను ద్వేషిస్తే అందుకు గల కారణాలను తెలుసుకోవడం కోసం స్త్రీ జన్మ తీసుకోవలసి వుంటుంది. స్త్రీ జన్మ తీసుకుని ఎందుకు ద్వేషించవలసి వచ్చిందో చైతన్యశక్తిపరంగా, ఆత్మశక్తి పరంగా, భౌతిక వాస్తవం పరంగా గల కారణాలను సంపూర్తిగా తెలుసుకునే వరకు స్త్రీ గా జన్మలు తీసుకోవడం జరుగుతుంటుంది. మీరు భిక్షగాళ్ళను ద్వేషిస్తే అందుకు గల కారణాలు తెలుసుకునేందుకు భిక్షగాడిగా జన్మ తీసుకోవడం జరుగుతుంది. మీరు మంచి వాళ్ళు అనే ముసుగు తొలగి వాస్తవం పొందాలంటే మీ ఆలోచనలను, నమ్మకాలను ఎప్పటికప్పుడు సమూలంగా పరీక్షించుకుంటూ వుండండి. మీరు ఎక్కెడెక్కడ తప్పిదాలు చేస్తున్నారో మీకే తెలుస్తుంది. మీకెవ్వరూ ఈ పని చేసి పెట్టరు. మిమ్మల్ని మీరే ఉద్ధరించుకోవాలి. మిమ్మల్ని మీరే చైతన్య పరిణామం చెందించుకోవాలి. జ్ఞానం అనే అగ్నిలో భ్రమలు మరి అవాస్తవాలు మాడిమసైపోతాయి.

మీ ఆరోగ్యం మరి మానసిక సమస్యలతో మీ డాక్టర్లు మరి మానసిక వైద్యులు దాగుడు మూతలాడుతున్నారు. ప్రస్తుతమున్న పాశ్చాత్య వైద్య విధానంతో మీకెప్పటికీ

శాశ్వత పరిష్కారం దొరకదు. మీ మానసిక వైద్యులవల్ల మీ మానసిక సమస్యలు మరింత పెరిగి దౌర్భాగ్యం పెరిగిందేగాని వాళ్ళవల్ల మీకేమీ ఒరగడం లేదు.

పదేపదే మీ ఆలోచనలను, నమ్మకాలను పరీక్షచేసుకోమని నేను చెప్పడం లేదుగాని, నిత్య జాగ్రత్త స్థితిలో ఎరుకతో జీవించాలని తెలియపరుస్తున్నాను. ఎరుకతో నిత్య జాగ్రత్త స్థితిలో వుండగల శక్తి సామర్థ్యాలు మీ కాన్షియస్ మైండ్‌కు వున్నాయని నొక్కి చెబుతున్నాను. మీ కాన్షియస్ మైండ్ అటువంటి అపారమైన శక్తిని కలిగి వుందని మీరు విశ్వసించండి, అంతే చాలు. మీ జీవితానుభవాలు, మీ చుట్టూ వున్న జీవిత పరిస్థితులు, భౌతిక సంఘటనలు మీ నమ్మకాలు సంకల్పాల వల్ల సృష్టింపబడినాయనే వాస్తవాన్ని సదా గుర్తుంచుకోండి. మీరు జన్మ తీసుకోక మునుపు, ఇపుడూ, మరణం తర్వాత కూడ మీ జీవితానుభవాలను మీరే సృష్టించుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ కొన్ని ప్రత్యేక భౌతిక అనుభవాలను, భౌతిక పరిస్థితులను ఎంచుకుని జీవాత్మలుగా భూమి మీద జన్మలు తీసుకుని ప్రయోగాలు చేస్తూ చైతన్య పరిణామం చెందుతున్నారు. వాళ్ళు ఎంచుకున్న భౌతిక అనుభవాల చట్రంలో చైతన్య పరిణామం చెందడానికి కావలసిన స్వేచ్ఛ, సర్వశక్తి సామర్థ్యాలు వాళ్ళు భూమి మీద పుట్టినప్పటి నుండే వాళ్ళ అంతర్‌ప్రపంచంలో ఇమిడి ఉన్నాయి.

ఈ విశ్వంలోని అన్ని లోకాలూ మూలచైతన్యం యొక్క మనోశక్తి నుండి వెలువడినాయి. మీరు జన్మతీసుకున్న త్రీ-డైమన్షనల్ భౌతిక ప్రపంచం కూడ మూలచైతన్యశక్తి నుండి వెలువడిన ఆత్మశకలాలతో సృష్టింపబడింది. మీలో ప్రతి ఒక్కరూ భౌతిక ప్రపంచంలో విడదీయరాని భాగంగా వుంటూ భౌతిక వాతావరణాన్ని, భౌతిక వస్తువులను సృష్టిచెయ్యడం జరుగుతూంది. ఈ విశ్వంలో కోటానుకోట్ల లోకాలు + వాటిలో జీవరాశుల సృష్టి అలానే జరుగుతూంది. ఒక లోకం యొక్క చైతన్య పరిణామం పెరిగితే విశ్వ చైతన్య పరిణామం కూడ పెరుగుతుంది. ఒక లోకం యొక్క చైతన్య పరిణామం అనేది దానిలో వున్న సమస్త జీవరాశుల సమిష్టి చైతన్య పరిణామం పై ఆధారపడివుంటుంది. లోకాలు అంటే భూమి లాంటి ఘనపదార్థ గ్రహాలే కాకుండా, ఇతర చైతన్య పదార్థంతో కూడిన ప్రపంచాలు కూడ వున్నాయని మీకు తెలియజేస్తున్నాను. మీ భూమి మీద అనేక లోకాలు నడుస్తున్నాయి. అవి మీ చర్మచక్షువులకు కన్పించవు. మీ అంతరేంద్రియాలతో ఎంతో సాధన ద్వారా వాటిని మీరు చూడవచ్చు. ఆయా లోకాలలోగల శక్తి యొక్క ఫ్రీక్వెన్సీ స్థాయికనుగుణంగా అక్కడ పదార్థం వుంటుంది. ఆ

పదార్థానికనుగుణంగా అక్కడి జీవరాశులు దేహాలు తీసుకుని చైతన్య పరిణామం చెందుతుంటాయి.

'నా తండ్రి రాజ్యంలో అనేక లోకాలున్నాయి' అని జీసస్ క్రైస్ట్ చెప్పిన మాటలను మీరు చదివే వుంటారు. మీ అంతర్ ప్రయాణం ద్వారా ఆ లోకాలను దర్శించవచ్చు. మీ అంతర్ శక్తి యొక్క ఫ్రీక్వెన్సీ స్థాయి ఒక లోకం యొక్క ఫ్రీక్వెన్సీ స్థాయికి ట్యూన్ అయినపుడు ఆ లోకానికి దర్శించడం అక్కడి జ్ఞానాన్ని పొందడం జరుగుతుంది. మూలచైతన్యశక్తి నుండి వెలువడుతున్న ఆత్మశకలాలు జీవాత్మలుగా ఒక లోకంలోనికి జన్మలు తీసుకున్నపుడు ఆ లోకపు శక్తి స్థాయిలో సంపూర్తి చైతన్య పరిణామం చెందవలసివుంటుంది. భూభౌతిక తలంలో పదార్థంతో ఇమిడివున్న చైతన్యశక్తిని దాని డైనమిక్స్‌ను తెలుసుకుని జ్ఞానాన్ని సముపార్జించుకోవడానికి ఆత్మలు జీవాత్మలుగా భూమి మీదకు జన్మలు తీసుకోవడం జరిగింది. చైతన్యశక్తి యొక్క మహిమాన్వితమైన సృష్టించగల శక్తి మీలో ప్రతి ఒక్కరికీ వారసత్వంగా సంక్రమించింది. ఒక్క మానవజాతికే గాక భూమి పై అన్ని జీవాత్మలకూ వారసత్వంగా సంక్రమించింది. తక్కువ, గొప్ప, చిన్న, పెద్ద అని తేడా లేకుండా ఎలక్ట్రాను, పరమాణువు, అణువు, రాయి, పర్వతం, ఇలా అన్నింటిలోను చైతన్యశక్తి నింపబడివుంది. భౌతిక వాస్తవాన్ని సృష్టించడంలో అన్నీ పాలుపంచుకుంటున్నాయి. కీటకాలు, పురుగులు, క్రిములు, పక్షులు, జంతువులు, చెట్లు, రాళ్ళు, సముద్రాలు... ఇంకా అన్నీ వివిధ దేహాలను ధరించి చైతన్య పరిణామాన్ని చెందుతూన్న జీవాత్మలే. ఈ ప్రకృతి భౌతిక వాతావరణాన్ని అన్ని జీవాత్మలూ సృష్టిస్తున్నాయి. భౌతిక ప్రపంచంలో చైతన్య పరిణామానికి ఈ భౌతిక వాతావరణ సృష్టి చాల తప్పనిసరి; ఈ సృష్టి చాల సహజంగా సులభంగా జరుగుతూంది. జీవరాశులు, భౌతిక వాతావరణంల మనుగడ పరస్పరం ఒక దానిపై ఒకటి ఆధారపడివున్నాయి.

ఈ భౌతిక వాతావరణంలో సంభవించే ఋతువులు, వర్షపాతాలు, నదీప్రవాహాలు, గాలి, సముద్రాలు అంతా కూడ ప్రాచీన కాలం నుండి మీ ఆత్మశక్తి యొక్క సంకల్పాలవల్ల సృష్టింపబడుతూ వున్నాయి. భూమి అనే భౌతిక దేహం కూడ ఆత్మను + మనోశక్తిని కలిగి వుంది. భూమిలో ఇమిడివున్న పర్వతాలు, నదులు సముద్రాలు... అన్నీ భూమి యొక్క దేహానికి సంబంధించినవే. భూమి మీద తయారయ్యే వస్తువులు, భూమి మీద సంభవించే భౌతిక సంఘటనలు, భౌతిక వాతావరణం, భౌతిక పరిస్థితులు అన్నీ భూమి అనబడు ఆత్మ చైతన్య పరిణామానికి సంబంధించినవే!

మీ దేహంలోగల ప్రతి ఎలక్ట్రాను, పరమాణువు ఆత్మను కలిగి వున్నాయి. మీ దేహంలోని అన్ని పరమాణువులు ఉమ్మడి చైతన్య పరిమాణం చెందుతున్నాయి. అన్ని పరమాణువులు వాటి అంతర్ ప్రపంచాల ద్వారా అనుసంధానింపబడి వున్నాయి. భూమి మీద అన్ని జీవాత్మలు వాటి అంతర్ ప్రపంచం ద్వారా అనుసంధానింపబడి వున్నాయి. భూమి మీద అన్ని జీవాత్మలు ఉమ్మడి భౌతిక వాస్తవాన్ని సృష్టిస్తూ చైతన్య పరిణామం చెందుతున్నాయి. భూమి మీద భౌతిక వాస్తవాన్ని సృష్టించడంలో అన్ని జీవాత్మలూ విశిష్టమైన పాత్రను పోషిస్తున్నాయి.

భౌతిక వాస్తవం, ఆత్మశక్తి, మల్టి డైమన్షనల్ ఆత్మ, అంతర్ ప్రపంచాల గురించి మీకు తెలిసిన జ్ఞానం మహా సముద్రంలో నీటి బిందువంత మాత్రమే. మీ సైకాలజిస్టులు, డాక్టర్లు, మత గురువులు 'అహం'తో ముడిపడిన విషయాలనే ఆలోచిస్తున్నారు. ఆత్మ గురించి , చైతన్య పరిణామం గురించి పరిశోధించాలనే ఆలోచనలు వారికి స్ఫురించడం లేదు. భూభౌతిక ప్రపంచంలో జీవాత్మల విశిష్టత గురించి వాళ్ళకు తెలియడం లేదు. మానసిక సమస్యలకు వాళ్ళు ఇచ్చే ట్రీట్‌మెంట్ 'అహం' స్థాయిలోనే వుంటుంది. మైండ్ గురించి వాళ్ళకు అవగాహన లేదు. మీ డాక్టర్లు దేహాన్ని ఒట్టి మాంసపు ముద్దగా భావించి ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. ఇది చాల హేయమైన, నీచమైన వైద్య విధానం.

సాధారణంగా మీరు ఏర్పరుచుకున్న నమ్మకాలు మీ ఎమోషన్స్‌ను, చేతలను ప్రభావితం చేస్తాయి. 'నేను ఆరోగ్యంగా వుంటాను' అని మీరు ప్రగాఢంగా నమ్మితే మీరు ఆరోగ్యాన్ని అన్ని వేళలా కలిగి వుంటారు. మీరు పేదరికంతో ప్రగ్గతున్నట్లయితే ధన సంపాదన ఎక్కువగా వుంటున్నట్లు, మీ ఇంటికి సంబంధించిన బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్నట్లు, ఖర్చుపెడుతున్నట్లు, మీకు కావలసిన వస్తువులు కొనుక్కుంటున్నట్లు, మీరెప్పుడూ మిగులు ధనం కలిగివున్నట్లు, సమాజ హితానికి కొంత శాతం ధనాన్ని దానం చేస్తున్నట్లు రకరకాలుగా ఊహించుకొని కలలు గనండి. మీ కలలన్నీ భౌతిక వాస్తవం చెందుతాయని నమ్మకం కలిగి వుండండి. అవి తప్పనిసరిగా నెరవేరేందుకుగాను అంతర్ ప్రపంచం యొక్క మెకానిజమ్ యాక్టివేట్ (activate) అవుతుంది.

మీకు జీవితం అంధకారంగా గమ్యంలేని నావలాగ తోస్తున్నదా? అయితే మీరు అర్థవంతంగా జీవిస్తున్నట్లు, ఆనందంగా వుంటున్నట్లు, అనేక అవకాశాలు, పనులు మీరు కలిగివున్నట్లు, జీవితం బిజీగా వుంటున్నట్లు, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటున్నట్లు, ఆధ్యాత్మిక పుస్తకాలు చదువుకుంటున్నట్లు, మీరు ఎంతో మందికి

ఉపయోగకరంగా వుంటున్నట్లు, మీ పెంపుడు జంతువులను, ఇతర జీవరాశులను ప్రేమతో చూస్తున్నట్లు ఇలా అనేక రకాలుగా ఊహించుకుని కలలు కనండి. అందుకనుగుణంగా మీ జీవితంలో భౌతిక పరిస్థితులు కల్పించబడతాయి. మీరు ఏవి సంకల్పించుకుంటారో, ఏవి కలలు కంటారో అవే మీ జీవితంలో భౌతిక సంఘటనలుగా ఎదురవుతాయి.

మీరు అనారోగ్యంగా వుంటున్నారా? అయితే ఆరోగ్యంగా వుంటున్నట్లు, చకచకా తిరుగుతున్నట్లు, చలాకీగా అందరితో మెలగుతున్నట్లు, అన్ని పనులు చేసుకుంటున్నట్లు, ఉత్తేజంగా వుంటున్నట్లు ఊహించుకుని కలలు కనండి. మీ దేహం అందుకనుగుణంగా సిద్ధపడుతుంది. మీరు సరియైన ఆరోగ్యాన్ని పొందుతారు.

మీరు ఇతరులతో మాట్లాడడానికి సంకోచిస్తున్నారా? 'నేను తక్కువ అనే భావం మిమ్మల్ని బాధిస్తుందా? అయితే అందరితో మాట్లాడుతున్నట్లు, ఎంతో మంది ఫ్రెండ్స్ వున్నట్లు, వాళ్ళతో మీరు నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు, మానవ సంబంధాలు నెరపుకోవడంలో ఎంతో ఉత్తేజంగా వుంటున్నట్లు అనేకరకాలుగా ఊహించుకుని కలలు కనండి. మీ భౌతిక పరిస్థితులు అందుకనుగుణంగా సృష్టింపబడతాయి.

దేనికీ భయపడకండి. మీకు ఏయే భౌతిక పరిస్థితులు, మానసికపరిస్థితులు, వాతావరణం, ఆరోగ్యం కావాలో వాటినే ఊహించుకుని కలలు కనండి. లేమి గురించి ఆలోచించకండి. ఫలానా భౌతిక సంఘటనలు జరుగుతాయేమోనని భయం చెందడంగాని, ఆందోళన చెందడంకాని చెయ్యకండి. మీ భయాలు, ఆందోళనలు కూడ భౌతిక వాస్తవాన్ని సృష్టిస్తాయి.

మీ 'కలలు' మీలో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని నింపుతాయి. ప్రాపంచికంగా గాని, ఆధ్యాత్మికంగా గాని మీరు సాధిస్తున్న విజయాలు లేదా మీరు పొందుతూన్న భౌతిక అనుభవాలన్నీ మీ సంకల్పాల నుండి మీ కలల నుండి ప్రాణం పోసుకుంటాయి. ఈ భౌతిక ప్రపంచంలో సంకల్పం లేకుండా ఏ భౌతిక సంఘటనా మీ జీవితంలో ఎదురవ్వదు. మీరు ఎరుకలో ఉన్నపుడు, ఎరుకలో లేనపుడు ప్రతి క్షణమూ మీ మైండ్‌లో సంకల్పాలు, కోరికలు, కలలు, ఊహలు, ఆశలు, కోరికలు ఎంచుకుంటుంటారు. వాటికిచ్చిన శక్తి తీవ్రత ఆధారంగా అవి భౌతిక సంఘటనలుగా మలచబడి మీకు ఎదురవుతుంటాయి. **మనిషికి కలలే లేకుంటే జీవితంలో ఉత్తేజం, ఉత్సాహం వుండవు. అతనికి జీవితం నిస్సారంగా అన్పిస్తుంది. కార్యసాధనకు ఉద్యుక్తం చేసేందుకు కలలు మిమ్ములను ఉద్యుక్తం చేస్తాయి.**

ఆధ్యాత్మికంగా, భౌతికంగా అత్యున్నత లక్ష్యాల కోసం కలలు కనండి. పెద్ద పెద్ద కలలు మిమ్మల్ని పెద్ద లక్ష్యాలను సాధించేటట్లు చేస్తాయి. చిన్న చిన్న కలలు చిన్న లక్ష్యాలను సాధించేట్లు చేస్తాయి. మీ కలలు, మీ సంకల్పాలు మీలో అంతరాగ్నిని ప్రజ్వలింపజేసి అంతర్‌శక్తిని ప్రేరేపింప జేస్తాయి. అత్యున్నత లక్ష్యాల కోసం కలలు కనండి. మీ కలలన్నీ సాకారం కావడానికి గల అపారమైన అంతర్‌శక్తిని కలిగి వున్నారని గుర్తుంచుకోండి.

మీ సబ్‌కాన్షియస్ మైండ్ ఆలోచనా తరంగాలను ఉత్పత్తి చేసి బయటి బాహ్య ప్రపంచంలోనికి పంపగలదు. బాహ్య ప్రపంచంలోని ఆలోచనా తరంగాలను సంగ్రహించగలదు. బలమైన మీ ఆలోచనా తరంగాలు విద్యుదయస్కాంత శక్తిని ఉద్గారం చేస్తాయి. ఇతరుల నుండి వచ్చే సూచనలు, ఆలోచనా తరంగాలను మీ సబ్‌కాన్షియస్ మైండ్ టెలీపతి ద్వారా పసిగట్టగలుగుతుంది. మీ ఆలోచనా తరంగాలు– స్వేచ్ఛ, ఆనందం, సంతోషం, ఐశ్వర్యం, సుఖం లాంటివాటికి సంబంధించినవయితే వాటికి అనుగుణంగా భౌతిక సంఘటనలను, మనుషులను మీ వైపు ఆకర్షించగలుగుతారు. మీకు మరి మీ చుట్టూ వున్న భౌతిక వాతావరణం + మనుషులు + జీవజాతుల మధ్య నిరంతరాయంగా టెలీపతి ద్వారా, ఎరుక ద్వారా ఆలోచనా తరంగాలు అటునుండి ఇటు, ఇటు నుండి అటు ప్రవహిస్తుంటాయి. ఒక రేడియో స్టేషను + రేడియో చేసే పనిని మీ సబ్‌కాన్షియస్ మైండ్ చేస్తుంటుంది. మీ కాన్షియస్ మైండ్‌లో మీరు ఏర్పరుచుకున్న నమ్మకాలకు అనుగుణంగా ఆలోచనలు ఆకర్షింపబడతాయి. ఆధ్యాత్మికంగా వుండాలంటే పేదరికంతో వుండడం తప్పనిసరి అని మీరు ప్రగాఢంగా నమ్మినట్లయితే పేదరికాన్ని మీ జీవితంలోనికి ఆహ్వానించిన వారవుతారు. పేదరికానికి సంబంధించిన భౌతిక పరిస్థితులు, భౌతికానుభవాలు మీకు ఎదురవుతుంటాయి. మీ నమ్మకాలకనుగుణంగా మీ ఎమోషన్స్, ఊహాశక్తి పనిచేస్తుంటాయి. మీరు ఏది కోరుకుంటున్నారో అదే మీ జీవితంలో వాస్తవమవుతుంది. మీ భౌతిక వాస్తవానికి, మీ స్వభావానికి సరిపడే ఆలోచనలనే మీరు ఆకర్షిస్తారు. మీకు వ్యతిరేకంగా వున్న ఆలోచనలు మీదరికి చేరవు.

జీవితంలో మీరు కలిగివున్న కొన్ని బిగుసుకుపోయిన నమ్మకాలు మీ జీవితగతిని శాసిస్తుంటాయి. ఆ నమ్మకాల వెంటే మీ జీవితంలో భౌతిక సంఘటనలు ప్రవేశిస్తుంటాయి. ఉదాహరణకు మీరు 'మానవజాతి చాల చెడ్డది! అని భావించినట్లయితే దానికనుగుణమైన జీవితానుభవాలనే మీరు ఆకర్షిస్తారు. వ్యక్తిగతంగా సామాజికంగా మానవజాతిలో మీరు

చెడునే చూస్తుంటారు. మీకు చెడు తలపెట్టేవాళ్ళే మీ వైపు ఆకర్షితులవుతుంటారు. మోసం చేసేవాళ్ళు, విద్రోహం తలపెట్టేవాళ్ళు, హింసను కలుగజేసేవాళ్ళు, అబద్ధాలాడి మిమ్మల్ని ఇబ్బంది పెట్టేవాళ్ళు... ఇంకా ఇలాంటి వాళ్ళనే మీరు ఆకర్షిస్తుంటారు. మీరు కూడ అలాంటి వాళ్ళవైపే ఆకర్షితులవుతుంటారు. న్యూస్ పేపర్లు, టెలివిజన్, రేడియో, సాహిత్యంలలో కూడ మానవజాతిలో చెడునే గ్రహించడం మీరు చేస్తుంటారు. మీకు తారసపడే ప్రతి వ్యక్తినీ చెడు చేసే వ్యక్తిగా అనుమానిస్తుంటారు. మానవులవల్ల కీడు జరుగుతుందేమోనని భయపడుతుంటారు. మీ నమ్మకాలను చెడు వైపే ప్రతిక్షణమూ కేంద్రీకరింపజేస్తుంటారు. జీవిత భాగస్వామిని, కుటుంబ సభ్యులను సహద్యోగులను, తన దేశ ప్రజలను అందరినీ 'చెడు'గానే భావిస్తుంటారు. ఆ నమ్మకాల కనుగుణంగా మీ జీవితంలో భౌతిక సంఘటనలు, భౌతిక పరిస్థితులు ఎదురవుతున్నాయి.

ఇక్కడ ఇంకొక ఉదాహరణ తీసుకుందాం! నా జీవితం నిరాశామయం. నేను చేపట్టే ఏపని కూడ అర్థరహితంగా వుంటుంది! అని మీరు బిగుసుకుపోయిన నమ్మకాన్ని ఏర్పరుచుకున్నపుడు అందుకనుగుణంగా మీకు జీవితానుభవాలు ఎదురవుతుంటాయి. అటువంటి స్థితిలో మీకు ఎదురయ్యే ప్రతి సంఘటనలోనూ నిరాశా ధోరణిని కనబరుస్తారు. మీ జీవితాన్ని అర్థహీనంగా భావిస్తూ ఎమోషనల్‌గా ఉద్రేకపడిపోతుంటారు. ఈ ధోరణితో మిమ్మల్ని మీరు మానసికంగా, శారీరకంగా హింసించు కుంటుంటారు. మీ కుటుంబ సభ్యులను, మీతో పరిచయం వున్నవాళ్ళను కూడ మానసికంగా, శారీరకంగా హింస పెడుతుంటారు.

అటువంటి నిరాశ నిస్పృహలతో కూడిన ధోరణిగల మీరు మానసిక శారీరక రుగ్మతలను ఆహ్వానించడమే కాకుండా ఇతరులకు కూడ వాటిని వ్యాప్తి చేస్తుంటారు.

నెగెటివ్ ధోరణిగల ఈ బిగుసుకుపోయిన నమ్మకాలను ఒక పట్టిక రూపంలో వ్రాసుకుని వాటిపట్ల జాగరూకత వహించి పుష్కలమైన అవకాశాలతో కూడిన జీవితం, ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు అనే దృక్పథం లాంటి బలమైన నమ్మకాలను ఏర్పరుచుకుని మీ జీవిత గమనాన్ని మార్చుకోండి. అనేకసార్లు మీ నెగెటివ్ ఆలోచనలను స్మరించుకోవాల్సిన అవసరం లేదు. మీకు ఏమేమి కావాలో, ఏ విధంగా మీ భౌతిక అనుభవాలు వుండాలో, అన్నీ పాజిటివ్‌గా వుండేటట్లు ఆలోచనా ధోరణిని కలిగి వుండండి. మీ బలమైన నమ్మకాలన్నీ పాజిటివ్‌గా వుండేటట్లు చేసుకోండి.

ఒక యువతి తనకు తారసపడే ప్రతి పురుషుడూ తనకు చెడు

తలపెడతాడేమోనని భయపడుతుంటుంది. పురుషజాతి పైన ఆమె అటువంటి బలమైన నమ్మకం ఏర్పరుచుకుంది. ఆమెకు కన్పించే ప్రతి వాడూ మోసం చేస్తాడని, తనకు కీడు చేస్తాడని భయపడుతుంటుంది. ఆమె అనుమానాలు, భయాలు ఆమె జీవితానుభవాలుగా, జీవిత వాస్తవాలుగా ప్రవేశిస్తాయి. అలా కాకుండా ఆమె తనకు తారసపడే ప్రతిమనిషిలో మంచిని మానవత్వాన్ని సంతోషాన్ని ఆనందాన్ని చూడగలిగినట్లయితే వాటికనుగుణంగా మంచితనాన్ని మానవత్వాన్ని ఆనందాన్ని పొందగలుగుతుంది. **మీరు ఏమి సాధించదలుచుకున్నారో దాని పర్యవసానాలు మాత్రమే వస్తాయని నమ్మండి; బలమైన నమ్మకాలు కలిగి వుండండి. మీకు అవసరం లేని వాటి గురించి దృష్టి పెట్టడం మానివెయ్యండి.** మీ జీవితంలో ఏవి పొందాలనుకుంటున్నారో వాటిపైన మీ ఊహాశక్తిని, కలలను, ఆలోచనలను కేంద్రీకరించండి. మీ జీవితంలో ఏ భౌతిక సంఘటనలూ మీ అనుమతి లేకుండా మీకు తారసపడవు. భౌతిక సంఘటనలు, జీవితానుభవాలు ఏ విధంగా, ఎవరి ద్వారా, ఎప్పుడు జరుగుతాయనే విషయాన్ని మీ అంతర్ ప్రపంచానికి వదిలి నిశ్చింతగా వుండండి. మీకు ఏది కావాలో అది మాత్రమే జరుగుతుందని ఆశించండి. మీ అంతర్ ప్రపంచం దాన్ని ఇస్తుందనే బలమైన నమ్మకంతో ఊహించుకోండి. కలలు కనండి.

భౌతిక సంఘటనలు + వాటి పర్యవసాలు = జీవితానుభవాలుగా చెప్పబడతాయి. ఒక వ్యక్తి ధన సముపార్జన జీవిత ధ్యేయంగా భావిస్తాడు. ధన సముపార్జనతోనే జీవితంలో సంతోషం, ఆనందం లభిస్తాయని అతను బలంగా నమ్మకాలను కలిగి వుంటాడు. అతని నమ్మకాలకు అనుగుణంగా అతని జీవితంలో భౌతిక సంఘటనలు ఎదురవుతుంటాయి. వాటి తాలూకు పర్యవసానాలు కూడ అతను అనుభవంలోనికి తెచ్చుకుంటాడు. ఆరోగ్యం, ఆధ్యాత్మిక జీవితపు విలువలు మానవజాతి చైతన్య పరిణామం అనేవి అతని జీవితానుభవాలుగా వుండవు. అతనికి జీవితం అసంపూర్తిగా వెలితిగా వుంటుంది. పర్యవసానంగా దుఃఖం అనేది జీవితానుభవంగా వెంటాడుతుంటుంది. **జీవితానుభవాలలో ఆధ్యాత్మికత కొరవడితే అశాంతి, దుఃఖం మిమ్మల్ని వెంటాడుతుంటాయి. ధనమే సర్వస్వం అని భావించే వ్యక్తికి ఆధ్యాత్మికత అలవడదు.** జంతువును ఒక ఆత్మగా భావించకుండా మాంసపుముద్దలా ట్రీట్ చేసి ప్రయోగాలు చేసే శాస్త్రవేత్త కూడ ఆధ్యాత్మికత, చైతన్యశక్తిని విస్మరిస్తున్నాడు. ఇవన్నీ తప్పుడు నమ్మకాలు. **ఆధ్యాత్మిక జ్ఞానం లేకుండా మానవజాతి ఆనందంగా,**

సుఖశాంతులతో పరిపూర్ణంగా జీవితానుభవాలు పొందడం, చైతన్య పరిణామం చెందడం అసాధ్యం.

బిగుసుకుపోయిన నమ్మకాలను జీవిత సత్యాలుగా భావించడం వలన మీ ఎమోషన్స్ + ఊహాశక్తి అందుకనుగుణంగా పనిచేస్తాయి. ఆ నమ్మకానికి అనుగుణంగా భౌతిక సంఘటనలను ఆకర్షించడం, దానికి అనుగుణంగా రాణించడం జరుగుతుంటుంది. దీనివల్ల ఇతర జీవితానుభవాలకు తలుపులు మూసినట్లవుతుంది. జీవితాన్ని అన్ని కోణాలలో దర్శించి జీవితానుభవాలు పొందేందుకు గల విశాల దృక్పథాన్ని (open mind) మీరు అలవర్చుకోవలసి వుంది. బిగుసుకుపోయిన నమ్మకాలను బ్రద్దలు కొట్టి క్రొత్త ఒరవడితో కూడిన ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవడంతో మీ ఊహాశక్తి + ఎమోషన్స్ చక్కగా పనిచేస్తాయి. అయితే ముందరగా బిగుసుకుపోయిన నమ్మకాలేమిటో మీరు స్పష్టంగా గుర్తించేందుకు మీరు ప్రయత్నం చేయాలి. వాటిని గుర్తించిన తర్వాత ఆ నమ్మకాలను రూపుమాపడం కోసం ఊహాశక్తి + ఎమోషన్స్‌ను మీరు ఆశ్రయించవచ్చు.

పరస్పర విరుద్ధమైన నమ్మకాలు, సంకల్పాలు భౌతిక సంఘటనలను ప్రభావితం చేస్తుంటాయి. ఒకేసారి పరస్పర విరుద్ధమైన ఆలోచనలు, సంకల్పాలు, భయాలు మీ నుండి వెలువడుతుంటాయి. **నేను ఆరోగ్యంగా వుండగలను. నా దేహంలో అపారమైన శక్తి వుంది' అని ఒక వైపు నమ్ముతూ మరో వైపు 'డాక్టర్ల దగ్గరకు వెళ్ళకపోతే వ్యాధులు నయంకావు' అని నమ్ముతుంటారు. ఒకే ఒరలో రెండు కత్తులు ఇమడవు గదా!** ఈ రెండు పరస్పర విరుద్ధమైన నమ్మకాలలో ఏది బలమైనది అయితే అదే భౌతిక సంఘటనగా వాస్తవం చెందుతుంది. ఒక వ్యక్తి తనకు అన్ని విధాలుగా నచ్చిన జీవిత భాగస్వామి దొరుకుతాడని ఒక వైపు నమ్మకం కలిగి వుంటూ మరోవైపు అన్ని విధాలుగా నచ్చిన జీవిత భాగస్వామి దొరకకపోవచ్చుననే సందేహాన్ని కలిగి వుంటాడు. వీటిలో ఏది బలమైనదో అదే భౌతిక సంఘటనగా మీకు ఎదురవుతుంది. రెండవ ఆలోచన బలహీనమైనది కనుక అది దాని శక్తికి అనుసారంగా ఒకానొక డైమన్షన్ గల తలంలో వాస్తవాన్ని పొందుతుంది. మీలో కలిగే పరస్పర విరుద్ధమైన నమ్మకాలు, ఆలోచనలు కూడ మీ జీవితానుభవాలను శాసిస్తుంటాయి.

మీ జీవితంలో ఎదురయ్యే అన్ని సవాళ్ళను, సమస్యలను ఎదుర్కోగల శక్తి, జ్ఞానం మీలోనే ఇమిడి వుందని పదేపదే మీకు గుర్తుచేస్తున్నాను. మీ ఆత్మ మీ దేహానికి మాత్రమే పరిమితంకాక అన్ని దిశలలో వ్యాపించిన మల్టిడైమన్షనల్ ఆత్మ అని మీకు

గుర్తు చేస్తున్నాను. ఇతరులు మీకు అందించే సహాయసహకారాలు మీకు అవసరమే. వాళ్ళు మీ చైతన్య పరిణామంలో మధ్యవర్తులుగా ఉండగలరేగాని బాహ్య ప్రపంచం నుండి ఏ శక్తీ మిమ్మల్ని శాసించడంగాని ప్రభావితం చేయడంగాని చెయ్యదు. మీ అంతర్ ప్రపంచంలో అనంతమైన శక్తి వుందని మీకు తెలియచేస్తున్నాను. మీ వాస్తవాన్ని మీరే సృష్టించుకుంటున్నారని మరోసారి మీకు గుర్తు చేస్తున్నాను.

మీరు కలిగివున్న ఆలోచనలు, సంకల్పాలు, ఆశలు, కోరికలతో మీ దేహం యొక్క ఆరోగ్యం ముడిపడి వుంది. ఉత్తమ లక్ష్యాలను ఎంచుకుని మీరు ఊహించుకోవడం, కలలు గనడం వల్ల మీలో ఉత్తేజం ఉత్సాహం ఆనందం కలిగి మీ దేహం కూడ అందుకు స్పందిస్తుంది. జీవితాన్ని నిస్సారంగా నిరాశాజనకంగా భావించినపుడు దాని కనుగుణంగా దేహం స్పందిస్తుంది. మీ ఆలోచనలకు సంకల్పాలకు అనుగుణంగా దేహం స్పందిస్తుంది. పర్యవసానంగా దేహం స్పందించి కొన్ని జీవరసాయనాలను విడుదల చేసుకుంటుంది. జీవితాన్ని నిస్సారంగా భావించినపుడు దేహం నిస్సత్తువను కలిగి వుండడం మరి జీవితాన్ని అర్థవంతంగా భావించినపుడు దేహం ఉత్తేజంగాను వున్నట్లు మీలో చాల మంది గమనించి వుంటారు. దేహం యొక్క ఆరోగ్యాన్ని మీ అంతర్ ప్రపంచం... అంటే మీ మైండ్ నియంత్రిస్తుంటుంది. మీ భయాలు సందేహాలు అడ్డు తగలకపోతే దేహం యొక్క సహజ సిద్ధమైన ఆరోగ్యాన్నీ మీ మైండ్ నియంత్రిస్తుంటుంది. త్రీ డైమన్షనల్ తలంగల ఈ భౌతిక ప్రపంచంలో మీ జయాపజయాలు మరి మీ దేహ ఆరోగ్యం ఒక దానిపై ఒకటి పరస్పరం ఆధారపడి వున్నాయి.

దేహాన్ని ఒక మాంసపు ముద్దలా కాకుండా ఆత్మశక్తి తో నిండిన భౌతిక పదార్థంతో తయారైన వాహనంగా మీరు గుర్తించాలి. చైతన్యశక్తితో నిండిన భౌతిక వాస్తవమే మీరు ధరించిన దేహం. జంతువుల దేహాలను కూడ మీరు అలాగే గుర్తించాలి. అలా గుర్తించగలిగి నపుడు వైద్య శాస్త్ర పరిశోధనలకోసం జంతువులను ప్రయోగశాలల్లో హింసించడం చెయ్యలేరు. త్రీ డైమన్షనల్ తలంలో చైతన్య పరిణామం చెందడం కోసం మీలాగే జంతుజాతి మరి ఇతర జీవజాతులు కూడా దేహాలను ధరిస్తున్నాయి. ఒక జంతువును చంపడమంటే మీ చైతన్యపరిణామాన్ని ఆటంక పరుస్తున్నారని మీరు తెలుసుకోవాలి. కొన్ని సందర్భాలలో అబద్ధమాడడం నేరం కాదు. ఒక శాస్త్ర పరిశోధన నేరం కాదు. చర్చికో, గుడికో వెళ్ళకపోవడం నేరంగాదు. **కాని మీ దేహానికి గాని, ఇతర జీవజాతుల దేహాలకుగాని హాని తలపెట్టడం పెద్ద నేరం! మీ ఆత్మ చైతన్య పరిణామానికి,**

ఇతర జీవజాతుల చైతన్య పరిణామానికి అడ్డుతగలడం పెద్ద నేరం. ఏ మనిషిని గాని, ఏ ఇతర జీవజాతులనుగాని చంపడం పెద్దనేరం. మీ ఆత్మ సంరక్షణలో భాగంగా ఏ ఇతర మనిషిని, ప్రాణిని చంపడం పెద్ద నేరం. మీరడగవచ్చు ఆత్మరక్షణలో తననుతాను కాపాడుకోవడం కోసం ఇతర మనిషిని, ప్రాణిని చంపడం ఎలా నేరమవుతుందని? కాని అది ముమ్మాటికీ నేరమే! తన ఆత్మరక్షణకు వేరే మార్గాలున్నాయి. మానసికంగా, ఆధ్యాత్మకంగా అనేక మార్గాలున్నాయి. తనపై దాడి జరుగుతుందనే భయం లేదా నమ్మకం మీపై దాడి జరిగేటట్లు వాస్తవాన్ని సృష్టించుకుంటున్నారు. భౌతిక వాస్తవంలో వున్న మెకానిజమ్ మీకు అర్థమయితే మీ పై దాడి జరిగే ప్రశ్న తలెత్తదు.

భౌతిక తలంలో చైతన్య పరిణామం చెందుతూ మీ జ్ఞాన పరిధిని విస్తరింపజేసుకోవడానికి ఈ భూమి మీదకు రావడం జరిగింది. మీ జీవితాన్ని ఒక సాహసంగా ఒక పరిశోధనగా భావించండి. ఆత్మ జ్ఞాన సముపార్జనకు సాహసవంతులే అత్యంత సమర్థులు. అంతర్ ప్రయాణం, ఆత్మశక్తిపై అంటే అంతర్ ప్రపంచంపై పరిశోధన, చైతన్య పరిణామం చెందడం ఆధ్యాత్మకతను పెంచుకోవడం లాంటివన్నీ ఈ భూమి మీద అత్యంత సాహసోపేత కార్యాలు. జీవితాన్ని సాహసంగా తీసుకోలేని వ్యక్తికి దేహ ఆరోగ్యం కూడ అంతంత మాత్రమే వుంటుంది. **దేహానికిగల స్వతఃసిద్ధ ఆరోగ్య రక్షణ వ్యవస్థ – మీరు జీవితాన్ని సాహసంగా తీసుకున్నపుడు చాలా పటిష్టంగా వుంటుంది. కేవలం సాహసవంతులే తమ జీవితాలలో ఆనందాన్ని నింపుకోవడమే గాకుండా ఇతరుల జీవితాలలో కూడ ఆనందాన్ని నింపగలుగుతారు. జీవితాన్ని ఒక సాహసంగా భావించేవాళ్ళు మాత్రమే ఇతర జీవజాతులను చైతన్యశక్తితో నిండిన ఆత్మలుగా భావిస్తారు.**

జంతుజాతి చైతన్య పరిణామం చెందడంలో భాగంగా ఒక జాతి జంతువు ఇంకొక జాతి జంతువును చంపి తినివేయడం జరుగుతుంది. ఈ ప్రక్రియ ప్రకృతి సమతౌల్యంలో ఒక భాగం. కాని మానవజాతి చైతన్య పరిణామంలో ఒక ప్రాణిని చంపడమంటే మీ చైతన్య పరిణామాన్ని చంపుకోవడమేనని మీకు తెలియబరుస్తున్నాను. జీవితం యొక్క విశిష్టతను గుర్తించడం, మీ దేహాన్ని ఇతర ప్రాణుల దేహాలను ఆత్మను ధరించిన వాహనాలుగా గుర్తించడం, ఆత్మజ్ఞానాన్ని ఆచరణలో పెట్టడానికి ఉపక్రమించడం జీవితాన్ని ఒక సాహసంగా స్వీకరించడం చెయ్యగలిగితే– వివేక రహితంగా యుద్ధాలు చేసుకోవడం, ఒకరినొకరు చంపుకోవడం, ఒకరినొకరు ద్వేషించుకోవడం మీ మానవజాతికి ఉండేవి కావు. **జీవితాన్ని హీనంగా అర్థవిహీనంగా భావించేవాడికే ద్వేషం,**

దుఃఖం, నిరాశ ఆవహిస్తున్నాయి. అటువంటి వాడికి తన దేహం పట్ల కూడ హీనభావం వుంటుంది. ఇతర జీవాత్మల దేహాలను కూడా అలాగే చూస్తాడు. దానికి తగినట్లు అతని దేహ ఆరోగ్య రక్షణ వ్యవస్థ కూడా ప్రతిస్పందిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధులు అటువంటి ధోరణి గల వాళ్ళకే సంక్రమిస్తుంటాయి.

ఏ జంతువు కూడా తన ఆహార అవసరానికి మించి ఇతర జంతువులను విచక్షణా రహితంగా చంపడం జరగడం లేదు. ప్రకృతి ధర్మాన్ని జంతువులు తు.చ తప్పకుండా పాటిస్తున్నాయి. జీవాత్మల చైతన్య పరిణామంలో జంతువులు వాటి జనాభాను అవే నియంత్రించుకుంటున్నాయి. పిల్లి – ఎలుక ఒకే రకానికి చెందిన చైతన్య పరిణామాన్ని చెందుతున్నాయి. జంతువులకు ఏ సందేశాలు ఇవ్వనవసరం లేదు. అవి స్వభావసిద్ధంగా ప్రకృతి ధర్మాన్ని నెరవేరుస్తున్నాయి.

హింసకు హింస సమాధానమని మీరు భావించవచ్చు. కాని అది ఎంత మాత్రం సత్యం కాదు. హింస అనే ప్రక్రియలో దేహం + మైండ్ + అంతర్ శక్తి + చైతన్యశక్తి ప్రభావితమవుతున్నాయి. హింస అనేది భూమి + జీవజాతుల చైతన్య పరిణామాన్ని ప్రభావితం చేస్తుంది. యుద్ధాలు, జాతి వైషమ్యాలు, ప్రాంతీయ దురభిమానాలు అన్నీ కూడా ప్రకృతి చైతన్య పరిణామ ధర్మానికి విరుద్ధం. **భూమి మీద మానవజాతి అంతా 'వసుధైక కుటుంబకమ్'లాగ వుంటూ చైతన్య వికాసం చెందాలి! ప్రకృతే మీరు, మీరే ప్రకృతి. హింసకు హింస, ద్వేషానికి ద్వేషం సమాధానం కావు. యుద్ధాలలో ఒక జాతి జనులు చంపబడితే, చంపిన వాళ్ళు కూడా ఇంకో సందర్భంలో చంపబడతారు. ప్రకృతికి, జీవితానికి, భూమికి వ్యతిరేకంగా హింసకు పాల్పడడం అతి పెద్ద నేరం!**

మీ దేహంలోని వైరస్‌లు, బాక్టీరియా క్రిములు కూడ ప్రకృతి చైతన్య ధర్మాన్ని పాటిస్తున్నాయి. వైరస్‌లు, బాక్టీరియాలు విచక్షణా రహితంగా మీ దేహంలోని జీవకణాలను చంపుకుంటూపోతే మీ దేహాలు ఎప్పుడో విచ్ఛిన్నమై వుండేవి. క్రోమోజోమ్‌ల సంఖ్య లేదా జీవకణాల సంఖ్య లేదా మీ రక్త కణాల సంఖ్య ఒక క్రమమైన లెక్క ప్రకారమే మీ దేహంలో వుంటున్నాయి. వాటి సంఖ్యను గతి తప్పకుండా మీ అంతర్‌శక్తి నియంత్రిస్తుంటుంది. జీవజాతులన్నీ వాటి అంతర్ చైతన్యశక్తి ద్వారా కనెక్టు కాబడి వున్నాయి. ఒక జంతు జాతి జనాభా విపరీతంగా పెరుగుతూన్నపుడు వాటిని నియంత్రించడానికి మిగతా జంతువులు వాటిని సంహరించడం చేస్తాయి. భూభౌతిక ప్రపంచంలో జంతుజాతులు ఎట్టి పరిస్థితులలోనూ తమ హద్దులు మీరవు. వాటి చైతన్య

పరిణామం చాల సహజంగా సవ్యంగా సాగుతూంది. మానవజాతి తన చైతన్య పరిణామానికి సరియైన రీతిలో బాధ్యత వహించడంలో విఫలమవుతూంది. దాని ఫలితంగా మీ మానవజాతి అనేక రకాల సమస్యల నెదుర్కొంటూంది. ప్రస్తుత ఈ తరుణంలో అధిక జనాభాను నియంత్రించుకోవడానికి వ్యాధులు, యుద్ధాలు, ప్రకృతి బీభత్సాలలో ఏదో ఒక దానిని ఆశ్రయిస్తున్నారు.

భౌతిక సంఘటనలకూ జీవితానుభవాలకూ మీ దేహానికి విడదీయరాని సంబంధముంది. దేహం యొక్క ఆరోగ్యాన్ని కాపాడు కోవడంలో ఏ డైనమిక్స్ అయితే ఇమిడి వున్నాయో అవే మీ భౌతిక సంఘటనల సృష్టిలో కూడా ఇమిడి వున్నాయి. మీ సంకల్పశక్తి, ఊహాశక్తి, కోరికలు, ఎమోషన్స్, ఫీలింగ్స్ అనేవి భౌతిక సంఘటనలను సృష్టిస్తున్నట్లే, మీ దేహ ఆరోగ్య రక్షణ వ్యవస్థనూ సృష్టిస్తున్నాయి. అంతర్‌శక్తి ద్వారా రూపాంతరం చెందుతున్న సంకల్పాలు, ఊహాశక్తి... భౌతిక పదార్థంలో ముడిపడిన భౌతిక సంఘటనలుగా రూపొందడంలో మీ మెదడు (brain) క్రియాశీల పాత్రను పోషిస్తుంది. విద్యుదయస్కాంత తరంగాలను ధ్వని + దృశ్య రూపంలోనికి చూపించడానికి మీ ఇంటిలో T.V ఎలా వ్యవహరిస్తుందో అదే మాదిరిగా అంతర్‌శక్తిని భౌతిక సంఘటనలుగా మలచడంలో మీ మెదడు అదే విధంగా వ్యవహరిస్తుంది.

దేహం అంటే ఒక పనిముట్టు కాదు, ఒక మాంసపు ముద్ద కాదు, దేహం అంటే ఆత్మను ధరించి వున్న ఒక వాహనం. దేహం అంటే మాంసపు ముద్దలో దాగి వుండే చైతన్య పదార్థం మరి ఆత్మ పదార్థం. మీరు జాగృదావస్థలో కలిగివున్న నమ్మకాలు, అభిప్రాయాలు, సంకల్పాలు, ఎమోషన్స్– దేహం యొక్క ఆరోగ్యాన్ని ప్రతిక్షణమూ ప్రభావితం చేస్తుంటాయి. దేహం యొక్క విశిష్టతను విస్మరించి మీరు ఆధ్యాత్మికతను పొందలేరు. మీ పరిభాషలో చెప్పాలంటే దేహం అనేది సజీవంగా కదులుతున్న ఆత్మ అని అర్థం. ఆత్మ ఏ స్వరూపంలోనైనా ఉండగలదు. కొన్ని సందర్భాలలో దేహాన్ని ధరించి వుంటుంది. కొన్ని సందర్భాలలో శక్తి స్వరూపంలోనే వుంటుంది. దేహం నిరంతరమూ తనని తాను హీలింగ్ చేసుకుంటుంది. బాహ్యంగా ఏ మందులూ ఏ సహాయమూ దేహానికి అవసరం లేదు. మరో విధంగా చెప్పాలంటే ఆత్మను ధరించి వున్న దేహం తనను తాను నయం చేసుకోగల అపారమైన శక్తిని కలిగివుంది.

మీ దేహంలో గల పరమాణువులు, అణువులు కలసి ఒక జీవకణంగా తయారవుతాయి. ఒక గ్రూపు పరమాణువులు లేదా అణువులు ఒక జీవకణంగా

వుంటాయి. అన్ని పరమాణువులకూ చైతన్య పరిణామం చెందడం కోసం వాటికి వ్యక్తిగత లక్ష్యాలు వుంటాయి. మీ దేహాన్ని ఆత్మ విడిచి పెట్టినపుడు ఈ పరమాణువులు అణువులు ఇతర దేహాలలోనికి ప్రవేశించి పరిణామం చెందుతుంటాయి. మీ దేహంలో ఇమిడివున్న పరమాణువులను, అణువులను, మీ దేహాన్ని, మీ మైండ్‌నూ – అన్నింటినీ మీ అంతర్‌శక్తి నడిపిస్తుంటుంది. ఇవన్నీ మీ అంతర్‌శక్తి చేత అనుసంధానింపబడి ఒక సమిష్టి లక్ష్యం వైపు చైతన్య పరిణామం చెందుతుంటాయి. ఒక మల్లెపువ్వు లేదా ఒక రోజాపువ్వును ఏ చైతన్యశక్తి నడిపిస్తుందో అదే శక్తి మీ దేహాన్ని కూడా నడిపిస్తుంటుంది.

మీ కళ్ళకు దేహం ఘనపదార్థంగా ఎంత యదార్థమో, మీ ఆలోచనలు + సంకల్పాలు కూడా అంతే యదార్థం. మీ అంతరేంద్రియాలకు మీ ఆలోచనలు స్పష్టంగా కన్పిస్తాయి. మీ తల మీద వెంట్రుకలు ఎంత సహజంగా పరిణామం చెందుతున్నాయో అంతే సహజంగా మీ ఆలోచనలు పరిణామం చెందుతున్నాయి. మీ ఆలోచనల పట్ల మీరు నిత్య జాగ్రత్తస్థితిలో లేకపోవడం వల్ల మీ జీవితంలో తారసపడే సవాళ్ళను సమస్యలుగా భావిస్తున్నారు. మీ దేహంలోని చైతన్యశక్తి స్వతహాగా గైడింగ్ సిస్టమ్ (guiding system)ను కలిగి వుంది. భూభౌతిక ప్రపంచంలో ఎటువంటి సవాళ్ళనైనా మీ దేహం అవలీలగా అధిగమించగలదు. వైరస్‌లు మీ దేహంలో ప్రవహిస్తున్నట్లుగానే మీ ఆలోచనా తరంగాలు కూడా ఈ విశ్వమంతా ప్రవహిస్తున్నాయి. మీ ఆలోచనా తరంగాలు మీ దేహాన్ని ప్రభావితం చేస్తాయి.

కొన్ని వైరస్‌లు మీ దేహానికి మేలు చేస్తున్నట్లుగానే మీ ఆలోచనల యొక్క విద్యుదయస్కాంతశక్తి మీ దేహానికి మేలు చేస్తుంది. మీ దేహంలో ప్రతి క్షణమూ అతి భయంకరమైన వైరస్‌లు నివసిస్తున్నాయి. కాని మీ సంకల్పశక్తి, జీవించాలనే ఇచ్ఛాశక్తి వల్ల ఆ వైరస్‌లు మీ దేహాన్ని ముట్టడించలేకపోతున్నాయి. ఈ వైరస్‌లను మీ వైద్య శాస్త్రజ్ఞులు కాని, మీ శాస్త్ర పరికరాలుగాని ప్రస్తుతం పసిగట్టగల స్థితిలో లేవు. మీ ఆలోచనా తరంగాల స్థితి + స్వభావం ఆధారంగా ఆ వైరస్‌లు మీ దేహానికి వుపయోగకరంగానో లేదా వినాశకరంగానో పని చేస్తుంటాయి. ఎయిడ్స్ (AIDS), క్యాన్సరు (Cancer)తో సహా ఏ వ్యాధినైనా నయం చేసుకోగల శక్తి స్వతహాగా మీ దేహానికి వుంది. ఎయిడ్స్ (AIDS) గురించి ప్రత్యేకంగా నేను ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే మీ మానవజాతి దాని పట్ల చాలా భయాన్ని, సందేహాన్ని కలిగి వుంది.

మీ అనుమతి అంగీకారం లేకుండా మీకు మరణం సంభవించదు. ఏ వ్యాధియైనా సంక్రమించిందంటే అది మీ భయం వల్లనో, మీ అనుమతితోనో సంక్రమించి వుంటుంది తప్ప యాదృచ్ఛికంగా ఏదీ జరగదు. నేను మిమ్మల్ని డాక్టర్ల వద్దకు వెళ్ళవద్దని ఆదేశించడం లేదు కాని వాళ్ళు ఇచ్చే మందులు చికిత్సా విధానం మీ దేహానికి ఏ మాత్రం సరిపడవు. పశ్చిమ దేశాలలో అభివృద్ధి చెందిన వైద్య విధానం + మందులు దేహం యొక్క సహజత్వాన్ని దెబ్బతీస్తున్నాయి. భూమి నుండి నేరుగా లభించే మందులనే వాడడానికి ప్రయత్నించండి. ఒక వ్యాధి కోసం మీ డాక్టర్లు ఇచ్చే మందులు ఇంకో వ్యాధిని కలుగ జేస్తున్నాయి. మీ దేహంలో ఎటువంటి వ్యాధినైనా నయం చేయగల శక్తిని మీ ఆలోచనా తరంగాలు కలిగి వున్నాయి. మీ దేహంలోని భయంకరమైన వైరస్‌లను చంపగల శక్తి మీ ఆలోచనా తరంగాలకు వుంది. మీ దేహంలో జబ్బు చేసిన భాగం వైపు మీ సంకల్పశక్తిని ఆలోచనా తరంగాలను కేంద్రీకరింప జెయ్యండి. మీ ఆలోచనలు + సంకల్పశక్తి మీ దేహంలో జీవరసాయనిక చర్యలు జరిపి అక్కడ వున్న భయంకరమైన వైరస్‌లను చంపి స్వస్థత చేకూరుస్తాయి. మీ ఆలోచనలు విద్యుదయస్కాంత శక్తిని కలిగి వున్నాయని మరవవద్దు. విద్యుదయస్కాంత శక్తి మీ జీవకణాల యొక్క చైతన్యశక్తిని ప్రభావితం చేస్తాయని గుర్తుంచుకోండి.

ఆధ్యాత్మిక, మానసిక, భౌతిక వాస్తవాల మధ్య భేదాలేమీ లేవు. ఈ మూడు వాస్తవాలు ఒక్కటే. వీటిలో భేదాలున్నట్లు మీకు అన్పిస్తే మాంసపిండంలో ఇమిడివున్న ఆత్మ గురించి కాని, మీ ఆలోచనా శక్తికి గల భౌతిక వాస్తవంగాని మీకు ఇంకా అర్థం కాలేదని భావం. మరణం తర్వాత దేహాన్ని విడిచిపెట్టడం మళ్ళీ ఇతర దేహాలతో పునర్జన్మలు తీసుకోవడం చాల సహజమైన క్రియ. మీ ఆలోచనలు మీ నుండి వెలువడి భౌతిక వాస్తవం చెందడం లేదా వాటి శక్తికి అనుగుణంగా వేరే తలాలలో వాస్తవం చెందడం కూడ చాల సహజమైన క్రియలు. ఈ ఆత్మ ఇతర సంభావ్య ఆత్మలుగా ఇతర డైమన్షన్స్‌లో దేహాలను ధరించి పరిణామం చెందడం కూడ చాల సహజమైన క్రియయే. మీ మనోశక్తి నుండి వెలువడిన ఆలోచనా తరంగాలు ప్రకృతి సహజమైనవే. అవి ఈ ప్రకృతిలో ఒక భాగం. మరణం తర్వాత మరి జన్మ తీసుకోక మునుపూ, ప్రస్తుతం ఈ తరుణంలో అన్ని వేళలా జీవితం కొనసాగుతుందనేది చాల సహజమైన క్రియ. ప్రకృతి ప్రకృతిలోనే ఇమిడివుంటూ చైతన్య పరిణామం చెందుతూంది. మీరు మీ లోనే వుంటూ చైతన్య పరిణామం చెందుతున్నారు.

చైతన్యశక్తి మీ దేహమంతా ఆవరించి వుంది. దేహమంతా ఆత్మశక్తితో నిండి వుంది. మీ దేహంలోని ప్రతి జీవకణమూ మనోశక్తిని కలిగి వుంటుంది. ప్రతి జీవకణమూ ఒక చిన్ని మెదడువలె ప్రవర్తిస్తుంది. జ్ఞానం అనేది ప్రతి జీవకణంలోనూ నిక్షిప్తపరచబడి వుంది. జీవకణం చైతన్య పరిణామం చెందుతూ ఇతర జీవకణాలకు కూడ సహకారాన్ని అందిస్తుంటుంది. ప్రతి జీవకణమూ తన వ్యక్తిత్వాన్ని, విశిష్టతను కాపాడుకుంటూ చైతన్య పరిణామం చెందుతూంటుంది. మీ దేహంలో క్షణకాలంలో ఎన్నో జీవకణాలు మృతి చెందుతూ వాటి స్థానంలో క్రొత్త జీవకణాలు నింప బడుతూంటాయి.

మీ దేహం ఒక పెద్ద జీవకణంగా ఊహించుకోండి ఆ జీవకణంతోబాటు కోట్ల జీవకణాలు ఒక పెద్ద దేహంలో వుంటూ పరిణామం చెందుతున్నట్లు ఊహించుకోండి. పెద్ద దేహానికి ఒక ఆత్మ ఉందని కూడ ఊహించుకోండి. పెద్ద దేహంలో ఒక జీవకణంగా పరిణామం చెందుతూన్న మీకూ ఒక ఆత్మ వుంది. అట్లే ఇతర జీవకణాలు కూడ ఆత్మలు కలిగివున్నాయి. ప్రతి జీవకణం తన విశిష్టతను, వ్యక్తిత్వాన్ని కోల్పోవడం లేదు. పెద్ద దేహంలో ఇమిడి వున్న ఆత్మలో ఈ జీవకణాల ఆత్మలన్నీ ఇమిడి వున్నాయి. పెద్ద దేహంలో వున్న ఆత్మ పూర్ణాత్మ అయితే, జీవకణాలలో వున్న ఆత్మలన్నీ అంశాత్మలు. ఇక్కడ జీవకణం వేరుకాదు. దేహం వేరుకాదు. రెండూ ఒకటే. అట్లే అంశాత్మ, పూర్ణాత్మ రెండూ ఒకటే. కాని దేని వ్యక్తిత్వం, విశిష్టత దానివే. దేహంలోని జీవకణం తన స్వతంత్రతను, ఉనికిని కోల్పోకుండా ఇతర జీవకణాలు + దేహానికి సహకారం అందిస్తూ చైతన్య పరిణామం చెందుతూంది. అంశాత్మలు కూడ తమ ఉనికిని, స్వతంత్రతను విశిష్టతను కోల్పోకుండా తాము చైతన్య పరిణామం చెందుతూ పూర్ణాత్మ చైతన్య పరిణామాన్ని పెంచుతున్నాయి. దేహంలో క్షణకాలంలో ఎన్నో జీవకణాలు మృతి చెందుతుంటాయి. మళ్ళీ క్రొత్త జీవకణాలు పుడుతుంటాయి. అంశాత్మలు జనన మరణ చట్రంలో పరిణామం చెందుతూ వుంటాయి. పూర్ణాత్మ మటుకు పెద్ద దేహంలాగ ఎప్పటికీ పరిణామ వ్యాకోచం చెందుతూ వుంటుంది. మీ దేహంలోని జీవకణాల మాదిరిగా మానవజాతి + ఇతర జీవజాతులు భూమి అనే పెద్ద దేహంలో ఇమిడి వున్నారు. మానవజాతి + ఇతర జాతుల మధ్య సహకారంతో చైతన్య పరిణామం భూమి అనే ఆత్మ చైతన్య పరిణామాన్ని పెంచుతుంది. మీ దేహంలో కోట్ల ఎలక్ట్రానులు, పరమాణువులు, అణువులు, వైరస్‌లు అన్నీ కలిసి దేహాన్ని నిలిపి వుంచుతున్నాయి. అట్లే మానవజాతి + జీవజాతులు, రాళ్ళు, పర్వతాలు, నదులు, సముద్రాలు అన్నీ భూమి అనే దేహాన్ని నిలిపి వుంచుతున్నాయి.

మీ అంతర్ ప్రపంచంలో మీకు తెలియని అనంతమైన శక్తి సామర్థ్యాలను కలిగి వున్నారు. ఎంతో స్పృహలో వుండి, ఎరుకతో ఫలానా రంగంలో లేదా ఫలానా కళలో రాణించాలని మీరు సంకల్పించుకున్నపుడు మీ అంతర్‌శక్తి అటువైపు కేంద్రీకరింపబడుతుంది. మీకిప్పటి వరకు డ్రాయింగ్ అనే కళ తెలియదు. డ్రాయింగ్ గురించిన జ్ఞానం మీ దగ్గర ప్రస్తుతం లేకపోవచ్చు. కాని ఎప్పుడైతే మీరు డ్రాయింగ్‌ను నేర్చుకోవాలని నిశ్చయించుకుని సంకల్పశక్తిని + ఊహాశక్తిని అటువైపు కేంద్రీకరింపజేశారో ఆ క్షణం నుండే మీ అంతర్ ప్రపంచానికి సంబంధించిన డైనమిక్స్ కార్యరూపం ధరిస్తాయి. 'నేను ఫలానా కళ నేర్చుకోవాలి. ఫలానా రంగంలో జ్ఞానం సంపాదించాలి.' అని ఒక చిన్న సంకల్పం లేదా కోరిక మీ అంతర్‌శక్తిలో కదిలికను కలుగజేసి భౌతిక వాస్తవం వైపు ఉపక్రమించేటట్లు చేస్తుంది.

ఈ వర్తమానంలో మీ జీవితపు పరిస్థితులు, మీ ఆరోగ్యం ఎలాగైనా వుండవచ్చు కాని వాటిని మీరు తీసుకున్న నిర్ణయం లేదా సంకల్పం వైపు మళ్ళించవచ్చు. మీరు ఎంచుకున్న సంకల్పం లేదా నిర్ణయం భౌతిక వాస్తవంగా సృష్టింపబడేందుకు ఈ భూప్రపంచంలో అనంతమైన సంభావ్యతలు కలిగి వున్నాయి. మీ జీవితం యొక్క దిశను ఎంతో ఎరుకతో వుండి మీ నిర్ణయాలు సంకల్పాల ద్వారా ప్రతి క్షణమూ నిర్దేశించవలసి వుంది. 'నేను జీవితం నిర్దేశించిన అవకాశాల దిశలో ప్రయాణిస్తాను'. 'జీవితంలో ఎటు ప్రయాణించాలో తెలియనటువంటి అశక్తుణ్ణి' లాంటివన్నీ కూడ మీరు తీసుకుంటూన్న నిర్ణయాలే. ప్రతి క్షణమూ మీ జీవిత దిశను మార్చుకోవడానికి అనంతమైన అవకాశాలు ఎదురు చూస్తుంటాయి. ఒక్కసారి మీరు నిర్ణయం తీసుకుని సంకల్పించుకున్న తర్వాత మీ అంతర్ శక్తి మీ భౌతికానుభవాల వైపు ప్రవహించి భౌతిక వాస్తవాన్ని రూపొందిస్తుంది.

భూభౌతిక ప్రపంచంలో మీకు మీరే కొన్ని నైతిక విలువలను ఆపాదించుకుని ఆ చట్రంలో ఎన్నో పరిమితులకు లోబడి బ్రతుకీడుస్తుంటారు. యౌవ్వనం మాత్రమే చాల అద్భుతమైన జీవితమని, వృద్ధాప్యం ఒక శాపమనీ, పేదరికం ఆధ్యాత్మికతకు దగ్గరి దారియని కొన్ని నమ్మకాలతో కూడిన విలువలను మీకు మీరే ఆపాదించుకుంటారు. ఆధ్యాత్మికత యౌవ్వనంలో అవసరం లేదు. వృద్ధాప్యంలో మాత్రమే అవసరమవుతుందని మీలో చాలా మంది నమ్ముతున్నారు. అమెరికాలో పుట్టడం చాల అదృష్టమని, ఆఫ్రికా దేశంలో లేదా సోమాలియా దేశంలో పుట్టడం శాపమనీ, మీరు భావిస్తూ వుండవచ్చు. ఇవన్నీ మీ పరిమిత జ్ఞానంతో ఏర్పరుచుకున్న నమ్మకాలే. వాటితోబాటే కొన్ని నైతిక

విలువలను పాటిస్తున్నామని భ్రమలో మునిగి తేలుతున్నారు. ఇవన్నీ మీ వాస్తవాన్ని కప్పిపుచ్చే ముసుగులు మాత్రమే. జీవితంలో యౌవ్వనం, వృద్ధాప్యంతో బాటు అన్ని దశలూ చైతన్య పరిణామంలో ఎంతో ప్రాముఖ్యతను కలిగి వున్నాయి. అమెరికాలో పుట్టినా, ఆఫ్రికాలో పుట్టినా లేదా మరే దేశంలో పుట్టినా భూమి ఒక్కటే. భూమి చైతన్య పరిణామం ఒక్కటే. జన్మ తీసుకోక మునుపే మీ చైతన్య పరిణామానికి అనువైన ప్రదేశాన్ని లేదా దేశాన్ని ఎంచుకుని సంకల్పించడం జరుగుతూంది. మానసికంగా, భౌతికంగా, ఆధ్యాత్మికంగా భూమి మీద అన్ని దేశాలు లేదా అన్ని ప్రాంతాలు ఒకే స్థితిని కలిగివున్నాయి. మీ జీవితం యొక్క అన్ని దశలను గుర్తించడంలో మీ శాస్త్రజ్ఞులు విఫలమైనారు. జీవితాన్ని చైతన్య పరిణామాన్ని అధ్యయనం చెయ్యడానికి ప్రాపంచికంగా ఏర్పరుచుకునే ప్రామాణికతలు సరియైనవి కావు. ఆధ్యాత్మిక ప్రామాణికతలను ఆశ్రయించవలసి వుంది.

వృద్ధాప్యంలో వున్న వారిని దుర్బలురుగా ఎందుకూ పనికిరాని వారిగా మీ సమాజం ట్రీట్ చేస్తూంది. దానికనుగుణంగా వారు కూడ నమ్మక వ్యవస్థను ఏర్పరుచుకుని దయనీయమైన జీవితాన్ని గడుపుతున్నారు. దురదృష్టవశాత్తు వాళ్ళను సరియైన రీతిలో గైడ్ చెయ్యగలిగే ఆధ్యాత్మిక గురువులు మీ భూమి మీద లేరు. వృద్ధాప్యంలో వున్నవారిని నిరాదరణతో చూడడం చులకనతో చూడడం మీ అజ్ఞానం వల్లనే జరుగుతూంది. ఆధ్యాత్మికంగా, మానసికంగా అత్యున్నతంగా రాణించడానికి వృద్ధాప్యంలో దేహం ప్రత్యేమైన హార్మోనులను, ఎంజైములను విడుదల చేసుకుంటుంది. మీ మానవజాతి ఏర్పరుచుకున్న నమ్మక వ్యవస్థవల్ల వార్ధక్యంలో పొందవలసిన ఆనందం, ఆధ్యాత్మిక పరిణామాన్ని మిస్సవుతున్నారు. చైతన్య పరిణామంలో వార్ధక్యం యొక్క విశిష్టతను గుర్తించగల విశాల దృక్పథాన్ని ప్రస్తుతాన్ని పెంపొందించుకోవల్సి వుంది. మీ రెంతసేపూ కాలం – దూరం అనే కాన్సెప్ట్ (concept) తో కూడిన చట్రంలో బిగుసుకుపోయి వున్నారు. జీవితం అంటే నెలలు, సంవత్సరాలు అని మాత్రమే లెక్కిస్తున్నారు. ఆత్మశక్తి + చైతన్య పరిణామం అనే కాన్సెప్ట్‌తో జీవితాన్ని గుర్తించడం నేర్చుకోవాలి. ఈ జీవితం వున్నదే జ్ఞాన సముపార్జన కోసం, ఆధ్యాత్మిక చైతన్య పరిణామం కోసం.

వృద్ధాప్యంలో వున్న వారిని చాలా గౌరవంగా చాలా జాగ్రత్తగా చూడడం మరి వాళ్ళ నుండి జ్ఞానాన్ని సంగ్రహించడం మీరు తక్షణమే చేపట్టవలసిన అవసరముంది. వాళ్లను చిన్నచూపు చూడడమనేది మీ మానసిక అపరిపక్వతను సూచిస్తుంది. గతించిన నాగరికతలలో వృద్ధాప్యంలో వున్నవారిని చాల జాగ్రత్తగా చూసుకునేవారు, వాళ్ళ నుండి

జ్ఞానాన్ని తీసుకునే వారు. మైండ్ + దేహం + చైతన్యశక్తి చక్కగా పరిణామం చెందేది వృద్ధాప్యంలోనే, మీ నమ్మకాలు, మీ జీవిత విలువలు అంతా కూడ 'వయస్సు' అనే కాన్సెప్ట్ మీద నడుస్తున్నాయి. యుక్త వయస్సులోనే వృద్ధాప్యం గురించి, మృత్యువు గురించి భయపడడం నేర్చుకుంటున్నారు. వృద్ధాప్యంలో దేహం తన శక్తిని కోల్పోతుందని, చూపు మందగిస్తుందని, చెవులు వినికిడి శక్తిని కోల్పోతాయని, సమాజం చేత చిన్న చూపు చూడబడతామని ముందుగా మీ మైండ్‌లో ఊహించుకుని హిప్నటైజ్ చేసుకుంటున్నారు. దానికి అనుగుణంగానే మీ భౌతిక వాస్తవం సృష్టింపబడుతూంది.

యౌవ్వనం, కౌమారం మాత్రమే జీవితంలో విజయం + ఆనందం + జీవితానుభవాలు వుంటాయని మీరు భావిస్తున్నారు. ఆ నమ్మకానికి అనుగుణంగా మీ జీవితంలో కొన్ని సంవత్సరాల పాటు మాత్రమే ఉత్పాదకత కలిగి వుంటున్నారు. కొన్ని సంవత్సరాలు మాత్రమే మీరు చురుకుగా వుంటున్నారు. ఆ తర్వాత మీ నమ్మకాల వల్ల మీ దేహం తన శక్తిని కోల్పోవడం జరుగుతూంది. మరి మీ మనోశక్తికి గల అసాధారణ శక్తిని వుపయోగించుకోలేకపోతున్నారు. రిటైర్మెంట్ వయస్సు వచ్చిందంటే జీవితంలో ఇంకేమీ మిగిలి లేదని నిశ్చయించుకుని దైన్యంగా మరి భయంతో మృత్యువు కోసం ఎదురు చూడడమేనని మీరు భావన ఏర్పరుచుకున్నారు. మీ పాశ్చాత్యదేశాల ఆలోచనాధోరణి అంతా యౌవ్వనం + కౌమారం పై కేంద్రీకరింపబడి వుంది. వాళ్ళ విద్యావిధానం కూడ దానికనుగుణంగా వుంది. అది చాల అసమగ్రమైన విధానం. శాస్త్ర ఆవిష్కరణలు, మరి జీవితానుభవాలు ఆ దశలలో మాత్రమే సంభవిస్తున్నాయి. తర్వాత వృద్ధాప్యం యొక్క సాటిలేని శక్తి సామర్థ్యాలను, జ్ఞాన సముపార్జనకు గల అవకాశాలను విస్మరించడం వల్ల చాల చాల గొప్ప అవకాశాన్ని పోగొట్టుకుంటున్నారు. అందుకే మీకు మృత్యువంటే భయం, చీకటంటే భయం, సాతాను (satan) అంటే భయం, తెలియని విషయాలలోనికి వెళ్ళాలంటే భయం, సాహసం చెయ్యాలంటే భయం, రాత్రంటే భయం.

మీ ప్రాచీన నాగరికతలలో రాత్రి చాల అద్భుతమైన అవకాశంగా భావించే వారు. రాత్రిళ్ళు ఎక్కువకాలం చైతన్య పరిణామ వికాసానికి, అంతర్ ప్రయాణానికి కేటాయించేవాళ్ళు. చైతన్యశక్తి గురించి, అంతర్‌శక్తి గురించి పరిశోధన కావించే వాళ్ళు. జ్ఞానాన్ని ఆచరణలో పెట్టి జీవితానుభవాలుగా మలిచి రాత్రి + పగలును మేళవించే వాళ్ళు. రాత్రి + పగలు అంటే రాత్రి పూట పరిశోధన, పగటిపూట ఆచరణ. ఆచరణలో

వున్నదే ధర్మమనిపించుకుంటుంది. మీ అంతర్ శక్తిని సాధ్యమైనంత ఎక్కువగా వినియోగించుకునేందుకు కావలసిన సాధన చేయండి.

Seth Speaks అనే పుస్తకంలో నిద్రావస్థ మరి జాగ్రదావస్థ గురించి చాల సమాచారం ఇవ్వబడింది. ఇక్కడ చాల క్లుప్తంగా నిద్ర + జాగృదావస్థల గురించి రెండు ముక్కల్లో చెబుతాను. స్వప్నావస్థలో లభించే అఖండ జ్ఞానాన్ని కాన్షియస్ మైండ్ బాగా గుర్తుంచుకోవాలంటే ప్రతిరోజూ మీరు, రెండు గంటలు + రెండు గంటలు = నాలుగు గంటలు నిద్రపోవడం మీకు ఎంతో మేలును కలుగజేస్తుంది. రెండు గంటల వ్యవధి నిద్ర తర్వాత కొంత బ్రేక్ (break) ఇచ్చి మళ్ళీ రెండు గంటల నిద్ర మీకు చాల వుపయోగకరంగా వుంటుంది. దానివల్ల మీకు స్వప్నాలు బాగా జ్ఞాపకం వుంటాయి. మీ డాక్టర్లు చెబుతున్నట్లు రోజూ ఎనిమిది గంటల నిద్ర అనేది మీ దేహానికి గాని, మీ ఆరోగ్యానికి గాని, మీ చైతన్య పరిణామానికి గాని ఏమాత్రమూ మేలు చెయ్యదు. నాలుగు గంటల నిద్ర వల్ల జాగృదావస్థలో మీ దేహాన్ని చాల ఆరోగ్యంగా ఉత్తేజంగా వుండేటట్లు చేస్తుంది. మీ కాన్షియస్ మైండ్, సబ్‌కాన్షియస్ మైండ్ చాల చక్కగా మీ అందుబాటులోనికి వస్తాయి. మీ అవగాహనా శక్తి పెరుగుతుంది. నాలుగు గంటల వ్యవధితో కూడిన నిద్ర వల్ల అంతర్వాణి చాల చక్కగా పనిచేయడం ప్రారంభిస్తుంది. అంతర్వాణి ద్వారా, స్వప్నాలు ద్వారా జ్ఞాన సముపార్జనకు చాల వుపయోగపడుతుంది. రెండు గంటలు + రెండు గంటల నిద్ర చాల సహజమైన స్వాభావికమైన ప్రక్రియ. ఈ ప్రక్రియ మీ జీవితాన్ని చాల లయబద్ధంగా వుండేటట్లు చేస్తుంది. మీ జీవితంలో ఒక అద్భుతమైన ఆత్మ స్థైర్యాన్ని కలుగజేస్తుంది. దేహం చాల ఆటోమాటిక్‌గా ఆరోగ్యరక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసుకుంటుంది. ఎప్పటికప్పుడు దేహం తనకు కావలసిన ఎంజైములను హార్మోనులను రసాయనాలను విడుదల చేసుకునే సామర్థ్యాన్ని సంతరించుకుంటుంది. తక్కువ వ్యవధితో కూడిన నిద్రవల్ల మీ దేహానికి గల బద్ధకం, మీ మనోశక్తికి గల బద్ధకం వదిలించబడతాయి. జీవితం + భౌతిక అనుభవాలు + చైతన్య వికాసం ఒక క్రమమైన లయలో జరుగుతుంది. చైతన్య వికాసం వ్యాకోచం చెందుతుంది. అంతర్‌శక్తి + బాహ్య ప్రపంచం గురించి జ్ఞానాన్ని సంపాదించుకోవడానికి చాల వుపయోగపడుతుంది.

తక్కువ వ్యవధి నిద్ర వల్ల ఇంకా చాల ప్రయోజనాలు వున్నాయి. మీ కాన్షియస్ మైండ్ చాల ఈజీగా (easy)వ్యాకోచం చెందుతుంది. మీకు మనోవికాసము పెరుగుతుంది. మైండ్ పాకల్టీస్ (Mind faculties)ను చాల చక్కగా వుపయోగించుకోవచ్చు. మీ

సృజనాత్మకత మరి నిత్య జాగ్రత్త స్థితి పెరుగుతాయి. స్వప్నాలు మీకు చక్కగా జ్ఞాపకముండడం వల్ల మీకు అంతర్ ప్రపంచమంటే ఏమిటో మీకు తెలుస్తుంది. మీరు ఈ దేహం మాత్రమే కాదు, అపారమైన అంతర్ శక్తితో కూడిన ఆత్మ అని మీకు తెలుస్తుంది. జీవితం యొక్క అర్థం, పరమార్థం తెలిసివస్తాయి. మృత్యు భయం పోగొట్టబడుతుంది. అంతర్ ప్రపంచంలోని జ్ఞానాన్ని భౌతిక వాస్తవంలోనికి తెచ్చుకునేందుకు మార్గం సుగమం అవుతుంది. స్వప్నాలలోగల అపారమైన జ్ఞానాన్ని భౌతికానుభవాలలోనికి తెచ్చుకునే వీలు ఏర్పడుతుంది. మీ ఇంటెలిజెన్స్ + నిర్ణయాత్మకశక్తి పెరుగుతాయి. మీ స్వప్నాలలో మీరు చాల తెలివైన వాళ్ళుగా, చురుకైన వాళ్ళుగా బాధ్యతాయుతమైన వాళ్ళుగా, ఎంతో పరిణితి చెందిన వాళ్ళుగా వుంటే – జాగృదావస్థలో ఈ భౌతిక ప్రపంచంలో కూడ ఆ శక్తి యుక్తులున్నట్లు మీరు గ్రహించ గలుగుతారు.. మీ స్వప్నాలు ఈ విషయాన్ని మీకు తెలియజేస్తున్నాయి. **రోజూ ఎనిమిది గంటలు మరి ఆపై ఎక్కువ సమయంతో కూడిన నిద్ర మీ దేహ ఆరోగ్యానికి ఎంత మాత్రము మంచిది కాదు; మరి మీ చైతన్య పరిణామానికి ఎంత మాత్రం ప్రయోజనం కలిగించదు.** చిన్న పిల్లల విషయంలో 'నిద్ర' చాల సహజ స్థితిలో వుంటుంది; ఎన్ని గంటల నిద్ర అనేది కూడ చాల సహజంగా వుంటుంది.

తక్కువ వ్యవధితో కూడిన నిద్ర మీ కాన్షియస్ మైండ్ + సబ్ కాన్షియస్ మైండ్‌లను కలిసి పనిచేసేటట్లు చేస్తుంది. ఈ విషయంలో మీ కంటే జంతుజాతి ఎంతో నిత్య జాగ్రత్త స్థితిలో వుంది. అవి తక్కువ వ్యవధితో కూడిన నిద్రను తమ జీవితంలో భాగం చేసుకుని దేహ ఆరోగ్య రక్షణ వ్యవస్థను కాపాడుకుంటున్నాయి. మానవజాతికి వైద్యులను సృష్టించుకున్నారు గాని జంతుజాతికి వైద్యుల సృష్టి జరగలేదు. అంతర్ శక్తి + భౌతిక వాస్తవం గురించి మీకు క్షుణ్ణంగా తెలిసినపుడు ఈ డాక్టర్ల వ్యవస్థ మీ భూమి మీద మటుమాయమై పోతుంది. మీ మానసిక శారీరక రుగ్మతలు దాదాపు అన్నీ కూడ మీరు కలిగివున్న అపసవ్యమైన నిద్రా కాలవ్యవధి వల్లనే కలుగు తున్నాయి. చాల వరకు మానసిక సమస్యలు సరికాని పద్ధతిలో వుండే మీ నిద్ర అలవాట్ల వల్లనే వస్తున్నాయి. రెండు గంటల నిద్ర + బ్రేక్ + రెండు గంటల నిద్ర అలవాటు వల్ల మీకు నరాల వ్యాధులు, నాడీమండల వ్యాధులు, మానసిక వ్యాధులు లాంటివి సంక్రమించవు. ఈ నిద్ర అలవాటువల్ల మీ ఆహారపుటలవాట్లు కూడ మారిపోతాయి. మీ దేహానికి ఏది సమంజసమైన ఆహారమో చాల స్పష్టంగా తెలుస్తుంది. రాత్రుళ్ళు సుదీర్ఘంగా నిద్రించడం

వల్ల దేహానికి అవసరమైన ఆహారం ఆ సమయంలో తీసుకోలేక పోతున్నారు. రాత్రి సమయంలో కూడ మధ్య మధ్యలో ఆహారం తీసుకోవడం ఆరోగ్యరీత్యా చాల అవసరం. కాని మీ నమ్మక వ్యవస్థ అందుకు వ్యతిరేకంగా వుంది. జాగృదావస్థలో ఎదురయ్యే సమస్యలు, సవాళ్ళు, ఆందోళన, ఒత్తిడి లాంటి వాటికి నిద్రావస్థలో మరి స్వప్నావస్థలో చాల స్పష్టమైన పరిష్కారాలు లభిస్తాయి. జాగృదావస్థలో ఎదురయ్యే అర్థరహిత సమస్యలకు సరియైన రీతిలో స్వప్నావస్థలో సమాచార మందించబడుతుంది.

జంతు జాతులు నిద్రావస్థలో దేహం + మైండ్‌కు విశ్రాంతిని పొందుతూ చైతన్యశక్తి పరంగా చాల అలర్ట్ (alert) గా వుండగలుగుతున్నాయి. ప్రకృతి ప్రళయాలు లేదా ఏవైనా ప్రమాదాలను నిద్రావస్థలో కూడ చాల బాగా పసిగట్టగలుగుతున్నాయి.

గడియారపు టైముతో లెక్కలు వేస్తూ బాల్యంలో గడిచే కాలాన్ని, వృద్ధాప్యంలో గడిచే కాలాన్ని చాల వృధాగా భావిస్తున్నట్లు ఒక నమ్మక వ్యవస్థలో మీరు కూరుకుపోయివున్నారు. బాల్యంలో మరి వృద్ధాప్యంలో జరిగే చైతన్య పరిణామం మానవజాతికి చాల సహజమైనది మరి చాల ముఖ్యమైనది. మీ ఆత్మ పురోగతికి ఇది చాల ఉపయోగకరమైనది.

నాలుగు గంటల వ్యవధిగల నిద్రావస్థవల్ల మీకింకా మరెన్నో ప్రయోజనాలున్నాయి. జాగృదావస్థలో మీకు మరుగు పర్చబడ్డ మానసిక ఆధ్యాత్మిక భౌతిక సామర్థ్యాలు ఈ నిద్రావస్థతో తెలియబర్చబడతాయి. జాగృదావస్థలో ఏయే విషయాలలో రాణించాలో, ఏ విధంగా ప్రవర్తిస్తే బాగుంటుందో అలాంటి విషయాలు మీకు స్వప్నావస్థలో తెలియబర్చ బడుతాయి. వ్యక్తిగతంగా లేక సామాజికంగా మీకుగల సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. మీ దేహం + మైండ్‌కు సంపూర్తిగా రిలాక్సేషన్ (complete relaxation) నాలుగు గంటల నిద్ర వ్యవధితోనే లభిస్తుంది. మీ డాక్టర్లు అంటున్నట్లు ఎనిమిది గంటల నిద్ర మీకు రిలాక్సేషన్ ఇవ్వదు. దేహం – మైండ్ మధ్య సంబంధం నాలుగు గంటల నిద్ర వ్యవధి వల్ల మరింత బలపడుతుంది. నిద్ర + స్వప్నాలకు రకరకాల రంగులు పులిమి వివిధ నిర్వచనాలిచ్చి, మానవజాతిని తప్పుదోవపట్టించారు మీ పశ్చిమ దేశాల శాస్త్రవేత్తలు. ప్రతి దానికీ విశ్లేషణలు, పట్టికలు రాసి మానవజాతి కున్న సహజత్వాన్ని వారు గుర్తించలేకపోతున్నారు. పాశ్చాత్య సమాజపు ఒక సామెత 'సోమరిపోతు మైండ్ ఒక దెయ్యాల కొంప' అనేది శుద్ధ తప్పు. వాళ్ళ దృష్టిలో నిద్ర, స్వప్నావస్థ, విశ్రాంతి అనేవి వృధా కాలక్షేపంగా కన్పిస్తాయి. అట్లాగని మిమ్మల్ని మానసిక

సోమరితనానికి పురికొల్పడం లేదు. చైతన్యశక్తి పరిణామంలో విశ్రాంతి అనేది కూడ ముఖ్యమేనని మీకు గుర్తుచేస్తున్నాను. ఊహాశక్తి, కలలు కనడం అంతర్ ప్రయాణం చెయ్యడం లాంటివన్నీ మీ సమాజానికి వృధాగా అన్పిస్తుంటాయి. కాని ఆత్మ పురోగతికి అవి చాల ముఖ్యమని మీరు గుర్తించాలి.

ప్రస్తుతం మీ సమాజం యువతను రెచ్చగొట్టి వాళ్ళకుగల సహజత్వాన్ని కోల్పోయేటట్లు చేస్తుంది. వారిలో అసహజమైన పోటీతత్వాన్ని పెంచి సరికాని జీవనవిధానం లోనికి నెట్టివేయడం జరుగుతూంది. ఆధ్యాత్మికత, చైతన్యశక్తి, ఆత్మశక్తి, జీవిత శాస్త్రము గురించి వాళ్ళకు బోధించాల్సిన అవసరముంది. జీవితమంటే పోటీతత్వంకాదని జీవితమంటే ఉన్నదంతా అనుభవించడానికేనని, ఆనందించడానికేనని వాళ్ళు గుర్తించేటట్లు చేయాలి. జీవితంలో ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక శాస్త్రము తప్పనిసరియని వాళ్ళకు తెలియాలి.

* * *

1. జంతువులను వధించడం, వాటి మాంసాన్ని ఆహారంగా భుజించడం ఆధ్యాత్మిక పురోగతికి చైతన్య పరిణామానికి ఏ మాత్రం సరిపడవు.
2. ఆధ్యాత్మిక పురోగతికి మీరే చొరవ తీసుకోవాలి. ప్రయత్నం చెయ్యకుండా పరిశోధనకుపక్రమించకుండా ఈ విశ్వంలో ఏవీ మీ దరికి రావు. మీ సంకల్పశక్తి 'కారణమ'యితే, దాని భౌతిక వాస్తవం 'కార్యం' అవుతుంది.
3. మీ నోటినుండి వెలువడే మాటలు, మీ మనస్సు నుండి వచ్చే ఆలోచనలు, మీ దేహం ద్వారా జరిగే చేష్టలు 'కారణం' అయితే, భౌతిక ప్రపంచంలో వాటి పర్యవసానాలు 'కార్యం' అవుతాయి.
4. జీవితంలో అన్ని కోణాలను దర్శించి భౌతిక సంఘటనలను జీవితానుభవాలుగా మార్చి చైతన్యశక్తి పరిణామం చెందడానికి జీవాత్మలుగా వివిధ రకాల జన్మలు తీసుకోవడం జరుగుతుంటుంది. కొన్ని సార్లు అంగవైకల్యంతో, కొన్నిసార్లు దీర్ఘకాలిక వ్యాధులతో కూడ జన్మలు తీసుకోవడం జరుగుతుంటుంది. అంతేగాని పాపానికి పరిహారంగా జన్మలు తీసుకోవడం లేదు.
5. జన్మపరంపర ద్వారా ఆధ్యాత్మిక పురోగతి, చైతన్యశక్తి వికాసం విస్తరిస్తూ వస్తాయి. తిరోగమనం అనేది ఎప్పుడూ వుండనే వుండదు. ఒక్కొక్క జన్మా ఆధ్యాత్మిక పరిణితిని పెంచుతూ వస్తుంది.

6. ఆత్మ అనేది మల్టిడైమన్షనల్ స్వరూపం. ఒక దేహానికి లేదా ఒక లోకానికి పరిమితం కావడం లేదు. అనేక లోకాలలో అన్ని డైమన్షన్‌లలో అన్ని దేహాలలో వుంటూ విస్తరిస్తూ వికాసం చెందుతూ వుంటుంది. ఆత్మ అతి ప్రాచీనమైనది. అతి సనాతనమైనది.

7. ఆత్మ చైతన్య పరిణామం చెందడం కోసం ఒక కోణంలో జీవితాన్ని దర్శించి అనుభూతులు పొందుతూ విస్తరించడం కోసం జన్మ తీసుకోవడం జరుగుతుంటుంది. జన్మ తర్వాత జన్మ... లోకం తర్వాత లోకం... ఇలా అనంతకాలం ప్రయాణం కొనసాగుతూనే వుంటుంది. ఆత్మకు పాజిటివ్ – నెగెటివ్ మరి తక్కువ – ఎక్కువ లాంటి జన్మలనేవి వుండవు. అన్ని జన్మలూ చైతన్య పరిణామం చెందడం కోసమే.

8. మీ జీవితంలో ప్రతి కదలికా ఆధ్యాత్మికతను ప్రభావితం చేస్తుంది. అకర్మణత్వం అనేది ఏ జీవాత్మకూ వుండదు. ప్రతి ఆత్మకూడా తనను తాను చైతన్య వికాసం చెందించుకోవాల్సిందే.

9. ఈ సృష్టిలో జీవాత్మలన్నీ విశిష్టమైనవే. ఏవీ తక్కువగా గాని, గొప్పగా గాని వుండవు.

మీ దేహం మరి మీ చైతన్యశక్తి యొక్క వికాసం మీ భూప్రపంచానికి అనుగుణంగా ఒక లయలో కొనసాగుతుంటుంది. అంతర్ ప్రపంచం మరి బాహ్య ప్రపంచం మధ్య అటునుంచి ఇటు, ఇటు నుంచి అటు నిరంతరమూ చైతన్యశక్తి ప్రవాహం జరుగుతుంటుంది. భూమి కూడ పరమాణువులు – అణువుల సముదాయమే. వీటన్నింటినీ చైతన్యశక్తి కలిపి వుంచుతుంది. ఖనిజాలు, జంతుజాతుల దేహాలు, వృక్షాలు, నదులు, లోయలు, పర్వతాలు అన్నీ పరమాణువులు – అణువుల నుండి ఏర్పడినాయి. అవన్నీ వివిధ రకాల దేహాలను ధరించి చైతన్య పరిణామం చెందుతూన్న ఆత్మశకలాలు, 'నేను భౌతికంగా, ప్రాపంచికంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా పురోగతి చెందుతున్నాను' అనే భావన కొరవడినపుడు దాని పర్యవసానంగా మూర్ఛావ్యాధి దేహానికి సంభవిస్తుంటుంది. అదే భావన జీవజాతులకు వున్నపుడు భౌతిక ప్రపంచం అంటే భూగ్రహం అనే దేహానికి 'భూకంపం' సంభవిస్తుంది. మీ దేహంలోని రక్తనాళాలలో రక్త ప్రవాహం ఎలా జరుగుతుందో ఈ భూమి అనే దేహంలో గాలి ప్రవాహం జరుగు తుంటుంది. రక్త ప్రవాహం దేహం లోపల జరుగుతూంటే, గాలి ప్రవాహం భూమి అనే దేహం వెలుపల జరుగుతూంది. అంతే తేడా.

మీరు దేహాన్ని ఎలా ధరించి వున్నారో, భూమి అనే ఆత్మ కూడ దేహాన్ని ధరించింది. మీ దేహంలో గల జీవకణాలు మీ దేహ ఆరోగ్య రక్షణ వ్యవస్థను ఎలాప్రభావితం చేస్తాయో అలాగే భూమి మీద గల జీవజాతులు, పర్వతాలు, నదులు, సముద్రాలు... భూమి యొక్క దేహ ఆరోగ్య రక్షణ వ్యవస్థను ప్రభావితం చేస్తుంటాయి. మీ మానవజాతి + ఇతర జీవజాతుల ఎమోషన్స్, ఫీలింగ్స్ వల్ల అంతర్ ప్రపంచం నుండి విద్యుదయస్కాంత తరంగాలు వెలువడి బాహ్య ప్రపంచంలో భౌతిక వాస్తవం చెందడం సంభవిస్తుంటుంది. ప్రస్తుతం భూమి మీద భౌతిక సంఘటనలను భౌతిక వాతావరణాన్ని ప్రభావితం చెయ్యడంలో మానవజాతి ప్రధాన పాత్రను కలిగి వుంది. భూమి మీద ఏ ప్రాంతంలోనయితే మానవజాతి ఓర్పు, సహనం లాంటివి నశించి పగ, ద్వేషాలతో రగిలిపోతుంటారో అక్కడ భూకంపాలు, అగ్ని పర్వత విస్ఫోటనాలు సంభవిస్తుంటాయి. మానవజాతి సామూహికంగా ఆత్మహత్యా సదృశధోరణి కలిగి వున్నపుడు ఆ ప్రాంతాలలో జలప్రళయాలు, భయంకరమైన వ్యాధులు ప్రబలడం సంభవిస్తుంటాయి. ఈ ప్రకృతి వైపరీత్యాలు మానవజాతి సామూహికంగా సంకల్పించుకున్నపుడు సంభవిస్తుంటాయి. మానవజాతిలో సహనం నశించినపుడు అశాంతి ప్రబలినపుడు భూ ప్రపంచ చైతన్య పరిణామంలో కొన్ని సర్దుబాట్లు జరుగుతాయి. ఆ సర్దుబాట్ల వల్ల ప్రకృతి వైపరీత్యాలలో ఏదో ఒకటి సంభవిస్తుంటుంది

దేహంలో విద్యుదయస్కాంత శక్తి ప్రవాహాలు, రసాయనిక ప్రక్రియలు నిరంతరమూ చోటుచేసుకుంటాయి. అదే మాదిరిగా వాతావరణంలో కూడ ఈ మార్పులు సంభవిస్తుంటాయి. మీ దేహాన్ని ఒట్టి మాంసపిండంగా భావించి చికిత్స చెయ్యడాన్ని తక్షణమే మీ డాక్టర్లు ఆపెయ్యాల్సిన అవసరముంది. దేహం ఆధ్యాత్మిక మానసిక రసాయనిక విద్యుదయస్కాంత ధర్మాలను కలిగి వుంటూ ఆత్మను ధరించి వుంది. మీ దేహంలో జీవకణాలు ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయో, మీ దేహాలు కూడ భూమి అనే దేహాన్ని ప్రభావితం చేస్తున్నాయి. మీ మనోశక్తి నుండి వెలువడే ఎమోషన్స్ + ఫీలింగ్స్‌కు అనుగుణంగా మీ భౌతిక వాతావరణం ప్రభావితం అవుతుంటుంది. భౌతిక ప్రపంచంలో ఏ భౌతిక సంఘటనలయినా వాటి ప్రభావం భూమండలమంతా వ్యాపిస్తుంది. భూమి మీద ఒక ప్రాంతంలో భూకంపం సంభవించినపుడు దాని ప్రభావం– ఆధ్యాత్మికంగా, మానసికంగా, భౌతికంగా, చైతన్యశక్తి పరంగా ఇతర అన్ని ప్రాంతాలకు వ్యాపిస్తుంది. అదే విధంగా భూమి మీద ఏదైనా ఒక ప్రాంతంలో ఆధ్యాత్మికంగా పురోగతి చెందినపుడు

దాని ప్రభావం భూమండలమంతా వ్యాప్తిచెందుతుంది. నిర్మాణాత్మకంగా గాని, వినాశకరంగా గాని ఏ భౌతిక సంఘటన జరిగినా దాని ప్రభావం భూమండలమంతా వ్యాప్తి చెందుతుందని మీరు గుర్తుంచుకోవాలి.

భూభౌతిక ప్రపంచంలో పదార్థంతో చైతన్యశక్తి సంయోగం చెందుతుంది. మీ జీవితానుభవాలు కూడ పదార్థం + చైతన్యశక్తితో ఇమిడి వుంటున్నాయి. ప్రకృతిలో జీవాత్మలుగా పరిణామం చెందుతూన్న మీకు తుఫానులు, భూకంపాలు, టోర్నాడోలు (తీవ్రమైన తుపానులు), అగ్ని పర్వతాలు లాంటి వాటిని ముందుగానే పసిగట్టగల శక్తి మీ అంతరేంద్రియాలు కలిగివున్నాయి. వాతావరణ పీడనం, వాతావరణంపై అయస్కాంత క్షేత్ర ప్రభావం, విద్యుత్ క్షేత్ర ప్రభావం, వైరస్‌లాంటి వాటినన్నింటినీ మీ చర్మం స్వతహాగా పసిగట్టగలదు. పరిశోధన, ఆచరణ, అభ్యాసాల ద్వారా జ్ఞానం మీ జీవితానుభవాలుగా మలచబడుతుంది. ప్రకృతి వైపరీత్యాలను, దేహానికి ఎదురయ్యే జబ్బులను మీ అంతరేంద్రియాల ద్వారా ముందే పసిగట్టి వాటి నుండి నివారణోపాయం పొందగల శక్తి సామర్థ్యాలు మీకున్నాయి; మీ స్వప్నాల ద్వారా కూడ మీకు తెలియబరచబడుతుంది. ప్రకృతి వైపరీత్యాల ప్రభావం మీపై వుండదనే బలమైన నమ్మకం మీకున్నట్లయితే అవి సంభవించక మునుపే ఎన్నో కారణాలవల్ల మీరు ఆ ప్రాంతం వదిలిపెట్టి వేరే ప్రాంతానికి చేరడం జరుగుతుంటుంది. ఏదీ యాదృచ్ఛికంగా జరగదు. తాను కోరుకోకుండా ఏ మనిషీ ప్రకృతి వైపరీత్యాలలో మరణించడం జరగదు. జంతు జాతులకు ప్రకృతి వైపరీత్యాలు ఎప్పుడు జరిగేదీ ముందే తెలుస్తుంటుంది. మానవజాతికి కూడ ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే పసిగట్టగల కెపాసిటీ వుంది కాని అంతర్ వాణిని వినే ప్రక్రియను మీరు ఎప్పుడో మర్చిపోయారు.

అంతర్ వాణిని వినాలనే సంకల్పం కలిగిన తక్షణమే మీ అంతర్ ప్రపంచం అందుకు వెంటనే స్పందించి సహకరిస్తుంది. కొంత సాధన ద్వారా అంతర్‌వాణిని వినగలిగే ప్రక్రియను మరింత పదును పెట్టవచ్చు.

భూమి మీద భౌతిక సంఘటనలు – మానసిక, భౌతిక, ఆధ్యాత్మిక కారణాల వల్ల సంభవిస్తుంటాయి. అవి ప్రకృతి వైపరీత్యాలు, లేదా యుద్ధాలు లేదా ప్రమాదకరమైన వ్యాధులు కావచ్చు – వాటన్నింటినీ మీ మానవజాతి తమంత తాముగా సృష్టించుకుని జీవితానుభవాలుగా ఎదుర్కొంటున్నాయి. మీ దేహంలో రక్త ప్రవాహం మాదిరిగా భూమి అనే దేహంలో నీరు ప్రవహిస్తుంటుంది. ప్రాణం అంటే విలువ లేనిదిగా భావించే

ప్రాంతాలలో, పగ ప్రతీకారం లాంటి భావనలు హెచ్చుగా వుండే ప్రాంతాలలో కరువు కాటకాలు సంభవిస్తుంటాయి. జీవితాసక్తి కోల్పోవడం, లైఫ్‌ని నెగెటివ్‌గా తీసుకోవడం, కుట్ర, మోసం, దగా ఎక్కువగా వున్న ప్రాంతాలలో మరి జీవిత విలువలు నశించినపుడు ఆ ప్రాంతాలలో జల ప్రళయాలు సంభవిస్తుంటాయి. మానవజాతిలో కోపం, ఉద్రేకం, ఏదో చేసేయ్యాలనే తపన ఉన్న ప్రాంతాలలో భూకంపాలు, అగ్ని పర్వతాల విస్ఫోటనం సంభవిస్తుంటాయి. మీ మానవజాతి సామూహికంగా కలిగి వుంటున్న ఎమోషన్స్ వినాశకర ధోరణిలో వుంటున్నపుడు అవి ప్రకృతి ప్రళయాలుగా భౌతిక వాస్తవం చెందుతాయి. మానవజాతిలో ఒక వర్గం ప్రజల పట్ల ద్వేషం, పగ లాంటి భావాలు వున్నపుడు అది యుద్ధంగా భౌతిక వాస్తవం చెందుతుంది. ఇవన్నీ ప్రకృతి తనను తాను ప్రక్షాళన చేసుకునేందుకు జరుగుతుంటాయి. మీ దేహంలో రక్త ప్రవాహాన్ని, ప్రాణశక్తి విలువను హీనభావనతో చూడడంవల్ల ఆ ప్రాంతంలో మానవజాతి సామూహికంగా అటువంటి ఎమోషన్స్ కలిగి వుండడం వల్ల ఆ ప్రాంతంలో కరువు కాటకాలు తాండవించి ప్రాణం విలువను గుర్తుచేసేందుకు జరుగుతుంటాయి.

ఒక ప్రాంతంలో నివసిస్తున్న మానవజాతికి ఓర్పు, సహనం నశించి వున్నపుడు అక్కడవాళ్ళకు ఓర్పు, సహనం నేర్పేందుకు ప్రాణాంతక వ్యాధులు ప్రబలి కొన్ని లక్షల మందికి సంక్రమించడం జరుగుతుంటుంది. ఆ వ్యాధుల ప్రభావంతో ఓర్పు సహనం అంటే ఏమిటో వాళ్ళకు తెలిసివస్తుంది. వాళ్ళలో ఆత్మహత్యా సదృశ ధోరణి వున్నవాళ్ళు దేహాలను విడిచి పెట్టడం జరుగుతుంటుంది. మానవజాతిలో అణచిపెట్టబడిన ఎమోషన్స్, ఫీలింగ్స్ బాహ్యంగా ప్రకటితం అయ్యేందుకు విప్లవాలు సంభవిస్తుంటాయి. వాళ్ళ భావనల్లో కసి, ప్రతీకారం చోటు చేసుకుంటున్నపుడు ఆ విప్లవాలు హింసాత్మకంగా మారుతుంటాయి.

కారుయొక్క ఇంజన్ ఎక్కువ వేడిచేసినపుడు దాన్ని చల్లార్చడానికి నీళ్ళు ఎంత వుపయోగపడతాయో, అదే మాదిరిగా ప్రకృతిలో మానవజాతిలో భావోద్వేగాలు చెలరేగినపుడు వాటిని బ్యాలెన్స్ చెయ్యడానికి ప్రకృతి వైపరీత్యాలు యుద్ధాలు, ఎపిడమిక్ వ్యాధులు (epidemic diseases ఒక ప్రాంతంలో సడెన్‌గా చెలరేగే ప్రాణాంతక వ్యాధులు) లాంటివి సంభవించి ప్రకృతి తనను తాను బ్యాలెన్స్ చేసుకోవడం జరుగుతుంటుంది. ఇది ప్రకృతి సమతౌల్యం! ప్రకృతి వైపరీత్యాలు, విప్లవాలు, యుద్ధాలు, వ్యాధులు అనేవి ప్రకృతి ఏర్పరుచుకునే శక్తితో ఆచరించే స్నానాలు (energy baths). స్నానంతో దేహం శుద్ధి అయినట్లుగా భూమి ఈ ప్రకృతి వైరీత్యాల ద్వారా శక్తి ప్రవాహంలో స్నానమాచరి

స్తుంటుంది. దేహం యొక్క ఆరోగ్యం క్షీణించడానికి ఎన్ని కారణాలుంటాయో, భూమి అనే దేహం యొక్క ఆరోగ్యం కూడ క్షీణించడానికి కూడ అనేక కారణాలున్నాయి. యుద్ధాలు కూడ ఒకరకమైన వ్యాధులే. భూమి అనే దేహానికి యుద్ధం అనే వ్యాధి సంక్రమిస్తుంది. మీ దేహానికి వ్యాధి నయమైనట్లే యుద్ధమనే వ్యాధి కూడా కొంతకాలం తర్వాత నయమవ్వడం జరుగుతుంది. యుద్ధం వల్ల జీవితం అంటే ఏమిటో, జీవితాన్ని ఎలా గౌరవించాలో, ప్రాణం విలువను ఎంత పవిత్రంగా గౌరవించాలో మీకు బోధింపబడుతుంది. ప్రకృతి వైపరీత్యాలు మీ ప్రాపంచిక పరిభాషలో చెప్పాలంటే మీకు వినాశనాన్ని కలుగ జేస్తున్నాయని మీరు భావించవచ్చు గాని అవి మీలో నిద్రాణమై వున్న అపారమైన అంతర్‌శక్తిని వినియోగించుకునేందుకు వుపయోగపడుతున్నాయి. మీరు నివసిస్తున్న భౌతిక ప్రపంచాన్ని, భౌతిక దేహాలను ధరించి జీవాత్మలు చైతన్య పరిణామం చెందుతున్న విషయాన్ని మీకు బోధించడానికి ఈ ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలను మీరే సృష్టించుకుంటున్నప్పటికీ వాటి ద్వారా మీకు కొంత జ్ఞానం బోధింపబడుతుందనే భావన మీ అంతర్ భావనలలో ఇమిడి వుండడం వల్ల అవి సంభవిస్తున్నాయి.

ప్రకృతి అంటే ఏమిటో, జీవాత్మలుగా ప్రకృతితో మీ అనుబంధమేమిటో ప్రకృతి వైపరీత్యాలు మీకు తెలియజేస్తాయి. తననుగాని, తన కుటుంబాన్నిగాని, తన సమాజాన్ని గాని పట్టించుకోని వ్యక్తికి ఈ ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాల వల్ల తన విలువను, తన కుటుంబం విలువను, తన సమాజం విలువను గుర్తించేటట్లు బోధింపబడుతుంది. అవి ఈ భూమితో మనిషికి గల అనుబంధాన్ని ఇతర జీవరాశులపట్ల గల అనుబంధాన్ని, ప్రకృతికి గల అమేయశక్తిని గుర్తించేటట్లు చేస్తాయి. ఒక విధంగా చెప్పాలంటే ఈ విశ్వశక్తితో ముఖాముఖి అనుబంధాన్ని ప్రకృతి బీభత్సాలు మీకు తెలియజేస్తాయి. ప్రకృతి వైపరీత్యాల మాదిరిగా మీ అంతర్ ప్రపంచంలో కూడ బీభత్సాలు జరుగుతుంటాయి. ఇవి భూమి మీద జీవాత్మలు నిర్మాణాత్మకంగా చైతన్యపరిణామం చెందేందుకు సంభవిస్తున్నాయేగాని మిమ్మల్ని శిక్షించడానికి మాత్రం కావు. ప్రకృతి వైపరీత్యాలు మీ మానవజాతి మరి ఇతర జీవజాతులకు గల నమ్మకాలు + ఎమోషన్స్‌లలో గల మాలిన్యాన్ని, కాఠిన్యాన్ని తొలగిస్తాయి. భూకంపం, తుఫాను, అగ్ని పర్వతం యొక్క విస్ఫోటనం వల్ల ప్రకృతిలో గల శక్తిని గుర్తించడమే గాకుండా తనలోని శక్తి కూడ మనిషి గుర్తించగలుగుతున్నాడు. ఈ విషయం మీ తర్కానికి విశ్లేషణకు అందకపోవచ్చుగాని

యదార్థంగా జరుగుతున్నదదే.

ఓర్పు నశించడం, అసహనం అనేవి మిమ్మల్ని వెంబడిస్తుంటాయి. ఏదో ఒక సమయంలో వాటిని మార్చుకోవచ్చుననే సంకల్పం మీ అంతరంగంలో వుంటుంది. దాని పర్యవసానంగా మీకు కొన్ని వ్యాధులు సంక్రమించి ఆసుపత్రిలో చేరడం సంభవిస్తుంటుంది. ఆసుపత్రిలో ఓర్పు, సహనం అంటే ఏమిటో అక్కడ నేర్చుకోవడం జరుగుతుంది. చాల మంది యుక్త వయస్సులో చనిపోవడం జరుగుతూంది. వాళ్ళు వృద్ధాప్యం పట్ల హీనమైన భావన కలిగి వుండడం, వృద్ధాప్యంలో దేహం శుష్కించిపోయి ఎందుకూ వుపయోగపడదనే భావన ఏర్పరుచుకోవడం వల్ల యుక్తవయస్సులోనే చనిపోవడం జరుగుతుంటుంది. భూకంపాలలో, యాక్సిడెంట్లలో చనిపోవాలని నిర్ణయించుకోవడం వల్ల లేదా ఆ సందర్భాలలో చనిపోతామనే భయం వల్ల కొంత మంది అలాంటి మరణాన్నే పొందుతున్నారు. కాన్షియస్ మైండ్ ఉపరితల పొరలలో అంటే 'అహం' స్థాయిలో మరణాన్ని మీకు కోరుకోక పోవచ్చు. కాని మీ అంతర్గత మైండ్‌లో వాటిని కోరుకోవడం లేదా అలా జరుగుతుందేమోనని భయపడడం వల్ల దాన్ని ఆహ్వానించడం జరుగుతుంటుంది. మానవజాతి సామూహికంగా వెదజల్లే ఎమోషన్స్+ ఫీలింగ్స్ + నమ్మకాలు వినాశకర రీతిలో వున్నపుడు వాటి తాలూకు శక్తి బాహ్య భౌతిక ప్రపంచంలో ఈ ప్రకృతి వైపరీత్యాలుగా సంభవించడం జరుగుతూంది. ఈ వైపరీత్యాల పర్యవసానంగా బాధలను అనుభూతి చెందడం జరుగుతుంది. నీటిలో పెద్ద బండరాయి నీటి ప్రవాహాన్ని రెండు పాయలుగా చీల్చినట్లే మీ ఎమోషన్స్ శక్తి ప్రవాహాన్ని చీల్చి ప్రకృతి వైపరీత్యాలుగా మలుస్తాయి.

మీ వ్యక్తిగత నమ్మకాలు మీ దేహాన్ని ప్రభావితం చేస్తున్నట్లే, మానవజాతి సామూహికంగా ఏర్పరుచుకున్న నమ్మకాలు ఒక ప్రాంతానికి లేదా ఒక దేశానికి సంబంధించిన భౌతిక సంఘటనగా రూపాంతరం చెంది భూభౌతిక దేహాన్ని ప్రభావితం చేస్తాయి. మీ యొక్క రోజువారి జీవితం కూడా ముఖాముఖిగా ప్రకృతిని ప్రభావితం చేస్తుంటుంది. ఎంచేతంటే మీరు ప్రకృతిలో ఒక భాగమై వున్నారు గనుక. మానవజాతి ఒక్కటే ప్రకృతి వైపరీత్యాలను, యుద్ధాలను, ప్రాణాంతక రోగాలను ఎందుకు ఎక్కువగా ప్రభావితం చేస్తుంది? అనే సందేహం మీకు కలుగుతుంటుంది. ఎంచేతంటే చైతన్యశక్తి పరిణామంలో ఇతర జీవజాతులకంటే ఒక అడుగు ముందు వరసలో మానవజాతి వుంది. మైండ్ పవర్ ద్వారా మీ నమ్మకాలు + ఎమోషన్స్ + ఫీలింగ్స్ + ఊహాశక్తి +

సంక్పాలు భూమి మీద భౌతిక సంఘటనలను ప్రభావితం చెయ్యడంలో మానవజాతి ప్రధాన పాత్ర వహిస్తుంది. అట్లాగని మానవజాతి ఒక్కటే చాలగొప్పదని నేను చెప్పడం లేదు. ఈ సృష్టిలో అన్ని జీవరాశులు ఎంతో విశిష్టమైనవి మరి అన్నీ భౌతిక వాస్తవాన్ని సృష్టిస్తున్నాయి.

జీవితమాధుర్యాన్ని ఆస్వాదించడంలో, సహజపద్ధతిలో చైతన్య పరిణామం చెందడంలో ఒక్క మానవజాతి తప్ప మిగతా అన్ని జీవజాతులు చాల సవ్యమైన మార్గంలోనే వుంటున్నాయి. జీవిత మాధుర్యాన్ని ఆస్వాదించడంలో మానవజాతి విఫలమవుతూంది. దాని పర్యవసానంగా మానవజాతిని దుఃఖం + రోగం + దారిద్ర్యం పీడిస్తున్నాయి. రోగానికి మూలకారణం జంతుజాతి పట్ల మీ హింసాత్మకధోరణియని ఇంతకు మునుపే చెప్పడం జరిగింది. హింస అనేది ఆధ్యాత్మికంగా + మానసికంగా + భౌతికంగా + చైతన్యశక్తి పరంగా మిమ్మల్ని వినాశకరరీతిలో ప్రభావితం చేస్తుంది. హింస వల్ల చేతనావస్థలో మరి అచేతనావస్థలో మీ అంతరంగం నుండి పగ, ప్రతీకారం, ద్వేషం... లాంటి వినాశకర ఆలోచనా తరంగాలను వెలువడేటట్లు చేస్తుంది. ఈ ఆలోచనా తరంగాలు భౌతిక సంఘటనలుగా రూపాంతరం చెంది మీ జీవితాలలో వినాశకరరీతిలో ఎదురవు తుంటాయి. ప్రాణాంతక వ్యాధులు, యుద్ధాలు, ప్రకృతి ప్రళయాలు... అన్నింటికీ మూల బీజం హింసా ప్రవృత్తియేనని మీకు మరోసారి గుర్తుచేస్తున్నాను.

వరదలు, తుపానులు, భూకంపాలు, ప్రాణాంతక వ్యాధులు ఇంకా ఇతర ప్రకృతి వైపరీత్యాలు మానవజాతిలో సామూహికంగా నిద్రాణమైవున్న నెగెటివ్ శక్తిని (negative energy) తీసివేసి సరిక్రొత్త శక్తిని ప్రవేశపెట్టడానికి సంభవిస్తున్నాయి. ఇక్కడ నెగెటివ్ శక్తి (negative energy)అంటే మిమ్మల్ని వినాశకరరీతిలో మళ్ళించే శక్తి అని అర్థం చేసుకోండి. మీ కాన్షియస్ మైండ్ అంతర్గతంగా కొన్ని ఎమోషన్స్‌ను కలిగి వుండి వాటిని బాహ్యంగా ప్రకటితం చేసుకోవడానికి ఈ ప్రకృతి వైపరీత్యాలు ఉపకరిస్తుంటాయి. మీలో ప్రతి ఒక్కరూ హీరోయిజమ్ (Heroism) గురించి ఫీలవుతూ ఈ దేశానికి ఏదైనా చేస్తే బాగుణ్ణు అని ఎమోషన్స్ + ఫీలింగ్స్ కలిగి వుంటుంటారు. వాళ్ళ కాన్షియస్ మైండ్స్‌లో దాగివున్న ఇలాంటి నిద్రాణమైన భావనలన్నీ బాహ్య ప్రపంచంలోనికి చొచ్చుకువచ్చి ఒక యుద్ధం రూపంలోనో లేదా ఒక విప్లవం రూపంలోనో బహిర్గతమవుతుంటాయి. అన్ని భౌతిక సంఘటనల సృష్టికీ మీరే కర్తలు. భౌతిక సంఘటనల సృష్టికి మీకు స్వతహాగా హక్కుంది. కాని వాటిని నిర్మాణాత్మకంగా మలుచుకోవడంలో

మీకు ఎంతో వుపయోగకరంగా వుంటాయి. మిమ్ముల్ని మరి భూమిని వేరుచేసి చూడడానికి వీలులేదు. వరదలు తుపానులులాంటివి భూభౌతిక దేహానికి హీలింగ్‌ను (healings) కలుగజేస్తాయి. మీ దేహంలో వైరస్‌లు ఎంత సహజంగా వున్నాయో భూభౌతిక దేహంలో కూడ మానవజాతి + ఇతర జీవజాతులు కూడ అలాగే వుండడం జరుగుతుంది. అలాగని మిమ్మల్ని వైరస్‌లతో పోల్చి హీనపర్చడం లేదు.

మిమ్మల్ని మీరు ప్రేమించుకోగలిగితే మీ జీవితం యొక్క పురోగతి చాల ఆటోమాటిక్‌గా జరుగుతుంటుంది. ప్రస్తుత ఈ వర్తమానంలో మీ జీవితపరిస్థితులు ఎలాంటివైనా సరే మీ ఉన్నతిని పురోగతిని మీరే సృష్టించుకోగల సామర్థ్యాన్ని కలిగి వున్నారు. మీ ఉనికిని కాపాడుకుంటూ మహిమాన్వితమైన శక్తిగల మీ అంతర్ ప్రపంచం నుండి గైడెన్స్ పొందుతూ ప్రతిక్షణమూ చైతన్య పరిణామం చెందుతూ వున్నారు. ఇతరులు కూడ ఆధ్యాత్మికంగా రాణించడానికి మీ వంతు సహకారం సహాయం అందించడం ద్వారా మీ చైతన్య వికాసం మరింత పెరుగుతుంటుంది.

ఈ భూమి మీద మానవజాతిలో తన వాస్తవాన్ని తానే సృష్టించుకొనజాలని దరిద్రుడు పుట్టడమనేది ఎప్పటికీ జరగదు. ప్రతి మనిషికీ అపారమైన అమేయమైన అంతర్‌శక్తి అందుబాటులో వుంది. ఈ విశ్వంలో జ్ఞానాన్నంతా మీ అంతర్ ప్రపంచం ఇముడ్చుకుని వుంది. 'నేను ఆధ్యాత్మికంగా మహాసంపన్నుణ్ణి. నా అంతర్ ప్రపంచాన్ని నా ఆత్మశక్తిని సంపూర్తిగా విశ్వసిస్తున్నాను.' అని పదే పదే స్మరించుకోండి. మిమ్మల్ని మీరు ద్వేషించుకోవాల్సినంత దయనీయమైన పరిస్థితులలో లేరు మీరు. మీ జీవితాన్ని ప్రేమించడం నేర్చుకోండి. ఈ భూమి మీద త్రీడైమన్షనల్ తలంలో చైతన్య పరిణామం చెందుటకు అత్యద్భుతమైన అవకాశాన్ని మీరు సృష్టించుకున్నారు. మీ దేహంలో ప్రతి భాగాన్ని మీరు ఎంతగా ప్రేమిస్తారో అదే మాదిరిగా ఈ విశ్వం తన భాగమైన మిమ్మల్ని అంతగా ప్రేమిస్తుంది. ఈ విశ్వం మిమ్మల్ని ఎంత మాత్రం విస్మరించడం లేదు.

ఈ విశ్వంలో అసామాన్యమైన ఉనికి గల మీరు ఇతరులతో పోల్చుకోవడం మానివెయ్యండి. ఇతరులతో పోల్చుకోవడం అనే ప్రక్రియ మీ 'అహం'వల్ల జరుగుతుంటుంది. ఒక చిన్న అల ఎంత వున్నతమైందో మహా సముద్రం కూడ అంతే వున్నతమైనది. మీ అంతర్ ప్రపంచం అనే మహా సముద్రం తనను తాను ఉన్నత పరుచుకుంటూ వుంటుంది. అంతే తప్ప తనను ఇతరమైన వాటితో పోల్చుకోవడానికి

అక్కడ ఇంకొక మహాసముద్రం వుండదు. ఈ భూమి మీద మిమ్మల్ని మీరే ఉన్నత పరచుకోవడానికి జన్మ తీసుకోవడం జరిగింది. జీవితం అనే మహా ప్రయాణంలో ఈ భూమి ఒక 'విడిది' మాత్రమేనని మీరు గుర్తుంచుకోవాలి. ఇతరులలో లోపాలు వెదకడం కూడ తక్షణమే మానివెయ్యండి. లోపాలు అనేవి జీవితం అనే మహా గ్రంథంలో ఎక్కడా లేవు. ప్రతి ఒక్కరూ చైతన్య పరిణామం చెందుతూన్న వారేనని మీరు గ్రహించండి . ఇతరులలో లోపాలు వెదకడమనే ప్రక్రియ మీ ఆలోచనల యొక్క ప్రతిరూపమే. తనను ఇతరులతో పోల్చుకోవడం, ఇతరుల లోపాలు వెదకడం, ఇతరులతో పోటీపడాలనే ఆలోచన కలిగి వుండడం అనేవి మిమ్మల్ని ఆధ్యాత్మికంగా ఎదగనివ్వవు. అవి మీ ఆధ్యాత్మిక పురోగతిని మీ చైతన్య పరిణామాన్ని ఆటంకపరుస్తాయి. మీ ఆత్మను మీరు ఉద్ధరించుకోవడానికి ఈ భూమి మీదకు జన్మతీసుకోవడం జరిగింది. ఇతరులను ఉద్ధరించడం కోసం మీరు ఈ భూమి మీదకు రాలేదు. జీవజాతులమధ్య పరస్పర సహకారం వుంటుందేకాని ఒక జాతి ఇంకొక జీవజాతిని ఉద్ధరించడం అనేది జరగదు. మీరు ఇతరులకు సహకారం అందించడం ద్వారా మిమ్మల్ని మీరు ఉన్నత పరచుకొంటున్నారు. అంతే తప్ప మీరు ఇతరులను ఉద్ధరించడం లేదు అనే విషయాన్ని విస్మరించకండి. ఈ విశ్వం మొత్తమూ మీకు సహకారం అందిస్తూంది . ఈ సృష్టి అంతా కూడ మీకు సహకారాన్ని అందిస్తూంది. భూమి + భూమి మీద జీవజాతులన్నీ మీకు సహకారాన్ని అందిస్తున్నాయి. విశ్వం నుండి మీరు పొందే సహకారం మహాసముద్ర మంతయితే మీరిచ్చే సహకారాన్ని దానితో పోల్చలేరు.

మీ జీవితం మీదే. మీ జీవితం పరమవిశిష్టమైనది. మీరెక్కడ వున్నారో అక్కడి నుండే క్రొత్త జీవితాన్ని ప్రారంభించండి. గతాన్ని నెమరువెయ్యవద్దు. ఈ భూమి మీద ఒక ఆదర్శవ్యక్తిగా జీవించడానికి ప్రామాణికతలు అంటూ ఏమీ వుండవు. మీకు ఆత్మజ్ఞానం యొక్క విస్తరణ పెరిగే కొలది జీవిత మాధుర్యాన్ని ఆస్వాదించడం పెరుగుతూ వస్తుంది. ఇతర మానవజాతికి, ఇతర జాతులకు మీరేదైనా సహాయసహకారాలు అందిస్తూ వుంటే, దానికి బదులుగా ఈ విశ్వం చేత అందించబడుతూంది. జీవితంలో కొన్ని నెగెటివ్ సంఘటనలు (negative issues) ఎదురయినంత మాత్రాన నిరాశా నిస్పృహలకు లోనయి క్రుంగిపోకండి. వాటిని మీరే సృష్టించుకుని మీ జీవితానుభవాలుగా స్వీకరించారని మర్చిపోకండి. 'ఎవరి వాస్తవాన్ని వారే సృష్టించుకుంటున్నారు.' అనే అఖండ సత్యం

తెలిసిన తర్వాత కూడ నిరాశ చెంది క్రుంగి పోవడం మీ అవివేకం వల్లనే జరుగుతుంటుంది. మీరింకా నెగెటివ్ సంఘటనలనే జీవితానుభవాలుగా ఎదుర్కొంటూ వుంటే అంతర్ ప్రయాణం ద్వారా సమాధానాలను వెదకండి. మీ అంతర్ ప్రపంచమే మీ గురువు. బాహ్య ప్రపంచంలో మీకు తారసపడే ఆధ్యాత్మిక గురువులు, ఆధ్యాత్మిక పుస్తకాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు మీ ఆధ్యాత్మిక పురోగతికి సహాయసహకారాలు అందిస్తున్నాయేగాని 'అసలు గురువు మాత్రం మీ అంతర్ ప్రపంచమే'.

ఆత్మజ్ఞానాన్ని వారధిగా చేసుకుని ముందుకు సాగండి. ఆత్మజ్ఞానం లేకుండా జీవితమాధుర్యాన్ని ఆస్వాదించలేరు. ఆధ్యాత్మికతలేని వ్యక్తికి జీవితం నిస్సారంగా తోస్తుంది. జీవితమంటే రహస్యం కాదు. జీవితమంటే తెరచిన పుస్తకం. ఈ విశ్వంలో అన్నీ మీ కోసమే సిద్ధపరచబడి వున్నాయి. మీ అంతర్ ప్రపంచం మీక్కావల్సిన అన్నింటినీ సమకూరుస్తుంది. మీరు ఏర్పరుచుకున్న నమ్మకాల పట్ల విశ్వాసాలపట్ల ఎంతో ఎరుకతో గమనించడం నేర్చుకోండి. జీవితాన్ని సీరియస్‌గా (seriously) బలవంతంగా తీసుకోకండి.

ప్రాపంచికంగా ఏ లక్ష్యాలయినా ఆధ్యాత్మిక లక్ష్యాలకంటే గొప్పవి కావు. ఆధ్యాత్మిక లక్ష్యాలు శాశ్వతమైన ఆనందాన్ని కలుగజేస్తాయి. ఆధ్యాత్మిక లక్ష్యాల సాధన కోసం వుపక్రమించండి. ఇరవై ఏళ్ళ వయస్సులో వున్న ఒక వ్యక్తి కొన్ని ప్రాపంచిక లక్ష్యాలు ఏర్పరచుకుని వాటినే చాలా గొప్పగా భావిస్తుంటాడు. అదే వ్యక్తికి ఏభై ఏళ్ళ వయస్సులో వున్నపుడు అవే లక్ష్యాలు చాలా చిన్నవిగా అన్పిస్తుంటాయి. కాని ఆధ్యాత్మిక లక్ష్యాలు అన్ని వయస్సుల వారికీ ఒకే విధంగా అత్యున్నతమైనవిగా భావించబడతాయి. మీ ప్రాపంచిక లక్ష్యాలు తప్పని నేను చెప్పడం లేదు. ఆ లక్ష్యాలకు ఆధ్యాత్మికతను మేళవించితే వాటి తాలూకు జీవితానుభవాలు మీకు మరి మీ సమాజానికి ఎంతో ఆనందాన్ని కలుగజేస్తాయి. మీరు ఏర్పరుచుకునే లక్ష్యాలను అధిగమించడం ద్వారా మీరు మరింత ఔన్నత్యాన్ని పొందుతారు. అంతేగాని ఆ లక్ష్యాల ద్వారా ఇతరులతో పోటి ఏర్పడడమో లేదా ఇతరులను అధిగమించడం కోసమో అయితే మీకు దుఃఖం సంభవిస్తుంది. మీలో చాలా మంది ఈ ప్రపంచానికి ఏదో మేలు చేస్తున్నట్లు భావిస్తున్నారు. ఈ ప్రపంచం ఎల్లవేళలా ఉత్తేజభరితంగా చైతన్య వికాసం చెందుతూనే వుంది. మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోవడం కోసమే ఈ భూమి మీద జన్మ తీసుకున్నారు. మిమ్మల్ని మీరు ఉన్నత పరుచుకుంటే ప్రపంచాన్ని ఉన్నత పరిచినట్లే!

ఇతరుల నుండి సహాయ సహకారాలను అర్థించడంలో తప్పులేదు. కాని మీ జీవితం పట్ల మీరు పూర్తి బాధ్యత తీసుకోవడంలోనే జీవిత మాధుర్యాన్ని పూర్తిగా ఆస్వాదించగలగుతారు. సైకాలజిస్టులు, మత గురువులు, డాక్టర్లు, మానసిక వైద్యులు, బంధువులు, స్నేహితులు ఇలా అందరూ మీకు సహాయ సహకారాలు అందించగలరే గాని జీవితంలో తారసపడే అన్ని భౌతిక సంఘటనలకు మీరు బాధ్యత వహించవలసి వుంది. మీ జీవితాన్ని మీరే శాసించుకోవాలి. ప్రతిదానికీ ఇతరులపై ఆధారపడడం మీకు ఏ మాత్రం మేలు చేకూర్చదు. మీ వ్యక్తిగత సమస్యలను మీ అంతర్ శక్తి... అంటే ఆత్మశక్తితోనే పరిష్కరించుకోవడం సాధన చేయండి. దురదృష్టవశాత్తు మీ విద్యావ్యవస్థ ఆత్మశక్తి గురించి, చైతన్య వికాసం గురించి బోధించడం లేదు. మీరు ఇతరులతో పోల్చుకుంటున్నారంటే మీ ఆత్మశక్తి పై మీకు నమ్మకం లేకపోవడం వల్లే జరుగుతుంటుంది. ఇతరులు మారాలి, ఈ ప్రపంచం మారాలి అని మీరు భావిస్తున్నట్లయితే మీదంతా ఒట్టి కపట ప్రేమ, కపట నాటకం అని గుర్తుంచుకోండి. మొదటగా మీరు మారాలి దానికనుగుణంగా ఈ ప్రపంచం స్పందిస్తుంది. మీలో లోపాలు ఏయేవి వున్నాయని వెతుకుతూ కాలయాపన చెయ్యకండి. వాటివల్ల మీకు నిరాశా నిస్పృహలు కలుగుతాయి. ఈ సృష్టిలో ఏ జీవాత్మకూ లోపాలు వుండడమనేది ఎప్పటికీ జరగదు.

'ఈ విశ్వంలో నా యొక్క ఉనికి, నా చైతన్య పరిణామం సాటిలేనివి' అని బలంగా విశ్వసించండి. అపుడే మీరు ఇతర జీవరాశులను గౌరవించడం నేర్చుకుంటారు. అపుడే మీరు మీరుగా వుంటూ మీ స్వభావాన్ని కోల్పోకుండా ఇతరులకు కూడా సహాయ సహకారాలు అందించగలుగుతారు. వాళ్ళను వాళ్ళలాగే గౌరవించడం ప్రేమించడం నేర్చుకోండి. ఇతరులలో వున్న నైపుణ్యాన్ని విశిష్టతను విశాల దృక్పథంతో (with open mind) గౌరవించండి. **మీకున్న సాటిలేనితనాన్ని మీరు గుర్తించగలిగినట్లయితే ఇతరులను డామినేట్ (dominate) చెయ్యాలనే భావన లేదా ఇతరుల వద్ద మోకరిల్లాలనే తలంపు మీకు కలగదు. మిమ్మల్ని మీరు విశ్వసించడం నేర్చుకోండి. అది ఇప్పటినుండే ఈ క్షణం నుండే సాధన చెయ్యడం ప్రారంభించండి. మీరు ఎంచుకునే లక్ష్యాలు సవాళ్ళు మిమ్మల్ని మీరు ఉన్నత పరుచుకోవడానికేగాని ఇతరుల నుంచి మెప్పుకోసం వుండరాదు. ఇతరుల మెప్పుకోసమే అయితే మీకెప్పటికీ ప్రశాంతత రాదు.**

మీరు మల్టిడైమన్షల్ ఆత్మ అని తెలుసుకోండి. మీ చైతన్య పరిణామం, మీ ఆధ్యాత్మిక పురోగతి, మీ ఆత్మశక్తి విస్తరణ ఎన్నో కోణాలలో విస్తరిస్తూ ప్రాపంచిక జీవితాన్ని

ఆధ్యాత్మిక జీవితాన్ని రెండింటినీ మేళవించి జీవిత మాధుర్యాన్ని ఆస్వాదించండి. వాటిని వేరు వేరుగా చూడకండి. మీ దేహం ఈ భౌతిక పదార్థంతో తయారయితే మీ అంతర్ ప్రపంచం మూలచైతన్యశక్తితో నిండివుంది. దేహాన్ని ఆత్మశక్తిని వేరు చేసి చూడడం అసాధ్యం! మీ అంతర్ ప్రపంచం నుండి వచ్చే ఫీలింగ్స్, అంతర్వాణి నుండి వచ్చే సందేశాల కంటే గొప్పవేవి ఈ ప్రపంచంలో వుండనే వుండవు. ఆధ్యాత్మిక గురువులు, మత గురువులు, సైకాలజిస్టులు, శాస్త్రవేత్తలు, స్నేహితులు మరి వాళ్ళ సందేశాలు మీ అంతర్‌వాణి నుండి వచ్చే సందేశాలకంటే గొప్పవేమికావు. ఇతరుల నుండి మీరు ఎంత జ్ఞానాన్ని అయినా పొందవచ్చుగాని అసలైన లోతైన ఆత్మజ్ఞానం మటుకు మీ అంతర్ ప్రపంచం నుండే పొందాలి. మీ అంతర్‌శక్తి + చైతన్యశక్తి మీదే. దాన్నెవరు ఆస్వాదించ లేరు; దాన్నెవరు అనుభూతి చెందలేరు; ఎవరి దారి వారిదే! ఎవరికి వారే యమూనా తీరే!! జీవితమనే అనంత కాల ప్రయాణంలో మీరే ప్రయాణించాలి. ఇతరులెవరూ మీతో బాటు ప్రయాణించరు. **ఈ భూ భౌతిక ప్రపంచంలో పదార్థం . చైతన్యశక్తి . ఆత్మశక్తితో కూడిన భౌతికానుభవాలు అన్నీ జీవాత్మలకూ ఒకే తీరులో వున్నప్పటికీ ఎవరి తీరు వారిదే; ఎవరి దారి వారిదే; ఎవరి విశిష్టత వారిదే! మీ పట్ల మీరు ప్రేమ, దయ, క్షమ కలిగి వుండండి. ఇతరుల పట్ల కూడా అదే విధంగా ప్రవర్తించండి.** సేత్ అని పిలవబడే నేను కూడా జీవితమనే మహా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాను. నాకు తెలిసిన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని జేన్ రాబర్ట్స్ అనే ఆవిడ మరి ఆమె భర్త రాబర్ట్. ఎఫ్. బట్స్ ద్వారా మీకు పంచడం ద్వారా నన్ను నేను ఔన్నత్య పరుచుకుంటున్నాను. మిమ్మల్ని ఉద్ధరించడానికి ఈ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని నేను మీకు పంచడం లేదు. నా సరదా కోసం నా చైతన్య పరిణామాన్ని విస్తరించుకోవడం కోసం చేస్తున్నాను. మీరు పాపాత్ములని, చెడ్డవాళ్ళని చెప్పేవాళ్ళను, మీ స్వభావాన్ని మీకు గల భౌతిక పరిస్థితులను అగౌరవ పరిచే వాళ్ళను, మీకు గల విశిష్టమైన వ్యక్తిత్వాన్ని కించ పరిచే వాళ్ళను, మీ వాస్తవానికి మిమ్మల్ని దూరంగా వుంచడానికి ప్రయత్నం చేసే వాళ్ళను మీరు విశ్వసించకండి. దుఃఖాన్ని, బాధను, శిక్షను మీరు అనుభవించి తీరాల్సిందే, దాని వల్ల మీరు ఆధ్యాత్మికంగా ఎదుగుతారని బోధించేవాళ్ళను విస్మరించండి. ధైర్యంగా వుండండి. జీవితంలో అన్నీ సవాళ్ళే తప్ప భయపడడానికి మీ అంతర్ ప్రపంచంలో ఏ అడ్డంకులూ వుండవు.

ఈ విశ్వంలో ఏ శక్తీ మిమ్మల్ని భయపెట్టదు. మీ పరిమిత జ్ఞానం వల్ల, మీ పరిమిత నమ్మకాల వల్ల మీకుగా మీరు ఆటంకాలు కల్పించుకుంటున్నారు తప్ప ఈ

విశ్వంలో మీ చైతన్య పరిణామాన్ని ఏ శక్తీ ఆటంకపరచడం లేదు. మీ జీవితాన్ని, మీ జీవితానుభవాలను మీ అంతర్ శక్తి ద్వారా సృష్టించుకోండి. **మీ అంతర్ శక్తికి మించిన మహిమాన్వితమైన శక్తి ఏదీ ఈ విశ్వంలో లేనే లేదు. మిమ్మల్ని మీరు గౌరవించుకోండి. మీలో వున్న దైవాన్ని ఆరాధించండి. మీరే దైవాలు! మీలోని దైవత్వమే మీకు ఇవ్వబడిన మహిమాన్వితమైన బహుమతి! మీ విశ్వాసాలకు నమ్మకాలకు అనుగుణంగా మీ వాస్తవాన్ని మీరే సృష్టించుకుంటున్నారు! మీకు పరిమితులున్నాయని మీరు విశ్వసిస్తే తప్ప ఈ విశ్వంలో మీ ఆత్మశక్తికి అసాధ్యమంటూ ఏదీ లేనే లేదు! ప్రాపంచికంగా గాని, ఆధ్యాత్మికంగాగాని జీవితంలో విజయాలు సాధించడానికి గొప్ప ఇంటెలిజెన్స్ లేదా గొప్ప సంపద లేదా గొప్ప స్థానం ఏదీ అవసరం లేదు. మీ ఆత్మశక్తి ... అంటే మీ అంతర్ ప్రపంచం ద్వారా అన్నీ సుసాధ్యమేనని తెలుసుకోండి.**

మీ అంతర్ శక్తి అపారమైనదని, ఏదైనా సాధించగల సర్వ సమర్థతను మీరు కలిగివున్నారని మీరు తెలుసుకున్న క్షణం నుంచే మీ జీవితంలో తారసపడే భౌతిక సమస్యలన్నీ మీకు సవాళ్ళుగా (challenges) జ్ఞానాన్ని బోధించే గొప్ప అవకాశాలుగా (opportunities) అన్పిస్తాయి. మీ దేహం కూడా అందుకు ప్రతిస్పందిస్తుంది. మీ దేహంలోని జీవకణాలు కూడా ఉత్తేజాన్ని పొందుతాయి. దేహం అందుకనుగుణంగా జీవరసాయనాలను ఎంజైములు + హార్మోనుల రూపంలో విడుదల చేసుకుని తన ఆరోగ్య రక్షణ వ్యవస్థను పటిష్టపరుచుకుంటుంది. జీవితాన్ని పాజిటివ్‌గా తీసుకున్నపుడు దేహ ఆరోగ్యం చక్కగా వుంటుంది. ఈ భౌతిక ప్రపంచంలో జీవితం కొనసాగుతున్నంత కాలం భౌతిక సవాళ్ళు (మీ భాషలో చెప్పాలంటే సమస్యలు) తప్పని సరి. కర్మలు చెయ్యకుండా ఏ జీవాత్మ కూడా ఈ భూ భౌతిక ప్రపంచంలో చైతన్య పరిణామం చెందడం జరగదు. ఎన్ని ఎక్కువ కర్మలనాచరిస్తే అంత జ్ఞాన విస్తరణ కావింపబడుతుంటుంది. భూమి మీద జన్మ తీసుకోకమునుపే మీకు ఎటువంటి భౌతిక దేహం కావాలో, కొన్ని కోణాలలో జీవితాన్ని దర్శించడానికి అంగవైకల్యాన్ని లేదా బుద్ధి మాంద్యాన్ని ఎంచుకొని ఏ విధంగా పరిణామం చెందాలో, ఏ ప్రాంతంలో పుడితే తన ఆధ్యాత్మిక పురోగతికి అనువుగా వుంటుందో అన్నీ నిర్ణయించుకుని జన్మ తీసుకోవడం జరుగుతుంటుంది. మీ జీవితంలోని ఈ వర్తమాన పరిస్థితులు ఎటువంటివైనా కానీగాక అవన్నీ మీ డిజైన్ (design) ప్రకారమే సృష్టింపబడుతున్నాయి. యుద్ధాలలో, యాక్సిడెంట్లలో (accidents) 'ప్రాణాంతక వ్యాధుల వల్లో (fatal diseases),

తుపానులలో... చనిపోవాలని మీ అంతరాలలో సంకల్పించుకోవడం వల్లనే అటువంటి పరిస్థితులలోనే చనిపోవడం జరుగుతుంది. మీ కాన్షియస్ మైండ్ పరిధిలో మీ రీజినింగ్ మైండ్ ద్వారా విశ్లేషిస్తే అన్నింటికీ మీకు సమాధానాలు దొరకవు.

'నేను అంగవైకల్యంతో కూడిన జన్మను ఎంచుకోను గదా?' అని మీరు భావించవచ్చు. కాని మల్టిడైమన్షనల్‌గా వుండే ఈ ఆత్మ అనేక డైమన్షన్స్‌లో, అనేక లోకాలలో ఒకేసారి అనేక రకాల దేహాలను ధరించి చైతన్య పరిణామం చెందుతూందని మీరు తెలుసుకోవాలి. ఆత్మ తనకు గల అనేక దేహాలతో ఈ భూమి మీద అంగవైకల్యంతో, ఇంకో లోకంలో డాక్టరుగా, ఇంకో లోకంలో కళాకారుడిగా, ఇంకోలోకంలో జంతువుగా రకరకాల దేహాలను ధరించి చైతన్య పరిణామం చెందుతూ వుంటుంది. మీ ఆత్మ ఈ దేహానికి ఈ భూమికి మాత్రమే పరిమితం కాదుగదా!

ఊహాశక్తి (power of imagination) మీకియ్యబడిన గొప్ప వరం! మహత్తరమైన ఊహాశక్తిని ఉపయోగించడం ద్వారా మీ అంతర్ శక్తిని బాహ్య ప్రపంచంలోనికి భౌతిక సంఘటనలుగా రూపాంతరం చెందించవచ్చని మీకిదివరకే తెలియజెయ్యడం జరిగింది. సంకల్పశక్తి (Intent or Will power) మరి ఊహాశక్తి రెండూ ఒకటే. ఇవి రెండూ వేరువేరుగా మీ కన్పించవచ్చుగాని సంకల్ప శక్తి యొక్క తీవ్రతనే ఊహాశక్తిగా పిలవవచ్చు. మీ విద్యా వ్యవస్థ నేర్పిన పరిమిత జ్ఞానం వల్ల, మీ సమాజం ద్వారా సంక్రమించిన బుద్ధి వల్ల ఊహాశక్తి యొక్క మహిమాన్వితమైన శక్తిని మీ మానవజాతి గుర్తించలేకపోతూంది. ప్రతిరోజూ మీ కెదురయ్యే సమస్యలకు, మీ ఆరోగ్య సమస్యలకు, ఊహాశక్తి ద్వారా సమాధానాలు లభిస్తాయి. మీరు ఎరుకలోవున్నా లేకపోయినా, మీరు చేతనావస్థలో వున్నా అచేతనావస్థలో వున్నా ఊహాశక్తిని ప్రతిక్షణమూ వుపయోగిస్తున్నారు. ఊహాశక్తిని ఉపయోగించడంలో జాగరూకత వహించకపోవడం వల్ల నిర్మాణాత్మకంగా వినియోగించుకోవడంలో విఫలమవుతున్నారు.

ఊహాశక్తిని వుపయోగించినపుడు మీ అంతర్ ప్రపంచం నుండి సందేశాలు పంపబడుతుంటాయి. ఏదైనా సమస్య ఎదురయినపుడు దాని గురించి బాధపడుతూ శక్తిని వృధా చెయ్యడం కాకుండా ఆ సమస్య తాలుకు పరిష్కారం లభించినట్లు మీ ఊహాశక్తితో కలలు కనండి. ఆ సమస్య పరిష్కారమయితే మీ ఎమోషన్స్ + ఫీలింగ్స్ ఎలా వుంటాయో కూడ ఊహించండి. ఊహాశక్తి ద్వారా మీ అంతర్ ప్రపంచం యాక్టివేట్ (activate) అయి స్పందిస్తుంది. సమస్యకు పరిష్కారాన్ని ఎంత తీవ్రంగా వాంఛిస్తున్నారు?

మీ ఊహాశక్తిని ఎంత బలంగా విశ్వసిస్తున్నారు? వాటి ఆధారంగా మీ అంతర్ ప్రపంచం నుండి సందేశాలు అందుతాయి. ఊహాశక్తి ద్వారా ఏ రోజు ఏర్పడే సమస్యలను ఆరోజే పరిష్కరించుకోవచ్చు. మీకు ఎటువంటి సమస్య ఎదురయినా దాన్ని పూర్తిగా జాగరూకతతో పసిగట్టగలిగితే దాని పరిష్కారాన్ని మీ స్వప్నాల ద్వారా రాబట్టవచ్చు లేదా పరిష్కారం ఇది వరకే లభించినట్లు మీ మనోశక్తితో ఊహించుకోండి. ఎమోషన్స్ + ఫీలింగ్స్‌ను కూడ ఊహాశక్తికి జోడించండి. సమస్య పుట్టినపుడే దాని పరిష్కారం కూడ పుట్టింది. సమస్య + పరిష్కారం రెండూ ఈ వర్తమానంలోనే వున్నాయి. మీ అంతర్ ప్రపంచం నుండే రెండూ సృష్టింపబడుతున్నాయి. సమస్య అనేది అంతర్ ప్రపంచం నుండి వెలువడినపుడు, దాని పరిష్కారం కూడ అంతర్ ప్రపంచం నుండే వెలువడుతుంది. అంతేకాని ఒకటి అంతర్ ప్రపంచం నుండి మరొకటి బాహ్య ప్రపంచం నుండి ఉద్భవించవు గదా? ఏరోజు సమస్యలకు ఆ రోజే సమాధానాలివ్వబడతాయని మీరు విశ్వసించి తీరాలి. ఎంచేతంటే సమస్య + పరిష్కారం రెండూ ఒకే మూలం నుండి ఒకేసారి వెలువడుతున్నాయి. సమస్యలు (సవాళ్ళు) కారణం' అయితే వాటి పరిష్కారం కార్యం' అవుతుంది. సమస్య అనేది మీరు చైతన్య పరిణామం చెందడం కోసం దాన్ని జీవితానుభవంగా ఎంచుకున్న ఒక ప్రయోగం.

మీ జీవితంలో ఎదురయ్యే అన్ని సవాళ్ళకూ మీ అంతర్ ప్రపంచం నుండి సమాధానాలు లభిస్తాయి. మీ అంతర్ ప్రయాణంలో – ఇతర డైమన్షన్లలో మీ ఆత్మ ధరించి వున్న ఇతర దేహాలతో వున్న మీ నుండి, మీ పూర్ణాత్మ నుండి, ఇతర లోకాలలో వుంటూన్న మీ నుండి, మీ పూర్ణాత్మ తాలూకు అంశాత్మల నుండి – వీటిలో దేన్నుంచయినా సమాధానాలు మీకు అందవచ్చు. మీ అంతర్ ప్రపంచమే ఆ పని చేసి పెడుతుంది.

మీ జీవితంలో ఎదురయ్యే సవాళ్ళకు దేహంలో వున్న 'దేహి' (అంటే 'నేను') నుండి సమాధానాలు లభిస్తాయి. దేహంలో వున్న మీరు + పూర్ణాత్మ + పూర్ణాత్మ నుండి వెలువడిన అంశాత్మలు + ఇతర డైమన్షన్స్(లేదా లోకాలలో)లో వివిధ దేహాలను ధరించివున్న మీ ఆత్మ – వాటిలో దేని ద్వారా అయినా మీకు సమాధానం దొరుకుతుంది. ఇక్కడ సవాళ్ళు అంటే భౌతిక సంఘటనలతో ముడిపడినవి మాత్రమేగాక, ఆధ్యాత్మికంగా, మానసికంగా, ఆత్మపరంగా కూడ ముడిపడిన సంఘటనలని అర్థం చేసుకోవాలి. మల్టిడైమన్షన్స్‌లో ఇమిడివున్న మూలాల నుండి మీ అంతర్ ప్రపంచం ద్వారా సమాధానం లభిస్తుంది. మీ అంతర్ ప్రపంచం తన చైతన్యశక్తి ద్వారా అన్ని డైమన్షన్స్‌లో వున్న

మిమ్మల్ని,పూర్ణాత్మను, పూర్ణాత్మ నుండి వెలువడిన అంశాత్మలను అనుసంధాన పరుస్తుంది. ఈ సమాధానాలు ఐడియాల (ideas) రూపంలోనో, ఛాయల (images) రూపంలోనో, సహజావబోధన (intuition) ద్వారానో, కలల (dreams) రూపంలోనో, ఫ్లాష్‌ల (flashes) రూపంలోనో మీ చైతన్యశక్తి ద్వారా అందించబడుతుంటాయి. వాటిని మీరు జాగరూకతతో పసిగట్టడం సాధన చేయవలసి వుంది.

మీ గత జన్మల నుండి కూడ సమాచారాన్ని రాబట్ట వచ్చు. డ్రాయింగ్ కళ గురించి (drawing) మీకు కొన్ని సమాధానాలు ఈ వర్తమానంలో అవసరముందని మీరు భావించినపుడు, గత జన్మలలో ఏదో ఒక జన్మలో మీరు డ్రాయింగ్ నేర్చుకుని వుంటే దాని తాలూకు నైపుణ్యం ఈ జన్మలో మీ అంతర్ ప్రపంచం ద్వారా అందించ బడుతుంది. అట్లాగని గతజన్మల జ్ఞానాన్నంతా ఒక ఉప్పెనలా ఒక తుపానులా ఇపుడు వుపయోగించి తీరాలని నిబంధనలు ఏవీ వుండవు. అన్ని జన్మల తాలుకు జ్ఞానం మీ మనోశక్తిలో (అంటే మైండ్) మీ అంతర్ ప్రపంచంలో ఇపుడే ఈ వర్తమానంలో మీకు అందుబాటులో వుంది. మీ దేహాన్ని ఇచ్చిన మీ తల్లిదండ్రులు, మీ పూర్వీకుల జ్ఞానమంతా మీ దేహంలోని జీవకణాలలో క్రోడీకరించబడివుంది. మీ పూర్ణాత్మ + దాని అంశాత్మలు+ ఇతర డైమన్షన్స్‌లో మీరు + మీ గత జన్మలలోని మీరు + మీ పూర్వీకులు + మూలచైతన్యం నుండి 'జ్ఞానం' మీ అంతర్ ప్రపంచం ద్వారా మీ అందుబాటులోనికి ఎల్లవేళలా సిద్ధంగా వుంది. మీరు ఏ దిశలో చైతన్య పరిణామం జరగాలో లేదా ఎన్ని దిశలలో మీ ఆత్మ చైతన్యశక్తి విస్తరించాలో, ఏ లోకాన్ని ఎంచుకోవాలో అంతా మీ సంకల్పశక్తిపై ఆధారపడి వుంది.

ఇతర డైమన్షన్స్‌లో వున్న మీరు సాధించే సాహస కార్యాల తాలూకు సమాచారం + జ్ఞానం అనేవి చైతన్యశక్తి ద్వారా మీ అంతర్‌శక్తికి అందించబడుతూంది. ఈ విశ్వంలో మీరు ఒంటరివారు కారు. అనేకానేక కోణాలలో, అనేకానేక డైమన్షన్స్‌గల లోకాలలో ఏకకాలంలో వివిధరకాల దేహాలను ధరించి మీ ఆత్మ విరాజిల్లుతోంది; చైతన్య పరిణామం చెందుతూంది. అన్నింటి నుండి మీక్కావల్సిన జ్ఞానాన్ని మీ అంతర్ ప్రపంచం నుండి రాబట్టవచ్చు. ఈ వర్తమానంలో మీ చైతన్యశక్తి ఎంత వరకు విస్తరించి వుందో, మీ కాన్షియస్ మైండ్ ఎంత వుందో, మీ జ్ఞానపరిధి ఎంత మేరకు విస్తరించి వుందో మీ నమ్మకాల వ్యవస్థ ఎంత పరిధి వరకు వుందో వాటికనుగుణంగా మీ అంతర్ ప్రపంచం నుండి జ్ఞానాన్ని రాబట్టి భౌతిక జీవితానుభవాలను వాస్తవం చెందించుకోవచ్చు. మీ

జ్ఞాన పరిధి, చైతన్యశక్తి పరిధి, కాన్షియస్ మైండ్ పరిధులను ఎంత విస్తరింపజేస్తే అంత పెరుగుతుంటాయి. వాటి పరిధుల విస్తరణకు అవధులు వుండవు. మీ తెలివితేటలను ఏ పరిధి విస్తరణకైనా పదునుపెట్టవచ్చు. మీ బుద్ధిని మరింత షార్ప్ (sharp) చెయ్యడంలో ఏ మేరకైనా విస్తరింపజెయ్యవచ్చు. వీటికి సరిహద్దు లేమీ వుండవు. ఈ భౌతిక ప్రపంచంలో మీ జీవితానుభవాలను, చైతన్య పరిణామ విస్తరణను అపరిమితంగా విస్తరింపజెయ్యగల స్వేచ్ఛ మీకు వుంది. మీరు సంకల్పించుకోకుండా, ఏదీ కోరకుండా ఏదీ కూడ ఈ భౌతిక ప్రపంచంలోగాని, మరే ప్రపంచంలో గాని సాధింపబడదు.

ఈ వర్తమానంలోనే ఏ నిర్ణయమైనా మీరు తీసుకోవాలి. ఈవర్తమానం నుండే మీ జీవిత గమనం మరి జీవితానుభవాల యొక్క దిశ మారుతుంటుంది. ఈ వర్తమానం వృత్తం యొక్క కేంద్రబిందువయితే, ఆ బిందువుకు అటూ ఇటూ వున్న వ్యాసార్థాలు గతం మరి భవిష్యత్ అవుతాయి. క్రొత్త కాన్సెప్ట్‌తో, క్రొత్త ఆలోచనా విధానంతో, నూతన ఒరవడితో కూడిన నమ్మక వ్యవస్థతో ఈ వర్తమానంలో నిత్యనూతనమైన జీవితాన్ని ప్రారంభించండి. భూత కాలంలో మీరు పొందిన జీవితానుభవాలకు ఈ వర్తమానంలో మీరు ప్రారంభించే నూతన జీవితానికి సంబంధం వుండదు. 'గతంలో చేసిన తప్పులే మిమ్మల్ని ఇప్పటికీ పీడిస్తున్నాయి.' అనే వాక్యం మీకొక సామెతగా ప్రచారంలో వుంది. కాని ఆ వాక్యం శుద్ధ తప్పు. గత జన్మలలో చేసిన కర్మలే ఈ జన్మలో అనుభవించాలి. అనే వాదన కూడ శుద్ధ తప్పు. మీ అంతర్ ప్రపంచంలో అపారమైన అనంతమైన శక్తి వుంది. సంపూర్ణ జ్ఞానాన్ని 'పూర్ణాత్మ + దాని అంశాత్మలు + మీరు + అనేక డైమన్షన్స్‌లో వివిధ దేహాలలో వున్న మీరు' నుండి మీరు ఏక్షణంలో సంకల్పిస్తే ఆ క్షణం నుండే మీ అంతర్ ప్రపంచం నుండి అందించబడుతుంది. గతం – వర్తమానం – భవిష్యత్తు అనేవి ఏక కాలంలో ఒకేసారి నడుస్తున్నాయి. ఒక వృత్త పరిధిని 120 డిగ్రీల కోణంలో మూడు సమాన భాగాలు చెయ్యండి. ఒక భాగం వర్తమానం అయితే మిగతా రెండు భాగాలు గతం, భవిష్యత్ అవుతాయి. వృత్తమూ, అందులోని మూడు భాగాలు (గతం – వర్తమానం – భవిష్యత్తు) ఇపుడే మీ కళ్ళ ముందు కన్పిస్తున్నాయి.

మీరు కాలాన్ని ఒకే డైమన్షన్‌లో ప్రామాణికతగా తీసుకోవడం వల్ల గతం – వర్తమానం – భవిష్యత్తు అనేవి ఏర్పడినాయి. మల్టిడైమన్షన్స్ ఆత్మకు కాలం కూడ మల్టిడైమన్షనల్‌గా ప్రామాణికంగా తీసుకోబడుతుంది. **ఇపుడొక ఎక్సర్‌సైజును (exercise) సాధన చెయ్యండి.**

1. సుఖాసనంలో హాయిగా కూర్చుని కళ్ళు మూసుకుని సాధారణ ఉచ్ఛ్వాస నిశ్వాసలను కొన్ని నిముషాల పాటు గమనించండి.
2. మీ మనస్సుకు హాయిగా అన్పించినపుడు మీ దేహం ఆధ్యాత్మికంగా, భౌతికంగా, మానసికంగా శక్తివంతమవుతూందని ఉత్తేజాన్ని పొందుతూందని వూహించుకోండి. అయిదు నిమిషాలపాటు అలా ఊహించుకోండి. బాగా రిలాక్సవ్వండి.
3. భౌతికంగా కాని, ప్రాపంచికంగా కాని, ఆధ్యాత్మికంగా కాని, ఆరోగ్యపరంగా కాని మీరు ఏది సంకల్పించుకున్నారో అది ఇప్పటికే వాస్తవం చెంది మీ జీవితానుభవంలో వున్నట్లు ఎమోషన్స్ + ఫీలింగ్స్‌తో ఊహాశక్తితో కలలుకనండి. ఈ ప్రక్రియను కూడా అయిదునుండి పది నిమిషాలు సాధన చెయ్యండి.
4. మీ అశక్తత గురించి, లేమి గురించి, అసాధ్యం గురించి ఎటువంటి పరిస్థితుల్లోనూ మీ ఊహాశక్తిలోనికి రానీయకండి.
5. ఎప్పుడు జరుగుతుందో, ఎలా జరుగుతుందో, ఎవరి ద్వారా జరుగుతుందో అని సంశయాలు పెట్టుకోకుండా మీ అంతర్ ప్రపంచాన్ని విశ్వసించండి.

మీ నమ్మకాలకు, విశ్వాసాలకు, మీ ఆలోచనలకుగల శక్తితీవ్రత అనుగుణంగా భౌతిక వాస్తవం సృష్టించబడుతుంది. బాల్యంలో మీకు నూరిపోసిన ఆలోచనలు, నమ్మకాలు మిమ్మల్ని ఇప్పటికే బలంగా ప్రభావితం చేస్తుంటాయి. ఈ వర్తమానం అనేది మాత్రమే గాకుండా 'రేపు' (tomorrow) అనేది కూడా వుందని మీకు బాల్యంలోనే నూరిపోస్తారు. ఆధ్యాత్మికంగా, మానసికంగా, జీవరసాయనికంగా, ఎమోషన్స్ పరంగా మీరు ఇప్పుడు పొందే అనుభవాలన్నీ దాదాపుగా చిన్నతనంలో పొందిన నమ్మకాల వల్లనే సంభవిస్తున్నాయి. వర్తమానం నుండే నిత్యనూతనమైన జీవితాన్ని ప్రారంభించవచ్చని మీకు తెలియాల్సి వుంది. బాల్యంలో మీకు నూరిపోయబడిన నమ్మకాలను ఈ క్షణమే పరిత్యజించి 'క్రొత్త జీవితాన్ని' ప్రారంభించడానికి పూనుకోవాలి. మీ తల్లిదండ్రుల ద్వారా, సంఘం ద్వారా, మీ విద్యావ్యవస్థ ద్వారా 'పరిమిత జ్ఞానం' మాత్రమే మీకు బోధింపబడుతూంది.

'ఆవగింజంత విశ్వాసం ఒక పర్వతాన్ని కదిలించి వెయ్యగలదు' అని ఒక సూక్తి బైబిల్‌లో వుంది. ఆవగింజంత విశ్వాసం మీ ఆరోగ్యాన్ని పటిష్టపరచగలదు. అదే విశ్వాసాన్ని నెగిటివ్‌గా వుపయోగించినపుడు ప్రకృతి వైపరీత్యాలను కూడా సృష్టించగలదు.

మీ ఆలోచనా తరంగాలను, సంకల్పాలను ఏ వైపు మళ్ళిస్తున్నారో ఆ వైపు భౌతిక సంఘటనలను సృష్టించగలరు. మీకు అనారోగ్యం పట్ల విశ్వాసం, నమ్మకం వున్నట్లయితే లేదా అనారోగ్యం సంప్రాప్తిస్తుందని భయపడుతున్నట్లయితే అనారోగ్యమే ఎదురవుతుంది. ఆత్మపరంగా, దేహపరంగా మీకు ఎన్నో సందేశాలను ఇవ్వడానికి 'కలలు' చాలా ఉపయోగపడతాయి. దేహపరంగా మీకున్న దీర్ఘకాలిక వ్యాధికి లేదా ప్రాణాంతక వ్యాధికి కలల ద్వారా చికిత్స జరుగుతుంది లేదా కలల ద్వారా ఏ ఔషధాలు తీసుకోవాలో సందేశం అందించబడుతుంది. జాగృదావస్థలో మీరెదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాన్ని కలల ద్వారా అందించబడుతుంది. ఆత్మ యొక్క మల్టి డైమన్షనల్ స్వరూపాన్ని, ఆత్మయొక్క అనంతమైన శక్తిని గురించి మీకు కలల ద్వారా తెలియజెయ్యబడుతుంటుంది. మీ ఆలోచనా విధానం మారిన తక్షణమే మీ దేహం మరి మీ భౌతిక పరిస్థితులు కూడా ఆ క్షణంనుండే మార్పునకు లోనవుతాయి. కొన్ని సంవత్సరాల తరబడి ఒక మొండి వ్యాధితో సతమతమవుతున్న వ్యక్తి అకస్మాత్తుగా తన ఆలోచనా విధానాన్ని మార్చుకొని 'కళల' పట్ల మొగ్గు చూపినాడనుకోండి. ఆ క్షణం నుండే అతని దేహంలో ఎవరూ ఊహించని (డాక్టర్లతో సహా) మార్పులు సంభవించి అతని వ్యాధి నయమవ్వడమూ, ఆ కళలను అభ్యసించడానికి అతని దేహం తయారవ్వడమూ జరుగుతుంది. ఆత్మజ్ఞాన జిజ్ఞాస, కళలు, మతం, రాజకీయాలు, ప్రేమ వ్యవహారాలు... ఇలా చాలా విషయాల పట్ల మీరు ఆసక్తి కనబరచడం, వాటికనుగుణంగా మీ దేహంలో మార్పులు మరి భౌతిక పరిస్థితులలో మార్పులు సంభవిస్తుంటాయి. మీ మనోశక్తి నుండి వ్యాధి జనిస్తుంది తప్ప మీ దేహం తనంతటతాను ఏ వ్యాధినీ సంక్రమింప జేసుకొనజాలదు. భౌతిక పరిస్థితులు కూడా అలాగే సృష్టింపబడుతున్నాయి.

ఈ ప్రపంచంలో దుఃఖం, విషాదం, అన్యాయం అపారంగా వున్నాయని విశ్వసించే వ్యక్తికి అతనికి ఎదురయ్యే అన్ని భౌతిక పరిస్థితులూ – దుఃఖం, విషాదం, అన్యాయాన్ని తీసుకు వస్తాయి. ఇతరులలో కూడా దుఃఖం, విషాదాన్ని వెదుకుతుంటాడు. మీరు దేని పట్ల ఆసక్తి చూపుతుంటారో, దేన్ని విశ్వసిస్తుంటారో, దేని గురించి భయపడుతూ కలత చెందుతుంటారో వాటికి సంబంధించిన భౌతిక సంఘటనలను మాత్రమే మీ జీవితానుభవాలలోనికి ఆహ్వానిస్తారు. మీ నమ్మకాలకు అనుగుణంగా సామాజిక గ్రూపులు, రాజకీయ గ్రూపులు, స్నేహితులు లేదా పర్సనల్ అనుభవాలు మీ వైపు ఆకర్షింప బడుతుంటాయి. మీ నమ్మకాల ద్వారా మిమ్మల్ని మీరు హిప్నటైజ్ (Hypnotise)

చేసుకోవడం ద్వారా మీరు వాటివైపు ఆకర్షింపబడడమో లేదా మీరు వాటిని ఆకర్షించడమో జరుగుతుంటుంది.

మీ జీవితంలో ఎదురయ్యే సమస్యలను సవాళ్ళుగా, బాధ్యతగా స్వీకరించండి. ప్రతి సమస్యా తనతోబాటు ఎంతో జ్ఞాన సందేశాన్ని మోసుకొస్తుంది. ప్రతి సమస్యను సవాలుగా స్వీకరించి దాన్ని అధిగమించడం ద్వారా మీకు మానసిక పరిణితి మరి ఆధ్యాత్మిక పరిణితి పెరుగుతుంటాయి. సమస్యనుండి పారిపోవాలనుకోవడం పిరికితనమైన చర్య. మీ ఆత్మశక్తితో పరిష్కారంకాని, అసాధ్యమైన సమస్య అంటూ ఏదీ వుండదు. ఇతరుల నుండి సానుభూతిని ఆశించకండి. సమస్య అనేది మీ ఆత్మశక్తి కంటే గొప్పది కాదు. సమస్యను సాహసోపేతంగా ఎదుర్కోవాలి. ప్రతిదానికీ ఇతరులపై ఆధారపడడం, ఇతరులు తనకు చేసిపెడతారని ఆశించడంలాంటివి– మీ ఆధ్యాత్మిక శక్తిని, జీవశక్తిని కించ పరిచినట్లవుతుంది. ప్రార్థన కూడా అలాంటిదే. **మీ సమస్యలను పరిష్కరించాలని 'దేవుడు' అనేవాడిని వేడుకోవడం అపారమైన మీ ఆత్మశక్తిని విశ్వసించకపోవడం వల్లనే జరుగుతుంది. వాస్తవానికి దేవుడు మీ అంతర్ ప్రపంచంలోనే వున్నాడు. మీ ఆధ్యాత్మిక దౌర్బల్యం మరి మానసిక దౌర్బల్యం వల్ల మీరు ప్రార్థనను ఆశ్రయించడం జరుగుతుంది. మీ జీవితంలో ఎదురయ్యే అన్ని జీవితానుభవాలకూ మీరు బాధ్యత వహించవలసివుంది. బాధ్యత అనేది మిమ్మల్ని సాహసవంతుల్ని చేస్తుంది; బాధ్యత అనేది మీకు ఆధ్యాత్మిక పరిణితిని పెంచుతుంది. ప్రతి దానికీ ఇతరులపై ఆధారపడడం మానుకోండి. మీ ఆత్మప్రబోధం ప్రకారమే నడుచుకోండి.** ఈ వర్తమానంలోనే సమస్య + పరిష్కారం సృష్టింపబడి వాస్తవం చెందుతున్నాయని మీరు గుర్తుంచుకోవాలి. మీరు ఆత్మశక్తిని ఆశ్రయించడం ద్వారా సమస్య గురించిన అస్పష్టత అయోమయం వాటంతట అవే కనుమరుగవుతాయి.

ఈ భూమి మీద లేదా మరే లోకంలోనైనా ప్రతి జీవాత్మా తన ఆత్మశక్తి ద్వారా రక్షణ కవచం కలిగి వుంటుంది. మీ అనుమతి లేకుండా ఈ విశ్వంలో ఏ శక్తీ ఆ రక్షణ కవచాన్ని చేధించి మీకు హాని తలపెట్టడం జరగదు. మీ అంతర్ ప్రపంచంలో గల ఆ రక్షణ కవచం దుర్భేద్యమైనది. మీకు ఎదురయ్యే భౌతిక సమస్యలు + అనారోగ్యం కాన్షియస్ మైండ్ పరిధిలో ప్రభావితం చేసి కాన్షియస్ మైండ్ పరిధిని విస్తరింపజేస్తున్నాయి. అంతర్ ప్రపంచంలో భౌతిక సమస్యలు + అనారోగ్యం అనేవి వుండవు. మీ మైండ్ యొక్క పరిధిని పెంచడం కోసమే భౌతిక సమస్యలను + అనారోగ్యాన్ని

సృష్టించుకుంటున్నారు. ఈ విశ్వంలో మీరు దేనికీ భయపడాల్సిన పనిలేదు. అన్నింటినీ మీ చైతన్య పరిణామం కోసం సృష్టించుకుంటున్నారు. సమస్యలనుండి తప్పించుకొని పారిపోతే అవి మరో రూపంలో మీకు ఎదురవుతాయి. అవి మీ నుండి దూరంగా వెళ్ళవు. ఎంచేతంటే వాటిని సృష్టించింది మీరే కనుక. మీ నీడ మిమ్మల్ని ఎలా వెంబడిస్తుందో, సమస్య కూడా అదే విధంగా వెంబడిస్తుంది. సముద్రం నుండి 'అల' ఎలా పుట్టిందో, మీ ఆలోచనల నుండి సమస్య (సవాలు) కూడ అలాగే పుట్టింది. సముద్రానికి 'అల' ఎంత అవసరమో మీ అంతర్ ప్రపంచానికి 'సమస్య' అంతే అవసరమని మీరు తెలుసుకోవాలి. భౌతిక సంఘటనలు అనేవి లేకుండా కర్మలను ఆచరించకుండా జీవాత్మలు ఈ భూ భౌతిక ప్రపంచంలో చైతన్య పరిణామం చెందడం జరగదు.

ఆరోగ్య సమస్యలు, భౌతిక సమస్యలు సృష్టింపబడడానికి మీరే కారణం. అయితే వాటిని ఎదుర్కొని పరిష్కరించుకోవడానికి కూడా మీరే కారకులు కావాలి. దేహం మరి మైండ్ మధ్య సమన్వయం లోపించినపుడు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అపరిష్కృతంగా వున్న సమస్యలను అధిగమించడం ద్వారా మీలో సృజనాత్మక శక్తి పెంచబడుతుంది; చైతన్య పరిణామం మరో ముందడుగు వేస్తుంది. మీరింకా అనారోగ్యంతో బాధపడుతున్నారా? అయితే దేహం – మైండ్ మధ్య ఎక్కడ సమన్వయం లోపించిందో మీ అంతర్ ప్రయాణం ద్వారా తెలుసుకొని దాన్ని సరియైన రీతిలో సరిదిద్దుకోండి. మీరు ఈ ప్రకృతిలో ఒక విడదీయరాని భాగం. ఏ దివ్యశక్తి వల్ల మీరు మరి మీ ప్రకృతి సృష్టింపబడుతూందో, అదే దివ్యశక్తి ఈ విశ్వమంతా వ్యాపించివుంది. మీ భౌతిక ప్రపంచమంతా దివ్య శక్తితో నిండివుంది. మీ చైతన్య పరిణామాన్ని పెంచడంలో ఎంతో ఉత్తేజకరంగా సహాయసహకారాలు అందిస్తూవుంది.

ఒక జంతుజాతి సమూహంలో ఏదైనా జంతువుకు జబ్బు చేసినపుడు మిగతా జంతువులు దాన్ని ఏకాంతంగా వుంచి విశ్రాంతి తీసుకునేటట్లు చేస్తాయి. ఇది చాలా సహజమైన విధానం. జబ్బు చేసినపుడు ఆ జంతువు ఔషధి మొక్క భాగాలను సేవించడమో, నది ఒడ్డున బురద గుంటలో దేహాన్ని ముంచడం ద్వారా సహజహీలింగ్ చేసుకోవడమో చేస్తుంది. మీ డాక్టర్లు జబ్బు చేసిన వాళ్ళను ఆసుపత్రులలో క్రుక్కేసి ప్రకృతికి దూరంగా చాలా దయనీయమైన పరిస్థితులలో బందీలను చేస్తున్నారు. ఈ విధానం చాలా అసహజమైనది. డాక్టర్లు + నర్సుల జాలి, దయాదాక్షిణ్యాల మీద వ్యాధిగ్రస్తులను ఆధార పడేటట్లు చేసి దివ్యమైన అంతర్ శక్తి పట్ల విశ్వాసం కోల్పోయేట్లు చేస్తున్నారు. జైళ్ళలో

ఖైదీలను కూడా చాలా అసహజమైన పద్ధతులతో బందీలుగా చేసి ప్రకృతికి దూరంగా వుంచుతున్నారు. ద్వేషం అనేది ద్వేషానికి సమాధానం కాదు. ఖైదీలకు బాహ్య ప్రపంచంతో బంధాలను త్రెంచేసి వాళ్ళను ఆధ్యాత్మికంగా, మానసికంగా, భౌతికంగా ఎదగనీయకుండా చెయ్యడం చాలా హీనమైన చర్య! జైళ్ళ నుండి విడుదలయన తర్వాత వాళ్ళు మరింత వక్రమార్గంలో నడిచేందుకు మీరే ప్రోత్సహిస్తున్నారు. జైళ్ళలో వున్నపుడు వాళ్ళ జీవశక్తిని అణగద్రొక్కడం ద్వారా మానసిక ఎదుగుదల కుంటుబడుతుంది.

మీ అస్తవ్యస్త విధానాల వల్ల జైలునుండి విడుదలయన ఖైదీ సామాజికంగా మరింత కీడు తలపెడతాడు. అతనిలో మానసిక, ఆధ్యాత్మిక పరివర్తన తీసుకురావడానికి బాహ్య ప్రపంచంతో బంధాలు త్రేంచేసి జైళ్ళలో బందీలుగా చెయ్యడం సరియైన విధానం కాదు. ఖైదీలు, జైలు వార్డెన్‌లు (Jail Wardens) ఇద్దరూ హింసాపూరితమైన ధోరణిని కలిగి వుంటున్నారు. 'ఈ ఖైదీలను హింసించి, దండించి, బాధపెట్టడం ద్వారా వాళ్ళలో సత్ప్రవర్తన వస్తుంది' అని వార్డెను భావిస్తుంటాడు. ఖైదీలు కూడా ఇతరుల పట్ల హింసాత్మక ధోరణితోనే ప్రవరిస్తుంటారు. హింసను, ద్వేషాన్ని అటు ఖైదీలు, ఇటు జైలు వార్డెన్స్ ఆశ్రయిస్తున్నారేగాని, సహజమైన పద్ధతులలో సంఘంతో సంబంధాన్ని కొనసాగిస్తూ చైతన్యశక్తిపరంగా, ఆధ్యాత్మిక పరంగా, మానసికంగా మనిషిలో మార్పు తీసుకురావచ్చనే సత్యాన్ని విస్మరిస్తున్నారు. నార్మల్ లైఫ్‌కు (normal life) దూరంగా వుంచి దండనల ద్వారా, శిక్షల ద్వారా మనిషిలో పరివర్తన మరి సత్ప్రవర్తన తీసుకురాలేరన్న నిజాన్ని మీరు తెలుసుకోవాల్సివుంది. చెడుని చెడుతో శుద్ధి చెయ్యలేరు. బురదను బురదతో శుద్ధి చెయ్యలేరు. హింసను, ద్వేషాన్ని నిర్మలమైన ప్రేమ ద్వారా, అచంచలమైన విశ్వాసం ద్వారా నిర్మూలించవచ్చు.

దురదృష్టవశాత్తు మీ ఆసుపత్రులలో కూడా రోగులను ఖైదీల్లాగ చూడడం జరుగుతుంది. ప్రకృతికి,నార్మల్ లైఫ్‌కు దూరంగా వుంచి దేహం సహజంగా కలిగివున్న జీవరసాయనిక శక్తి + విద్యుదయస్కాంత శక్తి + చైతన్య శక్తులను అసహజమైన విధానాల ద్వారా చికిత్స చెయ్యడం జరుగుతూంది. శిశువుకు జన్మనివ్వడం ప్రతి స్త్రీకీ చాలా సహజమైన అద్భుతమైన ప్రక్రియ. కాని మీ వైద్య విధానం అందుకు భిన్నంగా అసలు 'శిశువు జననం' అనే ప్రక్రియను చాలా సంక్లిష్టమైనదిగా భావించి ట్రీట్‌మెంట్ ఇవ్వడం జరుగుతూంది. గర్భిణీ స్త్రీలందరినీ ఒక వార్డులో, హృద్రోగులందరనీ ఇంకొక వార్డులో, క్యాన్సరు రోగులందరినీ మరొక వార్డులో మందలు మందలుగా క్రుక్కేసి ట్రీట్‌మెంట్

ఇస్తున్నారు. అసలు రోగులంటేనే మహా పాపం చేసినవాళ్ళుగా ట్రీట్ చెయ్యబడుతున్నారు. 'శిశువు జననం' అనే ప్రక్రియ ఎంత సహజంగా జరగాలో మీ డాక్టర్లకు తెలియడం లేదు. గర్భిణీ స్త్రీలకు 'శిశువు జననం' చాలా కష్టతరమైనదని, సర్జరీ (surgery) తప్పని సరవుతుందని ముందుగానే హిప్నటైజ్ (hypnotise) చేస్తారు. మీ డాక్టర్లు 'శిశువు జననాన్ని' ఒక సెలబ్రేషన్‌గా (celebration) గుర్తించడానికి బదులు దాన్ని కూడా ఆసుపత్రులకు అంటగట్టి జీవశక్తిని కించపరుస్తున్నారు. 'శిశువు జననం' అంటేనే స్త్రీ భయపడిపొయ్యేటట్లు మీ వైద్య విధానం నూరిపోస్తుంది. డాక్టరు – రోగి ఇద్దరూ మానసికంగా ఒకే ముసుగు ధరించివున్నారు. జైలర్ – ఖైదీ ఇద్దరూ మానసికంగా ఒకే ముసుగు ధరించి వున్నారు.

* * *

మానవజాతి తనకున్న శక్తిని ప్రేమ ద్వారా వ్యక్తపరిచినపుడు చైతన్య పరిణామం సవ్యంగా అమోఘంగా కొనసాగుతుంది. అపుడే సహజమైన ప్రాకృతిక జీవితాన్ని ఆలింగనం చేసుకొని ప్రతి క్షణమూ ఆనందంగా గడపగలుగుతారు. అప్పుడే ఆత్మ ప్రభోధంతో మీరు స్వధర్మాన్ని ఆచరిస్తూ ఆధ్యాత్మిక జీవితాన్ని అనుభవించ గలుగుతారు. భూ భౌతిక ప్రపంచంలో మానవజాతికి చైతన్యశక్తి పరిణామం పరంగా 'సామూహిక ఎదుగుదల' కేవలం ప్రేమ ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. భూమి మీద 'శిక్ష' అనే పేరుతో జీవాత్మలుగా చైతన్య పరిణామం చెందుతున్న మానవజాతిని ప్రకృతికి దూరంగా జైళ్ళలో బాధించడం చాలా హీనమైనది. జబ్బు పేరుతో ఆసుపత్రులలో క్రుక్కడం కూడా హీనమైనదే! మీ న్యాయస్థానాలు మనిషికి 'మరణ శిక్ష' విధించడమనేది మరీ నీచమైన విధానం. మీ మతాలు కూడా మిమ్మల్ని ఛాందస భావాలతో బంధిస్తున్నాయి. మీరు దేవుడికన్నా దెయ్యానికి ఎక్కువగా భయపడుతున్నారు. 'సాతాను' (satan)అనే వాడు లేకపోతే 'దేవుడు' అనే వాడికి ఉనికి వుండడం లేదు. పాపం, పుణ్యం అని ప్రతి క్రియకూ రంగు పులుముతున్నారు. మంచి – చెడు అని ప్రతి పనినీ విభజిస్తున్నారు. మతాలు అనేవి మటుమాయమైపోయే రోజులు మీ భూమి మీద చూడబోతున్నారు.

మానవజాతిలో అందరికీ విశాల దృక్పథం అలవడాలంటే ఆధ్యాత్మిక విప్లవం వేగవంతమవ్వాలి. అశక్తులుగా మీరు భావించినపుడు దేహం తన సహజ ఆరోగ్య రక్షణా శక్తిని కోల్పోతుంది. దేహం ప్రతిక్షణమూ తనను తాను హీలింగ్ చేసుకునే శక్తిని

సహజంగా కలిగివుంది. ప్రతి మనిషీ తన జీవితాన్ని పరమార్థంగా భావించాలి. అపుడే ఇతర జీవాత్మల ఎదుగుదలను కూడా పరమార్థంగా భావించగలుగుతారు. మీ 'ఆత్మ' మూలచైతన్యం అనే 'దివ్యాత్మ'నుండి ఒక అంశగా వెలువడి చైతన్య పరిణామం చెందుతూంది. ఆత్మ భూమి మీద తన లక్ష్యం, పరమార్థం సంపూర్ణంగా నెరవేర్చుకునేంతవరకు భూమి మీద + సమాంతర లోకాలలో జన్మలు తీసుకుంటూ చైతన్య పరిణామం చెందుతుంటుంది. భౌతిక పదార్థంతో సంయోగం చెందిన చైతన్యశక్తి యొక్క డైనమిక్స్ (dynamics) పూర్తిగా అర్థమయ్యేంతవరకు భూమి మరి భూమి స్థాయి ఫ్రీక్వెన్సీగల సమాంతర లోకాలలో ప్రతి ఆత్మకూ' పునరపి జననం పునరపి మరణం' తప్పనిసరిగా వుంటుంది.

భూమి మీద ఎలక్ట్రానులతో సహా ప్రతి దాంట్లోనూ చైతన్యశక్తి నిండివుంది. మీ శాస్త్రవేత్తలు పసిగట్టలేని అతి సూక్ష్మాతి సూక్ష్మమైన కణాలలో కూడా చైతన్యశక్తి నిండివుంది. ఆధ్యాత్మిక జీవితమూ, భౌతిక జీవితం రెండూ సంయోగం చెంది జీవితానుభవాలను కలుగజేసినపుడు జీవితం ఆనందమయం అవుతుంది. మిమ్మల్ని భయభ్రాంతులకు గురిచేసి మీ జీవితాన్ని అయోమయానికి, అస్పష్టతకూ గురిచేసే శక్తి ఈ విశ్వంలో ఎక్కడా లేదు. జీవితానికి అర్థమూ, లక్ష్యమూ అనేవి లేవని మీరు భావించినప్పుడు మీ దేహం నిస్తేజమై బలహీనపడుతుంది. అపుడు వ్యాధులనేవి సంక్రమిస్తాయి. దేహానికి వ్యాధులు సంక్రమించకూడదనే నియమాలేమీ లేవు. కొన్ని సార్లు దేహం తనలో తాను సర్దుబాట్లు చేసుకోవడానికి కొన్ని వ్యాధులను సంక్రమింపజేసుకుని నయం చేసుకుంటుంది. జ్వరం (fever) అలాంటిదే. జ్వరం ద్వారా మీ ఆరోగ్యం మెరుగుపరచబడుతుంది. మృత్యువును మీరు ఆహ్వానిస్తే తప్ప జ్వరం వల్ల చనిపోవడం అనేది తటస్థించదు. దేహంలోని వైరస్‌లు మీ సంకల్ప శక్తిని అధిగమించి ప్రభావితం చెయ్యలేవు. ప్రకృతి కూడా మీ ఆరోగ్యాన్ని కాపాడడంలో తన వంతు పాత్రను పోషిస్తోంది. ప్రకృతి మీ ఆరోగ్యాన్ని సంరక్షించడం ద్వారా తన ఆరోగ్యాన్ని మెరుగు పర్చుకుంటుంది. జీవజాతుల ఆరోగ్యము క్షేమకరంగా వున్నపుడే భూమి అనే దేహం కూడా ఆరోగ్యంగా వుంటుంది.

త్రీడైమన్షనల్ తలంలో సృష్టింపబడుతున్న అన్నింటి యొక్క మూలం అంతర్ ప్రపంచంలోనే వుంది. చైతన్యశక్తినుండి శక్తి (from consciousness to energy), మరి శక్తి నుండి భౌతిక పదార్థానికి (from energy to physical matter) మారే

ప్రక్రియలో విద్యుదయస్కాంత చైతన్యశక్తి కణాలు అత్యంత శక్తి స్థాయి గల హై ఫ్రీక్వెన్సీ (high frequency) నుండి త్రీడైమన్షనల్ తలంతో సమానమైన ఫ్రీక్వెన్సీలోనికి పదార్థ స్వరూపంలోనికి (into physical matter) కాంతి వేగం కంటే ఎన్నో రెట్లు వేగంతో అపత్వరణం (deceleration) చెందించబడి మార్చబడుతుంది. ఈ పదార్థంగా మారే ప్రక్రియలో చైతన్యశక్తి కణాలు (consciousness units) విద్యుదయస్కాంత శక్తి కణాలుగా (electro magnetic energy units) మార్చబడతాయి. ఈ విద్యుదయస్కాంత కణాలు తిరిగి భౌతిక పదార్థంగా మార్చబడతాయి. భౌతిక సంఘటనలు మరి భౌతిక వస్తువులు మరి భౌతక వాతావరణం అన్నీ భౌతిక పదార్థంతో ముడిపడివున్నాయి.

అంతర్ ప్రపంచం యొక్క డైనమిక్స్ గురించి మరింత వివరంగా తర్వాత పుస్తకంలో వివరిస్తాను. మీరిదివరకు బాహ్య ప్రపంచానికి సంబంధించిన జ్ఞానం వైపే మొగ్గు చూపుతూ వస్తున్నారు. సైన్సు, టెక్నాలజీ మరి వస్తు సంపాదన, ధన సంపాదన మాత్రమే పురోగతి అనుకుంటున్నారు. భూ భౌతిక వాతావరణం కలిగిన చైతన్యశక్తిని, భూమి + జీవజాతులు చైతన్యశక్తిని, ఆత్మ తాను స్వప్నావస్థలో పొందుతున్న జ్ఞానాన్ని, ఆధ్యాత్మిక శాస్త్రాన్ని విస్మరిస్తున్నారు. అంతెందుకు భౌతిక రూపం దాల్చిన మీ దేహం గురించే మీకు ఇంకా తెలియదు. ఆలోచనలు + ఫీలింగ్స్ + ఎమోషన్స్ అనేవి ఈ త్రీడైమన్షనల్ తలంలో ఏ విధంగా భౌతిక పదార్థంతో సంయోగం చెంది జీవితానుభవాలను సృష్టిస్తాయో ఆ డైనమిక్స్ గురించి మీరింకా తెలుసుకోవలసివుంది. మీ దేహానికి వచ్చే సందేహాలు, సూచనలన్నీ బాహ్య ప్రపంచం నుండి వస్తున్నాయని మీరింకా విశ్వసిస్తున్నారు.

మీ దేహానికి గల అనంతమైన శక్తి సామర్థ్యాలను విస్మరిస్తున్నారు. మీ దేహంలోని శక్తిని + ఫ్రీక్వెన్సీ స్థాయిలను పెంచడం ద్వారా గతంలోనికి మరి భవిష్యత్తులోనికి ప్రయాణించడం అనే ప్రక్రియ గురించి మీ ఊహకు అందడం లేదు. గతం, వర్తమానం, భవిష్యత్తు అనేవి మీ పరిమిత జ్ఞానంతో ఏర్పరుచుకున్న ప్రామాణికతలే తప్ప కాలం అనేది అనంతమైన శక్తి స్వరూపం. వస్తు సముదాయంతో కూడిన బాహ్య భౌతిక ప్రపంచాన్ని అధ్యయనం చేసి కొన్ని నిజాలను నిర్ధారించుకోవాలని మీ శాస్త్రవేత్తలు ప్రయత్నం చేస్తున్నారు. మీకు కూడా అలాంటి నిజాలే విశ్వాసాన్ని కలిగిస్తున్నాయి. బాహ్య ప్రపంచం నుండి మీరు నిర్ధారించిన నిజాలన్నీ ఒట్టి మాయ! **భౌతిక పదార్థం లోపల దాగి వున్న చైతన్యశక్తి గురించి, మీ అంతర్ ప్రపంచం గురించి, జీవాత్మల**

అంతర్ ప్రపంచం గురించి మీ అంతర్ ప్రయాణం (inner journey) లేదా ధ్యానం (meditation) ద్వారా నిజాలను నిగ్గు తేల్చడమే అసలైన పరిశోధన; అసలైన పురోగతి!

మీరు బాహ్య ప్రపంచంనుండి పొందుతున్న సైన్సు, టెక్నాలజీ, వైద్య శాస్త్రం మరి ఇతర విద్యలన్నీ మీకు జ్ఞానాన్ని ఇస్తున్నాయని మీరు నమ్ముతున్నారు. వాస్తవానికి అది జ్ఞానం కానే కాదు. సముద్రపు అలలను మాత్రమే చూచి అది జ్ఞానం అనుకుంటే పొరపాటే! సముద్రపు అలలతో పాటు సముద్రాన్ని మొత్తమూ పరిశోధించినపుడే మీకు అసలైన జ్ఞానం లభిస్తుంది. దేహం యొక్క జీవ ప్రక్రియల గురించి మీ వైద్యశాస్త్రానికి తెలిసింది చాలా స్వల్పం. మీరు తీసుకున్న ఆహారాన్ని జీర్ణించుకోవడం, దాన్ని రక్తంగా మార్చడం, రక్తాన్ని జీవశక్తిగా మార్చుకునే ప్రక్రియలను వివరించే స్థితిలో మీ వైద్య శాస్త్రం లేదు. మీరు జాగృదావస్థలో వున్నపుడు కంటే నిద్రావస్థలోనే దేహం తనకు గల అపరిమితమైన చైతన్యశక్తిని వినియోగించుకుంటుంది.

భూమి మీద మానవజాతి వ్యక్తి గతంగా మరి సమిష్టిగా తన వాస్తవాన్ని తనే సృష్టించుకుంటున్నది. భూ ప్రపంచంలో చోటుచేసుకునే భౌతిక సంఘటనలు, భౌతిక వాతావరణం మానవజాతి + ఇతర జీవజాతుల ఆకాంక్షలు, సంకల్పాలు, డ్రీమ్స్ (dreams)కు అనుగుణంగా సృష్టింపబడుతున్నాయి. వాటిని సృష్టించడంలో మానవజాతి ఎక్కువ పాత్ర పోషిస్తూంది. మీ జీవితంలో ఎదురయ్యే సర్వ పరిస్థితులకూ మీరే కారణం. విధి, దైవ నిర్ణయం ఎంత మాత్రం కానే కావు. మీ జీవితంలో ఎదురయ్యే పరాజయాలు, విజయాలు, పరాభవాలు, గౌరవాలు, కష్ట సుఖాలు అన్నింటికీ మీరే బాధ్యులు; వాటిని మీరే సృష్టించుకుంటున్నారు. వాటికి ఇతర మానవులు కాని, ఇతర జీవజాతులు గాని నిందార్హులు కానే కారనే విషయాన్ని మీరు గ్రహించాలి. ఈ వాస్తవం ఒక్క భూమి మీదే కాకుండా అన్ని లోకాలకూ వర్తిస్తుంది. అన్ని లోకాలకూ 'ఒకే సత్యం' వుంటుంది. ఒక లోకం యొక్క ఆధ్యాత్మిక పరిణితిని బట్టి అక్కడ ప్రత్యేకమైన ధర్మం ఆచరణలో వుంటుంది.

మీ జీవితంలో ఎదురయ్యే జీవితానుభవాలకు, సవాళ్ళకు మీరే బాధ్యత వహిస్తూ మీ ఇష్టప్రకారమే నడుచుకుంటే అది ధర్మ బద్ధమైన జీవితం అవుతుంది. ఇతరుల ఆకాంక్షలకు, వాళ్ళుపెట్టే ప్రలోభాలకు, వాళ్ళ మెప్పుకోసం ఆచరించే కర్మలన్నీ మీకు సమస్యలను దుఃఖాన్ని కలుగజేస్తాయి. దాని వల్ల మీకు ఆధ్యాత్మిక పురోగతి వుండదు. అనంత శక్తియుక్తులూ మీ అంతర్ ప్రపంచంలోనే వున్నాయి. మీ అంతర్ ప్రపంచంనుండే గైడెన్స్ తీసుకోండి. మీ అంతర్ సందేశాలు మిమ్మల్ని తప్పుదోవ పట్టించవు. దేనికీ

భయపడకండి. ఈ విశ్వంలో ఏ శక్తీ మిమ్మల్ని భయభ్రాంతులకు గురిచెయ్యదు. **మీ అంతర్ ప్రపంచమే మీ దైవం! మీ మతాలు బోధిస్తున్నట్లు 'స్వర్గం' 'నరకం' అనేవి ఎక్కడా లేవు. మరణం తర్వాత ఇంకొక లోకాన్ని చేరుతారు. అక్కడా ఆధ్యాత్మిక శాస్త్రాన్ని అభ్యసిస్తారు. మీ పరిమిత జ్ఞానంతో, పరిమిత భావాలతో, మూర్ఖ విశ్వాసాలతో మిమ్మల్ని మీరు శిక్షించుకుంటున్నారు తప్ప మిమ్మల్ని శిక్షించే వాడెవడూ ఈ విశ్వంలో లేడు.** ఆత్మ యొక్క అన్ని ధర్మాలను వ్యాకోచం చెందించి విస్తరింప జేసుకోవడానికే మీరు ఈ భూమి మీద జన్మ తీసుకోవడం జరిగింది. భూ ప్రపంచంలో అన్ని జీవాత్మలూ తమ సహజ ప్రవృత్తిలో చైతన్య పరిణామం చెందడానికి జన్మలు తీసుకున్నాయి. భౌతిక వాస్తవాన్ని ఆస్వాదిస్తూ ఆత్మశక్తి యొక్క ధర్మాలను విస్తరించుకోవడం కోసం ఏ కాలంలో పుట్టాలో, ఏ దేశంలో పుట్టాలో, ఏ పరిస్థితులలో పుట్టాలో అన్నీ ముందుగా డిజైన్ (design) చేసుకొని జన్మలు తీసుకుంటున్నారు. చైతన్య పరిణామం చెందడం కోసం ఒక మహదాశయాన్ని ఎంపిక చేసుకుని ఈ భూమి మీద జన్మ తీసుకున్నారు. దాన్ని నెరవేర్చడం కోసం విభిన్నమైన భౌతిక సంఘటనలను సృష్టించుకొంటున్నారు.

ఏవి సరియైన సంకల్పాలు? ఏవి కావు? సరియైన భౌతిక సంఘటనలను ఎంపిక చేసుకోవడం ఎలా? సరియైన ఆలోచనలను ఉత్పన్నం చెయ్యడం ఎలా? సరియైన నిర్ణయాలు తీసుకోవడం ఎలా? జీవితంలో సరియైన దృక్పథం ఏమిటి? ఇలాంటి ఎన్నో ప్రశ్నలు మిమ్మల్ని వెంటాడుతుంటాయి. ఆధ్యాత్మిక పరిణితి, మనో వికాసం పెరిగే కొలదీ సరియైన సంకల్పాలను, సరియైన దృక్పథాలను, సరియైన ఆలోచనలను ఎంచుకునే సామర్థ్యం పెరుగుతుంది. ఆధ్యాత్మిక పరిణితి లేకపోవడం వల్ల మీలో విశాల దృక్పథం కొరవడుతుంది. మీ యొక్క సహజ ప్రవృత్తి, మీ స్వభావానికి అనుగుణంగా భౌతిక సంఘటనలు మీ వైపు ఆకర్షింపబడుతుంటాయి. ఎటువంటి భౌతిక సంఘటనలను ఎంచుకోవాలో మీ సహజావబోధన (intuition) ద్వారా మీకు అందించబడుతుంటుంది.

మీ అభీష్టాలకు, ఆకాంక్షలకు, వాంఛలకు, సంకల్పాలకు అనుగుణంగా భౌతిక సంఘటనలు సునాయాసంగా అప్రయత్నంగా మీ జీవితంలోకి ప్రవేశిస్తున్నాయి. ఆధ్యాత్మికంగా సరియైన అవగాహన లోపించడం వల్ల అపసవ్య భౌతిక సంఘటనలను ఆకర్షించి మీ జీవితాన్ని బాధామయంగా చేసుకుంటున్నారు.

మీ కిదివరకు మత బోధకులు చెప్పిన పరిమిత జ్ఞానాన్ని, కాలం – దూరంనకు సంబంధించిన కాన్సెప్టులను, తర్కం – విశ్లేషణల పై ఆధారపడిన ఇంటెలిజెన్స్‌ను ప్రక్కన

పెట్టి మీ జీవన విధానంలో ఒక నూతన ఒరవడిని ప్రవేశపెట్టండి. పాత చింతకాయ పచ్చడిలాంటి అలవాట్లకు స్వస్తి చెప్పండి. సర్వ సమర్థతలూ మీ అంతర్ ప్రపంచంలో దాగి వున్నాయనే సత్యాన్ని మరవకండి.

భూమి మీద మానవులందరూ సమస్త జీవజాతులతో సఖ్యతతో మెలుగుతూ, సహాయ సహకారాలు అందిస్తూ విస్తారమైన జీవ కారుణ్యంతో మైత్రితో చైతన్య వికాసం చెందెదరు గాక! సకల ప్రాణికోటి పట్ల అనురక్తి కలిగి వుందురుగాక! మానవ సహజ దివ్యత్వం పట్ల విశ్వాసాన్ని కలిగి వుందురుగాక!

మనోశక్తి
(Mind Power)

మైండ్ (mind) లేదా మనోశక్తి అనేది ఆత్మశక్తికి సంబంధించిన భాగము. ఇది పూర్తిగా అంతర్ ప్రపంచానికి సంబంధించినది. మెదడు అనేది దేహంలో ఒక అవయవము. గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, ప్రేగులు, కన్ను లాగే మెదడు కూడ ఒక అవయవమై పనిచేస్తుంది. డాక్టర్లు, శాస్త్రవేత్తలు మెదడుపై శస్త్రచికిత్సలు చేసి దాని గురించి పరిశోధన చేస్తున్నారు. వాళ్ళకు మైండ్ గురించి ఏ మాత్రము తెలియదు. వారు శాస్త్రపరికరాలతో మెదడును ముక్కలుగా ఖండించి, చిన్న మెదడు, పెద్దమెదడు, మెడుల్లా అబ్లాంగేటా, ఎడమ మెదడు, కుడి మెదడు, అని రకరకాల పేర్లు పెట్టవచ్చుగాని మైండ్ (మనోశక్తి) వాళ్ళ శాస్త్ర పరికరాలకు అంతుచిక్కదు. మైండ్ (mind) చర్మ చక్షువులకు కన్పించదు. మెదడు (brain) దేహానికి సంబంధించిన ఒక అవయవం అయితే, మైండ్ (mind) చైతన్యశక్తికి (consciousness) సంబంధించిన శక్తి స్వరూపం (form of energy). మెదడు దేహంలోని భాగాలన్నింటినీ నియంత్రిస్తుంది. దేహంలోని నాడులన్నీ మెదడుకు అనుసంధానింపబడి (connect) పనిచేస్తున్నాయి. మైండ్‌కు గల శక్తి అపారము; అది నిర్వర్తించే ప్రక్రియలు అపరిమితము! జీర్ణవ్యవస్థ, గుండెకొట్టుకోవడం, ఊపిరితిత్తులు పనిజెయ్యడం లాంటి ఎన్నో ప్రక్రియలను (processess) మైండ్ నడిపిస్తుంది. ఈ ప్రక్రియలను నడిపించడానికి మెదడు అనే సాధనాన్ని (device) మైండ్ ఉపయోగించుకుంటుంది. మైండ్ చెయ్యగల ఎన్నో ప్రక్రియలలో దేహ నియంత్రణ ఒకటి మాత్రమే! ఆలోచనా తరంగాలు (thought waves) మైండ్‌లో ఉత్పత్తి అయి మెదడు ద్వారా వెలుపలికి వస్తాయి. మైండ్ నుండి వెలువడిన ఆలోచనలు (thoughts) మెదడు (brain) అనే సాధనం (device) ద్వారా బయటికి వస్తాయి. ఒక డాక్టరు (doctor) మెదడును శస్త్ర చికిత్స (surgery) చేసి ఆలోచనను (thought) కనుగొనలేడు. అతను ఇంకా నిశితంగా పరిశోధన (research) చెయ్యడం కోసం మెదడును కణవిభజన చెయ్యగలడు. కాని ఆలోచనా తరంగాలు ఎలా పుడుతున్నాయి? అనే విషయం అతనికి

కన్పించదు. అట్లాగే మైండ్‌కు గల అపరిమితమైన విషయాలు మీ శాస్త్రవేత్తలకు అందుబాటులో లేవు.

దేహం ఏర్పడక ముందూ ఆత్మ మరి మైండ్ వున్నాయి. దేహం నశించిన తర్వాతా ఆత్మ వుంటుంది; అలాగే మైండ్ కూడా వుంటుంది. దేహానికి మూలం ఆత్మ. మైండ్ యొక్క ఊహాశక్తి నుంచి జనించిందే ఈ దేహం. ఈ దేహం ఇవాళ వుంటుంది, రేపు పోతుంది. కాని మైండ్ జన్మపరంపరలుగా వుంటుంది. దేహానికి మూలం ఆత్మ. ఆత్మశక్తిలో భాగం ఈ మైండ్. జన్మపరంపరల నుండి జ్ఞానాన్ని, అనుభవాలను, చైతన్యశక్తిని ఈ మైండ్ మోసుకొస్తుంది.ఆత్మ ఎలా అవినాశియో, ఈ మైండ్ కూడ అలాగే అవినాశి! గత జన్మలో సంగీతం నేర్చుకుంటే ఈ జన్మలోను సంగీతం మీ మైండ్‌లో నిక్షిప్తపరచబడివుంది. గత కోటానుకోట్ల జన్మల తాలూకు జ్ఞానం మీ మైండ్‌లో భద్రపరచబడి వుంది. మీరు మరణించిన తరువాత దేహాన్ని ఈ భూమి మీదే వదిలేస్తారు. ఇక్కడ సముపార్జించిన జ్ఞానం, చైతన్యశక్తి, సంస్కారాలు అన్నీ మీ మైండ్‌లో స్టోర్ (store) అయివుంటాయి. ఇంకో జన్మ తీసుకున్నపుడు ఈ మైండ్ కంటిన్యూ (continue) అవుతుంది. ప్రతి జన్మకూ మైండ్ పవర్ (mind power) వ్యాకోచం చెందుతూనే వుంటుంది. కౌమారం, యవ్వనం, వృద్ధత్వం అనేవి దేహానికి వుంటాయి. ఆత్మ మరో జన్మ తీసుకున్న తరువాత ఇంకో దేహాన్ని తీసుకుంటుంది. కాని ఈ మైండ్ మాత్రము కంటిన్యూ అయి దాని ఉనికిని (identity) కలిగి వుంటుంది. శరీరం చంపబడినంత మాత్రాన ఆత్మ చంపబడదు; మైండ్ కూడ చంపబడదు. మైండ్ యొక్క విస్తరణకు అవధులు (limitations)లేనేలేవు. ఇది నిరంతరాయంగా వ్యాకోచం చెందుతూనే వుంటుంది. ఎంత విస్తరింపజేస్తే అంత వ్యాకోచం చెందుతూనే వుంటుంది. ఈ భూమి మీద జన్మ పరంపర పరిసమాప్తి అయిన తర్వాత ఇతర లోకాలలో (ఒకానొక ఉన్నత లోకంలో) జన్మ తీసుకోవడం జరుగుతుంది. అక్కడా ఆత్మ పరిణామం చెందుతుంది. మైండ్ అక్కడ జ్ఞానాన్ని, అనుభవాలను పొందుతూ వ్యాకోచం చెందుతుంటుంది.

ఈ విశ్వంలో ప్రతి ఆత్మశకలానికి మైండ్ వుంది. అన్నింటి మైండ్స్ అనుసంధానం కావింపబడి వున్నాయి. అణువు, పరమాణువు, ఎలక్ట్రాను (electron) తో సహా ప్రతిదీ చైతన్యశక్తిని, మైండ్‌ను కలిగివున్నాయి. పరమాణువు (atom)లో కేంద్రకం (nucleus) చుట్టూ ఎలక్ట్రాను (electron) ఆత్మ భ్రమణం చేసుకుంటూ పరిభ్రమణం చేస్తుంటుంది. భౌతిక శాస్త్రవేత్త (physicist) మైక్రోస్కోపు ద్వారా ఎలక్ట్రానును గమనిస్తున్న సంగతి ఎలక్ట్రానుకు తెలుసు. సైన్సు పరికరాల కొలమానానికి అంతుచిక్కని వేగంతో

ఎలక్ట్రాను పరిభ్రమణం చేస్తూంది. ఏ శాస్త్రవేత్త కూడా ఇంత వరకు ఎలక్ట్రానును పూర్తిగా పసిగట్టలేదు. 'ఆత్మ' మనిషిగా దేహధారణ చేసింది. అలాగే ఒక ఆత్మ భూమిగా దేహధారణ చేసింది. భూమి అనబడే ఆత్మ కూడ మైండ్‌ను కలిగివుంది. భూమి మీద సకల జీవరాశులూ మైండ్‌ను (మనోశక్తి) కలిగివున్నాయి. సీతాకోకచిలుక తన మనోశక్తి (mind) ద్వారా అందమైన దేహాన్ని సృష్టించుకుంది. సాలెపురుగు దేహాన్ని తన మనోశక్తి ద్వారా ఎంతో నైపుణ్యంతో గూడును నిర్మించుకుంటుంది. పక్షులు వేల మైళ్ళు వలస వెళ్ళి ఆహారాన్ని సంపాదించు కుంటున్నాయి. జంతువులన్నీ ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే పసిగడుతున్నాయి. ఇవన్నీ మనోశక్తి ద్వారా సాధ్యం! మెదడు ఒక సాధనంగా మాత్రమే ఉపకరిస్తుంది. సృష్టిలో ప్రతి ప్రాణీ తన మనోశక్తి ఉనికిని కాపాడుకుంటూ, విశ్వ మనోశక్తికి (cosmic mind or universal mind) అనుసంధానింపబడి వుంటుంది. దేని ఉనికి (identity) దానికే వుంటుంది.

స్వప్నాలు (dreams) అనేవి మైండ్ (mind) చేసే అనేక చేష్టలలో ఒక భాగం. ఇంతకు మునుపే చెప్పినట్లు మైండ్ (మనోశక్తి) ఆత్మశక్తిలో అంతర్భాగం. స్వప్నావస్థలో (dream state) ఇతర లోకాలను సందర్శించడం, ఇతర లోకాలలోని జ్ఞానాన్ని సంపాదించడం, ఇతర లోకాలలోని మాస్టర్స్ (masters)ను కలుసుకోవడం జరుగుతుంది. స్వప్నావస్థలో మీరు సూక్ష్మ శరీర సముదాయంతో (astral body) ప్రయాణం చేసి జంతుజాతితోను, వృక్షజాతితోను, ఇతర జీవజాతులతోను సంభాషణలు జరిపి భూమి మీద సమిష్టి చైతన్య పరిణామం గురించి చర్చించుకోవడం జరుగుతుంటుంది. ఒక గడ్డి మొక్క, లేదా పుష్పం కూడ ప్రతి ఆత్మ శకలం యొక్క మైండ్‌తో అనుసంధానం కలిగి వుంటుంది. మూలకాల నుండి, ఏకకణ జీవి నుండి మానవుడిగా ఎదిగిన పరిణామంలో ప్రతి జన్మ యొక్క జ్ఞానాన్ని మీ మైండ్ కలిగి వుంది. అన్ని ఆత్మల యొక్క మైండ్ చైతన్యశక్తి (consciousness)తో నడపబడుతూంది

సంకల్పం (intent), ఊహాశక్తి (imagination), ఇంటెలిజన్స్ (intelligence), తర్కం (reasoning), విశ్లేషణ (analysis) స్వప్నాలు (dreams), ఆలోచనాశక్తి (thinking), క్లైయిర్ వాయెన్స్ (clairvoyance= clear seeing), టెలీపతి (telepathy=communication with the mind), సహజావబోధన (intuition), జ్ఞాపకశక్తి (memory) ఇత్యాది ఎన్నో ప్రక్రియలు మైండ్ ద్వారా జరుగుతున్నాయి. మూలచైతన్య సంకల్ప శక్తితో (power of intent) ఈ విశ్వంలో కోటానుకోట్ల లోకాలు, కోటాను కోట్ల ఆత్మ శకలాలు ఏర్పడి చైతన్య పరిణామం చెందుతున్నాయి. జన్మ తీసుకునే

ముందు ఎలాంటి దేహం కావాలో ఆత్మ సంకల్పించుకుంటుంది. అందుకనుగుణంగానే దేహాన్ని తీసుకుని పరిణామం చెందడం జరుగుతుంది. మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు అనేవి మైండ్‌కు సంబంధించినవి. క్రోధం, మోహం లాంటి రాగ ద్వేషాలు మైండ్ నుండి పుడుతున్నాయి. జీవాత్మలు చేసే కర్మలన్నీ మైండ్ చేత నడపబడుతున్నాయి. మనిషి ప్రకృతిలో ఒకానొక భాగం. జీవరాశులన్నీ కలిస్తేనే ప్రకృతి, ప్రకృతి అనే మహా కర్మ సముద్రంలో మనిషి ఒకానొక 'అల' మాత్రమే! ప్రకృతి నిరంతరం ప్రవహిస్తూనే వుంటుంది. అది ఎక్కడా ఆగదు. నిరంతర బాహ్యకర్మల సముద్రంలో జీవాత్మల అంతర్ గుణాలు అత్యంత మెల్ల మెల్లగా మారుతూ వుంటాయి. బహిర్ కర్మలకు మూలం నిర్దిష్టమైన అంతర్ గుణాలు, మనిషి మరి జీవాత్మల గుణాలన్నీ మనోశక్తి నుండి సృష్టింపబడి ఒక్కొక్క మెట్టూ పరిణామం చెందుతూ మారుతున్నాయి. మనస్సు నుండి ఏర్పడే కోరికలు విజృంభించడం వల్ల మనస్సు అల్లకల్లోలం అవుతుంటుంది. దాన్ని నియంత్రించడానికి సంకల్పశక్తి (power of intent), ఊహాశక్తిని ఉపయోగించడం ద్వారా మైండ్ తనను తాను ఉన్నత పరుచుకుంటూ వుంటుంది.

ఊహాశక్తి (power of imagination), సంకల్పశక్తి , విశ్వశక్తి (universal force)లోని అంశాలు, విశ్వశక్తే అంతర్ శక్తి అయి వుంది. మనిషికి విచక్షణా శక్తిని కలుగజేసేది అంతర్ శక్తికి సంబంధించిన మనోశక్తే! భౌతిక ప్రపంచంలో ఏయే సంఘటనలు పొందగోరుతున్నారో, ఏయే పరిస్థితులు కావాలో, ఏవి సాధించాలనుకున్నారో, వాటిని మీ మైండ్‌లో సంకల్పించుకోవడం జరుగుతుంది. సంకల్పించుకున్న తర్వాత అవి నిజంగానే జరిగినట్లు, వాటిని మీ అనుభవంలోకి తీసుకువచ్చినట్లు ఊహించుకున్నట్లయితే అంతర్ ప్రపంచంలో సంకల్పించుకున్న కోరికలన్నీ బాహ్య ప్రపంచంలో వాస్తవరూపాన్ని పొందుతాయి.

మీకొక మంచి ఇల్లు కావాలనుకోండి. అది మీ మైండ్‌లో ఏర్పడిన సంకల్పం. మీ సంకల్పమే ఈ విశ్వం యొక్క సంకల్పం అవుతుంది. అలా సంకల్పించుకున్న తర్వాత ఆ ఇంట్లో మీరు, మీ కుటుంబసభ్యులు హాయిగా గడుపుతున్నట్లు, ఆ ఇంట్లో మీ అనుభవాలను అనేక కోణాలలో పొందుతున్నట్లు మీ మైండ్‌లో ఊహించుకోండి! మీ ఊహ ఒక డ్రాయింగ్ గీసినట్లు గాక చాల సజీవంగా ఉండేటట్లు చూడండి. మీ ఊహాశక్తిలో భావనలు (emotions) స్పందనలు (feelings) వుండేటట్లు చూడండి. ఈ ఎమోషన్స్ (emotions), ఫీలింగ్స్ (feelings) మీ మైండ్‌లో ఊహించుకున్న (imagined) దాన్ని సజీవంగా ఉండేటట్లు చేస్తాయి. అలా చేసినపుడు అంతర్‌శక్తి మీ మైండ్ ద్వారా బాహ్య

ప్రపంచంలోనికి భౌతిక సంఘటనగా రూపాంతరం (transform) చెందుతుంది. ఊహాశక్తి (power of imagination) ద్వారా భౌతిక ప్రపంచంలో మీరు సంకల్పించుకున్న భౌతిక సంఘటన తాలూకు బ్లూ ప్రింట్ (blue print)ను మీ మైండ్ (mind)లో ఏర్పరుస్తున్నారు. మీరు ఏది కోరుకుంటే దాన్ని మీ మైండ్ అందిస్తుంది. మైండ్‌కు మంచి, చెడులనేవి వుండవు. మీరు ఊహించుకున్నవన్నీ అంతర్‌శక్తి నుండి బాహ్య ప్రపంచంలోనికి మైండ్ ద్వారా సృష్టింపబడుతున్నాయి. మీరు సంకల్పించే భౌతిక సంఘటనలు, దాని పర్యవసానాలన్నీ మీ అనుభవంలోనికి వస్తాయి.

ఒక విద్యార్థి పరీక్షలకోసం చక్కగా చదువుతున్నట్లు, పరీక్షలు చక్కగా రాస్తున్నట్లు, పరీక్ష పాసయినట్లు ఎమోషన్స్, ఫీలింగ్స్‌తో సహా ఊహించుకుని మైండ్‌లో బ్లూప్రింట్ ఏర్పరిచినట్లయితే, అంతర్‌శక్తి నుండి మైండ్ ద్వారా వెలువడిన ఆలోచనా తరంగాలు (thought waves) బాహ్య ప్రపంచంలో భౌతిక సంఘటనగా రూపుదిద్దుకుంటాయి. అంతర్ ప్రపంచం నుంచి వెలువడిన ఆలోచనా తరంగాలు విద్యుదయస్కాంత శక్తిని కలిగి వుంటాయి. ఈ విద్యుదయస్కాంత తరంగాలు పదార్థాన్ని ప్రభావితం చేస్తాయి; పదార్థాన్ని సృష్టిస్తాయి. భౌతిక పరిస్థితులను, భౌతిక వాతావరణాన్ని సృష్టిస్తాయి. ఆ విద్యార్థి ఊహాశక్తిలో ఏర్పరుచుకున్న బ్లూ ప్రింట్ కనుగుణంగా భౌతిక పరిస్థితులు, భౌతిక సంఘటనలు సృష్టింపబడతాయి. పరీక్ష పాసయినట్లు, దాని పర్యవసానాలు అతని జీవితానుభవంలోనికి ప్రవేశిస్తాయి. **మైండ్ ద్వారా ఏది సంకల్పించి, ఊహిస్తే దాన్ని ఇవ్వడం మాత్రమే అంతర్ ప్రపంచానికి తెలుసు. అంతేగాని ఏది ఇవ్వాలి? ఏది ఇవ్వకూడదు? అనేది అంతర్ ప్రపంచం నిర్ణయించదు.**

మీరు జీవితంలో ఏది కావాలంటే అది సాధించుకోగల సర్వసమర్థత కలిగి వున్నారు. ఏది కావాలో దాన్ని ఎంచుకోగల స్వతంత్రత కలిగి వున్నారు. భూమి అనే దేహాన్ని ఒకానొక ఆత్మ సృష్టించుకుంది. సూర్యుడు అనే దేహాన్ని ఇంకొక ఆత్మ సృష్టించుకుంది. భూ భౌతిక వాతావరణాన్ని భూమి మీద గల అన్ని జీవరాశుల మనోశక్తి నుండి ఏర్పడుతూంది. మైండ్ వల్ల పదార్థం సృష్టింపబడుతుంది; ప్రభావితం చెయ్యబడుతుంది. అంతర్ శక్తి నుండి భౌతిక సంఘటనలు ఏర్పడుతాయనే వాస్తవం మీ శాస్త్రవేత్తలకుగాని, తత్త్వవేత్తలకుగాని ఏ మాత్రము తెలియదు. మైండ్ పదార్థాన్ని సృష్టించి ఒక భౌతిక రూపాన్ని ఏర్పరుస్తుందనే విషయంపై మీ శాస్త్రవేత్తలు పరిశోధన చెయ్యవలసివుంది. మీకు అతి దగ్గరగా చెప్పాలంటే – మీ దేహాన్ని మీ మైండ్ ద్వారా

సృష్టించుకున్నారు. మీ దేహం అందంగా గాని, వికారంగాగాని, ఆరోగ్యంగా గాని, అనారోగ్యంగా గాని, చురుగ్గా గాని, నెమ్మదిగా గాని వుందని జడ్జిమెంట్ (judgement) చెయ్యడం సరికాదు. మీ మనోశక్తి నుండి వచ్చిన ఆలోచనల కనుగుణంగా మీరు జన్మ తీసుకోకముందే తల్లిదండ్రులను ఎంచుకోవడం జరుగుతుంది. అందుకనుగుణంగా దేహాన్ని సృష్టించుకోవడం జరుగుతుంది. మీ ఆలోచనలు (thoughts) భావోద్వేగాల (emotions) కనుగుణంగా మీ దేహం యొక్క సృష్టి జరిగింది. మీరు మనోశక్తిలో ఏది ఊహించుకుంటారో దాని అనుసారంగా పరమాణువులు, అణువుల సముదాయంతో దేహ నిర్మాణం జరుగుతుంది. మీ మనోశక్తి నుండి ఊహాశక్తి యొక్క ఛాయ (image) దేహంగా రూపుదిద్దుకుంటుంది.

మీ మైండ్ నుండి వెలువడే ఆలోచనా తరంగాల (thought waves) సాంద్రత, బలంల కనుగుణంగా చైతన్యశక్తి భౌతిక పదార్థంగా రూపాంతరం చెందుతుంది. చైతన్యశక్తి (consciousness) భౌతిక పదార్థంగా రూపాంతరం (transform) చెందడంలో మైండ్ (mind) కీలక పాత్ర వహిస్తుంది. మైండ్ నుండి వెలువడే ఆలోచనా తరంగాలు (thought waves) బలహీనమైనవైతే దానికనుగుణంగా మిథ్యా భౌతిక రూపం (pseudo physical form) ఏర్పడుతుంది. మీ మైండ్ నుండి ఆలోచనా తరంగాలు నశించి పోవడం గాని, మటుమాయమైపోవడం కాని జరగదు. ఆలోచనా తరంగాల ఫ్రీక్వెన్సీ (fequency), శక్తి (energy) సాంద్రత (density)లకు సరిపడే లోకంలో అక్కడ పరిస్థితులకు అనుగుణంగా భౌతిక రూపాన్ని సంతరించుకుంటుంది.

మీ ఆలోచనా శక్తి (thought power) ఎంత త్వరగా పనిచేస్తుందనేది (work out) మీరు ఎంత బలంగా, తీవ్రంగా సంకల్పించారు? అనే దాని మీద ఆధారపడి వుంటుంది. మీ మైండ్‌లో అంటే మీ మనో ప్రపంచంలో ఎంత గాఢంగా వాంఛిస్తున్నారు? ఎంత తీవ్రంగా ఆలోచనలు శక్తిని, హై ఫ్రీక్వెన్సీ (high frequency)ని కలిగి వున్నాయి ? ఫీలింగ్స్ (feelings), ఎమోషన్స్ (emotions) ఎంత తీవ్రంగా వున్నాయి ? వాటి మీద ఆధారపడి వుంటుంది. ఇక్కడ మీ నమ్మక వ్యవస్థ (belief system) చాల ముఖ్యమైనది. మీ మనోశక్తి ద్వారా మీ దేహాన్ని సృష్టించుకున్నారనేది ఎంత నిజమో, మీ ఆలోచనలు (thoughts) బాహ్య ప్రపంచంలో వాస్తవ రూపం పొందుతున్నాయనేది అంతే నిజం!

మీరు ఒక వ్యక్తి గురించి తీవ్రంగా ఆలోచించినపుడు మీ ప్రతి రూపాన్ని

(counter self) అక్కడికి పంపిస్తున్నారు. మీ ఆలోచనా తరంగాల నుండి వెలువడిన చైతన్యశక్తి ఒక రూపాన్ని పొంది అక్కడ ప్రత్యక్షమవుతుంది. అక్కడవున్న వ్యక్తి మీ ప్రతిరూపాన్ని (your counterself) తన అంతరేంద్రియాల ద్వారా గుర్తించగలుగుతాడు. మీ ప్రతి రూపాన్ని (counter self) అతడు తన చర్మ చక్షువులతో (physical eyes) చూడలేడు.

మీరు పొందిన భౌతిక దేహం భూమి కనుగుణంగా వున్న మూలకాల పరమాణువులు, అణువులతో నిర్మింపబడుతుంది. ఈ పరమాణువులు, అణువులు చైతన్యశక్తి చేత నడపబడుతాయి. భూమి మూడు తలాల వ్యవస్థ (three dimensional system). మీరు ఒక వ్యక్తి గురించి తీవ్రంగా ఆలోచించినపుడు ఆలోచనా తరంగాలు ఆ మనిషిని చేరతాయి. అతని మనోశక్తి మీ ఆలోచనా తరంగాలను పసిగట్ట గలుగుతుంది. దీన్ని టెలీపతి (telepathy), అంటారు. దీన్ని ఎంతో మంది గమనించే వుంటారు. టెలీపతి ద్వారా జంతువులతో, పక్షులతో, వృక్షాలతో సంభాషించవచ్చు. రాయి. సముద్రం, పర్వతం, భూమితో కూడ టెలీపతి (telepathy) ద్వారా సంభాషించవచ్చు. టెలీపతి (telepathy) ద్వారా మైండ్ టు మైండ్ (mind to mind) కమ్యూనికేషన్ (communication) జరుగుతుంది. ఈ విశ్వంలో ప్రతి ప్రాణితో మీరు టెలీపతి ద్వారా సంభాషణ జరపగల వీలుంది. పదార్థాన్ని దాని భౌతిక స్వరూపంగా కాకుండా దాని చైతన్యశక్తితో సంభాషించ గలగాలి. టెలీపతి ద్వారా మీరు మరి జంతుజాతులు పరస్పరం సంభాషించుకుని జ్ఞానాన్ని (knowledge) పంచుకోవచ్చు. పూర్వపు నాగరికతలలో మానవజాతి జంతు జాతులతో టెలిపతి ద్వారా చక్కగా సంభాషించేవారు. జంతు జాతి నుండి ఎన్నో విషయాలను నేర్చుకున్నారు. మీరు మొక్కలతో సంభాషించడం నేర్చినట్లయితే అవి మీకు ఎన్నో ఔషధులను తెలియ జెయ్యగలవు. నేచురల్ హీలింగ్ (natural healing) గురించి ఎన్నో విషయాలు తెలియ జెయ్యబడతాయి. మీరు గాలి పీల్చుకున్నంత తేలికగా, సులభంగా మైండ్ యొక్క ఫాకల్టీస్ (faculties)ను ఉపయోగించగల వీలుంది. కొంత అభ్యాసం (practice) ద్వారా మీరు వాటిని అభివృద్ధి చెయ్యవచ్చును. తల్లి – బిడ్డల మధ్య ఈ టెలీపతి (telepathy) చాల సహజంగా (natural) పనిచేస్తుంది. భూమి మీద అన్ని జీవరాశులు టెలీపతి ద్వారా సంభాషించుకుంటున్నాయి. జంతువుల మధ్య సాగే టెలీపతిని మీలో చాలా మంది గమనించే వుంటారు. మీ పెంపుడు కుక్కపిల్ల, ఆవులాంటి జంతువులతో టెలీపతి ద్వారా సంభాషించడం నేర్చుకోండి. అది అసాధ్యమేమీ

కాదు. మీ ఇంటి పరిసరాలలో గల మొక్కలతో టెలీపతి ద్వారా మాట్లాడండి. మీ ఇంట్లో పెంపుడు జంతువులు మీ ఆలోచనా తరంగాలను చాల చక్కగా పసిగడతాయి. మీరు చిన్నపాటి అభ్యాసం ద్వారా దాన్ని సాధించవచ్చు.

మనోశక్తి ద్వారా వెలువడే ఆలోచనా తరంగాలు అతి వేగంగా ప్రయాణిస్తాయి. ఈ విశ్వంలో అంత కంటే వేగంగా ప్రయాణించేదేదీ వుండదు. కాంతి వేగం కంటే అధిక వేగంతో ఆలోచనా తరంగాలు ప్రయాణిస్తాయి. ఈ వేగాన్ని కాంతి వేగంతో పోల్చడం సరికాదు. ఎంచేతంటే ఆలోచనా తరంగాల వేగాన్ని లెక్కగట్టడానికి మీ సైన్సు పరిజ్ఞానం చాలదు. మీరు సంకల్పించిన క్షణమే మీ ఆలోచనా తరంగాల ప్రతిరూపం (counter self) మీ స్నేహితుడి వద్ద ప్రత్యక్ష మవుతుంది. మీరు సంకల్పించిన క్షణమే మీ ప్రతి రూపం (counter self) వేరే గెలాక్సీ (galaxy)లోని ఒక లోకంలో (one world) ప్రత్యక్షమవుతుంది. ఆలోచనా తరంగాలు విద్యుదయస్కాంత శక్తిని కలిగివుండి చైతన్యశక్తి (consciousness)తో ప్రయాణిస్తాయి.

మీ కంటే హై ఫ్రీక్వెన్సీ (high frequency) ఎక్కువ శక్తి (high energy)గల ఉన్నత లోకాలలో ఆలోచనా శక్తిని (thought power) చాల చక్కగా ఉపయోగించడం జరుగుతూంది. ఒకరి ఆలోచనలను ఇంకొకరు సులభంగా గ్రహించగలుగుతున్నారు. అక్కడ ఎంతో పారదర్శకత (transparency) వుంటుంది. ఒకరి మైండ్‌లో వున్న ఆలోచనా తరంగాలు ఇంకొకరు సులభంగా పసిగట్టగలుగుతారు. ఏదీ దాచి పెట్టడం జరగదు. వినాశకర ధోరణిలో ఆలోచనలు మైండ్ నుండి వెలువడటం జరగదు. అక్కడ జీవజాతులు ఎన్నో ఉన్నతమైన ఆలోచనలను వెలువరించడం ద్వారా ఎంతో ఉన్నత రీతిలో చైతన్య పరిణామం చెందుతున్నాయి. ఆలోచనలను గాని, భావనలనుగాని (emotions) ఏ మాత్రం దాచనవసరం లేదు కూడ. చైతన్యశక్తి యొక్క స్థితిగతులను దాని పర్యవసానాలను క్షుణ్ణంగా తెలిసిన వారుంటారు. దానివల్ల పరస్పర ఇతోధిక సహకారం జీవజాతుల మధ్య వుంటుంది. ప్రతి ఆత్మ ఇతర లోకాలలోని తన సంభావ్య ఆత్మలతో (probable selves) టెలీపతి ద్వారా ఆలోచనలను (thoughts) పంచుకోవడం (share) ద్వారా అభివృద్ధి చెందుతూ వుంటుంది. చైతన్యశక్తి (consciousness) యొక్క గతిశాస్త్రము(dynamics) క్షుణ్ణంగా తెలిసినపుడు ఆలోచనలను వినాశకర రీతిలో (destructive methods) ఉపయోగించడం జరగదు. చైతన్యశక్తి యొక్క గతులు (mechanics) మీకు తెలియక పోవడం వల్ల ఆలోచనాశక్తిని (thought power) సక్రమమైన రీతిలో ఉపయోగించడం మీకు తెలియడం లేదు.

నేను మీ తలం (dimension)లోకి ఛానెలింగ్ ప్రక్రియ ద్వారా సంకల్పించి (willing) ద్వారా రాలేదు. నా ఆలోచనాశక్తిని ఉపయోగించి మీ తలంలో వున్నట్లు ఊహించుకున్నాను. అంతే! ఊహాశక్తి (power of imagination) ద్వారా మీ భూతలంలోకి ప్రవేశించాను. నా మనోశక్తితో సంకల్పించుకుని, భూమి మీద ఉన్నట్లు ఊహించుకోవడం ద్వారా చైతన్యశక్తి సముదాయంతో జేన్స్ రాబర్ట్స్ (Jane Reberts) అనే ఆవిడ ద్వారా ఛానెలింగ్ చెయ్యడం జరుగుతూంది.

ఆలోచనాశక్తి (thought power) గురించి క్షుణ్ణంగా తెలియాలంటే చేతనా మనోశక్తి (conscious mind), అంతర్ చేతనా మనోశక్తి (sub conscious mind) గురించి మీకు తెలియాల్సి వుంది. కాన్షియస్ మైండ్ (conscious mind) మీ ఎరుకలో వుంటుంది. మీ మైండ్ అనంతమైన పొరలు కలిగి వుందని ఊహించు కుంటే, ఉపరితలంలో పైన ఉండే పొర కాన్షియస్‌మైండ్‌గా పిలువబడుతుంది. అంతరాంతరాలలోగల అపరిమితమైన పొరలను సబ్‌కాన్షియస్ మైండ్ అని పిలువబడుతుంది. మైండ్ అంటే పొరలనికాదు. పోల్చుకోవడానికి అలా చెప్పడం జరిగింది. **ఒక మహాసముద్రమంత మైండ్‌లో కాన్షియస్ మైండ్ ఒక 'అల' మాత్రమే! ఒక 'అలజడి' మాత్రమే! కాన్షియస్ మైండ్ బాహ్య ప్రపంచంతో సంబంధం కలిగి వుంటూ అంతర్ ప్రపంచానికి ఒక మార్గం (a way)గా పని చేస్తుంది. అంతర్ ప్రపంచం లేదా అంతర్ శక్తిలో గల మైండ్‌ను ఒక మహాసముద్రంతో పోల్చవచ్చు. దాన్నే 'సబ్ కాన్షియస్‌మైండ్' అని పిలవబడుతుంది. దాన్ని సూపర్ కాన్షియస్ మైండ్ (super conscious mind) అని కూడ పిలవబడుతుంది. వాస్తవానికి మైండ్‌కు పేర్లు వుండవు. విషయ అవగాహన కోసం అలా పేర్లతో పిలుచుకోవడం జరుగుతూంది.**

ఆత్మజ్ఞానాన్ని (spiritual science) సంప్రాప్తించుకోవడం ద్వారా సబ్‌కాన్షియస్ మైండ్‌ను (sub conscious mind) ఎలా ఉపయోగించుకోవాలో మీకు తెలుస్తుంది. ఆత్మజ్ఞానం సంప్రాప్తించక ముందు కాన్షియస్ మైండ్‌కు లోబడి మీ చర్యలు (actions) వుంటాయి. జన్మపరంపరగా సంప్రాప్తించుకున్న జ్ఞానమంతా సబ్‌కాన్షియస్ మైండ్‌లో నిల్వ (store) చేయబడివుంది. జన్మపరంపరలో ఎన్నో జన్మలు తీసుకున్నారు. ఎన్నో కోణాలు దర్శించి, అనుభవాలు పొందుతూ ప్రస్తుత ఈ జన్మ తీసుకున్నారు. ఈ జన్మ పరంపర గురించి, అనుభవాలు, జ్ఞానం గురించి తెలుసుకోవాలని అంతర్ మథనం మొదలుపెట్టినపుడు సబ్‌కాన్షియస్ మైండ్ మీ అందుబాటులోకి వస్తుంది. అంతర్‌మథనం

(అంతర్ ప్రయాణం), ఆత్మానుభవాల ద్వారా మహితాత్మకమైన సబ్‌కాన్షియస్ మైండ్‌ను మీరు వినియోగించుకోగలుగుతారు.

మహాసముద్రంలో నుండి పుట్టుకొచ్చిన ఒక 'అల' ఈ కాన్షియస్ మైండ్ అని ఇది వరకే చెప్పుకున్నాము. ఈ కాన్షియస్ మైండ్ యొక్క ఉప ఉత్పత్తి (by product) 'అహం' (ego). ఈ అహం అనేది సంఘం ఇచ్చిన బుద్ధి ద్వారా, బాహ్య ప్రపంచంలో మీరు సముపార్జించుకున్న జ్ఞానం ద్వారా పనిచేస్తుంది. ఆత్మానుభవాల లేమివల్ల కాన్షియస్ మైండ్ పైన అహం యొక్క ప్రభావం ఎక్కువగా వుంటుంది. అహం వల్ల విశృంఖలమైన మనస్సు విజృంభిస్తుంది. పర్యవసానంగా మనిషికి దు:ఖాలను కలిగిస్తుంది. మీ మతాలు (religions) మత పెద్దలు (priests) అహాన్ని ఆత్మగా భావిస్తున్నాయి. అహాన్ని సంతృప్తి పరచడమే కేంద్రంగా మతబోధనలు (religious teachings) సాగుతున్నాయి. మనిషికి ఒక ఆత్మ వుందని, ఆత్మకు అమేయమైన శక్తి వుందని అంతర్ ప్రయాణం ద్వారా ఆత్మశక్తిలోకి దూకడం ఏ మతబోధకుడూ మీకు చెప్పడం లేదు. మీ వాస్తవం యొక్క తలాలు (dimensions of reality) చాల పరిధులకు లోబడి వుంటాయి. 'అహం' అనేది వ్యక్తిత్వాన్ని వ్యక్తపరుస్తుందేగాని ఆత్మను వ్యక్తపరచదు. ఆధ్యాత్మిక శాస్త్రమంటే అంతరంగ శాస్త్రము ! అంతర్ శక్తి, అంతర్ ప్రపంచం గురించి తెలియజేసేదే ఈ అంతరంగ శాస్త్రము. అంతర్ ప్రపంచం నుండి ఉద్భవించే జ్ఞానమే నిజమైన జ్ఞానం (wisdom). ఈ అంతర్ ప్రపంచానికి సంబంధించిన జ్ఞానాన్ని 'ఆత్మ జ్ఞానం', లేదా 'ఆధ్యాత్మిక జ్ఞానం' గా పిలవబడుతుంది. 'జ్ఞానమే శక్తి' (knowledge is power) అని మీరు వినే వుంటారు. బాహ్యేంద్రియాల ద్వారా సంప్రాప్తించిన జ్ఞానం ఏ మాత్రం శక్తివంతం కాదు. బాహ్యేంద్రియాల ద్వారా పొందిన జ్ఞానాన్ని 'జ్ఞానమే శక్తి' అని పరిగణించడానికి వీలు లేదు. అంతరేంద్రియాల ద్వారా సంప్రాప్తించిన జ్ఞానం మాత్రమే శాశ్వతమైన 'ఆత్మానందాన్ని' ఇస్తుంది. మతాలన్నీ మీ అంతరేంద్రియాల ద్వారా జ్ఞాన సంప్రాప్తిని కలగజెయ్యడంలో విఫలమయ్యాయి.

ఆత్మ జ్ఞానమే (science of soul) యదార్థజ్ఞానం (real knowledge) గా పిలవబడుతుంది. ఈ యదార్థ జ్ఞానం వల్ల మీ ఆత్మ యొక్క అనంతమైన శక్తి మీ వినియోగంలోకి వస్తుంది. భూమి మీద మనిషి చైతన్య పరిణామంలో, ఆధ్యాత్మికంగా పరిపూర్ణుడయ్యేందుకు ఆధ్యాత్మిక శాస్త్రము (spiritual science) తప్పని సరి. మనిషి 'అహం' అనే చట్రంలో బిగుసుకుపోయి 'అసత్య విద్య' లోకి నెట్టబడుతున్నాడు. మీ

యూనివర్సిటీలలో (universities). కాలేజీలలో (colleges) 'అసత్యవిద్య' (false education) బోధింపబడుతూంది. అది మీకు భౌతిక ప్రపంచంలో అవసరాలను కొంతవరకు తీర్చగలుగుతుందేగాని శాశ్వతమైన 'ఆత్మానందం' (bliss)ను అందించదు.

వాస్తవానికి కాన్షియస్ మైండ్ (conscious mind) అనేది ఒక వస్తువు కాదు; ఇది ఒక దృగ్విషయం (phenomenon). ఇది ఎల్లప్పుడూ ప్రకృతి మాదిరిగా నిరంతరమూ మార్పుకు లోనవుతుంటుంది. ఇది 'అహం' (ego) చేత కప్పబడి వుంటుంది. కాన్షియస్ మైండ్‌ను బాహ్య ప్రపంచ వాస్తవాన్ని దర్శించడానికి, అంతర్ ప్రయాణం చేయడానికి, ఎలా కావాలంటే అలా ఉపయోగించుకోవడానికి వీలుంది. సాధన ద్వారా, ఆత్మానుభవాలు పెరగడం ద్వారా కాన్షియస్‌మైండ్ పదునుపెట్టబడుతుంది. సహజావబోధన (intuition), ఆత్మానుభవాలు లేనపుడు వున్నపుడు ఇది 'అహం' చేత ప్రభావితమై, 'అహం' యొక్క నమ్మక వ్యవస్థ (belief system) అనుసారంగా కాన్షియస్ మైండ్ పని చేస్తుంది. కాన్షియస్ మైండ్‌కు సహజావబోధన (intuition) నుండి విచక్షణా జ్ఞానం తోడయితే ఆశాకర ధోరణి (positive thinking)తో పనిచేస్తుంది.

మీరు కాన్షియస్ మైండ్‌ను సరియైన పద్ధతిలో ఉపయోగించడం నేర్చుకోవాల్సివుంది. అంతర్ సాధన ద్వారా దానిపై మీరు పట్టు సాధించవచ్చు. మీరు ఇది వరకే ఏర్పరుచుకున్న తప్పుడు అభిప్రాయాలవల్ల, సంఘం ఇచ్చిన బుద్ధి వల్ల, బాహ్య ప్రపంచంలో మీరు సంప్రాప్తించుకున్న పరిమిత జ్ఞానం వల్ల, మానసిక సోమరితనం (mind laziness) వల్ల కాన్షియస్ మైండ్‌ను అసాధారణ రీతిలో ఉపయోగించ లేకపోతున్నారు. ఈ క్రింద కనబర్చిన కొన్ని తప్పుడు అభిప్రాయాలు (false ideas)చూడండి. మీ కాన్షియస్ మైండ్ మిమ్మల్ని ఎలా పరిధుల్లో వుంచుతుందో గమనించండి.

1. జీవితం దు:ఖమయం.
2. దేహం చాల అల్పమైనది. మహిమాన్విత శక్తి దీనికి లేదు. దేహం పాపపూరితమైనది. గత జన్మల పాపంవల్ల ఈ దేహం తీసుకోవడం జరిగింది.
3. పరిస్థితుల ముందర నేను నిస్సహాయుడను. పరిస్థితుల అదుపులో నేనున్నాను, కాని వాటిని నా అదుపులో వుంచలేను.
4. నా వ్యక్తిత్వం, ప్రవర్తన బాల్యం నుండే వచ్చింది. దాన్ని ఇక మార్చడం అసంభవం, నేను గతంలో చేసిన కర్మలవల్ల దు:ఖిస్తున్నాను. గతం యొక్క దయా దాక్షిణ్యాల వల్ల బ్రతుకీడుస్తున్నాను.

5. నేను నిస్సహాయతలో కూరుకుపోయి వున్నాను. ఎంచేతంటే గత జన్మలలో చేసిన కర్మలు నన్ను ఇంకా వెంటాడి పీడిస్తున్నాయి. ఆ కర్మల ఫలితంగా శిక్షను అనుభవించాల్సిందే! గత జన్మలలో నేను మనుష్యులపట్ల నిర్దయగా ఉన్నాను. కనుక ఇపుడు శిక్షను అనుభవిస్తున్నాను.
6. మానవజాతి పట్ల నాకు సదభిప్రాయం లేదు. అందరూ చెడ్డ వాళ్ళుగానే కన్పిస్తున్నారు. నాకు మహిమాన్విత శక్తి వుందని నేను నమ్మను.
7. నాకు తెలిసిన సత్యం వేరెవ్వరికీ తెలియదు. అంచేత నేను చాల గొప్పవాడిని. మా గ్రూపు లేదా తెగ వాళ్ళు మాత్రమే గొప్ప జ్ఞానవంతులు. మిగతా వాళ్ళంతా చాల హీనంగా వున్నారు.
8. వయసు పెరిగే కొద్దీ దేహం యొక్క శక్తి క్షీణించి పోతుంది. అనారోగ్యాల పాలై జీవితం దుర్భరమవుతుంది.
9. నాకు సృజనాత్మకత చాల తక్కువ. ఊహాశక్తిని ఉపయోగించడం కాని, కలలు కనడం కాని నాకు కష్టమనిపిస్తుంది.
10. దురదృష్టం ఎల్లప్పుడూ నన్ను వెంబడిస్తుంటుంది.
11. అత్యాశ పరులే ధనార్జన చేస్తుంటారు. ధనం వల్ల ఒరిగేదేమీ వుండదు. ధన సంపాదన చేసే వాళ్ళు ఆధ్యాత్మికంగా ఎదగలేరు. ఆనందంగా జీవించలేరు.
12. నాకు ఎప్పుడూ ఏదో ఒక ఆరోగ్య సమస్య వుంటూనే వుంటుంది. నా దేహం దానికి అలవాటుపడిపోయింది.
13. చెయ్యాలనుకున్న పనిని ఏదీ సక్రమంగా చెయ్యలేకపోతున్నాను. నా స్వభావమే అంత! దాన్ని మార్చడం ఇక సాధ్యం కాదు.
14. నాది ఊబకాయం (fat body) అవుతుందేమో! మా పూర్వీకుల జీన్స్ నిర్మాణం (gene structure) నాకు సంక్రమిస్తుంది.
15. ప్రజలు నన్ను అంతగా ఇష్టపడరు. నా స్వభావం (nature) అలా వుంటుంది మరి

ఇలాంటి అవాస్తవ అభిప్రాయాలు ఇవాళ మానవజాతిలో ఎక్కువ శాతం మందికి వున్నాయి. ఎవరు ఏ అభిప్రాయాలు కలిగి వున్నారో, వాటినే వాళ్ళ జీవితానుభవాలుగా పొందుతున్నారు. మీరు ఏర్పరుచుకున్న నమ్మకాలు (beliefs) అభిప్రాయలే (ideas) మీ జీవితంలో ప్రవేశిస్తున్నాయి. **మీరు ఏ విత్తనం నాటితే దాని**

ఫలితాన్నే (as you sow, so shall you reap) పొందుతారు. మీ అభిప్రాయాలను, నమ్మకాలను ఎప్పటికప్పుడు సరిచేసుకుంటూ వుండండి. ఆత్మ యొక్క అపరిమిత శక్తి మీకు తెలియకపోవడం వల్ల, పరిమిత ఆత్మజ్ఞానం వల్ల, చైతన్యశక్తి డైనమిక్స్ (dynamics of consciousness) తెలియకపోవడం వల్ల మీరీ తప్పుడు అభిప్రాయాలు కలిగి వుంటారు. అద్దం మీద దుమ్ములాగ పరిమిత జ్ఞానం ఉండేంత కాలమూ ఆ తప్పుడు అభిప్రాయాలు (false beliefs) మిమ్మల్ని వెంబడిస్తుంటాయి. ఆత్మజ్ఞానం పెరిగే కొలదీ అద్దం మీద దుమ్ము తీసేసినట్లుగా వాటిని తొలగించుకుంటూ రావచ్చు.

ఈ తప్పుడు అభిప్రాయాల బంధాలలో ఇరుక్కున్న మీకు ఆనందం ఎక్కడ? ఆరోగ్యం ఎక్కడ? స్వేచ్ఛ ఎక్కడ? మీ జ్ఞాన పరిధి, ఆత్మానుభవాల పరిధి, విస్తరించే కొద్దీ బంధనాలు ఒకటి తర్వాత ఒకటి తొలగిపోతూ వస్తాయి. ఈ స్వేచ్ఛ, ఆనందాల పరిధి విస్తరిస్తూ (expand) వుంటుంది. మీ చైతన్యశక్తి (consciousness), జ్ఞానం (knowledge), అనుభవాలు (experience) పెరిగే కొద్దీ కాన్షియస్ మైండ్‌ను వినియోగించుకునే సామర్థ్యమూ పెరుగుతుంది. అభ్యాసము కూసు విద్య కదా!

బాహ్య ప్రపంచ జ్ఞానాన్ని, అంతర్ ప్రపంచ జ్ఞానాన్ని స్వీకరించి వివేచన చెయ్యగల శక్తి కాన్షియస్ మైండ్‌కు వుంది. ఏది సత్యము? ఏది అసత్యము? అని వివేచన చెయ్యగలదు. అట్లాగని కాన్షియస్ మైండ్‌కు అపరిమితమైన శక్తి వుందని చెప్పడం సరికాదు. అంతర్ ప్రపంచానికి సంబంధించిన సబ్‌కాన్షియస్ మైండ్ (sub conscious mind)కు కాన్షియస్ మైండ్ (conscious mind) ద్వారా సూచనలివ్వడం జరుగుతుంది. కాన్షియస్ మైండ్ ఇచ్చిన సూచనలను సబ్‌కాన్షియస్ మైండ్ తు. చ. తప్పకుండా అమలు చేస్తుంది. అంతర్ ప్రపంచం నుండి బాహ్యప్రపంచంలోనికి భౌతిక సంఘటనలుగా, భౌతిక వస్తువులుగా, భౌతిక పరిస్థితులుగా కాన్షియస్ మైండ్ సూచనల మేరకు వాస్తవ రూపం పొందుతున్నాయి. ఏది పాజిటివ్ (positive), ఏది నెగెటివ్ (negative) అనేది అంతర్ ప్రపంచంలో ఉండదు. సబ్‌కాన్షియస్ మైండ్‌కు ఇవ్వడం మాత్రమే తెలుసు. అంతర్ శక్తిని రూపాంతరం చెందించి బాహ్యప్రపంచంలో వాస్తవం పొందేటట్లుగా చేస్తుంది. అంతర్ శక్తి బాహ్య ప్రపంచంలో పదార్థంగా, భౌతిక సంఘటనలుగా (physical events) రూపాంతరం చెందడంలో ఇమిడి వున్న మెకానిజమ్ (mechanism) మీ సైన్సుకు (science) గాని, శాస్త్రవేత్తలకు (scientists) గాని అందుబాటులో లేదు. ఈ ప్రక్రియలంతా (processess) మనోయాంత్రిక శాస్త్రము (mental dynamics)

ఆధారంగా జరుగుతాయి. వాటిని అర్థం చేసుకునే చైతన్యశక్తి స్థాయి (consciousness) మీ కింకా రాలేదు.

కాన్షియస్ మైండ్ లక్ష్యాలను (goals) నిర్దేశిస్తుంది. సబ్ కాన్షియస్ మైండ్ ఆ లక్ష్యాలను స్వీకరించి, అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోనికి భౌతిక సంఘటనలుగా రూపాంతరం (transform) చేస్తుంది. "దురదృష్టం నా జీవిత కాలమంతా వెంబడిస్తుంటుంది" అని కాన్షియస్ మైండ్ ద్వారా అంతర్ ప్రపంచానికి సూచనలిస్తే, అవే పరిస్థితులు బాహ్య ప్రపంచంలో వాస్తవమై మీ జీవితంలో ప్రవేశిస్తాయి. అంతర్గతంగా ఏ అభిప్రాయాలు (ideas) కలిగి వుంటారో, అవే బాహ్య ప్రపంచంలో మీ జీవితానుభవాలుగా మారుతాయి. అంతర్ ప్రపంచానికి ఇవ్వడమే తెలుసు. అక్కడ జడ్జిమెంట్ (judgement) అనేది వుండదు. కాన్షియస్ మైండ్ నుండి ఏ కోణాలలో అంతర్ ప్రపంచానికి (interior world) సూచనలిస్తే (directions) అవే కోణాలలో (the same angles) ప్రతిస్పందించి (respond) బాహ్యప్రపంచంలోనికి భౌతిక పరిస్థితులను (physical circumstances), భౌతిక వాస్తవాన్ని (physical reality) సృష్టించి (create) మీ జీవితానుభవాలుగా రూపాంతరం చేస్తుంది.

"నాకు సిగ్గు, బిడియం ఎక్కువ. నాకు ఎక్కువ మంది ఫ్రెండ్స్ వుండరు." అని ఒకతను కాన్షియస్ మైండ్‌లో అభిప్రాయాలు కలిగి వుంటే, అలాంటి పరిస్థితులే అంతర్ శక్తి నుండి బాహ్య ప్రపంచంలోకి అతని జీవితానుభవాలుగా వాస్తవం అవుతాయి.

"వయసు పెరిగే కొద్దీ దేహం యొక్క సామర్థ్యం తగ్గిపోతుంది. వృద్ధాప్యంలో చూపు మందగిస్తుంది. చెవులు వినపడవు." అని ఒకతను కాన్షియస్ మైండ్‌లో అభిప్రాయాలు కలిగి వుంటే, వృద్ధాప్యంలో అతను ఆ పరిస్థితులనే అనుభవిస్తాడు.

"ఆధ్యాత్మిక పురోభివృద్ధికి ధన సంపాదన అవరోధం అవుతుంది. ఆధ్యాత్మిక పురోభివృద్ధి, ధన సంపాదన పరస్పరం విరుద్ధంగా వుంటాయి." అని ఒకతను భావిస్తే ఆ అభిప్రాయాలకనుగుణంగానే అతని జీవితంలో పరిస్థితులు సృష్టింపబడతాయి. నిర్దిష్ట పద్ధతి (right method) ద్వారా ధన సంపాదన తప్పు కాదు (not wrong) అనే విషయం అతనికి తెలియాలి.

మీ నమ్మక వ్యవస్థ (belief system) కనుగుణంగా జీవితానుభవాలు మీకు ఎదురవుతుంటాయి. మీ ఆలోచనలు దారిద్ర్యం (poverty) చుట్టూ పరిభ్రమిస్తూ వుంటే దారిద్ర్యపు జీవితాన్ని అనుభవిస్తారు. మీ ఆలోచనలు అనారోగ్యం చుట్టూ పరిభ్రమిస్తూ

వుంటే అనారోగ్య జీవితాన్ని అనుభవిస్తారు. **మీరు ఎలా ఆలోచిస్తే అలాంటి వారే (as he thinketh in his heart, so is he) అవుతారు.** ఎంతో వివేచన చేసి కాన్షియస్ మైండ్ ద్వారా అంతర్ ప్రపంచానికి సూచనలివ్వడం మీరు సాధన (practice) చేయాలి. కాన్షియస్ మైండ్‌ను ఉపయోగించడంలో మీరు జాగరూకత (awareness) కలిగి వుండాలి. మీ అంతర్ ప్రపంచం నుండి వెలువడిన ఆలోచనలే బాహ్యంగా మీ జీవితానుభవాలుగా మలచబడుతున్నాయి. మీ ఆలోచనలను క్షుణ్ణంగా పరీక్ష (examine) చెయ్యడాన్ని సాధన చెయ్యండి.

జీవిత సార్థకత (life's value fulfilment) ఎన్ని కోణాలలో అభివృద్ధి పరచవచ్చు? ఏ విధంగా ఆశావహ దృక్పథం (positive thinking) అలవర్చు కోవచ్చు? ఇలా ముందు దిశలో (forward direction) మీ ఆలోచనా దృక్పథం వుండాలి. మీ భూమి మీద మనస్తత్వ శాస్త్రం (psychology) అసలు అభివృద్ధి చెందనే లేదు. మీ మనస్తత్వ శాస్త్రవేత్తలకు (psychologists) మైండ్ గురించి, మైండ్ పవర్ గురించి, అంతర్ ప్రపంచం గురించి, చైతన్యశక్తి (consciousness) గురించి, అపరిమితమైన అంతర్ శక్తి గురించి ఏ మాత్రం తెలియదు. వాళ్ళ అధ్యయనం (study) పరిశోధన అంతా కాన్షియస్ మైండ్‌లో వున్న 'అహం' కే పరిమితమై వుంది. వాళ్ళ రీసెర్చ్ (research) అంతా ఒకే దిశలో (uni dimensional) సాగుతూంది . మైండ్ యొక్క అనంత దిశలను (multi dimensions) రీసెర్చ్ చెయ్యడం విస్మరించారు. వాళ్ళు అనుసరించే విధానాలు, మానసిక విశ్లేషణ (psycho-analysis) చాల అసమగ్రంగా (incomplete) వున్నాయి. యదార్థ శాస్త్రజ్ఞులు (real scientists) అంతర్ ప్రయాణం (inner journey) చేసి మైండ్ గురించి రీసెర్చి చేయాలి. అంతర్ ప్రపంచం, ఆత్మశక్తికి గల అపరిమిత శక్తి, మైండ్ – దేహం మధ్య సంబంధం (mind-body relationship), మైండ్ – చైతన్యశక్తి (mind-consciousness) కాన్షియస్ మైండ్, సబ్‌కాన్షియస్ మైండ్, మైండ్ యొక్క అనేక క్రియలు (multiple activities of mind), అంతర్ శక్తి వినియోగం (utilization of inner energy)ల మీద అంతర్ పరిశోధన చేసేవాడే నిజమైన మనస్తత్వ శాస్త్రవేత్త. మైండ్ ఉపరితలంలో 'అహం' (ego) చేసే విన్యాసాలను (activities) పరిశోధించి వాటిని మైండ్‌కు చెందినవిగా ప్రతిపాదిస్తున్నారు. అంతర్ ప్రయాణం చేసి మైండ్ గురించి రీసెర్చి చేసే వారే యదార్థ శాస్త్రవేత్తలు!

నాలో ఏ లోపాలున్నాయి? గతంలో నేను చేసిన తప్పులేమిటి ? ఆ తప్పులను

ఎలా సరిదిద్దుకోగలను? అని రకరకాలుగా ఆలోచించి మీరు సైకాలజిస్టులు (psychologists), థెరపిస్ట్ (therapists) ల దగ్గరకి వెళ్తారు. ఆ సైకాలజిస్టులు (psychologists) మీలో లోపాలు ఏవేవి వున్నాయి? ఏ తప్పులు చేశారు? అని పెద్ద చార్టు (chart) తయారు చేస్తారు. దానివల్ల మీకు ఒరిగేదేమీ వుండదు. మీరు మరింత లిమిటేషన్స్ (limitations)లోకి నెట్టబడుతారు. మీలో లోపాలు అసలు ఎక్కడున్నాయి? ఫలానా రంగంలో మీరు ఇంకా వెనుకబడి వున్నారంటే, ఆ రంగం వైపు మీ మైండ్‌ను కేంద్రీకరించలేదన్నమాట! మీ మైండ్‌ను అటువైపు కేంద్రీకరిస్తే అంతర్ ప్రపంచం నుండి మీకు ఏది కావాలంటే అది సిద్ధపరచబడుతుంది. ఆ విషయం వైపు మీరు దృష్టి మరల్చలేదు. దానిపట్ల మీ నైపుణ్యం పెంచవలసివుంది. అంతేకాని అది లోపం కాదుగదా!

మీరు ఒంటరిగా జీవిస్తున్నారు? ఇతరులతో కలిసి మెలసి వుండలేక పోతున్నారు. సిగ్గు, బిడియం మిమ్ముల్ని డామినేట్ (dominate) చేస్తుంటుంది. కాన్షియస్ మైండ్‌లో మీరు నిశ్చయించుకున్న అభిప్రాయాల (ideas) వల్ల అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోనికి వాస్తవరూపం పొందింది. అంతే! అది లోపం కాదు! ఆ అభిప్రాయాలను మార్చుకుని, ధైర్యంగా వున్నట్లు, అందరితో కలివిడిగా మాట్లాడుతున్నట్లు మీ మైండ్‌లో ఊహించుకుంటే, అదే మీ జీవితానుభవంగా వాస్తవమవుతుంది. అంతర్ ప్రపంచం నుండి ఎలా కావాలంటే ఆలా భౌతిక అనుభవాలను (physical experiences) బాహ్య ప్రపంచంలోనికి తీసుకువస్తే, మీ వాస్తవానికి మీరే కారకులని విశదమవుతుంది. గతంలో ఏ తప్పులు చేశాను? వాటినుండి నేను ఏమి నేర్చుకోగలను? అని గతంలోనికి తొంగి చూడనవసరం లేదు. దానివల్ల మీ మైండ్‌కుగల అపారశక్తిని నిందించి (blame)నట్లవుతుంది. గతానుభవాలకంటే ఒక అడుగు ముందుకు వచ్చి మరింత ఉన్నతంగా ప్రస్తుతం మీరు వర్తమానంలో జీవిస్తున్నారు. వర్తమానమే ఇంకొక అడుగు ముందుకు వెయ్యడానికి అవకాశమిస్తుంది.

గతంలో పొందిన అనుభవాలను ఆస్వాదించి, పరిణామం చెందిన తర్వాతే ఇపుడు వర్తమానంలో క్రొత్త అనుభవాలు, క్రొత్త జ్ఞానం కోసం సిద్ధంగా వున్నారు. వర్తమానంలో చేసే చేష్టలే భవిష్యత్తుని నిర్మిస్తుంది.! వర్తమానంలో చేసే చేష్టలతోనే ఆటోమాటిక్‌గా గతం యొక్క పునర్నిర్మాణం జరుగుతుంది.

వర్తమానమే బహుమానం ! గతం ఏమైనా వర్తమానం ప్రస్తుతం మీ చేతుల్లో వుంది. దాన్ని చక్కబెడితే చాలు భవిష్యత్తు కూడ చాల ఆటోమాటిక్‌గా మార్పుకు లోనవుతుంది. భవిష్యత్తులో ఏవేవి జరగాలో ముందే నిర్ణయించబడివుండవు. భవిష్యత్తును

ఎలా కావాలంటే అలా మలుపు త్రిప్పవచ్చును. బంకమట్టిని (clay) ఇష్టమొచ్చిన రూపంలో మీరు మలచవచ్చు. అట్లాగే భవిష్యత్‌ను కూడ ఇష్టమైన రీతిలో మలుపు త్రిప్పవచ్చు. వర్తమానం మారే కొద్దీ గతమూ, భవిష్యత్తూ రెండూ మారుతుంటాయి.

చెస్‌గేమ్ (chess game)నే తీసుకోండి. పావులను (pawns) కదపడంలో గతంలో కొన్ని తప్పులు దొర్లినాయి. అలాగని, ఆట గతంలో లేదు. ఇపుడు వర్తమానంలో పావులను సక్రమంగా కదుపుతున్నారా? లేదా? అనే దాని మీద ఆట గెలుపు, ఓటములు ఆధారపడి వున్నాయి. వర్తమానంలో కదిపే పావులతో (pawns) గతంలోని ఆట ఆటోమాటిక్‌గా మారింది. భవిష్యత్ ఆట యొక్క గెలుపు, ఓటములు కూడ ఆటోమాటిక్‌గా మారినాయి.

అంటే వర్తమానమే గతాన్నీ ఆటోమాటిక్‌గా పునర్నిర్మిస్తుంది; భవిష్యత్‌ను కూడ ఆటోమాటిక్‌గా సృష్టిస్తుంది. వర్తమానాన్ని వర్తమానమే సృష్టిస్తుంది! అంతేగాని, గతము మరి భవిష్యత్తు, వర్తమానాన్ని సృష్టించవు.

గతకాలంలో చేసిన తప్పులు, గత జన్మలలో చేసిన తప్పులను ఇపుడు నెమరువేయడం (recollect) అర్థరహితం. ఆ పొరలన్నీ (layers) దాటుకుని, ఎన్నో జన్మలలో, ఎంతో జ్ఞానాన్ని సంపాదిస్తూ వస్తున్నారు. మరింత జ్ఞాన సముపార్జన ఈ వర్తమానంలో జరగవలసివుంది. ఎన్నో మెట్లు దాటి వచ్చిన మీరు పై మెట్టును అధిరోహించడానికి ఈ వర్తమానంలో సాధన చేస్తున్నారు. ఇక గతంతో పనేముంది?

గతంలోకి తొంగి చూడాల్సి వస్తే, గతంలో మీరు ఆనందంగా గడిపిన క్షణాలు గుర్తుకు తెచ్చుకోండి. ఇపుడు దాని పర్యవసానంగా మరింత ఆనందంగా ఉండగలుగుతారు. గతంలో మీరు ఆరోగ్యంగా వున్న క్షణాలు గుర్తుకు తెచ్చుకోండి. ఇపుడు మరింత ఆరోగ్యంగా వుండడానికి ఊతమిస్తుంది. గతంలో మీరు సాధించిన విజయాలను గుర్తుకు తెచ్చుకోండి. ఇపుడు మరిన్ని విజయాలు సాధించడానికి అది నమ్మకాన్ని కలుగజేస్తుంది. అంతే గాని గతంలో మీరు అనారోగ్యంగా వున్న క్షణాలను గుర్తుకు తెచ్చుకోవడం వల్ల మీ కాన్షియస్ మైండ్ ద్వారా అంతర్ ప్రపంచం ప్రభావితమై మరింత అనారోగ్యానికి గురవుతారు.

మీ సైకాలజిస్టులు (psychologists), సైకియాట్రిస్టులు (psychiatrists) చేస్తున్న పొరపాటు (mistake) అదే! మీలో లోపాలు, మీరు చేసిన తప్పులను పెద్ద పెద్ద చార్టులు (charts) గీసి ఎత్తి చూపడం ద్వారా మిమ్మల్ని సరిదిద్దుతున్నామనుకుంటున్నారు.

లోపాలు, తప్పులు అనేవి ఎక్కడా లేవు. అన్నీ అనుభవాలే! వాళ్లు ఆ అనుభవాలను వేలెత్తి చూపడం ద్వారా మీకు గల అపారమైన మనోశక్తిని గుర్తించలేకపోతున్నారు; కించపరుస్తున్నారు. జీవితంలో అన్నీ అనుభవించడానికే జన్మ తీసుకోవడం జరిగింది. ప్రతి అనుభవమూ చైతన్య పరిణామాన్ని పెంచుతుంది. అనుభవాలను నిర్మాణాత్మకంగా (constructive) ఎంచుకోవడంలో మీ కాన్షియస్ మైండ్ ఎప్పటికప్పుడు మీకు సూచనల్ని ఇస్తూనే వుంటుంది. కాని 'అహం' ప్రభావానికి లోనైన మీరు లిమిటేషన్స్ (limitations)తో కూడిన నమ్మక వ్యవస్థ (belief system)కు అలవాటు పడిపోయారు; సరియైన అనుభవాలను ఎంచుకోవడంలో విఫలమవుతున్నారు.

సైకోఅనాలసిస్ (psycho analysis) చార్టు ద్వారా మీ బలహీనతలు లోపాలతో విశ్లేషణకు (analysis) పూనుకుంటారు మీ సైకాలజిస్టులు (psychologists). ఒక విషయం పట్ల మీరు బలహీనత (weakness) కలిగి వున్నారంటే, ఆ విషయం పట్ల మీ మనోశక్తిని కేంద్రీకరింప (concentrate) జెయ్యలేదని అర్థం! అంతేగాని అది మీ బలహీనత కాదు. సిగ్మంట్ ఫ్రాయిడ్ (Sigmund Freud), కార్ల్‌జంగ్ (Carl Jung) అనే మనస్తత్వవేత్తలు (psychologists) మానవజాతి బలహీనతలు, లోపాలపైన రీసెర్చి (research) చేశారు. మైండ్ గురించి, ఆత్మశక్తి గురించి వాళ్ళకేమీ తెలియదు. వాళ్ళ రీసెర్చి (research) చాల అసమగ్రమైనది. మీ భూప్రపంచంలో సైకాలజిస్టులు (psychologists), సైకియాట్రిస్టులు (psychiatrists)దాదాపు అందరూ మానసిక అనారోగ్యంతో (mental illness) బాధ పడుతున్నారు. వాళ్ళ దగ్గరకెళ్తే మీకు ఒరిగేదేమి వుండదు. అందరి సమస్యలూ వాళ్ళ సమస్యలుగా భావించి నెత్తిమీద మోస్తున్నారు. భూమి మీద ఆత్మహత్యలు (suicides) చేసుకునే వాళ్ళలో ఎక్కువ శాతం సైకియాట్రిస్టులే (psychiatrists). మైండ్ డైనమిక్స్ (mind dynamics) గురించి వాళ్ళు ఇతోధికంగా ఎంతో రీసెర్చి చేయాల్సి వుంది.

సైకాలజిస్టుల (psychologists) థెరపీ (therapy) అంతా 'అహం' చుట్టూ మాత్రమే వుంటుంది. మైండ్‌ను గుర్తించడంలో ఫెయిలవుతున్నారు. దేహం నుండి కన్ను (eye) ఎలా బాహ్యంగా కన్పిస్తుందో, అంతర్ మనోశక్తి నుండి 'అహం ' (ego) కాన్షియస్ మైండ్ ద్వారా బాహ్యంగా కన్పిస్తుంది. కన్ను బాహ్య ప్రపంచాన్ని మాత్రమే చూడగలదు. తనను తాను చూసుకోలేదు. దేహంలోని అంతర్భాగాలను చూసుకోలేదు. 'అహం' కూడ బాహ్యప్రపంచాన్ని చూడగలదు;తనని, అంతర్ ప్రపంచాన్ని చూసుకోలేదు. అహమే

సర్వస్వమని మీరు భావించడం వల్ల అంతర్ ప్రపంచం గురించి మీకు అవగాహన కలగడం లేదు. అహం నిరంతరమూ మార్పుకు లోనవుతుంటుంది. అయిదేళ్ళ క్రితం వున్న అహం ఇవాళ వుండదు. చైతన్యశక్తి కన్నుగా రూపాంతరం చెందినట్లే, అంతర్ మనోశక్తిలో ఒక పీలిక బాహ్యప్రపంచంలో 'అహం'గా సృష్టింపబడుతుంది. కన్ను, అహం రెండూ బాహ్య ప్రపంచ వాస్తవాన్ని దర్శించడానికి ఉపయోగపడతాయి. కాని అంతర్ ప్రయాణానికి ఇవి మార్గం కావు. కాలం గడిచే కొద్దీ కన్ను నిర్మాణంలో ఎన్నో జీవకణాలు పుడుతూ, చస్తూ, పుడుతూవుంటాయి. ఎన్నో జీవరసాయనిక ప్రక్రియలు జరుగుతుంటాయి. కాని కన్ను వీటిలో దేన్నీ చూడజాలదు. అట్లే 'అహం' పొరల (layers) లోపల ఎన్నో కోణాలలో మానసిక నిర్మాణాలు (psychological structures)పుడుతుంటాయి; గిడుతుంటాయి; కాని అహం వీటిని దర్శించలేదు. కాని నిరంతర ప్రవాహం లాగ మార్పులకు లోనవుతుంటుంది.

ఆత్మకు సంబంధించిన జ్ఞానం గురించి తెలుసుకోవాల్సింది ఇంకా ఎంతో వుంది. ఆత్మ గురించి, అంతర్ ప్రపంచం గురించి మీ సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులకు తెలిసిన పరిజ్ఞానం దాదాపు శూన్యం. మత పెద్దలు (religious leaders) 'అహం' అనే మాయలో చిక్కుకుని భౌతిక జీవితాన్ని ఆనందంగా గడపలేకపోతున్నారు. జీవిత శాస్త్రము (science of life) గురించి వాళ్ళకేమీ తెలియదు. ఆత్మ గురించి వాళ్ళకేమీ తెలియదు. భూమి మీద మానవ చైతన్య వికాసాన్ని, ఆత్మ యొక్క ఔన్నత్యాన్ని విస్మరించి హీనపరుస్తున్నది ఈ మత గురువులు, పాశ్చాత్య (western) వైద్య విధానాన్ని అనుసరిస్తున్న డాక్టర్లే! ఆధ్యాత్మిక శాస్త్రము (spiritual science), మనస్తత్త్వ శాస్త్రము (psychology), వైద్య శాస్త్రము (medical science), భౌతిక శాస్త్రం (physics) అన్నీ ఒక దానికొకటి మేళవించబడి (blended) సంయోగం చెంది అభివృద్ధి చెందవలసి వుంది. అపుడే నిజమైన సైన్సు (science) భూమి మీద అత్యద్భుతంగా అభివృద్ధి చెందగలదు.

మీ ఆలోచనలు (thoughts), భావోద్వేగాలు (emotions), స్పందనలు (feelings), ఆశయాలు (expectations), కోరికలు (desires) – మైండ్ (mind) నుండి వెలువడుతున్న విద్యుదయస్కాంత తరంగాలు (electro magnetic waves). అవన్నీ భౌతికంగా అన్ని దిశలలో ప్రయాణించడమే గాకుండా, మీ కంటికి కన్పించని అనేకానేక దిశలలోనూ ప్రయాణిస్తున్నాయి. అనేక తలాలలో (many dimensions) ప్రయాణిస్తున్నాయి. ఈ విశ్వంలో సంభవించే భౌతిక సంఘటనలు (physical events),

ఆధ్యాత్మిక సంఘటనలు (meta physical events) మైండ్ నుండే పుడుతున్నాయి. అంటే అంతర్ ప్రపంచం నుండి పుడుతున్నాయి. ఇదే పరమ సత్యం!

మెదడు (brain) ద్వారా మైండ్ కనెక్ట్ (connect)అయి వుంది. ఈ దేహం నశించినపుడు మెదడు కూడ నశించి పోతుంది. మైండ్ జన్మ పరంపరల ద్వారా కంటిన్యూ (continue) అవుతుంది. భూమి మీద అన్ని జీవజాతులకు సంబంధించిన సమాచారం (information), ఇంతవరకు మానవజాతులు అనేక నాగరికతలలో సాధించుకుంటూ వస్తున్న చైతన్య పరిణామం అంతా మీ మైండ్‌లో నిక్షిప్తమై వుంది. ఆత్మశక్తితో బాటు మైండ్ కూడ నిరంతరమూ చైతన్య పరిణామ చెందుతూ వ్యాకోచం (expand) చెందుతుంది. అన్ని వేళలా మీరు మీతోనే వుంటున్నారు. ప్రతిక్షణమూ మార్పు చెందుతూ చైతన్యశక్తిని విస్తరించుకుంటున్నారు. ఈ ప్రపంచంలో మిమ్మల్ని మీరే ఉద్ధరించుకోవాలి. మిమ్మల్ని మీరే విస్తరింపజేసుకోవాలి. మిమ్మల్ని మీరే అభివృద్ధి పరచుకోవాలి. జీవరసాయనాల పరంగా, ఆధ్యాత్మికంగా, మానసికంగా మీరు ఎంతో ప్రత్యేకత కలిగివున్నారు. ఈ ప్రపంచంలో మరెవ్వరూ మీలాగ ఉండే అవకాశం లేదు.

ఆత్మ జ్ఞానం గురించి మీకు తెలిసింది చిన్న ఆవగింజంత అయితే, మీరింకా తెలుసుకోవాల్సింది ఈ భూగోళమంత వుంది! మీ దేహంలోని అవయవాలను మీరు చూడగలుగుతున్నారు. కాలు, చెయ్యి, కడుపు వంటి వాటిని మీ కళ్ళతో చూడగలుగుతున్నారు. డాక్టర్లు మీ దేహంలోని అన్ని భాగాలను సర్జరీ (surgery) ద్వారా చూడగలరు. కాని వాళ్ళకు మైండ్ (mind) కనిపించదు. మెదడును ఎన్ని ముక్కలుగా కోసి సర్జరీ చేసినా 'మైండ్'ను వాళ్ళు కనుగొనలేరు. మీరు ఇతరుల తలను చూడగలరు. సర్జరీ చేస్తే వాళ్ళ మెదడును చూడగలరు. కాని 'మైండ్' మీకు కన్పించదు. మీ అంతర్ ప్రపంచంలో కోటానుకోట్ల లోకాలు ఇమిడివున్నట్లే కోట్ల మైండ్స్ ఇమిడి వున్నాయి. మైండ్ లోపల మైండ్ లోపల మైండ్ లోపల మైండ్... (mind in mind in mind in mind...) ఎన్నో మైండ్స్ ఒక దానిలో మరొకటి ఇమిడివున్నాయి. దీన్నే చైతన్యశక్తి లోపల చైతన్యశక్తి లోపల చైతన్యశక్తి లోపల... గా పేర్కొనవచ్చు.

ఒక మనిషిని అతని తెలివి తేటలు (intelligence),అతను చేస్తున్న పనులు ఆధారంగా గుర్తిస్తున్నారంటే మీరు ఎంచుకున్న ప్రామాణికాలు (measurements) సక్రమంగా లేవని అర్థం. ఒక వ్యక్తిని అతని మైండ్ పరంగా గుర్తించాలి. ఆత్మశక్తి పరంగా గుర్తించాలి. అపుడే మిమ్మల్ని మీరు ఉన్నత పరచుకోగలుగుతారు.

* * *

చైతన్యశక్తి (consciousness) మైండ్ ద్వారా ఆలోచనా శక్తి (thought power)గా మారుతుంది. ఆలోచనా శక్తి భౌతికపదార్థంగా, భౌతిక వస్తువుగా, భౌతిక సంఘటనగా రూపాంతరం చెందుతుంది. శక్తి (energy), చైతన్యశక్తి (conscious ness) విషయంలో మీరు అయోమయానికి (confusion) గురికావలసిన పనిలేదు. ఈ రెండూ ఒకటే. శక్తి యొక్క రూపాంతరమే చైతన్యశక్తి. ఆలోచనలు (thoughts) వస్తువులుగా రూపాంతరం చెందుతాయి. జీవజాతుల అన్నింటి ఆలోచనల నుండి భూ భౌతిక వాతావరణం (physical atmosphere) ఏర్పడుతూ వుంది. మీరు అంతర్గతంగా ఏర్పరచుకున్న కోరికలు (desires), ఆశయాలు, ఫీలింగ్స్, ఎమోషన్స్‌ల కనుగుణంగా, మీ మైండ్‌లో కొన్ని రూపాలను (forms) ఊహించుకుంటారు. అవి బాహ్య ప్రపంచంలోనికి వస్తువులుగా రూపాంతరం (transform) చెందుతాయి. మీరు అంతర్గతంగా కోరుకున్నవి ఆలోచనల రూపంలో మైండ్ ద్వారా బాహ్య ప్రపంచంలోనికి ప్రవేశించి వాస్తవాన్ని (reality) పొందుతున్నాయి. మీరు ఎరుకలో (awareness) వున్నా, లేకున్నా నిరంతరమూ మీ అంతర్ ప్రపంచం నుండి ఆలోచనలు వెలువడుతూ వుంటాయి. ప్రతి ఆలోచన దానికి గల శక్తి స్థాయి (energy level) కనుగుణంగా ఏదో ఒక లోకంలో (any world) వాస్తవ రూపం పొందుతుంది.

ఉన్నత లోకాలలో (higher worlds), ఆలోచనా రూపాలు (thoughts forms) భౌతిక పదార్థంగా (physical matter) రూపాంతరం చెందే ప్రక్రియ (process) గురించి అక్కడ వున్న వాళ్ళకు చాల చక్కగా తెలుసు. అంతర్గత నియమాలు (inner laws) బాహ్య ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయనే విషయం వాళ్ళు అర్థం చేసుకుని ప్రాక్టీసు (practice) చేస్తున్నారు. వాళ్ళు ఆలోచనా రూపాలను (thought forms) చదవగలుగుతున్నారు. ఆలోచనా రూపాలను తమకు కావలసిన రీతిలో ఉపయోగించుకుని వాళ్ళ జీవితాలలో కావల్సిన సంఘటనలను (events) ప్రవేశపెట్టగలుగుతున్నారు. అంతర్ ప్రపంచం (inner world) గురించి, ఆలోచనల (thoughts) గురించి ఆ లోకాలలో పరిశోధన కొనసాగుతూంది. అలాగని ఆ ఉన్నత లోకాలలో (higher worlds) ఆత్మ గురించి, ఆత్మజ్ఞానం గురించి సంపూర్ణమైన జ్ఞానం (complete knowledge)వుందని కాదు. వాళ్ళు నేర్చుకోవాల్సిన సబ్జెక్టు (subject) కూడ ఇంకా ఎంతో వుంది. జ్ఞానమనేది (knowledge) అనంతం!

మీ 'భౌతిక దేహం (physical body) కూడ అంతర్ శక్తి నుండి వెలువడిన ఆలోచనల (thoughts) సముదాయం వలన ఏర్పడింది. మీరు అంతర్గతంగా ఏ ఊహలు

(images)ఎంచుకుని దేహం కావాలనుకున్నారో, వాటికనుగుణంగా తల్లిదండ్రులను ఎంచుకుని మీరు భౌతిక దేహాన్ని ధరించడం జరిగింది. పరమాణువులు (atoms), అణువుల (molecule) సముదాయంతో జీవకణాలుగా మారి మీ దేహం నిర్మింపబడి వుంది. ఈ ఆలోచనా శక్తి కనుగుణంగా పరమాణువులు, అణువులు దేహనిర్మాణంలో పాలుపంచుకున్నాయి. త్రిదిశా తలం (three dimensional plane)లో వున్న మీరు మీ ఆలోచనల ద్వారా భూ భౌతిక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ముందే చెప్పాను. భూ భౌతిక సంఘటనలను ప్రభావితం చెయ్యడంలో మానవజాతి ఇవాళ (man kingdom) ప్రముఖ పాత్ర వహిస్తూంది.

మానవజాతి ఆలోచనలు – భూమి మీద ఎలక్ట్రాను, పరమాణువు, అణువు, వృక్షాలు, జీవజాతులు, సముద్రాలు, పర్వతాలు, భూమి, దానిపై భౌతిక వాతావరణం అన్నింటి చైతన్య పరిణామాన్ని ప్రభావితం చేసి వ్యాకోచం (expansion) చెందించడంలో ప్రముఖపాత్ర వహిస్తున్నది. భూమండలంలో ప్రస్తుతం మానవజాతిదే ప్రధాన పాత్ర! ప్రతి ఆలోచన (thought), భావన (emotion) ఎంతో విద్యుదయస్కాంత శక్తిని కలిగి వున్నాయి.

త్రిదిశా తలం (three dimensional plane) గల భూమి మీద ప్రాణికోటి జీవితానుభవాలన్నీ భౌతిక పదార్ధంతో (physical matter) ముడిపడి వున్నాయి. ఇక్కడ ఇచ్చే సబ్జెక్టు (subject) అంతా శక్తి (energy), చైతన్యశక్తి (consciousness), పదార్థం (matter) ల చుట్టూ పరిభ్రమిస్తుంది. మీనుండి మీ అంతర్ ప్రపంచంలో ఏర్పడే ప్రతి ఫీలింగ్ (feeling), భావన (emotion) కోరిక (desire), ఆలోచన (thought), ఊహ లేదా కల (image), అన్నీ విద్యుదయస్కాంత శక్తిని కలిగి వున్నాయి. వీటన్నింటినీ ఆలోచనలుగా పరిగణించవచ్చు. అంతర్ ప్రపంచం నుండి వెలువడే ప్రతిదీ ఆలోచనగానే పరిగణించబడుతుంది. ఫీలింగ్, ఎమోషన్ – ఇలా రకరకాల పేర్లు పెట్టబడుతున్నాయి. మీరు T.Vలో చూస్తున్న ప్రతిబింబాలన్నీ (images) విద్యుదయస్కాంత తరంగాల వల్ల ఏర్పడుతున్నాయి. అట్లాగే భూమి మీద పదార్థంతో కూడిన వస్తువులు, భౌతిక సంఘటనలు, భౌతిక వాతావరణం అన్నింటినీ అంతర్ ప్రపంచం నుండి వెలువడుతున్న విద్యుదయస్కాంత ఆలోచనా తరంగాలు బాహ్య ప్రపంచాన్ని సృష్టిస్తున్నాయి.

ఆలోచనా తరంగాల నుండి భౌతిక వాస్తవ రూపం (physical reality) పొందిన వస్తువు, లేదా భౌతిక సంఘటన ఎంత కాలం జీవించి వుంటుందనేది, ఆలోచనా తరంగాలకు గల శక్తి తీవ్రత (intensity of energy), బలం పై ఆధారపడుతుంది.

బలహీన ఆలోచనా తరంగాల నుండి రూపాంతరం చెందిన భౌతిక సంఘటన అతి కొద్ది కాలం మనుగడ సాగించి తర్వాత అంతరించి పోతుంది. భూమి మీద భౌతిక సంఘటనలు ఎంతకాలం కొనసాగుతున్నాయనేది వాటికి అందించబడుతున్న ఆలోచనా తరంగాలు ఎంత బలాన్నిచ్చి ప్రభావితం చేస్తున్నాయన్న దానిపై ఆధారపడుతున్నాయి. మీ జీవితంలో ప్రవేశించే భౌతిక సంఘటన కొంతకాలం ఉండి అంతరించిపోతుంది. మీ ఆలోచనలతో ఆ సంఘటనకు జీవం పోస్తున్నంతకాలం అది నిలిచి వుంటుంది. ఆ సంఘటన తాలూకు మీ ఆలోచనలు ఆగిపోయిన వెంటనే ఆ భౌతిక సంఘటన నశించి పోతుంది. భూ ప్రపంచంలో పుడుతున్న భౌతిక సంఘటనలన్నీ అలాగే ఆలోచనల సరఫరా కొనసాగినంతకాలం జీవించి తర్వాత నశిస్తున్నాయి. అన్ని ఆలోచనలు భూమి మీద భౌతిక వాస్తవం (physical reality) పొందాలనే నియమం లేదు. వాటి ఫ్రీక్వెన్సీకి అనుగుణంగా వున్న ఇతర డైమన్షన్స్‌గల లోకాలలోనికి వెళ్ళి అక్కడ రూపాంతరం చెందుతుంటాయి.

ఈ భౌతిక వాతావరణంలో, మీ దేహాలలో 'వైరస్' (viruses) ఎలా సజీవంగా వుందో ఆలోచనలు కూడ అంతే సజీవంగా వున్నాయి. వైరస్ మీ దేహాన్ని ప్రభావితం చేస్తున్నాయి; మీ భౌతిక వాతావరణాన్ని ప్రభావితం చేస్తున్నాయి; దేహంపై చర్యలు జరుపుతున్నాయి. వాటి కదలికల ద్వారా మీ దేహంలో జీవ రసాయనిక మార్పులు కలుగుతున్నాయి. వైరస్‌లు వాతావరణాన్ని ప్రభావితం చేసి మార్చగలవు. ఆలోచనలను ఒక మాదిరిగా వైరస్‌లతో పోల్చవచ్చు. ఆలోచనలు మీ దేహంలో జీవ రసాయనిక మార్పులు కలుగజేసి దేహ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి.. వైద్య శాస్త్రానికి, మీ డాక్టర్లకు అంతుచిక్కని జీవరసాయనాలను, ఎంజైములను ఆలోచనాశక్తి పుట్టిస్తుంది. ఉదాహరణకు, మీ జీవితంలో ఎదురయిన ఒక విచారకరమైన సంఘటనను తలుచుకోండి. దాని పర్యవసానంగా మీ ఫీలింగ్స్ కూడ విచారకరంగా మారుతాయి. మీ దేహంలో జీవ రసాయనిక చర్యలు కూడ అందుకనుగుణంగా మార్పు చెందుతాయి. వాటి ఫలితంగా మీ దేహ ఆరోగ్యం కూడ ప్రభావితమవుతుంది.

మీ దేహంలో ఏదైనా ఒక భాగం రోగగ్రస్తమైనపుడు మీ మానోశక్తి ద్వారా ఆలోచనలను అక్కడికి కేంద్రీకరింపజేసి నయం చేయవచ్చు. ఆలోచనలు విద్యుదయస్కాంత శక్తి (magnetic energy)ని మోస్తున్నాయి. కాబట్టి ఆ శక్తి దేహంలోని జబ్బును నయం చేయగలుగుతూంది. ఆలోచనా శక్తి దేహంలో రసాయనిక శక్తిని, రసాయనిక చర్యలను కలుగజేస్తుంది. ఆహ్లాదకరం, సంతోషకరమైన ఆలోచనలు మీ దేహాన్ని ఆరోగ్యంగా

వుంచగలుగుతాయి. దుఃఖంతో, విచారంతో కూడిన ఆలోచనలు మీ దేహంలో గల జీవకణాల స్థాయిలో రసాయనిక చర్యలు కలుగజేసి దేహానికి గల సహజశక్తి (natural power)ని తగ్గిస్తాయి. మీ ఆలోచనల ద్వారా దేహంలో ఏ జబ్బునైనా నయం చేసుకోవచ్చు. లేజర్ కిరణాలు (laser rays) శక్తిని, ఉనికిని (identity) ఎలా కలిగి వున్నాయో ఆలోచనలు కూడ శక్తిని, ఉనికిని కలిగి వున్నాయి. ఆలోచనలు + దేహంపై వాటి ప్రభావం గురించి ముందు పేజీలలో ఇంకా వివరింపబడుతుంది.

ఆలోచనల నుండి ఫీలింగ్స్, ఎమోషన్స్ పుడుతున్నాయి. ఇవి ఆలోచనల యొక్క ఉప ఉత్పత్తులు (by products). ఆలోచనలు, ఫీలింగ్స్, ఎమోషన్స్ ఒక దానిపైన ఒకటి ఆధారపడి వున్నాయి. ఒక దాని నుండి ఒకటి పుడుతున్నాయి. దేహంలోని జీవకణాలు ఒక తరహా నిర్మాణం (structure) కలిగి వుండి, దేహ ఆరోగ్యంను ప్రభావితం చేయడంలో ఎలా పాత్రవహిస్తున్నాయో, ఆ విధంగా ఆలోచనా తరంగాలు కూడ ఒక తరహా నిర్మాణం కలిగి వుండి, భౌతిక సంఘటనలు ఏర్పరచడంలో పాత్ర వహిస్తున్నాయి. ఆశాకర ఆలోచనలు ఇతర ఆశాకర ఆలోచనలను ఆకర్షిస్తాయి (positive thoughts attract other positive thoughts).

నిరాశాకర ఆలోచనలు ఇతర నిరాశాకర ఆలోచనలను ఆకర్షిస్తాయి (negative thoughts attract other negative thoughts). ఎంచేతంటే ఆలోచనలకు విద్యుదయస్కాంత శక్తి వుంది. మీ జీవితంలో తారసపడే భౌతిక పరిస్థితులు (physical circumstances) మీ ఆలోచనల విద్యుదయస్కాంత శక్తి ద్వారా ఆకర్షింపబడుతున్నాయి. మీ జీవితంలో ఎదురయ్యే దురదృష్ట పరిస్థితులు, అనారోగ్యం, మీ ఆలోచనల ద్వారా ఆకర్షింపబడుతున్నాయి. **మీ ఆలోచనలే మీ వాస్తవాన్ని సృష్టిస్తున్నాయి.** మీ అంతర్ శక్తి నుండి వచ్చిన మనోశక్తి బాహ్య ప్రపంచంలో భౌతిక రూపాంతరం చెందుతుంది. మీరు అనుభవంలోనికి తెచ్చుకుంటున్న మానసికరోగాలు (mental diseases), శారీరక రోగాలు (physical diseases) అన్నీ మీ మనోశక్తి నుండి ఏర్పరుచుకున్న అభిప్రాయాలు, ఆలోచనలవల్ల వస్తున్నాయి.

ఆలోచనలు, ఫీలింగ్స్, ఎమోషన్స్, కోరికలు (desires) ఆశలు (expectations), అన్నీ కాన్షియస్‌మైండ్ నుండి అంతర్ ప్రపంచంలోనికి డైరెక్ట్ (direct) చేయబడుతున్నాయి. అంతర్ ప్రపంచం నుండి వాటికనుగుణంగా ప్రతిస్పందన (response) ఏర్పడి బాహ్య ప్రపంచంలోనికి వాస్తవాలుగా (realities)

సృష్టింపబడుతున్నాయి. ఆలోచనలు, ఫీలింగ్స్... ఏర్పరచడంలో మీ కాన్షియస్ మైండ్‌కు సంబంధించిన 'అహం' ప్రధాన పాత్ర వహిస్తుంది. 'అహం' మీ వ్యక్తిత్వంవల్ల, సంఘం నుండి తెచ్చుకున్న బుద్ధి వల్ల ఉత్పన్నమైంది. భూమండలమంతా ఒకటే, కాని ఆసియా ఖండం , అమెరికా ఖండాలు, యూరప్ ఖండం అని పేర్లు పెట్టుకున్నట్లుగా, మైండ్‌ను– సబ్‌కాన్షియస్ మైండ్, కాన్షియస్ మైండ్, అహం అని పేర్లు పెట్టడం జరిగింది. **వాస్తవానికి మైండ్ అనేది అనేక భాగాలుగా విడిపోయి పనిచెయ్యడం లేదు. ఉన్నది ఒక మైండ్ మాత్రమే. అది అంతర్ ప్రపంచంలో ఇమిడి వుంది. అంతర్ ప్రపంచం, మైండ్ వేరు వేరు గావు.**

ఈ మైండ్ అనేది జన్మ పరంపరలకు కంటిన్యూ అవుతుంది. అనాది కాలం నుండి కంటిన్యూ అవుతూంది. అనంతకాలం వరకూ కంటిన్యూ అవుతుంది. **అంతర్ శక్తి, అంతరాత్మ, అంతర్ ప్రపంచం, అంతర్ చైతన్యశక్తి, మైండ్, ఆత్మ, అంతరంగం ఎన్ని పేర్లు పెట్టుకున్నా అన్నీ ఒకటే!** మీరు అయోమయానికి (confusion) గురికానవసరం లేదు. ఈ విషయాలపట్ల చాల స్పష్టత (clarity) కలిగి వుండండి. మైండ్ నుండి ఆలోచనా తరంగాలు వెలువడుతున్నాయంటే, అంతర్ ప్రపంచం నుండి కాదా? అని మీకు సందేహం కలుగుతుంది. యూరప్ ఖండం నుండి రాకెట్ (rocket) ప్రయోగింపబడింది అంటే భూమి నుండి ప్రయోగింపబడిందనే కదా! ఉన్నది ఒకే భూమి. ఖండాలుగా పేర్లు పెట్టి గుర్తుంచుకుంటున్నారు.

ఫీలింగ్స్, ఎమోషన్స్, కోరికలు అన్నీ కాన్షియస్ మైండ్‌లోని 'అహం' లెవెల్లో (ego levels) పుడుతున్నాయి. సరియైన నిర్ణయాలు (right decisions), సరియైన ఆలోచనలు (right thoughts), సరియైన కోరికలు (right desires) ఏర్పరచడంలో మీరు కాన్షియస్ మైండ్‌కు ఎంతో తర్ఫీదును (training) ఇవ్వవలసి వుంది. కాన్షియస్ మైండ్ ఇచ్చే డైరక్షన్స్ (directions) కనుగుణంగా అంతర్ ప్రపంచం స్పందిస్తుంది (responds). **అంతర్ ప్రపంచం తనంత తానుగా ఏదీ మీకు ఇవ్వదు. ఏ నిర్ణయమైనా కాన్షియస్ మైండ్ నుండి జరగాలి.**

వాయువును (air) మీరు కళ్ళతో చూడలేరు. కాని వాయువును మీ ఇంద్రియాల ద్వారా పసిగట్టవచ్చు. ఆలోచనలు కూడ మీ చర్మచక్షువులకు (eyes) కన్పించవు. టెలీపతి ద్వారా వాటిని పసిగట్టవచ్చు. మీ ఆలోచనలకు ఎంత శక్తి వుంటుందంటే ఆలోచనల ద్వారా బలమైన ఉక్కు కడ్డీలను (steel rods) వంచవచ్చు. ఒక బరువును కేవలం

ఆలోచనల ద్వారా పైకి ఎత్తవచ్చు. లేజర్ కిరణాలను (laser rays) కేంద్రీకరింపజేసి (concentrating) ఒక ఉక్కు కడ్డీని రెండు ముక్కలుగా కోసినట్లు, ఆలోచనలను కేంద్రీకరింపజేసి అదే ఉక్కు కడ్డీని రెండు ముక్కలుగా కోసి వెయ్యవచ్చు.

భౌతిక వస్తువులు (physical things) మీ కళ్ళకు ఎంత వాస్తవమో ఆలోచనలు కూడ అంతే వాస్తవం! జీవజాతుల ఆలోచనా తరంగాలు భూ భౌతిక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. మానవజాతి నుండి వెలువడుతున్న ఆలోచనా తరంగాలు చాల ప్రాధాన్యత కలిగి వున్నాయి. వాతావరణంలో మార్పులు ఆలోచనా తరంగాల వల్ల జరుగుతున్నాయి. ఒక ప్రాంతంలో వర్షాలు సక్రమంగా కురిసేటట్లు ఆ ప్రాంత ప్రజలు మైండ్‌లో సంకల్పించి ఆలోచనా తరంగాలను విడుదల చేస్తే అవి భౌతిక వాస్తవం పొంది వర్షాలు చక్కగా కురుస్తాయి. వాయువులలో పరమాణువులు, అణువులు ఎలా వున్నాయో, ఆలోచనా తరంగాలలో సూక్ష్మాతి సూక్ష్మమైన (micro level) విద్యుదయస్కాంత కణాలు ఇమిడి వున్నాయి. అవి వాతావరణంలో రసాయనిక మార్పులు తీసుకురాగలవు. వాతావరణాన్ని సమూలంగా మార్చగలవు. పదార్థం యొక్క స్వభావాన్ని మార్చి వెయ్యగలవు. మానవజాతి ఆలోచనా తరంగాలు ఇతర జీవజాతుల వాటికంటే చాల తీవ్రమైన శక్తిని కలిగి వున్నాయి. అందువల్ల భూగోళం సమస్తమూ మార్చగల శక్తి ఇవాళ మానవజాతికి వుంది. ఆలోచనా తరంగాల గురించి, దాని డైనమిక్స్ (dynamics) గురించి, ఆత్మశక్తి గురించి మీరు తక్కువ సమాచారం (information) కలిగి వుండడం వల్ల చాల నిర్వీర్యత (powerless)గా ఫీలవుతున్నారు. ఆలోచనలు, వాటి డైనమిక్స్ గురించిన పరిజ్ఞానం పెరిగే కొద్దీ మీరు మరింత శక్తివంతులవుతారు.

ఆలోచనల ద్వారా ఇతరులను ప్రభావితం చెయ్యగల శక్తిని మీరు కలిగివున్నారు. మీ ఆలోచనలకు గల బలమైన అయస్కాంత ఆకర్షణ శక్తి (magnetic force) ద్వారా ఇతరుల ఆలోచనలను ప్రభావితం చేస్తారు. అట్లాగని ఇతరులకు హాని చెయ్యడం, వాళ్ళకు ప్రమాదాన్ని తలపెట్టడంలాంటి వాటిని వాళ్ళ సంకల్పం (willing) లేకుండా మీ ఆలోచనలు వాళ్ళలోకి వెళ్ళి ప్రభావితం చెయ్యలేవు. వాళ్ళ సంకల్పంతోనే మీరేదైనా చెయ్యగలరు.

మీ నమ్మకాలను (beliefs), ఆలోచనలను చాల క్షుణ్ణంగా పరిశీలించండి. వాటి పట్ల చాల జాగరూకత (awareness) కలిగి వుండండి. వాటిని ఎంతో పరిశీలన (observation), పరీక్ష (examination) చెయ్యడం వల్ల మీ మైండ్ నుండి వెలువడే ఆలోచనలు సక్రమమైన రీతిలో పంపగలుగుతారు. ఆలోచనలు ఒకసారి మీ మైండ్

నుండి వెలువడిన తర్వాత వాటిని ఉపసంహరించడం మీ చేతుల్లో లేదు. అవి ఎక్కడో ఒక చోట వాస్తవ రూపం పొందుతాయి.

మీ ఆలోచనల వల్ల ఏర్పడే భౌతిక సంఘటనలకు, భౌతిక పరిస్థితులకు మీరు బాధ్యత వహించాలి. మీ ఆలోచనల వల్లే మీరు ఇప్పుడున్న పరిస్థితులలో వున్నారు. సృష్టికర్త, మరి అతని సృష్టి విడదీయలేనివి (creator can not be seperated from creation). ఇవి రెండూ విడదీయరాని బంధం కలిగి వున్నాయి; ఒక దానికొకటి అల్లుకు పోయి వున్నాయి. అంతరంగం నుండి వెలువడే ఆలోచనలు భౌతిక ప్రపంచంలో వాస్తవ రూపం (materialization) చెందించడం ఆత్మశక్తి యొక్క అఖిలక్ష్యం. మీ రోజువారి జీవితంలో మీ అనుభవానికొచ్చే భౌతిక సంఘటనలు మీ ఆలోచనల నుండే ఉద్భవిస్తున్నాయి. మీ ఆలోచనలే మీరు! మీరే మీ ఆలోచనలు అయివున్నారు. మీ కుటుంబ పరిస్థితులు, మీ ఫ్రెండ్స్, రోజువారి చర్యలు, అన్నీ మీ ఆలోచనల కనుగుణంగా ఆకర్షిస్తున్నారు. మీ జీవితంలో ఏదీ యాదృచ్ఛికంగా (accidental) జరగడం లేదు. అన్ని అనుభవాలు మీ ఆలోచనల అనుసారంగానే మీ జీవితంలో ఎదురవుతున్నాయి.

T.Vలో ప్రోగ్రామ్ (programme) నచ్చకపోతే ఇంకో ప్రోగ్రామ్‌ను మార్చే విధంగా మీ జీవితంలోని కొన్ని పరిస్థితులు, అనుభవాలు మీకు నచ్చకపోతే, వేరే పరిస్థితులను, అనుభవాలను మీ జీవితంలోనికి ప్రవేశపెట్టుకోవచ్చు. మీరెప్పుడూ నిస్సహాయస్థితిలో (helpless), నిర్వీర్య స్థితిలో (power less) లేరు. అన్ని సర్వసమర్థతలు మీ ఆత్మశక్తి లో ఇమడ్చబడి వున్నాయి. సర్వశక్తి యుక్తులూ మీలోనే వున్నాయి. T.V ప్రోగ్రామ్స్ మార్చినంత సులభంగా, తేలికగా మీ జీవితానుభవాలను, జీవిత పరిస్థితులను వెంటనే మార్చి వెయ్యవచ్చు. మీ మనోశక్తి, ఆలోచనల దిశ ఎటు మారితే అటు భౌతిక సంఘటనలలో మార్పులు జరుగుతాయి. నీటి ప్రవాహాన్ని ఎటు కావాలంటే అటు మలుపులు త్రిప్పినట్లు భౌతిక సంఘటనలను, భౌతిక పరిస్థితులను మీ ఇష్టమొచ్చిన రీతిలో మలుపులు త్రిప్పవచ్చు. ఈ విశ్వంలో (universe) ఏదీ దృఢంగా (rigid), పెళుసుగా (brittle) లేదు. విశ్వమంతా చైతన్యశక్తి (consciousness) ప్రవాహమే ! **బంకమట్టిని (clay) ఎలా కావాలంటే అలా మలచవచ్చు. అలాగే విశ్వచైతన్యశక్తిని ఎలా కావాలంటే అలా మలచవచ్చు.**

మీ అభిప్రాయాలు (ideas), ఆలోచనలతో ఈ ప్రపంచంలో ఏదైనా సృష్టించే స్వేచ్ఛ (freedom) మీలో ప్రతి ఆత్మశకలానికి వుంది. ఆలోచనలు, అభిప్రాయాలు

ఏర్పరచుకోవడంలో మీరు విచక్షణ కలిగి వుండాలి. చాల వరకు ఆలోచనలు 'అహం' స్థాయి (ego level)లో గల తెలివి (intellect) నుండి పుడుతున్నాయి. అహం భౌతిక ప్రపంచం గురించిన పరిజ్ఞానంతో మాత్రమే నడుస్తుంది. పరిమిత జ్ఞానంతో తీసుకున్న ఆలోచనలు పరిమితమైన జీవితానుభవాలనే ఇస్తుంది. 'అహం' ఎప్పుడూ మిమ్మల్ని లిమిటేషన్స్ (limitations) లోనికి నెట్టివేస్తుంది. మీ ఇంటెలక్ట్ (intellect) నుండి మీరు నిర్ణయాలు (decisions) తీసుకోవడం జరుగుతుంది. లిమిటేషన్స్ (limitations) అనేవి ఇంటెలక్ట్ నుండే ప్రారంభమవుతున్నాయి.

ఇంటెలక్ట్ (intellect)కు అంతర్వాణి లేదా సహజావబోధన (intuition) జోడిస్తే చాల అద్భుతమైన ఆలోచనలు, అభిప్రాయాలు, నిర్ణయాలు మీ మైండ్ నుండి పుడుతాయి. మొదట మీరు అంతర్వాణిని వినియోగించుకోవడం సాధన (practice) చెయ్యండి. మీ ఆత్మశక్తిని వెలికి తీసి మీ జీవితాలలో అద్భుతమైన భౌతిక సంఘటనలు ప్రవేశపెట్టడంలో మీ అంతర్వాణి మీకు ఎంతో సహకరిస్తుంది. అంతర్వాణి నుండి తీసుకునే నిర్ణయాలు, సలహాలు, ఆలోచనలు మిమ్మల్ని ముందు ముందుకు పరిణామం చెందిస్తాయి. అంతర్వాణి ద్వారా అన్నీ సవ్యంగా నడుస్తాయి. తప్పు ఒప్పుల ప్రసక్తి వుండదక్కడ. అంతర్ ప్రపంచం నుండి ఎంత గైడెన్స్ (guidance) కావాలంటే అంత లభిస్తుంది. **మీ అంతర్ ప్రపంచమే మీకు గైడ్ (guide)! సరియైన మార్గదర్శకత్వం కోసం బయటి ప్రపంచంలో మీరెక్కడా ప్రయాసపడి వెదకనవసరం లేదు. మీ అంతరాత్మ మీకు అన్ని సూచనల్నిస్తుంది. మీ అంతరాత్మ ఇచ్చే సూచనలను స్వీకరించడంలో ప్రస్తుతం మీరు విఫలమవుతున్నారు.**

ఏమి చెయ్యాలి ? ఏ పనికి ఉపక్రమించాలి? ఆ పని ముందుకు సాగడానికి మార్గాలేమిటి? ఇలా రకరకాల ప్రశ్నలు మీ మదిని తొలిచేస్తుంటాయి. కొద్ది సేపు కళ్ళు మూసుకుని శ్వాసను గమనిస్తుండండి. అపుడు మీరు అంతర్ముఖులవుతారు. అంతరాత్మ నుండి కొన్ని అభిప్రాయాలు (ideas), కొన్ని రూపాలు (images) ఫ్లాష్ (flash)లాగ మీకు స్ఫురిస్తాయి. వాటిల్లో మీకు కావల్సిన సందేశం (message) ఇమిడివుంటుంది. అంతర్వాణి నుండి సందేశాలు రాబట్టడంలో గల ప్రాక్టికల్ మెథడ్స్ (practical methods) గురించి తర్వాత పేజీలలో చెప్పడం జరుగుతుంది. బాహ్య ప్రపంచం నుండి వచ్చే గైడెన్స్ అంతా పరిమిత జ్ఞానానికి లోబడి వుంటుంది. దానివల్ల మీకు ఒరిగేదేమీ వుండదు. అంతర్ ప్రపంచం మీద ఆధారపడడం నేర్చుకోండి. బాహ్య ప్రపంచం (outer world),

మరి కాన్షియస్ మైండ్‌లోని 'అహం' మిమ్మల్ని తప్పుదారి పట్టించవచ్చు;మోసం చెయ్యవచ్చు. **కాని మీ అంతర్ ప్రపంచం మిమ్మల్ని మోసం చెయ్యదు. అది ఎల్లవేళలా మీకు ముందు దారి చూపిస్తుంది.**

మీ ఆలోచనలకు ఎంత శక్తి వుంటుందంటే అది అనూహ్యం! భావోద్వేగంతో, ఫీలింగ్‌తో ఒక ఆలోచనను మీ మైండ్ నుండి విడుదల చేస్తే అది చంద్రమండలానికి రాకెట్ (rocket)ను తీసుకెళ్ళేంత శక్తి కలిగి వుంటుంది. మీ శాస్త్రవేత్తలు గాని, మీ శాస్త్ర పరికరాలు గాని ఆలోచనాతరంగాలను పసిగట్టగలిగే స్థితిని కలిగి లేరు. బలమైన ఆలోచనా తరంగాలు ఉక్కు (steel) కంటే ఎంతో సాంద్రతను కలిగి వుంటాయి. నీటిని వివిధ ఆకారాలలో మలిచినంత తేలికగా ఆలోచనా తరంగాలను మలచవచ్చు. ఆలోచనలకు ఏ యానకం (medium) అవసరం లేదు. ఏ పదార్థంలోనైనా చొచ్చుకుపోగలవు; పదార్థ స్వభావాన్ని రసాయనిక చర్యలు చెందించి మార్చగలవు. ఆలోచనలకు కాలం, దూరం అనే పరిమితులు లేవు.

ఆలోచనలు టెలీపతి ద్వారా సంగ్రహించబడుతున్నాయి. ఈ సృష్టిలో అన్ని ఆత్మ శకలాలూ ఆలోచనలను పసిగట్టగలుగుతాయి. మీ టేబిల్ మీద పుస్తకం కూడ మీ ఆలోచనలను పసిగడుతుంది. అది పసిగట్టే విధానం వేరేగా వుంటుంది. మీ ఆలోచనల విద్యుదయస్కాంత శక్తి ఆ పుస్తకాన్ని స్పృశిస్తుంది. ఈ సృష్టిలో నిర్జీవమైనదేదీ లేదు. అన్నింటిలోనూ చైతన్య పదార్థం జీవం పోసుకుంది. ఒక రాయిని తీసుకోండి. దానిలో నిరంతరం పరమాణువులు (atoms), పరమాణువులోని ఎలక్ట్రాను (electron), ప్రొటాను (proton) ఇంకా చాల సూక్ష్మకణాలు నిరంతరము శక్తితో ప్రకంపిస్తున్నాయి. రాయి చైతన్య పదార్థంను కలిగి వుంది. వాటి చైతన్యశక్తి స్థాయిలలో (consciousness levels) తేడా వుంటుంది. ఆ స్థాయి నుండి ముందుకు పరిణామం చెందుతుంటుంది. ఒక్కొక్కలోకానికి ఒక్కొక్క చైతన్యశక్తి స్థాయి వుంటుంది. ఆ శక్తి స్థాయి కనుగుణంగా ఆ లోకంలో గల పదార్థ స్వభావం, ఖనిజాలు వుంటాయి. అక్కడ జీవం పోసుకునే జీవరాశులన్నీ ఆ శక్తి స్థాయి కనుగుణంగా భౌతిక రూపాలను (physical forms) తీసుకుంటాయి. ఆ లోకం + దానిపై గల జీవరాశులు ఒకే చైతన్యశక్తి స్థాయిలో వుండి, పరిణామం + వ్యాకోచం ముందుకు కొనసాగుతుంది.

కంప్యూటర్ సిస్టమ్ (computer system)లో డేటా (data)ను నిక్షిప్త పరచినట్లుగా, అన్ని లోకాల డేటా (data) మీ అంతర్ ప్రపంచంలో పొందుపర్చబడి

వుంది. దేవుడు లేదా అనంత శక్తి (God or All That Is) మీలో వుండి చైతన్య పరిణామం చెందుతూంది. సృష్టిలో అన్నింటిలోనూ వున్నది ఆ అనంత చైతన్య శక్తే! ఆలోచనా తరంగాలన్నీ మీ మైండ్ నుండి వెలువడుతున్నప్పటికీ అవన్నీ భూమి మీదే వాస్తవ రూపం పొందడం లేదు. వాటి శక్తి తీవ్రంగా, బలంగా వుంటే వెంటనే భౌతిక పదార్థంగా, భౌతిక సంఘటనగా భూమి మీదే వాస్తవ రూపం పొందుతున్నాయి. బలహీన ఆలోచనా తరంగాలు వాటి శక్తి, ఫ్రీక్వెన్సీకి తగిన తలం లేదా లోకంలోనికి (plane or world) ప్రయాణించి అక్కడ వాస్తవ రూపం పొందుతున్నాయి. మీ ఆలోచనా తరంగాలు ఇంకొక లోకంలో వస్తురూపం (form of a body) పొందవచ్చు. ఈ ఆలోచనా తరంగాలు ఆ లోకానికి సంబంధించిన శక్తి స్థాయి (energy level)ననుసరించి వస్తురూపం పొందుతుంది.

భూమి మీద పదార్థస్వభావం, ఇంకో లోకం మీద పదార్థ స్వభావం వేరువేరుగా వుంటాయి. మీ భూమి మీద జీవరాశులలోని జీవ రసాయనిక పదార్థం ఒక శక్తి స్థాయిలో (energy level) వుంటే, ఇంకొక లోకంలో జీవరాశుల దేహాలు ఇంకొక శక్తి స్థాయి గల జీవరసాయనిక పదార్థంను కలిగి వుంటాయి. ఇక్కడ ఇనుముతో (iron) యంత్రపరికరాలు తయారు చేస్తారు. ఇంకో లోకంలో ఇనుము స్థానంలో ఇతర లోహం (metal) వాడుకలో వుంటుంది. ఒక లోకంలోని లోహాలు, ఇతర లోకాలలోని లోహాలకు సారూప్యం (similarity) వుండదు.

సాధనను (practice) పెంచడం ద్వారా మీ దేహంలోని అంతర్భాగాలను (inner organs of body), మీ అంతర్ ప్రపంచాన్ని, మీ మైండ్‌ను, మీ మైండ్ నుండి వెలువడుతున్న ఆలోచనా తరంగాలను మీరు చూడగలరు. మీరు అంతర్ సాధనను ఇతోధికంగా పెంచవలసివుంది. చెట్టులోని ఫలాలు, పుష్పాలను చూస్తున్నంత స్పష్టంగా ఆలోచనా తరంగాలను మీరు చూడవచ్చు. మీ ఆలోచనాతరంగాలను ఒక స్థిరమైన వస్తువును (a body at rest) చూసినట్లుగా మీ అంతరేంద్రియాలతో చూడవచ్చు. మీ ఫీలింగ్స్‌కు కదిలిక (mobility) వుంటుంది. నీటి ప్రవాహం, వాయుప్రవాహం, విద్యుత్ ప్రవాహం లాగ ఫీలింగ్స్ యొక్క మొబిలిటీ (mobility)ని మీరు అంతరేంద్రియాల ద్వారా గమనించ వచ్చు. ఫీలింగ్స్‌ను వాటి రంగులతో సహా చూడవచ్చు. ఫీలింగ్స్ మారే కొద్దీ వాటి రంగులు కూడ మారుతాయి.

ఇక్కడ ఒక అభ్యాసం (exercise) సాధన చెయ్యండి.

1. ఈ భౌతిక ప్రపంచంలో కాని, ఆధ్యాత్మిక ప్రపంచంలో కాని మీరు ఏది సాధించదలుచుకున్నారో స్పష్టంగా (clearly) మీ కాన్షియస్ మైండ్ లెవెల్‌లో (at the level of conscious mind)ఒక లక్ష్యాన్ని (goal) నిర్ణయించుకోండి.
2. మీ మైండ్‌లో ఆ లక్ష్యం గురించిన బ్లూ ప్రింట్‌ను (blue print) ఏర్పరుచుకోండి.
3. మీ ఊహాశక్తితో (imagination) మీ అంతర్ ప్రపంచంలో కలలు (dreams) కనండి. ఆ లక్ష్యం నెరవేరినట్లు, మీ జీవితంలో అనుభవం పొందినట్లు, దాని ద్వారా మీకు కలిగే ఫీలింగ్స్ (feelings), ఎమోషన్స్ (emotions) అన్నింటినీ అనేక విధాలుగా ఊహించుకోండి.
4. పదిహేను రోజులకొకసారి, లేదా వారానికి ఒకసారి లేదా రోజులో ఒకసారి ఒక పది నిముషాలు కేటాయించండి. ఆ లక్ష్యం నెరవేర్చి మీ జీవితానుభవాలలో వున్నట్లు ఊహించండి. మీకు ఇష్టమొచ్చిన రీతిలో ఊహించుకోండి.
5. మీ ఊహాశక్తి (imagination), ఆలోచనల శక్తి తీవ్రత (energy intensity) ఎంత ఎక్కువగా వుంటే అంత త్వరితంగా (speedily) ఆ లక్ష్యం భౌతిక వాస్తవాన్ని పొందుతుంది.
6. ఎలా నెరవేరుతుంది? దాని మార్గాలేమిటి? దాని డైనమిక్స్ (dynamics) ఎలా వుంటాయి? అనేవి మీరు పట్టించుకోకండి. మీకు తెలిసిన పరిజ్ఞానంతో విశ్లేషణ (analysis), తర్కంతో (logic) అది నెరవేరుతుందా? లేదా? అని అభిప్రాయం ఏర్పరుచుకోకండి.
7. మీరు అంతర్ ప్రపంచాన్ని, దాని అనంతమైన శక్తిని నమ్మండి. మీ ఇంటెలక్ట్ (intellect)తో ఎంత విశ్లేషించినా అంతర్ ప్రపంచం యొక్క నియమాలు మీకు తెలియవు. మీరు నిర్దేశించుకున్న లక్ష్యం అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోనికి భౌతిక రూపాంతరం (materialization) చెంది తీరుతుంది.
8. అది నెరవేరుతుందా? లేదా? అని ఆతృతతో (anxiety) ఎదురు చూడడం మానేసి నిశ్చింతగా వుండండి. రావాల్సిందంతా అంతర్ ప్రపంచం నుండి వచ్చే తీరుతుంది.

ప్రస్తుతానికి ఇది ప్రాక్టీసు (Practice) చెయ్యండి. ముందు పేజీలలో ఇంకా తెలియజెయ్యబడుతుంది.

* * *

ఆలోచనా తరంగాలు విద్యుదయస్కాంత శక్తిని కలిగి వున్నాయి. అంతర్ ప్రపంచం నుండి వెలువడిన ఆలోచనా తరంగాలు రూపాంతరం చెంది పదార్థంగా మారుతున్నాయి. ఆలోచనా తరంగాల శక్తి స్థాయిని (energy level) బట్టి పదార్థ స్వభావం కూడ మారుతుంటుంది. భూభౌతిక పదార్థం ఒక రకంగాను, మరో లోకంలో మరో రకంగాను పదార్థం యొక్క స్వభావం (nature of matter) మారుతుంటుంది. భూమి మీద వున్న ఖనిజ ధాతువులు మాదిరిగా మరోలోకంలో ఉండవు. భౌతిక పదార్థ స్వరూపం, స్వభావం వాటి తీరుతెన్నులు వాటి ధర్మాలు, అవి కలిగివున్న శక్తి (energy) ఆ లోకాలలో వున్న శక్తి స్థాయి (energy level) ఆధారంగా వుంటాయి. ఆలోచనలు పదార్థాన్ని సృష్టించగలవు; పదార్థాన్ని ప్రభావితం చేసి దాని భౌతిక రసాయనిక ధర్మాలను మార్చగలవు. ఉదాహరణకు ఒక వ్యక్తి ప్రాణాంతకమైన క్యాన్సరు వ్యాధితో (cancer) బాధపడుతున్నాడనుకుందాం. ఎటువంటి పరిస్థితుల్లోనూ అతనికి ఆ వ్యాధి నయం కాదని తేల్చిచెప్పారు డాక్టర్లు. ఆ వ్యాధి నయమవుతుందని అతడు ప్రగాఢంగా విశ్వసిస్తాడు. వ్యాధి నయమైనట్లు, ఆరోగ్యంగా వున్నట్లు బలంగా సంకల్పించుకుని ఊహాశక్తితో కలలుగంటాడు. తత్ఫలితంగా అతని మైండ్ నుండి వెలువడిన ఆలోచనా తరంగాలు అతని దేహంలో విద్యుదయస్కాంత శక్తి చర్య జరిపి జీవ రసాయనిక చర్యలను కలుగ చేస్తాయి; క్రొత్త క్రొత్త ఎంజైములు దేహంలో తయారయ్యి ఆ వ్యాధి నయమవ్వడం జరుగుతుంది. దేహంలో గల ఏ వ్యాధినైనా నయం చెయ్యగల అపారమైన శక్తి మీ అంతర్ ప్రపంచంలో వుంది; మీ మైండ్‌లో వుంది. వ్యాధిని నయం చేసుకోవడంలో దేహం విడుదల చేసే జీవరసాయనాలు వాటి ప్రక్రియలు శాస్త్రవేత్తలకు ఏ మాత్రం అర్థం కావు. ఎటువంటి వ్యాధినైనా దేహం తనంతటతాను నయం చేసుకుంటుంది.

భూమి మీద దేహానికి సంక్రమించే ఎటువంటి వ్యాధినైనా నయం చేసుకునే శక్తి స్వతహాగా మీ దేహానికి వుంది. క్షణకాలంలో ఎన్నో రసాయనాలను, ఎంజైములను, హార్మోనులను దేహం విడుదల చేసుకుంటుంది. వాటిద్వారా మీ దేహం వ్యాధిని నయం చేసుకుంటుంది. దేహం విడుదల చేసుకునే రసాయనాలు, ఎంజైములు, హార్మోనుల గురించి మీ వైద్య శాస్త్రజ్ఞులకు చాల పరిమితమైన జ్ఞానం మాత్రమే వుంది. **దేహాన్ని ఒట్టి మాంస పిండంగా కాకుండా దేహం . ఆత్మ . చైతన్యశక్తిగా గుర్తించి చికిత్సా**

విధానాన్ని మీ వైద్యులు తప్పనిసరిగా అవలంబించవలసి వుంది. అపుడే మెరుగైన వైద్య శాస్త్రము మనుషులకు అందుబాటులోనికి వస్తుంది. ప్రస్తుతమున్న పాశ్చాత్య వైద్య విధానం మానవచైతన్య వికాసాన్ని హీనపరచేదిగా వుంది.

* * *

ఇంటెలిజెన్స్ (intelligence) అనేది కాన్షియస్ మైండ్ పరిధిలో వుంటుంది. నిర్ణయాలు (decisions) తీసుకోవడం, తర్కం (logic), విశ్లేషణ (analysis), రీజనింగ్ (reasoning). ఇంటెలిజెన్స్ ద్వారా జరుగుతాయి. 'అహం' ఇంటెలిజెన్స్‌ను ప్రభావితం చేస్తుంటుంది. ఎక్కువ తర్కం, విశ్లేషణ చేసే వ్యక్తిని తెలివైన వాడిగా (intellectual) మీరు గుర్తిస్తున్నారు. ఎక్కువ జ్ఞాపకశక్తి (memory), ఎక్కువ వాక్చాతుర్యం గల వ్యక్తిని తెలివైనవాడిగా మీరు గుర్తిస్తున్నారు. మీరు ఏర్పరుచుకున్న ఈ ప్రామాణికాలు (measurements) సరియైనవి కావు. **ఇంటెలిజెన్స్ పరిధిని క్రొవ్వొత్తి వెలుగుతో పోల్చితే, అంతర్ ప్రపంచంలోని మైండ్‌ను సూర్యుడి వెలుగుతో పోల్చవచ్చును. ఇంటెలిజెన్స్ చాల పరిమితమైనది. అంతర్ ప్రపంచంలోని మైండ్ అపరిమితమైనది.**

సంతోషం, దుఃఖం, కష్టం, సుఖం, బాధ, పగ, ప్రతీకారం, అసూయ, ద్వేషం ఇంకా అనేక భావనలు (emotions), స్పందనలు (feelings) అన్నీ కాన్షియస్ మైండ్ నుండి ఉద్భవిస్తున్నాయి. అంతర్ ప్రపంచంలో అవేవీ వుండవు. అంతర్ ప్రపంచంలో ఉన్నదంతా ఒక్కటే– అది బ్రహ్మానందం (bliss)! అంతర్ ప్రపంచంలో రాగద్వేషాలు వుండవు; కష్టసుఖాలు వుండవు; సుఖదుఃఖాలు వుండవు; జయాపజయాలు వుండవు. ఈ ఎమోషన్స్, ఫీలింగ్స్ అంతా మీ పరిమిత జ్ఞానం వల్ల కలుగుతున్నాయి. పర్వతారోహణం ఒకరికి దుఃఖభరితంగా వుంటుంది. మరొకరికి సవాలుగా (challenge) ఉంటుంది. అంతర్ ప్రపంచంలోగల మైండ్‌లో జడ్జిమెంట్ వుండదు. ఒక వ్యక్తి దుఃఖిస్తున్నాడంటే అతని పరిమిత జ్ఞానం వల్ల ఆ దుఃఖాన్ని అనుభవిస్తున్నాడు. పాజిటివ్ (positive), నెగెటివ్ (negative) ఆలోచనా ధోరణి (thinking) అనేది మీరు ఏర్పరచుకునే అభిప్రాయాలు. మైండ్‌లో పాజిటివ్, నెగిటివ్ అనేవి వుండవు. విజయం (sucess), ఓటమి (defeat) అనేవి బాహ్య ప్రపంచంలో మీరు ఏర్పరుచుకున్న ప్రామాణికాలు. అంతర్ ప్రపంచంలో అనుభవాలకు సంబంధించిన జ్ఞానం మాత్రమే వుంటుంది. ప్రకృతిలో అన్ని జీవరాశులూ సమానమే. ప్రకృతిపరంగా ప్రతిమనిషీ ఒకే విధమైన ప్రాముఖ్యతను కలిగి వున్నాడు. ఎక్కువ, తక్కువ అనే అంతరాలు (variations) వుండవు. తెలివైన వాళ్ళు (intellectuals), బుద్ధి మాంద్యం గలవాళ్ళు (mentally

retarded persons), పిచ్చివాళ్ళు (mad persons) అని మానవజాతిని మీకున్న పరిమిత జ్ఞానంతో విభజించుకున్నారు. ఆ విభజన అనేది ప్రకృతి పరంగా లేదు. అందరిలోనూ వున్న అంతర్ ప్రపంచం ఒక్కటే. అందరిలోవున్న మైండ్ ఒకటే. చైతన్య పరిణామ వికాసంలో ఒకరు ముందడుగు, ఇంకొకరు వెనుకడుగులో వుంటారు. అంతేకాని పిచ్చివాడు తక్కువ కాదు. తెలివైనవాడు ఎక్కువ కాదు. తెలివైనవాడి ఇంటెలిజెన్స్ (intelligence) అంతా కూడ క్రొవ్వొత్తి వెలుగంత మాత్రమే! అతని అంతర్ ప్రపంచంలోని మైండ్ సూర్యుడి వెలుగు అంత వుంది. పిచ్చివాడి అంతర్ ప్రపంచంలో కూడ సూర్యుడి వెలుగు అంత వుంది. భూమి + జీవరాశుల చైతన్య పరిణామంలో ప్రతి మనిషి, ప్రతి జీవరాశి కీలక పాత్ర వహిస్తుంది. ప్రతి ఒక్కరూ చైతన్య పరిణామంలో భాగంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని భూమి మీద ప్రవేశించడం జరిగింది.

సముద్ర ప్రయాణం చెయ్యడానికి ఒక నావను ఎలా ఎంచుకున్నారో, భూమి మీద చైతన్య పరిణామం చెందడానికి దేహం అనే నావను భూమి మీద తీసుకోవడం జరిగింది. మానవ దేహం అద్భుతమైన జెనెటిక్ నిర్మాణం కలిగి వుంది. దేహంలోని ప్రతి జీవకణమూ అపారమైన జ్ఞానాన్ని కలిగి వుంది. మానవ దేహమే ఒక అద్భుతం! పిచ్చివాళ్ళు, బుద్ధి మాంద్యం గల వాళ్ళు ప్రకృతిపరంగా అద్భుతమైన వాళ్ళుగా పరిగణించబడతారు. వాళ్ళవల్ల ప్రకృతికి లోపం ఏర్పడం, చైతన్య పరిణామం కుంటుబడటం అనేవి జరగదు. కొన్ని ప్రత్యేక లక్ష్యాలతో చైతన్య పరిణామం చెందడం కోసం వాళ్ళు పిచ్చి వాళ్ళుగా జన్మతీసుకోవడం జరుగుతుంది. భూమి మీద లైఫ్ క్వాలిటీని (quality of life) తెలివైన వాళ్ళు మాత్రమే పెంచడం లేదు. పిచ్చి వాళ్ళు కూడ అందులో పాలుపంచుకుంటున్నారు. ఈ విషయం మీ రీజనింగ్ మైండ్‌కు (reasoning mind) అందకపోవచ్చు. భూమికి ఉత్తర, దక్షిణ ధృవాలు రెండూ వున్నట్లే, మానవ చైతన్య వికాసానికి కూడ తెలివైన వాళ్ళు, పిచ్చివాళ్ళ అవసరముంది. సూర్యుని వెలుగులాంటి మనోశక్తిలో ఆ అంతరాలు లేవు. క్రొవ్వొత్తి వెలుగులాంటి ఇంటెలిజెన్స్ (intelligence) వల్ల కలిగిన రీజనింగ్ మైండ్ (reasoning mind)తో మీరు అటువంటి జడ్జిమెంట్స్ (judgements) ఏర్పరుచుకున్నారు.

రీజనింగ్ మైండ్, తర్కం, విశ్లేషణలాంటివి వుండవు కాబట్టి ఒక రకంగా చెప్పాలంటే పిచ్చివాళ్ళే చాల చక్కగా చైతన్య వికాసం చెందుతున్నారు. తెలివైన వాళ్ళుగా భావించుకునే మీరు మీ రీజనింగ్ మైండ్ ద్వారా ఎన్నో పరిమితుల్లో బిగుసుకుపోయి చైతన్య వికాసానికి సరియైన రీతిలో స్పందించడం లేదు. మీ విశ్లేషణ, తర్కంవల్ల జీవితపు

విలువలను పూర్తిగా ఆస్వాదించలేకపోతున్నారు. భూమి మీద ప్రతి జీవితమూ చాల పవిత్రమైనదే! ప్రతి జీవీ పరమ పవిత్రమైనదే! అన్ని జీవరాశులూ పరమ పవిత్రమైనవని మీరు గుర్తించాలి. సైన్సు, టెక్నాలజీని అభివృద్ధి చేసిన వాళ్ళను తెలివైన వాళ్ళుగాను, మిగతా వాళ్ళను తక్కువగాను అంచనా వేసి చూడటం మీ ఇంటెలిజెన్స్ ద్వారా జరుగుతుంది. ఆత్మశక్తి పరిణామం + చైతన్యశక్తి పరిణామంలో అటువంటి ప్రామాణికాలు వుండవు. ప్రామాణికాలు కలిగి వుండడమంటే మనిషికి గల అపారమైన అంతర్‌శక్తిని అగౌరవపర్చడమే.

మానవ సమాజంలో మనుషులను రకరకాల వర్గాలుగా విభజించుకుని మిమ్ముల్ని మీరు హీనపర్చుకుంటున్నారు. యూదులను తక్కువ వాళ్ళుగా చూడడం జరుగుతుంది. మరి కొన్ని ప్రాంతాలలోని మానవజాతిని తక్కువ వాళ్ళుగా చూడడం జరుగుతూంది. భూమండలంలోని మానవజాతి అందరిలోనూ ఒకే చైతన్యశక్తి ఆవరించి వున్నపుడు, మనుషులందరూ చైతన్యశక్తి ద్వారా అనుసంధానం కాబడి వున్నపుడు – ఒకరు తక్కువ, మరొకరు ఎక్కువ అని జడ్జిమెంట్స్ (judgements) ఏర్పరుచుకోవడం అర్థరహితం ! ప్రతి మనిషిని, ప్రతి జీవరాశిని అద్భుత చైతన్యశక్తిగా, ఒక అద్భుతమైన ఆత్మగా గుర్తించండి! ఒక జాతిని హీనపర్చడం ద్వారా మీరు ఆధ్యాత్మిక ఉన్నతిని పొందలేరు. భూమి మీద మానవులంతా ఒకే జెనెటిక్ నిర్మాణం (genetic structure), ఒకే చైతన్యశక్తి (consciousness) కలిగి వున్నారు. కొందరు మనుషుల జెనెటిక్ నిర్మాణం ఉన్నతంగాను, మరికొందరి జెనెటిక్ నిర్మాణం హీనంగాను ఉండడం భూమి మీద లేదు. మానవ జాతి అంతా ఒకే సమిష్టి లక్ష్యంతో చైతన్య పరిణామం చెందుతున్నది.

ఒక జాతిని హింసించడం ద్వారా మీ లైఫ్ క్వాలిటీని (quality of life) ఉన్నత పరుచుకోవడం అసంభవం! జీవజాతుల మధ్య పరస్పర సహకారంతో చైతన్య పరిణామ వ్యాకోచం జరుగుతూంది. జీవజాతుల మధ్య వైరం, పోటీ వాతావరణం అనేవి లేవు. అలా వుండి వుంటే భూమి మీదగాని, మరోలోకంలో గాని జీవజాతుల సృష్టి జరిగేది కాదు. పిల్లి–ఎలుక, పాము–కప్ప, పులి–జింక ఇంకా కొన్ని జీవజాతుల మధ్య వైరము వుందని మీరు భావించడం జరుగుతూంది. కాని వాస్తవానికి అది వైరం కాదు. చైతన్య పరిణామంలో అదొక ప్రక్రియ (process) మాత్రమే. హింసా ప్రవృత్తి ఆధ్యాత్మిక పురోగతికి ప్రతిబంధకంగా వుంది. మానవజాతిలో ప్రతి ఒక్కరిని రంగునుబట్టి, ప్రాంతం బట్టి, మతం బట్టి గాక ఒక ఆత్మశక్తిగా గుర్తించడం నేర్చుకోండి. జంతువులను మీ వైద్య శాస్త్ర ప్రయోగాలకు ఉపయోగించడం ద్వారా మానవజాతి చైతన్య పరిణామాన్ని

హీనపర్చుకుంటున్నారు. హింస ద్వారా జీవితపు విలువలను హీనపర్చుకుంటున్నారు.

ఆత్మచైతన్య పరిణామానికి హింస గొడ్డలిపెట్టు.

మనుషులలో గొప్పజాతులు, తక్కువ జాతులు లేవు. వివిధ భౌతిక పరిస్థితులలోగల మానవజాతిని మీరు ఇంటెలిజెన్స్ ద్వారా వర్గీకరణ చేసుకుని కొన్ని అహేతుక అభిప్రాయాలు కలిగి వున్నారు. మానవజాతి + జీవజాతుల అంతర్ ప్రపంచంలో ఒకే విధమైన చైతన్యశక్తి వుండి భూభౌతిక వాతావరణాన్ని సృష్టించడం జరుగుతూంది. అన్నింటిలోనూ ఒకే రకమైన జీవరసాయనిక పదార్థం నిండివుంది. భౌతిక ప్రపంచపరంగా వేరే వేరే పరిస్థితులలో మానవులు జన్మతీసుకున్నప్పటికీ, ఆధ్యాత్మిక ప్రపంచ పరంగా అందరికీ ఒక్కటే లక్ష్యం వుంటుంది. మానవ జీవితాలలో బాధాకరం (suffering) అనేది వుండదు. చైతన్య పరిణామంలో కొన్ని ప్రత్యేక సవాళ్ళతో కూడిన లక్ష్యం కోసం బాధాకరమైన జీవితాన్ని ఎన్నుకుని మానవజన్మ తీసుకోవడం జరుగుతుంది. ఒక నాటకంలో (drama) వివిధ పాత్రలు తీసుకుని నటిస్తున్న వ్యక్తులకు అది నాటకంగానే తోస్తుంది. దొంగ పాత్రలో వున్న వ్యక్తి, పోలీసు పాత్రలో వున్న వ్యక్తి దగ్గర దెబ్బలు తింటున్నట్లు నటిస్తాడు. భౌతిక ప్రపంచంలో ఈ బాధాకరం (suffering)అనేది ఆత్మపరంగా చూసినపుడు ఒక డ్రామాలాగ వుంటుంది. ఆత్మకు అది సవాలుగా వుంటుంది. ఆ సవాలును అధిగమించడంలో కొన్ని పాఠాలు (lessons) నేర్చుకుంటుంది. జీవితంలో తారసపడే ప్రతి అనుభవమూ మనోశక్తిని వ్యాకోచింప జేస్తుంది. కార్ రేస్ డ్రైవర్లు (car - race drivers), పర్వతారోహకులు (mountain climbers), ఆటగాళ్ళు (sports men) ఎంచుకునేవి వాళ్ళకు సవాళ్ళుగాను, ఇతరులకవి బాధాకరంగాను వుంటాయి.

భూమి పైన ఎదురయ్యే ప్రతి జీవితానుభవమూ ఆత్మపరంగా చూసినపుడు ఒక సవాలుగా వుంటుంది. కాన్షియస్ మైండ్ పరంగా తరచి చూస్తే ఒక అనుభవం ఆహ్లాదకరంగా, ఇంకొక అనుభవం బాధాకరంగా తోచవచ్చు. అంగవైకల్యంతో జన్మించే ఒక వ్యక్తి కూడ చైతన్యశక్తిని ఒక దిశలో కేంద్రీకరింపజేసి కొన్ని అనుభవాలు, పాఠాలు నేర్చుకునేందుకు అలాంటి జన్మను ఎంచుకోవడం జరుగుతుంది. అతడు ఆ జన్మను ఎంచుకునే ముందర జన్మనిచ్చే తల్లిదండ్రులు అతని జీవితంలో తారసపడే వ్యక్తుల అనుమతి కూడ వుంటుంది. ఆత్మానుభవాలు, చైతన్య పరిణామం చెందడం కోసం అంగవైకల్యం, బాధాకరమైన జీవితాలను ఎన్నుకుని భూమి మీద పాఠాలు నేర్చుకోవాలని

తప్పనిసరి రూలేమీ లేదు. మీ మనోశక్తితో ఎలా సంకల్పిస్తే అలా భూమిపై జీవితాన్ని ఎంచుకునే స్వేచ్ఛను కలిగి వున్నారు. **ఈ విశ్వంలో ఏ శక్తీ మిమ్మల్ని నియంత్రించడంగాని, శాసించడంగాని చెయ్యదు. అంతా మీ ఇష్టానుసారంగానే జరుగుతుంటుంది. జీవితంలో ఎదురయ్యే ప్రతి అనుభవమూ, ప్రతి జన్మా మీ మనోశక్తిని వ్యాకోచింపజేస్తూ వుంటుంది.** చైతన్య పరిణామంలో ముందడుగు వేస్తూనే వుంటారు. మానవ డ్రామాలో (human drama)ఎదురయ్యే ప్రతి అనుభవమూ మనోచైతన్య వికాసాన్ని పెంచుతుంది. అంతేగాని ఈ విశ్వంలో ఏ దేవుడూ మిమ్మల్ని శిక్షించడం లేదు. మరమనిషిలాగ (robot) మీరు జీవితానుభవాలను ఎదుర్కోవడం లేదు. మరమనిషి కూడ సూచనల ప్రకారం పనులను చెయ్యగలుగుతుంది, కాని దానికి చైతన్యశక్తి పరంగా మార్పులుండవు. మనిషి ఎదుర్కొనే పనులలో చైతన్యశక్తిపరంగా మార్పులు ఏర్పడి పరిణామానికి దోహదపడతాయి. మనిషికి తారసపడే ప్రతి అనుభవమూ చైతన్యశక్తి పరంగా ఒక పాఠం నేర్చుకోవడం జరుగుతుంది. అయితే ఏయే అనుభవాలు కావాలో, ఎటువంటి సవాళ్ళను ఎంచుకోవాలో నిర్ణయించుకునే శక్తి మీ మైండ్‌కు వుంది.

ఈ విశ్వంలో ప్రతి వస్తువూ చైతన్యవంతమైనదే. ప్రతి దానికీ అంతర్‌శక్తి, అంతర్ ప్రపంచం వున్నాయి. విత్తనమును (seed) తీసుకోండి. అది మహావృక్షం కాబోతున్నట్లు కలలుకంటుంది. మీ దేహంలోని జీవకణమూ దాని లక్ష్యాల గురించి కలలుగంటుంది. తల్లి గర్భంలోని పిండం కూడ తన పరిణామాన్ని గురించి కలలుగంటుంది. భూమి తన చైతన్య పరిణామం గురించి కలలు గంటుంది. ఈ విశ్వంలో ఏదీ నిర్జీవంగా లేదు. మీ భౌతిక శాస్త్రజ్ఞులకు (physicists) – పరమాణువులో (atom) కదలికలోవున్న ఎలక్ట్రాను (electron), ఇతర సూక్ష్మ కణాల గురించి తెలుసు కాని పరమాణువులోని చైతన్యశక్తి కదలికల గురించి ఏ మాత్రం వాళ్ళకు అవగాహన లేదు. దాన్ని శోధించడానికి వాళ్ళు అంతర్ మనోశక్తిని వినియోగించాల్సి వుంది.

జీవితం పట్ల గౌరవం, లక్ష్యం, పరమార్థం వున్నప్పుడు ప్రతిమనిషీ ఆత్మ చైతన్య పరిణామాన్ని అతివేగంగా అభివృద్ధిపరుచుకుంటాడు. మానవులందరూ అటువంటి ఆశాకరధోరణి కలిగివుంటే ఆ నాగరికత కాలంలోని మానవజాతి + జీవజాతులు + భూమి చాల అద్భుతంగా – ఆధ్యాత్మికంగా, ప్రాపంచికంగా, మనోశక్తి పరంగా – చైతన్య పరిణామం చెందుతాయి. జీవితం అర్థవంతంగా తోచనపుడు ఏ జీవరాశిగాని, ఏ మనిషిగాని భూమి మీద మరి జీవించి వుండలేరు. వెంటనే భూమి మీద నుండి

నిష్క్రమించడం జరుగుతుంది. అంగ వైకల్యం గల వాళ్ళు, తెలివైన వాళ్ళు, బుద్ధి మాంద్యం గలవాళ్ళు, పిచ్చివాళ్ళు అందరూ కూడ చైతన్య పరిణామంలో సమతౌల్యంను (balance) కలుగజేస్తున్నారు. అందరిలోని మనోశక్తి (mind power) చైతన్యశక్తి ద్వారా అనుసంధానింపబడి వుంది. మానవజాతి + జీవజాతులు కొన్ని విలువలు ఆధారంగా ఒకరికొకరు సహకరించుకుంటూ, టెలీపతి ద్వారా జ్ఞానాన్ని విస్తరింపజేసుకుంటూ వస్తున్నాయి. జీవిత పరమార్థాన్ని గుర్తించడంలో మీ సైన్సు పరిజ్ఞానం ఎంతో లోపభూయిష్టంగా అసమగ్రంగా వుంది.

జీవజాతుల చైతన్య వికాసం అంతా కూడ ఆధ్యాత్మికతను, మనోశక్తిని విస్తరింపజెయ్యడం కోసమే జరుగుతుంది. ప్రస్తుతం ఈ తరుణంలో మానవజాతి తన ఆధ్యాత్మిక శక్తిని, మనోశక్తిని విస్తరింపజేసుకుంటే మిగతా అన్ని జీవజాతుల ఆధ్యాత్మిక శక్తి + మనోశక్తిని పెంచడంలో ప్రముఖపాత్ర వహించినట్లవుతుంది. తాను పురోగతి పొందుతున్నాననే ఫీలింగ్ ప్రతి మనిషికీ, ప్రతి ప్రాణికీ అవసరం! లేకపోతే జీవితం అర్థాన్ని కోల్పోతుందన్న భావన ఏర్పడుతుంది. జీవితపరమార్థాన్ని విస్తరింపజేసుకోవడంలో ఇంటెలిజెన్స్ (intelligence)ఒక్కటే సరిపోదు. ఇంటెలిజెన్స్ + సహజావబోధన (intuition) + భావనలు (emotions) + ఊహాశక్తి (imagination) కలిసినపుడే జీవితానికి పరమార్థము (meaningful life) చేకూరుతుంది.

* * *

మనస్తత్వ శాస్త్రజ్ఞులు, శాస్త్రవేత్తలు, వైద్యులు ఎవ్వరూ కూడ మైండ్ పవర్‌ను అభివృద్ధి చెయ్యడంలో సహాయం చెయ్యలేరు. మైండ్ పవర్ గురించి, అంతర్ ప్రపంచం గురించి వాళ్ళకు తెలిసిన సమాచారం (information), చాల స్వల్పం. అంతర్‌శక్తి వినియోగం పెరిగే కొలది మనోశక్తి కూడ వ్యాకోచం చెందుతుంది. మీ చైతన్యశక్తి స్థాయి (consciousness level) పెరిగే కొలదీ మీ మనోశక్తి విస్తరించుకుంటూ పోతుంది. మీ చైతన్యశక్తి పెరగాలి. అపుడే మీ తెలివి (intelligence) మరింత పదునుపెట్టబడుతుంది. ఇక్కడ మైండ్ పవర్‌ను అభివృద్ధి చెయ్యడమంటే – కాన్షియస్ మైండ్ పరిధిలోని తెలివిని (intelligence) వ్యాకోచం చెందించడమని మీ పరిభాషలో చెప్పడం జరిగింది. వాస్తవానికి మైండ్ పవర్ అనేది అంతర్ ప్రపంచంలోని అనంతమైన శక్తి. దాన్ని అభివృద్ధి చెయ్యడమనే ప్రశ్న ఇక్కడ లేదు. మైండ్ పవర్‌ను అభివృద్ధి చెయ్యడమంటే మీ అంతర్ మనోశక్తిని వినియోగంలోనికి తీసుకురావడం అనే విషయాన్ని

మీ పరిభాషలో చెప్పడం జరిగింది. ఈ విషయాన్ని మీరు జాగ్రత్తగా గమనించండి. అనంతమైన మైండ్ పవర్‌ను అభివృద్ధి చెయ్యడం అనే విషయం అర్థరహితం. ఆత్మానుభవాలు, చైతన్య వికాసంను విస్తరింపజేసే కొలదీ, మనోశక్తి వినియోగం కూడ పెరుగుతూ వస్తుందనే విషయం మీ మనస్తత్వ శాస్త్రజ్ఞులు తెలుసుకోవాలి. మైండ్ అనేది ఒక శక్తి యొక్క రూపాంతరం అని వాళ్ళకు తెలియాల్సివుంది.

అందరిలోవున్న మైండ్ పవర్ అపారమైనది. పిచ్చివాడు, బుద్ధిమాంద్యం గలవాడు. తెలివైన వాడు – అందరిలోనూ అనంతమైన మనోశక్తి వుంది. జీవజాతు లన్నింటిలో ఈ సృష్టిలో ప్రతి ప్రాణిలో కూడ అనంతమైన మనోశక్తి ఇమిడి వుంది. వాటి చైతన్యశక్తి స్థాయిల (consciousness levels) అనుసారంగా మనోశక్తి వినియోగం జరుగుతుంటుంది. తద్వారా మానసిక వికాసం పెరుగుతుంటుంది. అంతర్ మనోశక్తి వినియోగంలో ఒకరి నుండి మరొకరికి అంతరాలు (variations) వుండవచ్చు. కాన్షియస్ మైండ్ స్థాయిలో (at the level of conscious mind) కన్పించే ఈ అంతరాల ఆధారంగా ఒకతన్ని తెలివైన వాడుగాను, మరొకతన్ని బుద్ధిమాంద్యం గలవాడుగాను మీ జడ్జిమెంట్ (judgement) కనుగుణంగా గుర్తించడం జరుగుతూంది. విశ్వంలో అన్ని ఆత్మశకలాలనూ ఆత్మశక్తి నడిపిస్తుంది. బాహ్య ప్రపంచంలో పిచ్చివాడు ఏమీ చెయ్యలేక పోవచ్చు. కాని చైతన్య పరిణామక్రమంలో తన వంతు పాత్రను నిర్వర్తించుకుంటున్నాడు. భూమి మీద ప్రకృతిని సమతౌల్యం చెయ్యడానికి అందరూ అవసరమే! భూమి మీద మానవజాతి సంపూర్తిగా అనంతమైన మనోశక్తిని వినియోగించుకోవడం లేదు. బుద్ధుడు, జీసస్‌లాంటి అతికొద్దిమంది ఆత్మశక్తిని చక్కగా ఉపయోగించుకోవడం చేశారు.

జ్ఞాపకశక్తి (memory capacity) అనేది కూడ కాన్షియస్ మైండ్‌లో ఒక క్రియ (activity). మానవజాతిలో వాళ్ళ చైతన్యశక్తి స్థాయిల (consciousness levels) కనుగుణంగా ఒక్కొక్కరికి ఒక విధంగా జ్ఞాపకశక్తి వుంటుంది. చైతన్యశక్తి ఎక్కువగా వున్నపుడు జ్ఞాపకశక్తి, ఏకాగ్రతలు పెరగగలవు. జ్ఞాపకశక్తి పెరగాలని సంకల్పించడం ద్వారా మనోచైతన్యశక్తి అటువైపు కేంద్రీకరింపబడి జ్ఞాపకశక్తి పెరగడం సంభవిస్తుంది అంతేగాని జ్ఞాపకశక్తి ఒకరికి లేకపోవడం, ఇంకొకరు కలిగివుండడం అనేది జరగదు. ఈ విశ్వంలోని జ్ఞానాన్నంతా మైండ్ తనలో ఇముడ్చుకున్నపుడు జ్ఞాపకశక్తి లేకపోవడమనేది సమస్య కానేకాదు. విశ్వంలోని జ్ఞానాన్నంతా మీ మైండ్ ఇముడ్చుకుని వుంది. అంతర్ ప్రయాణం ద్వారా ఆ జ్ఞానభాండాగారాన్ని బాహ్య ప్రపంచం వినియోగంలోనికి

తీసుకురావచ్చు. మెదడు అనే సాధనం ద్వారా మైండ్ ఉన్నంత కాలమూ మెదడును ఒక సాధనంగా మైండ్ చేత వినియోగింపబడుతుంది. త్రిదిశా తలంలో (three dimensional plane) భౌతిక పదార్థాన్ని (physical matter), భౌతిక వాతావరణాన్ని, భౌతిక పరిస్థితులను (physical circumstances) సృష్టి చేయడానికి మెదడును ఒక సాధనంగా మైండ్ ఉపయోగించు కుంటుంది. ఈ దేహం ఏర్పడక ముందు మైండ్‌యొక్క వ్యాకోచం కొనసాగుతూ వస్తూంది. ఈ దేహాన్ని వదిలేసిన తర్వాత కూడ మైండ్ యొక్క వ్యాకోచం విస్తరిస్తూనే వుంటుంది.

శక్తిని (energy) ఏ విధంగా కావాలంటే అలా వినియోగించుకునే స్వేచ్ఛను (freedom) మీరు కలిగి వున్నారు. జ్ఞాపకశక్తి పెరగాలనే సంకల్పం కలిగినపుడు మీ అంతర్‌శక్తి అటువైపు ప్రవహించి జ్ఞాపకశక్తిని పెంచుతుంది. మీ వాస్తవాన్ని మీ ఇష్టమొచ్చిన రీతిలో సృష్టించుకోవచ్చు.

ఎక్కువగా తర్కించి, విశ్లేషణ చెయ్యగల వ్యక్తిని జీనియస్ (genius) అని భావిస్తుంటారు. ప్రతిదాన్ని క్షుణ్ణంగా విశ్లేషణ చెయ్యడం, ప్రతిదానికీ కారణాలు వెదకడం, తర్కం చెయ్యడం అనేవి పూర్తిగా జ్ఞానం లేనపుడు జరుగుతుంటుంది. అంతర్ ప్రపంచంపై విశ్వాసం లేనపుడు కూడ జరుగుతుంటుంది. పూర్తి జ్ఞానం వున్నపుడు రీజనింగ్ (reasoning), విశ్లేషణ, తర్కం వుండవు. భౌతిక వాస్తవాన్ని (physical reality) అర్థం చేసుకునే స్థాయికి భూమి మీద మానవజాతి యొక్క మనోశక్తి ఇంకా ఎదగలేదు. బుద్ధుడు, జీసస్‌లాంటి వారు కొద్ది మంది మాత్రమే ఆ స్థాయికి ఎదిగారు. అంతర్ ప్రపంచాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం, అంతర్వాణిని వినగలగడం, అంతర్ ప్రయాణం ద్వారా అంతర్‌శక్తిని బాహ్య ప్రపంచంలోనికి భౌతిక వాస్తవంగా (physical reality) మరల్చగలగడం తెలిసిన వ్యక్తిని జీనియస్ మైండ్ (genius mind – మేధావి) అని పిలవవచ్చు. మీ శాస్త్రవేత్తలు విశ్లేషణ (analysis) ద్వారా సైన్సును అభివృద్ధి చేసే విధానం చాల అసమగ్రమైన పద్ధతి. అంతర్వాణి ద్వారా సైన్సును అభివృద్ధి చేసే శాస్త్రవేత్తను జీనియస్ (genius)గా పరిగణించవచ్చు.

ప్రతి విషయానికి అంతర్ ప్రపంచం ద్వారా గైడెన్స్ (guidance) తీసుకోవడం మీరు అలవర్చుకుంటే ఆధ్యాత్మికంగా, ప్రాపంచికంగా ఎంతో పురోగతి సాధిస్తారు. బాహ్య ప్రపంచంలోని పరిస్థితులు మిమ్మల్ని మోసం చెయ్యవచ్చు; మీ తర్కం మిమ్మల్ని మోసం చెయ్యవచ్చు– కాని మీ అంతర్ ప్రపంచం మిమ్మల్ని సరియైన మార్గంలో నడిపిస్తుంది. అంతర్ ప్రపంచాన్ని, అంతర్ వాణిని విశ్వసించడం నేర్చుకోండి. అనంతమైన

అంతర్ ప్రపంచం నుండే మీ దేహాన్ని తీసుకున్నారు; మీ జీవితంలో భౌతిక పరిస్థితులను సృష్టించుకుంటున్నారు. మీ అంతర్ ప్రపంచం నుండే మీ వ్యక్తిత్వ వికాసం, చైతన్య వికాసం జరుగుతూంది; మీ అంతర్ ప్రపంచం నుండే మిమ్మల్ని మీరు ప్రతిక్షణమూ సృష్టించుకుంటున్నారు. మీ అంతరాత్మ మిమ్మల్ని ఎప్పటికీ మోసం చెయ్యడం జరగదు. విత్తనంలోని అంతర్‌శక్తి మహావృక్షంగా ఎదుగుదలకు మార్గదర్శిగా వున్నట్లే, మీ అంతర్‌శక్తి మీకు ఎల్లవేళలా మార్గదర్శిగా వుంటుంది. అంతర్ శక్తి తన పని తాను చేసుకుంటూ పోతుంది. మీ దగ్గర సరిపడా జ్ఞానం లేనపుడు, మీ కళ్ళముందర సమస్యకు పరిష్కారం లేనపుడు, మీ ఆత్మశక్తిపట్ల విశ్వాసం లేనపుడు, మీ కాన్షియస్ మైండ్ తర్కాన్ని (logic), రీజనింగ్‌ను (reasoning) ఆశ్రయించడం జరుగుతుంటుంది.

రీజనింగ్ మైండ్‌ను (reasoning mind) ఆశ్రయించడం తప్పుగాదుకాని మానవజాతి చైతన్య వికాసానికి దీనివల్ల ఒనగూడే ప్రయోజనం చాల స్వల్పం. నిర్ణయాలు తీసుకోవడంలో (decision making) కొంత వరకు వుపయోగపడుతుంది. అంతే తప్ప, అంతర్ శక్తిని విశ్వసించి దాన్ని వినియోగంలోనికి తీసుకురావడానికి రీజనింగ్ మైండ్ ఏ మాత్రం ఉపయోగపడదు. ఏదైనా ఒక లక్ష్యం ఏర్పరుచుకున్నపుడు, అది నెరవేరుతుందా? లేదా? అని ఈ రీజనింగ్ మైండ్ అనేక విధాలుగా విశ్లేషణ చేసుకుంటుంది. దీని విశ్లేషణ అంతా పరిమిత జ్ఞానంతో జరుగుతుంది. ఆ విశ్లేషణ ఎంతకీ తెగదు. ఈ రీజనింగ్ మైండ్ అపారమైన ఆత్మశక్తిని విశ్వసించదు. రీజనింగ్ మైండ్ ద్వారా మానవజీవితాలలో అన్ని సమస్యలకు పరిష్కారం లభించదు. మీ సైన్సు, టెక్నాలజీలు రీజనింగ్ ద్వారా అభివృద్ధి చెందాయి. అంతర్వాణిని ఉపయోగించి అభివృద్ధి చేసి వుంటే సైన్సు, టెక్నాలజీలు లక్షల రెట్లు అభివృద్ధి చెందివుండేవి. పరిమితజ్ఞానం వున్నపుడు రీజనింగ్ అవసరమే కాని అంతర్వాణిని ఉపయోగించడం కోసం మీరు ఎంతో సాధన చేయవలసి వుంది. అపారమైన మనోశక్తిలో రీజనింగ్ మైండ్ అనేది చాల చాల స్వల్పమైన అంశం. సూర్యుడి వెలుగులో గోరంత వెలుగు ఈ రీజనింగ్ మైండ్!

ఏ పనికుపక్రమించాలి? ఏ విధంగా ముందుకు సాగాలి లాంటి అనేక ప్రశ్నలు మీకొస్తుంటాయి. మీ చైతన్య వికాసం పెరిగేకొలదీ మీ బుద్ధి వికాసం కూడ పెరుగుతుంటుంది; మీ బుద్ధి షార్ప్ (sharp) అవుతుంటుంది; మీ మనోశక్తి విస్తరణ పెరుగుతూ వుంటుంది. మీ చైతన్యశక్తి విస్తరణ ఎక్కువగా వున్నపుడు మీకు వివేచన శక్తి, అంతరాత్మ ప్రబోధం పెరుగుతాయి. మీ చైతన్యశక్తిని విస్తరణ చేసుకోవడంలో మీ

ప్రయాణం ముందుకు సాగవలసివుంది. చైతన్యశక్తి స్థాయి (consciousness level) ఎక్కువగల వ్యక్తి నిర్ణయాలు తీసుకోవడంలో, లక్ష్యాలు ఎంచుకోవడంలో స్పష్టత (clearity) కలిగివుంటాడు. చైతన్యశక్తి లోపించినపుడు అస్పష్టత (confusion) మిమ్మల్ని డామినేట్ చేస్తుంటుంది. దేనికైనా శక్తి వినియోగమే కదా!

ఇంటెలక్ట్ (intellect) అనేది నిర్ణయాలు తీసుకోవడంలో ముఖ్యమైన పాత్ర వహిస్తుంది. చైతన్యశక్తి పెరిగేకొలదీ ఇంటెలక్ట్ పరిధి పెరుగుతుంది. ఈ ఇంటెలక్ట్ కూడ కాన్షియస్ మైండ్ పరిధిలో ఇమిడి వుంది. ఇంటెలక్ట్ ప్రతి మనిషికీ అవసరమే ! నిర్ణయాలు తీసుకోవడం, లక్ష్యాలు ఎంచుకోవడం, జడ్జిమెంట్స్ ఏర్పరచుకోవడం దీని పరిధిలో జరుగుతున్నప్పటికీ అదే సర్వస్వం కాదు. ఇంటెలక్ట్ లేకపోయినా దేహాన్ని ధరించిన ఆత్మశకలం తన అంతర్‌శక్తి ద్వారా భూమి మీద జీవితానుభవాలను పొందడం జరుగుతుంది. అనంతమైన జ్ఞానాన్ని దేహంలోని ప్రతి జీవకణమూ ఇముడ్చుకుని వుంది. మీ పూర్వీకుల జ్ఞానమంతా మీ దేహంలోని క్రోమోజోమ్స్‌లో (chromozomes) భద్రపరచబడివుంది. మీ వినియోగంలోనికి రావడానికి ఆ జ్ఞానమంతా సిద్ధంగా వుంది. మీకు తెలియాల్సిందంతా ఎలా వినియోగించుకోవాలనే విషయమే. అందరికీ ఒకే స్థాయిలో ఇంటెలక్ట్ వుండదు. వారిలో చైతన్యశక్తి చలనానికి (motion of consciousness) అనుగుణంగా ఇంటెలక్ట్ వుంటుంది. సముద్రంలో ఒక 'అల' ఎలా కదలికను కలిగి వుంటుందో, ఈ ఇంటెలక్ట్ కూడ అంతే! మైండ్ అనేది సముద్రమయితే, కదలికలో వున్న ఈ 'అల'ను ఇంటెలక్ట్‌గా పరిగణించవచ్చు. భూమి, లేదా మరే లోకంలో నయినా ఏ ఆత్మశకలమూ నిర్దయగా వదిలివేయబడలేదు; విస్మరింపబడలేదు. ఈ విశ్వ శక్తే అన్ని ఆత్మశకలాల్లో నిండి వుంది. ఇంటెలక్ట్ వున్నా, లేకపోయినా దేహధారిగా వున్న ఆత్మశకలం యొక్క చైతన్య పరిణామం కొనసాగుతూనే వుంటుంది. ఇంటెలక్ట్ అనేది లక్ష్యాలను నిర్దేశించుకోవడంలో వుపయోగపడుతుంది. ఒక మానవజాతి మాత్రమే గాకుండా, జంతువులు + ఇతర జీవజాతులన్నీ వాటి చైతన్యశక్తి స్థాయిలలో ఇంటెలక్ట్‌ను కలిగివున్నాయి. సకల ప్రాణికోటిని నడిపించేది అంతర్‌శక్తే గదా!

* * *

మీ ఆలోచనలే మీ ప్రపంచాన్ని సృష్టిస్తున్నాయి. మీ ఆలోచనలే మిమ్మల్ని పరిపూర్ణ మానవత్వం వైపు తీసుకెళ్తున్నాయి. మనోశక్తి క్రియల (mental activities) ద్వారా ఆలోచనలు వెలువడుతున్నాయి. భావోద్వేగాల స్థితి (emotional state) ద్వారా

అన్ని జీవజాతులు అనుసంధానింపబడి (connected) వున్నాయి. మనిషికి నైతిక స్పందన (moral sense) వున్న విధంగానే జీవజాతులు కూడ నైతిక స్పందన కలిగివున్నాయి. ఆలోచనలను ఉత్పత్తి చేసే స్థానం మీ దేహంలోని మెదడు. మీరు ఎరుకలోవున్నా, లేకున్నా ప్రతిక్షణమూ మీ మనోశక్తి నుండి ఆలోచనా తరంగాలు వెలువడుతూనే వున్నాయి. కాన్షియస్ మైండ్ లెవల్‌లో (at the level of conscious mind) మీరు జాగృదావస్థలో లేనప్పటికీ ఆలోచనా తరంగాలు వెలువడుతూనే వుంటాయి. ప్రతి ఆలోచన ఈ విశ్వంలో ఏదో ఒక తలంలో (in any plane) వాస్తవరూపం (reality) చెందుతూనే వుంటుంది.

మీరు ఏది సంకల్పించినా అది నెరవేరి తీరుతుంది. మీ మైండ్ నుండి వెలువడిన ఆలోచనా తరంగాలు మళ్ళీ తిరిగి రావు. వింటినుండి వదిలిన బాణంలాగ ఈ ఆలోచనా తరంగాలు వాటి శక్తి అనుసారంగా ఈ విశ్వంలో గల ఏదో ఒక లోకంలోకి వాస్తవరూపం పొంది తీరుతాయి. ఈ ఆలోచనా తరంగాలు విద్యుదయస్కాంత శక్తిని కలిగి వుంటాయి. వాటికీ శక్తినిత్యత్వ నియమం (law of conservation of energy) వర్తిస్తుంది. శక్తి నిరంతరమూ రూపాంతరం చెందుతుంటుంది. కాంతి శక్తి – ఉష్ణశక్తిగా, ధ్వని శక్తిగా విద్యుత్ శక్తిగా, పదార్థంగా, ఇంకా అనేక రూపాలలోనికి మారుతుంది. ఆలోచనా తరంగాలు కూడ పదార్థంగా, ఇతర శక్తిరూపాలుగా రూపాంతరం చెందగలవు. ఆలోచనా తరంగాలు ఒక రూపం తీసుకున్న తర్వాత మళ్ళీ పునర్జన్మ తీసుకోగలవు. ఆలోచనా తరంగాలు మనోశక్తి నుండి వెలువడిన తర్వాత జన్మపరంపరలను కొనసాగిస్తాయి. మీ మనోశక్తి నుండి బలంగా సంకల్పించుకుని మీ ఫ్రెండ్ దగ్గర ఉన్నట్లు ఊహించుకోండి. వెంటనే మీ ప్రతిరూపం (counter self) ఆలోచనా తరంగాల నుండి ఉద్భవిస్తుంది. దానికి కలిగివున్న శక్తి తీవ్రత (intensity of energy) ఆధారంగా జీవించి మరణం పొందుతుంది. మరణం పొందిన తర్వాత మళ్ళీ జన్మతీసుకుంటుంది. దాని జన్మపరంపరలు (reincarnations) అనంతకాలం కొనసాగుతూ చైతన్య పరిణామం జరుగుతూ వుంటుంది. మీ ఆలోచనా తరంగాలు భూమి మీద త్రిదిశా తలంలో వాస్తవం పొందాలంటే వాటికీ బలమైన శక్తిని మీ మనోశక్తి ద్వారా సరఫరా చెయ్యాలి. ఆలోచనా తరంగాలు ఎంత బలమైన శక్తిని కలిగి వుంటే అంత త్వరితంగా భౌతిక వాస్తవాన్ని పొందుతాయి.

మీ దేహంలోని మెదడు తనంత తానుగా ఆలోచనా తరంగాలను సృష్టించజాలదు. మనోశక్తి నుండి వెలువడిన ఆలోచనా తరంగాలకు ఇది ఒక వాహనంగా పనిచేస్తుంది. మెదడు ద్వారా ఆలోచనా తరంగాలు బహిర్గతమవుతాయి. ఈ సృష్టిలోని

ఆలోచనా తరంగాలను బహిర్గతం చేసి సరఫరా చెయ్యడం (transmitting), సంగ్రహించడం (receiving) రెండింటిని మెదడు నిర్వహిస్తుంది. సరఫరా మరి సంగ్రహణ (transmission and receiving) అనే క్రియలు ఈ మెదడు నిర్వహణలో వుంటాయి. రేడియో మరి T.V సంగ్రహించుకునే విధంగానే ఈ విశ్వంలోని ఆలోచనా తరంగాలను మీ మెదడు గ్రహిస్తుంది. మీ జీవితాలలో లక్ష్యాలకు అనుగుణంగా వున్న ఆలోచనలను మీ మెదడు ఆకర్షిస్తుంది. ఆకర్షింపబడే ఆలోచనలు మీరు ఏర్పరుచుకున్న సంకల్పాల కనుగుణంగా వుంటాయి. ఆకర్షింపబడే ఆలోచనల ఫ్రీక్వెన్సీ స్థాయి (frequency level), మీ సంకల్పాల ఫ్రీక్వెన్సీ స్థాయి సమానంగా వున్నపుడు అలా జరుగుతుంటుంది. పెద్ద పెద్ద లక్ష్యాలు ఎక్కువ ఫీక్వెన్సీగల ఆలోచనా తరంగాలను మైండ్ నుండి వెలువడేటట్లు ప్రభావితం చేస్తాయి. మీ సంకల్పాలు (intents) అంతర్ మనోశక్తి నుండి ఉద్భవిస్తున్నాయి. అవి విశ్వశక్తిని (cosmic energy)కలిగి వుంటాయి. ప్రతి సంకల్పమూ దాని రేంజ్‌లో గల (range) ఆలోచనా తరంగాలను ఉద్గారం చేస్తుంది. ఈ ఆలోచనా తరంగాలు వాటి శక్తి కనుగుణంగావున్న ప్రదేశాన్ని చేరి వాస్తవాన్ని పొందుతాయి.

మీరు మనోశక్తిని విస్తరింపజేసుకుని చైతన్య పరిణామం చెందడానికే భూమి మీదకు రావడం జరిగింది. గెలుపు ఓటములు మనోశక్తిలో లేవు. ఒక లక్ష్యాన్ని సాధించడంలో విఫలం చెందారంటే దానర్థం మీరు ఆ లక్ష్యం వైపు మీ ఆత్మశక్తిని కేంద్రీకరింపజెయ్యలేదన్నమాట. మీ ఆత్మశక్తిని కేంద్రీకరింపజేసి వుంటే ఆ లక్ష్యం నెరవేరి వుంటుంది. మీకు కత్తిసాము చేత కాలేదంటే, ఆ విషయంపట్ల మీ అంతర్‌శక్తిని కేంద్రీకరింప జెయ్యలేదు; కత్తిసాము నేర్చుకోవాలని సరియైన శ్రద్ధ కనబర్చలేదని గుర్తుంచుకోండి. మీకు జ్ఞాపకశక్తి తక్కువగా వుందంటే, దాన్ని పెంచుకోవాలని శ్రద్ధ చూపడం లేదు. ఏ విషయం పట్లయినా సరే, మీరు సంకల్పం (intent), శ్రద్ధ ఏర్పరచుకుంటే మీ అంతర్ శక్తి అందుకనుగుణంగా ప్రతిస్పందించి ఆ సంకల్పం వైపు ప్రవహిస్తుంది. ఆ శక్తి భౌతిక సంఘటనగా (physical event) రూపాంతరం చెంది వాస్తవమవుతుంది.

మీకు సంగీతం (music) రాదనుకోండి. సంగీతం నేర్చుకోనంత మాత్రాన మీరు జీవితంలో విఫలం అయినట్లుకాదు. సంగీతం నేర్చుకోవాలని సంకల్పించుకున్నపుడు దేహంలో అనేక జీవరసాయనాలు ఉత్పత్తి అయి కంఠం దగ్గర వున్న కండరాలను

ప్రభావితం చేస్తాయి. సంగీతానికి అనుగుణంగా వుండేటట్లు మీ కంఠధ్వనిలో మార్పులు జరగడానికి దేహంలోని వ్యవస్థ అంతా సర్దుబాట్లు చేసుకుంటుంది. మీ సంకల్పానికి అనుగుణంగా మీ మైండ్ నుండి వెలువడిన ఆలోచనా తరంగాలు భౌతిక పరిస్థితులను ఆకర్షిస్తాయి. మీరు సంగీత విద్యను అభ్యసించేందుకు కావలసిన భౌతిక సంఘటనలు మీ ఆలోచనల ద్వారా సృష్టింపబడతాయి. మీ సంకల్పాలు (intents) ఎంత వరకు విస్తరించుకుంటాయో, ఆ పరిధి మేరకు భౌతిక పరిస్థితులు, భౌతిక సంఘటనలు సృష్టింపబడి మీ జీవితానుభవాల్లోనికి ప్రవేశిస్తాయి. అన్ని కళలూ, విద్యలూ, శాస్త్రాలూ నేర్చుకునేందుకు మానవ దేహధారి అయిన ప్రతి ఆత్మశకలమూ సర్వసమర్థతనూ కలిగి వుంది. ఫలానా కళలో మీరు నిష్ణాతులు కాలేదంటే అందులో మీరు విఫలమైనట్లు కాదు. ఆ కళను నేర్చుకోవడానికి మీరు సంపూర్తిగా సంకల్పించలేకపోవడం వల్ల విఫలమయ్యారు.

మానసిక వికలాంగులు, శారీరక వికలాంగులు వేరేదిశలో చైతన్య పరిణామం చెందడం కోసం, ఆత్మశక్తిని ఇంకో కోణంలో దర్శించడం కోసం ఆ విధంగా జన్మలను ఎంచుకోవడం జరుగుతూంది. మీ పరిభాషలో వాళ్ళు విఫలమైనట్లు తోస్తుంది. కాని ఆత్మశక్తి పరిభాషలో పురోగతి సాధిస్తున్నారు. జ్ఞానభాండాగారాన్ని మరింత పెంచి చైతన్య వికాసం చెందడానికే ప్రతి ఒక్కరూ భూమి మీద జన్మ తీసుకుంటున్నారు. ఎవరికోణంలో వారు పురోగతి సాధిస్తున్నారు. మీ జ్ఞానాన్ని అపారంగా విస్తరింపజేసుకోవాలనే ఆశయంలో ఈ భూమి మీద జన్మ తీసుకున్నారు. పర్‌ఫెక్షన్ (perfection) పొందడమనే భావనను మైండ్ కలిగి వుండదు. ఏ విషయంలోనైనా పర్‌ఫెక్షన్ సాధించారంటే దాని పురోగతి అంతటితో ఆగిపోయినట్లే. సంగీతంలో పర్‌ఫెక్షన్ సాధించారంటే దాని పురోగతి ఆగిపోయినట్లే. కాని సంగీతం యొక్క పురోగతి అనంతంగా సాగిపోతూ వుంటుంది. పర్‌ఫెక్షన్ అనే కాన్సెప్ట్ (concept) కాన్షియస్ మైండ్ భావన నుండి పుడుతూంది. ఏ విద్యగాని, జ్ఞానం కాని, కళగాని అనంతకాలం పురోగతి పొందుతూనే వుంటుంది. ఎక్కడా పర్‌ఫెక్షన్ అనే మాట వుండదు. ప్రతి విద్య నిరంతరమూ పురోగతి (ever continuous progress) చెందుతూ వుంటుంది; ఆత్మ చైతన్యశక్తి కూడ నిరంతరమూ పురోగతి (ever continuous progress) చెందుతూ వుంటుంది. మీ మనోశక్తి కూడ నిరంతరమూ పురోగతి చెందుతూ వుంటుంది. జీవిత ప్రవాహం నిరంతరమూ సాగుతూంటుంది.

మీరు సంకల్పాలు ఏర్పరుచుకుని నెరవేర్చుకునే కొలదీ మీ జీవితానుభవాలు పెరుగుతూంటాయి. మీ జ్ఞానపరిధి పెరుగుతూంటుంది. మీ చైతన్య పరిణామ వ్యాకోచం పెరుగుతూంటుంది. ఈ విశ్వంలో చైతన్య పరిణామ వ్యాకోచానికి మీరు కేంద్రంగా (you are the centre for the evolution of consciousness in the universe) వుంటున్నారు. విశ్వ చైతన్య వ్యాకోచానికి ప్రతి ఒక్కరూ కేంద్రంగా వుంటున్నారు. మీ మనోశక్తి వ్యాకోచం విశ్వమనోశక్తి వ్యాకోచాన్ని ప్రభావితం చేస్తుంది. మీ సంకల్పాల పరిమాణం పెరగాలి; అత్యున్నత లక్ష్యాలు మీరు ఎంచుకోవాలి. మీ జ్ఞానం యొక్క పరిధి నిరంతరమూ వ్యాకోచం చెందాలి. అపుడే మీ జీవితం అర్థవంతంగా వుంటుంది. విజయం (success), విఫలం (failure) అనేవి మీ కాన్షియస్ మైండ్‌లో కలిగే భావనవల్ల కలుగుతున్నాయి.

ఒక వ్యక్తి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని బలంగా సంకల్పించుకున్నపుడు దాని కనుగుణంగా విశ్వ మనోశక్తి (universal mind) ప్రతిస్పందించి, విశ్వశక్తి (cosmic energy) మీ లక్ష్యం కేంద్రంగా అటువైపు ప్రవహిస్తుంది. విశ్వశక్తి ప్రవాహానికి మీ లక్ష్యం ఒక కేంద్రంగా ఏర్పడి ఆకర్షిస్తుంది. ఈ విశ్వంలో ప్రతి ఒక్కరూ విశ్వశక్తి ప్రవాహానికి ఒక కేంద్రంగా పనిజేస్తున్నారు. ఈ విశ్వ చైతన్యంలో ప్రతి ఆత్మ శకలమూ ఒక కేంద్ర బిందువే! కేంద్ర బిందువు చుట్టూ పరిధి పెరిగే కొలదీ విశ్వచైతన్యశక్తి పరిధి కూడ విస్తరిస్తూ వుంటుంది. ఈ విశ్వంలో మీరు సంకల్పించుకున్న లక్ష్యం ఆత్మశక్తి నుండి ఉద్భవించింది. ఆ లక్ష్యం ఎక్కడో ఒక చోట – అది కలిగి వున్న ఆలోచనా తరంగాల శక్తి తీవ్రతను బట్టి నెరవేరితీరుతుంది.

మీరు ఇంటిలో వున్న గోడ ద్వారా ప్రయాణించాలని సంకల్పించుకుంటారు. కాన్షియస్ మైండ్ పరిధిలోగల రీజనింగ్ మైండ్‌కు అది అసాధ్యమన్పిస్తుంది. కాని ఆత్మశక్తి పరిధిలో అది చాల సులభమని, మీ మనోశక్తికి తెలుసు. ఈ విశ్వమంతా శక్తిమయమే! మీ కళ్ళకు కన్పించే ఆ గోడ ఘనపదార్థంగా (solid matter) రీజనింగ్ మైండ్ నిర్ధారించుకుంటుంది. వాస్తవానికి ఆ గోడ భౌతిక పదార్థం రూపంలోవున్న శక్తి స్వరూపం. మీరు పూర్తిగా విశ్వసించి గోడ గుండా ప్రయాణం చేయాలని సంకల్పించినపుడు మీ దేహం దానికనుగుణంగా ప్రతి స్పందించి శక్తి స్వరూపంగా మారి గోడ గుండా ప్రయాణించడం జరుగుతుంది. శక్తి ప్రసారానికి ఈ విశ్వంలో ఏ యానకమూ (medium) అవసరం లేదు. మీ ఆత్మశక్తి, మరి సూక్ష్మశరీర సముదాయం (astral body) పర్వతాలు,

గోళాలు, నక్షత్రాల గుండా చొచ్చుకుని పోగలవు; అనంత దూరాన్ని క్షణకాలంలో ప్రయాణించ గలవు. శక్తి ప్రసారానికి యానకం అవసరం లేదు. కాంతి తరంగాలు (light waves) ఏ యానకం అవసరం లేకుండా అనంతదూరం ప్రయాణిస్తున్నాయి గదా!

శారీరక అంగవైకల్యం (physically handicapped) వున్న ఒక వ్యక్తి కోల్పోయిన అవయవం తిరిగి పొందినట్లు బలంగా సంకల్పించి మనోశక్తి ద్వారా ఊహించుకుంటే (imagine) అందుకనుగుణంగా భౌతిక పరిస్థితులు సృష్టింపబడి అతని సంకల్పం నెరవేరుతుంది. అప్పటివరకు ఆ అవయవాన్ని అమర్చడానికిగల వైద్యశాస్త్రం అభివృద్ధి చెంది వుండకపోతే, అతని బలమైన సంకల్పానికి అనుగుణంగా క్రొత్త వైద్యశాస్త్రం అభివృద్ధి చెందించబడుతుంది. ఈ విశ్వశక్తి ప్రవాహం అటువైపు కేంద్రీకరింపబడి అందుక్కావలసిన భౌతిక పరిస్థితులను సృష్టిస్తుంది. అతని సంకల్పం నెరవేరుతుంది. అతని సంకల్పం బలహీనంగా వున్నపుడో, అంతర్‌శక్తి పైన అతనికి నమ్మకం లేనపుడో అతడు సంకల్పించిన లక్ష్యం తాలూకు ఆలోచనా తరంగాలు ఇంకో డైమన్షన్‌లోనికి (dimension) ప్రయాణించి అక్కడ వాస్తవాన్ని (reality) పొందుతాయి. మైండ్ నుండి ఒకసారి వెలువడిన ఆలోచనా తరంగాలు వాస్తవరూపాన్ని పొందక పోవడమనేది ఈ విశ్వంలో జరగనే జరగదు. ప్రతి ఆలోచనా తరంగమూ వాస్తవరూపం పొంది తీరుతుంది. త్రిదిశా తలంలో (three dimesional plane) అతడు సంకల్పించుకున్న లక్ష్యం యొక్క ఆలోచనా తరంగాలు ఇక్కడ నెరవేరనపుడు మరో సంభావ్యలోకంలో (probable world) వాస్తవాన్ని పొందుతాయి.

మీ ఆలోచనల కనుగుణంగా మీ జీవితాన్ని, జీవితానుభవాలను సృష్టించుకున్నారు. ఆలోచనల నుండే మీ దేహం సృష్టింపబడింది. ఆలోచనల నుండే ఈ జీవజాతులన్నీ తమ భౌతిక దేహాలను సృష్టించుకుంటున్నాయి. ఆలోచనల నుండే చైతన్యశక్తి పదార్థంగా రూపాంతరం చెందుతూంది. ఆలోచనల నుండే అణువులు, పరమాణువులు అన్నీ కలిసి దేహానికి ఒక రూపాన్ని కలుగజేస్తున్నాయి. ఆలోచనల నుండే ఈ విశ్వంలో మూలచైతన్యశక్తి నుండి కోటానుకోట్ల లోకాలు + వాటి మీద జీవరాశుల సృష్టి జరుగుతూంది. ఆలోచనలు సృష్టిని కావించి, దాన్ని పెంచి పోషిస్తాయి. మీ జీవితానుభవాలంతా ఆలోచనల ప్రవాహం దిశలో ప్రయాణిస్తాయి. మైండ్ నుండి వెలువడే ఆలోచనా తరంగాలు సృష్టిని కావిస్తూ జీవం పోస్తుంటాయి. ఇది నిరంతరమూ కొనసాగే ప్రక్రియ (an ever continous process).

మీరు ఏది ఆలోచిస్తున్నారో అదే మీ జీవితమై వుంటుంది. మీరు ఏవి కలలు కంటారో అవే పరిస్థితులు మీ జీవితానుభవాలుగా మారుతున్నాయి. ప్రతి ఆలోచనా తరంగం మీ మనోశక్తిని పెంచుతుంటుంది. ప్రతి ఆలోచనా తరంగం మీ మైండ్ చుట్టూ ఒక వలయంగా మారుతుంది. వలయాల సంఖ్య పెరిగే కొలదీ మైండ్ పరిణామ వ్యాకోచం విస్తరించుకుంటుంది. మీ యొక్క ప్రతి ఆలోచన, భావన, స్పందన, ఆశయం, ఊహ, కల – అన్నీ ఈ విశ్వంలో జీవం పోసుకుంటుంటాయి.

మీరు ఒక స్త్రీ అయివుండి వైవాహిక జీవితంలో అసంతృప్తిగా, నిరాశమయమైన జీవితం కలిగి వుంటే – ఆ పరిస్థితులను చక్కదిద్దగల శక్తిసామర్థ్యాలు మీలోనే వున్నాయి. మీ ఊహాశక్తి (imagination)ద్వారా మీ జీవితాన్ని ఇష్టమొచ్చిన రీతిలో మలుపుత్రిప్పవచ్చు. మీ వైవాహిక జీవితం సాఫీగా సాగిపోతున్నట్లు ఊహించుకోండి; మీ జీవిత భాగస్వామితో ప్రేమను పంచుకున్నట్లు ఊహించుకోండి! మీరూ ప్రేమను పంచుతున్నట్లు ఊహించుకోండి; అనేక విధాలుగా అన్ని కోణాలలో జీవితానుభవాలను మీ జీవిత భాగస్వామితో పంచుకుంటున్నట్లు ఊహించుకోండి. ఆ ఊహాశక్తి ఫలితంగా మీ జీవితంలో భౌతిక పరిస్థితులు సృష్టికావింపబడతాయి. మీ జీవిత భాగస్వామి మీ ఊహాశక్తి చేత ప్రభావితమవుతాడు. అందుకనుగుణంగా అతని ప్రవర్తనలో మార్పులు సంభవిస్తాయి. మీరు ఎలా ఊహించుకుంటే ఆ విధంగా భౌతిక సంఘటనలు మీ జీవితంలో సృష్టింపబడుతాయి. దూరం, కాల పరిస్థితుల కతీతంగా ఈ ఊహాశక్తి మీ జీవితాన్ని మార్చివేస్తుంది. మీ భౌతిక వాస్తవాన్ని సృష్టించడంలో ఈ ఊహాశక్తి మహిమాన్వితమైనది; ఇది ఒక గీటురాయి వంటిది. ఊహాశక్తి పనిచేస్తుందా? లేదా? అని మీరు సంశయాలు పెట్టుకోకండి. మీరు బలంగా నమ్మక వ్యవస్థను కలిగి వుంటే ఊహాశక్తి తప్పకుండా మీకు ఉపయోగపడుతుంది. ఊహాశక్తి అంతర్ మనోశక్తికి సంబంధించినది.

ఈ భౌతిక ప్రపంచంలో కాన్షియస్ మైండ్ యొక్క ఉనికి దేహంలోని మెదడుపై ఆధారపడి వుంటుంది దేహం వున్నపుడు, దేహం విడిచి పెట్టిన తర్వాత కూడ కాన్షియస్ మైండ్ మీ మనోశక్తితో బాటు కంటిన్యూ అవుతుంటుంది. అయితే ఈ భూమి మీద దేహధారిగా వున్నంతకాలం కాన్షియస్ మైండ్ అనేది మెదడు అనే పరికరం ద్వారా పని చేస్తుంది. మల్టిడైమన్షనల్‌గా వున్న మైండ్, మెదడు ద్వారా త్రిదిశా తలంగల భౌతిక ప్రపంచంలోనికి మరల్చబడుతుంది మైండ్ నుండి మరి అంతర్ ప్రపంచం నుండి

వచ్చే జ్ఞానాన్ని భూభౌతిక ప్రపంచానికి అనుగుణంగా మలుచుకోవడంలో ఈ మెదడు కీలక పాత్ర వహిస్తుంది. మైండ్ యొక్క కార్యకలాపాలన్నీ కూడ దేహంలోని మైండ్ ద్వారా నిర్వహించబడుతుంటాయి. **అంతర్ ప్రపంచం మహాసముద్రమైతే, బాహ్యప్రపంచం సముద్రపు అల.**

దేహానికి, మైండ్‌కు మధ్య వారధిగా చైతన్యశక్తి పనిచేస్తుంది. జీవకణాలు దేహాన్ని ఎలా వుంచుతాయో, ఆ విధంగానే ఆలోచనలు, సంకల్పాలు మైండ్‌ను అలా వుంచుతాయి. మీ మైండ్... (అంటే అంతర్ ప్రపంచం) మల్టిడైమన్షనల్ వాస్తవం అయితే మైండ్ నుండి ఆత్మశక్తి రూపాంతరం చెంది బాహ్య ప్రపంచంలో భౌతిక సంఘటనలు+ భౌతిక పరిస్థితులు + భౌతిక వస్తువులు + భౌతిక వాతావరణంగా త్రి డైమన్షనల్ తలంలో భౌతిక వాస్తవంగా రూపొందుతుంది.

అంతర్ ప్రపంచంలో ఒక భాగమీ కాన్షియస్ మైండ్. భౌతిక సంఘటనలు, భౌతిక పరిస్థితులను బాహ్యప్రపంచంలో సృష్టి జరగడానికి ప్రత్యక్ష మరి పరోక్ష సంబంధాన్ని కాన్షియస్ మైండ్ కలిగి వుంటుంది. పరిమిత జ్ఞానంతో కూడిన నమ్మకాలు అడ్డుతగలకపోతే అంతర్ ప్రపంచం నుండి వచ్చే సందేశాలను, జ్ఞానాన్ని కాన్షియస్ మైండ్ ద్వారా సంపూర్తిగా పొందవచ్చు. సంకల్పాలను, లక్ష్యాలను ఎంచుకోవడంలో కాన్షియస్ మైండ్ యొక్క పాత్ర చాల ముఖ్యమైనది. కాన్షియస్ మైండ్‌లో మీరు ఏర్పరుచుకున్న నమ్మకాలు, సంకల్పాలు, ఆశయాలు, భయాలకనుగుణంగా మీ అంతర్ శక్తి స్పందించి బాహ్య ప్రపంచంలో అవి భౌతిక సంఘటనలుగా రూపాంతరం చెందిస్తుంది. త్రీ డైమన్షనల్ తలంలో భౌతిక ప్రపంచానికి, అంతర్ ప్రపంచానికి మధ్య కాన్షియస్ మైండ్ ఒక వారధిగా, ఒక సాధనంగా పనిచేస్తుంటుంది.

బాహ్య భౌతిక ప్రపంచంలో కాన్షియస్ మైండ్ ఏది వాంఛిస్తూ వుంటుందో దాన్ని అంతర్ ప్రపంచం సరఫరా చేస్తుంటుంది. మీ కాన్షియస్ మైండ్ పరిధి పెరిగే కొలదీ మీ ఊహాశక్తియొక్క కెపాసిటి కూడ పెరుగుతుంటుంది. **అనేక భౌతిక సంఘటనలను ఎదుర్కొనడం ద్వారా, అనేక కర్మలను ఆచరించడం ద్వారా మీ జ్ఞానం యొక్క పరిధి పెరుగుతుంటుంది. మీ జ్ఞాన పరిధి విస్తరించే కొలదీ మీ కాన్షియస్ మైండ్ మరి ఊహాశక్తి అభివృద్ధి చెందుతుంటాయి.** మీరు ఎలా ఆలోచిస్తారో దానికనుగుణంగా మీ ఫీలింగ్స్ వుంటాయి. మీ నమ్మక వ్యవస్థ ఆధారంగా కూడ మీ ఫీలింగ్స్ వుంటాయి. ఊహాశక్తికి ఫీలింగ్స్ + ఎమోషన్స్ తోడయితే మీరు సంకల్పించుకున్న

లక్ష్యాలు బాహ్య భౌతిక ప్రపంచంలో వాస్తవం పొందడానికి మార్గం మరింత సులువవుతుంది. ఎన్ని ఎక్కువ కర్మలను ఆచరిస్తే ఎన్ని ఎక్కువ భౌతిక సవాళ్ళను ఎదుర్కొంటే అంత జ్ఞాన పరిధి విస్తరిస్తుంది. ఎక్కువ కర్మలను ఆచరించడం ద్వారా, ఎక్కువ భౌతిక సవాళ్ళను ఎదుర్కోవడం ద్వారా మీ జ్ఞాన పరిధి పెరుగుతుంటుంది. **మీరు ఆచరించే కర్మలు మరి మీరు సవాళ్ళుగా ఎంచుకున్న భౌతిక సంఘటనలలో ఆధ్యాత్మికతలోపించినట్లయితే మీకు దు:ఖం . అసంతృప్తి మాత్రమే సంప్రాప్తిస్తాయి.**

కాన్షియస్ మైండ్‌ను సరియైన రీతిలో ఎలా వినియోగించుకోవాలో మానవజాతికి ఇంకా పూర్తి అవగాహన లేదు. ఊహాశక్తి, ఎమోషన్స్, ఫీలింగ్స్, రీజనింగ్ మైండ్, విశ్లేషణాశక్తి, అహం, నిర్ణయాలు తీసుకోగల శక్తి మరి భావోద్వేగాలు కాన్షియస్ మైండ్‌కు సంబంధించినవే. వాస్తవానికి ఇవేవి కాన్షియస్ మైండ్‌లో వేరువేరు భాగాలు కావు. దేశం ఒక్కటే కాని రాష్ట్రాలుగా విభజించుకుంటున్నట్లు వేరు వేరు పేర్లు పెట్టడం జరిగింది. అంతర్ ప్రపంచం (మైండ్) అనే మహాసముద్రం యొక్క 'అల' ఈ కాన్షియస్ మైండ్ అని ఇది వరకే చెప్పాను. కాన్షియస్ మైండ్‌ను, ఊహాశక్తిని ఎక్కువగా వివివిగా వుపయోగించుకోండి.

ఈ విశ్వంలో ఏ లోకంలోనైనా, ఏ డైమన్షన్‌లోనైనా ఆధ్యాత్మిక ప్రగతి + జ్ఞానసముపార్జన + అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోనికి సృష్టిచెయ్యడం లాంటివి – సంకల్పశక్తి + ఊహాశక్తి ద్వారానే జరుగుతున్నదని మీరు తెలుసుకోవాలి. భౌతిక సంఘటనలు మరి జీవితానుభవాల సృష్టిలో ఊహాశక్తి ప్రధానపాత్ర వహిస్తుంది. అంతర్గతంగావున్న అపారమైన ఇంటెలిజెన్స్‌ను వెలికితీయడంలోనూ, అంతర్ ప్రపంచానికి సంబంధించి అపారమైన విజ్ఞాన భాండాగారాన్ని కాన్షియస్ మైండ్ ద్వారా మీ జీవితంలో ప్రవేశపెట్టడంలోనూ ఊహాశక్తి వుపయోగపడుతుంది. ఇంటెలిజెన్స్ గురించి మీరింకా పరిమితమైన కాన్సెప్ట్‌లలోనే (concepts) వుంటున్నారు. ఇంటెలిజెన్స్ యొక్క విస్తరణను ఎంతైనా అభివృద్ధి చెయ్యవచ్చు. మైండ్‌కుగల అపారమైన శక్తినుండే ఇంటెలిజెన్స్ ఉద్భవిస్తుంది. ఊహాశక్తి ద్వారా మీ ఇంటెలిజెన్స్ పెంచబడుతుంది. జంతుజాతి కూడ ఊహాశక్తిని వుపయోగిస్తున్నాయి గాని, ఊహాశక్తి ద్వారా చైతన్య పరిణామం చెందగల పుష్కలమైన అవకాశాలు మానవజాతికి వున్నాయి.

ఊహాశక్తి ద్వారా మీ అంతర్ ప్రపంచంతో సంబంధం కలిగి వుంటున్నారు. ఈ సృష్టి చైతన్య పరిణామం అంతా కూడ అంతర్ ప్రపంచం ద్వారానే జరుగుతూంది.

ఇంటెలిజెన్స్‌ను ఎక్కువ విశ్లేషణ చెయ్యగల శక్తి లేదా ఎక్కువగా జ్ఞప్తికి వుంచుకొనడం లేదా ఎక్కువ తర్కించడం ద్వారా నిర్వచనం ఇస్తున్నారు. ఇంటెలిజెన్స్ అంటే కాన్షియస్ మైండ్‌ను సరియైన రీతిలో విస్తారంగా వినియోగించుకోవడమని భావం. ఈ భూమి మీద మనుగడ సాగించడానికి, ప్రాపంచికంగా మరి ఆధ్యాత్మికంగా పురోగతి (మీ పరిభాషలో 'విజయం'– success) సాధించడానికి మీరు నిర్వచించుకునే ఇంటెలిజెన్స్ అవసరమే లేదు. తర్కం, విశ్లేషణ, జ్ఞాపకశక్తి మాత్రమే ఇంటెలిజెన్స్ అయితే కోటానుకోట్ల జీవజాతుల మనుగడ మరి చైతన్య పరిణామం ఏ విధంగా జరుగుతున్నాయి? మీ దేహం లోని జీర్ణప్రక్రియ, గుండె + ఊపిరితిత్తుల క్రియలు, రక్త ప్రసరణలాంటి వాటికి ఇంటెలిజెన్స్ అవసరమేముంది? ఒక చిన్న విత్తనం మహావృక్షంగా ఎదగడంలో ఇంటెలిజెన్స్ ఎక్కడుంది? ఎలక్ట్రాను గమనం, భూమియొక్క గమనం, సౌర వ్యవస్థ గమనం ఇవన్నీ ఇంటెలిజెన్స్ ద్వారా నడుస్తున్నాయా? అంతర్ ప్రపంచమే వీటన్నింటినీ నడిపిస్తూంది; మీరు నిర్వచిస్తున్న ఇంటెలిజెన్స్ మటుకు కాదు. మీకు ఏది కావాలో సంకల్పించుకునే శక్తి వుంటే చాలు, మీ జీవితంలో భౌతిక సంఘటనలను ప్రవేశపెట్టుకోవడానికి.

మీ నాగరికతలు, సైన్సు, టెక్నాలజీ, రీజనింగ్ మైండ్, విశ్లేషణాశక్తి అంతా ఊహాశక్తి ద్వారానే సృష్టించబడుతున్నాయి. తర్కం, విశ్లేషణ, రీజనింగ్‌మైండ్ అనవసరమని మీకు చెప్పడం లేదు. పరిమిత జ్ఞానంతో పరిమిత ఇంటెలిజెన్స్‌తో కూడిన తర్కం + విశ్లేషణ + రీజనింగ్ మైండ్‌లతో బాటు అపారమైన అంతర్ ప్రపంచంపైన కూడ ఆధారపడడం సాధన చెయ్యవలసివుంది. మీరు నిర్వచించు కుంటున్న ఇంటెలిజెన్స్ అసమగ్రత గురించి ఈ పుస్తకంలో ప్రస్తావిస్తున్నాను. మీ ఇంటెలిజెన్స్‌కు అందని అపారమైన జ్ఞానసంపద మీ అంతర్ ప్రపంచంలో ఇమిడి వుంది. భౌతిక సంఘటనలు ఎలా వాస్తవం చెందుతున్నాయో, సృష్టి చైతన్య పరిణామం ఎలా సాగుతూందో మీ ఇంటెలిజెన్స్‌కుగాని, మీ రీజనింగ్ మైండ్‌కుగాని తెలియవు.

భౌతికంగా ఇంకా వాస్తవం చెందని అంతర్‌శక్తి గురించి, భౌతిక వాస్తవం చెందిన బాహ్య ప్రపంచం గురించి సమగ్ర సమాచారం ఊహాశక్తి ద్వారా అందించబడుతుంది. మీ ఇంటెలిజెన్స్ మరి మీ రీజనింగ్ మైండ్‌కు భౌతిక వాస్తవం గురించిన రుజువులు లభిస్తే తప్ప విశ్వాసం కలగదు. మీ సాధారణ ఇంటెలిజెన్స్ చాల పరిమితమైనది. ఈ సృష్టిని ఈ విశ్వాన్ని ఒక అమేయమైన ఇంటెలిజెన్స్ (Infinite Intelligence) నడిపిస్తూంది.మీ ఊహాశక్తి మరి సంకల్పశక్తి అనేవి అంతర్ ప్రపంచానికి

సంబంధించినవి. మీ ఊహాశక్తి మరి సంకల్పశక్తి జనిస్తున్నప్పటికీ కాన్షియస్ మైండ్ ఇచ్చే సందేశాలు, సూచనలను, ఆర్డర్స్ (orders)ను అంతర్ ప్రపంచానికి తెలియజెయ్యడంలో ఇవి ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి.

ఈ విశ్వంలో అనంతమైన జ్ఞానం మీ పరిమిత ఇంటెలిజెన్స్‌కు అందనిది. మీ సంఘం ఇచ్చిన జ్ఞానం పరిధిలో, మీ కాన్షియస్ మైండ్ పరిధిలో మాత్రమే మీ ఇంటెలిజెన్స్ విస్తరించి వుంటుంది. సంకల్పశక్తి + ఊహాశక్తి మరి అంతర్ ప్రయాణం ద్వారా మాత్రమే ఆ అనంతజ్ఞానం కొద్ది కొద్దిగా మీ అనుభవంలోనికి వస్తుంటుంది. స్వప్నాల ద్వారా, సూక్ష్మశరీరయానం ద్వారా కూడ అమేయమైన ఇంటెలిజెన్స్ నుండి జ్ఞానం అందించబడుతుంది 'నేను' అని చెప్పబడే ఆత్మ యొక్క అపారమైన జ్ఞానం, అపరిమిత శక్తి గురించి మీ ఇంటెలిజెన్స్‌కు అందుబాటులో లేదు.

మీ దేహంలో జీవకణాలన్నీ వ్యక్తిగతంగా మైండ్‌ను (మనోశక్తి) కలిగివున్నాయి. వాటి వ్యక్తిగత మైండ్స్ అన్నీ సామూహిక మైండ్ (collective mind)గా మారి మీ సంకల్పశక్తికి + మీ ఊహాశక్తికి అనుగుణంగా స్పందిస్తాయి. కొన్ని సంవత్సరాల తరబడి ఒక దీర్ఘకాలిక వ్యాధితో ఒక వ్యక్తి బాధపడుతున్నట్లయితే తక్షణమే ఆ వ్యాధి నయమవ్వాలని అతను సంకల్పించినప్పుడో లేదా ఆ వ్యాధి నయమైపోయినట్లు, దేహం ఆరోగ్యంగా వుంటున్నట్లు అతను ఊహాశక్తితో కలలు కనినపుడో– తక్షణమే దేహంలోని జీవకణాల సామూహిక మైండ్ (collective mind of cells) అనూహ్యంగా స్పందించి సహకరిస్తుంది. దేహంలో సరిక్రొత్త జీవరసాయనాలు + విద్యుదయస్కాంత శక్తి విడుదలయి ఆ వ్యాధి నయం చెయ్యబడుతుంది.

దేహంలోని మెదడు (brain) భూభౌతిక పదార్థాన్ని మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక శక్తి, మానసిక శక్తి, జీవరసాయనిక శక్తి, విద్యుదయస్కాంత శక్తి, చైతన్య శక్తులను కలిగి వుంది. 'మెదడు' అనేది ఆత్మశక్తి నుండి మైండ్ ద్వారా నియంత్రించబడుతూంది. దేహం యొక్క ఆరోగ్యాన్ని కాపాడడంలో, బాహ్య ప్రపంచంలో భౌతిక సంఘటనలను వాస్తవం చెందించడంలో మనోశక్తి ద్వారా ఉత్తేజం పొందిన ఆత్మశక్తి మెదడు అనే సాధనాన్ని వుపయోగించుకుంటుంది. మీ ఊహాశక్తి, ఎమోషన్స్, ఫీలింగ్స్, ఆశయాలు, భయాలు, సంకల్పాల ద్వారా వెలువడే విద్యుదయస్కాంత శక్తిని మెదడు ద్వారా సంగ్రహించబడడం లేదా వెలువడేటట్లు చెయ్యడం మీ మైండ్ నిర్వర్తిస్తుంటుంది. మీ కాన్షియస్ మైండ్ మెదడు అనే సాధనం ద్వారా భౌతిక పదార్థంతో ప్రత్యక్షసంబంధం కలిగి వుంది. జీవాత్మలు భూమి మీద దేహాలనుతీసుకుని పరిణామం

చెందుతున్నంత కాలం అంతర్‌శక్తి మరి భౌతిక పదార్థంతో కూడిన జీవితానుభవాల మధ్య వారధిగా మెదడు అనే సాధనాన్ని వుపయోగించుకుంటాయి. దేహాన్ని విడిచి పెట్టిన తర్వాత మైండ్ కంటిన్యూ అవుతుంటుంది కాని మెదడును తయారుజేసిన భౌతిక పదార్థం ఈ భూమి మీదే వదిలిపెట్టబడుతుంది. ఆత్మ ఈ భౌతిక ప్రపంచంలో వున్నంతకాలం మాత్రమే కాన్షియస్ మైండ్ యొక్క క్రియలు మెదడుతో ముడిపడి వుంటాయి. మీ అంతర్ ప్రపంచానికి సరిహద్దులు, ఎల్లలు అనేవి వుండవు. అంతర్ ప్రపంచం మొత్తమూ మెదడు అనే సాధనంతో ప్రత్యక్ష సంబంధం కలిగి వుండడం గాని, ముడిపడి వుండడం కాని జరగదు. కేవలం భౌతిక పదార్థంతో కూడిన జీవితానుభవాల ద్వారా చైతన్యపరిణామం చెందడం కోసమే మెదడు అనే సాధనాన్ని మీ మనోశక్తి వినియోగించుకుంటుంది. మీ దేహ ఆరోగ్యాన్ని నియంత్రించడానికి మనోశక్తి, మెదడు ద్వారా తన పనిని నిర్వర్తించుకుంటుంది.

మైండ్ మల్టిడైమన్షనల్‌గా చైతన్య పరిణామం చెందుతూంటుంది. మల్టిడైమన్షనల్‌గా వున్న మనోశక్తిని (మైండ్) 'మెదడు' అనే సాధనం త్రీడైమన్షన్ తలమైన భూభౌతిక ప్రపంచంతో సంయోగం చెందించి ప్రత్యక్ష సంబంధం ఉండేటట్లు చేస్తుంది. అంతర్ ప్రపంచం నుండి మైండ్ పంపే సందేశాలను సంకేతాలను మీ మెదడు ద్వారా ఛానెలింగ్ (channeling) చేసి బాహ్యప్రపంచంలో భౌతిక సంఘటనలతో మీకు సంబంధాన్ని కలగ జేస్తాయి. అదే మాదిరిగా బాహ్య భౌతిక ప్రపంచంలోని సమాచారాన్ని సందేశాలను మెదడు ద్వారా ఛానెలింగ్ చేసి అంతర్ ప్రపంచానికి అందించడం జరుగుతుంటుంది.

ఈ భూభౌతిక ప్రపంచంతో సంయోగం చెందుతూ చైతన్యపరిణామం చెందుతున్నంతకాలం ఈ మెదడు యొక్క అవసరం తప్పనిసరి అవుతుంది. మల్టిడైమన్షనల్‌గా వుండే ఆత్మ, త్రీ డైమన్షన్ తలంగల భూమి మీదకు మళ్ళించడం వల్ల భౌతిక పదార్థంతో ముడిపడిన జీవితానుభవాలకు అలవాటు పడుతుంది. మల్టిడైమన్షనల్ వ్యవస్థలో (multi dimensional system) ఆత్మశక్తికి ప్రతిదీ సాధ్యమే. కాని త్రీ డైమన్షనల్ వ్యవస్థలోనికి (three dimensional system) ఆత్మ జీవాత్మగా జన్మించినపుడు కాలం – దూరం అనే చట్రంలోగల కొన్ని నమ్మకాలకు విశ్వాసాలకు లోనయి తన అంతర్ ప్రపంచంలోగల అపారమైన అనంతమైన శక్తిని మర్చిపోవడం జరుగుతూంది. ఆత్మ తనకుగల అపారమైన అంతర్ శక్తిని మర్చిపోయి త్రీడైమన్షనల్ తలంలో కాలం – దూరం అనే చట్రంలో ఇరుక్కుని పరిమిత జ్ఞానంతో కూడిన

నమ్మకాలతో బుద్ధిని కోల్పోవడాన్ని 'భ్రాంతి' అని మీ పరిభాషలో పిలుస్తారు. మీకు ఆత్మజ్ఞానం పెరిగే కొలదీ 'భ్రాంతి' క్రమేపీ తొలగి పోతూ వుంటుంది. **ఈ భౌతిక ప్రపంచంలో దైన్యంగా జీవించడానికి, హృదయ దౌర్భల్యంతో దుఃఖాన్ని అనుభవించడానికి ఏ జీవాత్మ కూడ జన్మ తీసుకోవడం జరుగదు. మీరు ఈ భూభౌతిక ప్రపంచంలోనికి జన్మ తీసుకున్నది ఆత్మజ్ఞానాన్ని విస్తారంగా పెంచుకుని చైతన్య పరిణామం చెందడంకోసమేనని మీరు గుర్తుపెట్టుకోవాలి. 'నేను' అంటే మల్టి డైమన్షన్స్ తలాలలో ఎన్నో లోకాలలో ఏక కాలంలో అనేకానేక దేహాలను ధరించి చైతన్య పరిణామం చెందుతూ విరాజిల్లుతూన్న 'ఆత్మ, అని తెలుసుకోండి.**

ఈ త్రీడైమన్షనల్ తలంలో కూడ మీ ఆత్మశక్తికి అపారమైన శక్తి వుంది. మీ సంకల్పాలు, కోరికలు, ఊహాశక్తి, ఎమోషన్స్, ఫీలింగ్స్, ఆశలు, ఆశయాలు అనేవి అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోనికి భౌతిక వాస్తవాలుగా రూపాంతరం చెందడమే 'రసవాదం' లేదా 'రసవాద విద్య'! గొంగళి పురుగును మహోద్భుతమైన సీతాకోకచిలుకగా రూపొందించేది కూడ దాని అంతర్ ప్రపంచంలోని సంకల్పం వల్లనే! అదే ప్రక్రియవల్ల మీ సంకల్పాలు కోరికలు అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోనికి భౌతిక సంఘటనలుగా రూపొందుతున్నాయి. స్వప్నావస్థలో మీ మైండ్ తన శక్తి సామర్థ్యాలను పూర్తిగా వినియోగించుకుంటుంది. జాగృదావస్థలోనికి వచ్చేసరికి కాలం – దూరం అనే చట్రంలో పరిమితజ్ఞానంలోనికి జారిపోవడం జరుగుతూంది. జాగృదావస్థలో కూడ అంతే పూర్తి సామర్థ్యంతో మీ మైండ్‌ను వినియోగించుకోవచ్చని మీ అంతర్ ప్రపంచానికి అపారమైన శక్తి వుందని స్వప్నాలు మీకు సందేశమిస్తున్నాయి. భూమికి సంబంధించిన జ్ఞానమంతా మీ మెదడు యొక్క జీవకణాలలో క్రోడీకరించబడివుంది.

ధైర్యంగా వుండాలని మీకన్పిస్తుందా?. ధైర్యం అనేది బాహ్య ప్రపంచం నుండి మీకు అందించబడదు. ధైర్యంగా వున్నట్లు ఊహించుకోండి. మీరు ఎదుర్కొనే జీవితానుభవాలపట్ల ధైర్యంగా వున్నట్లు ఊహించుకోండి. ఇతరులతో వ్యవహారం నెరపుతున్నపుడు ధైర్యంగా వుంటున్నట్లు ఊహించుకోండి. మీ ఊహాశక్తి కనుగుణంగా మీ అంతర్‌ప్రపంచం స్పందించి బాహ్య ప్రపంచంలో వాస్తవం పొందేటట్లు చేస్తుంది. మీకు జ్ఞాపకశక్తి తక్కువగా వుందా? జ్ఞాపకశక్తిని మీ డాక్టర్లుగాని శాస్త్రవేత్తలుగాని అందించలేరు. **జ్ఞాపకశక్తిని మీ అంతర్ ప్రపంచంలోని మనోశక్తి ద్వారా అభివృద్ధి చెయ్యడం**

మినహా మరే మార్గమూ లేదు. అంతర్ మనోశక్తి మాత్రమే మీకు జ్ఞాపకశక్తిని కలుగజేస్తుంది. మీ చైతన్యశక్తి పెరిగేకొలది మీకు నైపుణ్యం పెరుగుతుంటుంది. బుద్ధివికాసం వ్యాకోచిస్తుంటుంది. బుద్ధి మాంద్యాన్ని తొలగించే ఏకైక మార్గం చైతన్యశక్తిని పెంచుకుంటూ రావడమే. భూభౌతిక ప్రపంచంలో అన్ని కళలలో, అన్ని శాస్త్రాలలో నైపుణ్యం సాధించడానికి మీ ఊహాశక్తిని విరివిగా వుపయోగించడం ద్వారా సాధ్యమవుతుంది. చైతన్యశక్తిని పెంచుకోవడం ద్వారా కూడ మీ మనోశక్తిని మరింత వినియోగంలోనికి తీసుకురావచ్చు.

ఊహాశక్తిని సీరియస్‌గా కాకుండా చాల సరదాగా వుపయోగించండి. తప్పని సరిగా ఫలితాలు రాబట్టవలసిందే నన్నంత సీరియస్‌గా వుపయోగించడం చెయ్యకండి. దాని వల్ల మీరు ఫలితం కోసం ఎదురుచూస్తూ చాల అనహనానికి లోనవుతుంటారు. ఊహాశక్తిని సీరియస్‌గా తీసుకున్నపుడు మీ అంతరేంద్రియాలు సరిగ్గా స్పందించవు. మీ ఇంటెలిజెన్స్ మరి మీ నైపుణ్యం అంతా కూడ అంతర్‌శక్తి నుండి ఉత్పత్తి అవుతున్నాయి. మీ రీజనింగ్ మైండ్ ద్వారా మీ దేహంలోని గుండెను, ఊపిరితిత్తులను నియంత్రించలేరు. కనీసం ఒక జీవకణాన్ని కూడ మీ రీజనింగ్ మైండ్ నియంత్రించలేదు.

మీ దేహంలో అనంతమైన రసాయనిక చర్యలు, రసాయనిక సంయోగాలు, జీవరసాయనిక ప్రక్రియలు మీ ఆత్మశక్తి ద్వారా సంభవిస్తున్నాయి ఒక దీర్ఘకాలిక ప్రాణాంతక వ్యాధిని నయం చేసుకోవాలని మీరు బలంగా సంకల్పించినపుడు లెక్కలేనన్ని జీవరసాయనిక చర్యలు జరిగి ఆ వ్యాధిని నయం చేసుకోవడం జరుగుతుంది. రసాయనిక సంయోగాలు, రసాయనిక చర్యలు ఏ విధంగా జరుగుతాయో, దేహ ఆరోగ్య రక్షణ వ్యవస్థను కాపాడుకోవడంలో మీ సైన్సుకు అందని ఎంజైములు, హార్మోనులు ఎలా ఉత్పత్తి అవుతున్నాయో ఇంతవరకు మీ డాక్టర్లు పసిగట్టలేక పోతున్నారు.

క్షణకాలంలో కొన్ని లక్షల జీవరసాయనిక చర్యలు, జీవరసాయనిక సంయోగాలు మీ దేహంలో చోటుచేసుకుంటున్నాయి. వీటిని పసిగట్టి దేహానికి సరియైన చికిత్సా విధానం ఇవ్వగల స్థితి ప్రస్తుతం మీ వైద్య శాస్త్రానికి లేదు. కృత్రిమంగా సృష్టింపబడుతున్న రసాయనిక పదార్థాలు టాబ్లెట్లు (tablets), ఇంజెక్షన్స్ (injections) రూపంలో మీ దేహంలోనికి చొప్పించబడుతున్నాయి. ఇవి మీ దేహ ఆరోగ్యానికి ఎంత మాత్రం మంచిది కాదు. **ఈ అల్లోపతి డాక్టర్ల వ్యవస్థ . వారి చికిత్సా విధానం మీ మానవజాతికి పట్టిన**

దౌర్భాగ్యం! ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకూ డాక్టర్ల దగ్గరకు పరుగెత్తడం మానుకోండి. మీ దేహానికి గల అపారమైన శక్తిని విస్మరించి వాళ్ళేదో మీకు అద్భుతం చేస్తారని నమ్ముకోవడం మీ అవివేకం!

ఫోటో ఫిల్మ్ మీద విద్యుదయస్కాంత శక్తి ద్వారా ధ్వని + చిత్రాలను రికార్డు (record) చెయ్యడం జరుగుతుంది. విద్యుత్ సరఫరా ద్వారా ప్రొజెక్టర్ (projector) సహాయంతో సినిమా తెర (movie screen) మీద సినిమా ప్రదర్శించబడుతుంది. ఇక్కడ అంతర్ ప్రపంచాన్ని ఫోటోఫిల్మ్‌తో, మెదడును సినిమా తెరతో పోల్చవచ్చు. మీ సంకల్పాలు, కోరికలు, ఆశలు, ఆశయాలను విద్యుదయస్కాంత శక్తితో కూడిన రికార్డింగ్‌తో మరి మీ ఎమోషన్స్, ఫీలింగ్స్, నమ్మకాలను విద్యుత్ సరఫరాతో నడిచే ప్రొజెక్టరుతో పోల్చవచ్చు. మీ జీవితానుభవాలను కూడ ఫోటో ఫిల్మ్‌తో పోల్చదగ్గ అంతర్ ప్రపంచంలో రికార్డు చెయ్యబడుతున్నాయి. మీ సంకల్పాలు, కోరికలు ఆలోచనల రూపంలో వెలువడి అంతర్ ప్రపంచంలో రికార్డు చెయ్యబడతాయి. ఎమోషన్స్, ఫీలింగ్స్, నమ్మకాలు విద్యుత్ శక్తితో నడిచే ప్రొజెక్టరు వలె పనిచేసి అంతర్ ప్రపంచంలో రికార్డయిన సంకల్పాలను మెదడు అనే సినిమా తెర మీద ప్రదర్శించడం చేస్తాయి.

బాహ్య ప్రపంచంలోనికి భౌతిక సంఘటనలుగా వాస్తవం చెందడానికి మెదడు అనే సాధనం ద్వారా అంతర్ ప్రపంచం నుండి దివ్య చైతన్యశక్తి సంకల్పాల వల్ల ప్రేరేపింపబడి రూపాంతరం చెంది భౌతిక వాస్తవంగా ఏర్పడుతుంది. భౌతిక సంఘటనలుగా రూపొందే వేగాన్ని మీ ఎమోషన్స్, ఫీలింగ్స్ మరి బలమైన ఆలోచనా తరంగాలు నియంత్రిస్తాయి. మీ ఎమోషన్స్, ఫీలింగ్స్ సినిమా ప్రొజెక్టరు వలె వేగాన్ని నియంత్రిస్తాయి. జీవరసాయనికశక్తి పరంగా, పదార్థపరంగా మీ మెదడు అంతర్ ప్రపంచానికీ మరి బాహ్య ప్రపంచానికి వారధిలా (bridge) పనిచేస్తుంది. తెరపై (movie screen) మనం ఏది ప్రదర్శిస్తే అది ప్రత్యక్షమవుతుంది. **అంతర్ చైతన్యశక్తిని పరమాణువులు, అణువులు మరి జీవరసాయనిక శక్తితో కూడిన పదార్థంగా (matter) రూపాంతరం చెందిస్తుంది మీ మెదడు. అంటే మల్టిడైమన్షనల్‌గా వున్న అంతర్ చైతన్యశక్తిని త్రీడైమన్షనల్ తలంలోనికి మెదడు అనే సాధనం ద్వారా రూపాంతరం చెందించడం జరుగుతుంది. మెదడు తనంతట తానుగా ఏదీ చొరవతీసుకోదు. భౌతిక సంఘటనలనేవి విద్యుదయస్కాంత శక్తితో నిండిన భౌతిక వాస్తవాలు. ఇవి మెదడు అనే సాధనం ద్వారా భూమి ఫ్రీక్వెన్సీ స్థాయిలోనికి అంతర్ ప్రపంచం నుండి వెలువడడం జరుగుతున్నాయి. మీ సంకల్పశక్తి ద్వారా అంతర్ ప్రపంచం స్పందిస్తుంది. అంతర్ ప్రపంచం కూడ**

తనంతట తానుగా భౌతిక సంఘటనలను సృష్టించదు.

స్వప్నాలలో మెదడు తన పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకుంటుంది. అదే స్థాయిలో పూర్తి స్థాయిలో మెదడు వుపయోగింపబడుతుందని మీకు స్వప్నాలు తెలియజేస్తున్నాయి. మల్టిడైమన్షన్స్ నుండి మల్టిడైమన్షన్స్‌కు, మల్టిడైమన్షన్స్ నుండి త్రీ డైమన్షనల్‌కు భౌతిక సంఘటనలను మల్చగల శక్తి మెదడుకు వుందని స్వప్నాలు మీకు తెలియజేస్తున్నాయి. జాగృదావస్థలో మరి బాహ్య జీవితంలో మీరు ఏర్పరుచుకున్న నమ్మకవ్యవస్థవల్ల మీకు ఎదురయ్యే భౌతిక సంఘటనలన్నీ త్రీడైమన్షనల్ తలంలోకి మాత్రమే ట్యూన్ (tune) చెయ్యబడుతున్నాయి. వాస్తవానికి మీ దేహాన్ని త్రీడైమన్షనల్ తలం నుండి మల్టిడైమన్షనల్ తలంలోనికి ట్యూన్ చేసుకుని మీ ఇంట్లోగల గోడ గుండా దూసుకెళ్ళవచ్చు; అలాగే ఏ యానకం (medium)లోనికైనా ప్రయాణించవచ్చు. మల్టిడైమన్షనల్ తలంలోనైనా యానకం అనేది అడ్డంకిగా వుండదు. మీ సూక్ష్మ శరీరం యానకం గుండా ప్రయాణించగలదు. ఈ భౌతిక దేహాన్ని కూడ అదే విధంగా మల్చుకుని యానకంగుండా ప్రయాణించవచ్చు. మీ రీజనింగ్ మైండ్, మీ విశ్లేషణ మిమ్మల్ని త్రీ డైమన్షనల్ తలంలోనే బంధించి వుంచుతున్నాయి మైండ్‌కు అసాధ్యమంటూ ఏదీ లేదు. ఈ విశ్వంలోని అన్ని లోకాల సమాచారాన్ని మీ అంతర్ ప్రపంచంలోని మైండ్ ద్వారా మీకు తెలియజెయ్యబడుతుంది. 'నా తండ్రి రాజ్యంలో అనేక లోకాలున్నాయి. దేవుని రాజ్యం మీ లోనే వుంది.' అని జీసస్ క్రైస్ట్ (Jesus Christ) చెప్పిన అఖండ సత్యం మీ అంతర్ ప్రపంచం గురించే.

మీ డాక్టర్లు, శాస్త్రజ్ఞులు మెదడును శస్త్రచికిత్సల ద్వారా విభజించి మనోశక్తిని కనుగొనాలనే ప్రయత్నం చేస్తున్నారు. మైండ్ అనేది శక్తి స్వరూపం దాన్ని మీ కళ్ళతోగాని, శాస్త్ర పరికరాలతోగాని పసిగట్టలేరు. దేహంలోని జీవశక్తి ప్రక్రియలన్నీ మెదడు ద్వారా నియంత్రింపబడుతున్నప్పటికీ 'మైండ్' అన్నీ తానే అయి నడిపిస్తూంది. మీ మైండ్ మల్టిడైమన్షనల్ క్రియలను, త్రి డైమన్షనల్ క్రియలను మెదడు ద్వారా ఎప్పటికప్పుడు వేరుచేసి భౌతికతలంలో మీ నమ్మకాలు, విశ్వాసాలకు అనుగుణమైన వాటిని మాత్రమే అందిస్తుంటుంది. అలాగే స్వప్నాలలోని సమాచారాన్ని, జాగృదావస్థలోని సమాచారాన్ని వేరుచేసి మీకేది అవసరమో దాన్ని మాత్రమే మీకందిస్తుంటుంది. మెదడుకున్న పూర్తి సామర్థ్యాన్ని మానవజాతి ప్రస్తుతం వినియోగించుకోవడం లేదు. బలమైన నమ్మకంతో ఒక ప్రాణాంతక వ్యాధి నమయవుతుందని మీరు విశ్వసిస్తే క్షణకాలంలో అనూహ్యమైన

రీతిలో మీ మెదడు జీవరసాయనాలను విడుదల చేసి దేహమంతా ప్రసరింపజేసి వ్యాధిని నయం చేస్తుంది 'రోగాన్ని సృష్టించుకున్నదీ మీరే, రోగాన్ని నయం చెయ్యగలిగేదీ మీరే' నన్న సత్యాన్ని మీరు అన్ని వేళలా స్మరించుకోవాలి. ఆరోగ్యం అనేది డాక్టర్లు పెట్టే 'భిక్ష' కాదు. మీ మనోశక్తి ద్వారా మెదడు అనే సాధనంతో 'పరిపూర్ణ ఆరోగ్యం' అనే దాన్ని మీకు మీరు సమర్పించుకుంటున్న గొప్ప కానుక.

స్వప్నావస్థలో – ఆత్మశక్తి, మనోశక్తి అపరిమితమైన శక్తిని కలిగివుంటాయి. కాలం – దూరం అనే చట్రంతో ప్రమేయం లేకుండా ఆత్మశక్తి అనుభవాలను పొందగలుగుతుంది. కొన్ని స్వప్నాలు ఒక జీవితకాలానికి సరిపడా జీవితానుభవాలకు సంబంధించిన జ్ఞాన సందేశాలను ఇస్తాయి. ఒక గంట వ్యవధి గల స్వప్నంలో ఒక జీవితకాలానికి సరిపడా జీవితానుభవాలను దర్శించవచ్చు. కాలమనే కాన్సెప్ట (concept) గాని, దూరం అనే కాన్సెప్ట గాని (concept) స్వప్నాలలో ఆత్మశక్తికి వుండదు. కళ్ళు తెరచి మెలకువతో వున్న జాగృదావస్థలో, మరి నిద్రిస్తున్నపుడు స్వప్నావస్థలో సంభవిస్తున్న భౌతికసంఘటనల రెండింటి స్వభావం ఒకటే. కాని జాగృదావస్థలో సంభవించే భౌతిక సంఘటనలకు మీ పరిమిత జ్ఞానం + పరిమిత నమ్మకాలకనుగుణంగా 'ఆత్మ' పరిమితంగా తన శక్తిని వుపయోగించుకుంటుంది. అదే స్వప్నాలలో అయితే 'ఆత్మ' అపరిమితమైన శక్తిని వుపయోగించుకుంటుంది. అంతే తేడా!

స్వప్నావస్థ మరి జాగృదావస్థలో సంభవించే జీవితానుభవాలు రెండింటిలోనూ పరిణామం చెందుతూన్న చైతన్యశక్తి ఒకే తీవ్రత, ఒకే సాంద్రతను కలిగివుంటాయి. స్వప్నావస్థలో 'ఆత్మ' చైతన్యశక్తిని అదృశ్య రూపంలో జీవితానుభవాలుగా సృష్టిస్తుంటుంది. జాగృదావస్థలో ఆత్మ చైతన్యశక్తిని భౌతిక సంఘటనల రూపంలో జీవితానుభవాలను సృష్టిస్తుంటుంది. ఆత్మ యొక్క చైతన్య పురోగతి బాహ్య ప్రపంచంలోనూ మరి అంతర్ ప్రపంచంలోనూ కొనసాగుతుంటుంది. అట్లే ఆత్మ పురోగతి జాగృదావస్థలోనూ, స్వప్నావస్థలలోనూ కొనసాగుతుంటుంది. జీవాత్మ ఈ భూమి మీదకు జన్మతీసుకున్న క్షణం నుంచి జాగృదావస్థ మరి స్వప్నావస్థలలో చైతన్య పరిణామం చెందుతుంటుంది.

జాగృదావస్థలో ఆత్మ పురోగతి మరి జ్ఞాన సముపార్జన గోరంత అయితే స్వప్నావస్థలో ఆత్మ పురోగతి మరి జ్ఞాన సముపార్జన కొండంత వుంటుంది. కేవలం జాగృదావస్థలోనే జీవితానుభవాలు పొందుతూ, జ్ఞానసముపార్జన జరుగుతుందని భావించడం పొరపాటు. స్వప్నావస్థలో కూడ జాగృదావస్థ కంటే కూడ లక్షలరెట్లు పురోగతి

వుంటుంది. అట్లాగని దేనినీ విస్మరించడానికి వీలు లేదు. దేని ప్రాధాన్యత దానిదే. దేని విశిష్టత దానిదే.

చైతన్యశక్తి సంపూర్ణంగా భౌతిక పదార్థంతో ముడిపడిన భౌతిక సంఘటనలుగా వాస్తవం చెందడం జరగదు. కొండంత చైతన్యశక్తిలో గోరంత పరిమాణం మాత్రమే భౌతిక సంఘటనలుగా వాస్తవం చెంది మీ జీవితానుభవాలుగా ఎదురవుతున్నాయి. మిగతా కొండంత చైతన్యశక్తి అంతర్గతంగా పరిణామం చెందుతుంటుంది. స్థూలంగా చెప్పాలంటే మీ బాహ్య జీవితం గోరంత మరి మీ అంతర్ జీవితం కొండంత! బాహ్య ప్రపంచంలో ఒక జీవితకాలానికి సరిపడా జీవితానుభవాలు + జ్ఞానాన్ని స్వప్నావస్థలో ఒక గంట నిడివిగల కలలలో పొందవచ్చుంటే మీకు స్వప్న ప్రపంచం ఎంత విస్తారమైనదో అర్థమవుతుంది గదా! జాగృదావస్థ మరి స్వప్నావస్థ రెండింటిలోనూ 'సంకల్పాల' వలన కలిగిన ప్రేరణతోనే జీవితానుభవాలు సంభవిస్తుంటాయి.

కేవలం జాగృదావస్థలోని జీవితాన్ని మాత్రమే పరిగణలోనికి తీసుకుంటే మీరు పొందే జీవితానుభవాలు బహుస్వల్పం. జీవితాన్ని మల్టిడైమన్షనల్‌గా పరిగణనలోనికి తీసుకోవాలి. దేహం యొక్క ఆరోగ్య స్థితి జాగృదావస్థలో కంటే స్వప్నావస్థలో వేలరెట్లు మెరుగుపరచబడుతుంది. జాగృదావస్థలో దేహంలో జీవరసాయనిక చర్యలు నెమ్మదిగా జరుగుతుంటాయి ఈ చర్యలు దేహ ఆరోగ్య రక్షణ వ్యవస్థను సంపూర్ణంగా పటిష్టపరచలేవు. స్వప్నావస్థలో దేహంలోని జీవరసాయనిక చర్యలు అతివేగంగా జరుగుతుంటాయి. దేహం శక్తిని + ఉత్తేజాన్ని ఎక్కువగా నిద్రావస్థ మరి స్వప్నావస్థలో పొందుతుంటుంది. అన్ని స్థితులలో సంభవించే జీవితానుభవాలను మైండ్ తన సాధనమైన మెదడు ద్వారా రికార్డు చేసుకుంటుంది. ఈ భూభౌతిక ప్రపంచంలో జీవాత్మ తన జీవితాన్ని కొనసాగిస్తున్నంతకాలం మెదడును ఒక సాధనంగా మైండ్ వినియోగించుకుంటుంది. మనిషికి 'మేధస్సు' మైండ్ ద్వారా సృష్టింపబడుతుంది. మెదడు అనేది 'మేధస్సు'ను సృష్టించ జాలదు.

ఏ కళలోనైనా, శాస్త్రంలోనైనా నిష్ణాతులు కావాలంటే జాగృదావస్థలో పొందే జ్ఞానం ఒక్కటే సరిపోదు. స్వప్నావస్థ నుండి మరి అంతర్ ప్రపంచం నుండి పొందే జ్ఞానం తోడయినపుడు ఆ కళలో లేదా ఆ శాస్త్రంలో నైపుణ్యం పెరుగుతుంది. ఐన్‌స్టీన్ (Einstein) అనే శాస్త్రవేత్త పొందిన జ్ఞానమంతా అతని స్వప్నాల నుండే వచ్చింది.

గణితం మరి భౌతిక శాస్త్రాలలో ఐన్‌స్టీన్ గొప్ప మేధావి కాదు. కాని అపరిమిత జ్ఞానం అతనికి స్వప్నాల ద్వారా, సమాధిస్థితి ద్వారా లభించింది. భౌతిక సంఘటనలను వాస్తవం చెందించడంలో మెదడును సంపూర్ణంగా వినియోగించుకుంటుంది మనోశక్తి.

స్వప్నాలు కేవలం మానసిక మైనవి కావు. బాహ్యప్రపంచంలో అంటే త్రీ డైమన్షనల్ తలంలో భౌతికసంఘటనలు, భౌతిక వస్తువులను ఎలా సృష్టిచేస్తున్నారో అదే మాదిరిగా స్వప్నావస్థలో కూడ భౌతిక సంఘటనలు, భౌతిక వస్తువులను సృష్టిస్తున్నారు. స్వప్నావస్థలో భౌతిక సంఘటనల డైమన్షన్స్ వేరేగా వుంటాయి. స్వప్నావస్థలోని సంఘటనలను కూడ భౌతిక సంఘటనలుగా అభివర్ణించాల్సి వస్తుంది. ఎంచేతంటే జాగృదావస్థ మరి స్వప్నావస్థలలో సంభవించే భౌతిక సంఘటనల స్వరూపం – స్వభావం ఒకే విధంగా వుంటుంది. కాకపోతే జాగృదావస్థలోని భౌతిక సంఘటనలు చైతన్యశక్తి సంయోగంలో భౌతిక పదార్థంతో ముడిపడి వుంటాయి. మరి స్వప్నావస్థలో పదార్థం యొక్క స్వరూపం – స్వభావం ఇతర డైమన్షన్స్ పరంగా వేరే ప్రామాణికతలు కలిగి వుంటుంది.

భూభౌతిక ప్రపంచంలో నిద్ర మరి స్వప్నావస్థ లేకుండా జీవాత్మలు జీవితాన్ని కొనసాగించలేవు. భౌతిక దేహం వున్నంత వరకూ జీవాత్మకు అంతర్ ప్రపంచంతో అనుసంధానం కలుగజేసి మిమ్మల్ని భౌతిక ప్రపంచంలో కొనసాగేట్లు చెయ్యడంలో 'నిద్ర' తన కర్తవ్యాన్ని నిర్వహిస్తుంది. నిద్ర అనే స్థితి లేకుండా ఏ జీవాత్మ కూడ త్రి డైమన్షనల్ తలం గల భౌతిక ప్రపంచంలో జీవించడం అనేది జరగదు. ఇతర లోకాలతో అనుసంధానం, ఇతర లోకాల నుండి జ్ఞానసముపార్జన, శక్తి సముపార్జన అంతా కూడ స్వప్నాల ద్వారా జరుగుతూంది. మీ మేధస్సును స్వప్నాలు విస్తరింపజేస్తున్నాయి. జాగృదావస్థలో మీ సమస్యలకు, మీ సందేహాలకు స్వప్నాల ద్వారా సందేశాలు అందుతున్నాయి. స్వప్నాల ద్వారా జాగృదావస్థకు సంబంధించిన భౌతిక జీవితం యొక్క భవిష్యద్దర్శనం కూడ జరుగుతుంది.

అంతర్‌ప్రపంచం యొక్క అపరిమిత శక్తిని, అనంతమైన ఇంటెలిజెన్స్‌ను (infinite intelligence) మీ యొక్క త్రీ డైమన్షనల్ ఇంటెలిజెన్స్ (three dimensional intelligence) పసిగట్టలేదు. మీ సంకల్పాలకు, అభీష్టాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచం లోనికి భౌతిక సంఘటనలు + భౌతిక

వస్తువులు సృష్టింపబడి వాస్తవం చెందుతూన్న మెకానిజమ్స్ (mechanism) మీ అంతరేంద్రియాలకు (Inner Senses) మాత్రమే తెలుస్తుంది. ఆ మెకానిజమ్స్‌ను మీ త్రీడైమన్షనల్ ఇంటెలిజెన్స్‌కు తెలిసే అవకాశమే లేదు.

మీ జీవితంలో ఏది కావాలి? అని స్పష్టంగా తెలుసుకోగలిగితే చాలు. మిగతా పనిని మీ అంతర్ ప్రపంచం చూసుకుంటుంది. మీ సంకల్పాలు, ఆకాంక్షలు, కోరికలు అన్నీ ఆలోచనల రూపంలో మీ మైండ్ నుండి వెలువడుతున్నాయి. ప్రతి ఆలోచన కూడ ఈ విశ్వంలో గల ఏదైనా ఒక తలంలోనికి ప్రవేశించి అక్కడ వాస్తవం పొందుతుంది. ఆలోచనలు అనేవి విద్యుదయస్కాంత తరంగాలతో కూడిన శక్తి అని మీరు తెలుసుకోవాలి. మీ జీవిత లక్ష్యమేమిటో మీకు స్పష్టంగా తెలియాలి. ఆ స్పష్టత వల్ల మీ అంతర్ ప్రపంచంలోని శక్తులకు ప్రేరణ కలుగ జేయబడుతుంది.

మీ ప్రామాణికత ప్రకారంగా గల ఇంటెలిజెన్స్ ఈ సకల చరాచర సృష్టిని నడిపించడం లేదు. అనంతమైన ఇంటెలిజెన్స్ అనేది అన్ని జీవాత్మల అంతర్ ప్రపంచంలో వుంటూ ఈ సకల చరాచర సృష్టిని నడిపిస్తూంది. ఆ అనంతమైన ఇంటెలిజెన్స్ – మీ భూమిని సూర్యుని చుట్టూ పరిభ్రమించేట్లు చేస్తూంది; సూర్యగోళం మరి ఇతర గెలాక్సీల నుండి కాంతిని విశ్వమంతా వ్యాపింపజేస్తూంది; విత్తనం మహావృక్షంగా పరిణామం చెందిస్తూంది; మీరు భుజించిన ఆహారాన్ని జీవ రసాయనిక శక్తిగా రూపాంతరం చెందిస్తూంది; ఆధ్యాత్మిక శక్తి రూపాంతరం చెంది సమస్త జీవజాతులనూ కలిసి వుండేటట్లు చేస్తుంది.

మీ ఆధ్యాత్మిక ప్రగతికి గాని, మీ చైతన్య పరిణామానికి గాని మీరే సంకల్పించుకుని పూనుకోవాలి ఈ భూమి మీద వున్న రాళ్ళు, కొండలు, పర్వతాలు, నదులు, సెలయేళ్ళు, గడ్డిమొక్కలు, వృక్షాలు, అడవులు, ఖనిజాలు, క్రిమికీటకాలు, జంతువులు, మానవజాతి... సమస్త ప్రకృతీ అన్నీ మీకు సహకరిస్తున్నాయి. మీరు ఆత్మన్యూనతతో, దైన్యంతో, గిల్టీతో, అయోమయంతో జీవించనక్కర లేదు. మీకు ఏది కావాలో స్పష్టంగా తెలుసుకుని ఊహాశక్తి + ఎమోషన్స్ + ఫీలింగ్ + విశ్వాసం కలిగి వుంటే చాలు. మీ అంతర్ ప్రపంచం అన్నీ తానై మీ వాస్తవాన్ని సృష్టిస్తుంది. దీనికోసం గొప్ప తెలివి తేటలుగాని, గొప్ప పదవులుగాని అవసరం లేదు.

మీరు చేయవలసిందల్లా – ఆధ్యాత్మికతను, మనోవికాసాన్ని, జ్ఞానాన్ని

పెంచుకోవాలనే సంకల్పాలు కలిగి వుండడమే. ఇవి గనుక పెరిగితే అత్యద్భుతమైన లక్ష్యాలను ఎంచుకునే శక్తియుక్తులు మీకు పెరుగుతాయి. **మీ ఆధ్యాత్మిక ప్రగతికి ఏ పురుషుడి ముందుగాని, ఏ స్త్రీ ముందుగాని, ఏ ఆధ్యాత్మిక గురువు ముందుగాని, ఏ దేవుడి ముందుగాని తలవంచుకుని మోకరిల్లి అభ్యర్థించనక్కర లేదు. ఎప్పుడూ తలెత్తుకుని జీవించండి. మీకు ఎవరైనా సహాయసహకారాలు అందిస్తున్నారంటే వాళ్ళు తమను ఔన్నత్య పరచుకోవడానికేగాని మిమ్మల్ని ఉద్ధరించడానికి కాదు. అలాగే మీరూ ఇతరులకు సహాయసహకారాలు అందిస్తున్నారంటే మిమ్మల్ని మీరు ఔన్నత్య పరచుకోవడానికేనని తెలుసుకోండి. సఖ్యత, సహాయసహకారాలు అనేవి సకల చరాచర సృష్టిలోని జీవాత్మలన్నింటి మధ్యా వున్నాయి.**

మీ సహజ ప్రవృత్తిలోనే ఆధ్యాత్మిక పురోగతి చెందుతూ సర్వజీవాత్మలనూ వాటి వాటి సహజస్థితులతో స్వేచ్ఛగా ఆధ్యాత్మిక పురోగతి సాధించడానికి మీ సహాయ సహకారాలను అందించడమే నిజమైన ఆధ్యాత్మికత! సకల మానవజాతి అఖండ మనోవికాసాన్ని పొందుగాక!

ఆత్మ
(SOUL)

ఆత్మశక్తికి పరిమితులు లేవు. దానికి గల శక్తి అనంతం. ఆత్మ అనేది ఒక పదార్థం కాదు. మీరు ఆత్మను కలిగి వున్నారు అని చెప్పడం కంటే మీరే ఆత్మ అయివున్నారు అనడం సబబుగా వుంటుంది. ఆత్మ నిత్యనూతనమైనది, సనాతనమైనది, నిరంతరం పరిణామం చెందుతూ పురోగమిస్తున్నది. మీ భౌతిక ప్రపంచంలో ఎలక్ట్రానులు, పరమాణువులు, అణువులు, మూలకాలు, ఖనిజాలు, రాళ్ళు, ఏకకణజీవులు, క్రిములు, కీటకాలు, చెట్లు, జంతువులు, మానవులు ఇలా రకరకాల రూపాలను ఆత్మ తీసుకోగలదు. ఈ విశ్వంలో కోటానుకోట్ల లోకాలున్నాయి. ఈ విశ్వమంతా మూలచైతన్యం నుంచి ఆవిర్భవించింది. మూలచైతన్యం నుండి ఆవిర్భవించిన ఆత్మశకలాలు కోటానుకోట్ల లోకాలలో వివిధ భౌతిక రూపాలు తీసుకుని చైతన్యపరిణామం చెందుతున్నాయి. ఆయా లోకాల్లోని శక్తి యొక్క ఫ్రీక్వెన్సీ స్థాయి, అక్కడవున్న మూలకాలను అనుసరించి ఈ ఆత్మ శకలాలు వివిధ భౌతిక రూపాలను తీసుకోవడం జరుగుతుంది. భూమ్మీద ప్రవేశిస్తున్న ఆత్మ శకలాలు, మూలకాలు, ఏకకణ జీవినుండి మనిషి వరకు కోటానుకోట్ల జీవరాశులుగా జన్మ తీసుకుంటున్నాయి. ప్రతి ఆత్మ శకలమూ ప్రత్యేకమైనదే. ఏదీ ఇంకొక దానికి తీసిపోదు. దేని చైతన్య పరిణామం దానిదే. అన్నీ కూడ చైతన్య పరిణామం, ఆత్మ పరిణామం, జ్ఞానపరిణామం, మరి శక్తి పరిణామం చెందుతూ ఒకలోకం నుండి ఇంకో లోకానికి ప్రయాణిస్తూ వుంటాయి. ఇలా ఒక లోకంలోకి ప్రవేశించిన ఆత్మ అక్కడ వున్న జ్ఞానాన్నంతా పొందడానికి అనేకానేక జీవరాశులుగా జన్మ తీసుకుని ఒకమెట్టు తర్వాత మరోమెట్టు చైతన్య పరిణామం చెందుతూ ఉంటుంది. ఈ చైతన్య పరిణామంలో ఒక జన్మ తీసుకున్న తర్వాత మరో జన్మ తీసుకోవడానికి అదే లోకం ఎంచుకోవచ్చు లేదా ఇంకోలోకం ఎంచుకోవచ్చు. అంతేగాని ఫలానా లోకానికి మళ్ళీ తిరిగి వెళ్ళాలని నిబంధన ఏదీ వుండదు. ఆత్మశక్తికి ఏ లోకాన్నైనా, ఏ జీవరాశిగానైనా, ఏ భౌతిక రూపాన్నైనా ఎంచుకోగల సర్వ స్వతంత్రత కలిగి వుంది.

ఒకే శక్తి స్థాయిలో గల చైతన్య శక్తుల ఫ్రీక్వెన్సీస్థాయిగల లోకాలలో నేర్చుకోవాల్సిన

పాఠాలన్నీ నేర్చుకున్న తర్వాత మరింత ఉన్నత లోకానికి ఈ ఆత్మ శకలం ప్రయాణంచేసి అక్కడ ఒక ప్రాణిగా ఆవిర్భవించి, అక్కడ పరిస్థితుల కనుగుణమైన భౌతిక రూపం (దేహం) తీసుకుంటుంది. ఇక్కడ నేర్చుకోవాల్సిన పాఠాలంటే– జన్మ తీసుకున్న లోకంలో చైతన్య పరిణామం ఆత్మశక్తి పరిణామం జ్ఞాన పరిణామం సంపూర్తిగా పొందడమన్నమాట. ఈ పరిణామాలు ఆ లోకంలో సంపూర్ణంగా పొందిన తర్వాత మరో ఉన్నత లోకానికి ఆత్మశకలం ప్రయాణం చేస్తుంది. ఈ ప్రయాణం అనంతంగా సాగుతూనే వుంటుంది. ఈ ప్రయాణం ఎక్కడా ముగిసిపోదు. ఏ ఆత్మ కూడ దేంట్లోనూ లీనమైపోవడం జరగదు. మీరనుకున్నట్లుగా ఈ ఆత్మ భూమి నుండి నిష్క్రమించిన తర్వాత పరమాత్మలో లీనమైపోవడం జరగదు. ఈ విశ్వంలోని కోటానుకోట్ల లోకాలు, వాటిలో ఆవిర్భవించిన జీవరాశులు అన్నింటిలోనూ వున్నదే పరమాత్మ (All That Is). ఆ మూలచైతన్యశక్తియే పరమాత్మగా పిలవబడుతుంది.

ఒక బుద్ధుడు, ఒక జీసస్ లేదా మీరు చెప్పుకునే దేవుళ్ళు అందరూ కూడ చైతన్య పరిణామం చెందుతున్న ఆత్మశకలాలే. వాళ్ళంతా మీ భూమ్మీద జన్మ తీసుకుని సంపూర్తిగా చైతన్య పరిణామం, ఆత్మపరిణామం చెంది, ఉన్నత లోకాలకు వెళ్ళి అక్కడ కూడ పరిణామం చెందుతూ కోటానుకోట్ల ఉన్నత లోకాలకు ప్రయాణం సాగిస్తున్నవారే! బుద్ధుడు ఆత్మచైతన్య పరిణామం తాలుకు సవాళ్ళను ఎంచుకుని ఒకానొక ఉన్నతలోకంలో చైతన్య వికాసం చెందుతున్నాడు. జీసస్ కూడ ఒకానొక ఉన్నత లోకంలో చైతన్య వికాసం చెందుతున్నాడు. కృష్ణ, శివ, జొరాస్టర్, మహమ్మద్, లావోట్జు ఇలా అందరూ ఆయా ఉన్నత లోకాలలో ఆత్మ చైతన్య పరిణామం చెందుతూ వున్నారు. **ఇది నిరంతరమూ సాగే పరిణామం. అంతేగాని ఏ ఆత్మకూడ అనంత చైతన్యశక్తిలో లీనమైపోవడం లేదు. ఈ విశ్వంలో గల కోటానుకోట్ల లోకాలలో ఎక్కడికెళ్ళినా ఏ ఆత్మ కూడ తన ఉనికిని కోల్పోవడం జరగదు.** ఎన్నోలోకాలు, ఎన్నో జన్మలు, ఎన్నో జీవరాశులుగా ప్రతి ఆత్మ అనంతానంత కాలం ప్రయాణిస్తూ వుంటుంది. అంతే గాని ముగింపు ఎక్కడా లేదు. ఆత్మకు ప్రారంభమూ లేదు, ముగింపూ లేదు. **అది ఒక అనంతకాల ప్రయాణం! అది ఒక అనంత ఆత్మ చైతన్యశక్తి పరిణామవ్యాకోచం!**

ఆత్మ నిరంతరం అభివృద్ధి చెందుతూనే వుంటుంది. చైతన్య పరిణామం చెందడం కోసం ఆయా లోకాలలో పరిస్థితులను బట్టి భౌతిక రూపాలు తీసుకుంటుంది. ఆ భౌతిక రూపాలు మీ కంటికి గోచరం కావచ్చు, కాకపోవచ్చు. ఆత్మ చైతన్య పరిణామం

కాలానికి, దూరానికి సంబంధించింది కాదు. అది మల్టి డైమన్షనల్‌గా వుంటుంది. అంటే దాని చైతన్య పరిణామం అనేక కోణాలలో వుంటుంది. ఈ పరిణామం ఎలా జరుగుతుందనేది మీ అంతర్ ప్రపంచానికి చాల బాగా తెలుసు. ఇదేమీ అంతుచిక్కని నిగూఢ రహస్యమేమీ కాదు. భూమ్మీద మీకుగల పరిమిత జ్ఞానం వల్ల ఆత్మ యొక్క అపరిమిత శక్తిని తెలుసుకోలేకపోతున్నారు. భౌతికదేహంతో మీరు జన్మ తీసుకున్నారంటే దానర్థం ఆత్మ చైతన్య పరిణామం కోసమేనని మీరు గుర్తుంచుకోవాలి. ఎన్నో జన్మలలో ఎన్నెన్నో అనుభవాలు పొందుతూ, ఎంతో జ్ఞానాన్ని, చైతన్య వికాసాన్ని పొందుతూ వస్తున్నారు మీరు. ప్రతి జన్మలోను మీరు చైతన్యశక్తి పరంగా ఎంతో పురోభివృద్ధి సాధిస్తూ వస్తున్నారు.

మీ భౌతిక దేహంలో కొన్నికోట్ల జీవకణాలు ఉన్నాయి. వీటన్నింటి సముదాయమే మీ దేహం. ప్రతి జీవకణానికి చైతన్యశక్తి వుంది. ప్రతి జీవకణమూ చైతన్య పరిణామం చెందుతూ దేహం యొక్క సమిష్టి చైతన్య పరిణామానికి తోడ్పాటునందిస్తూ వుంటుంది. జీవకణానికి లక్ష్యము, దేహానికి లక్ష్యం, దేహాన్ని ఆవరించివున్న ఆత్మకు లక్ష్యం ఒక దానికొకటి సమ్మేళనం చెంది ఆత్మశక్తి చైతన్య పరిణామం చెందుతుంటుంది.

ఆత్మ అనేది ఒక సృష్టికర్త. దీన్ని అనేక కోణాలలో మనం అర్థం చేసుకోవచ్చు. చైతన్యశక్తిని కేంద్రీకరించడం ద్వారా మీరు కోరుకున్న రీతిలోనే భౌతిక దేహం తీసుకున్నారు. దేహం విద్యుదయస్కాంత శక్తి + జీవరసాయనిక శక్తి తో నిండి వుంది. భూమ్మీద మూలకాలన్నింటి చేత, భూభౌతిక పరిస్థితులకనుగుణంగా మీ దేహం నిర్మింపబడివుంది. దేహమంటే మాంసపు ముద్ద అని కాదు. అది విద్యుదయస్కాంత జీవరసాయనిక పదార్థంతో నిర్మింపబడిన ఆత్మ చైతన్యశకలం. భూమ్మీద జీవరాశులన్నీ అదే విద్యుదయస్కాంత జీవరసాయనికశక్తి గల దేహాలను తీసుకుని చైతన్యపరిణామం చెందుతున్నాయి. పరమాణువు నుండి రాయి, ఏకకణ జీవి, జంతువు, మనిషి, భూమి వరకు అన్నింటిలోను అదే శక్తి నిండివుంది. మీకు ఆత్మ వున్నట్లే రాయికి ఆత్మ వుంది. భూమికి ఆత్మ వుంది. భూమి + భూమ్మీద వున్న సమస్త ప్రాణికోటి సమిష్టిగా చైతన్యపరిణామం చెందుతున్నారు. సమస్త జీవజాతుల చైతన్య పరిణామాలు ఒకదానికొకటి ముడిపడి వున్నాయి. ఒక జీవజాతి చైతన్య పరిణామం ఇంకో జాతి చైతన్య పరిణామంతో పరస్పరం దోహదపడుతూ అభివృద్ధి చెందుతున్నాయి. ఆ విధంగా మానవజాతి చైతన్య పరిణామానికి సమస్త జీవకోటి (All species) సహాయం చేస్తున్నాయి. మానవజాతి

ఒక్కటే భూమ్మీద ప్రత్యేకత కలిగి వుండటం లేదు. ఆత్మ చైతన్య పరిణామానికి భూమ్మీద మనిషి ఎంత ముఖ్యమో, ఎలక్ట్రాను కూడ అంతే ముఖ్యం; చీమ అంతే ముఖ్యం; రాయి అంతే ముఖ్యం; పక్షి అంతే ముఖ్యం; జంతువు అంతే ముఖ్యం. **ఇక్కడ అన్ని జీవరాశులూ ముఖ్యమే!** ఏ జీవజాతినీ విస్మరించడానికి వీలులేదు. క్రిములు, కీటకాలు, వృక్షాలు, పక్షులు, జంతువులు, మనుషులు ఇలా అన్ని జాతుల మనుగడ మరి చైతన్య వికాసం పరస్పరం ఒక దానిపై ఇంకొకటి ఆధారపడివున్నాయి. భూమ్మీద ఏదైనా ఒక జాతి నిష్క్రమిస్తే మిగతా జాతులు కూడ నిష్క్రమిస్తాయి.

* * *

మీ ఆత్మశక్తి దానికిగల అనంతమైన శక్తిని, మరి మీ వాస్తవాన్ని మీరు తప్ప వేరెవ్వరూ అంచనా వెయ్యలేరు. మత ప్రవక్త, మనస్తత్వ శాస్త్రవేత్త, భౌతిక శాస్త్రవేత్త, మతగురువు, తత్వవేత్త వీళ్ళెవ్వరూ మీ అంతర్ ప్రపంచాన్ని అర్థం చేసుకోలేరు. ఎవరి అంతర్ ప్రపంచం వారిదే. ఎవరి ఆత్మ చైతన్య పరిణామం వారిదే. ఎవరూ తక్కువ గాదు. ఆత్మశక్తిని, అంతర్ ప్రపంచాన్ని నిర్వచించ వీలులేదు. ఆత్మశక్తి సృజింపబడదు; దర్శించబడదు; ఆదిమధ్యాంత రహితం. మరణానంతరం కూడ చైతన్యశక్తి పరిణామం జరుగుతూనే వుంటుంది. అనంత చైతన్యశక్తి మీ ద్వారా పరిణామం చెందుతూంది. అట్లాగే ఈ అనంత చైతన్యశక్తి విశ్వమంతా అన్ని జీవరాశులలో వుండి పరిణామం చెందుతూంది (evolution of consciousness). ప్రతి ఆత్మ శకలమూ చైతన్య పరిణామం చెందుతూ ఎక్కడా దాని ఉనికి కోల్పోకుండా అనంతకాలం ప్రయాణిస్తూనే వుంటుంది. ఈ విశ్వంలో మీ ఉనికి ఎప్పటికీ నిలిచి వుంటుంది. ఎల్లప్పుడూ చైతన్య పరిణామం చెందుతూనే వుంటారు. ఈ చైతన్య పరిణామం ఎక్కడా ఆగిపోదు. ఏ అనంత బ్రహ్మాండంలోనూ లీనమైపోవడం జరగనే జరగదు. అట్లా జరిగేటట్లయితే మీ ప్రపంచం వుండేది కాదు. మూలచైతన్యశక్తి నుండి వెలువడిన కోటానుకోట్ల ఆత్మ శకలాలు వేటికవి సొంత వ్యక్తిత్వాలు కలిగి వుండి, సొంత లక్ష్యాలు నిర్దేశించుకుని పరిణామం చెందుతుంటాయి. మూలచైతన్యశక్తి, ఆత్మశక్తి యొక్క చైతన్య పరిణామం + లక్ష్యాలలో జోక్యం చేసుకోదు. లక్ష్యం నిర్దేశం చెయ్యడం జరగదు.

త్రి డైమన్షనల్ (మూడు తలాలు) (three dimensions) వాస్తవికత గల భూమ్మీద ఆత్మ అహం (ego) చేత కప్పబడి వుంది. అందువల్ల మీ ఆలోచన విధానం ఎన్నో

పరిమితులకు లోబడివుంది. అంతర్ ప్రయాణం ద్వారా ఆ పరిమితులను చేధించగలిగినట్లయితే మీ ఆత్మ ఈ భూమ్మీద మాత్రమే పరిమితం కాలేదని ఇతర లోకాలలో, ఇతర డైమన్షన్స్‌లో కూడ అది తన ఉనికిని కలిగివుండి చైతన్య పరిణామం చెందుతూ వుందని గ్రహిస్తారు. ఆత్మ మూలచైతన్యశక్తిలోని ఒక భాగం మాత్రమేనని గ్రహిస్తారు. మీ చైతన్య పరిణామమే మూలచైతన్యపరిణామం! మూలచైతన్య పరిణామమే మీ పరిణామం! మీరు అంతర్ ప్రయాణం ద్వారా ఆత్మకుగల అపరిమిత శక్తిని తెలుసుకోగలుగుతారు. మీ అంతర్ ప్రపంచం అనంతమైనది. బాహ్యంగా మీరు చూసినపుడు కోటానుకోట్ల గెలాక్సీలు, కోటానుకోట్ల నక్షత్రాలు కన్పిస్తాయి. ఇదంతా బాహ్య విశ్వం. ఈ బాహ్య విశ్వమంతటా కోటానుకోట్ల లోకాలు వున్నాయి. **మీ దేహానికి బాహ్యంగా అనంతమైన విశ్వం ఎంత వుందో మీ అంతర్ ప్రపంచంలో కూడ అంతే విశ్వం ఇమిడి వుంది.** మీ అంతర్ ప్రపంచంలో కోటానుకోట్ల లోకాలు వున్నాయి. వాటన్నింటిని పరిశోధించి చైతన్య పరిణామం చెందగల శక్తి సామర్థ్యాలు మీలో వున్నాయి. ఈ విశ్వంలో దేన్నైనా సృష్టించగల శక్తి మీ ఆత్మకు వుంది. మీరు తీసుకున్న ఈ దేహం మీ ఆత్మశక్తి సృష్టించుకున్నదే. భూమ్మీద నిర్దేశిత అనుభూతులు పొంది ఆత్మ చైతన్య పరిణామం చెందడం కోసం దేహాన్ని ఎంచుకుని భూమ్మీద జన్మ తీసుకున్నారు. అనంత సుదూర ప్రయాణంలో భూమి ఒకానొక విడిది మాత్రమే. జన్మ తీసుకోక మునుపు ఎన్నో లోకాలలో విడిది చేసి వచ్చారు. ఆయా లోకాలలో అనుభవాలు పొంది చైతన్య పరిణామం చెందుతూ జ్ఞాన సముపార్జన కావించుకుంటూ వచ్చారు. మరణాంతరం మళ్ళీ మీ ప్రయాణం అనంత సుదూరం! **మీ ఆత్మశక్తి గురించి మీ అంతర్ ప్రపంచం గురించి మీకు తెలిసింది నీటి బొట్టంత పరిమాణమే. మీకింకా తెలుసుకోవలసింది మహా సముద్రమంత వుంది.**

ఆత్మశక్తికిగల చైతన్యశక్తి వికాసం దేహానికి మాత్రమే పరిమితమైనది కాదు. ఆత్మశక్తి విశ్వమంతా వ్యాపించి వుంది. దాని ఒకానొక శకలం మీలో పరిణామం చెందుతూవుంది. ఆత్మశక్తిని ఒక నమూనాలో నిర్వచించడం అసాధ్యం. ఆత్మ – ఆధ్యాత్మిక, భౌతిక, మానసిక, విద్యుదయస్కాంత, జీవరసాయన ధర్మాలను కలిగివుంది. లక్ష్యాలను నిర్దేశించుకుని చైతన్యపరిణామం చెందడం కోసం ఒక ప్రాణిగా భూమ్మీద జన్మ తీసుకోవడం జరుగుతుంది. మీరు భూమ్మీద జన్మ తీసుకున్నపుడే చైతన్య పరిణామం సర్వతోముఖాభివృద్ధి చెందడం కోసం సర్వశక్తి సామర్థ్యాలు ఇముడ్చుకుని వచ్చారు. మీ

దేహానికిగాని, మీ అంతర్ ప్రపంచానికి గాని ఎటువంటి అస్పష్టత లేదు. పరిమితు లేర్పరుచుకున్న మీ ఆలోచనా విధానంలో అస్పష్టత వుంది.

మీ అంతర్ ప్రపంచం మీ ఆత్మశక్తిలో అంతర్భాగం. భౌతిక పదార్థం, భౌతిక ప్రపంచం, భౌతిక సంఘటనలు ఆత్మశక్తి ద్వారా సృష్టింపబడినాయి. మీ అంతర్ ప్రపంచంలో ఏదైతే కలలుగన్నారో అది బాహ్యప్రపంచంలో భౌతిక పదార్థంగా, భౌతిక సంఘటనగా, భౌతిక ప్రపంచంగా రూపాంతరం చెంది వాస్తవమైంది. అంతర్ శక్తి రూపాంతరం చెంది బాహ్య ప్రపంచంలో భౌతిక పదార్థంగా మారింది. ఈ శక్తి రూపాంతరంలో జరిగే ప్రక్రియలను మీరు క్షుణ్ణంగా తెలుసుకోగలిగితే మీలో చైతన్యశక్తి పరిణామాభివృద్ధి వేగంగా జరుగుతుంది. మీ జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటన మీ అంతర్ శక్తి నుండి ఉద్భవిస్తున్నది. అంతకు మించి ఎటువంటి రహస్యమూ లేదు. భూమ్మీద శక్తి పదార్థంగాను, పదార్థం శక్తిగాను రూపాంతరం చెందే అంతర్గత ప్రక్రియలను గ్రహిస్తే మీరు ఏది కావాలంటే అది సృష్టించుకుని (create) మీ జీవితంలో వాస్తవాలను అనుభూతి చెందుతారు. ఆలోచనలు, భావనలను భౌతిక పదార్థంగా, భౌతిక సంఘటనగా మరల్చగల శక్తి మీ ఆత్మశక్తికి స్వతహాగా వుంది. మీ అంతర్ ప్రపంచంలో ఆలోచనలే బాహ్య ప్రపంచంలో భౌతిక సంఘటనలుగా వాస్తవ రూపం పొందుతున్నాయి. మీ రోజువారి జీవితం కూడ మీ ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా రూపుదిద్దు కుంటూంది.

అంతర్‌శక్తిని సద్వినియోగపర్చుకొని జీవితాన్ని అనుక్షణం ఆనందమయంగా మలుచుకోవడానికి అద్భుతమైన అవకాశం ఇవాళ మానవజాతికి ఇవ్వబడింది. అతివేగంగా చైతన్య పరిణామం చెందడానికి అనువైన వాతావరణం అవకాశాలూ ఇప్పుడు పుష్కలంగా వున్నాయి. మీరు ఎంచుకున్న భౌతిక దేహం, దీని జెనెటిక్ నిర్మాణం అంతా కూడా భూభౌతిక ప్రపంచంలో ఏ సవాలునైనా ఎదుర్కొనే విధంగా శక్తిసామర్థ్యాలు కలిగి వుంది. అంతర్ ప్రపంచాన్ని, జీవప్రక్రియలను, ప్రాణశక్తిని, విశ్వశక్తిని సంపూర్ణంగా వినియోగించుకునేందుకు అనుగుణంగా మీ దేహంలోని జీవకణాలు జెనెటిక్ నిర్మాణాన్ని కలిగి వున్నాయి. మీ దేహమంతా చైతన్య పదార్థంతో ఆవరింపబడివుంది. భూమికి, సూర్యునికి మధ్య వున్న ఖాళీ ప్రదేశాన్ని చైతన్యశక్తి ఆవరించి వాటి మధ్య ఆకర్షణ శక్తి కలిగించిన విధంగా మీ దేహంలోని ప్రతి పరమాణువులోను కేంద్రకానికి ఎలక్ట్రానులకు మధ్య సాపేక్షంగా అంతే ఖాళీ ప్రదేశం కలిగి వుండి, చైతన్య పదార్థంతో ఆవరింపబడి

వున్నది. సూర్యునికి భూమికి మధ్య ఎంత దూరం వుందో సాపేక్షంగా మీ దేహంలోని పరమాణువులో కేంద్రకానికి ఎలక్ట్రానులకు మధ్య అంతే దూరం వుంది. మీ దేహమంతా పరమాణువులమయమై చైతన్యశక్తిచే ఆవరింపబడివుంది. దేహమంతా పరమాణువుల సముదాయం. మీ దేహం, భూమి మరి భూమి మీద జీవరాశులన్నింటిలోను గల జీవరసాయనిక పదార్థం ఒకే సారూప్యత కలిగి వుంది. కోట్ల సంవత్సరాల తరబడి వుంటూ వస్తున్న మీ పూర్వీకుల జ్ఞానమంతా మీ దేహంలోని జీవకణాలలో నిక్షిప్తమై వుంది. ప్రతి జీవకణమూ ఎంతో జ్ఞానాన్ని భద్రపరుచుకుని పరిణామం చెందుతూవుంది. అంతర్ ప్రయాణంద్వారా మీరు ఆ జ్ఞానాన్ని పొందవచ్చు. ప్రతి జీవకణం కూడ దేహమంతా జరుగుతున్న జీవరసాయనిక చర్య (bio-chemical reaction) పట్ల ఎంతో ఎరుకత కలిగి వుంటుంది. మీ మైండ్ నుంచి వెలువడే ప్రతి ఆలోచనా తరంగానికి, భావనకు, ఉద్వేగానికి మీ దేహంలోని జీవకణాలు ప్రతిస్పందించి (react) సహకరిస్తాయి. మానవ జెనెటిక్ నిర్మాణానికి, భూమ్మీద ఇతర జీవజాతుల జెనెటిక్ నిర్మాణానికి మధ్య ఇచ్చిపుచ్చుకునే పద్ధతిలో చైతన్య పరిణామం జరుగుతూంది. మీరు జీవజాతుల చైతన్యపరిణామానికి తోడ్పాటునందిస్తే, జీవజాతులు మానవచైతన్య పరిణామానికి తోడ్పాటునందిస్తాయి. ప్రతి ఆత్మ శకలమూ తన పరిణామానికి కావలసిన భౌతిక దేహాన్ని ఎంచుకుని జీవితమనే గేమ్‌ను (game) ఒక సవాలుగా స్వీకరిస్తుంది. ప్రతి ఆత్మశకలానికి జీవితం ఒక గేమ్‌లాగ వుంటుంది. ఒక లోకంలో కొన్ని లక్ష్యాలను ఎన్నుకుని, వాటిని సాఫల్యం చేసుకోవడం కోసం ఆత్మ శకలాలు భౌతిక దేహాలను తీసుకుంటాయి. మరి ఆ లోకంలో ప్రవేశించిన తర్వాత అంటే జన్మ తీసుకున్న తర్వాత తమకున్న శక్తి సామర్థ్యాలను ఉపయోగించి చైతన్య పురోభివృద్ధి చెందుతూ విశ్వచైతన్య పురోభివృద్ధిని పెంచుతుంది.

ఇక్కడ వున్న మానవజాతి భూభౌతిక పదార్థంతో మారిన జీవరసాయనిక శక్తిని ఎంచుకుని దేహాలను తీసుకోవడం జరిగింది. అట్లాగే ఇతర జీవజాతులు కూడ భూభౌతిక జీవరసాయనిక శక్తిని తీసుకుని దేహాలను తీసుకున్నాయి. మానవజాతి ఎంచుకున్న చైతన్య పరిణామం తాలూకు లక్ష్యాలకు అనుగుణంగా దేహనిర్మాణం జరిగింది. దేహంలోని క్రోమోజోమ్‌లు అందుకనుగుణంగానే సృష్టించబడినాయి.

ఇతర గ్రహాంతరవాసులు, లేదా ఇతర గెలాక్సీలలోని నక్షత్రవాసులు భూమి మీద జీవజాతులతో సంపర్కం చెందడం ద్వారా మానవ దేహాలు సృష్టింపబడ లేదు.

భూమి మీద చైతన్య పరిణామానికి అనుగుణంగా భూభౌతిక జీవ రసాయనిక శక్తి, విద్యుదయస్కాంత శక్తి సంయోగంతో మానవదేహం నిర్మాణం జరిగింది. **మూలచైతన్యం నుండి వెలువడిన ఆత్మశకలాలు మానవ దేహం తీసుకుని టఫీమని ఊడి పడినట్లు భూమి మీద ప్రవేశించాయి.** ఇతర జీవజాతులు కూడ ఈ భూమి మీద చైతన్య పరిణామానికి అనుగుణంగా రకరకాలుగా దేహ ఆకృతులను తీసుకుని టఫీ మని భూమి మీద ఊడిపడినాయి. భూమి మీద ఒక దేహ ఆకృతిని తీసుకున్న జీవజాతి మనుగడ కొన్ని కోట్ల సంవత్సరాల తరబడి వుంటుంది. ఫలానా దేహ ఆకృతి ద్వారా చైతన్య పరిణామం ఇక భూమి మీద అవసరం లేదనుకున్నపుడు ఆ జీవజాతి భూమి మీద నుండి నిష్క్రమించి ఇంకో లోకం లోనికి ప్రయాణం చేస్తుంది. అక్కడ ఆ లోకానికి అనుగుణంగా దేహాన్ని ఏర్పరుచుకొని చైతన్య పరిణామం చెందుతుంది.

ఇపుడు మీరు కల్గివున్న మానవదేహం ప్రత్యేకంగా ఎంచుకుని ఆత్మచైతన్య పరిణామం కోసం భూమి మీద సృష్టించబడింది. డార్విన్ అనే శాస్త్రవేత్త సిద్ధాంతీకరించినట్లు కోతి నుండి మానవ దేహం ఉద్భవించిందనేది అసత్యం. **మనిషి మనిషిగానే పుట్టాడు. పక్షి పక్షిగానే పుట్టింది. జంతువు జంతువుగానే పుట్టింది.** భూమ్మీద కొన్ని కోట్ల జీవజాతులు అలాగే సృష్టింపబడినాయి. భూమ్మీద ప్రవేశించిన ఆత్మ శకలాలు ఆ విధంగా అనేక జీవజాతులుగా జన్మతీసుకుని పరిణామం చెందుతున్నాయి. **మానవ దేహం భూమ్మీద శాశ్వతంగా అదే ఆకారాన్ని కలిగి వుండాలన్న నిబంధన లేదు.** భూమి మీద చైతన్య పరిణామానికి అనుగుణంగా దేహాకృతి వుంటుంది. కొన్ని మిలియన్ల సంవత్సరాల తర్వాత మానవజాతి ఇంకొక దేహాకృతిలో వుండవచ్చు. ఆ ఆకృతి అప్పటి చైతన్య పరిణామ పరిస్థితులకు అనుగుణంగా వుంటుంది. మానవ దేహం ఫలానా ఆకారంలోనే భూమి మీద శాశ్వతంగా వుండాలని రూలేమీ లేదు. భూమ్మీద కోట్ల సంవత్సరాలు గడిచిపోయాయి. ఎన్నో నాగరికతలు అవతరించి అంతర్ధానమైపోయాయి. మనిషి తల + జంతువు దేహం, జంతువు తల + మనిషి దేహం, మనిషి తల + పక్షి దేహం, పక్షితల + మనిషి దేహం ఇలా రకరకాల కాంబినేషన్స్‌గల జీవజాతులు భూమి మీద అవతరించడం జరిగింది. ఈ భూమి మీద, లేదా విశ్వంలో ఏ లోకంలోనైనా ఏదైనా సంభవమే. ఆత్మ శకలాలు దేహాలను ఏ కాంబినేషన్ నైనా ఎంచుకుని అవతరించ గల స్వతంత్రత కలిగివున్నాయి. భూమి మీద ప్రవేశించే ఆత్మ శకలాలు వివిధ రకాల కాంబినేషన్స్‌తో (combinations) దేహాలను తీసుకుని చైతన్య పరిణామం చెందగలవు.

పాములాగ ప్రాకే మనుష్యజాతి, పక్షిలాగ ఎగిరే మనుష్యజాతి, సముద్రాలలోపల నివసించే మనుష్యజాతి, వేలసంవత్సరాలు జీవితాయుష్షుగల మనుష్యజాతి, ఇలా అనేక రకాలు గల మానవజాతులు ఇదివరకే భూమి మీద జీవించడం జరిగింది. ఆయా కాలపరిస్థితులలో చైతన్య పరిణామానికి అనుగుణంగా వాటి జెనెటిక్ నిర్మాణం వుండేది, దేహ నిర్మాణాలు వుండేవి. మీరు భూమ్మీద వ్యవసాయం చేస్తున్నట్లే, అప్పట్లో సముద్రాలలో నీటిలోపల నివసించే మానవజాతి వ్యవసాయం చేసుకుని జీవించేవారు.

ఈ విశ్వంలో ఏ లోకంలోనైనా ఏదైనా సాధ్యమే; ఏదైనా సంభవమే, గడిచిపోయిన కొన్ని నాగరికతలలో మానవజాతి కంటే ఎంతో తెలివైనవాళ్ళు, కొన్ని నాగరికతలలో మీ కంటే ఎంతో వెనుకబడిన వాళ్ళు వుండేవారు. అట్లాంటిస్ నాగరికత, లుమేరియా నాగరికతలు కొన్నివేల సంవత్సరాల క్రితం భూమ్మీద అంతర్ధాన మయ్యాయి. అట్లాంటిస్ నాగరికతలో గల మానవజాతి మీ కంటే ఎన్నో వేల రెట్లు తెలివితేటలు కలిగి ఉండేవారు. వాళ్ళు అభివృద్ధి చేసిన సైన్సు, టెక్నాలజీ, మెడిసిన్ రంగాలు మీరు అభివృద్ధి చేసిన దానికంటే కూడ కొన్నివేల రెట్లు మెరుగ్గా వుండేవి. చైతన్య పరిణామంలో భాగంగా ఆ నాగరికత అంతరించి పోయింది. కొన్ని నాగరికతలలో జంతుజాతులు మీ కంటే ఎంతో తెలివైనవిగా వుండేవి. అవి పనిముట్లు తయారు చేశాయి; వాహనాలు నడిపాయి; యుద్ధాలు చేశాయి. అవి కూడ సైన్సు, టెక్నాలజీ, మెడిసిన్‌లను అభివృద్ధి చేశాయి. ఆ జంతు జాతులు మానసికంగా ఎంతో పరిణితి కలిగి వుండేవి. మనుష్యజాతి జంతువుల దగ్గరికి వెళ్ళి ఎన్నో విషయాలు నేర్చుకున్నది. మనుష్యులకంటే జంతుజాతులు మానసికంగా ఎంతో పరిణితి కలిగి వుండేవి. మనుష్యులు, జంతుజాతుల మధ్య ఎంతో సఖ్యత, సహకారం వుండేది. పరస్పరం గౌరవించుకుని, జ్ఞానాన్ని పంచుకుని చైతన్య పరిణామం చెందేవి. వైద్య శాస్త్రానికి, దేహారోగ్యానికి సంబంధించి ఎన్నో విషయాలు జంతుజాతుల నుండి మానవుడు నేర్చుకున్నాడు. సామాజిక ప్రవర్తన, దైనిక జీవిత ప్రవర్తన లాంటివన్నీ జంతువులే మనిషికి నేర్పినాయి. ఇవన్నీ చదువుతుంటే మీకేమన్పిస్తుంది? ఈ విశ్వంలో మూలచైతన్యశక్తి నుండి ఉద్భవించిన ఆత్మశకలాలు ఏ దిశలోనైనా ఏ దేహంతోనైనా చైతన్యపరిణామం చెందగలవని తెలుస్తుందిగదా. మీరు కల్పిత కథలని భావించే కథలలో మత్స్యకన్యలు, నాగకన్యలు ఇంకా అనేక విషయాలు వినే వుంటారు. మనిషితల + చేప దేహం, మనిషితల + పాము దేహం కాంబినేషన్‌లో కూడ జీవజాతులు ఇదివరకే భూమి మీదకు అవతరించి నిష్క్రమించాయి. అట్లాగే ఇతర జంతు జాతులు కూడ రకరకాల కాంబినేషన్స్‌తో (combinations) దేహాలు తీసుకోవడం జరిగింది.

రాక్షసబల్లులు (డైనోసార్స్) భూమి మీద కొన్ని మిలయన్ల సంవత్సరాల క్రితం వుండేవి. వాటి చైతన్య పరిణామం భూమ్మీద ఇక అవసరం లేదనుకున్నపుడు భూమి మీద నుంచి నిష్క్రమించినాయి. **భూమి మీద మనుష్య దేహాలుగాని, జంతుజాతుల దేహాలుగాని, ఇతర జీవరాశుల దేహాలుగాని ఇతర గ్రహాంతరవాసుల సంపర్కంవల్ల సృష్టింపబడలేదు.** మానవ దేహంలోని క్రోమోజోములను, జెనెటిక్ నిర్మాణాన్ని ఇతర లోకవాసులెవ్వరూ సృష్టించలేదు. లేదా వాళ్ళు భూలోక జాతులలో సంగమించడం ద్వారా ఏర్పడ లేదు. ఆయా చైతన్య పరిణామ పరిస్థితుల కనుగుణంగా జెనెటిక్ నిర్మాణం తయారయ్యి దేహ ఆకృతులను తీసుకుని ఆత్మశకలాలు భూమ్మీదకు రావడం జరుగుతూంది. డైనోసార్స్ DNA నిర్మాణం , జెనెటిక్స్ కోడ్ భాష అంతా ఇతర డైమన్షన్స్‌లో భద్రపరచబడివుంది. భూమ్మీద వాటి చైతన్య పరిణామం అవసరమనుకున్నపుడు డైనోసార్స్ మళ్ళీ భూమ్మీద అవతరించగల అవకాశం వుంది. భూమ్మీద, లేదా ఇంకో లోకంలో అంతరించి పోతున్న జీవజాతుల తాలుకు DNA ఈ విశ్వంలోగల కొన్ని డైమన్షన్స్ గల లోకాలలో భద్రపరచబడుతాయి. భూమ్మీద చైతన్య పరిణామానికి అవకాశం లేకపోతే ఇంకో లోకానికి ప్రవేశిస్తాయి. పులి, సింహం, ఇతర పక్షి జాతులు కొన్ని భూమి నుండి అంతరించిపోతున్నాయని మీ శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. వాటంతట అవి నిష్క్రమించాలనుకుంటే తప్ప మానవజాతి వాటిని నిర్మూలించలేదు.

జీవజాతులు ఒక దానికొకటి జనాభా నియంత్రణను చేసుకుంటున్నాయి. ఉదాహరణకు పాము జాతిని గ్రద్ధ, నెమలి నియంత్రిస్తుంది. కప్పజాతిని చేప, పాము, పక్షులు నియంత్రిస్తాయి. చిన్న జంతువులను పెద్ద జంతువులు తినివేస్తాయి. ఇలా వాటి జనాభా నియంత్రణ కొనసాగుతుంది. అంతేతప్ప జంతుజాతిని నియంత్రించడానికి, లేదా వాటిని చంపడానికి మానవజాతికి ఎటువంటి పరిస్థితుల్లోనూ అధికారం లేదు. ఇవాళ చైతన్య పరిణామ క్రమంలో మానవజాతి అన్ని జీవజాతుల కంటే ముందున్నది. సకల ప్రాణికోటి మానవ చైతన్య పరిణామానికి దోహదపడుతూంది. జంతుజాతులన్నీ కూడ మానవ చైతన్య పరిణామానికి ప్రత్యక్ష, పరోక్ష సహకారాన్ని అందిస్తున్నాయి. జంతుజాతులన్నీ మానవజాతికి అనుంగు తమ్ముళ్ళులాంటి వారు. వాటిని చంపడమంటే మానవచైతన్య పరిణామాన్ని చంపుకోవడమే!

మీరు కలలు కంటున్నట్లుగానే జంతుజాతులు పక్షిజాతులు, ఇతర జీవజాతులు, వృక్షజాతులు కలలుగంటున్నాయి. మీరు లక్ష్యాలను నిర్దేశించు కుంటున్నట్లే అవి కూడ

కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకొని భూమ్మీద ప్రవేశించాయి. **జంతుజాతులన్నీ ఇతర లోకాలనుండి భూమ్మీదకు వచ్చిన ప్రతినిధులు.** దేహంలో ఒక చెయ్యి విరిగిపోయి తొలగింపబడినపుడు అంగవైకల్యం ఏర్పడుతుంది. దేహానికి కొంత వెలితి ఏర్పడుతుంది. అట్లాగే జీవజాతుల చైతన్య పరిణామానికి మానవజాతి ఆటంకం కలిగించి తన చైతన్య పరిణామానికి తాను విద్రోహం చేసుకుంటున్నది. జంతు జాతిని హింసిస్తున్నారంటే మిమ్మల్ని మీరు హింసించుకుంటున్నారని తెలుసుకోండి. జంతుజాతిని హింసించడం, చంపడం ద్వారా మానవజాతి చాల పెద్ద తప్పు చేస్తున్నది. దానివల్ల మానవజాతి చైతన్య పరిణామానికి చాల హాని జరుగుతూంది. వైద్య శాస్త్ర ప్రయోగాల కోసం జంతుజాతులను ఎంచుకుని వాటిని హింసించడం, వాటిపై ప్రయోగాలు చెయ్యడం చాల హీనమైన చర్య. అంతర్ ప్రయాణం చేసి అంతర్ ప్రపంచం నుండి క్రొత్త క్రొత్త విషయాలు రాబట్టి వైద్యశాస్త్రాన్ని అభివృద్ధి చేసివుంటే వైద్యశాస్త్రము ఎన్నోవేల రెట్లు అభివృద్ధి చెంది వుండేది. జంతువుల దేహాలు, మృతజీవ కణాలపై ప్రయోగాలు చేసి అభివృద్ధి చేసిన వైద్య శాస్త్రము మీకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదు. ఇవాళ మీరు అభివృద్ధి చేసుకున్న అల్లోపతి వైద్యశాస్త్రము మానవదేహానికి, మానవ చైతన్య పరిణామానికి ఏమాత్రము పనికిరాదు. ఆత్మ, దేహం, మరి చైతన్య పరిణామం కక్షుణ్ణంగా అధ్యయనం చేసి, పరిశోధన చేసి చికిత్స చేసేవాడే నిజమైన వైద్యుడు. భూమ్మీద చైతన్య పరిణామానికి మీ అల్లోపతి వైద్యులు అంతరాయం కలిగిస్తున్నారు. వారి వైద్య విధానం చాల అసమగ్రంగా వుంది (incomplete). ఆ వైద్యం మానవ దేహానికి ఏ మాత్రం సహాయపడేదిగా లేదు. ఈ వైద్యశాస్త్రం గురించి మరింత లోతుగా తర్వాత వివరిస్తాను.

జంతుజాతి నుండి మీరెంతో నేర్చుకోవలసివుంది. జబ్బు చేసినపుడు అవి తమ దేహాలను ఎలా రిలాక్స్ చేసుకుంటాయో, ఓషధ మొక్కలను గుర్తించి వాటిని వాడటం ద్వారా అనారోగ్యాన్ని ఎలా నయం చేసుకుంటాయో క్షుణ్ణంగా అధ్యయనం చెయ్యడం ద్వారా సహజ ఆరోగ్యవిధానాలను మీరు నేర్చుకోవచ్చు. జంతువుల భౌతిక విన్యాసాలను గమనించండి. సాలెపురుగు ఎంతో సృజనాత్మకంగా తన గూడును నిర్మించుకుంటుంది. ఆ నైపుణ్యం దానికెవరు నేర్పారు? ఆ సాలె పురుగు తన అంతర్ ప్రపంచం ద్వారా నేర్చుకున్న నైపుణ్యమది. పాము తన దేహాకృతిని ఎలా అందంగా సృష్టించుకుంటుంది? పక్షికి తన గూడును అద్భుతంగా నిర్మించడం ఎవరు నేర్పారు? పక్షులకు వేల మైళ్ళ దూరం ప్రయాణించి ఆహార అన్వేషణ చెయ్యడం ఎవరు నేర్పారు? ఈ నైపుణ్యం, ఈ

కళలు అన్నీ అంతర్ ప్రపంచంలో నుండి బాహ్య ప్రపంచంలోకి వాస్తవ రూపం పొందుతున్నాయి. అంతర్ శక్తి రూపాంతరమే బాహ్య ప్రపంచంలో భౌతిక సంఘటనలుగా, కళలుగా, భౌతిక పదార్థంగా రూపుదాల్చుకుంటాయి. ప్రతి జీవజాతికి అంతర్ శక్తిని వినియోగించుకోవడం చాల బాగా తెలుసు.

మానవజాతి మనుగడ + చైతన్య వికాసం ఇతర జీవజాతుల మనుగడ + చైతన్య వికాసం పరస్పరం ఆధారపడివున్నాయి. మానవజాతి చైతన్య పరిణామంలో కొన్ని విలువలు పెంచేందుకు అన్ని జీవజాతులు పాలు పంచుకుంటున్నాయి. జీవితం చాల పవిత్రమైనది! అన్ని జీవజాతుల జీవితాలూ చాల పవిత్రమైనవి! పరమార్థకత, చైతన్య పరిణామం ఆశించి ఆత్మశకలాలు జీవజాతులుగా ఉద్భవించాయే తప్ప కేవలం మనుగడ కోసమే ఇక్కడ జన్మ తీసుకోవడం జరగలేదు. అట్లాగని జీవజాతులు మానవజాతి చైతన్య పరిణామం కోసం త్యాగం చెయ్యడం లేదు. మీకు సహకారం అందించడం ద్వారా అవి తమను తాము ఉద్ధరించుకుంటున్నాయి. భూమ్మీద జీవజాతులన్నీ ప్రత్యేక లక్ష్యాలను కలిగి వున్నాయి. జీవరసాయనిక జెనెటిక్ భాషను కలిగి వుంటాయి. ఆ భాష ద్వారా జీవజాతులన్నీ అనుసంధానించబడి వుంటాయి. భూమ్మీద అన్ని జాతుల చైతన్య పరిణామం ఒకే దిశలో అభివృద్ధి చెందుతూంది. ఇది విశ్వ చైతన్య పరిణామాన్ని మరింత పెంచుతుంది. ఏ ఒక్క జంతువునుగాని, కీటకాన్నిగాని, వృక్షాన్నిగాని, మనిషినిగాని విస్మరించడానికి వీలులేదు. విశ్వచైతన్యపరిణామంలో ప్రతి ప్రాణీ ముఖ్యమే. ఒక మనిషి చైతన్య పరిణామ సార్థకత, మరి ఇతర జీవజాతుల చైతన్య పరిణామ సార్థకత (fulfilment) పరస్పరం తోడుగా అభివృద్ధి చెందుతున్నాయి. మనుషుల మధ్యగాని, జీవజాతుల మధ్యగాని, జీవజాతులు+ మనుషుల మధ్యగాని ఎల్లప్పుడూ సఖ్యత వుంటుంది కాని పోటీ వాతావరణం ఏర్పడదు. చైతన్య పరిణామంలో ఒక జీవజాతి ఇంకో జీవజాతితో పోటీ తత్వం ఉంటే ఈ ప్రపంచం వుండేది కాదు. **గొప్ప జీవజాతులు, హీన జీవజాతులు అనేవి భూమ్మీద, లేదా మరే లోకంలోనూ లేవు.** ఒక లోకం అంటే ఉదాహరణకు భూమ్మీద మానవుడు మరి జీవజాతులన్నింటి జెనెటిక్ నిర్మాణం, జీవరసాయనిక శక్తి పరంగా లింకు కలిగి వున్నాడు. అన్ని జీవజాతుల కంటే ఎక్కువగా లెక్కపెట్టలేని విధాలుగా మానవజాతి చైతన్య పరిణామం చెందడానికి అవకాశాలు ఇవాళ వున్నాయి. చైతన్య పరిణామం చెందుటకు గల కాంబినేషన్స్ మానవజాతికి ఎన్నివున్నాయంటే, ఇవాళ మీ సూపర్ కంప్యూటర్లు కూడ లెక్కగట్ట లేవు.

ప్రతి మనిషీ చైతన్య పరిణామం చెందుతూ పరమార్థకత పొందుతున్నాడు. భూమి మీద – ఖనిజ లవణాలు, ఏకకణ జీవి, రాళ్ళు, రప్పలు, కీటకాలు, వృక్షాలు, జంతువులుగా అనేక జన్మలు తీసుకుని చైతన్య పరిణామం చెందుతూ వస్తూన్న ఆత్మశకలం చివరగా మానవ దేహాన్ని ఎంచుకోవడం జరిగింది. మానవ దేహంతో కూడ అనేక రకాలుగా అనుభవాలు పొందడం కోసం ఎన్నో జన్మలు తీసుకోవడం జరుగుతూంది. ఒక జన్మలో బాధాకరమైన జీవితాన్ని ఎంచుకోవచ్చు. ఆ దిశలో ఆత్మ పరిణామం చెందుతూ ఎదుగుతుంటుంది. ఆత్మస్థాయిలో అది బాధాకరంగా దుర్భరంగా అనిపించదు. అది మీ విశ్లేషక మైండ్ (Analytical mind)ఏర్పరుచుకున్న భావనమాత్రమే. ఒక పర్వతారోహకుడికి కొండలు ఎక్కడం బాధాకరంగా వుండదు. అది అతనికి ఒక సవాలుగాను, తమాషాగాను వుంటుంది. అట్లాగే, బాధాకరమైన జీవితాన్ని ఎంచుకున్న ఆత్మకు అది ఒక సవాలుగా, తమాషాగా అన్పిస్తుంది. ఆ జీవితంలో తను చైతన్య విస్తరణ కోసం కొన్ని పాఠాలు నేర్చుకుంటుంది. ఒక మనిషి అంగవైకల్యంతో భూమ్మీద జన్మించడం అంటే కొన్ని లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశలో తన శక్తిని కేంద్రీకరించి చైతన్య పరిణామం చెందడం కోసమే. అంతేగాని అతను గత జన్మలలో చేసిన కర్మలకు శిక్షగాదు. తనంతట తాను అంగవైకల్యంతో కూడిన జన్మతీసుకున్నాడు. ఆత్మశక్తి స్థాయిలో అది ఏ విధంగానూ దుఃఖ భరితమైన జీవితం కాదు. కొన్ని అనుభవాలు పొందడం కోసం, తద్వారా చైతన్య వికాసం చెందడం కోసం వుంటుంది. ఆ విధంగా జన్మ తీసుకునే ముందర ఆ ఆత్మ శకలము ఎక్కడ పుట్టాలో, ఏ దేశంలో పుట్టాలో, ఏ భౌతిక పరిస్థితుల మధ్య పుట్టాలో, ఏ తల్లి దండ్రులకు పుట్టాలో, ఏయే లక్ష్యాలు నెరవేర్చాలో అన్నీ నిర్ణయించుకుని జన్మ తీసుకోవడం జరుగుతుంది. ఏదీ యాదృచ్ఛికంగా జరగదు!

భూమి మరి భూమ్మీద జీవజాతుల చైతన్య వికాసాన్ని ఉపరితలం నుండి ఒక కోణంలో మాత్రమే మీరు గ్రహించ గలుగుతున్నారు. వాస్తవానికి మీరు తెలుసుకోవలసింది ఎంతో అపరిమితంగా వుంది. సముద్ర జీవజాతులను తీసుకోండి. వాటి చైతన్య పరిణామం భూభౌతిక జీవజాతులకు సమాంతరంగా జరుగుతుంది. జలచరాలు చైతన్య పరిణామం చెందుతూ వేరే దిశలో పరిశోధన చేస్తూ ప్రయాణిస్తున్నాయి. ఒకానొక చైతన్యశక్తి స్థాయిలో భూభౌతిక జీవజాతులు మరి సముద్ర జీవజాతులు సమానమవుతాయి. సముద్రపు అడుగు భాగంలో నివసించే మానవజాతి వుండేదని ఇంతకుముందే చెప్పాను. వాటి మేధాశక్తి మీకంటే ఎక్కువగా వుండెడిది. మనిషితల +

చేప దేహం, చింపాంజి తల + చేప దేహం గల జీవజాతులు వుండేవి. అవి భూమి మీద మానవజాతితో సంబంధాలు కలిగి వుండేవి. మీ ఇతిహాసాలలో వాటి ప్రస్తావన వుండటం మీరు చదివే వుంటారు. కొన్ని సముద్రజాతుల ఇంటెలిజెన్స్ మానవజాతికంటే ఎన్నో రెట్లు వుండేది. వాటిని దేవతలుగా మీ పూర్వీకులు పూజించి ఆరాధిస్తూ వుండేవారు. డాల్ఫిన్ అనే సముద్రజాతి జంతువులు మానవజాతిలాగే కుటుంబ వ్యవస్థను కలిగి వున్నాయి. వాటి ప్రవర్తన భావోద్వేగాలు, వినయ విధేయతలు, సామాజిక సాహచర్యంలాంటివి మానవజాతితో సారూప్యం కలిగివున్నాయి. డాల్ఫిన్స్ ఇతర సముద్ర జాతులకు ఎంత సహాయపడతాయంటే మానవజాతి సిగ్గుపడేంతగా వుంది. ఇవాళ మానవజాతి భూభౌతిక జీవజాతులు, సముద్ర జీవజాతులను డామినేట్ చేస్తున్నది. కొన్ని నాగరికతల్లో సముద్ర జీవజాతులు ఇతర జీవజాతులను డామినేట్ (ఆధిపత్యము) చేశాయి. కొన్ని సంభావ్యతా లోకాలలో (probable worlds) సముద్ర జీవజాతులు ఇప్పటికీ ఇతర జీవజాతుల మీద ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ భౌతిక ప్రపంచంలో ఎన్నో సంభావ్యతలు (probabilities) జరగడానికి ఆస్కారముంది. జీవజాతులు చైతన్య పరిణామ సార్థకత సాధించేందుకు వివిధ రకాల దేహాలను తీసుకుని అందుకనుగుణంగా నాడీ వ్యవస్థలు, జీవ రసాయనిక చర్యలను తయారు చేసుకుంటాయి. జీవజాతి చైతన్యశక్తి, నమ్మకాలను బట్టి అవి దేహాలను సృష్టించుకోవడం ఆ దిశలో పరిణామం చెందడం జరుగుతుంది. పరిణామం చెందే దిశలో జరిగే సంభావ్యతలు, తద్వారా భవిష్యత్‌లో జరిగే పరిణామాభివృద్ధి అంతటినీ జీవజాతి ఎరుకతో వుండి మనుగడ సాగిస్తుంది. పసిబిడ్డ నడక నేర్చుకునే దశలో తప్పటడుగులు వెయ్యడం, క్రింద పడడం, దెబ్బతగలడం జరుగుతున్నప్పటికీ నేర్చుకోవడం జరుగుతుంది. అట్లాగే ఒక జీవజాతి క్రొత్తగా భూమి మీద ప్రవేశించిన తర్వాత తప్పటడుగులు వేస్తుంది. తద్వారా ఎన్నో పాఠాలు నేర్చుకుని చైతన్య పరిణామం చెందుతుంది. క్రొత్తగా భూమ్మీద లేదా మరో లోకంలో ప్రవేశించే జీవజాతులు అంతర్ చైతన్యశక్తి ద్వారా ఎంచుకున్న లోకంలో ఇతర అన్ని జీవజాతులతో అనుసంధానం ఏర్పరచుకుంటాయి. అలాగే సమిష్టి చైతన్య వికాసంలో పాలుపంచుకుంటాయి.

మీరు అభివృద్ధి చేసిన సైన్సు, టెక్నాలజీ ఎంతో పరిమితమైనది. మీ శాస్త్ర పరికరాలతో అంతరిక్షాన్ని క్షుణ్ణంగా పరిశోధన చెయ్యడానికి వీలుపడదు. అంతర్ వాణిని, అంతర్ శక్తిని వినియోగించుకొని సైన్సును అభివృద్ధి చెయ్యడంలో మీరు విఫలమైనారు.

మీ కంటే ముందు నాగరికతల్లోని మానవజాతులు భౌతిక శాస్త్రాన్ని మైండ్ ద్వారా, అంతర్ శక్తి ద్వారా అభివృద్ధి చేశారు. దాన్ని మెంటల్ ఫిజిక్స్ (Mental Physics) అని పిలిచేవారు. గ్రహాల స్థితిగతులను, నక్షత్రాల స్థితిగతులను సౌరవ్యవస్థ ఆవిర్భావాన్ని, ఇతర సౌరవ్యవస్థల ఆవిర్భావాన్ని ఇత్యాది ఎన్నో విషయాలు అధ్యయనం చేసి చక్కగా తెలుసుకున్నారు. మీకు తెలిసిన జ్ఞానం కంటే లక్షలరెట్లు జ్ఞానం వాళ్ళు పొందారు. పూర్వపు నాగరికతల్లో వ్యోమ నౌకలు (Space ships) నిర్మించి కాలాన్ని చేధించి అంతరిక్షయానం చేశారు. చంద్రమండలయానం, ఇతర గ్రహాలయానం చేశారు. ఇవాళ సివిల్ ఇంజినీరింగ్‌కు సాధ్యంగాని అద్భుతమైన కట్టడాలు అప్పట్లో నిర్మించారు. ప్రస్తుత తరుణంలో మీరు కూడ మెంటల్ ఫిజిక్స్ (Mental Physics) ను అభివృద్ధి చేయవలసి వుంది. అంతర్‌శక్తిని, ఆధ్యాత్మికతను కలబోసి సైన్సును అభివృద్ధి చేస్తే భూమి మీద చైతన్య పరిణామం అతి వేగంగా సాగుతుంది. ఇపుడున్న మీ సైన్సు తర్కానికి లోబడి పనిచేస్తున్నది. తర్కం పై ఆధారపడే సైన్సు ఈ విశ్వంలోని ఎన్నోరహస్యాలను చేధించజాలదు. మీకు తెలియని ఫిజిక్స్ ఇంకా అనంతమైనదిగా వుంది.

ఐన్‌స్టీన్ అనే శాస్త్రవేత్త అంతర్ శక్తి ద్వారా సైన్సును అభివృద్ధి చేయడంలో కొంతవరకు సఫలమయ్యారు. అతన్ని నేను ఐన్‌స్టీన్ ప్రవక్త (Prophet Einstein) అని సంబోధిస్తాను. ఐన్‌స్టీన్ గణిత శాస్త్రంలో గనుక నిష్ణాతుడై వుండి వుంటే తర్కం అతని సహజావబోధన (Intuition)ను డామినేట్ చేసి వుండేది. అంతటి అద్భుతమైన శాస్త్ర ఆవిష్కరణలు చేసి వుండేవాడుకాదు. మీ సైంటిస్టులు అభివృద్ధి చేసిన శాస్త్ర పరికరాలతో భూమి మీద జరిగే చైతన్య పరిణామం తాలుకు అభివృద్ధి, దాని కదలికలను ఏమాత్రం పసిగట్ట లేవు. ఎలక్ట్రానునే (electron) తీసుకుందాము. ఎలక్ట్రాను (electron) కదలిక దాని ఆత్మ భ్రమణం, కేంద్రకం చుట్టూ పరిభ్రమణంలను పరిశోధన చెయ్యడంలో మీ సైన్సుకు అందుబాటులో లేదు. ఎలక్ట్రానులను గురించి ఇప్పటి వరకు మీకు తెలిసిందంతా ఒట్టి భ్రమ. ఎలక్ట్రానును ఒక కణంగానే కాకుండా దాని చైతన్యశక్తిని మల్టి డైమన్షన్ ఆక్టివిటీని (Multi dimenesional activity) కూడ మెంటల్ ఫిజిక్స్ (Mental Physics) ద్వారా పరిశోధన చేసినట్లయితే ఎన్నో అద్భుతమైన విషయాలు తెలుసుకోగలుగుతారు. భూమి, భూమి మీద జీవజాతులు, మనిషికి ఇతర జీవజాతుల మధ్య అనుసంధానం, జీవజాతుల చైతన్య పరిణామం, భూమి చైతన్య పరిణామం, అంతర్ ప్రపంచంలో చైతన్య పరిణామం, పదార్థం + శక్తి స్వభావం వీటన్నింటి మీద

సమగ్రమైన అధ్యయనం, పరిశోధన జరిగినపుడే నిజమైన ఫిజిక్స్ అభివృద్ధి చెందుతుంది. మీ శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన సిద్ధాంతాలు చాల వరకు తప్పు. అవి సంపూర్తిగా సమాచారాన్ని ఇవ్వలేక పోతున్నాయి. పదార్థాన్ని పదార్థంగానే కాక దాని చైతన్యశక్తిని కూడ అధ్యయనం చెయ్యాలి. మీ కంటికి గోచరం కాని చైతన్యశక్తిని కూడ మీ అంతర్‌వాణి ద్వారా స్టడీ (study) చెయ్యాలి. అపుడు అద్భుతమైన సైన్సు, టెక్నాలజీ రంగాలు ఆవిష్కరింపబడతాయి.

అన్ని జీవజాతులతో బాటు మానవజాతి చైతన్య వికాసం చెందుతున్నప్పటికీ, ఊహాశక్తి (Imagination)ని ఉపయోగించడంలో మానవజాతి ప్రత్యేక పాత్రను కలిగివుంది. ఈ ఊహాశక్తి మీ భావోద్వేగాలను, విశ్లేషణను అనుసంధానం చేస్తుంది. అంతర్ ప్రపంచ వాస్తవానికి, బాహ్య ప్రపంచ అనుభవాలకు మధ్య అనుసంధాన కర్త ఊహాశక్తి! అన్ని జీవజాతుల మధ్య గల అంతర్ ప్రపంచాన్ని అనుసంధానం చెయ్యడంలో ఈ ఊహాశక్తి కీలక పాత్ర వహిస్తుంది. ఊహాశక్తిని ఉపయోగించి అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోనికి భౌతిక సంఘటనలుగా వాస్తవరూపం పొందినపుడు, మీరు చైతన్య పరిణామాన్ని విస్తరించుకుంటున్నారు. మీ ఈ విస్తరణ యావత్ జీవజాతులను ప్రభావితం చేసి వాటి చైతన్య విస్తరణకు దోహదం చేస్తుంది. ఈ ఊహాశక్తి శాస్త్ర, సాంకేతిక, వైద్యరంగాలలో చాల ఉపయోగపడుతుంది. అంతర్‌శక్తిని వినియోగించడంలో ఊహాశక్తి చక్కగా మార్గదర్శినిగా పని చేస్తుంది. నిజమైన శాస్త్రవేత్త తన ప్రశ్నలకు సమాధానాలను సహజావబోధన (Intuition) ద్వారా రాబట్టడానికి ప్రయత్నం చేస్తాడు. పదార్థం, దాని చైతన్యశక్తి పరిణామ స్థితిగతులు, పదార్థ అంతర్ శక్తి పోకడలు మొదలగునవి తెలుసుకోవడానికి తన అంతర్ చైతన్యశక్తి ద్వారా అంతర్ ప్రపంచంలోకి ప్రవేశించి పరిశోధన చేసే వాడే నిజమైన శాస్త్రవేత్త! అంతర్ ప్రపంచాన్ని పరిశోధించడమే సాహసమైన, యదార్థమైన పరిశోధన! అపుడే భౌతిక ప్రపంచపు వాస్తవాలు తెలుసుకోగలుగుతారు.

* * *

చాలా మంది భౌతిక శాస్త్రవేత్తలు అంతర్ శక్తి నుండి వచ్చే స్పందనలను అధ్యయనం చెయ్యడం లేదు. అంతర్ ప్రపంచ స్పందనలపై ఒక తప్పుడు అభిప్రాయం ఏర్పరుచుకున్నారు. సైన్సు అంటే ప్రతిదీ రుజువు చెయ్యాలని, ప్రతిదీ తర్కించి, విశ్లేషించి

కనుగొనాలని వారు భావిస్తున్నారు. అపక్రమ మార్గాలు వారికి క్రమ మార్గాలుగా కన్పిస్తున్నాయి. పదార్థాన్ని విచ్ఛిన్నం చెయ్యడం ద్వారా దాని భౌతిక ధర్మాలను కనుగొనడానికి ప్రయత్నిస్తున్నారు గాని దాని అంతర్ ధర్మాలు, చైతన్యశక్తి ధర్మాలను విస్మరిస్తున్నారు. జంతువును చంపి ఆ మాంసాన్ని స్టడీ చేయడం ద్వారా జీవశాస్త్రాన్ని అభివృద్ధి చెయ్యడం అపసవ్య మార్గమే గదా! మనిషి మెదడును స్టడీ చెయ్యడం కోసం జంతువులను చంపి వాటి మెదడులను సేకరించి పరిశోధన చెయ్యడం అపసవ్యంగా వుంది. దానివల్ల మీ మానవజాతి ఆధ్యాత్మిక పురోభివృద్ధికి ఆటంకాలను ఏర్పరచుకుంటున్నది. మనిషి తనకు ఆటంకాలు ఏర్పరచుకోవడమే గాకుండా తన సహచర జీవజాతులకు కూడ వాటి ఆధ్యాత్మిక పురోభివృద్ధికి హాని చేస్తున్నాడు. మీరు చేపట్టిన పరిశోధనల అపసవ్యతల వల్ల – మీరు + ఇతర జీవజాతుల చైతన్య పరిణామాన్ని అర్థం చేసుకోవడంలో విఫలమవుతున్నారు. మీరు ఇంకా చైతన్యశక్తి + దాని అద్భుత శక్తిని అర్థం చేసుకోవడంలో విఫలమవుతూనే వున్నారు. పదార్థాన్ని విచ్ఛిన్నం చెయ్యడం, లేదా జంతువును చంపి ప్రయోగం చెయ్యడం, జంతువు బ్రతికుండగానే దాన్ని హింసపెట్టి ప్రయోగాలు చెయ్యడం ద్వారా చైతన్యశక్తిని అధ్యయనం చెయ్యాలని పూనుకొనడం చాల హేయమైన చర్య! జీవితం, దాని ధర్మాలు, అంతర్ శక్తి, చైతన్యశక్తి వికాసం మొదలగు వాటిని దేహాన్ని విచ్ఛిన్నం చెయ్యడం ద్వారా తెలుకోబూనుకోవడం అవివేకం. హింస, విచ్ఛిన్నం చెయ్యడం, చంపడం ద్వారా ప్రయోగాలు చెయ్యడం అనేవి జీవిత పరమార్థాన్ని హీనపర్చడమే తప్ప అది అభివృద్ధి ఏ మాత్రం కాజాలదు. ఆధ్యాత్మిక పురోభివృద్ధి అంతకన్నా కాదు. **జంతువులను చంపడం అనే ప్రక్రియ మీరు మానివేయగల్గితే భూమి మీద హింస అనేది మటుమాయమై పోతుంది. యుద్ధాలు అనేవి వుండవు. మానవజాతుల మధ్య వైషమ్యాలు వుండవు.** అపుడే జంతుజాతిపట్ల మరి ఇతర జీవజాతుల పట్ల అనురక్తి కలిగి వుంటారు. ప్రకృతి సమతుల్యతను కలిగి వుంటుంది. అస్సలు మానవజాతిలో హింసాప్రవృత్తి అనేది ఒక జాడ్యంగా ప్రబలడానికి కారణం జంతు జాతులను హింసించడం, చంపడం కారణమయ్యింది. ఆ హింసా ప్రవృత్తిని మానివేస్తే ప్రకృతిని, జీవ చైతన్య పరిణామాన్ని చాల చక్కగా అర్థం చేసుకోగలుగుతారు. జీవితానికి విలువ ఇవ్వడం నేర్చుకుంటారు. జీవచైతన్యశక్తి పరిణామం, ఆత్మ చైతన్యశక్తి పరిణామం చక్కగా ఆకళింపు చేసుకోగలుగుతారు. మానవజాతికి సంక్రమిస్తున్న రోగాలు, వాటి

మూలాలను కనుగొనడానికి జంతువులను చంపి ప్రయోగాలు చెయ్యడం ద్వారా మరిన్ని క్రొత్త రోగాలు పుట్టుకొస్తున్నాయి. హింసా మార్గాన్ని వదిలివేసి అంతర్ శక్తి ద్వారా మీరు ప్రయోగాలు చేసి వైద్య శాస్త్రాన్ని అభివృద్ధి చేసి వున్నట్లయితే ఇవాళ మానవజాతికి ఎక్కువ రోగాలు వుండేవి కావు. **రోగాలనేవి హింసా మార్గాన్ని ఆశ్రయించడం వల్ల కలిగిన విపరిణామం. మైండ్, దేహం, భావోద్వేగాలు, ఆరోగ్యం, అనారోగ్యంల మధ్య లింకును మీరు అంతర్ శక్తి ద్వారా పరిశోధించి వుంటే భూమ్మీద వ్యాధులనేవి మటుమాయమై పోయేవి.** అట్లాగని మీరు తప్పనిసరిగా ధర్మబద్ధమైన, నిర్దిష్టమైన ప్రపంచాన్ని (perfect world) ఆవిష్కరించి తీరాల్సిందేనని తెలియజెయ్యడం లేదు. చైతన్యశక్తిని వినియోగించుకుని మీ లైఫ్ యొక్క క్వాలిటీని (quality of life) పెంచుకోవచ్చునని తెలియజేస్తున్నాను.

పదార్థం శక్తిగా ఎలా రూపాంతరం చెందుతుంది? పదార్థం యొక్క అంతర్ చైతన్యం ఎలా వుంది? అని అధ్యయనం చెయ్యాలి. మీ శాస్త్ర పరికరాలతో గ్రహాలు, నక్షత్రాల దూరం, వైశాల్యం కొలుస్తున్నారు. భూమి వైశాల్యం, భూఉపరితలం మీద దేశాలు, సముద్రాలు, పర్వతాలను గుర్తిస్తున్నారు. అది కాదు మీరు చేయవలసింది. గ్రహవ్యవస్థ, నక్షత్ర వ్యవస్థల అంతర్ ప్రపంచాన్ని శోధించాలి. భూమి అంతరాంతరాలలో గల చైతన్యశక్తిని శోధించాలి. మీ సహజావబోధన (Intuition) ద్వారా అంటే mental physics ను ఉపయోగించి పరిశోధనకు పూనుకోవాలి. అపుడే మీకు ఎన్నో విషయాలు తెలియగలవు. అపుడే మీ సైన్సు, టెక్నాలజీ ఎంతో వేగంగా అభివృద్ధి చెందగలవు. ఇతర గెలాక్సీలలో మీ కంటే మహాఉన్నతమైన సైన్సు అభివృద్ధి చెందింది. పదార్థాన్ని అధ్యయనం చేసేటపుడు దాని భౌతిక, ఆధ్యాత్మిక, మానసిక చైతన్యశక్తులను అధ్యయనం చెయ్యాలి. ఎలక్ట్రాను (electron) లాంటి చిన్న కణాల నుండి, రాయి, చెట్టు, జంతువు, మనిషి, భూమి వరకు అన్నింటికి ఆత్మ వుందనే విషయం మీరు గుర్తుంచుకోవాలి. ప్రతిదీ చైతన్యాన్ని కలిగి వున్నది. అన్నింటిలోగల అంతర్ ప్రపంచాన్ని, సజీవంగావున్న చైతన్యశక్తిని అధ్యయనం చేయగల్గితే, బ్రహ్మాండమైన శక్తివంతమైన అంతర్ ప్రపంచం గురించి తెలుస్తుంది. అదీ ప్రాక్టికల్ నాలెడ్జ్ అంటే! పదార్థాన్ని బహుముఖకోణాల్లో (multi dimensions) అధ్యయనం చేయండి. భూమితో సహా అన్నింటినీ బహుముఖ కోణాల్లో (multi dimensions) అధ్యయనం చేయండి!

* * *

మిమ్మల్ని వాస్తవానికి దగ్గరగా, సహజత్వానికి దగ్గరగా తీసుకెళ్ళడానికి అంతర్ ప్రయాణం ఎంతో అత్యవసరం. జంతు జాతి ఎంత సహజత్వం కల్గి వుందో, మానవజాతి కూడ అంతే సహజత్వం కలిగి వుంది. భూ భౌతిక జీవజాతులన్నీ భూమి చైతన్య వికాసానికి లయబద్ధంగా పరిణామం చెందినపుడే జీవరాశుల లైఫ్ క్వాలిటీ (quality of life) పెరుగుతుంది.

ఈ విశ్వంలో ప్రతి ఆత్మ శకలము నిరంతరమూ చైతన్య పరిణామం చెందుతూ వుంటుంది. ఏదీ అకర్మణత్వంలో వుండదు. గ్రహాలు నిరంతరం సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తూ (ఆత్మ భ్రమణం చేసుకుంటూ) వుంటాయి. సౌర వ్యవస్థ, ఇంకో ఖగోళ వ్యవస్థ చుట్టూ ఆత్మ భ్రమణం చేస్తూ, పరిభ్రమణం చేస్తుంది. సృష్టిలో ప్రతిదీ లయబద్ధంగా (rhythm) చలనం కలిగి వుంది. ఏదీ నిశ్చల స్థితిలో వుండదు. చలనం లేకపోతే అది నశించిపోతుంది. సాలెపురుగు తను గూడును నిర్మించాల్సిందే. లేకపోతే దాని చైతన్య పరిణామం ఆగిపోతుంది. పక్షి తన గూడును తయారు చేసుకోవాలి. లేకపోతే దాని చైతన్య పరిణామం ఆగిపోతుంది. నది నిరంతరమూ ప్రవాహం కలిగి వుండాలి. లేకపోతే నది చచ్చి పోతుంది. చెట్లు పుష్పించాలి, కాయలు, పండ్లు ఇవ్వాలి. లేకపోతే దాని చైతన్య పరిణామం ఆగిపోతుంది. మానవజాతి కూడ నిరంతరమూ చైతన్య పరిణామం చెందుతూనే వుండాలి. లేకపోతే మానవజాతి కూడ భూమి నుండి అంతరించిపోతుంది. చైతన్య పరిణామం ఎప్పటికీ జరిగే ప్రక్రియ! ఈ విశ్వం చైతన్యశక్తితో సంకోచ, వ్యాకోచం చెందుతుంది. అదంతా లయబద్ధంగా (rhythmic) కొనసాగుతుంది. ఏదీ స్థిరంగా నిలిచిపోవడం లేదు. భూమి మీద జీవజాతుల చైతన్య పరిణామం అలా నిరంతరమూ సాగిపోతూ వుండాలి. అన్ని జీవరాశుల మాదిరిగానే మనిషి భూమి మీద ప్రవేశించాడు. వాటికీ మీకు సమిష్టి లక్ష్యం కలిగి వుండి చైతన్య పరిణామం చెందుతున్నారు. ఈ పరిణామంలో మానవజాతి యొక్క బాధ్యత ప్రముఖ పాత్ర వహిస్తుంది. జంతుజాతి మరి ఇతర జీవజాతులు మానవజాతి చేసే తప్పిదాలను ఎప్పుడూ నిందించ లేదు. అవి ఎల్లప్పుడూ మానవజాతికి సహకారాన్ని అందిస్తూనే వున్నాయి. అంతర్ ప్రపంచానికి సంబంధించి ఎన్నో విషయాలు మీకు బోధించాయి. అవి మీకు టీచర్స్ (teachers) లాగ అన్ని విషయాలు తెలియజేశాయి. పెంపుడు జంతువులు కొన్ని ప్రత్యేక లక్ష్యాలను ఎంచుకుని మానవజాతితో కలిసి పనిచేస్తున్నాయి. పెంపుడు జంతువులు, మనుష్యులు వాటిని అర్థం చేసుకునే కంటే ఎక్కువగా మనుష్యులను అర్థం చేసుకుంటాయి. పెంపుడు కుక్క ఇంటిని కాపలా కాయడం తన యజమానులను ఇష్టపడటం చక్కగా ఎంజాయ్

చేస్తుంది. గుఱ్ఱం తన యజమాని తనను అర్థం చేసుకునే కంటే తన యజమానిని ఎక్కువగా అర్థం చేసుకుంటుంది. మీరు జంతువులను ప్రేమించడం నేర్చుకోండి. మీరు వాటిని ప్రేమించాలి అని చెప్పడానికి కారణం చైతన్య పరిణామపరంగా ఇతర కారణాలున్నాయి. ఆత్మశక్తిని సజీవంగా గుర్తించి గౌరవించడం నేర్చుకుంటే మీరు జంతువులను హింసించడం మానేస్తారు. వాటిని ప్రేమిస్తారు. పెంపుడు జంతువులు కొన్ని ప్రత్యేక లక్ష్యాలు ఎంచుకుని మానవ చైతన్య వికాసంలో భాగమయ్యాయి. మానవజాతితో సంబంధాలను మనిషికంటే ఎక్కువగా అర్థం చేసుకుంటున్నాయి. మానవ చైతన్య వికాసాన్ని అవి క్షుణ్ణంగా స్టడీ చేస్తున్నాయి. పెంపుడు జంతువులు మిమ్మల్ని చాల ఎక్కువగా ఇష్టపడుతున్నాయి; ప్రేమిస్తున్నాయి. మీరే వాటిని అంతగా ప్రేమించడం లేదు. అడవి జంతువులు వేరే కోణంలో లక్ష్యాలు ఎంచుకుని మానవజాతికి దూరంగా వుంటూ చైతన్య వికాసం చెందుతున్నాయి. మనిషిని, ఇతర జీవజాతులను విడదీసి, వేరుచేసి విశ్లేషించలేము. ఎందుకంటే ఒక దాని చైతన్య వికాసం ఇంకో దానితో పెనవేసుకుని వున్నాయి. అన్ని జీవజాతుల లైఫ్ క్వాలిటీ ఒక దానిపై ఒకటి ఆధారపడి వున్నాయి. **మానవజాతి యొక్క లైఫ్ క్వాలిటీ (quality of life) పెరిగితే మిగతా జీవజాతుల లైఫ్ క్వాలిటీ ఆటోమాటిక్‌గా పెరుగుతుంది.**

* * *

స్వప్న ప్రపంచంలో (dream world) మనిషి మరి ఇతర జీవజాతులు భూమి పై చైతన్య పరిణామం గురించి తరచూ చర్చించుకోవడం జరుగుతూంది. స్వప్న ప్రపంచంలో మీరంతా అక్కడ కలుసుకుంటారు. అన్నీ చర్చించుకుని నిర్ణయాలు తీసుకుంటారు. మీరు మరి అన్ని జీవజాతులు భూమ్మీద కుటుంబ సభ్యుల్లాంటి వారు. ప్రతి ఒక్కరూ సక్రమంగా వుంటే కుటుంబ వ్యవస్థ సక్రమంగా వుంటుంది.

ఖనిజ లవణాలు, ఎలక్ట్రానులు (electrons) పరమాణువులు, అణువులు, చెట్లు, క్రిమి కీటకాలు, జంతువులు, మనిషిగా పరిణామ దశలో ఎదుగుతూ రావడం జరుగుతుందని ఇదివరకే వివరించాను. డార్విన్ పరిణామ సిద్ధాంతం ప్రకారం జంతుజాతి నుండి మానవుడు ఉద్భవించాడనేది అసత్యమని ఇది వరకే చెప్పడం జరిగింది. జంతువు జన్మలుగా పరిపక్వపరిణామం చెంది, ఆ జన్మలు ముగిసిన తర్వాత ఆ ఆత్మశకలము మానవజన్మ తీసుకోవడం జరిగింది. ఈ భూమి మీద మానవుడిగా చైతన్య పరిణామం చెందుతూ తన చైతన్యశక్తిని పెంచుకుంటూ అనేక జన్మలు తీసుకోవడం జరుగుతుంది.

ఈ జన్మ పరంపర ఎంత కాలం సాగుతుందంటే భూమి మీదగల శక్తి యొక్క గరిష్ట ఫ్రీక్వెన్సీ వరకు జరుగుతుంది.

ఆత్మశక్తి సంపూర్తిగా భూమి శక్తి స్థాయిలో (energy levels) పరిపక్వత చెందేవరకు జన్మలు తీసుకోవడం జరుగుతుంటుంది. **ఆత్మ యొక్క చైతన్యశక్తి ఫ్రీక్వెన్సీ, భూతలం మీద చైతన్యశక్తి ఫ్రీక్వెన్సీని దాటితే మరి ఆ ఆత్మ శకలము మళ్ళీ భూమి మీద జన్మ తీసుకోవడం సంభవించదు.** భూతల చైతన్యశక్తి ఫ్రీక్వెన్సీ గరిష్ట విలువ వరకు ప్రతి ఆత్మ శకలమూ పరంపరగా జన్మలు తీసుకుంటూ భూమి మీదకు మళ్ళీ, మళ్ళీ తిరిగి రావడం జరుగుతుంది. లేదా భూతల చైతన్యశక్తి ఫ్రీక్వెన్సీకు సరిపడే ఇతర సమాంతర లోకాలలో (parallel worlds) జన్మలు తీసుకుని చైతన్య వికాసం చెందడం సంభవిస్తుంది. ఆత్మ ఆ విధంగా భూమి మీదనే కాకుండా ఇతర సమాంతర లోకాలలోకి ప్రయాణించి జన్మలుతీసుకుని అనుభవాలు పొందుతుంది.

భూమితో పోల్చదగ్గ ఫ్రీక్వెన్సీ స్థాయిగల ఇతర లోకాలనుండి ఆత్మశకలాలు భూమి మీదకు వచ్చి ఇక్కడ చైతన్య వికాసం చెందడం కూడ సంభవిస్తుంది. ఆత్మల రాకపోకలు ఒకే శక్తి, ఫ్రీక్వెన్సీ స్థాయిలు (frequency levels) గల లోకాలలో జరుగుతూ, వాటి చైతన్యశక్తి స్థాయి ఆ లోకాల గరిష్ట విలువను దాటినపుడు మరింత ఉన్నత లోకాలకు వెళ్ళి అక్కడ పరిణామం చెందుతాయి. ఒక శక్తి, ఫ్రీక్వెన్సీ స్థాయి గల తలాలను ఎంచుకోగల స్వతంత్రత ఆత్మలు కలిగి వున్నాయి. భూమిని వదిలి పెట్టిన ఆత్మ మళ్ళీ భూమి మీదకు తిరిగి రావాలనే రూలేమీ లేదు. ఇపుడు భూమ్మీద వున్న మానవజాతి ఖనిజాలనుండి పరిణామం చెందుతూ వచ్చిన వాళ్ళతోను, వేరే సిస్టమ్స్ (systems) నుండి వచ్చిన వాళ్ళతోను నిండివుంది. వేరే సిస్టమ్స్ (systems) లేదా తలాలలో భూమి మీద పోలిన భౌతిక రూపాలు వుండవు. అక్కడ తలంలో ఉండే పరిస్థితుల కనుగుణంగా భౌతిక రూపాలుంటాయి.

* * *

వేరే వేరే స్థాయిలలో (various levels) ఇతర డిగ్రీలలో గల శక్తి (energy)ని అనుసరించి మానసికంగా ఆధ్యాత్మికంగా చైతన్యశక్తిపరంగా ఆత్మల మధ్య సంభాషణ (communication) కొనసాగుతుంటుంది. అంతర్ ప్రపంచం ద్వారా అన్ని జీవజాతులు కమ్యూనికేషన్ (communication) జరుపుకుంటున్నాయి. జాగృదావస్థ (awakening state) కంటే నిద్రావస్థ (sleep ing state)లో ఈ కమ్యూనికేషన్ చాల చక్కగా

జరుగుతుంటుంది. స్వప్నావస్థలో (dream state) మీ జీవజాతులన్నీ కమ్యూనికేషన్ చేసుకుంటున్నాయి. మనిషి కంటే ఎంతో మెరుగ్గా జంతు జాతులు మీ ఆలోచనలను (thoughts) గ్రహిస్తాయి. పెంపుడు జంతువులు తమ యజమానిని చక్కగా అర్థం చేసుకుంటున్నాయి. తమ యజమాని ఆలోచనలను చాల చక్కగా పసిగడతాయి. అన్ని జీవజాతుల మధ్య కమ్యూనికేషన్ (communication) టెలీపతి (telepathy) ద్వారా జరుగుతుంది.

జీవజాతులన్నీ (species) ఒక లోకాన్ని (world) ఎంచుకున్నపుడు వాటి దేహాలన్నీ ఒకే రకమైన జీవరసాయనిక శక్తి (bio-chemical energy) విద్యుదయస్కాంత శక్తి (electromagnetic energy) ల చేత నిర్మించబడి వుంటాయి. వాటి దేహాలలోని జీవకణాలన్నీ ఆ లోకంలోగల ఖనిజలవణాలు (minerals), ధాతువులతో నిర్మింపబడి వుంటాయి. జీవజాతులుగా ఉన్న ఈ ప్రాణులన్నీ వివిధ శక్తి స్థాయిలు (energy levels) చైతన్యశక్తి స్థాయిలు (consciousness levels) కలిగి వుంటాయి. అవి కలిగి వున్న చైతన్యశక్తి (consciousness) ని బట్టి వాటి పరిణామం (evolution) ముందుకు సాగుతుంటుంది. జీవజాతులన్నీ వేర్వేరు చైతన్యశక్తి స్థాయిలు (various consciousness levels) కలిగి వుంటాయి. మానవజాతి (man kingdom), పక్షిజాతి (bird kingdom), జంతుజాతి (animal kingdom) ఇతర జీవజాతులన్నీ భూమి యొక్క ఖనిజ లవణాలతో, ధాతువులతో కూడిన జీవరసాయనిక దేహాలు కలిగివున్నాయి.

మనిషి దేహానికి గల జీవరసాయనిక పదార్థం, ఇతర జీవజాతుల దేహాలలోని జీవరసాయనిక పదార్థం ఒకే విధంగా వుంటుంది. కాకపోతే, వాటి దేహాలలో చైతన్యశక్తి ఒక్కొక్క దానికి ఒక్కో విధంగా వుంటుంది. మనిషి మరి జీవజాతుల మధ్య పోటీ వాతావరణం వుండదు. ఒక జాతి ఇంకొక జాతితో పోటీపడి ఒకరినొకరిని నాశనం చేసుకునే పరిస్థితులు ఎప్పుడూ జరగవు. అన్ని జాతులు సమిష్టిగా (collectively) ఒక జాతితో ఇంకో జాతి సహకరించుకుంటూ చైతన్య పరిణామం చెందుతున్నాయి. జీవజాతుల మధ్య పోటీ వాతావరణం ఏర్పడి ఒక జాతి, ఇంకొక జాతిని ధ్వంసం చేసుకునే దిశలో సాగితే ఈ ప్రపంచం ఎన్నటికీ ఉండేది కాదు.

* * *

ప్రతి జీవికి జనన మరణ చక్రాలు వున్నట్లే నాగరికతలకూ (civilizations) జనన మరణ చక్రాలు వున్నాయి. మరణం తర్వాత మళ్ళీ జన్మ తీసుకుని చైతన్య

పరిణామంలో మరింత ముందడుగు వెయ్యడం ప్రతి ఆత్మ శకలానికి (soul entity) జరుగుతుంది. జన్మ పరంపరల (series of incarnations) ద్వారా చైతన్య వికాసం (expansion of consciousness) అభివృద్ధి చెందుతూంటుంది. భూమి మీద ఇది వరకే ఎన్నో నాగరికతలు (civilizations) వెలసి అంతర్ధానమయ్యాయని ఇది వరకే మీకు తెలియజెయ్యడం జరిగింది. ఒక్కో నాగరికతలో మనిషితో సహా అన్ని జీవజాతులు (species) కొన్ని నిర్ధిష్ట లక్ష్యాలను (specific goals) ఎంచుకుని ప్రవేశిస్తాయి. చైతన్య పరిణామపథంలో (in the way of evolution of consciousnesss) జీవజాతులన్నింటి సమిష్టి లక్ష్యం (collective goal) ఆ నాగరికత లక్ష్యం అవుతుంది. ఇపుడు మీరు వుంటున్న నాగరికతలో మానవజాతి + ఇతర జీవజాతులు సమిష్టిగా (collectively)ఒక లక్ష్యాన్ని ఎంచుకున్నారు. మానవజాతి చైతన్య పరిణామం ఇతర జాతుల చైతన్య పరిణామాన్ని ప్రభావితం (influence) చేసి నడిపించే స్థితిలో వుంది. అన్ని జీవజాతులు మానవజాతి (man kingdom)చైతన్య వికాసానికి తోడ్పాటునందిస్తున్నాయి. అట్లాగే అన్ని జీవజాతుల చైతన్య వికాసం మానవజాతి చైతన్య వికాసం పై ఆధారపడి వుంది. అన్ని జీవజాతులకు నాయకత్వంవహించి జీవజాతుల చైతన్య పరిణామాన్ని సంరక్షించే బాధ్యత ఇవాళ మీ మానవజాతికి వుంది. జీవజాతులన్నింటికీ మీరు పెద్దన్నయ్య (big brother) లాంటివారు.

ఒక్కొక్క నాగరికతలో జీవరాశులు ఒక్కొక్క రీతిలో భౌతిక దేహాలు ధరించడం జరిగింది. ఒక నాగరికతలో సృష్టి జరిగిన జీవజాతులు మరో నాగరికతలో కంటిన్యూ (continue) అవవచ్చు లేదా అంతరించి పోవచ్చు. కొన్ని నాగరికతలలో మీరెప్పుడూ కనివిని ఎరుగని జంతువులు వుండేవి. ఆ జంతు జాతులు ప్రస్తుతం మీ నాగరికత (civilization)లో లేవు. ఆయా నాగరికతల లక్ష్యాలు భూమి మీద శక్తి (energy) చైతన్యశక్తి (consciousness)ల ఆధారంగా నిర్దేశించబడినాయి. మనుష్యుల ఆకారాలు (physical shapes) ఒక నాగరికతలో ఒక విధంగా, మరో నాగరికతలో మరో విధంగాను వుండేవి.ఆ ఆకారాలు ఒక నాగరికత నుండి మరో నాగరికతకు కంటిన్యూ (continue) అవ్వడమో లేదా మారిపోవడమో జరుగుతుంది. ఒక నాగరికతలో మనుష్యులు యాభై (50)అడుగుల ఎత్తు (height) కలిగి వుండి చాల భారీకాయులుగా వుండేవారు. వారి ఆయుష్షు కొన్ని వందల సంవత్సరాలుగా వుండేది. ఇంకో నాగరికతలో జంతువు తల + మనిషి దేహం వుండేది. ఇంకో నాగరికతలో మనిషి తల + జంతువు దేహం

వుండేది. సగం మనిషి + సగం చేప గల దేహాలు గల మనుష్యులు ఒకానొక నాగరికతలో వుండేవారు. కొన్ని నాగరికతల్లో మనిషి డామినేట్ (dominate) చెయ్యడం, కొన్ని నాగరికతల్లో ఒక జంతు జాతి డామినేట్ చెయ్యడం, ఇంకా కొన్ని నాగరికతల్లో సముద్ర జాతులు డామినేట్ చెయ్యడం జరిగాయి. ఒక్కొక్క నాగరికతలో చైతన్య పరిణామం చెందడం కోసం జీవజాతులు ప్రయోగాలు చెయ్యడం, వాటి నుండి పాఠాలు (lessons) నేర్చుకోవడం జరుగుతుంది. ఒక నాగరికతలోని ప్రయోగాలు (experiments) ఇంకొక నాగరికతలోని ప్రయోగాలకు భిన్నంగా (different) వుంటాయి. నాగరికతలలో జీవజాతులన్నీ ఎంచుకున్న లక్ష్యాలకనుగుణంగా వాటి ప్రయోగాలు మారుతూ వస్తున్నాయి.

ఆయా నాగరికతలలో అభివృద్ధి చెందిన సైన్స్ మరి టెక్నాలజీ వేరు వేరుగా వుండేవి. కొన్ని నాగరికతలలో మానవజాతి గ్రహాంతర యానం (journey to other planets) అతి తక్కువ సమయంలో చేసేది. ఇతర లోకాలలోనికి (other worlds), ఇతర డైమన్షన్లలోనికి (other dimesions) ఆత్మశక్తి ద్వారా, సూక్ష్మశరీర యానం ద్వారా చాల సులభంగా ప్రయాణం చేసి వచ్చేవారు. అక్కడ జ్ఞానాన్ని (knowledge) భూమి మీదకు తీసుకువచ్చేవారు. వీటన్నింటినీ చాల సులభంగా సాధించగల సామర్థ్యం (capacity) ఇవాళ మీ మానవజాతికి వుంది. కాని ఎన్నో లిమిటేషన్స్‌లో (limitations) ఇరుక్కున్న మీరు వాటిని ఛేదించాల్సి వుంది. ఒక్కొక్క నాగరికతకు ఒక్కొక్క విధంగా లక్ష్యం వుంటుంది. జీవ జాతులన్నింటికీ లక్ష్యం ఒకటిగానే వుంటుంది.

ఆత్మలు జీవరాశులుగా దేహాలు తీసుకుని భూమి మీద ప్రవేశించడం, నిష్క్రమించడం జరుగుతూనే వుంటుంది. జీవరాశులన్నింటితోబాటు భూమి కూడ చైతన్యశక్తి పరంగా అభివృద్ధి చెందుతుంటుంది. జీవరాశులన్నీ భౌతిక వాతావరణాన్ని (physical atmosphere) సృష్టిస్తున్నాయి. భౌతిక వాతావరణం ఏ ఒక్క జీవజాతికీ ప్రత్యేకంగా సంబంధించినది కాదు.

జీవరాశులన్నింటి పరిణామమే భూమి యొక్క పరిణామం. భూమి యొక్క పరిణామమే విశ్వచైతన్యశక్తి పరిణామం. ఆత్మశకలాలకు ఒక్కొక్క లోకం ఒక ప్రయోగశాల (laboratory). భూమి ఒక ప్రయోగశాల. భూమి అనే ప్రయోగశాలలో ఒక్కొక్క నాగరికత కాలానికి సంబంధించి కొన్ని లక్ష్యాల కోసం జీవజాతుల చేత ప్రయోగాలు జరుగుతూ వస్తున్నాయి. ఆ ప్రయోగాలలో ముందు వెనుకడుగులు వెయ్యడం జరుగుతుండవచ్చు. కాని చైతన్య పరిణామపరంగా ఆ జీవజాతులన్నింటికీ ముందడుగే.

ఒక్కొక్క నాగరికత వెలసి అంతరించిపోయే కొద్దీ భూమి యొక్క చైతన్యశక్తి పరిణామం పెరుగుతూ వుంటుంది. భూమి + దాని మీద ఇతర జీవజాతుల చైతన్య పరిణామం ఎదుగుతూ, ఎదుగుతూ అనంతకాలం సాగుతూనే వుంటుంది. నాగరికతలలో ఎంచుకున్న లక్ష్యాలు అన్ని జీవజాతుల చైతన్య వికాసాన్ని పెంచుతాయి. ఆధ్యాత్మికత (spirituality) అవగాహన శక్తి (understanding capacity) ఆ లక్ష్యాలకు తోడయినట్లైతే వాటి చైతన్యశక్తి పరిణామం అతి వేగంగా జరుగుతుంది. ఒక నాగరికతలో ఉద్భవించిన జీవరాశులు మరింత ఉన్నతి పొందడం కోసం మళ్ళీ భూమి మీద ఇంకొక నాగరికతలో ప్రవేశిస్తాయి. అవి భౌతిక రూపాలను (physical shapes) వేరే విధంగా ఎంచుకోవడం జరుగుతుంది. ఆ జీవ రాశులన్నీ వేరే లక్ష్యాలు, సవాళ్ళు ఎంచుకుని ఇంకొక నాగరికతలోనికి ప్రవేశించి పరిణామం చెందుతాయి. అలా ఎన్నో సవాళ్ళు, మలుపులు, చైతన్య పరిణామాలు దాటుకుంటూ, ఒక్కొక్క అడుగూ ముందుకేసుకుంటూ ఇవాళ మానవజాతి + ఇతర జీవరాశులు ఆత్మ చైతన్య పరిణామం చెందుతూ వున్నాయి.

ఒక నాగరికతలో అంతరించిన జీవజాతులు ఇంకో నాగరికతలో మరో రకమైన భౌతిక రూపాన్ని తీసుకోగల స్వేచ్ఛను కలిగి వుంటాయి. అట్లే చైతన్య పరిణామంలో ముందడుగు వెయ్యడానికి అందుకు అనుగుణంగా వున్న లోకాన్ని ఎంచుకునే స్వేచ్ఛ (freedom) కలిగి వున్నాయి. మళ్ళీ భూమి మీదకు తిరిగి రావాలనే రూలేమీ లేదు (there is no such rule). జీవజాతుల చైతన్య పరిణామం యొక్క అభివృద్ధి (development) ఒక అడుగు తర్వాత మరో అడుగు (one step after another) లాగ ఒకే దిశలో (direction) కాకుండా అనేకానేక దిశలలో (many many directions) జరుగుతుంది.

జీవజాతులన్నింటి చైతన్య పరిణామం వేగంగా చకాచకా (by leaps and bounds) జరగాలంటే ఆధ్యాత్మిక శాస్త్రాన్ని (spiritual science) అంతర్ ప్రపంచాన్ని (interior world)వినియోగించుకోవడం జరగాలి. ఈ నాగరికతలో ఇవాళ మానవజాతి అన్ని జీవజాతుల చైతన్య పరిణామాన్ని ప్రభావితం చెయ్యగల స్థితిలో వుంది. కనుక ఆధ్యాత్మిక శాస్త్రాన్ని, అంతర్ ప్రపంచాన్ని వినియోగించు కోవడంలో ఎంతో సాధన చేయవలసి వుంది. మీరు + మీతో బాటు వున్న జీవజాతులన్నింటి చైతన్య పరిణామాన్ని ముందుకు నడిపించడమో , లేదా మీ మానవజాతి మూర్ఖత్వం (stupidity), అవగాహనా రాహిత్యం (lack of understanding), ఆధ్యాత్మికత లేమి (lack of spirituality)తో

భూమి మీద నుండి నిష్క్రమించడమో ఈ రెండింటిలో ఏదో ఒకటి జరగడానికి బాధ్యత వహించి నడిపించాల్సిన బృహత్తర బాధ్యత (a grand responsibility) మానవజాతి పైన వుంది.

మానవజాతిని, ఇతర జీవజాతులను వేరుచేసి చూడడానికి వీలు లేదు. అన్నీ సమిష్టిగా చైతన్య పరిణామం చెందాల్సిందే. అన్ని జీవజాతుల వాస్తవాలు (realities) ఒక దానితో ఒకటి కలిసిపోయి వున్నాయి. ఒక దానికొకటి సహకరించుకుంటూ అన్ని దిశలల్లోకి వ్యాకోచం చెందాల్సిందే. అన్ని కోణాల్లోకి దూసుకు పోవాల్సిందే. దేహంలో ఏదైనా ఒక అవయవానికి (one organ) ప్రమాదం జరిగినపుడు దాని తాలూకు బాధ (suffering) దేహం మొత్తం పంచబడుతుంది. దేహంలోని ఇతర భాగాలన్నీ సహకరించి ఆ బాధను తొలగించడానికి, నయం చేయడానికి పూనుకుంటాయి. అట్లాగే భూమి మీద ఏదైన ఒక జీవజాతికి సమస్య (crisis) వచ్చినపుడు దాన్ని అన్ని జీవజాతులు భరించాల్సి వుంటుంది. అన్ని జీవజాతుల చైతన్యశక్తి అటువైపు ప్రవహించి ఆ సమస్యను పరిష్కరించడం జరుగుతుంది.

ఒక జాతి అభివృద్ధిలో (development) వుంటే దాని ప్రభావం అన్ని జీవజాతులకు విస్తరిస్తుంది. ఒక జాతి సమస్య (crisis) లో వుంటే దాన్ని అన్ని జాతులు భరించాల్సి వుంటుంది. భూమి మీద ఒక ప్రాంతంలో దుర్భిక్షం (starvation) తాండవించి అక్కడి మానవులు సమస్యలో (crisis) వుంటే దాని ప్రభావం (influence) ఇతర ప్రాంతాలలోని మానవుల మీద పడుతుంది. **భూమి మీద ఒక ప్రాంతంలో మానవులు ఆధ్యాత్మిక అభివృద్ధి** (spiritual development) **సాధిస్తే దాని ప్రభావం భూమండలంలో గల ప్రజానీకానికంతా వ్యాపిస్తుంది.** అందరూ దానివల్ల లబ్ధి (benefit) పొందుతారు. మానవజాతి లబ్ధి (benefit) పొందితే తద్వారా ఇతర జీవరాశులు + భూమి లబ్ధి పొందుతుంది. భూమి + దానిపై జీవరాశుల అభివృద్ధి, వికాసం విశ్వచైతన్యానికి తోడవుతుంది.

* * *

ఒక్కొక్క నాగరికతలో జీవజాతులు నిర్దేశించుకుంటున్న లక్ష్యాల తీరుతెన్నులు ఒక్కో విధంగా వుంటున్నాయి. వాటికనుగుణంగా భూమి యొక్క భౌతిక స్వభావం (physical nature) దాని మీద భౌతిక వాతావరణం (physical reality) మార్పులు

చెందుతున్నాయి. మీకు కొన్ని అతి సమీప నాగరికతలలో (your nearest civilizations) సంభవించిన భౌతిక వాస్తవాలు (physical realities)ఇప్పటి పరిస్థితులకు భిన్నంగా వుండేవి. భూ అయస్కాంత ఉత్తర దక్షిణ ధృవాలు ఇప్పుడున్న స్థితి (position)కి తారుమారుగా (in reverse) వుండేవి. మీకు సమీపంలో జరిగిన మూడు నాగరికతలలోని ఒక నాగరికతలో అభివృద్ధి చెందిన సైన్సు (science), టెక్నాలజీ (technology) మీ సైన్సు, టెక్నాలజీ కంటే ఎంతో ఉన్నతంగా వుండేవి. పెట్రోలు (petrol), డీజిల్ (diesel) ఇంధనాలకు బదులుగా ధ్వని (sound) ని ఇంధనంగా వాడుక చేశారు. ధ్వనిని ఉపయోగించి భౌతిక శరీరాన్ని హీలింగ్ (healing) చేసేవారు. ధ్వని ద్వారా రవాణా వాహనాలను (transport vehicles) నడిపేవారు. పదార్థాన్ని కదల్చడానికి, బరువులను తూకం (weighing) వెయ్యడానికి ఇంకా అనేక కార్యకలాపాలకు ధ్వనిని వాడుక చెయ్యడం జరిగింది. ఇపుడున్న ఫిజిక్స్ (physics)కు భిన్నంగా వేరే దిశలో ఫిజిక్స్ అభివృద్ధి పరచబడింది. అంతర్ ప్రయాణం చేసి అంతకు ముందు సంభవించిన నాగరికతలలోని జ్ఞానాన్ని సంపాదించేవారు.వేరే లోకాలు (other worlds) వేరే సిస్టమ్స్ (systems) లోనికి చాల సులభంగా సూక్ష్మ శరీరయానం (astral travel) చేసేవాళ్ళు. అక్కడి జ్ఞానాన్ని సంపాదించుకునే వాళ్ళు. ఎరుకతో సూక్ష్మ శరీరయానం చెయ్యడం ఇవాళ మీ మానవజాతి సాధన (practice) చెయ్యవలసి వుంది.

ఆ నాగరికతల నుండి నిష్క్రమించిన చాల జీవరాశులు వేరే సిస్టమ్స్ (systems)లో పరిణామం చెందుతున్నాయి. పదార్థం (matter) తో కూడిన భౌతిక రూపాలను (physical forms) పొందే స్థితిని దాటివేశారు. భౌతిక పదార్థంతో (physical matter) కూడిన దేహాలు (bodies) తీసుకుంటున్న దశలో (phase) భూమి దాని సమాంతర లోకాలలో (parallel worlds) పునర్జన్మలు (reincarnations) తీసుకుంటూ వుండేవాళ్ళు. ఆ స్థితిని (phase) దాటిన తర్వాత వేరే డైమన్షన్స్ (dimensions) గల లోకాల లోనికి ప్రవేశించారు. లుమేనియా (lumania), అట్లాంటిస్ (atlantis) నాగరికతలు మీకు అతి సమీపకాలంలో సంభవించాయి. అన్ని నాగరికతల జ్ఞానం ఆకాశ రికార్డులలో (akashic records) భద్రపరచబడివుంది. మీరు అంతర్ ప్రయాణం చేసి ఆయా ఫ్రీక్వెన్సీ (frequency)లకు ట్యూన్ (tune) అయినపుడు, ఆ ఫ్రీక్వెన్సీ తాలూకు (related) ఆకాశ రికార్డులను అధ్యయనం (study) చెయ్యవచ్చు. అట్లాంటిస్ నాగరికత ప్రస్తుతం ఇపుడున్న అట్లాంటిక్ మహాసముద్రం (atlantic ocean) అడుగు భాగమున

మునిగిపోయి వుంది. మూ (mu) నాగరికత పసిఫిక్ మహాసముద్రంలో (pacific ocean) మునిగిపోయి వుంది.

ఇప్పటికీ మీలో చాల మంది స్వప్నావస్థలో (in dream state) సూక్ష్మశరీర యానం ద్వారా ఆ నాగరికతలను దర్శించి వస్తున్నారు. స్వప్నాలను (dreams) జ్ఞప్తికి (remembering) తెచ్చుకుని వీటినుండి మీరు లబ్ధి పొందవచ్చు., భూమి మీద ఇదివరకే వెలసిన నాగరికతల గురించి ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే అంతర్ శక్తిని ఉపయోగించడం ద్వారా ఆత్మశక్తి ఎన్ని కోణాలలోనైనా (in all angles) చైతన్య పరిణామం చెందవచ్చునని మీకు తెలియజెయ్యడం కోసం. ఆత్మ శకలాలన్నీ తమ అంతర్ శక్తిని (inner energy), మనోశక్తిని (mind power) ప్రత్యేక లక్ష్యాల దిశలో కేంద్రీకరించి (concentrating) తనకు ఇష్టమొచ్చిన రీతిలో దేహాలను ధరించి వివిధ జీవరాశులుగా అవతరించి నిరంతరమూ చైతన్య పరిణామం చెందుతూ వున్నాయని తెలియజేయడం జరుగుతుంది. అంతరాత్మశక్తి (psychic energy) లీలలు ఎన్ని విధాలుగానైనా వుంటాయని తెలియజేయడం జరుగుతుంది. శక్తిని (energy) ఏ విధంగానైనా రూపాంతరం (transformation) చెందించవచ్చునని, దాని డైనమిక్స్ (dynamics) అంతా మీ మనోశక్తి (mind power) లో ఇమిడి వుందని తెలుస్తుంది గదా!

జీవజాతులన్నీ ఏ దిశలో మనోశక్తిని (mind power) కేంద్రీకరింపజేస్తే ఆ దిశలో భూమి వాతావరణం, భౌగోళిక మార్పులు కూడ మార్పు చెందుతాయి. మీ జీవజాతులన్నీ నేల, నీరు అంటే ఖండాలు, సముద్రాలు, దీవులు (islands) ద్వీప కల్పాలు (peninsulas) పర్వతాలు, రాళ్ళు, నగరాలు, వృక్షాలు మొదలగునవి తమ ఊహాశక్తితో సంకల్పించడం వల్ల దానికనుగుణంగా భౌతిక మార్పులు (physical changes) భూమి మీద సంభవించాయి. ఒక నాగరికతలో జీవజాతులు భూమి మీద ఏయే వాతావరణాలు, పరిస్థితులు కావాలని ఊహాశక్తి (imagination) ద్వారా సంకల్పిస్తాయో వాటి కనుగుణంగా భూమి మీద పదార్థం (matter) దాని స్వభావం (its nature) మారుతుంది. గడిచిన ఒక నాగరికతలోగల మానవజాతి నీటి లోపల వ్యవసాయం (agriculture) చేసే వాళ్ళు. వాటికనుగుణంగా భౌతిక పదార్థం (physical matter) వుండేది. అప్పటి మానవజాతి (man kingdom) భౌతిక దేహాలు (physical bodies) వేరే విదంగా (in a different manner) వుండేవి. అంతరంగ శక్తి (psychic energy)ని బట్టి బాహ్య ప్రపంచంలోగల పదార్థం (matter) ప్రభావం చెంది మార్పు

చెందుతుంది. కాల పరిస్థితులనుబట్టి భూమి మీద పదార్థం యొక్క స్వభావం (nature) నిరంతరమూ (continuously) మార్పులకు లోనవుతూనే వుంది.

ఇది వరకు భూమి నుండి నిష్క్రమించిన అన్ని జీవజాతుల తాలూకు DNA భూమి తలంలో (earth plane) ఆకాశ రికార్డులుగా పదిలంగా భద్రపరచ బడివున్నాయి. అంతర్ ప్రపంచం నుండి శక్తిని (energy) చాల ఫ్రీగా (freely) బాహ్య ప్రపంచంలోనికి పంపగలగడం, దాన్ని నియంత్రించడం (controlling) లాంటి డైనమిక్స్ (dynamics) తెలిసినంత కాలం, భౌతిక వాస్తవికత (physical reality) ఆధ్యాత్మికతలను (spirituality), అంతర్ శక్తి వినియోగం మేళవించడం (combining) జరిగినంతకాలం ఆ నాగరికత మనుగడ కొనసాగుతుంది. ఆధ్యాత్మికత + భౌతిక వాస్తవికత మేళవించబడకపోతే ఆ నాగరికత, దానిలోని జీవరాశులు అంతరించిపోతాయి. ఇపుడు మీరు వున్న పరిస్థితులు (circumstances) అలాంటివే! భౌతిక వాస్తవానికి (physical reality) సమాంతరంగా (parallel) ఆధ్యాత్మికతను (spirituality) అభివృద్ధి పరుచుకుంటూ రావాల్సిన తరుణమిది. మైండ్ పవర్‌ను చాలా ఫ్రీగా (freely) అంతర్ ప్రపంచం నుండి బాహ్య ప్రపంచంలోనికి చొప్పించి మ్యానిపులేట్ (manipulate) చెయ్యడం నేర్చుకోగలిగితే మీ జీవజాతుల చైతన్య పరిణామం అతివేగంగా సాగగలదు.

* * *

జాగృదావస్థకు (waking state), నిద్రావస్థలకు మధ్య ఎంతో అగాధం ఉందని, నిద్రావస్థలో జరిగే అంతర్గత మార్పులు మానవజాతికి అందుబాటులో లేవని మీరు భావాలను (ideas) ఏర్పరుచుకున్నారు. ఆ భావాలకనుగుణంగా హిప్నాసిస్ (hypnosis)కు లోనై ఎన్నో పరిమితులలో (limitations) జీవిస్తున్నారు. ప్రతి రోజూ నిద్రలో (in sleep) వివిధ డైమన్షన్స్‌కు (other dimensions) వెళ్ళి రావడం, అక్కడి అనుభవాలు, జ్ఞానం తీసుకురావడం జరుగుతూనే వుంది. ఆ కలలను (dreams) గుర్తుంచుకోవడంలో మీరు విఫలమవుతున్నారు. మీ కలలలో (dream) ఇతర డైమన్షన్స్ (other dimensions)కు సంబంధించిన విషయాలు స్పష్టంగా (clearly) చూడగలుగుతారు; అర్థం చేసుకోగలుగుతారు. జాగృదావస్థలో మీరు ఏర్పరుచుకున్న లిమిటేషన్స్ (limitations)ను అక్కడ మర్చిపోయి, పూర్తి స్వేచ్ఛతో (with total freedom) మీ మనోశక్తికి గల అనంతమైన శక్తి (infinite energy)ని అక్కడ వినియోగించ గలుగుతున్నారు. ఆ కలలలో తారసపడే భాష, ఛాయలు (images) మీకు ఎన్నో

సందేశాలను (messages) ఇవ్వగలుగుతాయి. వాటిని డీకోడ్ (decode) చెయ్యడం మీరు సాధన (practice) చెయ్యాలి. నిద్ర నుండి లేచిన తర్వాత ఆ కలలను గుర్తుకు తెచ్చుకోవడం కూడ మీరు ఎంతో సాధనచెయ్యాలి. మీరు ఏర్పరచుకున్న భాష (language) చాల లిమిటేషన్స్ (limitations)కు లోబడి ప్రతిదాన్ని నిర్వచించడానికి అలవాటుపడిపోయింది. దానివల్ల మీకు లిమిటెడ్ (limited) జ్ఞానం స్వప్నాల ద్వారా అందుతూంది. భాషతో (language) నిమిత్తం లేకుండా ఆత్మశక్తి ఈ విశ్వంలోని సమాచారాన్నంతా (information) సేకరించగలుగుతుంది; అర్థం చేసుకోగలుగుతుంది.

జాగృదావస్థ (waking state) ఎంత సహజంగా వుందో, అంతే సహజంగా స్వప్నావస్థ (dreaming state) వుంది. జాగృదావస్థలో మీ పరిణామం ఒక కోణంలో (one angle) కొనసాగితే, ఇంకో కోణంలో (another angle) స్వప్నావస్థ కొనసాగుతుంది. మీరు దాన్ని గుర్తించడం లేదు. స్వప్నావస్థను (dreaming state) జ్ఞాపకం (memory) లోనికి తీసుకురావడం ద్వారా ఆత్మకుగల అనంతమైన శక్తి (infinite power of the soul) మీకు విశదమవుతుంది. మానవజాతి చైతన్య పరిణామం చెందడంలో స్వప్నావస్థ (dream state) ఇతోధికంగా సహాయపడుతుంది.

స్వప్నావస్థలో మీరు చేస్తున్న సూక్ష్మశరీరయానం (astral travel), ఇతర లోకాలలో (other worlds), ఇతర డైమన్షన్స్‌లో పొందే అనుభవాలను పరోక్షంగా మీ జీవితానుభవాల్లోనికి తీసుకురావడం జరుగుతుంది. జాగృదావస్థలో మీ జీవితంలో జరిగే సంఘటనలన్నీ చాల ప్రత్యక్షంగా (directly) మీ ఎరుకలో జరుగుతున్నాయి. అన్ని అనుభవాలు మీకు ఒక డ్రామా (drama)గా వుంటాయి. మీ జీవితంలో ప్రవేశించే డ్రామాలలో మీరే ముఖ్య పాత్రధారి. భౌతిక సంఘటనల రూపకల్పనలో మీ దేహం (physical body) కూడ రంగప్రవేశం (involve) చేస్తుంది. అన్ని భౌతిక సంఘటనలూ మీరు కేంద్రంగా మీ చుట్టూ పరిభ్రమిస్తుంటాయి. భౌతిక జీవితంలో నడిచే డ్రామాలన్నీ ఒకే తలం (only one plane) మీద వుంటాయి, ఒకే దిశలో దాని ప్రయాణం సాగుతుంది.

అయితే స్వప్నావస్థలో పొందే అనుభవాలు ఏ భౌతిక నియమాలకు (physical laws) ప్రభావితం కావు. క్షణకాలంలో ఎన్నో తలాలను దర్శిస్తారు. అనేక దిశలలో (many directions) మీ ప్రయాణం సాగుతుంటుంది. ఎన్నో రెట్ల శక్తి సామర్థ్యాలను సాధించగల శక్తి మీరు కలిగి వున్నారనే విషయం స్వప్నావస్థలో తెలుస్తుంది. ఆత్మకు గల అనంతమైన శక్తి (infinite power) స్వప్నాల ద్వారా మీకు తెలియజెయ్యబడుతుంది.

మీరు ఈ దేహానికి మాత్రమే పరిమితం కాదని, ఆత్మ అనే మహానది (a great river) నుండి ఒక పిల్ల కాలువ (a small canal) రూపంలో మీ దేహాన్ని ఎంచుకుని పరిణామం చెందుతుందని తెలుస్తుంది. ఆత్మ అనే మహానదికి ఎన్నో పిల్లకాలువలు వున్నాయి. ప్రతి పిల్లకాలువ ఆత్మయొక్క ఒక భాగం. ప్రతి పిల్ల కాలువ ఒక దేహాన్ని కలిగి వుందని మీకు తెలుస్తుంది. ఆత్మ అనే మహానది ఏకకాలం (simultaneously)లో అనేక పిల్లకాలువలను (దేహాలను) ఒకే సారి అనేకచోట్ల కలిగి వుందని స్వప్నావస్థలో మీకు తెలుస్తుంది. **అంటే ఆత్మయొక్క ఒకానొక శకలం మీ దేహంలో వుంటూ పరిణామం చెందుతూ వుంది. మిగతా ఆత్మశకలాలు ఇతర దేహాలలో పరిణామం చెందుతున్నాయి. ఈ ఆత్మశకలాల మధ్య నిరంతరాయంగా చైతన్య ప్రవాహం (consciousness flow). జ్ఞానమార్పిడి జరుగుతూంది. వాటిని మీరు స్వప్నాలలో తెలుసుకోవచ్చు.**

జాగృదావస్థలో మీకు ఎన్నోవిషయాలు మరుగుపర్చబడివున్నాయి. ఆత్మశక్తికి ఎంత అపారమైన శక్తి వుందో మీకు జాగృదావస్థలో తెలియడం లేదు. మీరు ఇంట్లో T.V (టెలివిజన్) ద్వారా ఒక ఛానెల్ (channel) లోని ప్రోగ్రాం (programme) చూస్తూవున్నారు. ఆ T.Vలో ఇంకా ఎన్నో ఛానెల్స్ ఇమిడివున్నాయి. ఒక ఛానెల్ మాత్రమే చూస్తూవున్న మీకు ఇతర ఛానెల్స్ కనిపించవు. కాని చూడకపోయినప్పటికీ ఎన్నో చానెల్స్ ఒకే సమయంలో ఆ టి.వి. లో ఇమిడివున్నాయి. మీకు ఒక ఛానెల్‌ను మాత్రమే చూస్తూ, మిగతా చానెల్స్ టి.వి.లో నడవడం లేదు అదంతా మిథ్య అని ఊహించి నట్లుంటుంది మీ ఆత్మశక్తి గురించి. జాగృదావస్థలో మీరు ఒక ఛానల్‌లో ఒక ప్రోగ్రామ్‌నే చూస్తున్నారు. అంటే జీవితాన్ని భౌతిక ప్రపంచాని కనుగుణంగా, ఆత్మశక్తి ద్వారా ఒక దిశలో మాత్రమే మీరు గ్రహించగలుగు తున్నారు. టి.వి.లోని అన్ని ఛానెల్స్‌లోని ప్రోగ్రామ్స్‌ను ఒకేసారి చూస్తున్నట్లు స్వప్నావస్థలో ఆత్మశక్తి యొక్క అన్ని దిశలను ఒకేసారి దర్శిస్తున్నారు.

జాగృదావస్థలో భౌతిక ప్రపంచాన్ని, అందులోని అనుభవాలను ఒక ఫ్రీక్వెన్సీ (frequency)లో మాత్రమే ఆస్వాదిస్తున్నారు. టి.విలోని అన్ని ఛానెల్స్‌లోని ప్రోగ్రామ్స్ (programmes)ను ఒకేసారి చూస్తున్నట్లుగా స్వప్నావస్థలో భౌతిక ప్రపంచంలోని అన్ని ఫ్రీక్వెన్సీలు గల లోకాలను ఒకేసారి అనుభవం పొందుతున్నారు. ఇది జాగృదావస్థలో అసాధారణ విషయంగా మీకు తోస్తుంది. స్వప్నావస్థలో సాధారణంగా అన్పించేవి జాగృదావస్థలో అసాధారణంగా అసాధ్యంగా అన్పిస్తాయి. స్వప్నావస్థలో ఏవేవి

సాధారణమో, ఏవేవి సాధ్యమో అవన్నీ మీ ఆత్మశక్తికి సాధ్యమేనని తెలుసుకోండి.

మీరు టి.వి. చూస్తున్నపుడు ఒక గ్రహం పేలిపోయినట్లు, సముద్రాలు ఉప్పొంగినట్లు, సముద్రపు నీరునంతా ఒక పక్షి త్రాగేసినట్లు, రోదసీ యాత్రికుడు (astronaut) గుర్రం మీద ఆకాశంలో విహరిస్తున్నట్లు, పిల్లి సింహంతో పోట్లాడి గెల్చినట్లు ఇలా చాల దృశ్యాలు చూస్తున్నారనుకోండి. జాగృదావస్థలో మీకేమన్పిస్తుంది? అదంతా ఒట్టి భ్రమ, అది భౌతిక ప్రపంచంలో జరగడం అసాధ్యం అని భావిస్తారు. అదంతా సాధ్యమే అని మీరు నమ్మలేరు. సాధ్యమేనని నేను చెబితే ఆశ్చర్యపోతారు గదా! అట్లాగే స్వప్నావస్థలో (in dream state) టి.వి.లో చూసిన మాదిరిగానే మీరు ఎన్నో సాహసాలు (adventures) చేస్తున్నట్లు కలలు (dreams) వస్తుంటాయి. స్వప్నాలలో ఎన్నో సాహసాలు చేస్తారు, ఒక విమానాన్ని అలా నడిపేస్తారు. క్షణకాలంలోఎన్నో దేశాలు చుట్టివస్తారు. క్షణకాలంలో పెద్ద భవంతిని నిర్మిస్తారు. విచిత్రమైన జంతువులను చూస్తారు. మీకెప్పుడూ పరిచయం లేని మనుష్యులను చూస్తారు. మీకు పరిచయం లేని సంగీతం, నాట్యం, సాహిత్యం ఇతర భాషలు, ఇంకా కళలు ప్రదర్శిస్తారు. ఇలాగ ఎన్నో రకాలుగా కలలుగంటారు. అవన్నీ జాగృదావస్థలో అసాధ్యమేనని మీరు భావిస్తుంటారు.జాగృదావస్థలో నాట్యం రాదు కాని స్వప్నంలో చాల అద్భుతంగా నాట్యం చేశారు. ఇదెలా సాధ్యం? అని మీరు ఆశ్చర్యపోతారు. విమానం ముఖమే చూడని మీకు స్వప్నంలో విమానం నడిపారు. ఇది కూడ మీకు ఆశ్చర్యకరమే. జాగృదావస్థలో మీరు విమానం నడపగలరనేది నమ్మశక్యం కాలేదు మీకు. అయితే ఇవన్నీ మీ ఆత్మశక్తికి గల అపారమైన సామర్థ్యంను తెలియజేస్తున్నాయి. మీ అంతర్ శక్తికి అన్నీ సాధ్యమే! అన్నింటినీ మీరు సాధించగలరు. మీకు ప్రస్తుతం నాట్యం (dance) రాదు. మీ శక్తిని (energy) అటు కేంద్రీకరిస్తే నాట్యం చక్కగా నేర్చుకోగలరు. ఆ కెపాసిటీ (capacity) మీ అంతర్ శక్తిలో వుంది. కొంత ట్రైనింగ్ (training) ద్వారా విమానం నడిపే సామర్థ్యం మీలో వుంది. మీరు ఆ దిశలో సంకల్పించి ప్రయత్నిస్తే మీరు విమానం నడిపే పైలట్ (pilot) కావచ్చు. మీరు స్వప్నాలలో ఏయే ఫీట్స్ (feets), సాహసాలు (adventures) చేస్తున్నారో అవి అన్నీ మీ ఆత్మశక్తి ద్వారా సాధ్యమేనని మీకు సందేశం (message) ఇవ్వబడుతుంది.

ఒక వ్యక్తి తనకున్న క్యాన్సర్ (cancer) వ్యాధిని క్షణంలో నయం చేసుకున్నట్లు కలలో (in dream) చూశాడు. జాగృదావస్థలో కొచ్చేసరికి అతనికి నమ్మశక్యం కావడం

లేదు. డాక్టర్లు ఈ క్యాన్సరు నయం కాని వ్యాధి అని ఇది వరకే చెప్పారు. ఈ స్వప్నావస్థలో అతనికి క్యాన్సర్ క్షణంలో నయమవుతుందని సందేశం వచ్చింది.అతడు దాన్ని విశ్వసించినట్లయితే అతని దేహం క్యాన్సరును నయం చేసుకోవడానికి సిద్ధపడుతుంది. దాన్ని నయం చేయడానికి కావలసిన జీవరసాయనాలను, ఎంజైములను దేహం విడుదల చేసి క్షణకాలంలో క్యాన్సరును నయం చేయడం జరుగుతుంది. కాని అతడు జాగృదావస్థలో దాన్ని నమ్మడం లేదు. దేహానికి గల నయంచేసే శక్తిని అతను అడ్డుకుంటున్నాడు. కాన్షియస్ మైండ్(conscious mind) ద్వారా దేహానికి సూచనలిచ్చి క్యాన్సరును నయంచేసే శక్తిని ఆపగలుగుతున్నాడు. క్యాన్సరును నయంచేసే శక్తి అతని అంతర్ శక్తికి వుందని స్వప్నం అతనికి తెలియజేస్తున్నది.

దేహానికిగల అపారశక్తి, ఆత్మశక్తికి గల అపారశక్తి స్వప్నాల ద్వారా మీకు వ్యక్తపరచబడుతుంది. మీకు దైనందిక జీవితంలో (daily life) ఎదురయ్యే అనేక సమస్యలకు స్వప్నాలలో సమాధానాలు దొరుకుతాయి. శాస్త్రవేత్తలు (scientists) భౌతిక ప్రపంచం గురించి జాగృదావస్థలో ప్రయోగాలు చేసి వెదుకుతున్నారు. దీనివల్ల వాళ్ళకు చాల కాలయాపన జరుగుతున్నది. ఏవేవి పరిశోధించాలి? ఏ విధంగా పరిశోధనకుపక్రమించాలి? ఏ విధంగా ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి? అని ప్రయత్నిస్తే స్వప్నావస్థ (dream state) నుండి శాస్త్రవేత్తలకు సమాధానాలు లభిస్తాయి. స్వప్నప్రపంచాన్ని (dream world) ఉపయోగించడం చాల సులభమైన మార్గం. మీ ఆత్మశక్తికి ఏవేవి సాధ్యాలో మీ స్వప్నాల నుండి తెలుస్తాయి. వ్యాధులను నయం చేసుకున్నట్లు మీరు స్వప్నిస్తే జాగృదావస్థలో ఆ వ్యాధులను నయం చేసుకోగల సామర్థ్యం మీకుందని అర్థం. స్వప్నావస్థలో మీ చైతన్యశక్తి వేరే ఫ్రీక్వెన్సీలకు మళ్ళించబడుతుంది. ఆయా ఫ్రీక్వెన్సీలకు ట్యూన్ (tuning) అయ్యే లోకాలను సందర్శించి అక్కడి జ్ఞానాన్ని తీసుకువస్తుంటారు. జాగృదావస్థలో (in waking state) ఒక ఫ్రీక్వెన్సీలో నడిచే భౌతిక వాస్తవాలను మాత్రమే చూడగలుగుతున్నారు. మీ అనుభవాలలో నడుస్తున్న భౌతిక వాస్తవాలు కాకుండా ఇంకా ఎన్నో లోకాలు ఏకకాలంలో నడుస్తున్నాయనే విషయం మీకు కలల ద్వారా తెలుస్తుంది.

ఆత్మ మీ దేహానికి మాత్రమే పరిమితమయి బంధింపబడలేదని, దాని చర్యలు (activities) అనేకానేకం అనే విషయం కలల ద్వారా వ్యక్తపరచబడుతుంది. మీకు తెలియని ఎన్నో భాషలు (languages) మీకు స్వప్నాలలో అర్థమవుతాయి. గత జన్మలలోకి

ప్రయాణించి రాగలుగుతారు. చనిపోయిన మీ పూర్వీకులను కలుస్తారు. క్రొత్త క్రొత్త ప్రదేశాలను చూసివస్తారు. ఇదివరకెప్పుడూ చూడని దృశ్యాలు చూస్తారు. జాగృదావస్థలో అసాధ్యమనిపించే ఎన్నో కార్యాలు అక్కడ చేస్తుంటారు. భవిష్యత్తులోనికి ప్రవేశించి మీకుటుంబంలో పుట్టబోయే పిల్లలను చూసి వస్తారు. ఎప్పుడూ చూడని ఆకారాలను చూసివస్తారు. భౌతిక ప్రపంచంలో తీరని కోరికలను అక్కడ తీర్చుకుంటారు ఇతర లోకాలకు ప్రయాణించి అక్కడ జీవరాశులతో సంభాషించి వస్తారు. ఆ లోకాలలోని జ్ఞానాన్ని తీసుకువస్తారు. టి.వి. చానెల్స్ మార్చిన విధంగా వివిధ ఫ్రీక్వెన్సీలు (frequencies) గల లోకాలకు చకచకా వెళ్ళి వస్తుంటారు. ఈ ఒక్క దేహంతోనే కాదు. ఏకకాలంలో అనేక దేహాలు కలిగి వున్న ఆత్మ అని మీరు తెలుసుకుంటారు. వాటి మధ్య కమ్యూనికేషన్ (communication)ను మీరు గుర్తిస్తారు. ఒకే కాలంలో (simultaneously) అనేక ఫ్రీక్వెన్సీలు గల లోకాలను దర్శిస్తారు. ఇలా అనేక విధాలుగా స్వప్నావస్థల ద్వారా మీ ఆత్మశక్తి వ్యక్తీకరింపబడుతుంది.

ఒక వ్యక్తి సంగీతం (music) నేర్చుకోవాలని సంకల్పిస్తాడు. భౌతిక ప్రపంచంలో అతని ప్రయత్నాని కనుగుణంగా సంగీత గురువు దొరుకుతాడు. సంగీతం నేర్చుకోవాలని అతను బలంగా, తీవ్రంగా సంకల్పించినపుడు అంతర్ ప్రపంచం నుండి స్వప్నాల ద్వారా సమాచారం అందుతుంది. స్వప్నాలలో అతనికి సంగీత గురువులు బోధిస్తారు. స్వప్నాలలో సూక్ష్మ శరీరయానం చేసి భూమి మీద ఇదివరకే వుండి మరణించిన సంగీత గురువులను, ఇతరలోకాలలోని సంగీత గురువులను కలిసి సంగీతాన్ని అభ్యసిస్తాడు. ఆత్మకు గతం, వర్తమానం, భవిష్యత్తు అనేవి వుండవు. భవిష్యత్తులోనికి ప్రయాణించి భవిష్య సంగీత గురువులను కలిసి అభ్యసిస్తాడు. సంగీతానికి సంబంధించిన ఎంతో జ్ఞానం అతనికి స్వప్నాల ద్వారా లభ్యమవుతుంది.

ఒక కళాకారుడు (artist) ఒక కాన్వాసు (canvas) మీద బొమ్మ గీస్తున్నపుడు గతంలో పెయింట్ చేస్తున్న బొమ్మ . ప్రస్తుతం పెయింట్ చేస్తున్న బొమ్మ, పెయింట్ చెయ్యబోయే బొమ్మ అన్నీ అతని మైండ్‌లో ఇపుడే నిలిచి వున్నాయి. అట్లే ఆత్మశక్తిలో కూడ గతం, వర్తమానం, భవిష్యత్తులలో సంఘటనలు అన్నీ ఒకేసారి జరుగుతున్నాయి. ఆర్టిస్టు (artist) కాన్వాసు మీద ఇంకా ఎన్ని బొమ్మలు గీయాలో అతని మైండ్‌లో వుంటాయి. ఆత్మశక్తి కకూడ భవిష్యత్తులో జరిగే సంఘటనలన్నింటినీ కలిగి వుంటుంది. భవిష్యత్తు సంఘటనలన్నీ ఆత్మశక్తిలో ఇపుడే వున్నాయి.

ఇపుడు మీరు ఇరవై ఒకటవ శతాబ్దంలో (twenty first century) వున్నారు. పదునాలుగవ శతాబ్దంలోనికి (fourteenth century) ప్రయాణించి అపుడు జన్మతీసుకున్న మిమ్మల్ని కలిసి వస్తారు. ఈ వర్తమానంలో మీరు ఉంటున్నది ఎంత వాస్తవమో, 14వ శతాబ్దంలో వున్న మీరు అంతే వాస్తవంగా వున్నారు.

మీరు సంగీతం నేర్చుకోవాలనుకున్నారు. ఆత్మశక్తిలోని ఒక ఆత్మ శకలం, దేహంగా కలిగివున్న మీరు ఒకానొక జన్మలో సంగీత విద్వాంసుడిగా పుట్టి వుంటే, ఆ జన్మలోనికి ప్రయాణించి సంగీత ప్రావీణ్యాన్ని ప్రస్తుత ఈ జన్మలోనికి తీసుకురావచ్చు. మీ పూర్ణాత్మనుంచి ఉద్భవించిన ఆత్మశకలాల్లో ఏదైనా ఒకటి సంగీతం నేర్చుకుని వుంటుంది. మీ అంతర్ ప్రయాణం ద్వారా, స్వప్నాల ద్వారా ఆ సంగీత జ్ఞానాన్ని ఆ ఆత్మశకలం నుండి నేర్చుకోవచ్చు.

ఇలా అనేక విధాలుగా స్వప్నాల నుండి లబ్ధిపొందవచ్చు. ఈ స్వప్నాల గురించి ఇంకా విస్తారంగా ముందు ముందు వివరిస్తాను.

* * *

వాస్తవానికి ఏ వైరస్‌లూ, జంతువులూ, సూక్ష్మక్రిములూ, పక్షులు భూమి నుండి నిష్క్రమించడం లేదు. కొన్ని జీవజాతులు భౌతికంగా నిష్క్రమించినా, జీవరసాయనిక శక్తిపరంగా వాటి DNA భూమి మీద జీవపదార్థ సందేశాల రూపంలో భద్రపరచబడుతున్నాయి. అతి సూక్ష్మాతి సూక్ష్మమైన చైతన్య శకలాల ద్వారా మనిషి + భూమి మీద జీవజాతులన్నీ జీవరసాయనిక పదార్థంతో ఒకే సారూప్యమైన మాంసపిండాలను కలిగిన దేహాలను తీసుకుంటున్నాయి. భూమి మీద ఏదైనా ఒక జీవజాతిలో జీవరసాయనాలు + జన్యువులలో మార్పుసంభవిస్తే దాని ప్రభావం అన్ని జీవజాతులకు వ్యాప్తి చెందుతుంది.

ఈ విశ్వమంతా ఆవరించివున్న మూలచైతన్యం తన నుండి వెలువడుతూన్న అన్ని ఆత్మశకలాలను సర్వదా ప్రేమిస్తుంటుంది. ఈ విశ్వం తనను తాను ప్రేమించుకుంటుంది. తనలో ఇమిడివున్న సకల చరాచర సృష్టిని ఎంతో ఉన్నతంగా ప్రేమిస్తూంది. ప్రతిక్షణమూ ఈ విశ్వం... అంటే మూలచైతన్యశక్తి తనను తాను సృష్టించుకుంటూ చైతన్య పరిణామాన్ని వ్యాకోచింపజేసుకుంటూ తన సాటిలేని ఉనికిని ప్రకటితం చేసుకుంటూనే వుంటుంది. ఈ విశ్వంలో సృష్టింపబడుతూన్న ప్రతిదీ నిత్యమూ – నూతనంగా చైతన్య వికాసం చెందుతూనే వుంటుంది. ప్రతిరోజూ సూర్యోదయం

నిత్యనూతనంగా వుంటుంది; ప్రతిరోజూ పుష్పించే రోజాపుష్పం నిత్యనూతనంగా వుంటుంది; ప్రతిరోజూ ప్రవహించే నది నిత్యనూతనంగా వుంటుంది; ప్రతిరోజూ మీకు కన్పిస్తూన్న ప్రకృతి నిత్యనూతనంగా వుంటుంది; భూమి + మానవజాతి + జీవరాశులు ప్రతిరోజూ నిత్యనూతనంగా వుంటున్నాయి; జీవజాతుల చైతన్య పరిణామం నిత్యనూతనంగా వుంటూంది. మహిమాన్వితమైన మూలచైతన్యశక్తి ఈ సకల చరాచర సృష్టిలో సమస్త ప్రాణికోటిలో వుంటూ నిత్యనూతనంగా చైతన్య పరిణామం చెందుతూ వుంది. ఈ మూలచైతన్యం మీ ద్వారా నిత్యనూతనంగా చైతన్య పరిణామం చెందుతూంది.

విశ్వమంతా వ్యాపించివున్న ఈ మూలచైతన్యం – కోటానుకోట్ల లోకాలు + వాటిలో జీవరాశులుగా సృష్టి చేసుకుని చైతన్య పరిణామం చెందుతూ విరాజిల్లుతూంది. సృష్టియే తానై, తానే సృష్టియై నిత్యనూతనంగా చైతన్య వికాసం చెందుతూంది.

ఈ సృష్టిలో ఒక భాగం ఉన్నతంగాను, మరోభాగం హీనంగాను వుండడం జరగదు. సృష్టిలో అన్ని భాగాలలో ఉన్న ఈ మూలచైతన్యశక్తి అన్ని భాగాల్లోనూ చైతన్యపరిణామం చెందుతూ ఉన్నత పరచుకుంటూంది. విశ్వశక్తి భౌతిక జీవితాలన్నింటిలోను విస్తరించి పరిణామం చెందుతూ వుంది. **మీ చుట్టూ వున్న భౌతిక ప్రపంచం మరి మీరు వేరువేరు కాదు. రెండూ ఒకటే. భౌతిక ప్రపంచం తనలో ఇమిడివున్న అన్ని జీవరాశుల పట్ల ఒకే విధమైన చైతన్య వికాసాన్ని కలుగజేస్తూ వుంది.**

దేహంలోని జీవకణాలన్నీ ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఒకదానికొకటి సహకారం అందించుకుంటున్నాయి. కొన్ని జీవకణాలు కలిసి దేహంలో ఒక అవయవంగా రూపొందినట్లుగా, ఆత్మ శకలాలన్నీ ఒక గ్రూపుగా ఏర్పడి ఆత్మగా పిలవబడుతాయి. జీవకణం శరీర అవయవంలో ఇమిడివున్నట్లే మీరు ఆత్మలో ఇమిడి వున్నారు. శరీర అవయవం భౌతికమైనదిగా మీ పరిభాషలో చెప్పబడుతుంది. ఆత్మ మటుకు మూలచైతన్యశక్తికి సంబంధించినది. కోటానుకోట్ల ఆత్మల గ్రూపును 'పూర్ణాత్మ' అని చెప్పబడుతుంది.

మీ జీవితంలో ఎదురయ్యే ప్రతి అనుభవమూ మీ అంతర్ ప్రపంచంలో రికార్డు అవుతుంటుంది. ఈ విశ్వమంతా మీ అంతర్ ప్రపంచంలోనే ఇమిడి వుంది. మీ అంతర్ ప్రపంచమే బ్రహ్మాండం. బాహ్య భౌతిక ప్రపంచమంతా కూడ అంతర్ ప్రపంచం

యొక్క చిన్న అంశం మాత్రమే. మీ అంతర్ ప్రపంచం ఒక మహాసముద్రమయితే బాహ్య ప్రపంచం ఒక 'అల' మాత్రమే! అంతర్ ప్రపంచం యొక్క పొడిగింపే మీ బాహ్య ప్రపంచం. మీ రీజనింగ్ మైండ్ లేదా మీ ఇంటెలిజన్స్ ఆత్మతో కూడిన దేహాన్ని సృష్టించలేదు. జీవాత్మల దేహాల సృష్టి అంతర్ ప్రపంచంవల్లనే జరుగుతూంది. భూమి మీద జీవాత్మలన్నీ మీ అంతర్ ప్రపంచం ద్వారా చైతన్య పరిణామం చెందుతూ పరస్పరం సహకారాన్ని అందించుకుంటున్నాయి. మీ దేహంలోని ఒక జీవకణం భూమి చైతన్య పరిణామానికి సంబంధించిన జ్ఞానాన్ని తనలో కోడ్ భాషలో (code language) ఇముడ్చుకుని ఉంది. మీ పూర్వీకుల జ్ఞానాన్నంతా మీ దేహంలోని ప్రతి జీవకణం భద్రపరచుకుని వుంది. భూమి మీద జీవరాశుల అన్నింటి చైతన్య పరిణామం తాలూకు జ్ఞానమంతా మీ దేహంలోని జీవకణాలలో ఇమిడివుంది.

* * *

చైతన్యశక్తి విస్తరణకు, జ్ఞాన సముపార్జనకు, ఆధ్యాత్మికంగా పురోగతి సాధించేందుకు ప్రతి ఆత్మా జన్మలు తీసుకొంటున్నది. ఈ జన్మల పరంపర అనంత కాలం కొనసాగుతుంటుంది. ప్రతి జన్మలో ఆత్మ తన చైతన్య విస్తరణను, జ్ఞానాన్ని, ఆధ్యాత్మికతను పెంచుకుంటుంది. ప్రతి జన్మలోను ఎంతో కొంత జ్ఞానాన్ని నేర్చుకోవడం జరుగుతుంటుంది. ఈ నేర్చుకోవడమనే ప్రక్రియ ఆత్మయొక్క ఇష్టాయిష్టాల పై ఆధారపడి వుంటుంది. ఆధ్యాత్మికంగా విశాల దృక్పథం కొరవడినపుడు ఒకే విషయాన్ని నేర్చుకోవడం కోసం అనేక జన్మలు తీసుకోవలసి వుంటుంది. ఒకే విషయాన్ని అధ్యయనం చెయ్యడం కోసం ఒక వృత్తాకార మార్గంలో తిరుగుతున్న గానుగెద్దులాగ మళ్ళీ మళ్ళీ జన్మలు తీసుకోవడం జరుగుతుంటుంది. ఆత్మ నిత్య జాగ్రత్త స్థితిని కోల్పోయినపుడు తను ఒక తలం లేదా ప్రపంచంలో ఏ లక్ష్యం కోసం జన్మ తీసుకుందో దాన్ని అసంపూర్తిగా వదిలిపెట్టడం వల్ల మళ్ళీ జన్మ తీసుకోవడం జరుగుతుంది.

ఉదాహరణకు మీరు ఒక వ్యక్తిని తీవ్రంగా ద్వేషిస్తున్నారనుకోండి. ఆ ద్వేషం ఎందువల్ల మీ నుండి జనించిందో దానికిగల 'కారణ–కార్య సంబంధం' సంపూర్తిగా తెలుసుకునేంత వరకు జన్మలు తీసుకోవలసి వుంటుంది. 'ద్వేషం'నకు సంబంధించిన స్థూలమైన అంశాలు, సూక్ష్మమైన అంశాలు మరి ద్వేషానికి సంబంధించి అన్ని డైనమిక్స్ పూర్తిగా అర్థమయ్యేంత వరకు పునర్జన్మలు తీసుకోవలసి వుంటుంది. ప్రతి జన్మలోనూ

ద్వేషానికి సంబంధించిన గుణాలను, జీవిత సంఘటనలను ఆకర్షించడం జరుగుతుంటుంది. 'ద్వేషం' గురించి మీరు నమ్ముతున్నంత కాలం అలాంటి జీవితానుభవాలనే ఎదుర్కొంటుంటారు. తర్వాత జన్మలోనూ అలాంటి జీవితానుభవాలే కంటిన్యూ (continue) అవుతుంటాయి. మీకు ఏ క్షణంలోనయితే 'ద్వేషం' అనే కాన్సెప్ట్ (concept) గురించి క్షుణ్ణంగా తెలుసుకుంటారో అపుడే మీరు 'ద్వేషం' వల్ల కలిగిన బంధనాల నుండి విముక్తి పొందుతారు. ఆ బంధనాల నుండి విడుదల కానంత వరకు భూమి మరి భూమి స్థాయి ఫ్రీక్వెన్సీగల సమాంతర లోకాలలో (parallel worlds) జన్మలు తీసుకోవలసి వుంటుంది.

జన్మ మరి ఇంకొక జన్మ మధ్య విరామం వుంటుంది. ఆ విరామంలో కూడ చైతన్యశక్తి విస్తరణ, ఆధ్యాత్మిక జ్ఞానసముపార్జన జరుగుతుంటుంది. ఆ విరామంలో గనుక మీరు 'ద్వేషం' అనే కాన్సెప్ట్‌ను క్షుణ్ణంగా నేర్చుకున్నట్లయితే మళ్ళీ 'ద్వేషం'ను నేర్చుకోవడం కోసం జన్మ తీసుకోనవసరం లేదు. ఎంచేతంటే ఆత్మ తన చైతన్యశక్తిని, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రతి క్షణమూ విస్తరించుకుంటుంది. ఏక్షణంలోనైనా ఆత్మకు 'ద్వేషం' అనే కాన్సెప్ట్‌ను పూర్తి అవగాహన కలగచేసుకోవడానికి ఎన్నో అవకాశాలు వుంటాయి. ఆత్మ ఎల్లప్పుడూ నిత్య జాగ్రత్తస్థితిలో వుండి ఆ అవకాశాలను ఒడిసి పట్టుకోవాల్సి వుంటుంది.

మీరు ద్వేషించిన వ్యక్తి తర్వాత జన్మలలో కూడా మీకు తారసపడాలనే నియమమేదీ వుండదు. ద్వేషం వలన ఇప్పుడు ఎదుర్కొంటున్న జీవితానుభవాలు తర్వాత జన్మలలో కూడా అదే స్వభావాన్ని కలిగి వుండాలన్న నియమాలు కూడా వుండవు. తర్వాత జన్మలలో తారసపడే వ్యక్తులను, జీవితానుభవాలను మీకు 'ద్వేషం' అనే కాన్సెప్ట్‌ను నేర్పడానికే మీరు సృష్టించుకుంటారు. మీ సంకల్పాల కనుగుణంగా అవి సృష్టింపబడుతుంటాయి. ప్రస్తుతం ఈ జన్మలో ఇవాళ మీరు కలిగి వున్న శక్తి సామర్థ్యాలు, మీ నైపుణ్యాలు, మీ చైతన్య పరిణామం, మీ జ్ఞానం అంతా కూడా మీరు గత జన్మలలో సముపార్జించిన దానికి పొడిగింపు మాత్రమే. మీ పరిభాషలో చెప్పాలంటే గత జన్మలో మీరు రెండవ తరగతికి సంబంధించిన పాఠాలు నేర్చుకున్నపుడు ఈ జన్మలలో మూడవ తరగతికి సంబంధించిన పాఠాలు + ఆ పై తరగతుల పాఠాలు నేర్చుకోవడం జరుగుతుంది. గత జన్మలలో కొంత ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సముపార్జించి వుంటారు. ఈ

జన్మలలో ఆ జ్ఞానాన్ని కంటిన్యూ చేసుకొంటూ మరింత ఉన్నత జ్ఞానాన్ని నేర్చుకోవడం జరుగుతుంది.

ఈ అధ్యాయంలో ఆత్మ యొక్క జన్మ పరంపరలు ఏక దిశలో (uni directional) కొనసాగుతుండడాన్ని ప్రస్తావిస్తున్నాను. ఆత్మ ఒకేసారి ఏక కాలంలో అనేక దేహాలు ధరించి అనేక డైమన్షనల్ గల తలాలు లేదా ప్రపంచంలో చైతన్య పరిణామం చెందుతూన్న విషయాన్ని 'మల్టి డైమన్షల్ ఆత్మ' అనే అధ్యాయంలో వివరిస్తాను. మల్టి డైమన్షనల్ ఆత్మకు కాలం – దూరానికి సంబంధించిన పరిమితులు వుండవు. మల్టి డైమన్షనల్ ఆత్మకు కాలం కూడా మల్టి డైమన్షనల్‌గా వుంటుంది.

'ద్వేషం' అనే కాన్సెప్ట్ గురించి త్రీ డైమన్షనల్ భూ భౌతిక తలంలో సంపూర్ణంగా నేర్చుకున్న తరువాత మళ్ళీ దానికోసం జన్మ తీసుకోవనవసరం లేదు. అలాగే త్రీ డైమన్షనల్ తలంగల భూ భౌతిక ప్రపంచంలో ఆ ఫ్రీక్వెన్సీ స్థాయికి తగ్గ చైతన్య పరిణామంలో భౌతిక సంఘటనలను స్వీకరించి దానికి సంబంధించిన జ్ఞానాన్ని స్వీకరించి ఆధ్యాత్మికంగా పురోగతి చెందిన తర్వాత ఆత్మ మరో ఉన్నత లోకాన్ని ఎంచుకొని అక్కడ జన్మ పరంపరలను కొనసాగించడం జరుగుతుంది. ఒక లోకానికి సంబంధించిన జ్ఞానాన్ని, ఆధ్యాత్మిక శాస్త్రాన్ని సముపార్జించడానికి ఆ లోకాన్ని + ఆ లోకానికి సరిపడా ఫ్రీక్వెన్సీ స్థాయిలో గల సమాంతర లోకాలలో జన్మలను తీసుకొంటూ ఆత్మ తన చైతన్య పరిణామాన్ని పెంచుకుంటూ వస్తుంది.

ఒక జన్మ పూర్తి అయిన తర్వాత మళ్ళీ వెనక్కి చూడాల్సిన అవసరం లేదు. గత జన్మల అనుభవాలు, జ్ఞానం, చైతన్య పరిణామం మీ సబ్ కాన్షియస్ మైండ్‌లో రికార్డు అయివుంటాయి. మీరు అంతర్ ప్రయాణం చేసి ఆ అనుభవాలను, జ్ఞానాన్ని మీ వర్తమాన జీవితంలోనికి ఉపయోగించు కొనవచ్చు. ప్రతి ఆత్మ కూడ తనను తానే ఉద్ధరించుకోవాలి; తన చైతన్య పరిణామాన్ని తనే విస్తరించుకోవాలి. అంతేగాని ఈ విశ్వంలో ఏ శక్తీ ఆత్మను ఉద్ధరించడం గాని, చైతన్య పరిణామం చెందించడం గాని చెయ్యదు.

మీ ఆలోచనలకు, మీ జీవితానుభవాలకు అనుగుణంగా మీ జీవితంలో భౌతిక సంఘటనలను, కుటుంబ సభ్యులను, స్నేహితులను, బంధువులను, జీవితానుభవాలను ఆకర్షిస్తారు. మీ అంతర్ ప్రపంచం ద్వారా మీరు వాటిని ఆకర్షిస్తారు. స్థూలంగా చెప్పాలంటే ఒకే ఆలోచనా ధోరణి గలవాళ్ళు పరస్పరం ఆకర్షింపబడుతుంటారు. మీ

జీవితానుభవాలు, మీ స్నేహితులు, బంధు మిత్రులు, కుటుంబసభ్యుల ఆధారంగా మీరెలాంటివారో సులభంగా ఇట్టే పసిగట్టవచ్చు. జీవితాన్ని ఏ రీతిలోనైనా మలుపు త్రిప్పుకోవడానికి ప్రతిక్షణమూ మీకు అవకాశం వుంది. ఈ వర్తమానంలోనే మీ ఆలోచనలు + సంకల్పాలు దిశను మార్చడం ద్వారా జీవిత దిశను కూడా మార్చవచ్చు.

ప్రస్తుతం ఈ వర్తమానంలో వుంటున్న కుటుంబంలో జన్మ తీసుకోవడానికి ఎన్నో కారణాలుంటాయి. మీరు ఎరుకలో లేనప్పటికీ చైతన్యశక్తి పరంగా కుటుంబ సభ్యులందరూ వాళ్ళ అంతర్ ప్రపంచాల ద్వారా అనుసంధానింపబడి ఒక సమిష్టి లక్ష్యం కలిగి వుంటూ చైతన్య పరిణామం చెందుతుంటారు. వ్యక్తిగత లక్ష్యాలు కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ వున్నప్పటికీ అందరి వాస్తవాలు ఒక దానికొకటి ప్రభావితం చేసుకొంటూ సమిష్టి లక్ష్యం వైపు ప్రయాణం సాగిస్తూ చైతన్య పరిణామం చెందడం జరుగుతుంటుంది. ఎవరి వాస్తవాలకు వారే బాధ్యులయినప్పటికీ ఒకరి వాస్తవం మిగతా వాళ్ళ వాస్తవాలను ప్రభావితం చెయ్యగలుగుతుంటుంది. అలాగే ఒక దేశంలోని ప్రజలంతా ఒక సమిష్టి లక్ష్యం ఏర్పరుచుకొని వుంటారు. చైతన్యశక్తి ద్వారా అందరూ వారి అంతర్ ప్రపంచాల ద్వారా అనుసంధానింపబడి చైతన్య పరిణామం చెందుతుంటారు.

'ఏ గూటి పక్షులు ఆ గూటికి చేరుతాయి' అనే సామెత ఇక్కడ చక్కగా వర్తిస్తుంది. మిలిటరీ గ్రూపులు, చర్చి గ్రూపులు, వేటగాళ్ళ గ్రూపులు, ఒక మతం లేదా ఒక ప్రాంతానికి చెందిన గ్రూపులు ఆ విధంగా ఒక సమిష్టి లక్ష్యాన్ని వాళ్ళ సంకల్పశక్తి ద్వారా ఏర్పరుచుకొని ఒకే ఫ్రీక్వెన్సీ గల శక్తి స్థాయిలో చైతన్య పరిణామం చెందుతుంటారు. భూమి మీద మానవజాతి అంతా ఒకే లక్ష్యం వైపు చైతన్య పరిణామం చెందుతుంటుంది. మంచి, చెడు అనే జడ్జిమెంట్స్ (Judgements) మీ 'అహం' పరిధిలో జరుగుతున్నాయి కాని వాస్తవానికి అన్నీ జీవితానుభవాలే.

చైతన్య పరిణామం చెందడానికి కుటుంబ సభ్యులందురూ ఒక సమిష్టి లక్ష్యాన్ని, ఒక వర్గానికి చెందిన ప్రజలందరూ ఒక సమిష్టి లక్ష్యాన్ని, ఒక దేశ ప్రజలందరూ ఒక సమిష్టి లక్ష్యాన్ని, ఒక ప్రపంచానికి చెందిన జీవజాతులన్నీ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుంటాయి. భూమి మీద మానవజాతి + ఇతర జీవజాతులన్నీ ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని చైతన్య పరిణామం చెందుతున్నాయి. అంతర్ ప్రపంచం ద్వారా మానవజాతి మరి జీవజాతులన్నీ అనుసంధానింప బడివున్నాయి. భూమి మీద చైతన్య

పరిణామం చెందడానికి సమిష్టి లక్ష్యమేమిటో మీ అంతర్ ప్రపంచానికి తెలుసు. భూమిమీద జన్మ తీసుకున్నందుకు గల లక్ష్యం, పరమార్థం మీ అంతర్ ప్రపంచానికి తెలుసు. అంతర్ ప్రయాణం ద్వారా జీవిత లక్ష్యమేమిటో తెలుసుకోవచ్చు. కారణం లేకుండా, లక్ష్యం లేకుండా ఏ జీవాత్మ కూడా భూమి లేదా మరే లోకంలోనైనా జన్మ తీసుకోవడం జరగదు.

ఒక కుటుంబానికి గల లక్ష్యం లేదా ఒక దేశంలో మానవజాతికి గల లక్ష్యం లేదా భూమి మీద జీవజాతుల లక్ష్యం మీ సబ్‌కాన్షియస్ మైండ్‌లో ఇమిడివుంది. ఆ లక్ష్యాలు నెరవేరుతాయా? లేదా? అనేది పురుష ప్రయత్నం మీద ఆధారపడి వుంటుంది. పురుష ప్రయత్నం, సాధన లేకుండా ఏదీ సాధింపబడదు.

గత జన్మలనుండి నేర్చుకోవాలనే నియమాలు ఏవీ లేవు. గత జన్మల కర్మల నుండి గుణపాఠాలు నేర్చుకోవాలనే నిబంధన కూడా ఏదీ వుండదు. ఈ వర్తమానంలోనే చైతన్య పరిణామం చెందగల అవకాశాలు అపారంగా వున్నాయి. ముందరగా మీరు మల్టి డైమన్షనల్ ఆత్మగా (Multi dimensional Soul) గుర్తుంచుకోవాలి. ఆత్మ జన్మ పరంపరల ద్వారా చైతన్య పరిణామం చెందుతుంటుంది. ఆత్మ జన్మ పరంపరల ద్వారా ఒకే దిశలోనూ (uni directional), తన మల్టి డైమన్షనల్ (multi dimensional) ఉనికి ద్వారా అనేక దిశలలోనూ చైతన్య పరిణామం చెందుతుంటుంది.

ఒక ప్రపంచంలో జన్మ పరంపరలు పరిసమాప్తమై మరో ఉన్నత లోకానికి ప్రయాణం చేసి అక్కడ జన్మలు తీసుకోవాలంటే ప్రస్తుతమున్న లోకంలో గల ఫ్రీక్వెన్సీ, శక్తి స్థాయిలో నేర్చుకోవాల్సిన పాఠాలన్నీ పరిసమాప్తమవ్వాలి. ఆ లోకానికి సంబంధించిన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంపూర్తిగా నేర్చుకొన్న తర్వాతే మరో ఉన్నత లోకంలోనికి జన్మలు తీసుకోవడం జరుగుతుంది. ఉదాహరణకి ద్వేషం అనే కాన్సెప్టును సంపూర్తిగా అవగాహన చేసుకొని దాన్నుండి ఆధ్యాత్మిక పాఠాలు నేర్చుకోవడం జరుగుతుంది. అలాగే ఈ భూ భౌతిక ప్రపంచానికి సంబంధించిన నిర్దిష్ట ఆధ్యాత్మిక జ్ఞానం పొందిన తర్వాతే మరో ఉన్నత లోకంలో జన్మలు తీసుకోగలుగుతారు. భూమి, భూమి ఫ్రీక్వెన్సీ స్థాయిలో గల సమాంతర లోకాలలో జన్మ పరంపర కొనసాగిస్తూ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంపూర్తిగా పొందిన తర్వాత మీరు ఈ లోకం నుండి స్వేచ్ఛ పొందుతారు. దాన్నే 'నిర్వాణం' అని చెప్పవచ్చు.

ప్రతి జన్మలోనూ కొన్ని లక్ష్యాలు, సవాళ్ళు అనేవి ఆత్మకు వుంటాయి. మీకు సహజావబోధన (intuition) మరి అంతర్ వాణి ద్వారా జీవిత లక్ష్యం తెలుస్తుంటుంది. మీరు అంతరేంద్రియాలను విస్మరించడం వల్ల సహజావబోధనను సక్రమంగా వినియోగించుకోలేక పోతున్నారు. ప్రతి జన్మలోనూ మీ లక్ష్యాలు, సవాళ్ళను ఎదుర్కునే సర్వసమర్థతను కలిగి వుంటారు. **మీ అంతర్ ప్రపంచం యొక్క నైజాన్ని, డైనమిక్స్‌ను తెలుసుకొని దానికిగల అపరిమిత శక్తిని వుపయోగించి భౌతిక జీవితంలో వాస్తవం చెందడానికే ప్రస్తుత ఈ జన్మ తీసుకున్నారు. మీ అంతర్ ప్రపంచాన్ని ఎలా వుపయోగించుకుంటున్నారో మీ జీవితానుభవాలు తెలియజేస్తాయి. బాహ్య భౌతిక ప్రపంచంలో మీ జీవితానుభవాలన్నీ మీ మనోశక్తి... అంటే మీ అంతర్ శక్తి ప్రతిబింబాలే! మీ ఆలోచనా తరంగాలు మీ జీవిత వాస్తవాన్ని సృష్టిస్తున్నాయనే విషయం మీకు పూర్తిగా అవగాహన అయినపుడే మీకు విముక్తి లభిస్తుంది.**

భూమి మీద జన్మలు తీసుకునే మానవులు మరి జీవాత్మలన్నీ వివిధ జీవితానుభవాలను ఎంచుకొని వాటి ద్వారా జ్ఞాన సముపార్జన చేస్తుంటారు. మనిషి యొక్క జన్మ పరంపరలలో ప్రతి జన్మలోనూ ఆరోగ్య వంతుడిగా. సంపన్నుడిగా జన్మించడం జరగదు. ఒక జన్మలో సంపన్నుడిగా, ఇంకో జన్మలో పేదవాడిగా, మరో జన్మలో ఆరోగ్యవంతుడిగా, మరో జన్మలో రోగిగా... ఇలా ఎన్నో జన్మలు తీసుకుంటుంటాడు. కొన్ని వరుస జన్మలు స్త్రీగా, లేదా కొన్ని వరుస జన్మలు పురుషుడిగా లేదా ఒక జన్మ పురుషుడిగా, మరో జన్మ స్త్రీగా జన్మ పరంపర కొనసాగుతుంది. **భూ ప్రపంచం మీద చైతన్య పరిణామం . జ్ఞాన సముపార్జన కోసం భూమి ఫ్రీక్వెన్సీ స్థాయి (frequency level) మరి శక్తి స్థాయి (energy level)లో సంపూర్తిగా జరగాలంటే స్త్రీ . పురుష జన్మలు విధిగా తీసుకోవాల్సిందే! కేవలం పురుష జన్మలు, లేదా కేవలం స్త్రీ జన్మలు తీసుకుని చైతన్య పరిణామం చెందడం అసంభవం! కేవలం ఒకే లింగ జాతితో కూడిన జన్మల ద్వారా భూప్రపంచానికి సంబంధించిన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందడం అసాధ్యం! ఆత్మపరంగా, మానసికంగా, భౌతికంగా, ఆధ్యాత్మికంగా ఆత్మకు సంపూర్ణమైన పరిణితి జరగాలంటే స్త్రీ, పురుష జన్మలు తప్పనిసరి అవుతాయి. భూమి మీద జన్మ తీసుకోక ముందు ఆత్మకు స్త్రీ, పురుష లింగబేధం అనేది వుండదు.**

ఆధ్యాత్మికంగా మరి మానసికంగా అతి వేగంగా చైతన్య పరిణామం చెందడానికి ఆత్మ స్త్రీ, పురుష జన్మలను తీసుకుంటుంది. కేవలం ఒకే లింగ జాతితో కూడిన వరుస జన్మలతో అంతర్ శక్తిని సంపూర్తిగా వినియోగించడం సాధ్యపడదు. ప్రతి ఆత్మ

కూడా జీవాత్మగా భూమి మీద ప్రవేశించిన తర్వాత కేవలం ఒక లింగజాతితో కూడిన జన్మ పరంపరల ద్వారా భూమి యొక్క బంధాన్ని విడిచి (అంటే మోక్షం పొంది) ఉన్నత లోకాలలోకి ప్రయాణించడం జరగదు.

ఈ వర్తమాన జీవితంలో మీకు ఎదురయ్యే సంబంధాలు, మానసిక స్థితులు, జీవితానుభవాలు మీరు మరో జన్మ తీసుకోవడానికి మార్గాన్ని సుగమం చేస్తాయి. ఉదాహరణకు ప్రస్తుతం ఈ జన్మలో స్త్రీ జాతిని ద్వేషిస్తున్నారనుకోండి. ఎందువల్ల స్త్రీ జాతిని ద్వేషించవలసి వచ్చిందో, స్త్రీ మూర్తిత్వం అంటే ఏమిటో సంపూర్తిగా మీకు అర్థమయ్యేంత వరకు వరుసగా కొన్ని జన్మలు స్త్రీగా మీరు జన్మలు తీసుకోవలసి వుంటుంది. మీరు జబ్బు పడ్డ మనిషిని అసహ్యించు కుంటున్నారనుకోండి. ఎందువల్ల అటువంటి ధోరణి మీలో కలిగిందో, దాని డైనమిక్స్ ఏమిటో మీకు పూర్తిగా అర్థం చేసుకోవడానికి మీరు తర్వాత జన్మలో రోగిగా జన్మ తీసుకోవడం జరుగుతుంది. కేవలం ఒక కారణం కోసమే పునర్జన్మలు తీసుకోవడం జరగదు. అందులో మానసిక, ఆధ్యాత్మిక కారణాలు ఇంకా ఎన్నో ఇమిడి వుంటాయి.

ఆధ్యాత్మిక పురోగతికి, చైతన్య పరిణామానికి దుర్భరమైన జీవితాన్ని ఎంచుకొని జన్మ తీసుకోవడం తప్పనిసరి అనే నిబంధన లేదు. మీ జీవితాన్ని సరియైన రీతిలో శోధన చేసినట్లయితే ఈ జన్మలో ఎంచుకున్న లక్ష్యాలు, సవాళ్ళు ఏమిటో తెలుస్తాయి. ఇది అంత సులభమైన ప్రక్రియ కాదుగాని అంతర్ ప్రయాణం ద్వారా సహజావబోధనను అభివృద్ధి చేసుకోవడం ద్వారా దీన్ని సాధించవచ్చు. గత జన్మలలో చేసిన కర్మలకు పరిహారంగా ఈ జన్మలో శిక్ష అనుభవించడం లేదు. గత జన్మలో ఆరోగ్యంగా వున్నపుడు, ఆత్మశక్తి యొక్క శక్తి సామర్థ్యాలను జాగరూకతతో వినియోగించు కోలేక పోయినపుడు, ఎందుచేత అలా జరిగిందో తెలుసుకోవడానికి ప్రస్తుత ఈ జన్మలో దీర్ఘకాలిక వ్యాధిని ఎంచుకోవడం జరగవచ్చు. అంతేగాని గత జన్మ కర్మల పర్యవసానంగా ఈ జన్మలో శిక్ష అనుభవించడం జరగదు. మరి కొన్ని కారణాల వల్ల కూడా ప్రస్తుత ఈ జన్మలో దీర్ఘవ్యాధులను ఎంచుకొని అనుభవించవలసి వుంటుంది. మానవుడికి ఆధ్యాత్మిక జ్ఞానం కొరవడడం వల్ల, మానసిక సోమరితనం వల్ల ప్రాణాంతక మరి దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమించడం జరుగుతుంది. **చైతన్యశక్తిని సరియైన రీతిలో వినియోగించుకోవడం మీకు తెలిసినట్లయితే ఎటువంటి వ్యాధినైనా క్షణాలలో నయం చేసుకునే శక్తి మీ దేహానికి కలుగ జెయ్యవచ్చు. జంతుజాతిని వధించడం, జంతుజాతిని హింసపెట్టడం**

లాంటివి మీ మనోశక్తిని తీవ్రంగా ప్రభావితం చేసి తద్వారా మీ దేహ ఆరోగ్య వ్యవస్థలను విచ్ఛినం చేయడం జరుగుతుంది. మానవజాతికి వ్యాధులు సంక్రమించడానికి ఈ హింసకూడా ప్రధాన కారణమవుతూంది.

ఒక జన్మలో భార్యాభర్తలుగా జన్మ తీసుకున్న వాళ్ళు తర్వాత కొన్ని జన్మలలో కూడా భార్యాభర్తలుగా కొనసాగవచ్చు. గత జన్మలో భార్యగా వున్న ఆత్మ ఈ జన్మలో భర్తగా, భర్తగా వున్న ఆత్మ ఈ జన్మలో భార్యగా, లేదా భార్యాభర్తలుగా కొన్ని జన్మల పాటు డిజైన్ (design) చేసుకొని జన్మలు తీసుకోవడం జరుగుతుంటుంది. అనేకానేక జన్మలు భార్యాభర్తలుగా జన్మలను డిజైన్ చేసుకోవడం జరగదు. కుటుంబ సభ్యులు, ఒక సంస్థలోని సభ్యులు లేదా ఒక ప్రాంతంలోని ప్రజలు ఈ విధంగానే కొన్ని జన్మల పాటు కలిసి మెలిసి వుండేట్లు జన్మలు తీసుకోవడం జరుగుతుంది. కొన్ని జన్మల వరకు మాత్రమే ఈ బంధాలు కొనసాగుతాయి. భార్యా భర్తలుగా లేదా ఒకే కుటుంబ సభ్యులుగా లేదా ఒక సంఘంలో వుండేటట్లుగా అన్ని జన్మలలోనూ పర్మనెంటుగా బంధాలను కొనసాగించడం జరగదు. ఒక లోకానికి సంబంధించి బంధాలను ఎంచుకోవడంలో కోటానుకోట్ల కాంబినేషన్స్ (combinations)తో కూడిన సంభావ్య అవకాశాలు (probable opportunities) ప్రతి ఆత్మకూ వుంటాయి.

ఏ ఆత్మ కూడా తన బంధాలను తనకు తెలిసిన ఆత్మలతోనే పర్మనెంట్‌గా కొనసాగించాలని జన్మలను తీసుకోదు. ఒక లోకానికి సంబంధించిన చైతన్యశక్తి స్థాయిలో ఆధ్యాత్మికంగా, ఆత్మ పరంగా సంపూర్ణంగా పరిణామం చెందడం కోసం కొన్ని పరిమిత జన్మలకు మాత్రమే బంధాలను కొనసాగించి తర్వాత క్రొత్త కాంబినేషన్‌ను ఎంచుకుంటుంది.

గత జన్మలో శత్రువు ప్రస్తుత ఈ జన్మలో మీ కుమారుడిగా లేదా కుమార్తెగా జన్మించి, మీరివురూ ప్రేమ, సృజనాత్మకత, జీవితం విలువలు, ఆధ్యాత్మికత గురించి జ్ఞానసముపార్జన చెయ్యడం జరగవచ్చు. మీ ఎమోషన్స్ మీకు బంధాలను కలుగ జేస్తాయి. ఈ జన్మలో ఒక మనిషి పట్ల ఎమోషనల్‌గా బంధాన్ని కొనసాగిస్తూ దాని గురించిన డైనమిక్స్ అర్థం గాక మరణించడం సంభవిస్తే, తర్వాత జన్మలో అదే వ్యక్తితో బంధాన్ని కొనసాగించి ఆ ఎమోషన్ యొక్క డైనమిక్స్‌ను తెలుసుకునే ప్రయత్నం జరుగుతుంది. ఒక ఎమోషన్ గురించిన డైనమిక్స్‌ను సంపూర్తిగా అర్థం చేసుకోవడానికి కొన్ని జన్మలు పట్టవచ్చు లేదా ఒక జన్మలోనే సాధ్యపడవచ్చు. ఆ ఎమోషన్‌ను పూర్తిగా

తెలుసుకోవడం కోసం ఇపుడున్న వ్యక్తిని విస్మరించి తర్వాత జన్మలలో ఇతరులను ఎంచుకోవచ్చు.

ఆత్మకు, ఆధ్యాత్మిక మరి ఆత్మ జ్ఞానం విస్తారంగా పెరిగినపుడు ఎమోషన్‌పరంగా పెంచుకున్న బంధాల సంకెళ్ళన్నీ పటాపంచలవుతాయి. ఎమోషన్స్‌కు సంబంధించిన డైనమిక్స్ అన్నీ ఆధ్యాత్మిక జ్ఞానం . ఆత్మ జ్ఞానం ద్వారా తెలియజెయ్యబడతాయి. తర్వాత ఆ ఎమోషన్స్ కోసం జన్మలు తీసుకోవడం ఆగిపోతుంది. భూ ప్రపంచం నుండి జన్మ కర్మ పరంపరను పరిసమాప్తి చేసుకోవడానికి ప్రతి ఆత్మ కూడా ఎంతో జ్ఞానాన్ని సముపార్జించవలసి వుంటుంది. ఆత్మ తాను పొందిన ఆధ్యాత్మిక మరి ఆత్మ జ్ఞానాన్ని ఇతర జీవాత్మలకు కూడా బోధించి వాళ్ళను కూడా ఆత్మజ్ఞానులుగా తయారుచేసిన తర్వాత మాత్రమే భూ ప్రపంచం + ఆ శక్తి స్థాయిలో వుండే సమాంతరలోకాల నుండి బంధవిముక్తి పొంది జన్మ పరంపర పరిసమాప్తం చేసుకోగలుగుతుంది. **తను మాత్రమే జ్ఞాన సముపార్జన చేసుకొని ఇతర జీవాత్మలకు బోధించకుండా, ఇతర జీవాత్మలనూ ఆత్మ జ్ఞానులను చెయ్యకుండా ఈ లోకం నుండి విముక్తి పొందడం జరగదు. ప్రతి ఆత్మకూ తన జన్మను ఆఖరిదిగా చేసుకోవడానికి విధిగా కొంత మందిని ఆత్మజ్ఞానులుగా తయారుచెయ్యాలి. ప్రస్తుతం మీ భూమి మీద ఎవరైతే ఆధ్యాత్మిక శాస్త్రాన్ని విరివిగా బోధించి, ఇతరులను ఆత్మ జ్ఞానులను తయారుచేస్తున్నారో వారందరూ భూ ప్రపంచం మీద ఆఖరి జన్మలలో వున్నారని నేను మీకు తెలియజేస్తున్నాను.**

'గత జన్మలలో చేసుకొన్న కర్మల పర్యవసానంగా గత జన్మల ఎమోషన్స్ ఫలితంగా ఈ జన్మలో దైన్యస్థితిలో, ఆత్మన్యూనతలో జీవితం కొనసాగిస్తున్నాను' అని మీరు భావించ నక్కరలేదు. ప్రతి జన్మలోనూ ఆధ్యాత్మికంగా రాణించి, అపారమైన ఆత్మజ్ఞానాన్ని సముపార్జించి చైతన్య పరిణామం చెందుతూ జన్మను ఆఖరు జన్మగా చేసుకోవడానికే డిజైన్ చేసుకొని భూమి మీద ప్రవేశించడం జరుగుతుంది. కాని నిత్య జాగ్రత్త స్థితి కొరవడడం చేత, మానసిక సోమరితనం వల్ల, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంపాదించాలన్న ధ్యాస లేకపోవడం చేత ఆ జన్మ యొక్క లక్ష్యమేమిటో మీకు తెలియకుండాపోతుంది. సహజావబోధన ద్వారా మీ జన్మ యొక్క లక్ష్యాన్ని తెలుసుకోవడాన్ని మిస్సవ్వడం అనేది మీ మానసిక సోమరితనం వల్ల జరుగుతుంది.

మీ జన్మ యొక్క లక్ష్యం మరి సవాళ్ళను తెలియజెయ్యడం కోసం భూమి మీద ఆధ్యాత్మిక గురువులు మీకు ఎల్లప్పుడూ అందుబాటులో వుంటూనే వున్నారు. ఎంతో ఆధ్యాత్మికశాస్త్ర సాహిత్యం కూడా ఇవాళ మానవజాతికి అందుబాటులో వుంది. జీవితాన్ని ఒక సాహసంగా ఎంచుకోలేక పోవడం వల్ల, ఆధ్యాత్మిక శాస్త్ర జిజ్ఞాస లేక పోవడం వల్ల జీవితాన్ని సృజనాత్మకంగా, ఆనంద భరితంగా ప్రేమతో జీవితానుభవాలను పొందలేక పోతున్నారు. **సాహసం లేని జీవితం మరి ఆధ్యాత్మికంగా పురోగతి లేని జీవితం దుర్భరంగా వుంటుంది.** విశ్వశక్తి అన్ని వేళలా మీకు అందుబాటులో వుంటుంది. అన్ని జీవాత్మలూ మీ చైతన్య పరిణామానికి సహాయసహకారాలు అందిస్తున్నాయి. పరిమిత జ్ఞానంతో ఏర్పడిన ఎమోషన్స్ మరి మానసిక సోమరితనం మిమ్మల్ని గ్రుడ్డి వాళ్ళుగా చేసి జీవిత మాధుర్యాన్ని కోల్పోయేటట్లు చేస్తున్నాయి.

భూభౌతిక ప్రపంచంలో ప్రతి మనిషి కూడా అన్ని కళలను, అన్ని శాస్త్రాలను, అన్ని ఎమోషన్స్‌నూ, ఆ ఎమోషన్స్ వల్ల కలిగే బంధాలను సంపూర్ణంగా అధ్యయనం చేసి వాటి డైనమిక్స్ సంపూర్తిగా అర్థమయిన తర్వాత మాత్రమే జన్మ కర్మ పరంపర పరిసమాప్తి చేసుకుని భూమి నుండి విముక్తి (మోక్షం) పొంది తీరాలంటే, ఆధ్యాత్మిక శాస్త్రం మాత్రమే మిమ్మల్ని ఆ కళలు, శాస్త్రాలు, ఎమోషన్స్ + వాటి బంధాల నుండి విముక్తిని కలుగ జేస్తాయి. భౌతిక పదార్థంలో ఇమిడి వున్న కళలు, శాస్త్రాలు, ఎమోషన్స్‌ను కొన్ని ఆత్మలు చక్కగా ఎంజాయ్ చేస్తూ చైతన్య పరిణామం చెందుతుంటాయి; ఆధ్యాత్మికంగా రాణిస్తుంటాయి. కొన్ని ఆత్మలు భూమి మీదే వుంటూ స్వప్నాల ద్వారా, సూక్ష్మ శరీర యానం ద్వారా ఇతర లోకాలలో సంచరించి ఇవే కళలను, శాస్త్రాలను, ఎమోషన్స్ + వాటి బంధాల గురించిన డైనమిక్స్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి జ్ఞానాన్ని సంపాదించుకుంటాయి. కాని ఒక ప్రపంచానికి (అంటే మీ విషయంలో భూమి) సంబంధించి జన్మ, కర్మ పరంపరల పరిసమాప్తికి ఆ ప్రపంచానికి గల చైతన్యశక్తి స్థాయిలో ఆధ్యాత్మిక + ఆత్మ జ్ఞాన సముపార్జన మరి బోధన తప్పనిసరి అవుతుంది. భూప్రపంచపు చైతన్యశక్తి స్థాయిలోనే కాకుండా అపరిమితమైన జ్ఞానాన్ని సముపార్జించుకోగల అవకాశలు ప్రతి మనిషికీ ఈ భూమి మీద వున్నాయి. ఆత్మశక్తికి పరిమితులనేవి లేవు. అనంతమైన జ్ఞానాన్ని సంపాదించుకోగల సత్తా మీకు ఇవ్వబడి వుంది.

ఆత్మలు చైతన్య పరిణామం మరి జ్ఞాన సముపార్జన కోసం ప్రతి జన్మనూ ఒక ఆయుధంగా, ఒక అవకాశంగా ఎంచుకుంటాయి. ఎమోషనల్‌గా బంధాన్ని పూర్తిగా ఆస్వాదించి దాని డైనమిక్స్‌ను అధ్యయనం చెయ్యడం కోసం కవల పిల్లలుగా జన్మ తీసుకోవడానికి రెండు ఆత్మలు నిర్ణయించుకోవడం కూడా భూమి మీద జరుగుతుంటుంది. 'పేదరికాన్ని గల జీవితాన్ని డిజైన్ చేసుకుని జన్మ తీసుకున్న వ్యక్తికి నేనేమీ సహాయపడక్కర లేదు'అని మీరు భావించకూడదు. అటువంటి భావన మీకు ఒక బలమైన విశ్వాసంగా రూపొందితే పేదరికం యొక్క డైనమిక్స్ పూర్తిగా అర్థంచేసుకోవడానికి తర్వాత జన్మలో పేదవాడిగా జన్మతీసుకోవడం జరుగుతుంది. ప్రతి జన్మలోనూ మీరు ప్రేమ, సృజనాత్మకత, ఆనందం, ఆధ్యాత్మిక జ్ఞానం లను ఇతరులకు విధిగా పంచవలసి వుంటుంది. అలా కాకుండా మీరు చైతన్య పరిణామం చెందడం అసాధ్యం!

భూమి మీద జన్మ తీసుకోకమునుపే ఏయే జీవితానుభవాలు కావాలో, ఏ విధంగా చైతన్య పరిణామం చెందాలో అన్నీ ముందే నిర్ణయించుకుని ఈ భూమి మీద ప్రవేశించడం జరుగుతుంది. మీరు జన్మ తీసుకోకమునుపే నిర్ణయాలు తీసుకున్నప్పటికీ – ఆధ్యాత్మికంగా, చైతన్య పరిణామపరంగా మీ లక్ష్యాలు సవాళ్ళను మార్చుకుని క్రొత్త డిజైన్‌ను ఎంచుకోగల స్వేచ్ఛ, స్వతంత్రతలను మీరు ప్రస్తుత ఈ వర్తమానంలో కలిగి వున్నారు. ఉదాహరణకు ఒక నిర్దిష్ట దిశలో చైతన్య పరిణామం చెందడం కోసం ఒక దీర్ఘకాలిక వ్యాధితో కూడిన జన్మను తీసుకున్నారనుకోండి. ఆత్మ న్యూనతతో, దైన్య స్థితితో ప్రస్తుతం ఆ దీర్ఘకాలిక వ్యాధితో మీరు జీవించాల్సిన అవసరం లేదు. ఈ వర్తమానంలోనే తక్షణమే ఆ వ్యాధి నుండి విముక్తి కలగాలని మీరు ప్రగాఢంగా వాంఛించినపుడు మీ 'ఆత్మశక్తి' అందుకు ఉద్యుక్తమై ఆ వ్యాధిని నయం చేసుకోవడం జరుగుతుంది. మీ దేహానికి అపరితమైన శక్తి వుంది. మీ జీవితం యొక్క డిజైన్‌ను ఈ వర్తమానంలోనే మార్చుకోగల శక్తి మీకు వుంది.

ఈ భూమి మీద ప్రతి మనిషిలోనూ అర్ధనారీశ్వర తత్వం వుంటుంది. కాన్షియస్ మైండ్ పరిధిలో అన్నీ మీకు ఎరుకలో వుండవుగాని స్త్రీగాను, పురుషుడిగాను గత అనేక జన్మలలో పొందిన చైతన్యశక్తి పరిణామాన్ని మీ అంతర్ ప్రపంచంలో ఇముడ్చుకుని వున్నారు. ఈ జన్మలో పురుషుడిగా జన్మ తీసుకుని వుంటే గత అనేక జన్మలలో స్త్రీగా

మీరు పొందిన జ్ఞాపకాలను, అనుభూతులను స్త్రీ మూర్తిత్వాన్ని మీ అంతర్ శక్తి ద్వారా కలిగి వుంటున్నారు. **కొన్ని ప్రత్యేక కోణాలలో చైతన్య పరిణామం చెందడం కోసం కొన్ని జన్మలు పురుషుడిగా, మరి కొన్ని ప్రత్యేక కోణాలలో చైతన్య పరిణామం చెందడం కోసం స్త్రీగా జన్మలు తీసుకోవడం ప్రతి ఆత్మకూ తప్పనిసరి అవుతుంది. మానవ చైతన్య పరిణామం సంపూర్తిగా చెందడం కోసం కొన్ని జన్మలలో పురుషుడిగా, మరి కొన్ని జన్మలలో స్త్రీగా లింగ విభజన జరుగుతుంది.** ప్రతి ఆత్మ కూడా సమాన సంఖ్యలో స్త్రీ, పురుష జన్మలు తీసుకోవడం జరుగదు. కొన్ని ఆత్మలు ఎక్కువ సార్లు స్త్రీ జన్మలు తీసుకొని, తక్కువ సార్లు పురుష జన్మలు తీసుకొని చైతన్య పరిణామం చెందడం జరుగుతుంటుంది. మరికొన్ని ఆత్మలు ఎక్కువ సార్లు పురుష జన్మలు, కొద్ది సార్లు స్త్రీ జన్మలు తీసుకోవడం జరుగుతుంటుంది.

ప్రస్తుతం ఈ జన్మలో స్త్రీగా జన్మ తీసుకొన్న ఆత్మ గత జన్మలలో పురుషుడిగా పొందిన చైతన్య పరిణామాన్ని, అనుభూతులను, పురుష మూర్తిత్వాన్ని జ్ఞానాన్ని తనలో ఇమడ్చుకుని వుంటుంది. ఆత్మ అన్ని కోణాలలో జీవితాన్ని దర్శించి, ఆత్మశక్తితో భౌతిక పదార్థంతో కూడిన చైతన్యశక్తితో సంపర్కం చెందడానికి, చైతన్యశక్తి యొక్క అన్ని ధర్మాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ఆధ్యాత్మిక శాస్త్రాన్ని సంపూర్తిగా అర్థం చేసుకోవడానికి స్త్రీ పురుష జన్మలు తీసుకొని చైతన్య పరిణామం చెందవలసి వుంటుంది. అంతర్ ప్రయాణం ద్వారా, సహజావబోధన ద్వారా, స్వప్నాల ద్వారా, సమాధి స్థితి ద్వారా మీ అంతర్ ప్రపంచంలో దాగి వున్న గత జన్మల చైతన్యశక్తి పరిణామాల స్మృతులను మీ ప్రత్యక్ష అనుభవంలోనికి తీసుకురాగల అవకాశాలు మీకు ఇవ్వబడివున్నాయి. ఈ జన్మలో పురుషుడిగా లేదా స్త్రీగా భూమి మీద ప్రవేశించడానికి గల కారణం – మీ ఆత్మశక్తి ద్వారా ఈ భౌతిక ప్రపంచంలో కొన్ని నిర్దిష్టమైన శక్తి సామర్థ్యాలను పరిణామణం చెందించి ఆధ్యాత్మికంగా పురోగతి పొందడం కోసమే. ప్రస్తుత ఈ పురుష జన్మలో గత జన్మలలో స్త్రీగా పొందిన చైతన్య పరిణామ అనుభూతుల ప్రభావం వుంటుంది. దాని పర్యవసానంగా ఈ నాగరికతలో ఈ వర్తమానంలో స్త్రీలుగా జన్మలు తీసుకొన్న జీవాత్మలను సగౌరవంగా గుర్తించడం, వాటితో సహజీవనం చెయ్యడం, పరస్పర సహకారం ద్వారా ఆధ్యాత్మిక పురోగతి సాధించడం జరుగుతుంది. స్త్రీ జన్మ తీసుకున్న ఆత్మకు కూడా గత జన్మలలో పురుషుడిగా చైతన్య పరిణామ అనుభూతులతో ప్రభావితం చెయ్యబడుతుంటుంది.

గత జన్మల చైతన్య పరిణామ ధర్మాలు ప్రస్తుతం జాగృదావస్థలో మీ ఎరుకలో వుండవు. కాని ఆ అనుభూతులు మీ అంతర్ ప్రపంచంలో ఇమిడివుంటూ వ్యక్తిగతంగా మరి సామాజికంగా మిమ్మల్ని బ్యాలన్సు (balance)లో వుంచుతుంటాయి. ప్రస్తుత ఈ పురుష జన్మలో మీరు విచక్షణ కోల్పోయి స్త్రీ జాతి పట్ల దురుసుగా ప్రవర్తించే క్షణంలో అచేతనా స్థితిలో మీలో దాగి వున్న గత స్త్రీ జన్మల తాలూకు చైతన్యశక్తి మిమ్మల్ని నియంత్రించడం జరుగుతుంటుంది. అచేతనావస్థలో పురుషుడు స్త్రీమూర్తిత్వ చైతన్యశక్తి వైపు గుంజబడుతుంటాడు. మరోవైపు ప్రస్తుత పురుష జన్మ తాలూకు చైతన్యశక్తి సంఘర్షణ వైపు గుంజబడుతుంటుంది. ఈ రెండింటి మధ్య ఏర్పడిన సంఘర్షణ ద్వారా ఉత్తేజకరమైన ఆలోచనలు తద్వారా ఆధ్యాత్మిక పురోగతికి దారి తీసే భౌతిక సంఘటనలు మరి జీవితానుభవాలు ప్రవేశిస్తాయి. ఆధ్యాత్మిక పురోగతిలో ఒక అడుగు ముందుకు వెయ్యడానికి ఈ సంఘర్షణ తప్పనిసరి అవుతుంది.

'ఆత్మ' భూ ప్రపంచంలో జన్మలు తీసుకుంటూ చైతన్య పరిణామం చెందుతున్న ప్రారంభ దశలలో ఈ లింగ విభజనతో కూడిన జన్మలు తప్పనిసరవుతాయి. మనిషిలో దాగి వున్న స్త్రీ, పురుష చైతన్య శక్తుల సంఘర్షణ మరి వాటి మధ్య అనురాగం చాల జన్మల పాటు కొనసాగుతుంటుంది. దీని వల్ల ఆధ్యాత్మికంగా ఎదుగుదల కొనసాగు తుంటుంది. జన్మ పరంపరలు పరిసమాప్తి పొందే దశలో అంటే చివరి జన్మలో ఆత్మకు స్త్రీ మూర్తిత్వంగాని, పురుషత్వంగాని వుండవు. లింగ విచక్షణ అనేది మటుమాయమవుతుంది. ఆఖరి జన్మలో పురుషుడిగా జన్మించినా, స్త్రీగా జన్మించినా ఏదైనా ఒక్కటే. అప్పటికే ఆత్మ ఎంతో చైతన్య పరిణామం చెందివుంటుంది; ఆత్మ ఎంతో ఆధ్యాత్మిక పురోగతి సాధించి వుంటుంది; రాగ ద్వేషాలకు, భూ భౌతిక వాసనలకు వ్యామోహాలకు అతీతమైన స్థితిలో వుంటుంది. భూ భౌతిక జీవితానుభవాలు పొందుతున్నప్పటికీ ఆధ్యాత్మికంగా ఎంతో సమతౌల్యాన్ని పొందివుంటుంది.

– ఈ జీవితం కొనసాగుతున్నంత కాలం మరి మరణాంతర జీవితంలోనూ మానవ చైతన్య పరిణామానికి కావల్సిన గైడెన్స్ ఇవ్వడానికి ఆధ్యాత్మిక గురువులు ఎల్లప్పుడూ అందుబాటులో వుంటున్నారు. మీకు కావాల్సిన గైడెన్స్ అంతర్ ప్రపంచం నుండి వస్తుంది. అంతర్ ప్రయాణం ద్వారా దాన్ని పొందవచ్చు. ఆధ్యాత్మిక గురువుల గైడెన్స్ తప్పని సరిగా అత్యావశ్యం కాదు. మీ అంతర్ ప్రపంచమే మీకు అసలైన గురువు.

– భూమి మరి తత్సమానమైన శక్తి స్థాయి మరి ఫ్రీక్వెన్సీ స్థాయి గల లోకాలను ఒక సిస్టంగా (system) పరిగణించడం జరుగుతుంది. ఈ సిస్టంకు సంబంధించిన ఆధ్యాత్మిక శాస్త్రాన్ని సంపూర్తిగా పొందడం మరి ఆధ్యాత్మిక బోధన జరిగిన తర్వాతే మరింత ఉన్నత సిస్టం గల లోకాలలోనికి ప్రయాణించి అక్కడ జన్మ పరంపర కొనసాగించడం జరుగుతుంది.

– ఏ ఆత్మ కూడా ఈ భూమి మీద నిర్దయగా, దయనీయమైన స్థితిలో వదిలివేయ బడలేదు. ఈ భూమి మీద చైతన్య పరిణామం సంపూర్ణంగా చెందడానికి అపరిమిత జ్ఞానాన్ని తన అంతర్ ప్రపంచంలో ఇముడ్చుకుని వుంది. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సరియైన రీతిలో వుపయోగించుకోకపోవడం వలన దుఃఖాన్ని, దౌర్భాగ్యాన్ని, దారిద్ర్యాన్ని మీ జీవితానుభవాలలో చోటు కల్పిస్తున్నారు. మీ వాస్తవాలను మీరే సృష్టించుకుంటున్నారు.

– భూమి మీద మానవ చైతన్య వికాసానికి మరి ఇతర జీవజాతుల చైతన్య వికాసానికి, పరిపూర్ణ ఆధ్యాత్మిక వికాసానికి అపారమైన అవకాశాలను అన్ని జీవాత్మలూ కలిగి వున్నాయి. జీవాత్మలు తమ ఇష్టానుసారంగా, స్వేచ్ఛగా ఏ కోణాలలోనైనా భౌతిక సంఘటనలను జీవితానుభవాలుగా స్వీకరించి చైతన్య పరిణామం చెందగలవు. ఏ లోకానికైనా ఇవే నియమాలు వర్తిస్తాయి. ఇతర లోకవాసులు మీపై అధికారం చెలాయించడంగాని, మిమ్మల్ని నియంత్రించడం గాని జరగవు. ఎవరి సవాళ్ళు వారికుంటాయి.

– భూమి + దాని మీద జీవజాతులన్నీ ఒక సమిష్టి లక్ష్యాన్ని (collective goal) ఎంచుకొని చైతన్య పరిణామం చెందుతున్నాయి. చైతన్య పరిణామం తద్వారా ఆధ్యాత్మిక పురోగతి ప్రస్తుత తరుణంలో వేగాన్ని పుంజుకున్నాయి.

– ఈ 21వ శతాబ్దంలోనే ఓ వినూత్నమైన ఆధ్యాత్మిక ప్రపంచం భూమి మీద ఆవిష్కరించగల అవకాశం ఆసన్నమైంది. మీ అంతర్ ప్రపంచంలో అందుకనుగుణంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మీ ప్రాపంచిక భాషలో చెప్పాలంటే 'భూమి మీద స్వర్గం' ఆవిష్కరించబడుతుంది. అనూహ్యమైన రీతిలో మానవ చైతన్య పరిణామం క్రొత్త పుంతలు త్రొక్కుతుంది.

– భూమి మరి దాని తత్సమాన శక్తిస్థాయి + ఫ్రీక్వెన్సీ స్థాయి గల లోకాలు గల సిస్టంలో ఏ లోకంలోనైనా జన్మలు తీసుకొని చైతన్య పరిణామం మరి ఆధ్యాత్మిక

పురోగతి చెందగలదు. ఈ సిస్టంలో జన్మ పరంపరల చివరి దశలో... అంటే ఆఖరి జన్మలో స్త్రీ, పురుష చైతన్యశక్తి ధర్మాలు రెండూ కలిసిపోతాయి. లింగ విభజన ఆధారంగా చైతన్య పరిణామం వుండదు. ఆఖరి జన్మలో మనిషి దేహంలో స్త్రీ, పురుష జీవశక్తి ధర్మాలు రెండూ మేళవించబడివుంటాయి.

– భూమి మీద ఆఖరి జన్మలో మీ చైతన్యశక్తి భూ భౌతిక ప్రపంచపు చైతన్యశక్తితో చాలా చక్కగా ట్యూన్ అయి వుంటుంది. సకల ప్రాణికోటి పట్ల ప్రేమ, అనురక్తి వుంటుంది. తన సహచర జీవజాతుల పట్ల రాగద్వేషాలు మటుమాయమవుతాయి.

* * *

జన్మపరంపరల ద్వారా మీ చైతన్యశక్తి విస్తరిస్తూ వుంటుంది; ఆధ్యాత్మిక శాస్త్రం పట్ల మీ అవగాహనా శక్తి పెరుగుతూ వుంటుంది; మీ మనోశక్తి మరింత పదునుదేలుతుంటుంది. అయితే సాధన మరి పరిశోధనల వేగం మటుకు మీపై ఆధారపడివుంటుంది. మంచి చెడుల గురించి విశ్లేషణలు, మూర్ఖ అభిప్రాయాలు, మానసిక సోమరితనం మిమ్మల్ని ఆధ్యాత్మికంగా ఎదగనీయకుండా పరిమిత జ్ఞానంతో వుండేటట్లు చేస్తుంటాయి. ఆధ్యాత్మికంగా, మానసికంగా ఎదగడానికి కావలసిన సరళత్వం మీకు కొరవడడం వల్ల ప్రతి జన్మలోనూ అస్పష్టత, అయోమయం మరి ఆందోళనకు గురవుతున్నారు. పర్యవసానంగా ఆధ్యాత్మిక పురోగతి కుంటుపడుతూంది.

ఉల్లిపాయకు అనేక పొరలుంటున్నట్లే మీ దేహం కూడా అనేక పొరలను కలిగివుంది. మీరు ప్రస్తుతం పురుషుడిగా వున్నట్టయితే గత అనేక జన్మల దేహాలు, ఆ జన్మలలో పొందిన ఆధ్యాత్మిక జ్ఞానం కోడ్ భాషలో (code language) విద్యుదయస్కాంత శక్తి రూపంలో మీ అంతర్ శక్తిలో నిక్షిప్తపరచబడి వున్నాయి. ఆ దేహాలను ఆ కోడ్ భాషను మీ అంతరేంద్రియాల ద్వారా దర్శించే వీలుంది. ఈ వర్తమానంలో మీరు పొందిన పురుష జన్మ లేదా స్త్రీ జన్మ తాలూకు చైతన్యశక్తి ధర్మాలు వాటిని మరుగున పడేటట్లు చేస్తాయి. ఇపుడు మీరు ధరించి వున్న దేహం యొక్క జెనెటిక్ నిర్మాణం గత అనేక జన్మలలో పొందిన దేహాల తాలూకు చైతన్యశక్తి + ఆధ్యాత్మిక శక్తుల ఆధారంగా రూపొందింది. మీ దేహంలోని జీవకణాలన్నీ గత అనేకానేక జన్మలలో పొందిన జ్ఞానాన్నంతటినీ కోడ్ (code) రూపంలో దాచుకునివున్నాయి.

మీరు పురుషుడైతే మీలో స్త్రీ మూర్తిత్వం విద్యుదయస్కాంత శక్తి + జీవరసాయనిక శక్తి రూపంలో ఇమిడివుంది. మీరు స్త్రీ అయితే మీలో పురుష మూర్తిత్వం కూడా అదే

మాదిరిగా మీలో వుంటుంది. మీ దేహంలోని పురుషుడు + స్త్రీ విద్యుదయస్కాంత శక్తి ద్వారా అనుసంధానింపబడి వుంటాయి.

ఇంతకు ముందే చెప్పినట్లు ఉల్లిపాయపొరలలో ఉపరితలంలో వుండే పొర మాత్రమే మీకు కన్పిస్తుంటుంది. లోపలి పొరలు మీకు కన్పించవు. ఉల్లిపాయలలోని అనేక పొరలలో విద్యుదయస్కాంత శక్తి + జీవరసాయనిక శక్తి వుంటూ ఉల్లిపాయకు ఒక ఆకారాన్ని కలుగ జేస్తుంది. ఉల్లిపాయకు గల రుచి మరి దాని ఘాటు వాసనలను చైతన్యశక్తి కలుగ జేస్తుంది. పై ఉదాహరణ లాగానే గత అనేకానేక జన్మలు + ఈ వర్తమాన జన్మలకు సంబంధించిన దేహాలను ప్రస్తుతం మీరు కలిగివున్నారు. ఈ వర్తమానంలో వున్న దేహం మాత్రమే మీకు ఉపరితలంలో కన్పిస్తుంది. మిగతా అనేకానేక జన్మలలోని దేహాలు అదృశ్య పొరల వలె మీ దేహంలో ఇమిడివున్నాయి. ఈ దేహాలన్నీ చైతన్యశక్తి ద్వారా అనుసంధానింప బడివున్నాయి గత అనేకానేక జన్మలలో పొందిన దేహాలు + ఆధ్యాత్మిక జ్ఞానం + చైతన్య పరిణామం అంతా కూడా మీ ఆత్మశక్తి పురోగతికి వారసత్వంగా సంక్రమిస్తున్నాయి.

ప్రస్తుతం మీరు పురుషుడిగా వుండి స్త్రీల గురించి వారి చైతన్యశక్తి ధర్మాలను తెలుసుకోవాలని కాంక్షిస్తున్నారనుకోండి. అపుడు మీరు అంతర్ ప్రయాణం, సమాధిస్థితి, స్వప్నాల ద్వారా మీరు గత అనేక జన్మలలో స్త్రీగా పొందిన చైతన్యశక్తి అనుభవాలను శోధించి తెలుసుకోవచ్చు. ప్రస్తుతం మీరు అనారోగ్యంతో బాధపడుతుంటే – గత కొన్ని జన్మలలో మీరు కల్గివున్న బలమైన + ఆరోగ్యమైన దేహాల నుండి జెనెటిక్ కోడ్ భాషను (Genetic code language) ప్రస్తుత ఈ దేహంలోనికి చొప్పించి ఆరోగ్యాన్ని పొందవచ్చు. ఈ కోడ్ భాషను ట్రాన్స్‌ఫర్ (transfer) చేసుకోవడానికి స్వప్నాలు, అంతర్ ప్రయాణం లాంటివి మీకు ఉపయోగపడతాయి. ప్రస్తుతం మీకు 'ధైర్యం' అనే గుణం లేదనుకోండి. అపుడు గత కొన్ని జన్మలలో ధైర్యవంతుడిగా మీరు పొందిన అనుభవాల ద్వారా పొందిన చైతన్యశక్తిని ఇపుడు వినియోగంలోనికి తీసుకురావచ్చు. స్థూలంగా చెప్పాలంటే – గత అనేకానేక జన్మలలో పొందిన అనుభవాలను, జ్ఞానాన్ని, చైతన్య వికాసాన్ని మీ అంతర్ ప్రపంచంలో ఇముడ్చుకుని వున్నారు.

ఆత్మ ఒక కోణంలో మాత్రమే ఆధ్యాత్మిక పురోగతిని చెందుతున్న విషయాన్ని ఇక్కడ వివరిస్తున్నాను. ఆత్మ అనేక కోణాలలో ఏ విధంగా పురోగతి చెందుతూందో తర్వాత వివరిస్తాను. భూమి మీద ఒక జీవజాతి నేర్చుకున్న జ్ఞానాన్ని చైతన్యశక్తి

రూపంలోనికి మార్చి దాన్ని విద్యుదయస్కాంత శక్తి ద్వారా ఇతర జీవజాతులకు చేరవేస్తాయి. అట్లాగే మానవజాతిలో స్త్రీ జాతి తాము సంపాదించిన జ్ఞానాన్ని పురుషజాతికి, పురుష జాతి తాము సంపాదించిన జ్ఞానాన్ని స్త్రీ జాతికి పంచడం జరుగుతుంటుంది. ఆత్మకు స్త్రీ, పురుష విచక్షణ వుండదు. ఆత్మ స్త్రీగాను, పురుషుడిగాను జన్మలు తీసుకోగలదు. అన్ని జీవజాతుల మాదిరిగానే మానవజాతి కూడా కొన్ని ప్రత్యేక కోణాలలో చైతన్య పరిణామం చెందుతూంది. ఒక కుటుంబంలోని సభ్యులందరూ పరస్పర సహకారంతో అభివృద్ధి చెందుతున్నట్లే, భూమి మీద జీవజాతులన్నీ పరస్పర సహకారంతో మెలుగుతూ వాటి జ్ఞానాన్ని పంచుకుంటున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య సఖ్యత – సహకారం వుంటాయి కాని పోటీ వుండదు. అట్లే జీవజాతుల మధ్య కూడా సఖ్యత – సహకారం వుంటాయి కాని వాటి మధ్య పోటీ వుండదు. భూ భౌతిక ప్రపంచంలో ఆధ్యాత్మికశక్తిని మరి జీవశక్తిని వేరుచేసి చూడడానికి వీలులేదు. జీవశక్తి, ఆధ్యాత్మికశక్తి రెండూ సమాంతరంగా పురోగతి చెందుతాయి. ఈ రెండింటి వాస్తవాల కలయికే ఆత్మ చైతన్య పరిణామం అనబడుతుంది.

మీ కళ్ళకు గోచరమయ్యే బాహ్య ప్రపంచం అంతర్ ప్రపంచం యొక్క పొడిగింపు మాత్రమే. మల్టిడైమన్షనల్‌గా వుండే అంతర్ ప్రపంచం నుండి మీ వాంఛలకు, నమ్మకాలకు, సంకల్పాలకు అనుగుణంగా బాహ్య భౌతిక ప్రపంచం యొక్క సృష్టి జరుగుతుంటుంది. మీ అంతరంగంలో ఏర్పడే ఆలోచనా తరంగాలు, సంకల్పాల కనుగుణంగా ఎప్పటికప్పుడు బాహ్య భౌతిక ప్రపంచం యొక్క స్వభావం కూడా మారిపోతుంటుంది. ఆత్మశక్తిని ఒక ప్రత్యేక కోణంలో ప్రకటితం చెయ్యడానికి ఈ భూమి అనే లోకాన్ని ఆత్మ ఎంచుకోవడం జరిగింది. ఆత్మ తన చైతన్య పరిణామం మరి ఆధ్యాత్మిక పురోగతి కోసం భూమి అనే త్రీ డైమన్షనల్ తలం గల లోకాన్ని ఎంచుకోవడంలో గొప్ప లక్ష్యం + పరమార్థం దాగి వున్నాయి.

ఆత్మ యొక్క మల్టిడైమన్షనల్ స్వరూపాన్ని తెలుసుకోవడానికి ఈ భూమి అనే వేదిక చాల చక్కగా వుపయోగపడుతుంది. ఎలక్ట్రాను (electron) యొక్క చలనం (motion) మల్టిడైమన్షన్స్‌లో వుంటుంది. త్రీ డైమన్షనల్ తలంలో రూపొందించిన శాస్త్ర పరికరాలు ఎలక్ట్రాను యొక్క మల్టిడైమన్షనల్ కదలికలను పసిగట్టలేవు. మీ చైతన్యశక్తిని తరంగాల సముదాయంగా కేంద్రీకరింపజేసి ఎలక్ట్రానును అధ్యయనం చేసినపుడు ఎలక్ట్రాను యొక్క మల్టిడైమన్షనల్ కదిలికలు మీకు కనిపిస్తాయి. పదార్థంలో

(matter) ఇమిడివున్న చైతన్యశక్తిని అధ్యయనం చెయ్యడానికి కూడా మీ చైతన్యశక్తిని పదార్థంలోనికి చొప్పించవలసివుంటుంది. విత్తనంలో మహా వృక్షం దాగి వుందనే సత్యం మీ కళ్ళకుగాని, మీ శాస్త్ర పరికరాలకు గాని కన్పించదు గదా! ఒక మహా వృక్షం చైతన్యశక్తి రూపంలో ఒక చిన్న విత్తనంలో ఇమిడి వుంటుంది. అలాగే ఆత్మ అనే మహా వృక్షం తన చైతన్యశక్తి ద్వారా 'దేహం' అనే మాంస పిండంలో ఇమిడి వుంటుంది. భూమి మీద జీవాత్మలకు 'దేహం' అనే కవచం అతి పవిత్రమైనది. ఆ పవిత్రతను విస్మరించి జంతుజాతులను చంపి వాటి మాంసాన్ని భుజించడం, జంతుజాతులను ప్రయోగశాలల్లో వుపయోగించడం చాల తుచ్ఛమైన విషయాలు!

భూమి మీద జన్మ రాహిత్యం పొందినప్పటికీ కొన్ని పరిణితి చెందిన ఆత్మలు ఊర్ధ్వలోకాలలో అత్యున్నత ఆధ్యాత్మిక జ్ఞానం అభ్యసించి తిరిగి భూమి మీదకు ఆ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించడానికి జన్మలు తీసుకోవడం జరుగుతుంటుంది. భూమి మీద మానవజాతికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించడం అత్యావశ్యకమని భావించకుండా సరదాకోసం అలా భూమిని దర్శించి జ్ఞానాన్ని బోధించడం చేస్తుంటారు. వాళ్ళు ఎంత మాత్రమూ భూభౌతిక ప్రపంచానికి సంబంధించిన బంధనాలకు, రాగ ద్వేషాలకు లోనుకారు. భూమి మీదకు ఎందుకు వచ్చారో వచ్చిన పనేమీటో వాళ్ళకు స్పష్టంగా తెలుస్తుంది. స్వప్నావస్థలలో, ట్రాన్స్‌స్థితులలో (trance states) మరి సమాధి స్థితులలో కూడా మీకు ఆధ్యాత్మిక శాస్త్రము గురించి బోధింపబడుతుంటుంది. మీ మైండ్ ఆ జ్ఞానాన్ని సంగ్రహిస్తుంది. పరిణితి చెందిన ఆత్మలు ఎప్పుడు కావాలంటే అపుడు భూమి మీద జన్మలు తీసుకొని భౌతిక వాస్తవాన్ని ఎంచుకొని చైతన్య పరిణామం చెందగల స్వేచ్ఛను కలిగి వుంటాయి. కాని చాల సార్లు ప్రత్యేకంగా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించడానికి జన్మలు తీసుకుంటుంటాయి.

ఒక్క మానవజాతికే కాక భూమి మీద జన్మలు తీసుకొంటున్న జీవాత్మలన్నింటికీ స్వప్నావస్థలలో డైరెక్టుగా మరి టెలీపతి ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించడం జరుగుతుంది. ఇతర లోకవాసులు భూమి మీదకు తరచుగా యాత్రలు చేసి దర్శించడం జరుగుతుంది. వాళ్ళు మీకు చైతన్య పరిణామానికి కావలిసిన జ్ఞానాన్ని అందించడానికి వస్తున్నారు. భూమి మీదకు దండెత్తి మానవజాతిని తమ అధీనంలో వుంచుకోవడానికి వాళ్ళు ఇక్కడకు రావడం లేదు. మీ స్వప్నావస్థలలో వింత ఆకారాలను చూడడం జరుగుతుంటుంది. ఆ వింత ఆకారాలే గ్రహాంతర వాసులు. వాళ్ళ నుండి

సంగ్రహించబడిన జ్ఞానం మీ సబ్‌కాన్షియస్ మైండ్‌లో రికార్డయి వుంటుంది. స్వప్నాలను విశ్లేషించడం ద్వారా ఆ జ్ఞానాన్ని మీ అందుబాటులోనికి తీసుకురావచ్చు.

ప్రస్తుతం మీ దేహం మరి మీ జీవితం అనంత మూలచైతన్యం నుండి ఉద్భవించింది. మీ జీవిత సవాళ్ళను అధిగమించడానికి కావలసిన శక్తిని ఆ అనంతమూలచైతన్యశక్తి నుండి పొందవచ్చు. అలాగే మీరున్న భౌతిక ప్రపంచం కూడా ఆ అనంత మూలచైతన్యం నుండే ఉద్భవించింది. దానికి కావలసిన శక్తి కూడా అనంత మూలచైతన్యం నుండే లభిస్తుంది. ఇంతకూ ఈ అనంత మూలచైతన్యం లేదా బ్రహ్మాండం ఎక్కడ వుందని మీకు సంశయం కలుగవచ్చు. అనంత మూలచైతన్యం లేదా బ్రహ్మాండం మీ అంతర్ ప్రపంచంలో ఇమిడి వుంది; అదే ఈ విశ్వమంతా ఆవరించి వుంది. మీ అంతర్ ప్రపంచంలోనూ, ఈ విశ్వమంతా ఆవరించి వుంది.

* * *

జీసస్ మరి బుద్ధుడు మానవ చైతన్య వికాసం భూమి మీద ఎంత ఉన్నతంగా చెందగలదో మీకు తెలియజేశారు. మీ బైబిల్‌లో ఉదహరించినట్లుగా జీసస్ శిలువ వేయబడలేదు. జీసస్ బోధనలన్నీ అంతర్ ప్రయాణం ద్వారా మానవ చైతన్య వికాసాన్ని పెంపొందించుకోవడం పైన సాగినాయి. జీసస్ భూమి మీద నుండి నిష్క్రమించిన తర్వాత జీసస్ బోధనలను ఆచరించే వారే కరువయ్యారు. జీసస్‌ను శిలువ వెయ్యడాన్ని మానవ చైతన్యాన్ని, ఆధ్యాత్మిక పురోగతి వైపు మళ్ళించడానికి జరిగిన కాస్మిక్ డ్రామా! కానీ ఆ డ్రామా తర్వాత మానవజాతి అంతర్ ప్రపంచం వైపు దృష్టి సారించడాన్ని విస్మరించడం జరిగింది.

జీసస్ జీవించి వున్నపుడు ఆయనతో సమానంగా ఆధ్యాత్మిక పరిణితి చెందిన మరో ఇద్దరు క్రైస్తులు కూడ వుండేవారు. అంటే జీసస్‌తో పాటు ముగ్గురు క్రైస్తులు (Three Christs) వుండేవారు. ముగ్గురూ మానవ దేహాలతోనే వుండేవారు. ఆ ముగ్గురిలో ఏ ఒక్కరూ శిలువ వేయబడలేదు. ఆ ముగ్గురు క్రైస్తులూ . వారి పన్నెండు మంది శిష్యులు భూమి మీద మానవ చైతన్య ధర్మాలకు ప్రతీకలు! మానవశక్తి సామర్థ్యాలు ఎలాంటివో, మానవ చైతన్య ధర్మాలు ఎలా వుంటాయో, మానవుడు ఆధ్యాత్మిక పురోగతిని ఏ మేరకు సాధించగలడో మీకు తెలియ జెయ్యడానికి ముగ్గురు క్రైస్తులు . వారి పన్నెండు మంది శిష్యులు ప్రాతినిధ్యం వహించారు. జీసస్‌ను శిలువ వెయ్యడమనేది ఆత్మశక్తికి సంబంధించిన డ్రామా మరి కాస్మిక్ డ్రామా! ఈ డ్రామా త్రీ డైమన్షనల్ సిస్టంలో

మానవజాతిని మల్టి డైమన్షనల్ సిస్టం వైపు త్రిప్పడానికి సృష్టించబడింది. అలాగే ఇలాంటి డ్రామాలు చాల వరకు సృష్టింపబడినాయి. ఈ డ్రామాలు దురదృష్టవశాత్తు మానవజాతిలో మతాలను సృష్టించాయి. ఈ మతాలు మూఢ విశ్వాసాలను కలుగ జేసి మానవజాతిలో బేధాలను సృష్టించి యుద్ధాలను కలుగ జేశాయి. దానివల్ల మానవజాతి చైతన్య వికాసానికి ఎంతో హాని జరిగింది.

అనంతమూలచైతన్యం (All That Is) తను సృష్టించుకున్న సృష్టి అంతటిలోనూ ఇమిడివుంది. మూలచైతన్యం ప్రతి క్షణమూ తనను తాను సృష్టించుకుంటూనే వుంటుంది. 'మూలచైతన్యం' తన సృష్టికంటే ఇంకా ఎక్కువ పెద్దది. ఈ మూలచైతన్యం ప్రతి స్త్రీలోనూ, ప్రతి పురుషుడిలోనూ, ప్రతి సాలె పురుగులోనూ, ప్రతి చీమలోనూ, ప్రతి గడ్డిపోచలోనూ మరి ఈ చరాచర సృష్టి అంతటిలోనూ ఇమిడివుంది. అనంత మూలచైతన్యం మనిషి ఆకారంలో మాత్రమే వుంటుదని ఎందుకనుకుంటారు? అన్ని రూపాలలో మూలచైతన్యం విరాజిల్లుతూంది. మూలచైతన్యమే దేవుడు. దేవుడే మూలచైతన్యం. మూలచైతన్యం అనేది పురుషుడూ కాదు మరి స్త్రీనూ కాదు. మూలచైతన్యానికి అన్ని గుణాలు వున్నాయి. కొన్ని ప్రత్యేక గుణాలు కలిగి వుండదు. మల్టి డైమన్షనల్ మూలచైతన్యాన్ని మానవ పరిభాషలో నిర్వచించడానికి సాధ్యపడదు; ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని ఆపాదించడం ద్వారా మూలచైతన్యాన్ని వర్ణించడం అసాధ్యం.

మీ ఉనికి ద్వారా మూలచైతన్యాన్ని అనుభూతి చెంది ఆస్వాదించడం తప్పించి దాన్ని బాహ్యేంద్రియాల ద్వారా తెలుసుకోలేరు. ఆ మూలచైతన్యం మనిషి రూపంలోనూ మరి సమస్త జీవాత్మల దేహాల రూపంలోనూ ఇమిడి వుంటూ ఆత్మ చైతన్య పరిణామం చెందుతూంది. మీ ఊహల కనుగుణంగా దేహాన్ని ధరించి వున్న మీరు మూలచైతన్యాన్ని మీ అంతర్ ప్రపంచంలో ధరించి వున్నారు. మీ అంతర్ ప్రపంచంలోని మూలచైతన్యం మీకు విశిష్టతను మరి పరమార్థాన్ని కలుగ జేస్తుంది. మీ ఆకాంక్షలకు, సంకల్పాలకు అనుగుణంగా మీ అంతరంగంలోని మూలచైతన్యం స్పందించి మీకు వాస్తవాన్ని కలుగ జేస్తుంది. **మీ అంతర్ ప్రపంచంలోని మూలచైతన్యమే మల్టిడైమన్షనల్ దైవం (Multi Dimensional God)! మీ అంతర్ ప్రపంచం ఎప్పటికీ అవినాశిగా వుంటూ మూలచైతన్యం యొక్క అనంతమైన శక్తి ద్వారా నడపబడుతూ, కాపాడబడుతూ, సంరక్షింప బడుతూ వుంటుంది. మీ అంతర్ ప్రపంచమే అనంత బ్రహ్మాండ మూలచైతన్యం!**

ఈ విశ్వంలోని సమస్త లోకాలలోగల సకల చరాచర సృష్టి యొక్క అనంత ధర్మాలు మీ అంతర్ ప్రపంచంలో ఇమిడి వున్నాయి. అనంత బ్రహ్మాండమైన మూలచైతన్యం యొక్క సర్వశక్తి సామర్థ్యాలూ మీ అంతర్ ప్రపంచంలో ఇమిడి వున్నాయి. మీ అంతర్ ప్రపంచాన్ని నాశనం చెయ్యడంగాని లేదా శూన్యం చెయ్యడం గాని ఎప్పటికీ సంభవం కాదు. మూలచైతన్యంలోని విడిపోయిన ఒక కణం ప్రస్తుతం మీ దేహం రూపంలో చైతన్య పరిణామం చెందుతూంది. ఇప్పటికే కోట్ల దేహాలను ధరించి వుంది. ప్రస్తుతం మీరు కల్గి వున్న దేహాన్ని కూడ ధరించి వుంది; ఈ దేహాన్ని విడిచి పెట్టిన తర్వాత మళ్ళీ కోటానుకోట్ల జన్మలు తీసుకుని కోటానుకోట్ల దేహాలను ధరించబోతుంది. మీ ఉనికి, మీ చైతన్య పరిణామం ఎప్పటికీ నిలిచివుంటుంది. మీరు తిరిగి మళ్ళీ మూలచైతన్యంలో లీనమైపోవడం లేదు. మీరు వుంటున్నదే మూలచైతన్యంలో మరి అటువంటపుడు ఎక్కడ లీనమై పోతారు?

మీ అంతర్ ప్రపంచంలోని మూలచైతన్యం అనంతమైనది. ఆ మూలచైతన్యమే విశ్వమంతా ఆవరించి వుంది. దాన్ని అనుభూతి చెందగలరే తప్ప చూడలేరు. దాన్ని మీ అంతరేంద్రియాలలో మాత్రమే అనుభూతి పొందగలరు. జీవాత్మల అంతర్ ప్రపంచంలోని దేవుడిని కూడా మీ అంతరేంద్రియాల ద్వారా మాత్రమే దర్శించే వీలుంది. మీ కంటికి కన్పించే ప్రపంచంలో మూలచైతన్యం యొక్క పరిణామం నీటి బొట్టంత అయితే మీ అంతరేంద్రియాలతో దర్శించే మూలచైతన్యం మహా సముద్రమంత వుంటుంది.

మీ అంతర్ ప్రపంచంలోని మల్టి డైమన్షనల్ దేవుడు (Multi Dimensional God) ఒంటిరిగా, ఏకాకిగా ఈ భూమి మీద వుంటున్నాడా? అలాగే ఇతర జీవాత్మలలోని మల్టి డైమన్షనల్ దేవుళ్ళు కూడా ఎవరికి వాళ్ళు ఒంటరిగా, ఏకాకిగా వుంటారా? కానేకాదు. అందరి అంతర్ ప్రపంచాలలోని దేవుళ్ళు తమ మూలచైతన్యశక్తి ధర్మాల ద్వారా అనుసంధానింప బడివున్నారు. అందరూ దేవుళ్ళే! ఈ విశ్వంలోని అన్ని జీవాత్మలూ 'దేవుళ్ళే'! ఈ విశ్వంలో ఆవరించిందంతా దైవ స్వరూపమే!

ఈ విశ్వం మీ కోసమే వుంది. ఈ విశ్వంలోని ఏ శక్తీ మీ సంకల్పాలకు, ఆకాంక్షలకు వ్యతిరేకంగా పనిచెయ్యదు. కష్టాలు, సుఖాలు అన్నింటినీ సృష్టించుకుంటున్నది మీరే. భూమి మీద మానవులందరూ మీకు సహకారం అందించడం కోసమే వున్నారు. మీ ఆలోచనా తరంగాల స్వభావాన్ని బట్టి వాళ్ళు మీకు దగ్గరవ్వడమో,

దూరమవ్వడమో లేదా మిత్రులుగానో, శత్రువులుగానో సృష్టింపబడడం జరుగుతుంటుంది. ఎవరి సంకల్పాలు వారికుంటాయి. ఎవరి వాస్తవాలు వారికుంటాయి. ఒకరి వాస్తవం ఇంకొకరి వాస్తవానికి ప్రోత్సాహాన్ని, సహకారాన్ని అందిస్తుంది. ఈ భూమి మీద జీవాత్మల వాస్తవాలన్నీ దేనికది ప్రత్యేకంగా వుంటుంది. జీవాత్మలన్నింటి వాస్తవాల కలయికే భూ ప్రపంచం యొక్క వాస్తవం అవుతుంది.

దేహం అనే మాంసపిండంలో మూలచైతన్యం యొక్క ఒక కణం లేదా ఒక శకలం ఆత్మగా పరిణమించింది. త్రీ డైమన్షనల్ తలంగా చెప్పబడే ఈ భూమి మీద గల సిస్టం (system)లో జన్మ తీసుకొని చైతన్య పరిణామం చెందుతూంది. భౌతిక పదార్థంలో కూడిన జీవితాన్ని ఆస్వాదిస్తూ, ఇతర డైమన్షన్స్‌కు సంబంధించిన జ్ఞానాన్ని అంతర్ ప్రయాణం ద్వారా, స్వప్నాల ద్వారా పొందడం జరుగుతూంది. మీ అంతర్ ప్రపంచాన్ని దానికిగల అనంత ధర్మాలను మీరు విశ్వసించి తీరాలి. మీ ఆత్మ పురోగతిని, ఆధ్యాత్మిక పురోగతిని ఎంచుకునే బాధ్యత మీదే. ఈ పనిని మీకెవరూ చేసిపెట్టరు. మీ అంతర్ ప్రయాణం ద్వారా మీ అంతర్ గురువుని ఆశ్రయించి ఎప్పటికప్పుడు మీ జీవితానికి కావలసిన సవాళ్ళను ఎంచుకుని చైతన్య పరిణామాన్ని చెందించుకోగల బాధ్యత మీదే. ఎరుక స్థితిలో వున్నపుడు, స్వప్నావస్థలో వున్నపుడు, సూక్ష్మ శరీరయానం చేసేటపుడు మీ ఆధ్యాత్మిక గురువులు గైడెన్స్ ఇస్తుంటారు. కాని దాన్ని స్వీకరించడమో, తిరస్కరించడమో చెయ్యగల స్వేచ్ఛ మీకు వుంటుంది. అదంతా మీ ఇష్టం పైన ఆధారపడివుంటుంది. మీ జీవితాన్ని మలుపు త్రిప్పుకునే ఛాయిస్ (choice) మీదే! ఎవరూ దాన్ని శాసించరు. మీలో ప్రతి ఒక్కరికీ అపరిమితమైన శక్తి వుందని మీ స్వప్నాల ద్వారా ప్రతిరోజూ తెలియజెయ్యబడుతూనే వుంటుంది. మీలోనే అపరిమితమైన శక్తి వున్నప్పటికీ, మీ అంతర్ ప్రపంచమే మీకు అసలైన గురువు అయినప్పటికీ, ఈ విశ్వంలో గల అన్ని లోకాలలోనూ మిమ్మల్ని అన్ని వేళలా జాగృత పరుస్తూ మిమ్మల్ని జీవిత లక్ష్యం మరి పరమార్థం వైపు మళ్ళించడానికి ఆధ్యాత్మిక గురువులు మీకు బోధిస్తుంటారు. మీ భౌతిక ప్రపంచం యొక్క సిస్టంకు (system) సంబంధించి అంతిమ జ్ఞానాన్ని (ultimate knowledge) అందజెయ్యగల ఆధ్యాత్మిక గురువులను కూడా ఈ విశ్వం మీకు సమకూరుస్తోంది. మీ పరిమిత జ్ఞానం వల్ల, మూఢ విశ్వాసాల వల్ల , మత ఛాందస కోరలలో చిక్కుకుపోవడం వల్ల అత్యున్నతమైన జ్ఞానాన్ని అందించే ఆధ్యాత్మిక గురువులను మీరు అందుకోలేక పోతున్నారు.

భూమి మీద మానవజాతి అంతా ఒక చెట్టు యొక్క వేర్లు (roots) వంటివారు. అన్ని వేర్లు ఒక చెట్టువే. ఈ వేర్లు భూమిలోని సారాన్ని సంగ్రహించి చెట్టుకంతా వ్యాపింపజేసినట్లు మానవజాతి ఈ భూమి మీదే వుంటూ తమ అంతర్ ప్రయాణాల ద్వారా ఇతర డైమన్షన్స్‌లోని సారాన్ని... అంటే జ్ఞానాన్ని సంగ్రహించడంలో మిగతా అన్ని జీవజాతుల కంటే ఎంతో ముందడుగులో వుంది. భూమిని ఒక చెట్టుతో పోల్చితే మానవజాతిని వేర్లుగాను, ఇతర జీవజాతులను చెట్టులోని ఇతర భాగాలుగాను పోల్చవచ్చు. చెట్టులోని ఏ భాగానికి హాని జరిగినా చెట్టు మొత్తమూ దాన్ని భరించాల్సి వుంటుంది. చెట్టులోని ఒక వేరును నరికి వేయడం వల్ల చెట్టుకు ఎంతో నష్టం వాటిల్లుతుంది. అదే మాదిరిగా మానవజాతిలో ఏ ఒక్కరిని చంపినా మానవ చైతన్య వికాసానికి నష్టం వాటిల్లుతుంది. జీవ చైతన్య పరిణామంలో అగ్రభాగాన వున్న మానవునికి ఈ భూమి మీద ఏ జీవాత్మనూ చంపే అధికారం లేదు. ఏ జీవాత్మను చంపినా భూ ప్రపంచ చైతన్యశక్తి గరిష్టస్థాయిని అందుకోలేదు. భూ ప్రపంచ చైతన్యశక్తి గరిష్ట స్థాయిని అధిగమించిన తర్వాతనే అతడు ఇక్కడ జన్మరాహిత్యం పొంది ఉన్నత లోకాలకు ప్రయాణించి అక్కడ జన్మపరంపరలు కొనసాగించ గలడు. **మీ అంతర్ ప్రపంచాన్ని దేవుని దుర్గంగా వర్ణిస్తే, జీవహింసకు పాల్పడే వాడు దేవుని దుర్గంలోనికి ప్రవేశించ లేడు.** మీరు ఒక జీవాత్మను చంపినపుడు మీ చైతన్య వికాసంపై దెబ్బ కొట్టినట్లే. మత విద్వేషాలు, యుద్ధాల పేరిట మానవజాతి ఒకరినొకరిని చంపుకుంటున్నది. అంటే చెట్టు వేర్లు తెగిపోతున్నాయి. దీని వల్ల భూ ప్రపంచపు చైతన్య వికాసానికి హాని జరుగుతూంది.

ఆధ్యాత్మిక ఎదుగుదల, మనోశక్తి విస్తరణ, చైతన్య పరిణామం త్రీ డైమన్షనల్ భూ ప్రపంచంలో గల గరిష్టశక్తి స్థాయిలో సంపూర్తిగా పొంది జన్మ పరంపరలను పరిసమాప్తి చేసుకోవాలంటే – విస్తారమైన జీవకారుణ్యమూ, సకల ప్రాణి కోటి పట్ల అనురక్తి, సాటి మానవజాతి పట్ల సహకారం . సఖ్యత, ఈ భూమి మీద జీవితం పట్ల సంపూర్ణమైన ప్రేమ . గౌరవం మీకు వుండి తీరాలి. మానవజాతి పట్ల విద్వేషం, జీవజాతుల పట్ల విద్వేషం, జీవితం పట్ల విరక్తి, తానే దైవం అని విశ్వసించక పోవడం – మీ ఆధ్యాత్మిక ఎదుగుదలను ఆటంక పరుస్తుంటాయి.

ఈ భూమిని, ఈ మానవజాతిని, ఇక్కడ వున్న సమస్త జీవజాతులను మీరు అనురాగంతో ప్రేమించి తీరాలి. వాటితో సఖ్యంగా వుంటూ సహజీవనం చెయ్యడం

మీరు అలవర్చుకోవాలి. ద్వేషం ద్వారా, జీవితాసక్తిని కోల్పోవడం ద్వారా, జీవిత మాధుర్యాన్ని ఆస్వాదించ లేరు; ఆనందంతో జీవించలేరు.

అంతర్ ప్రయాణం, ధ్యానం, సర్వజీవాత్మల చైతన్య పరిణామం పట్ల వివేకంతో కూడిన నిశిత పరిశీలనల ద్వారా తప్ప మరే విధంగానూ మీకు ప్రజ్ఞ సంప్రాప్తించదు. బాహ్య ప్రపంచ పరిశోధనల వల్ల మీకు ప్రజ్ఞ రాదు. ప్రజ్ఞను సాధించుకోవాలి. మీరు ఇంకొకరికి ప్రజ్ఞను ప్రసాదించలేరు. ఎవరి లక్ష్యాలు వారికుంటాయి. ఎవరి జీవితపరమార్థం వారికుంటుంది. ఎవరి దారి వారిదే. ఈ భూమి మీద ప్రవేశించిన మానవులందరూ అతి గొప్ప వాళ్ళే. అతి విశిష్టమైన వాళ్ళే. అనంత బ్రహ్మాండ మూలచైతన్యం అందరి అంతర్ ప్రపంచాల్లోనూ ప్రకాశిస్తూంది.

జంతుజాతులతో టెలీపతి (telepathy) ద్వారా సంభాషించడం ప్రాక్టీసు చెయ్యండి. అదేమంత కష్టమైన విషయమేమీకాదు. తక్కువ సమయంలోనే సునాయాసంగా టెలీపతిని మీరు నేర్చుకోవచ్చు. కుక్క, పిల్లి, ఆవు ఇంకా కొన్ని రకాల పెంపుడు జంతువులు మీ మైండ్ నుండి వెలువడే ఆలోచనా తరంగాలను పసిగట్టగలుగుతున్నాయి. పసిపిల్లలు మరి పెంపుడు జంతువులు టెలీపతి ద్వారా పరస్పరం సంభాషించుకోవడం చేస్తున్నారు. టెలీపతి అనేది మీ సహజ సామర్థ్యం (Natural ability)! దాంట్లో నైపుణ్యం సాధించడానికి ప్రారంభంలో కొంత అభ్యాసం అవసరమవుతుంది. మీరు టెలీపతిని అభివృద్ధి చేసుకున్నట్లయితే జంతుజాతులు మరి మీరు పరస్పరం సంభాషించుకుని ఎన్నో విధాలుగా జ్ఞానాన్ని పంచుకునే వీలు ఏర్పడుతుంది.

మానవజాతి వికృత చేష్టలను సహనంతో భరిస్తూ కూడ జంతుజాతులు మీ పట్ల అనురాగం, ప్రేమను పంచుతున్నాయి. వాటికి మీపట్ల ఎటువంటి ద్వేషమూ పెంచుకోలేదు. మానవజాతి తన సహజ ప్రవృత్తిలోనికి మారవలసి వుంది. జంతుజాతులు మరి మానవజాతుల మధ్య పరస్పర సహకారం మరి సఖ్యతతో జీవశక్తి చైతన్య పరిణామం ఎంతో ముందడగు వేయవలసి వుంది. దీనివల్ల భూమి మీద జీవజాతులన్నీ లబ్ధిపొందుతాయి.

వాతావరణ ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులను మీ దేహం పసిగట్టగలుగుతుంది. ఇది మీ మైండ్ ద్వారా జరుగుతుంది. అలాగే ఇతర మానవుల ఆలోచనాతరంగాలను, జంతువులు, వృక్షాలు మరి ఇతర వస్తువుల ఫీలింగ్స్‌ను కూడ మీ మైండ్ పసిగట్ట

గలదు. ఒక్క ఆలోచనా తరంగాలనే కాకుండా ఆత్మశక్తి నుండి వెలువడే స్పందనలను కూడ మీ మైండ్ పసిగట్టగలదు. మీ ఇంట్లో కుర్చీ, లేదా టేబిల్ కూడ మీ ఆత్మశక్తి నుండి వెలువడే స్పందనలను పసిగట్ట గలవు. మైండ్ అనేది ఆత్మలో ఇమిడిన శక్తి అని మీకిదివరకే చెప్పడం జరిగింది.

చైతన్యశక్తి ధర్మాలు ఒక్కొక్క లోకానికి ఒక రీతిలో క్రోడీకరించి వుంటాయి. ఉదాహరణకు భూమి మీదగల చైతన్యశక్తి ధర్మాలు మరోలోకానికి వర్తించవు. కోట్ల సంవత్సరాల నుండి భూమి మీద జరిగిన అన్ని సంఘటనలను చైతన్యశక్తి క్రోడీకరించి ఆకాశ రికార్డుల రూపంలో భద్రపరిచింది. ఒక మిలియన్ సంవత్సరాల క్రితం ఏమి జరిగిందీ మీ అంతర్ ప్రయాణం ద్వారా ఆకాశ రికార్టులను పరిశీలించి తెలుసుకోవచ్చు. కాలానికి మీరిచ్చే నిర్వచనాలన్నీ ఒక భ్రమ మాత్రమే.

చైతన్యశక్తి యొక్క ఒక రేంజి (range of consciousness)లో మాత్రమే ఆ లోకం + దానిపై జీవరాసులు దేహాలను ధరించడం జరుగుతుంది. అణువుల నిర్మాణం, కాంతి యొక్క విలువలు (light values) ఆ చైతన్యశక్తి రేంజికి తగినట్లుగా వుంటాయి. ఈ విశ్వంలో కోటానుకోట్ల సౌరవ్యవస్థలున్నాయి. ఒక సౌరవ్యవస్థకు సంబంధించిన కొన్ని లక్షల వర్ణ వ్యవస్థలు (spectra)మీ అంతరేంద్రియాలకు దర్శనమిస్తుంటాయి. భూమి మీద ఒక సౌరవర్ణ వ్యవస్థ (system of solar spectrum)ను మాత్రమే మీ శాస్త్రవేత్తలు కనుగొనగలిగారు. మీ శాస్త్రవేత్తలకు అంతుచిక్కని ఎన్నో సౌరవర్ణ వ్యవస్థలు భూమి మీద వున్నాయి. వాటిని పసిగట్టే స్థితికి మీ ఫిజిక్స్ (physics) ఇంకా అభివృద్ధి చెందలేదు. ఒక సౌరవర్ణ వ్యవస్థలో గల విద్యుదయస్కాంత తరంగాలు ఒక రేంజిని (range) కలిగి వుంటాయి. మీ చర్మచక్షువులకు గోచరమయ్యే మానవులు + ఇతర జీవజాతుల దేహాలు ఒక రేంజికి పరిమితమైన విద్యుదయస్కాంత తరంగాల వలయంలో వుంటున్నాయి. మిగతా రేంజిలలో గల విద్యుదయస్కాంత తరంగాల వలయాలలో గల జీవజాతుల దేహాలను మీ చర్మచక్షువులుగాని, మీ శాస్త్ర పరికరాలు గాని పసిగట్టలేవు.

భూమి మీద ఎన్నో సౌరవర్ణ వ్యవస్థలు వున్నాయి. ఒక్కొక్క సౌరవర్ణ వ్యవస్థలో ఒక రేంజికి సంబంధించిన విద్యుదయస్కాంత తరంగాల వలయాలు వుంటున్నాయి. మీ ఫిజిక్స్ ఇంత వరకూ ఒకే ఒక సౌరవర్ణపటాన్ని (solar spectrum) కనుగొనగలిగింది. దీన్నిబట్టి మీ ఫిజిక్స్ లేదా ఇతర సైన్సులు ఎంత పరిమితులలో వుందో తెలుస్తుంది గదా. ఒక్క భూమి మీద ఎన్నో సౌరవర్ణ వ్యవస్థలు వున్నపుడు ఒక

గెలాక్సీలో గల సౌరవర్ణ వ్యవస్థలు మానవ ఇంటెలిజెన్స్‌కు అందేది కాదు. ఒక రేంజి వరకు విస్తరించిన ఒక సౌరవర్ణ వ్యవస్థలో గల చైతన్యశక్తి క్రోడీకరించిన భాషలో (coded language) ఇమిడి వుంటుంది. మీ అంతర్ ప్రయాణం ద్వారా ఇతర రేంజిలకు విస్తరించిన సౌర వర్ణ వ్యవస్థలలోనికి ప్రవేశించి అక్కడ గల జ్ఞానాన్ని సంగ్రహించవచ్చు. ఇతర ఉన్నత సౌరవర్ణ వ్యవస్థలలోనికి (higher systems of solar spectra) మీరు ప్రయాణించ గలిగినపుడే, ఆ స్థాయికి మీ చైతన్యశక్తి పరిణితి చెందినపుడే మానవజాతికి గల అమేయమైన అపరిమితమైన శక్తి మీకు తెలుస్తుంది. అంటే మీ మనోవికాసం ఉన్నత ఫ్రీక్వెన్సీలకు (higher frequencies) ఎదిగి వుండాలి. అపుడే మీరు భూమి మీద గల ఇతర జీవజాతుల విశిష్టతను కూడ గుర్తించగలుగుతారు.

ఇతర సౌరవర్ణ వ్యవస్థలలోనికి అంతర్ ప్రయాణం ద్వారా ప్రవేశించగల సర్వశక్తియుక్తులూ, సర్వదక్షతలూ భూమి మీదగల ప్రతి మనిషికీ వున్నాయి. మీ మానవజాతి జీవశక్తి పరిణామం గాని, ఆధ్యాత్మిక పరిణామం గాని బాహ్య ప్రపంచంలోని ఏ శక్తి మీద ఆధారపడి లేదు. అవి మనిషి యొక్క అంతర్‌ప్రపంచం మీద మాత్రమే ఆధారపడి వున్నాయి. మీ చైతన్యశక్తి మాంసపిండ రూపంలో మీ దేహంలో ఇమిడివుంది. బాహ్య ప్రపంచ పరిశోధన ద్వారా, వస్తు విశ్లేషణ ద్వారా, తర్కం ద్వారా, మానవజాతి ఆధ్యాత్మిక పురోగతిని పొందే ప్రశ్నే లేదు.

భౌతిక వాస్తవం ద్వారా చైతన్య పరిణామాన్ని ఒక నిర్దిష్ట దిశలో, ఒక ప్రత్యేకమైన ఆశయంతో తెలుసుకుని విస్తరించుకోవడం కోసం మానవజాతి + ఇతర జీవజాతులు ఇక్కడ దేహాలను తీసుకోవడం జరిగింది. మీ చైతన్యశక్తిని విస్తరింపజెయ్యడం ద్వారా మీ సౌర వర్ణవ్యవస్థ రేంజిని పెంచవచ్చు. ఉదాహరణకు మీ సౌరవర్ణవ్యవస్థలోని విద్యుదయస్కాంత తరంగాల రేంజి 10 నుండి 1000 వరకు (10 to 1000)అనుకోండి. మీ చైతన్యశక్తి విస్తరణ ద్వారా దాని రేంజిని 10 నుండి 7000 వరకు (10 to 7000) విస్తరింపజెయ్యవచ్చు. అపుడు 1000 నుండి 7000 విస్తరణలో గల జ్ఞానం మానవజాతి + ఇతర జీవజాతులకు అందుబాటులోనికి వస్తుంది. అంటే ఇతర రేంజిలలో గల సౌర వర్ణ వ్యవస్థల జ్ఞానం మీ రేంజి పెరగడం ద్వారా మీకు లభ్యమవుతుంది. ఈ రేంజిని ఎంత వరకైనా పెంచవచ్చు. ఉన్నత జ్ఞానం (higher knowledge)మీకు అందుబాటులోనికి రావడం ద్వారా మీ రేంజిలో గల మానవజాతి + ఇతర జీవజాతుల బుద్ధి + మనోవికాసం + జీవిత విలువలు పెరుగుతాయి. ఒక బుద్ధుడు, ఒక జీసస్... ఇంకా ఎంతో మంది బుద్ధుళ్ళు చేసిన పని అదే! వాళ్ళు ఇతర

రేంజిలలో గల సౌరవర్ణ వ్యవస్థలలోగల జ్ఞానాన్ని తెలుసుకోగలిగారు. ఒక గెలాక్సీలోగల కోట్ల సౌర వర్ణవ్యవస్థలలో గల జ్ఞానాన్ని బుద్ధుడు, జీసస్... ఎందరో తెలుసుకోగలిగారు. ఒక సౌర వర్ణ పటాన్ని మాత్రమే పట్టుకుని వ్రేలాడుతున్న మీ శాస్త్రవేత్తలు సాధించిన శాస్త్రీయ అభివృద్ధి (scientific development) ఎంత అల్పమైనదో చెప్పాల్సిన అవసరం లేదు.

మానవుడు ఉన్నత ఆధ్యాత్మిక లోకాలనుండి (higher spiritual worlds) ఊడిపడి భూమి మీద జన్మలు తీసుకోవడం లేదు. మీరు ప్రస్తుతం జన్మతీసుకున్న సౌరవర్ణవ్యవస్థకు సంబంధించిన జ్ఞానం కంటే అత్యున్నత జ్ఞానాన్ని కలిగిన సౌరవర్ణ వ్యవస్థలు కలిగిన లోకాల నుండి ప్రస్తుత లోకం లోనికి జన్మ తీసుకోవడం జరగదు. ఏ ఆత్మ కూడ ఉన్నత ఆధ్యాత్మిక జ్ఞానస్థాయి నుండి దానికంటే తక్కువ ఆధ్యాత్మిక జ్ఞాన స్థాయిగల స్థితికి దిగి వచ్చి జన్మలు తీసుకోవడం చెయ్యదు. ఇపుడున్న స్థితి నుండి ఉన్నత స్థితి చేరాలని ప్రయత్నం చెయ్యడం జరుగుతుంది. మీ అంతర్ ప్రపంచంలో ఇతర ఉన్నత సౌర వర్ణ వ్యవస్థలలోనికి ప్రవేశించడానికి కావలసిన మెకానిజమ్ (mechanism) ఇమిడి వుంది. ఆ మెకానిజమ్‌ని మీరు పదును పెట్టుకోవాలి. ఆ పనిని ఇంకొకరు మీకు చేసి పెట్టలేరు. ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి.

'నా తండ్రి రాజ్యంలో అనేక లోకాలున్నాయి.' అని జీసస్ చెప్పాడు. అంటే ఆయన ఇతర సౌరవర్ణ వ్యవస్థలలోని లోకాలను తన అంతర్ ప్రయాణం ద్వారా దర్శించ గలిగాడు. ఒక సౌర వర్ణ వ్యవస్థలో ఉన్న విద్యుదయస్కాంత తరంగాల రేంజిలోగల శక్తికి అనుగుణంగా అక్కడి జీవాత్మల దేహాలు వుంటాయి. మీ రేంజిలో మానవ దేహం ఒక మాదిరిగాను, మరో రేంజిలోగల మానవ దేహం మరో మాదిరిగాను వుంటాయి. మీ కంటే హైయర్ రేంజిలో (higher ranges) కూడ మానవజాతులు వున్నాయి. కాకపోతే వాళ్ళ దేహాలు, వాళ్ళ సైన్సు-టెక్నాలజీలు, వాళ్ళు ఎంచుకున్న చైతన్య పరిణామ దిశలు, వాళ్ళు ఎంచుకున్న కళలూ (arts), వాళ్ళు చెందే భౌతిక వాస్తవం (physical reality) మీ కంటే చాల విభిన్నంగా వుంటున్నాయి. ఒక సౌర వర్ణ వ్యవస్థ ఒక డైమన్షన్‌గా (dimension) వ్యవరించబడుతుంది. మీ కళలూ (Arts), శాస్త్రాలూ ఒక విధంగానూ, మరో డైమన్షన్‌లోని కళలూ, శాస్త్రాలూ మరో విధంగానూ వుంటాయి. **భూమి మీద ఐన్‌స్టీన్ (Einstein) అనే శాస్త్రవేత్త అంతర్ ప్రయాణం ద్వారా ఇతర సౌరవర్ణ వ్యవస్థలలో కొన్నింటిలోనికి ప్రవేశించగలిగాడు. ఆయన మామూలు శాస్త్రవేత్త కాదు, ఒక ఆధ్యాత్మిక శాస్త్రజ్ఞుడు!**

ఒక సౌర వర్ణ వ్యవస్థకు సంబంధించిన సిస్టంలోగల విద్యుదయస్కాంత శక్తికి అనుగుణంగా, ఆ సిస్టంకు సంబంధించిన మూలకాలతో జీవజాతుల దేహ నిర్మాణం జరుగుతుంది. భూమికి సంబంధించిన సిస్టంలో ఇమిడివున్న విద్యుదయస్కాంత శక్తి యొక్క రేంజిలోనే మానవజాతి + ఇతర జాతుల దేహాల నిర్మాణం జరుగుతుంది. మీ దేహాలు భూమి మీద సంక్రమించే ఎటువంటి వ్యాధులనైనా త్రిప్పికొట్టగలిగే జీవరసాయనిక శక్తిని కలిగి వుంటాయి. మీ దేహంలోని విద్యుదయస్కాంత శక్తి + జీవరసాయనిక శక్తిని పెంచడం ద్వారా మీ దేహ ఆరోగ్య వ్యవస్థను పటిష్టపరుచుకోవచ్చు. **హైయర్ శక్తి స్థాయిలు (higher energy levels) వున్నపుడు మీ దేహాన్ని ఏ వైరస్‌లూ (viruses) ఏ బాక్టీరియాలు (bacteria) ముట్టడించలేవు.**

మీరు బ్యాలెన్సుడుగా (balanced) సంపూర్ణ ఆరోగ్యాన్ని, సరియైన ఆలోచనలను కలిగి వున్నపుడు మీ పెంపుడు జంతువులు, మీ పెరట్లో మొక్కలు కూడ మీకు ప్రతిస్పందించి ఆనందిస్తాయి. అన్ని జీవజాతులూ మరి మొక్కలలాగే మీరు కూడ ప్రకృతిలో ఒక భాగం. ఆ విషయాన్ని మీరు విస్మరిస్తున్నారు. ప్రకృతితో వున్న అనుబంధాన్ని మీరు విస్మరిస్తున్నారు. ప్రకృతి వేరే, జీవజాతులు వేరేగా వుండవు. త్రీడైమన్షనల్ సిస్టంలో గల ఈ ప్రకృతిలో ఎటువంటి సవాలునైనా ఎదుర్కోగల సర్వశక్తియుక్తులు మీ దేహం మరి మీ మనోశక్తి (అంతర్ శక్తిలో) కలిగి వున్నాయి. ప్రకృతిలోని అన్ని శక్తులూ మీకు సహకరిస్తాయి. ప్రకృతిలో దుష్టశక్తులుంటాయని మరి దుష్టశక్తితో పోరాడి వాటిని ఓడించడం జరుగుతుంటుందని కల్పిత గాథలలో చదివి వుంటారు. దుష్టశక్తులు అనేవి మీ నెగెటివ్ ఆలోచనల సృష్టి వల్లనే జరుగుతుంటుంది. భూమి మీద మరి ఈ విశ్వంలో ఎక్కడా దుష్ట శక్తులుండవు. మీ మత గ్రంధాలలో దుష్టశక్తుల ప్రస్థావన వుంది. దుష్టశక్తులతో పోరాడి గెలిచిన హీరోల గురించి కూడ మీరు చదివి వుంటారు. ఆ దుష్టశక్తులన్నింటినీ మీ ఆలోచనల నుండి సృష్టించుకుంటున్నవేనని మీరు గుర్తించాలి. మీరు ఏవి నమ్మితే అవే మీకు ఎదురవుతాయి.

ఒలింపిక్స్ గేమ్స్‌లలో (Olympic games) క్రీడాకారులు చాల అద్భుతమైన క్రీడావిన్యాసాలు ప్రదర్శిస్తున్న సంగతి మీకు తెలుసు. వాటిని అద్భుతాలుగా, ప్రపంచ రికార్డులుగా (world records) మీరు గుర్తించడం జరుగుతూంది. అటువంటి అద్భుత విన్యాసాలు చేసే శక్తి మరి మెకానిజమ్ భూమి మీద ప్రతి మానవ దేహంలోనూ ఇమిడి వుంది. భూమి మీద ప్రతి మానవుడి దేహమూ అపరిమితమైన శక్తిని కలిగి

వుంది. మీరు కూడ సంకల్పశక్తిని కేంద్రీకరింపజేసి ఒలింపిక్ క్రీడాకారుల కంటే కూడ గొప్ప విన్యాసాలు చెయ్యవచ్చు,

భూమి మీద ఆధ్యాత్మిక ఛాలెంజెస్‌ను (spiritual challenges) ఎదుర్కోవడానికి ధీటుగా మీరు భౌతిక దేహాన్ని ఎంచుకోవడం జరుగుతుంది. ఎటువంటి వ్యాధినైనా సంక్రమింపజేసుకునే శక్తి దేహానికి వుంటుంది. అదే వ్యాధిని హీలింగ్ చేసుకునే సామర్థ్యం కూడ మీ దేహంలోనే వుంటుంది. జీసస్ ఎంతో మందికి వ్యాధులను హీలింగ్ చెయ్యడం జరిగిందని మీరు చదివి వుంటారు. వాస్తవానికి జీసస్‌వల్ల ఎవ్వరికీ హీలింగ్ జరగలేదు. హీలింగ్ జరుగుతూందని వాళ్ళు విశ్వసించడం వల్ల వాళ్ళ దేహాలలోని అపరిమితమైన శక్తి ఉత్తేజితమవడం ద్వారా హీలింగ్ జరిగింది. భూమి మీద ఎంతో మంది క్యాన్సరు (cancer) ఇంకా ఇతర ప్రాణాంతక వ్యాధులను కలిగివున్న వాళ్ళు సడెన్‌గా (suddenly) వ్యాధులను నయం చేసుకోవడం మీరు చూస్తున్నారు గదా! మీ డాక్టర్లకు ఇలాంటివి తరచూ ఎదురవుతూ వుంటాయి. మీ డాక్టర్లు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యేరీతిలో రోగులు వ్యాధులను నయం చేసుకోవడం జరుగుతూంది. చైతన్యశక్తి మీ దేహమంతా విస్తరించి వుంటుంది. బాహ్య ప్రపంచం నుండి ఇవ్వబడే ఎటువంటి హీలింగూ మీ దేహానికి సంక్రమించిన వ్యాధులను నయం చెయ్యడం జరగదు. బాహ్య ప్రేరణవల్ల హీలింగ్ జరిగిపోతుందని మీరు విశ్వసించడం వల్ల మీ దేహంలోని అపరిమిత శక్తి క్రియారూపం ధరించి వ్యాధులను నయం చేస్తుంది. మీ సంకల్పం విశ్వశక్తిలో భాగమని గుర్తించండి. భూమి మీద మానవజాతి తమ వాస్తవాన్ని తామే సృష్టించుకుంటూంది. కొన్ని వేల మంది లేదా అంతకంటే ఎక్కువ మంది ఆత్మహత్యా సదృశమైన ఆలోచనలను ఉత్పన్నం చెయ్యడం వల్ల ఒక హిట్లర్‌లాంటి వాడినీ, ఒక భూకంపాన్ని, ఒక తుఫానునూ, ఒక సునామీనీ, కొన్ని వేల మందిని హరించివేసే ఒక వ్యాధినీ, ఇంకా ఇతర ప్రకృతి భీభత్సాలను సృష్టించుకుంటున్నారు. అంతేకాని, దేవుడు పాపులను, దుర్మార్గులను శిక్షించడానికి ప్రకృతి భీభత్సాలను ప్రాణాంతక వ్యాధులను భూమి మీద పంపడమో, లేదా దుష్టశక్తులు భూమి మీద, మానవజాతి మీద దాడి చెయ్యడమో జరగవు. అన్ని జీవజాతులను వదిలిపెట్టేసి ఒక్క మానవజాతి మీదే దుష్టశక్తులు దాడి చేయడం జరగదు.

ఈ విశ్వంలో ప్రతి లోకానికీ ఒక రక్షణ వ్యవస్థవుంటుంది. చైతన్యశక్తి రక్షణ వ్యవస్థగా పనిచేస్తుంటుంది. ఒక ప్రత్యేక రేంజిలో వున్న చైతన్యశక్తి ఆ లోకంలో వుంటుంది. లోకంలోని అన్ని జీవజాతుల చైతన్య వికాసంవల్ల ఆ రేంజి పెరుగుతుంటుంది. ఏ లోకంలోనూ మంచి చెడులనేవి ప్రత్యేకంగా వుండవు. మంచి

చెడులనేవి మీ మనస్సులోనే వున్నాయి. మీ అంతర్ శక్తిని మంచివైపు మరి చెడువైపు మళ్ళించుకునే స్వేచ్ఛ మీ చేతుల్లోనే వుంది. **ప్రతి లోకమూ ఒక సత్య తలమే. ఒక సత్య తలంలో ఒక నిర్ధిష్ట పరిధిలో జ్ఞానాన్ని సముపార్జించి మరో సత్య తలంలోనికి ఆత్మ ప్రయాణించి అక్కడా జన్మ పరంపరలు కొనసాగిస్తూ ఒక నిర్ధిష్ట పరిధిలో జ్ఞానాన్ని సంపాదించుకోవడం జరుగుతుంది. ఆత్మ యొక్క ప్రయాణం అనంతంగా వున్న సత్య తలాల గుండా సాగిపోతూనే వుంటుంది.**

* * *

అనారోగ్యం,కష్టాలు, దుఃఖం అనేవి మీ ఆలోచనల నుండి సృష్టింపబడి మీ జీవితానుభవాలుగా రూపొందుతున్నాయి. బాహ్యప్రపంచం నుండి అవి సృష్టింపబడవు. దేవుడు లేదా మూలచైతన్యం మిమ్మల్ని శిక్షించడం కోసం వాటిని మీపై రుద్దడం లేదు. ఆధ్యాత్మిక జ్ఞానం అనేది మీకు జీవిత శాస్త్రాన్ని నేర్పుతుంది. అనారోగ్యం, దుఃఖం, కష్టాలను ఆధ్యాత్మిక జ్ఞానం లోపించడం వల్ల మీ జీవితంలోనికి ఆహ్వానించడం జరుగుతుంది. చైతన్యశక్తిని ప్రాక్టికల్‌గా ఎలా వినియోగించుకోవాలో మీకు తెలియకపోవడం వల్ల జీవితాన్ని ఆనందమయంగా, సృజనాత్మకంగా మలుచుకోలేక పోతున్నారు. అనారోగ్యం, కష్టాలు, దుఃఖాలనుండి ఎన్నో ఆధ్యాత్మిక సందేశాలను పొందవచ్చు. అవి ఎంతో జ్ఞానాన్ని మోసు కొస్తుంటాయి నిర్మాణాత్మక దృక్పథంతో వాటిని పరిష్కరించుకోవడం సాధన చేయండి. వాటిని మీ ఆలోచనల ద్వారా సృష్టించుకోగలుగు తున్నారు కనుక వాటిని పరిష్కరించుకునే శక్తియుక్తులు కూడ మీలోనే ఇమిడి వున్నాయి.

నిరంతరమూ బాధామయ జీవితంతో, అనారోగ్యంతో జీవిత ప్రయాణాన్ని కొనసాగించడం ఆత్మకు ఎంత మాత్రమూ మంచిది కాదు. 'ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు'! అనే సత్యం తెలుసుకుని వాటిని తొలగించుకోవడానికి మీ అంతర్ శక్తిని వుపయోగించండి. సర్వశక్తి సామర్థ్యాలూ మీలోనే వున్నాయని సదా గుర్తుంచుకోండి. అనారోగ్యం, కష్టాలు, దుఃఖాలతో జీవితమంతా దైన్యంతో, నైరాశ్యంతో, దిక్కుతోచని స్థితితో క్రుంగిపోవడం ఆధ్యాత్మికత అన్పించుకోదు. అన్నింటినీ సాహసంతో ఎదుర్కొని పరిష్కరించుకోండి. ఏ క్షణంలోనైనా మీ జీవితాన్ని మలుపు త్రిప్పవచ్చు. ఈ వర్తమానం నుండే క్రొత్త జీవితాన్ని ప్రారంభించవచ్చు. వర్తమానంలో మీరు తీసుకునే సరియైన నిర్ణయాలు మీ జీవితాన్ని ఎప్పటికప్పుడు మార్చివేస్తాయి. **ఏ విశ్వశక్తి లేదా మూలచైతన్యం**

ఈ ప్రపంచాలన్నింటినీ సృష్టిస్తూందో, ఆ విశ్వశక్తి మీ అంతర్ ప్రపంచంలో ఇమిడి వుంది. విశ్వశక్తి యొక్క అనంత ధర్మాలూ, అనంత గుణాలూ మీ అంతర్ ప్రపంచంలో ఇమిడివున్నాయి. మీ జీవితంలో ఎదురయ్యే అన్ని సవాళ్ళకూ మీ అంతర్ ప్రపంచం నుండి సమాధానాలు లభిస్తాయి.

బాహ్య ప్రపంచం నుండి, ఆధ్యాత్మిక గురువుల నుండి, ఆధ్యాత్మిక పుస్తకాల నుండి మీరు పొందే గైడెన్స్ కంటే మీ అంతర్ ప్రపంచం నుండి పొందే గైడెన్స్ అపరిమితమైనది. మరి నిజమైన ఆధ్యాత్మిక గురువులు–

1. అనంతమైన శక్తి సంపదలూ, సర్వకార్యదక్షతలూ, అనంతమైన జ్ఞానం మీలోనే వున్నాయని మీకు బోధిస్తారు.
2. 'మీ సహజ స్థితుల్లో మీ సహజ ప్రవృత్తిలో కొనసాగే స్వేచ్ఛనిస్తూ, మీ వాస్తవాలను మీరే సృష్టించుకుంటున్నారు' అనే ఎరుకను కలిగి వుండమని బోధిస్తారు.
3. ప్రజ్ఞను (wisdom) మరొకరు ఎవ్వరూ మీకు అనుగ్రహించలేరని మరి మీరూ ఇతరులకు అనుగ్రహించలేరనే సత్యాన్ని బోధిస్తారు.
4. సర్వమానవజాతి అభ్యసించవలసిన మరి అధ్యయనం చేయవలసిన శాస్త్రం 'ఆధ్యాత్మిక శాస్త్రం' మాత్రమేనని బోధిస్తారు.

మత గ్రంథాలను ఉదహరిస్తూ (quote) చేసే ప్రసంగాలు చేస్తూ 'కాలాపహరణం' చేసే వాడెవడూ ఆధ్యాత్మిక గురువుకానేరడు. అంతర్ ప్రయాణం గాకుండా మరే పద్ధతిలోనూ మీకు 'ప్రజ్ఞ' (wisdom) సంప్రాప్తించదు. అంతర్ ప్రపంచాన్ని పరిశోధన చెయ్యకుండా మీరు 'ఆత్మ' గురించి తెలుసుకోలేరు. మత బోధకుల ప్రవచనాలంతా మీ 'అహం'ను సంతృప్తి పరచడానికి పరిమితమవుతున్నాయిగాని 'ఆధ్యాత్మికతను' సూటిగా మీకు చేరవేయడం లేదు. వారి బోధనలు 'గానుగెద్దు ప్రవృత్తి'లో వుంటూ మిమ్మల్ని ఎంత మాత్రమూ ఎదగనీయకుండా చేస్తున్నాయి; మానసికంగా మరి ఆధ్యాత్మికంగా మిమ్మల్ని ఎదగనీయకుండా చేస్తున్నాయి. 'నిన్ను నీవు తెలుసుకో! నీ లోనే దైవముంది! అని బోధించేవాడే నిజమైన ఆధ్యాత్మిక గురువు!

మల్టి డైమన్షనల్ ఆత్మ
(Multi Dimensional Soul)

ఆత్మ గురించి ఇది వరకు మీరు గ్రహించిన విషయాలు చాలా స్వల్పం. అది నదీ ప్రవాహం వలె నిరంతరమూ ప్రవహిస్తూ వుంటుంది; నిరంతరం చైతన్య పరిణామ వ్యాకోచం చెందుతుంటుంది. **ఆత్మ, దాని అనంతమైన శక్తి అంతర్ ప్రపంచానికి (inner world) సంబంధించినవి.** వ్యక్తిత్వం, బాహ్యేంద్రియాలు, అంతర్ ప్రపంచం, దేహం– ఇవన్నీ వేరు వేరుగా చెప్పడం జరుగుతున్నప్పటికీ అవన్నీ ఆత్మశక్తి అంతర్భాగాలే ! ఆత్మకు పరిధులు (limitations) నిర్వచించలేము. మీ సైకాలజిస్టులు (psychologists) 'అహం' (ego),చేతనా మనోశక్తి (conscious mind), అంతర్ చేతనా మనోశక్తి (sub conscious mind) అని ఆత్మకు (soul) అనేక నిర్వచనాలు ఇస్తున్నారు. ఆత్మకు గల అనంతమైన విస్తరణ వారి ఆలోచనా పరిధికి అందుబాటులో లేదు. ఆత్మశక్తి గురించి మీకు తెలిసిన తర్వాత, భౌతిక వాస్తవం (physical reality), ఆలోచనాశక్తి (thought power), చైతన్య పరిణామం గురించి చాల చక్కగా అర్థం కాగలదు

చైతన్యశక్తి (consciousness) రూపాంతరం చెంది కోటానుకోట్ల లోకాలుగా వెలిశాయి. మీ భూమి వాటిల్లో ఒకానొక తలం (plane). మీ పదజాలంతో దాన్ని మూడుతలాలు గల ప్రపంచంగా (three dimensional world) చెప్పబడుతుంది. చైతన్యశక్తి (consciousness) శక్తిస్థాయి (energy level) మరి ఫ్రీక్వెన్సీల (frequency) ఆధారంగా భౌతిక పదార్థ స్వభావం (nature) వుంటుంది. ఫ్రీక్వెన్సీ స్థాయి (frequency level) ఎక్కువగా వున్నపుడు పదార్థ స్వరూపం ఒక విధంగా, ఫ్రీక్వెన్సీ స్థాయి తక్కువగా వున్నపుడు పదార్థ స్వరూపం మరో విధంగా వుంటుంది. ఉదాహరణకు మీ ఇంట్లో సీలింగ్ ఫ్యాను (ceiling fan) నిశ్చల స్థితి (at rest)లో వున్నపుడు మీ కంటికి మూడు రెక్కలు (three wings) కన్పిస్తాయి. ఫ్యాను వేగాన్ని (speed) రెగ్యులేటర్ ద్వారా ఒకటి., రెండు, మూడు, నాలుగు, అయిదు అలా వరుసగా పెంచినపుడు ఫ్యానులో రెక్కలు లెక్కించడం కష్టమవుతుంది. అత్యంత వేగంలో వున్నపుడు రెక్కలు (wings) కన్పించకుండా

పోతాయి. ఫ్యానుకు కలుగజేసిన శక్తి (energy) పెరిగే కొద్దీ దాని వేగం, ఫ్రీక్వెన్సీ (frequency) పెరుగుతాయి. అలాగే ఎక్కువ శక్తి స్థాయి (energy level) వున్న లోకాలు మీ కంటికి కన్పించవు. ఎక్కువ శక్తి స్థాయి తలంనుండి (high energy plane), తక్కువ శక్తి స్థాయి తలాన్ని చూడవచ్చు. ఈ విశ్వంలో లోకాలన్నీ (all worlds) వివిధ శక్తి స్థాయిలు కలిగి వుండి, వివిధ ఫ్రీక్వెన్సీలలో చైతన్య పరిణామం చెందుతున్నాయి. భూమి మీద నివసిస్తున్న జీవజాతులు (species), భూమితో సహా చైతన్య పరిణామం చెందుతున్నాయి. సృష్టిలో వున్న సకల ప్రాణికోటి మూలచైతన్యం (All That Is) నుండి వెలువడిన ఆత్మ శకలాలు ! ఆత్మ, దాని స్వభావం భౌతిక నియమాలకు, కాలానికి, దూరానికి సంబంధం లేకుండా వుంటుంది. భౌతిక నియమాలను (physical laws) ఆత్మశక్తికి, అంతర్ ప్రపంచానికి (inner worlds) వర్తింపజెయ్యలేము! బాహ్య కర్మలు, భౌతిక సంఘటనలు (physical events) అంతర్ ప్రపంచంలోని మనోశక్తి ద్వారా ఆవిర్భవిస్తున్నాయి. మీ కళ్ళకు కన్పించే ప్రతి భౌతిక సంఘటన, అంతర్ ప్రపంచంలో అంతర్ సంఘటన (inner event)గా ఏర్పడిన తర్వాత భౌతిక ప్రపంచంలో (అంటే బాహ్య ప్రపంచంలో) వాస్తవ రూపం పొందుతూంది.

భౌతిక దేహం, భౌతిక వాతావరణం (physical environment), భౌతిక సంఘటనలు (physical events), ఈ విశ్వంలోగల సృష్టి అంతా కూడ అంతర్ ప్రపంచం నుండి సృష్టింపబడుతున్నాయి. మీరు కేవలం ఒక దేహం (physical body) మాత్రమే కాదు. ఏక కాలంలో (simultaneously) మీరు అనేక రూపాలలో దేహాలను కలిగి వుండి, అనేక చోట్ల వుంటూ ఆత్మ చైతన్య పరిణామం చెందుతున్నారు. ఒకేసారి అనేకచోట్ల వున్నట్లు మీ బాహ్యేంద్రియాలకు గోచరం కాదు. మీ 'అహం' నకు మీరు ఒక దేహానికి మాత్రమే పరిమితమై వున్నట్లు అన్పిస్తుంది; మీ ఆత్మ ఒక దేహానికి మాత్రమే పరిమితమై వున్నట్లు అన్పిస్తుంది. మీ మనోశక్తి నుండి (అంతర్ ప్రపంచం నుండి) రూపాలను నిరంతరమూ సృష్టింపబడుతూనే వుంటాయి.

ఉదాహరణకు – సముద్రం ఒడ్డున ఒక అందమైన ప్రదేశాన్ని ఊహించుకోండి. అక్కడ మీరు సంచరిస్తున్నట్లు ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నట్లు ఉహించుకోండి. అక్కడ ఆనందంగా గడుపుతున్నట్లు ఊహించుకోండి. అనేక రకాల అనుభూతులను పొందుతున్నట్లు ఎమోషన్స్ (emotions), ఫీలింగ్స్ (feelings)తో సహా ఊహించుకోండి. అలా ఊహించుకోవడం వల్ల మీ అంతర్ ప్రపంచం నుండి విద్యుత్ అయస్కాంత తరంగాలు వెలువడి సముద్రపు ఒడ్డున ఒక భౌతిక రూపం ప్రత్యక్షమవుతుంది. దాని

రూపం మీ దేహం యొక్క ఛాయ (image)ను పోలివుంటుంది. మీ మనోశక్తి నుండి వెలువడిన ఆ భౌతికరూపం ఇతరులకు కన్పించదు. శాస్త్రపరికరాలు (scientific instruments) పసిగట్టలేవు. మీ మైండ్ నుండి వెలువడిన ఆలోచనా తరంగాలు (thought waves) వాటి శక్తి (energy), ఫ్రీక్వెన్సీలకు (frequency) అనుగుణంగా భౌతిక రూపం ఏర్పడింది. అది మిథ్యా భౌతిక రూపం (pseudo physical form) లేదా భౌతిక రూపం (physical form)గా రూపుదిద్దుకుంది. అంతర్ శక్తి నుండి వెలువడిన ఆలోచనా తరంగాలు భౌతిక రూపంగా రూపాంతరం చెందడం జరిగింది. నిరంతరమూ ఇలాంటి రూపాలు మీ అంతర్ ప్రపంచం నుండి సృష్టింపబడుతూనే వుంటాయి. ఈ ప్రక్రియ ప్రతిక్షణమూ సాగుతూనే వుంటుంది. మీ అంతర్ శక్తి నుండి వెలువడిన ఆలోచనా తరంగాల శక్తి (energy), సాంద్రత (density), తీవ్రత (intensity), ఫ్రీక్వెన్సీల (frequency) ఆధారంగా ఆ భౌతిక రూపాల సాంద్రత కూడ మారు తుంటుంది. వేర్వేరు శక్తి స్థాయిలు గల (energy levels) ఆలోచనా తరంగాల నుండి సృష్టించబడిన భౌతిక రూపాలు వేర్వేరు సాంద్రతలతో రూపాంతరం చెందుతుంటాయి. దేని ప్రత్యేకత దానికి వుంటూ మీరు ఆ భౌతిక రూపానికి (physical form) మీరు సృష్టికర్త (creator)గా తయారయ్యారు.

మీ మనోశక్తి (mind power) నుండి ఫలానా పరిస్థితులు కావాలని బలంగా, తీవ్రంగా ఊహించుకుంటారు. దాని ఫలితంగా మీ అంతర్ ప్రపంచం (inner world) నుండి వెలువడిన ఆలోచనా తరంగాలు శక్తి రూపాంతరం (energy transformation) పొంది బాహ్య ప్రపంచంలో మీరు కోరిన విధంగానే భౌతిక పరిస్థితులు (physical circumstances) సృష్టింపబడతాయి. మీ జీవితంలో ప్రవేశించే భౌతిక పరిస్థితులకు, భౌతిక సంఘటనలకు మీరే సృష్టికర్త (creator)! ఈ ఆత్మశక్తి నుండి మీ దేహం (physical body) సృష్టింపబడింది. మీ సంకల్పానికి అనుగుణంగా మీ దేహం అంతర్ ప్రపంచం నుండి, భౌతిక ప్రపంచంలోనికి వాస్తవరూపం పొందింది. భూమి మీద ప్రవేశించక ముందే తల్లిదండ్రులను, భౌతిక పరిస్థితులను, అనుకూల వాతావరణాన్ని, ప్రదేశాన్ని ఎంచుకుని వాటికనుగుణంగానే మీరు అనుభవాలను ఎదుర్కొంటున్నారు. వాటిని మీ అంతర్ ప్రపంచం నుండి ఇంతకు ముందే సృష్టించుకుంటున్నారు.

మీ మనోశక్తి నుండి వెలువడుతున్న ప్రతి ఆలోచన (thought) ఈ విశ్వంలో ఎక్కడో ఒక చోట భౌతిక వాస్తవాన్ని (physical reality) పొందుతుంటుంది. అది పొందే భౌతిక వాస్తవం – అది పొందే శక్తి తీవ్రత (intensity of energy)ను బట్టి

ఆధారపడి వుంటుంది. దాని భౌతిక వాస్తవికతను మీ కళ్ళు పసిగట్టవచ్చు లేదా పసిగట్టలేకపోవచ్చు.

మీరు మీ స్నేహితుడి గురించి తీవ్రంగా ఆలోచించి అతన్ని కలవాలని గట్టిగా సంకల్పించుకుంటే, వెంటనే మీ ప్రతిరూపం అతని దగ్గర ప్రత్యక్షమవుతుంది. అతని బాహ్యేంద్రియాలు మీ మిథ్యారూపాన్ని (pseudo form) పసిగట్టవు. కాని అతని అంతరేంద్రియాలు పసిగట్టగలవు. అతను మీ గురించి ఫీలవుతాడు (feel). మీరు అక్కడ వున్నట్లు అతను స్పందిస్తాడు (responds). ఇటువంటి అనుభవాలు మీరు ఏకాంతంగా వున్నపుడు ఎదురయి వుంటాయి. ఏకాంతంగా, ప్రశాంతంగా వున్నపుడు మీ బంధువులు, ఫ్రెండ్స్ తాలూకు మిథ్యా భౌతిక రూపాలు మీ దగ్గరకు వచ్చినపుడు నిజంగానే వాళ్ళు మీ దగ్గర వున్నట్లు ఫీలయి వుంటారు. మీ అంతర్ శక్తి నుండి అలా వెలువడిన భౌతిక రూపాలు చైతన్యశక్తి పరిణామం చెందడం ప్రారంభిస్తాయి. వర్షపు తుంపర్ల లాగ మీ మనోశక్తి నుండి భౌతిక రూపాలను సృష్టిస్తూనే వుంటారు. అవి మీ నుండి విడిపోయిన తర్వాత తమ స్వంతరీతిలో పరిణామం చెందడం ప్రారంభిస్తాయి. తర్వాత అవి మీ పైన ఏ మాత్రము ఆధారపడవు. చాల స్వతంత్రంగా, స్వేచ్ఛగా చైతన్య వికాసం చెందుతూ వుంటాయి. అవి మీ దయాదాక్షిణ్యాల పైన, మీ సూచనలు, సలహాల మీద ఆధారపడవు. మీరు కూడ అలాగే ఒకానొక పూర్ణాత్మ (higher self) అంతర్ శక్తి నుండి సృష్టింపబడిన వారే ! ఆ పూర్ణాత్మ నుండి ప్రతిక్షణమూ ఎన్నో ఆత్మశకలాలు సృష్టింపబడుతూ వుంటాయి. వాటిల్లో మీరు ఒకానొక ఆత్మశకలము మాత్రమే ! ఒకసారి పూర్ణాత్మ నుండి విడిపోయిన తర్వాత, ఇక ఏమాత్రం పూర్ణాత్మ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన అవసరం లేదు. పూర్ణాత్మ నుండి సృష్టింపబడిన మీరు ఎంతో స్వతంత్రంగా పరిణామం చెందుతున్నారు. పూర్ణాత్మ చెప్పుచేతల్లో మీరు ఉండరు. దాని పెంపుడు కుక్కలాగ మీరు మనుగడ సాగించడం లేదు. మీనుండి వెలువడుతున్న భౌతిక రూపాలన్నీ కూడ ఈ విశ్వంలో గల ఇతర తలాల్లో (other dimensions) కొనసాగుతున్నాయి. వాటి శక్తిస్థాయిలకు (energy level) అనుగుణంగా ఆ తలాలను (dimensions) ఎంచుకోవడం జరుగుతుంది. ఇక్కడ, తలం (plane or dimension) అంటే ఒక ప్రపంచం (world)అని అర్థం. మీ భూమి ఒక తలం ! అట్లాగే ఈ విశ్వంలో (universe) కోటానుకోట్ల తలాలు వున్నాయి! పూర్ణాత్మ, మరి దాని మనోశక్తి నుండి నిరంతరమూ సృష్టించబడుతూన్న ఆత్మశకలాలు (soul entities) అన్నింటినీ కలిపి 'నేను' అనబడుతుంది. పూర్ణాత్మ, మరి మీరు, మరి మీ నుండి సృష్టింపబడుతూన్న సృష్టి అంతా

కలిపితే ' నేను' అవుతుంది. మీరు ఈ దేహం ఒకటే కాదు. పూర్ణాత్మ నుండి మీరు, మీ నుండి మీ ఆలోచనలు + మీ ఆలోచనల సృష్టి అంతా కలిస్తే 'నేను' అవుతున్నారు. 'నేను'లో పూర్ణాత్మ + మీరు + మీ ఆలోచనల సృష్టి ఇమిడి వుంది. **నిన్ను నీవు తెలుసుకో (know thyself)!** అంటే దేహంతో కూడిన మిమ్మల్ని మాత్రమే కాకుండా పూర్ణాత్మ + మీరు + మీ ఆలోచనల సృష్టిని తెలుసుకోవడమన్న మాట ! పూర్ణాత్మ నిరంతరమూ పరిణామం చెందుతూ వుంటుంది. దాని నుండి అనుక్షణమూ సృష్టింపబడుతూన్న ఆత్మశకలాలు నిరంతరమూ పరిణామం చెందుతుంటాయి. పూర్ణాత్మ + దానిచే సృష్టికాబడిన ఆత్మశకలాలు సమిష్టిగా చైతన్య పరిణామాభివృద్ధి చెందుతున్నాయి. దీన్ని ఒక చక్కటి ఉదాహరణతో గమనించండి. సిటీ బ్యాంక్ (City Bank) అమెరికాలో న్యూయార్క్ (New York) నగరంలో వుందని ఊహించుకోండి. ప్రధాన కార్యాలయం (head office) న్యూయార్క్‌లోను, దాని శాఖలు (branches) ప్రపంచమంతటా అన్ని నగరాలలో వ్యాపించి వున్నాయి. ప్రతిశాఖ స్వతంత్రంగా (independently) అభివృద్ధి చెందుతుంటుంది. ఒక శాఖలో ఖాతాలు, బ్యాంక్ బ్యాలెన్సు (Bank Balance) ఎంతైనా పెంచుకోవడానికి అవకాశం వుంది. ఆ శాఖ అభివృద్ధిని (development) ఇతర శాఖలు కాని, ప్రధాన కార్యాలయం గాని ఆటంకపరచవు. ఆ శాఖ తన అభివృద్ధిని ఇష్టమైన రీతిలో స్వేచ్ఛగా సాధించవచ్చు. తన కార్యకలాపాలను స్వతంత్రంగా నిర్వర్తించుకోవచ్చు. దీని అభివృద్ధి ప్రధానకార్యాలయం మరి ఇతర శాఖల అభివృద్ధిగా మారుతుంది. భూమండలమంతా అన్ని నగరాలలో వున్న అన్ని శాఖలు ఇంటర్‌నెట్ ద్వారా కనెక్ట్ (connect) కాబడి వున్నాయి. ప్రధాన కార్యాలయంలో వెబ్ (web) వుంటుంది. ఒక శాఖలో సేకరించిన నగదును ప్రపంచంలో ఏ ఇతర శాఖలోనైన విత్ డ్రా (withdraw) చేసుకోవచ్చు. అన్ని శాఖలు ఒకదానికొకకటి అనుసంధానం చేయబడివున్నాయి. ప్రతిశాఖ అభివృద్ధిని ప్రధాన కార్యాలయం మరి ఇతర శాఖలు పంచుకుంటున్నాయి. ఒక శాఖ అభివృద్ధి కుంటుపడితే, ప్రధాన కార్యాలయం, ఇతర శాఖలు దాన్ని ఆదుకుంటాయి. ఒక శాఖలో జమ అయిన నగదు (cash) వివరాలు ప్రధానకార్యాలయం నుండి అన్ని శాఖలలోనూ తెలియబడతాయి! అన్ని శాఖలు ప్రధానకార్యాలయం నుండి సృష్టింపబడినాయి. ఒక శాఖ అభివృద్ధిని ప్రధాన కార్యాలయం నియంత్రించదు (control). ఇతర శాఖలు కూడ దాని అభివృద్ధిని నియంత్రించవు. ప్రధానకార్యాలయం మరి అన్ని శాఖల మధ్య పరస్పర సహకారం వుంటుంది. వాటి మధ్య నిరంతరాయంగా కమ్యూనికేషన్ (communication) వుంటుంది. ఒక దానికొకటి సహకరించుకుంటూ,

తోడ్పాటునందించుకుంటూ వ్యాకోచం (expansion) చెందుతూ వుంటాయి. ఈ ఉదాహరణలాగే, పూర్ణాత్మ (Over Soul or Higher Soul), దాని అంశాత్మలు (soul entities) ఉమ్మడిగా చైతన్య పరిణామం చెందుతున్నాయి. ప్రధాన కార్యాలయం పూర్ణాత్మ అయితే దాని అన్ని శాఖలు అంశాత్మలుగా పరిగణించుకోండి. అంశాత్మలకు, పూర్ణాత్మకు మధ్య చైతన్యశక్తి (consciousness) ద్వారా అనుసంధానం (inter connection) వుంటుంది. ఒక ఆత్మ యొక్క చైతన్య పరిణామాభివృద్ధి పూర్ణాత్మకు, ఇతర అంశాత్మలకూ వర్తిస్తుంది. ఒక ఆత్మ చైతన్యశక్తి వ్యాకోచం అన్ని అంశాత్మలకు వ్యాకోచాన్ని కలుగజేస్తుంది. ఆత్మ చైతన్య వికాసం పూర్ణాత్మ చైతన్య వికాసంగా మారుతుంది. నిరంతరం సాగే ప్రవాహంలాగ పూర్ణాత్మ మరి దాని అంశాత్మలు చైతన్య పరిణామం చెందుతూనే వుంటాయి. ఒక దాని అభివృద్ధిని, వ్యాకోచాన్ని చైతన్య పరిణామాన్ని అన్నీ పంచుకుంటాయి. పూర్ణాత్మ, దాని అంశాత్మలన్నీ ఏకకాలంలో అభివృద్ధి చెందుతూంటాయి. ఒక దానికి కావల్సిన జ్ఞానాన్ని పూర్ణాత్మ నుండి, ఇతర అంశాత్మల నుండి సేకరిస్తుంది. పూర్ణాత్మ అంశాత్మల పైన ఆధిపత్యం కలిగి వుండడం, ప్రభావితం చెయ్యడం, వాటి అభివృద్ధిని నిరోధించడం, వాటి విషయాలలో జోక్యం (interference) చేసుకోవడం లాంటివి చెయ్యదు. వేటికవే స్వతంత్రంగా పరిణామం చెందుతుంటాయి.

ఒక అంశాత్మ (soul entity) జ్ఞానాన్ని విస్తరింపజేసుకుందంటే, ఆ జ్ఞానాన్ని పూర్ణాత్మకు, ఇతర అంశాత్మలకు విస్తరింపజేస్తుంది. ఇతర అంశాత్మలు, పూర్ణాత్మకు సంబంధించిన జ్ఞానాన్ని (knowledge) స్వేచ్ఛగా పొందవచ్చు. ఒకదానికి సంబంధించింది అన్నింటికీ సంబంధించినట్లు లెక్క! అన్ని అంశాత్మల వ్యక్తిగత ప్రగతి (individual development) + పూర్ణాత్మ వ్యక్తిగత ప్రగతి అన్నీ కలిపితే పూర్ణాత్మ తన ప్రగతిని సాధించినట్లు అవుతుంది. పూర్ణాత్మ నుండి సృష్టింపబడుతూన్న ఆత్మశకలాలు (అంశాత్మలు) ఈ విశ్వంలో గల కోటానుకోట్ల లోకాలలో (in many worlds) వుంటాయి. దేని పరిణామం దానిదే ! దేని అభివృద్ధి దానిదే ! ఆయా లోకాలలో ఆయా పరిస్థితులకనుగుణంగా రూపాలు తీసుకుని అంశాత్మలు చైతన్య పరిణామం చెందుతూంటాయి. భూమి మీద త్రిదిశాత్మక తలంలో (three dimensional) భౌతిక దేహాన్ని తీసుకుని మీరు చైతన్య పరిణామం (evolution of consciousness) చెందుతున్నారు. మీరు ఒకానొక పూర్ణాత్మ నుండి ఊడిపడిన అంశాత్మ !

ఈ పూర్ణాత్మలన్నీ మూలచైతన్యం నుండి ఉద్భవించినాయి. మూలచైతన్యం (All That Is) ఈ విశ్వమంతా ఆవరించి వుంది. అది అనేక రూపాలలో విశ్వమంతా

వ్యాపించి చైతన్య పరిణామం చెందుతూ వుంది. నక్షత్రాలుగా, సూర్యుళ్ళుగా, గ్రహాలుగా, సముద్రాలుగా, ఆయా లోకాలలోని జీవరాశులుగా అన్నింటా ఈ మూలచైతన్యం ఆత్మశకలాలుగా విడగొట్టబడి పరిణామం చెందుతూంది. మూలచైతన్యం నుండి ఉద్భవించిన పూర్ణాత్మలు, పూర్ణాత్మల నుండి అంశాత్మలు, అంశాత్మల నుండి మళ్ళీ అంశాత్మలు ఇలా ఈ మహా ప్రవాహం సాగిపోతూనే వుంటుంది. ఈ అంశాత్మలు పూర్ణాత్మలుగా ఎదుగుతూ వుంటాయి. ఆ ఎదిగిన పూర్ణాత్మలు మళ్ళీ అంశాత్మలను సృష్టి చేస్తూనే వుంటాయి. ఇది ఎప్పటికీ ఆగిపోయే ప్రక్రియ (process) కానే కాదు.

మీ అంతర్ శక్తి నుండి వెలువడిన ఆలోచనా తరంగాలు (thought waves) వాటిశక్తి తీవ్రతల (intensity of energy) కనుగుణంగా ఈ విశ్వంలో గల ఒకానొక లోకంలో ఒక రూపం (form) తీసుకుని చైతన్యశక్తి పరిణామం చెందుతూంటుంది. అనంతకాలం నుండి మీరు చైతన్య పరిణామం చెందుతూ ఉంటున్నారు. అనంతకాలంగా మీ ఆలోచనా తరంగాల నుండి భౌతిక రూపాలు (physical forms) ఏర్పడుతున్నాయి. ఇపుడూ ఆలోచనా తరంగాల నుండి భౌతిక రూపాలు సృష్టింపబడుతున్నాయి. ఇంతకు ముందూ సృష్టింపబడుతూ వుంటాయి. ఈ సృష్టి అనునిత్యము జరుగుతుంటుంది. ఆ భౌతిక రూపాలు ఆయా లోక పరిస్థితుల కనుగుణంగా, అక్కడ ఉండే శక్తి (energy), చైతన్యశక్తికి (consciousness) అనుగుణంగా వుంటాయి. అవి మీ చర్మచక్షువులకు (physical eyes) గోచరం కావచ్చు, కాకపోవచ్చు.

మూలచైతన్యం (All That Is) నుండి పూర్ణాత్మలు, పూర్ణాత్మల నుండి అంశాత్మలు, అంశాత్మల నుండి అంశాత్మలు, వాటి నుండి మళ్ళీ సృష్టి కొనసాగుతూనే వుంటుంది. విశ్వంలో ఇవన్నీ చైతన్యశక్తి అనుసంధానం (consciousness internet) ద్వారా పరస్పరం జ్ఞానం (knowledge) + శక్తి (energy) + అనుభవాలను (experiences) ఒక దానికొకటి పంచుకుంటూ అభివృద్ధి చెందుతూ వున్నాయి. ఈ సృష్టి (creation) ఎప్పుడు ప్రారంభమైంది? ఎన్ని దిశలలో సాగుతూంది ? ఎన్నాళ్ళు ఈ సృష్టి సాగుతుంది ? అని ఎన్నో ప్రశ్నలు మిమ్మల్ని వెంటాడుతుంటాయి. ఈ సృష్టి అనంతకాలం నుండి ప్రారంభమైంది? అనంతకాలం వరకు కొనసాగుతుంది. స్ప్రింగు (spring), సంకోచ వ్యాకోచాలు (compressions and expansions) చెందుతుంటుంది. కాని స్ప్రింగ్ (spring) అక్కడే వుంది. అది తన ఉనికిని (identity) కోల్పోలేదు. అట్లే ఈ విశ్వంలోగల మూలచైతన్యం నిరంతరం సంకోచవ్యాకోచాలు (compressions and expansions) చెందుతూనే వుంటుంది. మూలచైతన్యం (All That Is or God) కోటానుకోట్ల రూపాలను

(forms) తీసుకుని, మళ్ళీ వాటిని నాశనం చేసి మళ్ళీ పునర్జన్మల ద్వారా ఇతర రూపాలను తీసుకుని పరిణామం చెందుతుంటుంది. ఇది నిరంతరం సాగుతున్న ప్రక్రియ (a continuous process). ఆత్మశకలము తన రూపాన్ని ఒక నక్షత్రంగా, ఒక గ్రహంగా, ఒక మనిషిగా, ఒక జంతువుగా, ఒక చెట్టుగా, ఒక క్రిమిగా, ఒక చేపగా ఎంచుకోవచ్చు. భూమి మీద ఆత్మ శకలం తీసుకునే రూపాలన్నీ మీ ఇంటెలిజెన్స్ (intelligence)కు గాని, మీ బాహ్యేంద్రియాలకు గాని అర్థం కావు. ఆత్మ శకలం ఎలక్ట్రాను (electron)గా రూపం తీసుకోగలదు. పరమాణువు (atom)గా తీసుకోగలదు. ఇతర లోకాలలో (other worlds), ఇతర డైమన్షన్స్‌లో (dimensions) ఆత్మశకలం తీసుకునే రూపాలు (forms) మీకు అర్థం కావు. అది మీ అంతర్ ప్రపంచానికి (inner world) మాత్రమే అర్థం కాగలదు.

పూర్ణాత్మ, అంశాత్మల మధ్య నిరంతరమూ కమ్యూనికేషన్ (communication) జరుగుతుంటుంది. మీ అంతరేంద్రియాలకు ఇది గ్రాహ్యమవుతుంది. ఆత్మ ఎప్పటికీ స్థిరంగా వుండదు. నిరంతరం పరిణామం (continuous evolution) చెందడం దాని నైజం (nature). అన్ని ఆత్మలు వాటి అంతర్ ప్రపంచం (inner world) ద్వారా చైతన్యశక్తి చేత కనెక్ట్ (connect) కాబడి వున్నాయి. మీరు ఒంటరిగా, ఏకాంతంగా వున్నపుడు ఏవో రూపాలు కన్పిస్తున్నట్లు, ఏవో శబ్దాలు వింటున్నట్లు మీ అంతర్వాణికి తెలుస్తుంటుంది. ఇది చాల మందికి అనుభవమయ్యే వుంటుంది. మీ దేహం గురించి, మీ ఆత్మను గురించి తెలుసుకోవాల్సిన సబ్జెక్టు (subject) అపారంగా వుంది. నేను ఈ దేహం మాత్రమే, ఈ అహమే నేను అని మీరు భావించినట్లు అయితే మీరు ఎన్నో పరిమితులకు (limitations) లోబడి వున్నారు. సముద్రంలో ఒక దోసెడు నీరును మాత్రమే తీసుకుని అదే సర్వస్వమని భావించినట్లుగా, దేహంతో వున్న మీరు మాత్రమే ఆత్మ అని భావిస్తున్నారు. పూర్ణాత్మ ఒక వ్యక్తిత్వంతోగాని, ఒక దేహంతోగాని నిర్వచించబడదు. పూర్ణాత్మను నిర్వచించాలంటే – మూలచైతన్యం నుండి పూర్ణాత్మ, పూర్ణాత్మ నుండి అంశాత్మలు, అంశాత్మల నుండి మళ్ళీ పుట్టుకొచ్చిన అంశాత్మలు, అనంతకాలంగా సాగే ఈ పరిణామం అన్నింటినీ కలుపుకొని నిర్వచించాల్సి వుంటుంది. ప్రతి ఆత్మను ఒక దేహంగా, ఒక వ్యక్తిత్వం (personality)గా నిర్వచించడానికి వీలు లేదు. పూర్ణాత్మ నుండి ఆత్మ సృష్టి, ఆత్మ నుండి నిరంతరమూ వెలువడే ఆలోచనల తాలూకు రూపాలు, ఆత్మతో బాటు పూర్ణాత్మ నుండి సృష్టించబడిన ఇతర అంశాత్మలు అన్నింటినీ కలిపి నిర్వచించ వలసి వుంటుంది. ఆత్మ ఒక దేహానికి మాత్రమే

పరిమితమైనట్లు నిర్వచించడం సరికాదు. ఈ దేహం తీసుకోక మునుపు, ఈ దేహం నశించిన తర్వాత కూడ ఈ ఆత్మ పరిణామం చెందుతూ వుంటుంది.

తీవ్రమైన శక్తిగల ఆలోచనా తరంగాలు త్రిదిశ తలంలో (three dimensional plane) భౌతిక రూపంగా (physical form) వాస్తవాన్ని పొందుతాయి. అవి ఎంత త్వరగా వాస్తవరూపం ధరిస్తాయనేది మీ ఆలోచనల శక్తి ఎంత బలంగా వుంటుందనే దాని మీద ఆధారపడి వుంటుంది. బలహీనమైన ఆలోచనా తరంగాలు వాటి శక్తి కనుగుణంగా ఇతర తలాల్లో (other dimensions) రూపాల నేర్పరుచుకుని పరిణామం చెందుతుంటాయి. మనిషిగా దేహం తీసుకున్న మీరు దేహానికి, వ్యక్తిత్వానికి మాత్రమే పరిమితం కాకుండా అన్ని దిశలలో వ్యాపించి వున్న ఆత్మను తెలుసుకోవడానికి ఉపక్రమించాలి. చైతన్యశక్తి ప్రవాహాలు అనేకానేక ఆత్మ శకలాలతో వివిధస్థాయిలలో (at different levels) సాగుతుంటుంది. చైతన్యశక్తి ప్రవాహాలు ఒక్కొక్క ఆత్మ శకలానికి ఒక్కో విధంగా వుంటుంది. ఈ ప్రవాహాలన్నీ కలుపుకుని మహా చైతన్యశక్తి ప్రవాహం అవుతుంది. పిల్ల కాలువలన్నీ కలుపుకుని మహానది అయినట్లు మహానదులన్నీ కలుపుకుని మహాసముద్రమయినట్లు – కోటానుకోట్ల ఆత్మ శకలాల చైతన్య పరిణామాలన్నింటినీ కలుపుకుని మహాచైతన్య ప్రవాహమవుతుంది. ఈ విశ్వమంతా మహా చైతన్య ప్రవాహం! అన్నీ ఒకదానికొకటి లింకు (link) కలిగి వున్నాయి. అట్లాగని మీరు ఆ మహా ప్రవాహంలో కొట్టుకు పోవడం లేదు. మీ ప్రత్యేక ఉనికి ఎప్పటికీ నిలిచే వుంటుంది. మీ వ్యక్తిత్వాన్ని, మీ సంకల్పాలను, మీ చైతన్యపరిణామాన్ని భంగపరిచే శక్తి ఈ ప్రపంచంలో దేనికీ లేదు. ఈ సమాచారమంతా (information) మీ అంతర్ ప్రపంచానికి తెలుసు. 'అహం' చేత ప్రభావితమైన మీరు వీటన్నింటినీ వింటుంటే ఆశ్చర్యపడుతున్నారు. తనకు తెలిసిన పరిజ్ఞానంలో వున్న వాటిని మాత్రమే 'అహం' నమ్ముతుంది. దానికి ఆవల వున్న అనంతమైన జ్ఞానాన్ని అది విశ్వసించదు.

* * *

మల్టి డైమన్షనల్ ఆత్మ గురించి తెలుసుకునే ముందర 'దేవుడు' అనే కాన్సెప్ట (concept) గురించి మీకు తెలియజేస్తాను. ఈ విశ్వం అనంతమైనది. కోటానుకోట్ల గెలాక్సీలు (galaxies) ఈ విశ్వంలో వున్నాయి. ఒక్కొక్క గెలాక్సీలో కొన్ని కోట్ల నక్షత్రాలు వున్నాయి. ఒక్కొక్క నక్షత్రమూ ఒక సూర్యుడుగా పరిగణింపబడుతుంది. సూర్యుడు + దాని చుట్టూ పరిభ్రమించే గ్రహాలు + గ్రహాల చుట్టూ పరిభ్రమించే ఉపగ్రహాలు కలిసి సౌరవ్యవస్థ (solar system) అనబడుతుంది. అంటే ఈ విశ్వంలో కోటానుకోట్ల

సౌరవ్యవస్థలు వున్నాయి. ఈ విశ్వం ఆదిమధ్యాంత రహితమైనది. అనంతమైనది. మానవ మేధస్సుకు ఏ మాత్రం అందదు.

ఈ విశ్వంలో కోటానుకోట్ల లోకాలు వున్నాయి. ఒక్కొక్క లోకం ఒక నిర్ధిష్ట ఫ్రీక్వెన్సీ స్థాయితో కూడిన చైతన్యశక్తితో నిండి వుంటుంది. ఆ లోకంలో గల జీవాత్మలన్నీ ఆ చైతన్యశక్తి స్థాయిలో పరిణామం చెందుతూ వుంటాయి. ఒక లోకంలో గల జీవాత్మలన్నీ చైతన్య పరిణామం చెందుతూ ఆ లోకం యొక్క శక్తి స్థాయిని పెంచుకుంటూ రావడం జరుగుతుంటుంది. ఒక లోకాన్ని ఒక తలంగా భావించడం జరుగుతుంది. ఒక లోకం ఒక తలంగానూ, మరో లోకం మరో తలంగానూ ఆయా లోకాలు ఆయా తలాలుగా వుంటాయి. 'తలం' అంటే డైమన్షన్ (dimension) అని అర్థం! భూమి అనే లోకం త్రీ డైమన్షనల్ తలం, ఇక్కడ తలం అంటే గ్రహమని కాదు. భూమి గ్రహం మీద అనేక తలాలు వున్నాయి. అంటే భూమి మీద అనేక లోకాలు వివిధ శక్తిస్థాయిలు కలిగి వుంటున్నాయి. భూమి మీద వివిధ మల్టి డైమన్షన్స్ గల లోకాలు నడుస్తున్నాయి. అవి హయర్ ఫ్రీక్వెన్సీ (higher frequency) గల లోకాలు. ఆ లోకాలు మీ చర్మచక్షువులకు కన్పించవు. ఈ విశ్వంలో శూన్య ప్రదేశం అనేది ఎక్కడా వుండదు. విశ్వమంతా చైతన్యశక్తి చేత ఆవరించబడివుంది. గాలిలోని పరమాణువులు మీ కంటికి ఎలా కన్పించవో ఈ విశ్వంలోని చైతన్యశక్తి కూడ మీ కళ్ళకు కన్పించదు. భూమి మీద వివిధ ఫ్రీక్వెన్సీలు, శక్తి స్థాయిలు గల లోకాలున్నాయి. ఇనుము అనే లోహపదార్థాన్ని అత్యధిక ఉష్ణోగ్రతకు వేడిచేసినపుడు ద్రవరూపంలోనికి మారుతుంది. ఆ ద్రవాన్ని మరింత అత్యధిక ఉష్ణోగ్రతకు వేడిచేసినపుడు వాయురూపంలోనికి మారుతుంది. లోహపదార్థం ఘనస్థితి నుండి ద్రవస్థితిలోనికి, ద్రవస్థితి నుండి వాయు స్థితిలోనికి మార్పు చెందింది. అంటే ఒకే పదార్థం వివిధ స్థితులలో వుండగలదు. ఘన స్థితి తక్కువ ఫ్రీక్వెన్సీగల శక్తి స్థాయిలోనూ, ద్రవస్థితి ఎక్కువ ఫ్రీక్వెన్సీగల శక్తి స్థాయిలోనూ, వాయుస్థితి మరింత ఎక్కువ ఫ్రీక్వెన్సీ గల శక్తి స్థాయిలోను వుంటాయి. ఘనస్థితిలో వున్నపుడు గల సాంద్రత (density), ద్రవస్థితిలో వున్నపుడు గల సాంద్రత, వాయుస్థితిలో వున్నపుడు గల సాంద్రత వేరువేరుగా వుంటాయి. ఈ విశ్వంలో గల లోకాలు, గ్రహాలు, సౌరవ్యవస్థలు కూడ అలాగే వేరువేరు ఫ్రీక్వెన్సీలు గల శక్తి స్థాయిలలో, వేరువేరు సాంద్రతలను కలిగి వుంటాయి.

ఒక లోకంలో గల శక్తి స్థాయి, సాంద్రతకు అనుగుణంగా అక్కడ జన్మలు తీసుకునే జీవాత్మల దేహాల సృష్టి జరుగుతుంటుంది. ఈ విశ్వమంతా ఒకే

మూలచైతన్యశక్తి ఆవరించి వున్నప్పటికీ, దాని ధర్మాలు మరి చైతన్య పరిణామం వివిధ లోకాలలో వివిధ రీతులలో వుంటూ పురోగతి చెందుతుంటుంది. మీ సౌరవ్యవస్థలో (solar system) గ్రహాలు, ఉపగ్రహాలతో బాటు మీ కళ్ళకు కన్పించని, మీ శాస్త్ర పరికరాలు పసిగట్టలేని ఎన్నో లోకాలు ఇమిడివున్నాయి. ఒక సౌర వ్యవస్థ యొక్క చైతన్యశక్తి పరిధిలో లెక్కపెట్టలేనన్ని లోకాలున్నాయి. ఈ విశ్వంలో కోటానుకోట్ల సౌరవ్యవస్థలలో వున్న లోకాలు మానవమేధస్సుకు అంతుబట్టవు. ప్రతి లోకంలోని జీవాత్మలు చైతన్య పరిణామ వ్యాకోచం చెందుతూ ఆ లోకం యొక్క శక్తి స్థాయిని పెంచుకుంటూ వస్తాయి. తద్వారా సౌరవ్యవస్థలోని అన్ని లోకాల శక్తి స్థాయి పెంచబడుతూ వస్తుంది. వెరసి ఈ విశ్వం యొక్క చైతన్య పరిణామ వ్యాకోచం పెంచబడుతుంది.

'దేవుడు' అనే కాన్సెప్టును వివరించడానికి ప్రయత్నం చేస్తాను. మీకు తెలిసిన కాన్సెప్ట ప్రకారం 'దేవుడు' మానుషరూపంలో వున్నాడని, 'దేవుడు' అనే ఆయనకు మహిమాన్విత శక్తి వుందని, ఈ లోకసంరక్షకుడు' ఆయనేనని భావించడం జరుగుతూంది. మీకు గాని, మీ మత గురువులకు గాని తెలిసిన కాన్సెప్ట చాల స్వల్పం. ఈ కాన్సెప్ట గురించి మీకు తెలియక పోవడం వల్ల మతాల మధ్య యుద్ధాలు జరిగాయి. 'దేవుడు' అనే కాన్సెప్టను త్రీ డైమన్షనల్ తలానికి మాత్రమే అన్వయించుకుంటున్నారు. మానవజాతి అద్భుతంగా భావించే గుణగణాలను 'దేవుడు' మాత్రమే కలిగి వుంటాడని, మరే మానవుడికీ అటువంటి గుణాలుండడం అసంభవమని భావిస్తుంటారు మీరు. మీ మనస్సులో వుండే భావాల కనుగుణంగా దేవుడిని ఊహించుకుంటున్నారు.

'దేవుడు' అనే కాన్సెప్టకు ఈ క్రింద కనబర్చిన కొన్ని నిర్వచనాలను మానవజాతి వివిధ కాలాలలో ఇవ్వడం జరిగింది.

- దేవుడు అనంతశక్తిమంతుడు. ఆయన ఉగ్రరూపుడు. ఆయన ఆగ్రహోదగ్రుడు అయినపుడు అన్ని లోకాలను భస్మం చేసెయ్యగలడు.
- ఆయన దీన జన బాంధవుడు. 'పాహిమాం, పాహిమాం' అని ఆర్తనాదాలు చేసేవారిని ఆయన కాపాడుతాడు.
- పాపాత్ములను శిక్షించువాడు ఆయనే. మానవజాతి చేసే పాపాలకు తీర్పు చెప్పేవాడు ఆయనే.
- ఆయన భక్తవత్సలుడు. భక్తులకు వశమై పోతాడు. భక్తుల కోరికలను తీరుస్తాడు.

- ఆయన మానవగుణాల కతీతుడు. ఆయన నిర్గుణుడు.
- ఆయన ప్రార్థనల ద్వారా, భజనల ద్వారా, స్తోత్రముల ద్వారా, పూజల ద్వారా ప్రసన్నుడౌతాడు. భక్తుల కోరికలను తీరుస్తాడు.

ఇలా అనేక విధాలుగా దేవుడి గురించి మానవజాతి నిర్వచనాలివ్వడం, గుణగణాలను వర్ణించడమూ జరుగుతూంది. మీ భావనలతో, మీకు తెలిసిన జ్ఞానంతో, దేవుడిని నిర్వచించడం జరుగుతూంది. మానవ గుణాలను దేవుడికి ఆపాదించడం జరుగుతూంది. దేవుడు మనిషి రూపంలోనే వున్నాడని కూడ మీరు భావిస్తున్నారు. దేవుడి గురించి మీరు ఏర్పరుచుకున్న అభిప్రాయాలూ, మీ నిర్వచనాలు అన్నీ అర్థరహితమైనవి.

ఈ విశ్వంలో మీ ఆత్మ ఎన్నో లోకాలలో ఎన్నో దేహాలను ధరించి చైతన్య పరిణామం చెందుతూంది. అటువంటపుడు 'దేవుడు' ఒక త్రి డైమన్షనల్ తలంగల భూమిలో గల మానవజాతి నిర్వచనాలకు అందుతాడా? ఈ విశ్వంలో కోటానుకోట్ల లోకాలున్నాయి. అనంత బ్రహ్మాండమైన విశ్వాన్ని మహాసముద్రంతో పోల్చితే, నీటి బొట్టంత కూడ లేని భూమిలోని మానవజాతి ఇచ్చే నిర్వచనాలకు అనుగుణంగా దేవుడు వుంటాడా? ఈ విశ్వాన్ని భూగోళంతో పోల్చితే, గుండుసూది మొన అంత కూడ లేదు భూమి! అటువంటి భూమి మీద గల మానవజాతిలో కొంత మంది భక్తి పారవశ్యానికి దాసోహమవుతాడా? మీరు చేసే స్తోత్రాలకు, పూజలకు, ప్రార్థనలకు దేవుడు సంతోషిస్తాడా? మానవ గుణాలకు అతీతుడా? **కోటానుకోట్ల లోకాలలోగల ఇతర జీవాత్మల గుణగణాల సంగతేమిటని మీరు ఆలోచించారా? కోటానుకోట్ల లోకాలలో ఎంతో సృష్టిజరుగుతూంది. ఈ భూమి మీద మాత్రమే మానవులు 'పాహిమాం, పాహిమాం,' అని దైన్యంతో ఆర్తనాదాలు చెయ్యవలసిన పరిస్థితులున్నాయనుకోవడం మీ అవివేకానికి పరాకాష్ట!** పాపాత్ములను ఏ ప్రాతిపదికతో నిర్ణయిస్తారు? ఆ పాపాత్ములను శిక్షించడానికి దేవుడున్నట్లయితే ఆయనకు మానవ గుణాలు వుండాలి గదా? అనంత బ్రహ్మాండమైన విశ్వంలో, కోటానుకోట్ల లోకాలు గల ఈ విశ్వంలో కూసంతగూడ లేని ఈ భూమి మీద గల మానవుని రూపంలో దేవుడుంటాడని భావించడం మీ ఆధ్యాత్మికజ్ఞానం లోపం వల్లనే! ఈ కూసంత భూమి మీదకు దేవుడు తన కుమారుని పంపి మానవులను రక్షిస్తున్నాడని మీరు భావిస్తున్నారు. **కోటానుకోట్ల లోకాలలో వున్న జీవాత్మలన్నీ మూలచైతన్యం నుంచి సృష్టింపబడినవే! అన్ని లోకాలలోని జీవాత్మలన్నీ దేవుని కుమారులే!**

దేవుడు అంటే ఈ విశ్వమంతా ఆవరించివున్న మూలచైతన్యం. దేవుడంటే స్త్రీ గాదు, పురుషుడూ గాదు. ఈ విశ్వంలో వున్న శక్తి స్వరూపమే దైవం. భూమి మీద మానవజాతితో సహా అన్ని జీవాత్మలూ దేవుళ్ళే! కోటానుకోట్ల లోకాలు + ఆ లోకాలలోని జీవాత్మల సృష్టి అంతా కూడ దైవమయమే. 'అనంతమూలచైతన్యం' నిరంతరమూ పరిణామవ్యాకోచం చెందడానికి తనను తాను కోటానుకోట్ల లోకాలుగా, కోటానుకోట్ల జీవరాశులుగా సృష్టించుకుంటూంది. సృష్టికర్త మరి సృష్టి రెండూ ఒకటే. విశ్వం తనలోని సృష్టినంతా ప్రేమిస్తుంది.

'మూలచైతన్యం' కోటానుకోట్ల లోకాలుగా, కోటానుకోట్ల జీవరాశులుగా తననుతాను సృష్టించుకుని చైతన్య పరిణామం చెందుతూంది. కోటానుకోట్ల జీవాత్మల గుణాలన్నీ ఆ మూలచైతన్యంలోనే... అంటే దైవంలోనే వున్నాయి. దైవం కోటానుకోట్ల గుణాలలో చైతన్య పరిణామం చెందుతూ విస్తరించుకుంటూ వుంది. దైవం నిర్గుణమని, గుణాతీతుడని నిర్వచించడం అసాధ్యం! మానవ పరిభాషలో ఇచ్చే నిర్వచనాలన్నీ అర్థరహితమైనవి. కోటానుకోట్ల జీవాత్మల గుణగణాలతో విరాజిల్లుతూన్న మూలచైతన్యాన్ని మానవగుణాల కతీతమని చెప్పడం ఎంత హాస్యాస్పదం!

అనంత బ్రహ్మాండమైన మూలచైతన్యం అనంతమైన గుణాలను, అనంతమైన ధర్మాలను ఏకకాలంలో కలిగి వుంటుంది. దాని చైతన్య పరిణామం అనంతమైన దిశలలో వుంటుంది. ఈ మహా విశ్వంలో ప్రతి జీవాత్మా అద్భుతమైనదే! సృష్టి అంతా అద్భుతమైనదే! కూసంత భూమి + దీని మీద సృష్టింపబడుతూన్న జీవాత్మలు కూడ అద్భుతమైనవే. త్రి డైమన్షనల్ తలమైన భూమి + దాని మీద జీవరాశుల చైతన్య పరిణామం కూడ అనంత బ్రహ్మాండ మూలచైతన్య పరిణామాన్ని పెంచుతుంది.

భూమి మీద ఒక కోణంలో చైతన్య పరిణామంలో కదిలిక ఏర్పడితే దాని ప్రభావం మూలచైతన్యం మీద మల్టి డైమన్షనల్ కోణాలలో...అంటే అనంతమైన కోణాలలో వుంటుంది. మీరు ఒక దిశలో కదిలికను కలుగజేస్తే మూలచైతన్యం అనేక దిశల నుండి ప్రతిస్పందిస్తుంది. సృష్టికర్త తన సృష్టి నుండి వేరుగా లేడు.

అనంతమైన కాంబినేషన్స్‌తో (combinations), అనంతమైన సంభావ్యతలతో (probabilities) **మూలచైతన్యం** (All That Is) అనంత లోకాలలో అనంతమైన రూపాలలో అనంతమైన దేహాలతో తనను తాను సృష్టించుకుంటూంది.

మూలచైతన్యం యొక్క అనంతమైన ధర్మాలన్నీ మీ అంతర్ ప్రపంచంలో

ఇమడ్చబడి వున్నాయి. మూలచైతన్యం యొక్క అనంతతత్వం మీ అంతర్ ప్రపంచంలో పొందుపరచబడి వుంది. అనంతతత్వాన్ని దర్శించడానికి అంతర్ ప్రయాణం (Inner Journey or Meditation) ఒక్కటే ఏకైక మార్గం! ఈవిశ్వంలోని అన్ని లోకాలలోని జీవాత్మలన్నింటి అంతర్ ప్రపంచాలలో మూలచైతన్యం విరాజిల్లుతూంది.

దైవం (= మూలచైతన్యం) తన సృష్టిని శాసించదు. తన సృష్టిని శిక్షించదు. ఈ సృష్టిలో ఏ జీవాత్మలూ పాపాత్ములుగా లేరు. ఈ సృష్టిలో ఎవరూ దీనజనులు లేరు. అనంతమైన సృష్టిలో ప్రతి భాగమూ, ప్రతి ఆత్మ, ప్రతి జీవాత్మ ఎంతో విశిష్టమైనవే. **ఈ అనంత బ్రహ్మాండమైన విశ్వంలో ఈ కూసంత భూమి . దాని మీద జీవాత్మలు కూడ ఎంతో విశిష్టమైనవే! దైవం అనేది విశ్వమంతా వ్యాపించివున్న మల్టి డైమన్షనల్ శక్తి స్వరూపం!**

భూమి మీద మానవజాతిలో చాల కొద్ది మంది మాత్రమే అంతర్ దర్శనం ద్వారా మూలచైతన్యాన్ని అనుభూతి చెందారు. బుద్ధుడు, జీసస్‌లాంటి వారు ఎంతో మంది వారి అంతర్ ప్రపంచాలలోని మూలచైతన్యాన్ని దర్శించగలిగారు. భూమి మీద జన్మతీసుకునే ప్రతి మానవుడికీ తన అంతర్ ప్రపంచంలోని మూలచైతన్యాన్ని దర్శించి అనుభూతి చెందగల శక్తి సామర్థ్యాలున్నాయి. మానవ చైతన్యం ఎంత వరకు పరిణామం చెందగలదో తెలియజెప్పడానికి బుద్ధుడు, జీసస్... ఇంకా ఎంతో మంది మీకు తెలియజేశారు.

అనంత మూలచైతన్యం యొక్క అనంత ధర్మాలను ఆస్వాదించడానికి అన్ని జీవాత్మలూ అర్హమైనవే. మల్టి డైమన్షనల్ దైవాన్ని అర్థం చేసుకోవడానికి మానవ ఇంటెలిజెన్స్ (human intelligence) ఏ మాత్రం సరిపోదు. ప్రస్తుతం మానవజాతి చైతన్య పరిణామం మరి ఆధ్యాత్మిక పురోగతి వేగం పుంజుకుంటూంది. మల్టి డైమన్షనల్ దైవాన్ని కొద్దిగానైనా తెలుసుకునే దిశలో ప్రస్తుతం మానవజాతి ప్రయాణం చేస్తూంది. మానవవజాతి ఆలోచనా తరంగాలు ఇతర డైమన్షన్స్‌లో వున్న లోకాలలో కూడ వాస్తవ రూపం పొందుతున్నాయనే విషయాన్ని తెలుసుకునే స్థితిని మానవజాతి పొందబోతూంది. 'తమ వాస్తవాలను తామే సృష్టించుకుంటున్నాం' అనే సత్యాన్ని గ్రహించగల మేధోపరిణితిని మానవజాతి పొందబోతూంది. స్థూలంగా చెప్పాలంటే ఆధ్యాత్మికంగా ఎంతో పరిణితిని మానవజాతి సాధించబోతూంది.

* * *

భూమి + మానవజాతి + జీవాత్మలన్నీ చైతన్య పరిణామం చెందడానికి అనంతమైన సంభావ్యతలు (infinite probabilities) వున్నాయి. ఉదాహరణకు అమెరికా నుండి ఇంగ్లాండుకు ప్రయాణించడానికి లెక్కలేనన్ని మార్గాలను ఎంచుకోవచ్చు. రోడ్డుపై గాని, జలమార్గం ద్వారా గాని, ఆకాశమార్గం ద్వారా గాని లెక్కకు మిక్కిలి సంభావ్యతలను ఎంచుకోవచ్చు. ఒక సంభావ్య మార్గాన్ని ఎంచుకున్న తర్వాత అదే మీ భూ ప్రపంచపు వాస్తవమవుతుంది. ఆ మార్గాన్ని జాగృదావస్థలో వున్నపుడు, ఇతర అనంతమైన సంభావ్యతలను మీ అంతర్ ప్రపంచం ద్వారా ఎంచుకుని ఆ మార్గాలలోనూ చైతన్య పరిణామాన్ని ఏకకాలంలో పొందుతున్నారు. ప్రతి క్షణంలోనూ చైతన్య పరిణామం చెందడానికి అనంతమైన సంభావ్యతలు మరి అవకాశాలు మీ ముందర ఎదురుచూస్తున్నాయి. ఒక అవకాశాన్ని సరియైన రీతిలో చేజిక్కించుకోవడం అనేది మీ మైండ్ పైన ఆధారపడి వుంటుంది. మీరు బలమైన మరి ప్రగాఢమైన చైతన్యశక్తిని నింపుకున్నపుడే సరియైన రీతిలో అవకాశాలను ఎంచుకోవడం జరుగుతుంటుంది.

ఈ విశ్వంలో ప్రతిదీ చైతన్యంతో నిండివుంది. మీ ఫిజక్స్ (physics) ప్రకారం పరమాణువు (atom) మరి ఎలక్ట్రాను అతి చిన్నవి. ఆ పరమాణువులో న్యూక్లియస్ + ఎలక్ట్రానులు వుంటాయి. న్యూక్లియస్‌లో ప్రొటానులు, న్యూట్రానులు ఇంకా ఎన్నో ప్రాథమిక కణాలున్నాయని మీ శాస్త్రవేత్తలు నిర్ధారించడం జరిగింది. న్యూక్లియస్‌లోని ప్రాథమిక కణాలు మరి ఎలక్ట్రానులలో చైతన్యశక్తి నింపబడి వుంటుంది. ఆ ప్రాథమిక కణాలు నిరంతరమూ ఆత్మభ్రమణం చెందుతూ పరిభ్రమణం కూడ చేస్తుంటాయి.

ఎలక్ట్రాను ఆత్మభ్రమణం చెందుతూ న్యూక్లియస్ చుట్టూ పరిభ్రమణం చెందుతుంటుంది. విద్యుదాకర్షణ శక్తి వల్ల ఎలక్ట్రాను న్యూక్లియస్ చుట్టూ ఆత్మ భ్రమణం + పరిభ్రమణం చెందుతుంటుందని, మీ ఫిజిక్స్ చెప్తుంది. ఎలక్ట్రానుకు ఆ చలనం కలుగజేసిన విద్యుదాకర్షణ బలం ఎక్కడి నుండి వచ్చింది? చైతన్యశక్తి ద్వారా ఎలక్ట్రాను ఆత్మ భ్రమణం + పరిభ్రమణం చెందుతూవుంది. ఆ చైతన్య శక్తే సౌర కుటుంబాన్ని నడుపుతూ వుంది. చంద్రుడు భూమి చుట్టూ, భూమి సూర్యుడి చుట్టూ, ఆత్మభ్రమణం + పరిభ్రమణం చెందడానికి గల కారణం ఈ చైతన్యశక్తియే! ఈ నమూనా (pattern) ఈ విశ్వమంతా ప్రాథమిక కణాల నుండి గెలాక్సీ (galaxies)ల వరకు కొనసాగుతూంది. **ఈ విశ్వంలోని అన్నింటిలోను ప్రాథమిక కణం మొదలు అతిపెద్ద గెలాక్సీల దాకా వాటిలో చలనాన్ని కలుగజేసేది ఈ చైతన్యశక్తియే!** న్యూక్లియర్ బలాలు, గురుత్వాకర్షణ

బలాలు లేదా విద్యుదాకర్షణ బలాలు లేదా ఇంకేదైనా పేరుపెట్టుకోవచ్చు. కాని ఈ బలాలు చైతన్యశక్తి వలన కలుగుతున్నాయి. ఈ విషయాలను మీకు తెలిసిన ఫిజిక్స్ భాషలో చెప్పడం జరిగింది. ఈ విశ్వంలో మీ ఫిజిక్స్ కంటే బ్రహ్మాండమైన సైన్సు ఇతర లోకాలలో వుంది. మీ ఫిజిక్స్ చాల స్వల్పమైనది. చాల పరిమితమైనది.

ఒక పరమాణువులో న్యూక్లియస్ + ఎలక్ట్రానులు అనేకం, వుంటాయి. ఎలక్ట్రాను యొక్క గమనం మల్టి డైమన్షనల్ (multi dimensions)లో వుంటుంది. దాని వేగం మీ లెక్కల ప్రకారం కాంతి వేగం కంటే ఎన్నో లక్షల రెట్లు వుంటుంది. ఈ గమనాన్ని మీ సైన్సు పసిగట్టే స్థితిలో లేదు. కొన్ని పరమాణువులు కలిసి ఒక అణువుగా ఏర్పడుతాయి. కొన్ని పరమాణువులు ఒక అణువుగా ఏర్పడడం రసాయన బంధం ద్వారా జరుగుతుంది. ఈ రసాయన బంధనాన్ని చైతన్యశక్తి కలుగ జేస్తుంది. కొన్ని అణువుల కలయిక చైతన్యశక్తి ప్రేరణతో జరిగి ఒక 'జీవకణం' తయారవుతుంది.

మీ దేహంలో కొన్ని కోట్ల జీవకణాలుంటాయి. ఈ జీవకణాలన్నీ జీవరసాయనిక శక్తి + విద్యుదయస్కాంత శక్తి + చైతన్యశక్తి తో నింపబడి వుంటాయి. ఈ జీవకణాలన్నింటిలోని చైతన్యశక్తి వేరువేరుగా ప్రత్యేకంగా పరిణామం చెందుతుంటుంది. క్షణకాలంలో ఎన్నో జీవకణాలు మృతి చెందుతూ వాటి స్థానంలో మళ్ళీ క్రొత్త జీవకణాలు పుడుతుంటాయి. మృతి చెందే జీవకణాలు + పుడుతూన్న జీవకణాలు మీ దేహాన్ని ప్రతిక్షణమూ మార్పుకు లోనుచేస్తుంటాయి. పదిసంవత్సరాల క్రితం వున్న దేహానికి ఇపుడున్న దేహానికి సంబంధమే వుండదు. అంతెందుకు ఒక క్షణం క్రితం వున్న దేహం ఇపుడు వుండదు. ఈ క్షణకాలంలో ఎన్నో కోట్ల జీవకణాలు మృతి చెంది వాటిస్థానంలో క్రొత్త జీవకణాలు ప్రాణం పోసుకుని వుంటాయి. ఈ ప్రక్రియలో మీ దేహం క్షణక్షణానికి మార్పు చెందుతూ వుంటుంది. కాని మీ ఆత్మకు చెందిన చైతన్యశక్తి + జ్ఞానం మాత్రం ప్రత్యేక ఉనికిని కలిగి వుంటూ విస్తరింపబడుతూ వుంటుంది.

మీ కంటిపాప ఒక సంవత్సరం క్రితమూ వుంది. ఇపుడూ వుంది. కాని అపుడు మీ కంటిపాపలో వున్న జీవకణాలు ఇపుడు లేవు. కంటిపాపలో ప్రతిక్షణమూ మృతి చెందిన జీవకణాల స్థానంలో క్రొత్త జీవకణాలు ప్రవేశించి కంటిపాప ఉనికిని నిలిపి వుంచుతున్నాయి. అయితే సంవత్సరం క్రితం మీ కంటిపాపతో చూసిన దృశ్యం ఇంకా మీ మనోశక్తిలో మెదులుతూ వుంది. ఆ దృశ్యం తాలూకు చైతన్యశక్తి మీ మనోశక్తి ద్వారా మీ ఆత్మశక్తిలో రికార్డయి వుంటుంది. మీరు చూసిన ప్రతి దృశ్యమూ, మీరు

నేర్చుకున్న ప్రతి అంశమూ, మీరు అనుభూతి చెందిన ప్రతి జీవితానుభవమూ, మీరు సాధించిన జ్ఞానం అంతా కూడ మీ అంతర్ ప్రపంచంలో రికార్డయి వుంటుంది. మీ అంతర్ ప్రపంచం అనంతమైన విషయాలను, అనంతమైన జ్ఞానాన్ని రికార్డు చేసుకుని భద్రపరుచుకోగల సామర్థ్యాన్ని కలిగి వుంటుంది.

మీ దేహంలోని జీవకణాలు వేటికవి తమ విశిష్టతను, ప్రత్యేకతను కాపాడుకుంటూ తమ వ్యక్తిత్వాన్ని నిలువుకుంటాయి. చైతన్యశక్తి ద్వారా జీవకణాల మధ్య అనుసంధానం వుంటుంది. జీవకణాల సమిష్టి చైతన్య పరిణామం దేహం యొక్క చైతన్య పరిణామంగా మారుతుంది. మృతి చెందుతూన్న జీవకణాల తాలూకు చైతన్య పరిణామాన్ని మీ ఆత్మశక్తి ఎప్పటికప్పుడు రికార్డు చేసుకుంటుంది. ఎప్పుడు కావాలంటే అపుడు వాటి తాలూకు చైతన్య పరిణామ సమాచారాన్ని మీ సబ్‌కాన్షియస్ మైండ్ ద్వారా మీ ఎరుకలోనికి తీసుకురాగల శక్తిని మీరు ప్రతిక్షణమూ కలిగి వున్నారు.

ఈ సృష్టిలో ఎలక్ట్రానులు లాంటి అతి సూక్ష్మాతి సూక్ష్మమైన కణాలు, మరి ఎలక్ట్రానులలో ఇమిడి వుండే చైతన్యశక్తి శకలాలతో సహా రాళ్ళు, కొండలు, పర్వతాలు, గ్రహాలు, గెలాక్సీలు అన్నీ ఆత్మను కలిగి వున్నాయి. సూక్ష్మమైన కణాల నుండి స్థూలమైన వాటి వరకూ అన్నింటిలోనూ ఆత్మ నిండి వుంది. ఎలక్ట్రానుకు ఆత్మ వున్నట్లే చీమకూ ఆత్మ వుంది; భూమికి కూడ ఆత్మ వుంది; మీ సౌరవ్యవస్థకూ ఆత్మ వుంది; మీ గెలాక్సీకి కూడ ఆత్మ వుంది; ఈ విశ్వానికి కూడ ఆత్మ వుంది. ఈ విశ్వమంతా ఆవరించి వున్న ఈ ఆత్మయే ఆ అనంత బ్రహ్మాండ మూలచైతన్యం (All That Is or God).

మీ చర్మచక్షువులకు గోచరం కాని ఇతర డైమన్షన్స్ గల లోకాలలో కూడ సృష్టి జరుగుతూనే వుంటుంది. ఈ సకల చరాచర సృష్టి అంతటిలోనూ మూలచైతన్యం ఆవరించి వుండి ఆత్మ శకలాలుగా (soul entities) విభజింపబడి వుంటుంది.

భౌతిక దేహం నిత్య నూతనంగా చైతన్యశక్తితో మనుగడ సాగించాలంటే జీవకణాలు నిరంతరమూ మరణిస్తూ వాటి స్థానంలో క్రొత్త జీవకణాలు పుడుతుండాలి. జీవకణాలు మృతి చెందకపోతే వాటికి జీవ చైతన్యశక్తి పరిణామ పురోభివృద్ధి వుండదు. మృతి చెందడమనేది మళ్ళీ పుట్టడం కోసమేనని జీవకణానికి తెలుసు. దేహంలోని జీవకణాలు పరస్పరం చంపుకోవడం కూడ చేస్తుంటాయి. అడవిలో ఒక జాతి జంతువులు మరొక జాతి జంతువులను చంపడం ద్వారా జంతుజాతి జనాభాను నియంత్రించు కుంటున్నట్లు దేహంలో కూడ జీవకణాల సంఖ్యను నియంత్రించు కోవడానికి పరస్పరం

చంపుకోవడం చేస్తుంటాయి. వాటిస్థానంలో తక్షణమే క్రొత్త జీవకణాలు పుడుతుంటాయి. ఈ ప్రక్రియ 'ఆత్మ' దేహంలో వున్నంతకాలం కొనసాగుతుంటుంది.

ప్రతి జీవకణమూ ఒక ప్రత్యేకమైన ఆత్మగా పరిగణింపబడుతుంది. ఇవన్నీ పరస్పరం సహకారాన్ని అందించుకుంటూ దేహం యొక్క జీవ చైతన్యశక్తిని పెంచుతుంటాయి. మీ దేహాన్ని ఆవరించి వున్న ఆత్మను పూర్ణాత్మగా పరిగణిస్తే, దేహంలోని జీవకణాలను అంశాత్మలుగా పరిగణించవచ్చు. అంశాత్మల వ్యక్తిగత చైతన్య పరిణామం పూర్ణాత్మ యొక్క చైతన్య పరిణామంగా పరిగణింపబడుతుంది. పూర్ణాత్మను, దాని అంశాత్మలను వివరించడానికి దేహాన్ని, జీవ కణాలను ఉదాహరణగా తీసుకోవడం జరిగింది. దేహం కొన్ని సంవత్సరాల పాటు వుంటుంది. కాని దేహంలోని జీవకణాలు ఈ కాల పరిమితిలో కొన్ని కోట్లజీవకణాలు మృతి చెందివుంటాయి. వాటి స్థానంలో క్రొత్త కణాలు పుడుతుంటాయి. మరి ఈ మృతి చెందుతూన్న కణాల చైతన్య పరిణామాన్ని, జీవశక్తి జ్ఞానాన్ని అంతర్ ప్రపంచానికి చెందిన ఆత్మశక్తి రికార్డు చేసుకుంటుంది. ఆ విధంగానే మీ కాల ప్రామాణికత ప్రకారం పూర్ణాత్మ కొన్ని మిలియన్ల సంవత్సరాలు జీవించి వుంటుంది. ఈ కాల వ్యవధిలో కోటానుకోట్ల అంశాత్మలు మృతి చెందుతూ పునర్జన్మలు తీసుకుంటుంటాయి. ప్రతి క్షణమూ కోట్ల అంశాత్మలు పూర్ణాత్మ నుండి వెలువడుతుంటాయి. అగ్నికీలల నుండి వెలువడే అగ్ని కణాలలాగ ఈ అంశాత్మలు నిరంతరం పూర్ణాత్మ నుండి వెలువడుతుంటాయి.

అంశాత్మలు జన్మపరంపరల ద్వారా చైతన్య పరిణామం చెందుతూ ఆధ్యాత్మిక పురోగతి చెందుతుంటాయి. ఈ జన్మ పరంపరలు ఒక లోకంలోగల నిర్దిష్ట శక్తి స్థాయిలో కొనసాగుతూ వుంటుంది. అంశాత్మ యొక్క చైతన్యశక్తి + ఆధ్యాత్మిక శక్తి ఆ లోకానికి సంబంధించిన గరిష్ట చైతన్యశక్తి స్థాయిని దాటినపుడు మరో ఉన్నత లోకానికి ప్రయాణించి అక్కడ జన్మపరంపరలు కొనసాగిస్తుంటుంది. ఈ ప్రయాణం అనంత కాలం కొనసాగుతుంటుంది. పూర్ణాత్మ + అంశాత్మల చైతన్య పరిణామం అనంత కాలం కొనసాగుతుంది. అంశాత్మలు పూర్ణాత్మలో లీనమవ్వడం గాని, పూర్ణాత్మలు మూలచైతన్యశక్తిలో లీనమవ్వడం గాని ఎప్పటికీ జరగనే జరగవు. అంశాత్మలుగాని, లేదా పూర్ణాత్మలుగాని ఈ అనంతకాల ప్రయాణంలో ఎక్కడా తమ ఉనికిని, ప్రత్యేకతను, వ్యక్తిత్వాన్ని కోల్పోవడం జరగదు.

అంశాత్మల వ్యక్తిగత పురోగతి పూర్ణాత్మ యొక్క పురోగతిని పెంచుతుంది.

అంశాత్మల మధ్య పరస్పర సహకారం వుంటుంది. విద్యుదయస్కాంత శక్తి ద్వారా భూమి మీద ఇంటర్‌నెట్ (Internet) వ్యవస్థ పనిచేస్తున్నట్లే, చైతన్యశక్తి ద్వారా పూర్ణాత్మ + అంశాత్మలు కమ్యూనికేషన్ వ్యవస్థను (communication system) కలిగి వున్నాయి. ఈ అంశాత్మలు ఒక లోకానికి మాత్రమే పరిమితమై వుండవు. వాటి వ్యక్తిగత ఆధ్యాత్మిక పురోగతి మరి చైతన్యశక్తి స్థాయిలకు అనుగుణంగా వివిధలోకాలలో ఈ అంశాత్మలు విస్తరించి వుంటాయి.

మీరు కూడా ఒకానొక పూర్ణాత్మ నుండి వెలువడిన అంశాత్మయే! మీ పూర్ణాత్మ నుండి వెలువడిన అంశాత్మలు, మరి నిరంతరం వెలువడుతున్న అంశాత్మలు అవి కలిగిన చైతన్యశక్తి స్థాయిలకు అనుసారంగా వివిధలోకాలలో అవి విస్తరించి వుంటాయి. మీ పూర్ణాత్మ యొక్క అంశాత్మలు మీ భూమి మీద, భూమి కంటే ఉన్నత లోకాలలోనూ, భూమి కంటే తక్కువ శక్తి స్థాయిగల లోకాలలోనూ విస్తరించి వుంటాయి. ఒక ఇంటర్‌నెట్‌కవ్యవస్థకు (Internet system) కొన్ని కోట్ల కనెక్షన్స్ (connections) వున్నట్లే, పూర్ణాత్మ + అంశాత్మల మధ్య చైతన్యశక్తి వ్యవస్థ (consciousness system) ద్వారా కోటాను కోట్ల కనెక్షన్స్ వుంటాయి. మీకంటే ఉన్నత లోకాలలోని అంశాత్మల నుండి మరి పూర్ణాత్మ నుండి మీరు జ్ఞానాన్ని పొందవచ్చు. అలాగే మీ నుండి భూమి కంటే తక్కువ శక్తి స్థాయిలో గల లోకాలలోని ఇతర అంశాత్మల నుండి కూడ జ్ఞానాన్ని రాబట్టు కోవచ్చు.

భూమి మీద ప్రధాన వెబ్‌సైట్ (Main website) మరి దానికి అనుసంధానంగా కొన్ని కోట్ల ఉపవెబ్‌సైట్‌లు (sub websites) కలిసి ఒక వ్యవస్థగా రూపొందుతాయి. అలాంటి వ్యవస్థలు చాలానే భూమి మీద వెలిశాయి. ఒక వ్యవస్థను పూర్ణాత్మ + అంశాత్మలుగా ఉదహరించవచ్చు. ఇట్లాంటి వ్యవస్థలు ఈ విశ్వంలో కోటానుకోట్లుగా వున్నాయి. ఈ వ్యవస్థలన్నీ అనంత బ్రహ్మాండ మూలచైతన్యం (All That Is) నుండి అనంతకాలం నుండి అనంతకాలం వరకు (from infinite time to infinite time) వెలువడుతూనే వుంటాయి. ఈ వ్యవస్థలన్నింటి ఆధ్యాత్మిక చైతన్య పరిణామం మూలచైతన్యం యొక్క పరిణామంగా పరిణమిస్తుంది.

పూర్ణాత్మ + అంశాత్మలను మరింతగా వివరించడానికి ఒక వెబ్‌సైట్ వ్యవస్థను ఉదాహరణగా తీసుకుందాం. ప్రధాన వెబ్‌సైట్‌కు అనుబంధంగా వున్న కోట్లాది ఉప వెబ్‌సైట్‌లు భూ ప్రపంచమంతా వెలిసి వుంటాయిని మీకు తెలుసు. వాటి మధ్య

కమ్యూనికేషన్ అనేది ఇంటర్ నెట్ వ్యవస్థ ద్వారా (Internet system)జరుగుతుందని మీకు తెలుసు గదా! మీ ఇంట్లో లేదా ఆఫీసులో కూడా ఒక వెబ్‌సైట్ వుందనుకోండి. ఆ వెబ్‌సైట్‌లో మీకిష్టమైన వర్క్‌ను (work) సృష్టించుకోవచ్చు, మీరు సృష్టించిన వర్క్‌ను ఇంటర్‌నెట్ ద్వారా ప్రపంచంలో ఎవరైనా దర్శించవచ్చు. ప్రపంచంలోని కోట్లాది వెబ్‌సైట్‌ల నుండి సమాచారాన్ని అతి సులభంగా ఇంటర్‌నెట్ ద్వారా పొందవచ్చు. ప్రధాన వెబ్‌సైట్ + దాని ఉప వెబ్‌సైట్‌లు = వెబ్ సిస్టం (web system). ఇలాంటి వెబ్ సిస్టంలు ఎన్నో వుంటాయి. ఒక వెబ్ సిస్టంలోని సమాచారాన్ని, ఇంకో వెబ్ సిస్టంలో గల వెబ్ సైట్‌లోనికి ట్రాన్స్‌ఫర్ చేసుకునే వీలుంటుంది. మీ ఇంటర్‌నెట్ ద్వారా ప్రపంచంలోని అన్ని వెబ్ సిస్టమ్స్‌లోని సమాచారాన్ని పొందవచ్చు. ఒక వెబ్ సిస్టంలోని సమాచారాన్నంత ఇంకో వెబ్‌సిస్టంలోని నెట్‌వర్క్ (network) ద్వారా పొందగలిగే వీలుంది.

పై ఉదాహరణ నుండి పూర్ణాత్మ + దాని అంశాత్మలను ఒక వెబ్ సిస్టంగా పరిగణించవచ్చు. ప్రతి ఆత్మనూ ఒక వెబ్‌సైట్‌గా పరిగణించండి. ప్రతి ఆత్మ కూడా పూర్ణాత్మ నుండి వెలువడిన అంశాత్మయేనని మీకు తెలుపుతున్నాను. ఆత్మ తన ఇష్టానుసారంగా, తనకు నచ్చిన రీతిలో చైతన్య పరిణామం చెందుతుంటుంది. ఒక ఆత్మ సాధించిన ఆధ్యాత్మిక పురోగతిని, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఇతర ఆత్మలు కూడా పంచుకుంటాయి. పూర్ణాత్మ + దాని అంశాత్మలు ఒక సిస్టంగా (system)గా పిలవబడుతుంది. ఈ సిస్టంలో ఏదైనా ఒక అంశాత్మ పొందిన జ్ఞానాన్ని చైతన్యశక్తి ద్వారా ఇతర అంశాత్మలకు చేరవేయబడుతుంది. ఆధ్యాత్మిక జ్ఞానం, పూర్ణాత్మ మరి అన్ని అంశాత్మలకూ కమ్యూనికేట్ (communicate) అవుతుంది. ఒక సిస్టంలోని జ్ఞానాన్ని ఇంకొక సిస్టంలోని అంశాత్మలు పొందగలుగుతాయి. ఈ సిస్టమ్స్ (systems) అన్నీ మూలచైతన్యం నుండి ఉద్భవించినవే!

ఇంటర్‌నెట్ వ్యవస్థ (Internet system) మరి వెబ్ సిస్టంల (web system) ద్వారా ఆత్మల మధ్య పరస్పర సహకారం తెలిసింది గదా! దీన్ని మరింత విస్తరించి లోకాలు గురించి వివరిస్తాను. భూమి + దాని 'లోకాలు' మీద గల జీవజాతులన్నింటినీ ఒక వెబ్ సిస్టంగా పరిగణించండి. భూమికి సంబంధించిన వెబ్‌సిస్టం నుండి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఇతర లోక వాసులు పొందే వీలుంటుంది. ఇతర లోకాలలో గల జ్ఞానాన్ని భూమి మీదగల మీరు పొందే వీలుంది. భూమి + దాని మీద జీవజాతులు గల వెబ్

సిస్టంలో అన్ని జీవజాతులూ స్వేచ్ఛను కలిగి వున్నాయి. వాటికి కావలిసిన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, చైతన్య పరిణామాన్ని అవి తమ ఇష్టానుసారంగా పెంచుకోవచ్చు. ఇతర లోకవాసులు మిమ్మల్ని భయపెట్టడమో , మీపై ఆధిపత్యం పొంది మిమ్మల్ని నియంత్రించడమో చెయ్యరు. మీ ఆధ్యాత్మిక పురోగతికి వారు సంతోషిస్తారు. మీనుండి జ్ఞానాన్ని పంచుకోవడానికి వాళ్ళు మిమ్మల్ని అంతర్ ప్రయాణం ద్వారా సంప్రదిస్తూనే వున్నారు. ఆ విషయం మీ స్వప్నాల ద్వారా కొంత తెలిసి వుంటుంది.

అంతర్ ప్రయాణం (Inner Journey), ధ్యానం (meditation), మరి స్వప్నాల ద్వారా ఇతర లోకాలకు సంబంధించిన జ్ఞానాన్ని అతి సునాయాసంగా పొందే మెకానిజమ్ (mechanism) మీ అంతర్ ప్రపంచంలో ఇమిడి వుంది. భూమి అనే వెబ్ సిస్టం నుండి సమస్త జ్ఞానాన్ని మీ అంతర్ ప్రపంచంలో ఇముడ్చుకుని వున్నారు. మీరు అంతరేంద్రియాలను సమర్థవంతంగా వినియోగించడం కోసం ఎంతో సాధన చెయ్యవలసి వుంది. మీరు ఈ విశ్వంలో ఒంటరి వారు కారని, మీరు వెబ్ సిస్టం ద్వారా ఈ సమస్త విశ్వంతో అనుసంధానం కావింప బడివున్నారని అర్థమవుతుందా? ఈ విశ్వంలో ఏ ఆత్మ కూడా దైన్య స్థితిలో, దిక్కుతోచని స్థితిలో, అయోమయంలో వుండాల్సిన అగత్యం లేదని మీకిప్పుడు అర్థమయ్యిందను కుంటాను.

భూమి మీద మీరు ఒక జన్మలో దేహాన్ని ధరించి జీవించేకాలం కాస్మిక్ టైం స్కేలుతో (cosmic time scale) పోల్చి చూసినపుడు దాదాపు శూన్యం. మీ కాల ప్రామాణికత ప్రకారం వంద సంవత్సరాలు అనేది కాస్మిక్ టైం స్కేలులో అసలు లెక్కలోకి రాదు. మీ కాల ప్రామాణికత ఒక కోణంతో మాత్రమే ముడిపడి వుంది. కాలం మల్టిడైమన్షనల్ ప్రామాణికతలను కలిగి వుంది. పూర్ణాత్మ యొక్క కాల ప్రామాణికత మల్టి డైమన్షనల్‌గా వుంది.

ఆత్మ యొక్క మల్టి డైమన్షనల్ ఉనికిని (multi dimensional existence) తెలుసుకోవడానికి త్రీ డైమన్షనల్ ఇంటెలిజెన్స్ (three dimensional intelligence) సరిపోదు. దాన్ని తెలుసుకోవడానికి మీ అంతరేంద్రియాలను ఉపయోగించ వలసి వుంది. మీ అంతర్ ప్రపంచపు ఇంటెలిజెన్స్‌తో పోల్చితే మీ త్రీ డైమన్షనల్ ఇంటెలిజెన్స్ సముద్రంలోని నీటి బొట్టు పరిణామం కూడా వుండదు.

భూమి + దాని మీద జీవజాతులు గల్గిన వెబ్ సిస్టంలో ఎంత క్రియేటివిటీని (creativity) అయినా పొందుపరచవచ్చు. భూమి + జీవజాతుల చైతన్య పరిణామాన్ని,

ఆధ్యాత్మిక పురోగతిని పెంచడం ద్వారా భూ ప్రపంచపు శక్తి స్థాయి మరి ఫ్రీక్వెన్సీ స్థాయి పెరుగుతుంది. ప్రస్తుతం భూ ప్రపంచం హైయర్ ఫ్రీక్వెన్సీ (higher frequency) గల ప్రపంచంగా మార్పు చెందుతూంది.

భూ ప్రపంచం యొక్క చైతన్య వికాసం పెరగడం ద్వారా సౌరవ్యవస్థలోని అన్ని లోకాలలోని చైతన్య వికాసం పెరుగుతుంది.సౌరవ్యవస్థ యొక్క చైతన్య వికాసం పెరగడం ద్వారా గెలాక్సీ చైతన్య వికాసం మరి మూలచైతన్య వికాసం పెరుగుతుంది. భూమిని ఒక వెబ్ సిస్టంగా పరిగణిస్తున్నాము. ఈ సౌరవ్యవస్థలో చర్మ చక్షువులకు గోచరం అయ్యేవీ, గోచరం కాని అన్ని లోకాలను వెబ్ సిస్టమ్స్‌గా పరిగణించుకోండి. ఈ వెబ్‌సిస్టమ్‌ల సముదాయాన్ని సౌర వ్యవస్థకు చెందిన మెయిన్ వెబ్ సిస్టం (Main web system)గా పరిగణించుకోండి. ఇలాంటి మెయిన్ వెబ్ సిస్టమ్స్ మీ గెలాక్సీలో కోటానుకోట్లుగా వున్నాయి. గెలాక్సీలోని అన్ని మెయిన్ వెబ్ సిస్టమ్స్ అన్నీ ఒక దానికొకటి అనుసంధానింపబడి వున్నాయి. విశ్వంలోని అన్ని గెలాక్సీలలోని మెయిన్ వెబ్ సిస్టమ్స్ అన్నీ కూడ మూలచైతన్యంలో ఇమిడి వున్నాయి.

భూమి మీద ఆత్మగా గల మీరు పొందే ఆధ్యాత్మిక పురోగతి అనంతమైన దిశలలో సౌరవ్యవస్థలోని అన్ని లోకాలలో, అన్ని గెలాక్సీలలో, మూలచైతన్యంలో ప్రభావాన్ని చూపుతుంది. ఆధ్యాత్మికంగా మీరు కలుగజేసే చిన్న కదలిక బ్రహ్మాండమైన మూల చైతాన్యాన్ని కదిలించగలుగుతుంది. ఆధ్యాత్మికంగా మీరు వేసే ఒక ముందడుగు భూమండలంలోని ఆధ్యాత్మికతను తద్వారా సౌరవ్యవస్థలోని అన్ని లోకాలలోని ఆధ్యాత్మికతను, గెలాక్సీలోని కోట్ల సౌరవ్యవస్థలలోని ఆధ్యాత్మికతను మరి బ్రహ్మాండ మూలచైతన్యం యొక్క ఆధ్యాత్మికతను కోటానుకోట్ల రెట్లు ముందడుగులను వేయిస్తుంది. మీకిది నమ్మశక్యం కాకపోయినా పచ్చి యదార్థం! మీరిచ్చే చిన్న కదలిక ఈ విశ్వంలో కోటానుకోట్ల రెట్లు పెరిగి ఈ అనంత బ్రహ్మాండ మూలచైతన్యంలో బ్రహ్మాండమైన కదలికను కలుగజేస్తుంది. అలాగే ఈ విశ్వంలో ఏ మూలలోనైనా ఒక చిన్న పాటి ఆధ్యాత్మిక పురోగతి సంభవిస్తే అది కోటానుకోట్ల రెట్లు పెరిగి విశ్వం యొక్క ఆధ్యాత్మిక పురోగతిని బ్రహ్మాండమైన స్థాయిలో పెంచుతుంది. **మీరు ఈ భూమి మీద జ్ఞాన పరంగా ఒక మెట్టు పైకి ఎదిగితే ఈ విశ్వంలోని ప్రతి ఆత్మ కూడా జ్ఞానాన్ని సంగ్రహించి ఒక మెట్టు పైకి ఎదుగుతుంది. వెరసి మీరు పొందే ఒక మెట్టు ఎదుగుదల కోటానుకోట్ల రెట్లు ఎదుగుదలగా పరిణమిస్తుంది. ఈ విశ్వంలో కదలిక తేవడానికి మీరు ఒక**

కేంద్ర బిందువుగా వున్నారు. అలాగే ఈ విశ్వంలోని ప్రతి ఆత్మ కూడా ఒక కేంద్ర బిందువే! ఈ విశ్వంలో అన్ని పాయింట్లూ కేంద్ర బిందువులే! ఈ విశ్వంలో అన్ని ఆత్మలూ విశిష్టమైనవేనని మీరు గుర్తించాలి. మీ వ్యక్తిగత ఆధ్యాత్మిక ఎదుగుదల సకల చరాచర సృష్టిని మరి అనంత బ్రహ్మాండమైన మూలచైతన్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకున్నారు గదా!

మీరు లేకుండా ఈ విశ్వం లేదు. మీ వ్యక్తిగత ఆధ్యాత్మిక పురోభివృద్ధి ఈ విశ్వమంతా ప్రాకిపోతుంది. కోట్లాది రెట్లు పెరుగుతుంది. మీ జీవిత విలువలను పెంపొందించుకోవడం ద్వారా భూమండలంలోని సమస్త జీవజాతుల జీవిత విలువలను పెంచడంలో ప్రభావం చూపుతుంది. భూమి మీద మానవుడు విశ్వజీవి! మానవుడు ప్రకృతిలో ఒక భాగం! ఒక్కొక్క లోకానికి సంబంధించి ఒక్కొక్క ప్రకృతి వుంటుంది. ఈ విభిన్నమైన ప్రకృతిలో మూలమైనది 'అనంత బ్రహ్మాండ మూలచైతన్యం! దాన్నే 'మహా ప్రకృతి' అని కూడా పిలవవచ్చు. ఆ 'మహా ప్రకృతి'యొక్క అఖిలక్షణాలు, ధర్మాలన్నీ మీ అంతర్ ప్రపంచంలో ఇమడ్చబడి వున్నాయి. భూ ప్రపంచానికి సంబంధించిన ప్రకృతిలో మమేకమై 'భావ సంపద', 'మనో వికాసం' మరి 'చైతన్య పరిణామం' సంపూర్తిగా పొందే వరకూ మళ్ళీ మళ్ళీ జన్మలు తీసుకుంటూ వుండాల్సిందే! భూమి + ఆ స్థాయిలోగల సమాంతర లోకాలలో జన్మ పరంపర పరిసమాప్తం కావాలంటే ఇతర ప్రాణికోటితో సహృదయంతో, అనురక్తితో జీవించడం, ఆ ప్రపంచానికి సంబంధించిన సమస్త జీవజాతుల పట్ల 'సంపూర్ణమైన మనోవికాసంతో' మెలగడం సాధించవలసి వుంది. స్థూలంగా మీ చర్మ చక్షువులకు కన్పించే ప్రకృతే కాకుండా మీ అంతర్ ప్రపంచంలో ఇమిడి వున్న ఎన్నెన్నో లోకాలలోని ప్రకృతులు... అంటే బ్రహ్మాండమైన 'మహా ప్రకృతిని' కూడా మీ అంతర్ ప్రయాణం ద్వారా దర్శించడాన్ని మానవజాతి సాధన చెయ్యవలసి వుంది.

* * *

మల్టి డైమన్షనల్ ఆత్మను గురించి జీసస్ మరి బుద్ధుడికి చాలా బాగా తెలుసు! మీ సమీప చరిత్రలో బుద్ధుడు పొందిన ఆధ్యాత్మిక పురోగతి అసామాన్యమైనది. ఆ స్థాయిలో లేదా అంతకంటే విశేషంగా ఆధ్యాత్మిక పురోగతిని సాధించగల సర్వ శక్తియుక్తులూ మానవజాతిలో ప్రతి మనిషిలోనూ ఇమిడివున్నాయి. బుద్ధుడి ధర్మ ప్రచారంలో చాలా అద్భుతమైన ఆధ్యాత్మిక సత్యాలు దాగివున్నాయి. బుద్ధుడి బోధనలు

అర్థం చేసుకునే స్థితికి మానవజాతి 'మానసిక వికాసం' ఇంకా ఎదగలేదు. అతికొద్ది మంది మాత్రమే ఆ స్థాయికి చేరుకుంటున్నారు. బౌద్ధ మతంలో వున్న వారందరికీ బుద్ధుడి బోధనలు అర్థమై వుంటాయని చెప్పడానికి వీలులేదు.

మీ మత గ్రంథాలు కూడా భౌతిక వాస్తవాన్ని, మరి ఆత్మ ఈ భౌతిక ప్రపంచంలో పరిణామం చెందుతున్నపుడు, భౌతిక ప్రపంచాన్ని దాటి ఇతర డైమన్షన్స్‌లోనికి ప్రవేశించినపుడు ఆత్మ యొక్క చైతన్య పరిణామాన్ని వివరించ లేకపోయాయి. కొన్ని ప్రాచీన మత గ్రంథాలు స్పెయిన్ దేశంలోను, ఆస్ట్రేలియా మరి దక్షిణాఫ్రికా ఖండాలలో, ఆసియాలోని కొన్ని దేశాలలో మానవజాతికి అందుబాటులో లేకుండా మిస్సవడం (missing) జరిగింది. అవి గనుక మీ అందుబాటులోనికి వచ్చి వుంటే ఎన్నో ఆధ్యాత్మిక రహస్యాలు మీకు తెలిసివుండేవి. మానవజాతి ఆధ్యాత్మిక పథంలో ఒక ముందడుగు వేసివుండేది.

సముద్రంలో కెరటాలను గమనించారా? ప్రతి క్షణంలోనూ కోటానుకోట్ల కెరటాలు పుడుతుంటాయి. ప్రతి కెరటం యొక్క తీరు (pattern) ప్రత్యేకంగా వుంటుంది. ఒక దాని తీరు మరో దానిలా వుండదు. దేని ప్రత్యేకత దానికుంటుంది. 'సముద్రం ఎలా వుంటుంది? ఎంత ఆకారంలో వుంటుంది? సముద్రాన్ని చూడాలని వుంది?' – అని ప్రతి కెరటమూ అనుకుంటుంది. ఆ కెరటం తాను సముద్రంలోనే వున్నాననే సంగతి తెలుసుకోలేదు. అలా వుంది మీ పరిస్థితి. దేవుడెక్కడున్నాడు? ఏ రూపంలో వుంటాడు? – ఇలాంటి ఎన్నో ప్రశ్నలు మీకు కలుగుతుంటాయి. సముద్రంలో కెరటం ఎలా వుందో ఈ అనంత బ్రహ్మాండ మూలచైతన్యంలో మీరూ అలానే వున్నారు. ఒక లోకంలో జన్మ పరంపరలు కొనసాగించి, ఆ తర్వాత మరో లోకంలోనికి ప్రవేశించి అక్కడా జన్మ పరం పరలు కొనసాగించి... అలా అనంతమైన సంఖ్య గల లోకాలలో మీ ప్రయాణం అలా సాగిపోతూనే వుంటుంది. మీ ప్రయాణానికి ముగింపు ఎక్కడా వుండదు. ఈ విశ్వంలో మీ వునికి ఎప్పటికీ కోల్పోవడం జరగదు. మీరెప్పటికీ మూలచైతన్యంలోగాని, దేవుడులో గాని, బ్రహ్మాండంలోగాని, పూర్ణాత్మలోగాని లయమైపోవడం ఎప్పటికీ జరగదు.

ప్రతి క్షణమూ కోట్లాది కెరటాలు సముద్రంలో పుడుతున్నట్లుగానే ప్రతి క్షణమూ మూలచైతన్యం నుండి కోటానుకోట్ల శకలాలు వేరుపడి ఆత్మ శకలాలుగా రూపొందుతూనే వుంటాయి. ఈ ఆత్మ శకలాలు అనంతకాలం వరకూ కోట్లాది లోకాలలో ప్రయాణం చేస్తుంటాయి. ప్రతి క్షణమూ కోట్లాను కోట్ల ఆత్మ శకలాలు మూలచైతన్యం నుండి

పుడుతున్నాయనే విషయం మీకు ఆశ్చర్యంగా వుందా? సముద్రంలోని కెరటాలు పుట్టి మరలా సముద్రంలోనే అంతమవుతాయి. కాని మూలచైతన్యం నుండి వెలువడిన ఆత్మ శకలాలు ఎప్పటికీ తమ విశిష్టతను, ఉనికిని కోల్పోవడం జరగదు. ప్రతి ఆత్మ శకలం యొక్క ఆధ్యాత్మిక ప్రగతి అనంత కాలం కొనసాగుతూనే వుంటుంది.

మీ పిల్లలకు జన్మ ఇవ్వగలిగారే కాని వాళ్ళకు ప్రాణశక్తిని మీరివ్వలేదు. 'ఆత్మ' జన్మ తీసుకునేటప్పుడే అనంత మూలచైతన్యం నుండి ప్రాణశక్తిని పొందుతుంది. ప్రాణశక్తి సరఫరా మీ దేహంలోనికి ప్రతి క్షణమూ పూర్ణాత్మ నుండి మరి అనంత మూలచైతన్యం నుండి జరుగుతూ వుంటుంది. ఈ విశ్వంలో ఏ శక్తీ మీ ప్రాణశక్తిని హరించి వేయడం జరగదు. మీ ఆత్మను భయపెట్టే శక్తులు విశ్వంలో ఎక్కడా లేవు. మరణం అంటే ఈ దేహాన్ని వదిలి ఇంకొక దేహంలోనికి ప్రవేశించడం. ఆత్మ తన దేహాన్ని ప్రతి మరణం తర్వాతా మార్చుకుంటూ వుంటుంది. జన్మల పరంపరల ద్వారా వ్యాప్తి చెందించుకుంటూ వస్తున్న చైతన్యశక్తి + జ్ఞానం + భావసంపద + మనో వికాసాన్ని ఆత్మ కలిగి వుంటుంది.

* * *

మీ జీవితంలో ప్రతి రోజూ కర్మలు ఆచరిస్తూనే వున్నారు. కర్మలు ఆచరించకుండా ఏ జీవాత్మలూ ఈ సృష్టిలో వుండవు. మీరు చేసేది ప్రతీదీ కర్మగానే పరిగణింప బడుతుంది. ఉదాహరణకు దగ్గడం (coughing), తుమ్మడం (sneezing), కిటికీ దగ్గరికి నడవడం, ప్రమాదం నుండి ఒక పిల్లవాడిని రక్షించడం, ఒక పుస్తకం చదవడం, ఆత్మహత్య చేసుకోవడం, ఇంకొకరి హాని చెయ్యడం, మీకు ఇంకొకరు హాని తల పెట్టడం, ఆలోచించడం, కూర్చోవడం, లేవడం, నిద్రించడం లాంటివన్నీ కర్మలే. మీ మనోశక్తి నుండి వెలువడిన అన్ని ఆలోచనలూ కర్మల క్రిందకే వస్తాయి. ప్రతి ఆలోచనా తరంగమూ ఒక కర్మగా రూపాంతరం చెందుతుంది.

కర్మలు మరి మీ ఆలోచనలు ఎలా వాస్తవం చెందుతుంటాయో ఒక ఉదాహరణ ద్వారా తెలియజేస్తాను. మీరు ఈ పుస్తకాన్ని చదువుతున్నపుడు టెలిఫోను (telephone) రింగయ్యింది. ఈ రోజు సాయింకాలం 5 గంటలకు మిమ్మల్ని కలవమని మీ ఫ్రెండ్ చెప్పడం జరిగింది. ఆ విషయం గురించి మీ ఫ్రెండ్‌కు ఎలా చెప్పాలా అని మీ మైండ్ నుండి మూడు ఆలోచనలు వెలువడినాయి. ఆ మూడు ఆలోచనలు:

(A) అపుడు కలవడం వీలుకాదని చెప్పేసి ఇంట్లోనే వుండి పోవాలని నిర్ణయించు కోవడం.

(B) కలవడానికి వీలుకాదని చెప్పి, మరో చోటికి షాపింగ్‌కు వెళ్ళాలనుకోవడం.

(C) కలుస్తానని చెప్పి ఆ సాయంకాలానికి కలవాలనుకోవడం.

ఈ మూడు ఆలోచనలూ ఒక దాని వెంట ఒకటి మీ మైండ్ నుండి వెలువడినాయి. ఈ మూడూ భౌతిక సంఘటనలుగా రూపాంతరం చెందగల శక్తి సామర్థ్యాలు కలిగివున్నాయి. ఏదో ఒకటి చెయ్యాలని గట్టిగా నిర్ణయం తీసుకునేంత వరకూ మూడు ఆలోచనలూ ఒకే రకమైన చైతన్య ధర్మాలను కలిగివున్నాయి. ఈ మూడింటిలో ఒక దాన్ని మాత్రమే ఎంచుకొని దాని వైపు మీ చైతన్యశక్తిని కేంద్రీకరింప జెయ్యడం ద్వారా ఒక ఆలోచన మాత్రమే భౌతిక సంఘటనగా (physical event) వాస్తవం పొందింది. మిగతా రెండు ఆలోచనలు భౌతిక ప్రపంచంలో వాస్తవం పొందలేదు. కేవలం ఒక ఆలోచన మాత్రమే వాస్తవం చెంది, మిగతా రెండు ఆలోచనలు ఎందుకు వాస్తవం చెందలేదని మీకు సందేహం కలుగుతుంటుంది.

మూడింటిలో ఒక దాన్ని ఎంచుకుని దాని వైపు మీ ఎమోషన్స్ + ఫీలింగ్స్ + విశ్వాసాన్ని బలంగా కేంద్రీకరింపజెయ్యడం ద్వారా మీ ఆలోచనల తాలూకు విద్యుదయస్కాంత శక్తి అటువైపు ప్రవహించి అది భౌతిక సంఘటనగా త్రీ డైమన్షనల్ తలంపై ప్రవేశించింది. మిగతా రెండు ఆలోచనలు వాటికివ్వబడిన శక్తి అనుసారంగా సంభావ్యతా లోకాలలోనికి (probable worlds) ప్రవేశించి అక్కడ వాస్తవం చెందుతాయి. ఒక ఆలోచన భౌతిక ప్రపంచంలో వాస్తవం చెందడం ఎంత నిజమో, మిగతా రెండూ కూడా సంభావ్యతా లోకాలలో వాస్తవం పొందుతున్నాయనేది కూడా అంతే నిజం! మీ మైండ్ నుండి వెలువడిన ఆలోచనలు వివిధ లోకాలలో కర్మలుగా పైన చెప్పిన విధంగా వాస్తవం పొందుతున్నాయి.

భౌతిక ప్రపంచంలో మరి ఇతర డైమన్షన్స్ గల లోకాలలో జరిగే కర్మలన్ని మనోశక్తి నుండి వెలువడుతున్న ఆలోచనా తరంగాలు. సంభావ్యతా లోకాలలో వాస్తవం చెందుతూన్న మీ ఆలోచనలను భౌతిక సంఘటనలుగా మీరు గుర్తించక పోవచ్చు. మీ కళ్ళెదుట ఒక ఆలోచన తాలూకు భౌతిక సంఘటన ఎలా జీవం పోసుకుందో మిగతా ఆలోచనలు కూడా ఇతర లోకాలలో జీవం పోసుకుని పరిణామం చెందుతుంటాయి. **మీ మైండ్ నుండి వెలువడుతున్న ఆలోచనా తరంగాలు ఎటువంటి పరిస్థితుల్లోనూ నశింపబడవు, ఎందుచేతంటే అవి విద్యుదయస్కాంత శక్తి తరంగాలు కనుక!**

త్రీ డైమన్షనల్ భూమి మీద క్రీడాకారుడుగా మీరు జీవిస్తుండ వచ్చు. ఇంకో లోకంలో డాక్టరుగా, మరో లోకంలో రోగిగా, మరో లోకంలో వ్యాపారిగా మీ ఆత్మ వివిధ లోకాలలో వివిధ దేహాలను ధరించి చైతన్య పరిణామం చెందుతుంటుంది. ఒకే ఆత్మ అనేక లోకాలలో అనేక దేహాలను ధరించి చైతన్య పరిణామం చెందుతుంటుంది. చైతన్య పరిణామం చెందడానికి ఎన్ని కాంబినేషన్స్‌ను (combinations) అయినా, ఎన్ని సంభావ్యతలనయినా (probabilities) ఆత్మ ఎంచుకోగలదు. ఒకే సత్య తలంలో అనేక దేహాలను ధరించి వుండగలదు. ఆత్మ అనేక శకలాలుగా విడిపోయి భూమి మీద మరి ఇతర లోకాలలో వివిధ దేహాలను తీసుకోగలదు. ఆత్మ తన యొక్క శకలాలతో భూమి మీదనే ఒక చోట ధనికుడిగా, ఇంకొకచోట పేదవాడిగా, మరొక చోట స్త్రీగా, మరో చోట మత బోధకుడిగా, మరో చోట డాక్టరుగా వివిధ దేహాలలో వుండగలదు. ఒక నది అనేక పాయలుగా (branches) చీలిపోయి ప్రవహిస్తున్నట్లుగానే, ఆత్మ తనకు తాను అనేకానేక శకలాలుగా (entities) విడగొట్టుకొని అనేక దేహాలతో జీవాత్మలుగా జన్మలు తీసుకోగలదు.

ఆత్మ తన అన్ని శకలాలతో జీవ రసాయనిక శక్తి + ఆధ్యాత్మిక శక్తి + చైతన్యశక్తి పరంగా కమ్యూనికేషన్ (communication) కలిగి వుంటుంది. ఆ కమ్యూనికేషన్ టెలీపతి ద్వారా జరుగుతుంటుంది. ఆత్మ యొక్క ఒకానొక శకలం ప్రస్తుతం మీ దేహాన్ని ధరించి వుంది. జాగృదావస్థలో మీ దృష్టి అంతా భౌతిక విషయాలపైన కేంద్రీకరింపబడి వుండడం చేత మీ ఆత్మ ధరించిన ఇతర దేహాలను తెలుసుకోలేక పోతున్నారు. స్వప్నాలు, అంతర్ ప్రయాణం, ధ్యానం ద్వారా మీ ఆత్మ యొక్క ఇతర శకలాలతో కమ్యూనికేషన్ జరుపుతుంటారు. ఇది ప్రతి క్షణమూ జరుగుతుంటుంది.

మీ ఆధ్యాత్మిక పురోగతి, జ్ఞాన సముపార్జన మీ ఆత్మ యొక్క ఇతర శకలాలకు టెలీపతి ద్వారా అందించబడుతుంటుంది. మీరు తీసుకునే నిర్ణయాలు, లక్ష్యాల ప్రభావం వాటన్నింటి పైనా పడుతుంటుంది. అలాగే ఇతర సంభావ్యతాత్మలు పొందే అన్ని ఆధ్యాత్మిక అనుభూతులూ మిమ్మల్ని ప్రభావితం చేస్తుంటాయి.

ఆత్మ అనేక డైమన్షన్‌లలో వివిధ లోకాలలో A. సంభావ్య ఆత్మలు (probable selves), B. సమాంతర ఆత్మలు (parallel selves), C. ప్రత్యామ్నాయ ఆత్మలు (alternate selves)గా జన్మలు తీసుకుని చైతన్య పరిణామం చెందుతుంటుంది. సంభావ్య ఆత్మలు వున్నట్లే సంభావ్యలోకాలూ, ప్రత్యామ్నాయ ఆత్మలు వున్నట్లే

ప్రత్యామ్నాయ లోకాలూ, సమాంతర ఆత్మలు వున్నట్లే సమాంతర లోకాలు వున్నాయి. మీ భూమికి కూడా సంభావ్య భూలోకాలూ, సమాంతర భూలోకాలూ, ప్రత్యామ్నాయ భూలోకాలూ వున్నాయి. మీరు ఒక కళలోనో లేదా ఒక శాస్త్రంలోనో భూమి మీద రాణిస్తూంటారు. ఇతర కళలలో, శాస్త్రాలలో కూడా రాణించాలని ప్రగాఢమైన కోరికలుంటాయి. ఒక కళ లేదా శాస్త్రం ప్రస్తుతం మీ వృత్తిగా వుంటుంది. మీ ప్రగాఢమైన కోరికల వల్ల ఇతర కళలూ, శాస్త్రాలను ఇతర లోకాలలో వున్న మీ సంభావ్య ఆత్మలు ఒక్కొక్కటి ఒక కళను లేదా శాస్త్రాన్ని అభ్యసిస్తుంటాయి.అన్ని కళలూ, శాస్త్రాలకు సంబంధించిన జ్ఞానాన్ని మీ చైతన్యశక్తి ఇంటర్‌నెట్ (consciousness Internet) ద్వారా అంటే టెలీపతి ద్వారా పరస్పరం పంచుకుంటూ వుంటారు.

త్రీ డైమన్షనల్ భూమి మీద గల కళలూ, శాస్త్రాలే కాకుండా ఈ విశ్వంలో కోటానుకోట్ల కళలూ, శాస్త్రాలూ వున్నాయి. చైతన్యశక్తి భూమి మీద పదార్థంగా (matter) రూపాంతరం చెందింది. అలాగే ఇతర లోకాలలో అక్కడ వున్న శక్తిస్థాయి (energy level) . ఫ్రీక్వెన్సీ స్థాయి (frequency level) లకు అనుగుణంగా చైతన్యశక్తి తన స్వరూపాన్ని మార్చుకోగలదు. ఒక లోకంలోని కళలూ, శాస్త్రాలూ, జీవజాతుల దేహాలూ మరో లోకంలో వాటికి భిన్నంగా వుంటాయి. మీ ఆత్మ సంభావ్య ఆత్మలుగా, సమాంతర ఆత్మలుగా, ప్రత్యామ్నాయ ఆత్మలుగా ఆయా లోకాలలో విభిన్నమైన దేహాలను ధరించి లెక్కలేనన్ని కళలను అభ్యసిస్తూ వుండడం జరుగుతుంటుంది. అనేక దేహాలలో వర్ధిల్లుతూన్న ఆత్మ శకలాలు అంతర్ ప్రపంచాల ద్వారా కమ్యూనికేషన్ జరుపుకుంటూ వుంటాయి.

మీ మైండ్ నుండి వెలువడిన బలమైన ఆలోచనా తరంగాల శక్తి త్రీడైమన్షనల్ భూమి యొక్క శక్తి స్థాయిలో ట్యూన్ అయినపుడు ఇక్కడ భౌతిక సంఘటనలుగా వాస్తవం పొందుతుంటాయి. మిగతా ఆలోచనలు వాటి శక్తి స్థాయికి ట్యూన్ అయ్యే సంభావ్యతా లోకాలలోనికి ప్రయాణించి అక్కడ వాస్తవం పొందుతుంటాయి. భూమి మీద వాస్తవం పొందే ఆలోచనలు మరి ఇతర సంభావ్య లోకాలలో వాస్తవం పొందే ఆలోచనలలో ఏవి ప్రాధాన్యమైనవి? అనే సందేహం మీకు కలుగుతుంటుంది. నిజానికి అన్నీ ప్రాధాన్యమైనవే. ఒక వృక్షంలోని వేర్లు, కాండం, కొమ్మలూ, ఆకులూ, పుష్పాలూ, ఫలాలు అన్నీ వృక్షానికి సంబంధించిన భాగాలయినట్లే, మీ మనోశక్తి నుండి వెలువడిన అన్ని ఆలోచనలు భూమి + ఇతర డైమన్షన్స్ గల లోకాలలో వాస్తవం చెందుతూన్నవన్నీ మీకు సంబంధించినవే!

ప్రతి క్షణమూ మీ మైండ్ నుండి ఆలోచనలు వెలువడి భూమి + ఇతర సంభావ్య లోకాలలో వాస్తవం పొందుతూనే వుంటాయి. ఇది నిరంతరమూ కొనసాగే ప్రక్రియ. ఈ దేహం వున్నపుడూ, దేహాన్ని వదిలిపెట్టిన తర్వాతా ఇది కొనసాగుతూనే వుంటుంది. మీ ఆలోచనలన్నీ కర్మలుగా వాస్తవం పొందుతూనే వుంటాయి. మీ కర్మలన్నింటికీ మీరే బాధ్యతవహించ వలసి వుంటుంది. అంటే మీ ఆలోచనలన్నింటికీ మీరే బాధ్యత వహించవలసి వుంటుంది.

సంభావ్య లోకాలలోని అన్ని వాస్తవాలు నిరంతరమూ చైతన్య పరిణామం చెందుతుంటాయి. భూ భౌతిక ప్రపంచంలో వాస్తవం కాని అన్ని ఆలోచనలూ ఏదో ఒక సంభావ్య లోకంలో వాస్తవం పొందుతుంటాయి. ఇతర సంభావ్య ఆత్మల అనుభవాల నుండి జ్ఞానాన్ని + శక్తి యుక్తులనూ మీరు సంపాదించుకోవచ్చు. అలాగే మీ అనుభవాల నుండి జ్ఞానాన్ని, శక్తి యుక్తులనూ వారు పొందవచ్చు. మీరు ఇతర ఆత్మ శకలాలకు సంభావ్య ఆత్మగా, ఇతర ఆత్మ శకలాలు మీకు సంభావ్య ఆత్మలుగా ఎంచబడుతుంది.

మీ ఆలోచనలకు, ఆకాంక్షలకు అనుగుణంగా సంభావ్య దేవుళ్ళను కూడ సృష్టించుకోవడం జరుగుతుంటుంది. 'దేవుడు' సర్వశక్తిమంతుడు మరి ఆయనకు ఉన్నతమైన గుణాలుంటాయని మీరు విశ్వసించడం వల్ల ఆలోచనలు మీ మైండ్ నుండి వెలువడి వాటికనుగుణంగా 'సంభావ్య దేవుడు' (probable God) సృష్టింపబడతాడు. మీ ఆలోచనల ద్వారా సృష్టింపబడిన 'సంభావ్య దేవుడు' ఒకానొక సంభావ్య లోకాన్ని చేరి అక్కడ చైతన్య పరిణామం చెందుతుంటాడు. మీరు భూత, ప్రేత, పిశాచాలను నమ్మినట్లయితే మీ ఆలోచనలు 'సంభావ్య భూత, ప్రేత, పిశాచాలను' సృష్టిస్తుంటుంది. వినాశకర, నిర్మాణాత్మక శక్తులు రెండూ మీ ఆలోచనలవల్లే సృష్టింపబడుతున్నాయి.

మీ ఆలోచనలన్నీ ఒకానొక సంభావ్య లోకంలో ప్రాణశక్తిని పొంది దేహాలు ధరించి జీవాత్మలుగా రూపొందుతున్నాయి. అంటే మీ ఆలోచనలూ, ఆకాంక్షలూ, సంకల్పాల ద్వారా భూతలం మీద + ఇతర సంభావ్య తలాలలో 'సృష్టి'ని చేపడుతున్నారు. మీరూ సృష్టికర్తలే! మీరు చేసిన 'సృష్టి'+ మీరూ ఒకటే! మీకు మీ సృష్టికి మధ్య టెలీపతి ద్వారా నిరంతరమూ కమ్యూనికేషన్ జరుగుతుంటుంది. మీరు చేసిన 'సృష్టి'మీ పై ఆధారపడకుండా చాల స్వతంత్రంగా (independently) చైతన్య పరిణామం చెందుతుంటుంది. మీరు కూడ ఒకానొక 'పూర్ణాత్మ' (higher self) ఆలోచన నుండి సృష్టింపబడిన వారే ! మీరు పూర్ణాత్మ యొక్క అంశాత్మ! పూర్ణాత్మ మిమ్మల్ని సృష్టి చేస్తే,

మీ ఆలోచనల ద్వారా ఇతర అంశాత్మలను మీరు ప్రతిసృష్టి చేస్తున్నారు. భూమి మీద + ఇతర లోకాలలోని జీవాత్మలందరూ సృష్టికర్తలే ! మీ వాస్తవాన్ని మీరే సృష్టించుకుంటున్నారు. ఈ 'వాస్తవం' యొక్క పూర్తి స్వరూపం మీ బాహ్యేంద్రియాలకు చిక్కదు. మీ అంతరేంద్రియాల ద్వారా మాత్రమే దాన్ని దర్శించగలుగుతారు. మూలచైతన్యం (All That Is) తనలో ఇమిడివున్న కోటానుకోట్ల సంభావ్య ఆత్మలన్నింటితోనూ 'చైతన్యశక్తి ఇంటర్‌నెట్ (consciousness internet) ద్వారా కమ్యూనికేషన్‌ను కలిగి వుంటుంది.

మీరు సంభావ్య కర్మలకు (probable actions), సంభావ్య ఆత్మలకు మధ్య కేంద్రబిందువుగా (centre point) వుంటూ చైతన్య పరిణామం చెందుతున్నారు. ఇది ఎలా వుంటుందంటే మీరు సముద్రం మధ్యలో వున్నట్లుంటుంది. సముద్రం మధ్యలో మీరు ఒక కదలికను కలుగజేస్తే దాని ప్రభావం అన్ని వైపులా విస్తరించి సముద్రం మొత్తాన్ని కదిలించి వేస్తుంది. ఆధ్యాత్మిక పరిణామంలో మీరు పొందే అతి చిన్న పురోగతి యొక్క ప్రభావం విశ్వమంతా గల అన్ని లోకాలకూ వ్యాపిస్తుంది. మీరు పొందే ఈ చిన్ని చైతన్య పరిణామపు వ్యాకోచం విశ్వమంతా కదలికను తెచ్చి కోటానుకోట్ల రెట్లుగా వ్యాకోచం చెందుతుంది. మీరు త్రీ డైమన్షనల్ గుణింతాన్ని (three dimensional multiplication) లెక్కగడితే అది తన ప్రభావాన్ని ఈ విశ్వంలో గల సకల చరాచర సృష్టికి మల్టిడైమన్షనల్ గుణింతం (multi dimensional multiplication)గా రూపొందుతుంది. ఈ గుణింతం ఎప్పటికీ ఆగిపోయే ప్రక్రియ కాదు. నిరంతరమూ గుణింపబడుతూ (multiply) వుంటుంది.

మీరిచ్చే చిన్న కుదుపు బ్రహ్మాండమైన మూలచైతన్యంలో ఇమిడివున్న సమస్త లోకాలను కుదిపేస్తుంది. అంతరేంద్రియాల ద్వారా చాల ప్రత్యక్షంగా మరి సహజావ బోధన, స్పందనల ద్వారా పరోక్షంగా సంభావ్య లోకాలలోని జ్ఞాన సమాచారం (information and knowledge) మీకు ప్రతిక్షణమూ అందుతూంటుంది. మీ మనోశక్తి (mind power)లోని అంతర్ వాతావరణం ఒక మీ సంకల్పాలకే పరిమితం కాకుండా ఈ విశ్వమంతా గల అన్ని సంభావ్య ఆత్మలతో కమ్యూనికేషన్‌ను కలిగి వుంటుంది. మీ 'అహం'నకు మీ మనోశక్తి మీకు మాత్రమే పరిమితమై వుంటున్నట్లు అన్పిస్తుంటుంది. మీరు + విశ్వ వ్యాప్త సంభావ్య ఆత్మల మధ్యగల కమ్యూనికేషన్‌ను టెలీపతీ నెట్‌వర్క్

(telepathic network) అని పిలుచుకోవచ్చు. జాగృదావస్థలో ఇవేవీ మీ ఎరుకలో వుండకపోవచ్చు.

మీరు రూములో కూర్చుని ఈ పుస్తకాన్ని చదువుతున్నపుడు పొందే ఆధ్యాత్మిక జ్ఞానం తాలూకు మానసిక స్పందనలు + ఎమోషన్స్ కలుగుతాయి. ఇవి విశ్వమంతా గల అన్ని ఆత్మశకలాలకూ కమ్యూనికేట్ (communicate) చెయ్యబడుతాయి. విశ్వమంతా గల అన్ని ఆత్మశకలాలకూ, అంటే సకల చరాచర సృష్టికీ పంచబడుతుంది. అంటే మీ జ్ఞాన పరిధి పెరగడం వల్ల మీరు పొందిన మనోవికాసం + చైతన్య పరిణామం అనేవి ఇతర సృష్టికి మీ ఆలోచనలు + ఎమోషన్స్ ద్వారా పంచబడుతుంది. మీ ఆలోచనలు + ఎమోషన్స్ వల్ల ఏర్పడిన విద్యుదయస్కాంత తరంగాలు భౌతిక ప్రపంచంలోని అన్ని దిశలలో, అన్ని కోణాలలో ప్రయాణించడమే కాకుండా మీ చర్మ చక్షువులకు గోచరం కాని కోటానుకోట్ల అదృశ్య దిశలలో ప్రయాణించి వాటి శక్తి స్థాయికి ట్యూన్ (tune) అయిన సంభావ్య ఆత్మలను చేరతాయి. అలాగే ఇతర సంభావ్య ఆత్మల నుండి వాటి ఆలోచనలు + ఎమోషన్స్ మీకు అందు తుంటాయి. మీరు ఈ భూభౌతిక ప్రపంచంలో ఏ భౌతిక సంఘటనలనయితే వాస్తవం చెందించాలని ప్రగాఢంగా బలంగా సంకల్పిస్తారో, వాటికి సంబంధించిన ఆలోచనలను మాత్రమే ఇతర సంభావ్యలోకాల నుండి వచ్చిన వాటి నుండి ఎంపిక చేసుకుని సంగ్రహించడం జరుగుతుంది.

ఉదాహరణకు మీరు చిత్ర లేఖనం (drawing) నేర్చుకోవాలని ఆకాంక్షిస్తారు. మీ ఆలోచనా తరంగాలకు తోడుగా మీరు చిత్ర లేఖనంలో నైపుణ్యం సంపాదించేందుకుగల అన్ని ఆలోచనలను సంభావ్య లోకాలనుండి ప్రయాణించే వాటిని సంగ్రహించడం జరుగుతుంది. సంభావ్య లోకాలనుండి ప్రయాణిస్తూన్న అన్ని ఆలోచనలనూ మీరు సంగ్రహించడం సంభవించదు. మీ సంకల్పాలకు అనుగుణంగా వున్న వాటిని మాత్రమే మీరు సంగ్రహిస్తారు. అన్నీ మీకు చేరవు. మీ ఆధ్యాత్మిక పురోగతికి, ఆత్మ చైతన్య వికాసానికి, మనోవికాసానికి మీరు లక్ష్యాలు, సంకల్పాలను ఏర్పరుచుకుని తీరవలసిందే. లక్ష్యాలు ఏర్పరుచుకోకుండా ఎదుగుదల అనేది అసంభవం.

అంతరేంద్రియాల ద్వారా ఇతర డైమన్షన్స్ గల లోకాలనుండి ఎలా కమ్యూనికేషన్ జరుగుతూందో, జ్ఞానాన్ని ఏ విధంగా సంగ్రహించవచ్చో తెలుసుకోవడానికి ఇక్కడ ఒక ఎక్సర్‌సైజు (exercise) ఇస్తున్నాను. దాన్ని సాధన చెయ్యండి.

(EXERCISE) :

1. సుఖాసనంలో హాయిగా కూర్చుని కళ్ళు మూసుకోండి. ఉచ్ఛ్వాస నిశ్వాసలను కొద్దిసేపు గమనించండి. బాగా రిలాక్స్ (relax) అవండి. మీ గది అంతా చీకటి ఆవరించినట్లు ఊహించుకోండి. మీరు ఒక్కరు మాత్రమే వుంటున్నట్లు ఊహించుకోండి. మీ ఆలోచనలు, కష్టాలు, అన్నింటినీ ప్రక్కన పెట్టండి.
2. మీ మైండ్ అంటే మీ అంతర్ ప్రపంచం నుండి ఏదైనా సందేశాలుగాని, అంతర్ ధ్వనులు గాని, రూపాలుగాని, సంగ్రహించడానికి ఓపెన్ మైండ్‌తో (open mind) ఎదురు చూస్తూండండి. బాహ్య ధ్వనులను వినడానికి ప్రయత్నించకండి. మీలో ఒక అంతర్ ప్రపంచం వున్నట్లు ఊహించుకోండి. బాహ్య ప్రపంచం గురించి, బాహ్య భౌతిక జీవితం గురించి పూర్తిగా మర్చిపోయి అంతర్ ప్రపంచం వైపే మీ దృష్టిని కేంద్రీకరించండి. సందేశాలు, అంతర్ శబ్దాలు, రూపాలు వస్తాయేమో ఎదురు చూస్తూ వుండండి.
3. అంతర్ ప్రపంచం నుండి వచ్చే సందేశాలను, రూపాలను, అంతర్ ధ్వనులను మీ రీజనింగ్ మైండ్‌తో విశ్లేషణ చెయ్యడానికి ఆతృత పడకండి. ప్రారంభంలో మీ అంతరేంద్రియాలు పర్‌ఫెక్టుగా (perfectly) ఆ పని చెయ్యలేక పోవచ్చు. కొన్ని రోజుల తర్వాత మీ అంతర్ ప్రపంచం నుండి వచ్చే సమాచారాన్ని విశ్లేషించుకుని మీ ప్రాపంచిక జీవితంలోనికి వినియోగించుకోవచ్చు.
4. ఈ ఎక్సర్‌సైజును ప్రతి రోజూ రాత్రి నిద్రించేముందూ లేదా మీరు విశ్రాంతిలో వున్నపుడు లేదా మీ దైనందిక జీవితంలో ఖాళీ సమయంలో ఒక సిట్టింగ్‌లో (in one sitting) పదినిముషాల పాటు సాధన చెయ్యండి. ఆ పదినిముషాల నిడివిలో ఎటువంటి పరిస్థితుల్లోనూ కళ్ళు తెరవకండి. సాధనలోనే వుండండి.
5. ఈ సాధన ద్వారా మీ అంతర్ ప్రపంచంలోని వివిధ డైమన్షన్స్‌గల లోకాల శక్తి స్థాయిలలోకి ట్యూన్ అవ్వడం జరుగుతుంటుంది. మీ ప్రాపంచిక జీవితానికి సంబంధించిన లక్ష్యాలకు సంబంధించిన జ్ఞానం ఇతర డైమన్షన్స్ నుండి మీకు రూపాల ద్వారా లేదా అంతర్ శబ్దాల ద్వారా లేదా సందేశాల ద్వారా అందించబడుతుంది. మీ అంతరేంద్రియాల ద్వారా వచ్చే అన్నింటినీ గమనిస్తూండండి. అత్యుత్సాహంతో వెంటనే జడ్జిమెంట్స్ ఇవ్వడం, విశ్లేషణలు చెయ్యడం చేయకండి.

6. కొన్నాళ్ళపాటు సాధన చెయ్యడం ద్వారా అంతర్ వాణి నుండి సందేశాలను సంగ్రహించడం చాల ఆటోమాటిక్‌గా మీకు అలవడుతుంది. ఇతర లోకాలు, ఇతర డైమన్షన్స్, ఇతర సంభావ్యలోకాల నుండి మీ లక్ష్యాలకు + సంకల్పాలకు ట్యూన్ అయ్యే జ్ఞానం మీకు చేరవేయబడుతుంది. ఇతరత్రా జ్ఞాన సందేశాలు కూడ మిమ్మల్ని చేరుతుంటాయి. కాని మీ దృష్టి వాటి వైపు కేంద్రీకరించకపోవడం వల్ల ఆ జ్ఞానాన్ని మీరు సంగ్రహించడం జరగదు.

ఇలాంటి ప్రాక్టీసు (practice) ద్వారా జేన్ రాబర్ట్స్ (Jane Roberts) తన అంతర్ ప్రపంచాన్ని దర్శించడం జరిగింది. నా ద్వారా (SETH అను నేను) సందేశాలు పొందగలుగుతూంది. బాహ్య భౌతిక వాతావరణాన్ని పూర్తిగా మర్చిపోయి, పూర్తిగా (totally) ట్రాన్స్ స్థితిలోకి (into trans state) జారినపుడే అంతర్ ప్రపంచాన్నుండి జ్ఞానాన్ని సంగ్రహించడం జరుగుతుంది. ఈ విశ్వంలో గల వివిధ డైమన్షన్స్ నుండి జ్ఞానాన్ని సంగ్రహించడానికి మీ అంతరేంద్రియాలు ఛానెల్స్ (channels) వలె పనిచేస్తాయి. భూమి మీద మీ జన్మ యొక్క లక్ష్యాలన్నింటినీ నెరవేర్చడానికి గల జ్ఞానాన్ని మీ అంతర్ ప్రపంచం నుండి సంగ్రహించవచ్చు. మీ జీవితానికీ, మీ చుట్టూ వున్న భౌతిక పరిస్థితులకు మీరు బాధ్యత వహించి తీరాలి.

ఈ ఎక్సర్‌సైజును సాధన చెయ్యడం వల్ల మీ జీవితంలో అన్ని సమస్యలకు సవాళ్ళకు సమాధానాలు లభిస్తాయి. మీరు ఎంచుకున్న లక్ష్యాలకు సంబంధించిన సమాచారం ఇవ్వబడుతుంది. ఇతర లోకాలు, ఇతర సిస్టమ్స్ (other systems) నుండి ఎంతో జ్ఞానాన్ని మీ స్వంతం చేసుకోవచ్చు. ఆధ్యాత్మిక పురోగతిని అతి వేగంగా పొందవచ్చు. మానసిక, ఆధ్యాత్మిక, ఆత్మ జ్ఞాన పరిధిని విస్తారంగా పెంచుకోవచ్చు. మీరు ఎంత విస్తారంగా జ్ఞానాన్ని పెంచదల్చుకుంటే అంత విస్తారంగా పెంచుకోవచ్చు. మీ ఆధ్యాత్మిక పురోగతిని ఆపగల శక్తి ఈ విశ్వంలో ఎక్కడుంది?

జీవితాన్ని మరి జన్మ పరంపరలను ఏక దిశలో (uni directional) ప్రయాణిస్తున్నట్లు పరిగణిస్తే కర్మ సిద్ధాంతం (Law of Karma) వున్నట్లు మీకు అన్పించవచ్చు. కాలం అనేది మీ త్రీ డైమన్షనల్ ఇంటెలిజెన్స్‌కు (three dimensional intelligence) అందే స్థితిలో లేదు. కాలమనేది ఒక 'మహాభ్రమ' (a great illusion)గా మాత్రమే మీకు అర్థమవుతుంది. **ఆత్మ యొక్క జన్మలు భూతకాలంలోనూ, వర్తమానంలోనూ, భవిష్యత్ కాలం లోనూ ఏక కాలంలో ఒకేసారి సంభవిస్తున్నాయి.**

'కాలం' అనేది మల్టి డైమన్షనల్ రాశి (multi dimensional entity). ఆత్మ కూడ మల్టిడైమన్షనల్ శక్తి స్వరూపం (multi dimensional energy form). మల్టి డైమన్షనల్ కాలంలో కర్మ సిద్ధాంతం ' అనేది లేదు.

జన్మ పరంపరలను ఏక దిశలో ప్రయాణిస్తూన్నట్లు పరిగణిస్తే గత జన్మలో మీరు ఎనిమిదవ తరగతికి సంబంధించిన జ్ఞానం నేర్చుకుని వుంటారు. ఈ జన్మలో తొమ్మిదవ తరగతికి సంబంధించిన జ్ఞానం నేర్చుకుంటున్నారు. గత జన్మకు ముందుజన్మలో ఏడవ తరగతికి సంబంధించి నేర్చుకుని వుంటారు. జ్ఞానం మరి ఆధ్యాత్మికంగా ఒక్కొక్క జన్మలో ఒక మెట్టు ఎదుగుతూ వుంటారు. కాని మల్టి డైమన్షనల్ స్వరూపంలోకొచ్చేసరికి జన్మపరంపరలు అన్నీ ఒకేసారి ఏకకాలంలో సంభవిస్తున్నాయి. **ఆత్మ ఏకకాలంలో కోటానుకోట్ల దేహాలను ధరించి చైతన్య పరిణామం చెందుతూంది. కోటానుకోట్ల దేహాలలో ఒకానొక దేహంలో మీరు వున్నారు. కోటానుకోట్ల దేహాలలోగల అన్ని ఆత్మ శకలాల నుండీ మీ అంతర్ ప్రపంచం ద్వారా జ్ఞానాన్ని ఈ వర్తమానంలోనే పొందవచ్చు.** గత జన్మలో ఎనిమిదవ తరగతికి సంబంధించిన జ్ఞానం, ఆ తర్వాత పదవ తరగతికి సంబంధించిన జ్ఞానం అంటూ ఏదీ వుండదు.. (ఎనిమిదవ తరగతి, తొమ్మిదవ తరగతి, పదవ తరగతి... ఉదాహరణగా చెప్పడం జరిగింది.)

క్షణకాలంలో ఆత్మ యొక్క కోటానుకోట్ల ఆత్మ శకలాల నుండి జ్ఞానం పొందగల అవకాశం మీ అంతర్ప్రపంచానికి కలిగి వున్నపుడు 'కర్మ సిద్ధాంతం' ను విశ్వసించడం అర్థరహితం! ఆత్మ అనేకానేక రూపాలతో దేహాలనుధరించి ఎన్నో కోణాలలో ఆధ్యాత్మిక విస్తరణను కావించుకుంటూంది. గత జన్మలలో చేసిన కర్మలకు ఈ జన్మలో శిక్షలుండవు. మీ ఆత్మ ఒక దేహానికి మాత్రమే పరిమితం కాదు. ఏకకాలంలో అనేక దేహాలతో వున్నారు. **మీరు మల్టి డైమన్షనల్ ఆత్మ అని తెలుసుకున్న తర్వాత 'కర్మ సిద్ధాంతం' మీకు వర్తించదు.** గత జన్మలలో మీరు ఎనిమిదవ తరగతికి సంబంధించిన జ్ఞానం నేర్చివుంటే, ఈ జన్మలో ఏకంగా పోస్ట్‌గ్రాడ్యుయేషన్ (Post graduation) మరి పిహెచ్.డి. (Ph.d) చెయ్యవచ్చు. మల్టి డైమన్షనల్ ఆత్మ ధరించిన అనేకానేక దేహాలలో గల అంశాత్మలు సముపార్జిస్తూన్న జ్ఞానాన్ని ఈ వర్తమానంలోనే పొందవచ్చు. మూలచైతన్యం, మరి పూర్ణాత్మలు, మరి కోటానుకోట్ల లోకాలలో విస్తరించిన ఆత్మ శకలాలన్నింటి నుండీ మీరు జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు.

ద్వేషానికి సంబంధించిన డైనమిక్స్ తెలుసుకోవడానికి ఒక జన్మ, స్త్రీ జాతిని

ద్వేషించడానికి గల కారణాలు తెలుసుకోవడానికి ఒక జన్మ... ఇలా అనేక జన్మల నుండి పొందిన 'భావసంపద' + మనోవికాసం + జ్ఞాన పరిధిని దాటి ఆధ్యాత్మికంగా మరో అడుగు ముందుకు వెయ్యడానికి ఒక జన్మ... అలా జన్మ పరంపరలు కొనసాగిస్తూ మెల్లగా చైతన్య పరిణామం చెందుతుండడం ఒక దిశలో సాగుతుంటుంది. **'మల్టిడైమన్షనల్ ఆత్మ నేను. ఈ ఒక్క దేహానికి మాత్రమే నేను పరిమితం కాలేదు.' అనే ఎరుక కలిగిన తర్వాత ఆధ్యాత్మిక పురోగతికి జ్ఞాన సముపార్జనకు కోటానుకోట్ల లోకాలలో విస్తరించిన కోట్ల కోట్ల ఆత్మల నుండి మల్టి డైమన్షనల్ కోణాలలో అవకాశాలు మీ అందుబాటులోకి వస్తాయి. సర్వకళలూ, సకల శాస్త్రాలూ, అపరిమితమైన జ్ఞానమూ నిరంతర ప్రవాహంవలె మీ అంతర్ ప్రపంచాన్ని చేరుతుంటుంది. మీ అంతరేంద్రియాలను సరియైన రీతిలో వినియోగించుకోవడం ద్వారా జ్ఞానాన్ని ఈ విశ్వంలోని అన్ని దిశల నుండీ, అన్ని ఆత్మ శకలాలనుండీ పొందగలిగే వీలుంది. మీ గత జన్మలలో మీరు సంప్రాప్తించుకున్న మనోవికాసం . జ్ఞానం . భావసంపదల పైన ఈ జన్మలో మీ ఆధ్యాత్మిక పురోగతి ఆధారపడాల్సిన అవసరం లేదు. ఒకేసారి అన్ని దిశలలో మల్టి డైమన్షన్స్‌లో మీ అంతర్ ప్రయాణం ద్వారా పూర్ణాత్మలు . అంశాత్మల నుండి డైరెక్టుగా (directly)జ్ఞానాన్ని సంపాదించుకోగల సర్వసమర్థతలూ మీకున్నాయి. మీరు గత జన్మల నుండి సంపాదిస్తూ వస్తూన్న జ్ఞానం కంటే లక్షల రెట్లు... కోట్ల రెట్లు గల జ్ఞానాన్ని ఈ జన్మలో సంపాదించుకోవచ్చు. ఈ విషయం మీకు తెలిసిన తర్వాత 'కర్మ సిద్ధాంతం' అనేది వుండదు.** ఈ జన్మ యొక్క అభివృద్ధి గత జన్మలలో మీరు పొందిన అభివృద్ధి పైన ఆధారపడి వుండడం సహజమే గాని ఒక్కసారి మీకు 'నేను అనబడే ఈ ఆత్మ ఈ ఒక్క దేహానికి మాత్రమే పరిమితం కాలేదు. కోటానుకోట్ల దేహాలుగా గల అంశాత్మలతో విరాజిల్లుతూన్న పూర్ణాత్మ యొక్క ఒకానొక అంశాత్మను మాత్రమే'! అని మీరు తెలుసుకోగలిగినట్లయితే ఈ జన్మలో మీ ఆధ్యాత్మిక పురోగతి ఇక ఎంత మాత్రమూ గత జన్మలలో సాధించిన అభివృద్ధిపై ఆధారపడాల్సిన అవసరం లేదు. అంటే **'కర్మ సిద్ధాంతం' అనేది మల్టి డైమన్షనల్ ఆత్మకు వర్తించనే వర్తించదు.** మీరు 'మల్టి డైమన్షనల్ ఆత్మ' అని తెలుసుకోవాలి. ఆత్మశక్తికి పరిమితులు లేవు అనే విషయం కూడ మీరు గ్రహించాలి.

మల్టి డైమన్షనల్ ఆత్మ ఒక భూతలానికి అంటే త్రీ డైమన్షనల్ తలానికి మాత్రమే పరిమితం కాదు. మీ దేహంలో ఇమిడిన ఆత్మ మీ దేహానికి మాత్రమే పరిమితం గాక

దాని శాఖలు (branches) ఇతర లోకాలలోనికి కూడ వ్యాపించి వున్నాయి. అన్ని లోకాలలోనికి విస్తరించిన మల్టిడైమన్షనల్ ఆత్మకు భూమి మీద గల ఒకానొక 'అంశాత్మ' కర్మలకు + జ్ఞానానికి ఎందుకు పరిమితమవుతుంది? భూమి + దానికి సమాంతరమైన లోకాలలో ఒక అంశాత్మ సాధించిన మనోవికాసం + భావసంపద + జ్ఞానం మాత్రమే ఆత్మ యొక్క ఆధ్యాత్మిక పురోగతి కాజాలదు.

ఈ వర్తమానంలో ప్రస్తుత దేహంలో గల మీరు సాధిస్తూన్న ఆధ్యాత్మిక ప్రగతికి గత జన్మలలో మీరు పొందిన జ్ఞానం + చైతన్య పరిణామానికి తోడుగా మల్టిడైమన్షనల్ ఆత్మ యొక్క ఇతర అంశాత్మల నుండి అపారమైన జ్ఞానాన్ని మీ అంతరేంద్రియాల ద్వారా పొందే సర్వశక్తి యుక్తులు కలిగివున్నారు. **మల్టిడైమన్షనల్ ఆత్మ తన చైతన్యశక్తిని సంపూర్తిగా కేంద్రీకరించి భూమి మీద దేహాన్ని తీసుకుని ఇమిడే స్థితిలో లేదు. త్రీ డైమన్షనల్ తలమైన భూమి మీదకు మల్టిడైమన్షనల్ ఆత్మ తన పూర్తి శక్తితో దిగి రావడం అసంభవం. ఒక చిన్న మట్టి కుండలో సముద్రాన్ని ఇమడ్చడం కష్టం గదా. మల్టిడైమన్షనల్ ఆత్మ యొక్క ఒకానొక ఆత్మ శకలం అయిన మీరు అంశాత్మగా ఈ త్రీ డైమన్షనల్ భూ తలం మీదకు జన్మ తీసుకోవడం జరిగింది.**

మల్టిడైమన్షనల్ ఆత్మగా పరిణామం చెందుతున్న మీకు మల్టిడైమన్షనల్ రాశి అయిన కాలంలో అన్ని జన్మలూ ఒకేసారి సంభవిస్తున్నాయి. వాస్తవంగా చెప్పాలంటే గతం – వర్తమానం – భవిష్యత్తుకు సంబంధించిన అన్ని జన్మలూ ఒకేసారి (simultaneously) సంభవిస్తున్నాయి. ఉదాహరణకు ఒక చక్రాన్ని (wheel) తీసుకోండి. దాని ఇరుసు (hub) దగ్గర మీరున్నట్లు (అంటే ఆత్మగా వున్న మీరు) ఊహించుకోండి. ఇరుసు నుండి చక్రం యొక్క వృత్తాకార ఉపరితలానికి స్పోక్స్ (spokes) బిగించబడి వుంటాయి. ఉపరితలానికి తాకుచున్న ఒక స్పోక్ (spoke) ఒక కాలానికి సంబంధించిన ఒక జన్మలో వున్నారని ఊహించుకోండి. ఆ చక్రానికి పన్నెండు (12) స్పోక్స్ వున్నాయనుకుంటే – ఆ స్పోక్స్ వద్ధ మీరు తీసుకున్న జన్మలు వరుసగా 20BC, 5BC, 10AD, 100AD, 500AD, 1900AD, 2007AD, 2100AD, 5000AD, 6000AD, 6500AD, 10,000AD (B.C – క్రీ।పూ AD – క్రీ।శ లలో వున్నాయనుకోండి. ఆయా సంవత్సరాలలో మీరు తీసుకున్న జన్మలు స్పోక్స్‌ద్వారా కనెక్ట్ (connect) అయివున్నాయి. కాలం అనే చక్రంలో ఇరుసు దగ్గర వున్న మీకు అన్ని జన్మల తాలూకు జ్ఞానం ఏకకాలంలో అందుతూంది. ఆ పన్నెండు

స్పోక్స్ స్థానంలో అనంతమైన స్పోక్స్‌ను (infinite number of spokes)ఊహించుకుని అవి అనంత కాలం వరకూ అంటే భూత, వర్తమాన, భవిష్యత్తు కాలాలకు వ్యాప్తిచెంది వున్నాయనుకున్నపుడు అన్ని జన్మలనుండీ పొందే జ్ఞానం ఎంత అపరిమితంగా వుంటుందో గదా! ఇక్కడ చక్రాన్ని ఏకతలంలో (one plane) మాత్రమే ఉదాహరణగా తీసుకోవడం జరిగింది. ఇపుడు ఒక గోళాన్ని (sphere) ఉదాహరణగా తీసుకోండి. గోళం కేంద్ర బిందువు నుండి దాని ఉపరితలానికి ఎన్ని కోణాలలో సరళ రేఖలు (straight lines) గీచి కలుపగలరో ఒకసారి ఆలోచించండి. భూగోళానికి (sphere of the Earth) దాని కేంద్రబిందువు నుండి ఎన్ని సరళ రేఖలు గీయగలరో మీ ఊహకు అందుతూందా? అనంతమైన సరళ రేఖలు గీయవచ్చు. ప్రతి రేఖనూ ఒక స్పోక్‌గా పరిగణిస్తే, ఆ స్పోక్ చివరి ఉపరితలంలో ఒక కాలానికి సంబంధించిన జన్మను ఊహిస్తే ఒక ఆత్మ ఎన్ని కోట్ల జన్మలు తీసుకోగలదో ఊహించడానికి మీ త్రీ డైమన్షనల్ ఇంటెలిజెన్స్ (three dimensional intelligence) చాలదు. ఆత్మ అనేక దేహాలతో, అనేక రూపాలతో, అనేక లోకాలలో అనేక డైమన్షన్స్‌లలో అనంతమైన జన్మలను ఎన్నుకుని చైతన్య పరిణామం చెందుతూంది.

ఒక సైకిలు చక్రం లేదా ఒక వాహనం యొక్క చక్రం ఒక దిశలో మాత్రమే ముందుకూ, వెనుకకూ కదులుతుంది. కాని గోళం (sphere) ఏ దిశలోనైనా దొర్లగలదు. ఎన్ని దిశలలోనైనా దాని గమనం (motion) వుండగలదు. కాలం కూడ అలాగే ఎన్ని దిశలలోనైనా దాని గమనం ముందుకూ – వెనుకకూ వుంటుంది. ఒక నిర్ధిష్ట దిశలో మాత్రమే కాలం యొక్క గమనం పరిమితమై వుండదు. కాలాన్ని నిర్వచించడానికి వీలుపడదు. ఏవిధంగా చెప్పితే మీకు అర్థం చేసుకోగలరనే కోణంలో మీకు వివరించడానికి ప్రయత్నం చేస్తున్నాను. ఒక చక్రం లేదా ఒక గోళాన్ని ఉదాహరణగా తీసుకొని మీకు అర్థమయ్యే రీతిలో చెప్పడానికి ప్రయత్నం తప్ప కేవలం ఇలాంటి ఉదాహరణలే మీకు పూర్తి సమాచారాన్ని (information) ఇవ్వలేవు.

భూగోళమంత సైజును ఊహించుకున్నపుడు దాని కేంద్రం నుండి ఎన్ని స్పోక్స్ ఇమడ్చవచ్చు? గెలాక్సీ (galaxy) సైజులో వుంటే ఎన్ని స్పోక్స్ ఇమడ్చవచ్చు...ఇలా లెక్కిస్తే మానవ మేధస్సు అర్థం చేసుకునే స్థితిలో లేదు. ఒక గెలాక్సీ సైజులో గల గోళంలో విస్తరించిన స్పోక్స్ ఎన్ని దిశలలో వుంటాయో ఊహించుకోండి. కొన్ని కోట్ల దిశలుంటాయని మీకు అర్థం అవుతుంది గదా! కేంద్రం నుండి గోళం ఉపరితలం

పైకి సరళ రేఖలను గీచినపుడు లెక్కలేనన్ని కోణాలలో ఆ రేఖలు విస్తరించి వుంటాయి. మల్టి డైమన్షన్స్ అంటే అనంతమైన కోణాలలో విస్తరించిన తలాలు అని అర్థం చేసుకోవాలి. ఒక గెలాక్సీలోనే అలా వుంటే కోటానుకోట్ల గెలాక్సీలు గల విశ్వం సంగతేమిటి ?

'మహా ఆత్మ' ధరించిన దేహాలు అనంతమైనవి. ఆ 'మహా ఆత్మ' యే మూలచైతన్యం లేదా దేవుడు లేదా అనంత బ్రహ్మాండం. ఈ సకల చరాచర సృష్టి అంతా అనంతమైన లోకాలలో అనంతమైన రూపాలలో వర్ధిల్లుతూన్న 'మహా ఆత్మ' తన అంశాత్మలనూ సమానంగా సంపూర్ణానురాగంతో ప్రేమిస్తూంది! మీరు ఆ 'మహా ఆత్మ' యొక్క ఒకానొక అంశాత్మ మాత్రమే! ఈ విశ్వంలో మీరొక్కరే ఒంటరిగా వుంటారని ఎలా అనుకోగలరు?

ఒక సెకనును పదిలక్షల భాగాలుగా విభజిస్తే, ఆ ఒక భాగంలోని కాలంలో ఈ విశ్వంలోని మూలచైతన్యం కొన్ని కోట్ల రెట్లు వ్యాకోచం చెంది వుంటుంది. ఈ కాల వ్యవధిలో కోటానుకోట్ల లోకాలు సృష్టింపబడి వుంటాయి. ఆ సృష్టి అంతా అనంతమైన డైమన్షన్స్‌గల తలాలు (లోకాలలోని) అన్నింటిలోనూ నిండి చైతన్య పరిణామం చెందుతూంటాయి. వర్తమానం, భవిష్యత్తూ, గతమూ అన్నీ ఒకేసారి మల్టిడైమన్షన్స్‌లో ఒకేసారి జరుగుతుంటాయి. **అంత బ్రహ్మాండమైన సృష్టిలో మీ ఉనికీ, మీ స్వేచ్ఛా, మీ వ్యక్తిత్వమూ, మీ ప్రత్యేకతా, మీ విశిష్టతా ఎప్పటికీ కోల్పోవడం జరగదు. ఏ బ్రహ్మాండంలోనూ మీరు లీనమైపోవడం ఎప్పటికీ జరగనే జరగదు.**

మల్టి డైమన్షనల్ ఆత్మ గురించి తర్వాత పుస్తకాలలో వివరించడం జరుగుతుంది.

గమనిక

1. **మైండ్ పవర్, థాట్ పవర్, జీవితం ఒక వరం, మహాజీవిత శాస్త్రం, మొ॥ (సేత్ విజ్ఞానం) + దివ్యసంపద, అపరిమితమైన జీవితం, మహా సంకల్పశక్తి** మొ॥ **(రామ్తా విజ్ఞానం)** + (ప్రాచీన + ఆధునిక) ఆధ్యాత్మిక శాస్త్రంలపై **శ్రీ వి.వి.రమణ** గారిచే నిర్వహించబడు రెండు రోజుల వర్క్ షాప్ (2 days workshop / every month at Hyderabad / Vijayawada) నకు హాజరయిన ఎడల మీకుగల సందేహాలన్నీ నివృత్తి అవుతాయి. హాజరు కాదలచిన వారు **ఫోన్ : 9963 258 796**, ఫోన్ చేసి తమ పేరును ముందుగా రిజిష్టరు చేసుకోవలసి వుంటుంది. **ఉచిత ప్రవేశం లేదు.**
2. అలాగే, దైనందిక జీవితంలో మీకు ఎదురయ్యే వ్యక్తిగత + శారీరక + మానసిక + కుటుంబ + సామాజిక సమస్యలకు / రుగ్మతలకు వ్యక్తిగత కౌన్సిలింగ్ (personal counselling) ఇవ్వబడును.
3. అలాగే అన్ని రకాల వ్యాధులకు, మానసిక సమస్యలకు **హోలిస్టిక్ హీలింగ్** (holistic healing) మరి గైడెన్స్ (guidance) ఇవ్వబడును. పై వాటికి (2 & 3) ముందుగా అపాయింట్మెంట్ తీసుకొనవలెను.

   ఫోన్ : 9963 258 796.
4. సింగరేణి కాలరీస్ NTPC, SAIL, Vijaya Bank, Andhra Bank, State Bank of India etc., కార్పోరేట్ సంస్థల్లో workshops నిర్వహించడం జరిగింది. Corporations, college లలో workshops నిర్వహించడం కొరకు సంప్రదించగలరు. ఫోన్ : 9963 258 796.

వి.వి. రమణ
email : ramanapyramid@yahoo.com
vvramana.pyramid@gmail.com